స్వాతంత్ర్యం కోసం
(రంగా ఆత్మకథ)

ఆంగ్లంనుంచి
అనువాదం:
డాక్టర్ జక్కంపూడి
సీతారామారావు

Muni

ఉత్తమ గురువు - అత్యుత్తమ శిష్యుడు



ఆచార్య రంగా - రాజగోపాలనాయుడు

"స్వాతంత్ర్యం కోసం" గ్రంథావిష్కరణ,
ప్రజా హృదయాధినేత



శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు

నవ్యాంధ్ర ముఖ్యమంత్రి

మా నాయకులు

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు

పౌరసరఫరాల శాఖామాత్యులు, ఆం.ప్ర.

ఆత్మీయులు

శ్రీ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరు శాసనసభ్యులు

తాతకు తగిన మనుమడు



శ్రీ గల్లా జయదేవ్

గుంటూరు లోక్‌సభ సభ్యులు

అంకితం

ఆచార్య రంగకు అనుచరుడు,
పలు పదవులు అలంకరించి నిస్వార్థంగా ప్రజాసేవ చేసిన
స్వర్గీయ పాటూరి రాజగోపాలనాయుడు గారి దివ్యస్మృతికి
ప్రేమ పూర్వకంగా అంకితం

డాక్టర్ జేక్కంపూడి సీతారామారావు

ధార్మిక సంపద



శ్రీ గల్లా రామచంద్ర నాయుడు
శ్రీమతి గల్లా అరుణకుమారి

స్వాతంత్ర్యం కోసం

('రంగా' ఆత్మకథ)

Fight for Freedom

(Autobiography of N.G. Ranga)



అనువాదం

డా॥ జేక్కంపూడి సీతారామారావు

స్వాతంత్ర్యం కోసం
('రంగా' ఆత్మకథ)

అనువాదం :
డా॥ జేక్కంపూడి సీతారామారావు

సర్వ హక్కులు రచయితవి

ప్రథమ ముద్రణ : జూన్, 2017

ప్రతులు : 1000

వెల : రూ. 300/-

ప్రతులకు :

డా॥ జేక్కంపూడి సీతారామారావు
ప్రజ్ఞ రీజెన్సీ, 4/1 అశోక్‌నగర్
గుంటూరు - 522 007
చరవాణి : 98494 97739

ముద్రణ :

శ్రీలక్ష్మీ ప్రెస్
14/2, అరండల్‌పేట
గుంటూరు - 522 002
ఫోన్ : 0863-2230643

శ్రీ పాటూరి రాజగోపాలనాయుడు (రాజన్న) జీవిత విశేషాలు

జననం	:	05-04-1920
జననీజనకులు	:	శ్రీమతి లక్ష్మమ్మ, శ్రీ శ్రీనివాసులునాయుడు
జన్మస్థలం	:	దిగువమాగం, చిత్తూరు జిల్లా
విద్యాభ్యాసం	:	అనంతపురం కళాశాల పట్టభద్రులు (మాజీ ముఖ్యమంత్రి సంజీవయ్యగారి సహపాఠి)
విద్యాభ్యాసం పూర్తి	:	1942
విద్యార్థిగా రాజకీయ కార్యకలాపాలు	:	శ్రీ తాడిపత్రి రామిరెడ్డి అనే కమ్యూనిస్టు నాయకుని ప్రభావానికి లోనైనారు. 'ఆకాశవాణి' వ్రాత పత్రికను రహస్యంగా సైకిలుమీద తిరుగుతూ పంచేవారు. 'గాంధి టోపీ'తో కళాశాలకు హాజరు. 1942 లో దిగువ మాగం గ్రామానికి పట్టభద్రునిగా తిరిగి రాక.
సమాజ సేవ	:	స్వగ్రామంలో, పరిసర గ్రామాల్లో సేవాసంఘాల స్థాపన. 'కూలోడు' నాటక ప్రదర్శన. ప్రదర్శనకు రంగాగారు ఆహ్వానితులు. నాటినుండి రంగాగారి ప్రభావానికి లోనై కడవరకు ఆయన ముఖ్య అనుచరుడిగా కొనసాగారు.
వివాహం	:	కొండ్రాజు కాల్వ శీనయ్యనాయుడుగారి కుమార్తె అమరావతమ్మతో.

ఉద్యోగం : వివాహానంతరం షోలింగరులో టీచరుగా ఉద్యోగం. ఉత్తర బ్రాహ్మణపల్లెలో ఎలిమెంటరీ స్కూలు ప్రారంభం. అందులో టీచరు. దిగువమాగం ఎలిమెంటరీ స్కూల్లో కొద్దిరోజులు టీచరు. ఓరియంట్ పబ్లిషింగ్ కంపెనీ – చిత్తూరు శాఖలో కొద్దిరోజులు ఉద్యోగం.

- 1945 కుమార్తె అరుణకుమారి జననం.
- 1946 లో రైతాంగ విద్యాలయం – శివగిరిలో నిర్వహణ, సాహితీ సమితుల స్థాపన, 'నాగేలు' వ్రాతపత్రిక నిర్వహణ, గ్రంథాలయ ఉద్యమం.
- 1947 లో అమరావతమ్మ అమరత్వం. శివగిరి ఆశ్రమంలో స్వాములు, సన్యాసులతో పరిచయం. మళయాళస్వామివారితో పరిచయం. స్వాములవారి 'జ్ఞానపథము' తెనుగుసేత. పునర్వివాహానికి నిరాకరణ. తీరుబడి లేకుండా సంఘసేవా కార్యక్రమాల నిర్వహణ. స్వగ్రామంలో 'సారాసీసా' వగైరా నాటకాల ప్రదర్శన. తిరుమలలో హరిజనులచేత ఆలయ ప్రవేశం చేయించడం. అరగొండ హైస్కూలుకు భూసేకరణ. ఇతర సంఘసేవా కార్యక్రమాలు.
- 1952 లో కృషికార్ లోక్‌పార్టీ అభ్యర్థిగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ, ఓటమి. లోకల్ డెవలప్‌మెంట్ స్కీము క్రింద ప్రతి ఊరికి మంచినీళ్ల బావి త్రవ్వించారు.
- 1953 లో చిత్తూరు జిల్లా కళాపరిషత్తు స్థాపన. వారం రోజులు చిత్తూరులో కళా, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ. అరగొండలో విద్యుత్ సబ్‌స్టేషన్ స్థాపన. బాలానంద సంఘాల స్థాపన. రచనా వ్యాసంగం.
- 1955 లో కృషికార్ లోక్‌పార్టీ తరఫున అసెంబ్లీకి ఎన్నిక.
- 1956 లో భారత్ సేవక్ సమాజ్ జిల్లా శాఖ సమావేశ కర్త. అనేక యువతీ–యువజన శిక్షణ సేవా శిబిరాలను నిర్వహించారు. రాజమండ్రి జైలు, తిరుత్తణిలో రాజకీయ పాఠశాల నిర్వహణ.

  అరగొండ కల్లు సత్యాగ్రహం.

  అరగొండ–చిత్తూరు రహదారిని తారురోడ్డుగా మార్పించారు. చిత్తూరు చక్కెర ఫ్యాక్టరీ నిర్మాణానికి సహాయం.

  చిత్తూరులో బాలికల కృష్ణవేణి జూనియర్ కళాశాల స్థాపనకు సహాయం.

- ❖ 1962 లో చిత్తూరు పార్లమెంటు సీటుకు రంగాగారిచేత పోటీ చేయించి గెలిపించారు.
- ❖ 1963 లో గల్లా రామచంద్రనాయుడుతో కుమార్తె అరుణ వివాహం.
- ❖ 1964 లో ఆరోగ్యం దెబ్బతిని జస్టిస్ పి.ఎ. చౌదరిగారింట్లో మకాం.
- ❖ 1965 లో చిత్తూరు సంతపేటలో హైస్కూలు స్థాపనకు రూ.25,000/– విరాళం. స్కూలు కమిటీ అధ్యక్షులు.
- ❖ 1973 లో అమెరికా పర్యటన. శాసనమండలికి ఎన్నిక.
- ❖ 1976 లో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం సిండికేటు మెంబరు.
- ❖ 1977 లో పార్లమెంటు సభ్యునిగా ఎన్నిక – కాంగ్రెస్ పార్టీ తరుపున.
- ❖ 1979 లో కాంగ్రెస్ అభ్యర్థిగా పార్లమెంటుకు రెండవసారి ఎన్నిక.
  చిత్తూరు తపోవనం అభివృద్ధికి కృషి. పనికి ఆహారం పథకంలో గోధుమలకు బదులు బియ్యం ఇప్పించడం. అడవుల్లో మేకల్ని, పశువుల్ని పన్నులు లేకుండా మేపుకోనివ్వాలని ఉద్యమం, పన్ను రద్దు.
  బెల్లంమీద విధించిన కంట్రోలును ఎత్తివేయించడం.
  రోడ్డు రవాణా సంస్థ బస్సులో స్టూడెంట్ పాస్‌ల పద్ధతిని ప్రవేశపెట్టించారు.
  చిత్తూరులో పాలడైరీ స్థాపనకు కృషి. సెరికల్చర్ స్కీమును, డబ్బును కేంద్రం నుండి రాష్ట్రానికి రాబట్టారు.
- ❖ 1980 లో 'రాయలసీమ సేవాసమితి' స్థాపన.
- ❖ 1984 నుండి 'వినయాశ్రమం' (కావూరు, గుంటూరు జిల్లా) నిర్వాహక అధ్యక్షులు దాని పునరుజ్జీవనానికి కృషి.
- ❖ 1985 లో మధుమేహం – మూత్రపిండాల వ్యాధి. మద్రాసు విజయా హాస్పిటల్లో చికిత్స. వినయాశ్రమ కార్యక్రమాల నిర్వహణ.
- ❖ 1997 లో సెప్టెంబరు 6న సాయంత్రం వాహ్యాళికి వెళ్లి పడటంతో కాలి తొంటి ఎముక చిట్లింది. మద్రాసు విజయా హాస్పిటల్లో చేరిక. అక్టోబరు 21 న మద్రాసు అపోలో హాస్పిటల్లో శివసాయుజ్యం.
  ఆయన క్రియాశీలిగా ఉన్నప్పుడు చిత్తూరు జిల్లాలో ఆయన లేని రాజకీయ, విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక కార్యక్రమాలేవీ ఉండేవి కావు.

రాజగోపాలనాయుడుగారి రచనలు

- గేయం, కథ, నవల, నాటకం, వ్యాసం, అనువాదం, పరిశోధన మొదలైన అన్ని సాహిత్య ప్రక్రియల్లోను రచనలు చేశారు.
- సారాసీసా, భగ్నహృదయం, పొరపాటు, రాణాప్రతాప్, కలశజలాలు మొదలైనవి నాటకాలు, నాటికలు.
- త్యాగభూమి, భారత విజయం, వెన్నెల వెలుగులు – పిల్లలకోసం రాసినవి.
- చంద్రగిరి దుర్గం, ఛత్రపతి శివాజీ, దైవోపహతుడు దారా, జేజవ్వ, రామానుజుని ప్రతిజ్ఞ, గండికోట, మాతృమందిరం మొదలయినవి నవలలు. మధూలిక, తమసోమా, కురుక్షేత్రే, పాటలలో ఛందస్సు–పరిశోధక గ్రంథాలు.
- రాధేయుడు, భాగ్యనగరం మొదలయినవి గేయరచనలు.
- కృష్ణావతారం, భగవాన్ పరశురామ్, పృథ్వీ వల్లభుడు అనువాద రచనలు. తథాగతుడు, బుద్ధం శరణం గచ్ఛామి, నేతాజీ నవలలు. జ్ఞానపథం – మళయాళస్వామి రచనకు పద్యానువాదం.
- విడిగా అనేక గేయాలు, పాటలు రచించారు. బుర్రకథలు రచించారు. ఇంకా అనేక రచనలు చేశారు. ఆంగ్లంలో 'The Trial The Triumph' అనే పేర్లతో మహాభారతం రచించారు.

రాజగోపాలనాయుడుగారి వంశవృక్షం

శ్రీమతి గల్లా అరుణకుమారి	కుమార్తె
శ్రీ గల్లా రామచంద్రనాయుడు	అల్లుడు
మనుమడు, కోడలు	**మనుమరాలు, అల్లుడు**
గల్లా జయదేవ్	డాక్టర్ గౌరినేని రమాదేవి
గల్లా పద్మావతీదేవి (భార్య)	డాక్టర్ గౌరినేని ప్రసాద్ (భర్త)
మునిమనుమలు	**మునిమనుమలు**
గల్లా అశోక్	గౌరినేని హర్షవర్ధన
గల్లా సిద్ధార్థ	గౌరినేని విక్రమాదిత్య

గ్రామీణ ప్రజాబంధు-కారణజన్ముడు ఆచార్య రంగా

కోట్లాది గ్రామీణ ప్రజానీకం గర్వించదగిన భరతమాత ముద్దుబిడ్డలలో ఆచార్య రంగా ప్రముఖ స్థానంలో నిలుస్తారు. జీవితకాలమంతా రైతులు, వ్యవసాయ కూలీలు, చేనేత, చేతివృత్తుల పనివారలు, కళాకారుల అభివృద్ధి - సంక్షేమం కోసం అలుపెరుగని కృషి సల్పారు. తాను విశ్వసించిన 'కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్' ఆశయాన్ని పూజ్య బాపూజీకి వివరించి ఆయన ఆశీస్సులు పొంది ఆ ఆశయాల సాఫల్యత కొరకు పార్లమెంట్ లోపల, వెలుపల ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా లెక్కచేయక పోరాడిన ధీశాలి. తన లక్ష్య సాధనకు పార్లమెంటు సభ్యత్వాన్ని ఒక సాధనంగా ఉపయోగించుకొన్నారే తప్ప, పదవుల కోసం ఏనాడూ ప్రాకులాడలేదు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉపముఖ్యమంత్రిగా అవకాశం వచ్చినా, స్వతంత్ర భారతావనిలో కేంద్ర ఆహారశాఖామాత్యులుగా అవకాశం వచ్చినా తృణీకరించిన త్యాగశీలి. అస్పృశ్యతను, సమాజంలో కొన్ని వర్గాల ప్రజలను న్యూనతాభావంతో చూచుటను వ్యతిరేకించిన సంస్కరణాభిలాషి. రాజకీయ శిక్షణా తరగతులను నిర్వహించి వేలాదిమందికి రాజకీయ, ఆర్థిక,సామాజిక అంశాలపైన విశాలమైన అవగాహనను కల్పించిన దార్శనికుడు.

పిన్నవయస్సులోనే పెద్ద ఆలోచనలు

అతి పిన్నవయస్సులోనే తన గురువైన ఆంజనేయులుగారి ప్రోత్సాహంతో రామాయణం, మహాభారతం, భగవద్గీత వంటి ఉద్గ్రంథాలతో పాటు వేదాలు, ఉపనిషత్తులలోని సారాంశమును మరియు వేమన శతకం, సుమతీ శతకాలలో నిబిడీకృతమై ఉన్న సందేశాలను, వివేకానంద, స్వామి రామతీర్థ మరియు

వీరేశలింగం గార్ల రచనలను పఠించడంతో పాటు దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావుపంతులుగారి 'ఆంధ్రపత్రిక'ను, ముట్నూరి కృష్ణారావుగారి 'కృష్ణా పత్రిక'ను రెగ్యులర్‌గా చదువుతూ ఉండటంతో అపారమైన విజ్ఞానాన్ని, దేశభక్తిని మరియు సమాజం యెడల బాధ్యతను, రైతులు, హరిజనులతో సహా గ్రామీణ పేదల సమస్యలపట్ల స్పష్టమైన అవగాహనను పొందగలిగారు. పెంపుడు తల్లి మంగమ్మ ద్వారా వ్యవసాయం-ప్రకృతి అనుబంధాన్ని, గ్రామీణ ప్రజల సాధక బాధకాలను అర్థంచేసుకున్నారు.

1911 లో బాపట్లలోను మరియు 1917 లో నెల్లూరులోను జరిగిన ఆంధ్ర మహాసభలలో పిన్నవయస్సులోనే పాల్గొన్నారు. అనిబిసెంట్‌ను బ్రిటిష్ ప్రభుత్వం జైలులో ఉంచినపుడు నిడుబ్రోలులో సహవిద్యార్థులతో నిరసన ప్రదర్శన నిర్వ హించారు. మాంటేగ్‌నకు సమర్పించవలసిన కాంగ్రెస్ మ్యానిఫెస్టోకు స్థానికంగా ప్రజలచే సంతకాలు సేకరించి జాతీయోద్యమంలోకి అరంగ్రేటం చేశారు.

ప్రజలందరూ విద్యావంతులైనప్పుడే పేదరికం, అంతరాలు తగ్గుతాయని, సమాజ ప్రగతితో పాటు భారతదేశం శీఘ్రంగా అభివృద్ధి చెందటానికి సాధ్య మవుతుందని విశ్వసించారు. తాను పాఠశాల విద్యార్థిగా ఉంటూనే పేదరికం వలన విద్యాగంధానికి నోచుకోని విద్యార్థినీ విద్యార్థులకు సాయంత్ర సమయంలో విద్యను బోధించడం, పేద విద్యార్థులకు ఫీజుల నిమిత్తం గ్రామస్తుల నుండి బియ్యం సేకరించి వారికి తోడ్పడటం ఆయన హృదయ వైశాల్యానికి నిదర్శనం.

నిడుబ్రోలులోని గ్రంథాలయంవల్లనే విశాలమైన లోకజ్ఞానం సంపాదించడం సాధ్యపడింది కావున తన చుట్టుప్రక్కల గ్రామాల్లో కూడా గ్రంథాలయాలు ఏర్పడాలని, అభివృద్ధిచెందాలని తద్వారా గ్రామీణ ప్రజలలో చైతన్యాన్ని కలిగించి, దేశభక్తి భావనను రగిలించాలని గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణం, నాగినేని వెంకయ్య మున్నగువారి తోడ్పాటుతో గ్రంథాలయోద్యమ వ్యాప్తి కొరకు రంగాజీ విశేషమైన కృషిసల్పారు. ఆ కాలంలోనే ప్రముఖ సంఘ సంస్కర్త త్రిపురనేని రామస్వామి చౌదరితో పరిచయం ఏర్పడింది.

గిల్డ్ సోషలిస్ట్ రంగా

ఉన్నతవిద్య కొరకు ఇంగ్లాండ్‌లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఉండగా వెలగపూడి రామకృష్ణ, వి.వి.గిరి, లింగం వీరభద్రయ్య చౌదరి మున్నగువారితో సన్నిహిత సహచర్యం లభించింది. లేబరు పార్టీ నాయకులతో చర్చలు జరపటమే కాక సోషలిస్ట్ భావజాల సాహిత్యాన్ని కూడా పఠించారు. 'గిల్డ్ సోషలిజం' పట్ల ఆకర్షితులైనారు. వర్కర్స్ ఎడ్యుకేషన్ అసోసియేషన్, అడల్ట్ ఎడ్యుకేషన్ సొసైటీ మరియు లేబర్ కాలేజీలతో సంబంధాలు ఉండేవి.

భారతదేశానికి తిరిగివచ్చిన దరిమిలా మద్రాసులో అత్యంత ప్రసిద్ధిపొందిన పచ్చయ్యప్ప కళాశాలలో ఎకనామిక్ ప్రొఫెసర్‌గా నెలకు రూ. 1,000/- లు వేతనంతో నియమితులయ్యారు. ఆ బాధ్యతలతోపాటు ప్రభుత్వానికి ఆర్థిక సలహాదారుగా, సర్వే రీసెటిల్‌మెంట్ కమిటీ సభ్యునిగా సేవలందించారు.

రైతు ఋణాలపై మారిటోరియం సాధించిన రంగా

రెండవ ప్రపంచ యుద్ధం దరిమిలా ప్రపంచవ్యాప్తంగా మాంద్యం ఏర్పడింది. అందువలన మన దేశంలో అత్యంత తీవ్రమైన పరిణామాలు సంభవించాయి. ధాన్యం ధరలు దారుణంగా పడిపోయాయి. వృత్తిదారులకు పనులు కరువైనాయి. బ్యాంకులు, షావుకార్లు ఋణాలను తిరిగి చెల్లించాలంటూ తీవ్రమైన ఒత్తిళ్లు తెచ్చారు. వేలాదిమంది రైతులు ముఖ్యంగా సన్నకారు, చిన్నకారు రైతులు తమకున్న కొద్దిపాటి భూములను అతి తక్కువ ధరలకు అమ్ముకోవలసి వచ్చింది. దేశంలోనే ప్రప్రథమంగా తెనాలిలో 1931 లో నిర్వహించిన 'ఆంధ్ర రైతాంగ రక్షణ మహాసభ'లో అప్పుల మారిటోరియం కొరకు డిమాండ్ చేయటం జరిగింది. దరిమిలా అనేక రాష్ట్రాలలో రైతుల ఋణాల మారిటోరియం కొరకు పెద్ద పెద్ద బహిరంగ సభలను, రైతు యాత్రలను నిర్వహించడం కొరకు కృషి సల్పారు. ఇచ్ఛాపురం నుండి మద్రాసు వరకు చారిత్రాత్మక 'రైతు రక్షణ యాత్ర'ను కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి, పుల్లెల శ్యామసుందరబాబు, సర్దార్ గౌతు లచ్చన్న, గొర్రెపాటి వెంకటసుబ్బయ్య మున్నగు రైతు నాయకుల సారథ్యంలో అత్యంత జయప్రదంగా నిర్వహించి, నాటి మద్రాసు రాష్ట్ర ప్రధానమంత్రి

సి. రాజగోపాలాచారిగారిచే ఆమోదింపజేశారు. వడ్డీ, అపరాధపు వడ్డీ కలిపి అసలు మొత్తానికన్నా మిగలరాదని రాజాజీ ప్రభుత్వం నిర్ణయించి, రైతులకు ఎంతో ఉపకారం చేసింది. దరిమిలా ఇతర రాష్ట్రాలలో కూడా గ్రామీణ రైతులు, పేదల ఋణాలపై మారిటోరియం వెసులుబాటు లభించింది. ఆవిధంగా దేశంలో కోట్లాది రైతు కుటుంబాలను ఆర్థిక సంక్షోభం నుండి గట్టెక్కించడానికి ప్రధాన కారకుడు ఆచార్య రంగాజీ.

జమీందారీ రద్దుకు నాంది పలికిన రంగా

బ్రిటీష్ ప్రభుత్వ ఏజెంట్లుగా రైతులనుండి భూమిశిస్తు వసూలు చేయుటకు ఏర్పాటుచెయ్యబడ్డ జమీందారీ వ్యవస్థ తన పరిమితులను దాటి అక్రమంగా, నిర్బంధంగా రైతులనుండి శిస్తులు వసూలు చెయ్యటం, గ్రామాలకు సమీపంలో ఉన్న అడవులలో గ్రామీణులు తమ పశువులను మేపుకొనుటకు పుల్లరి వసూలు చెయ్యటం, తమ సిబ్బందిచే గ్రామీణులపై దౌర్జన్యకాండకు పూనుకోవటం పట్ల రంగాజీ ఆవేదన చెందారు. చోళులు మరియు చాళుక్యుల పరిపాలనా కాలంలో రైతులకు తమ భూములపై హక్కు ఉంటూ వచ్చింది. బ్రిటీష్ పరిపాలనలో ఈ హక్కును కాలరాసి జమీందారుల దయాదాక్షిణ్యాలపై రైతులు ఆధారపడవలసిన పరిస్థితి సరికాదని రంగాజీ దృఢంగా విశ్వసించారు. 1931 లో నెల్లూరు జిల్లా రైతుల మహాసభ రంగాజీ అధ్యక్షతన జరిగి జమీందారీ రైతులు పడుతున్న ఇక్కట్లను చర్చించి, ఆ అంశంపైన అధ్యయనం చేయటానికి రంగాజీ అధ్యక్షునిగా, జమీన్ రైతు సంపాదకుడు నెల్లూరి వెంకట్రామనాయుడు కార్యదర్శిగా 'జమీందారీ రైతుల ఎంక్వైరీ కమిటీ' ఏర్పాటు అయ్యింది. దరిమిలా నెల్లూరు జిల్లా వెంకటగిరిలో 'ఆంధ్ర రాష్ట్ర జమీందారీ రైతుల మహాసభ'ను నిర్వహించారు. కటికనేని కుటుంబంవారు వెంకటగిరి జమీందార్లకు వెరవకుండా సహకారం అందించారు. ప్రముఖ నాయకులు సత్యమూర్తి, కాశీనాథుని నాగేశ్వరరావు, ఒరిస్సా నుండి విశ్వనాథదాస్ మున్నగు ప్రముఖులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా జమీందారీల రద్దు కొరకు పోరాటం ఇక్కడే ఆరంభమయ్యింది. దరిమిలానే బీహార్‌లో స్వామి సహజానంద, ఉత్తరప్రదేశ్‌లో చౌదరి చరణ్‌సింగ్ మున్నగు నాయకుల సారథ్యంలో జమీందారీ రద్దు పోరాటం బలపడింది.

జమీందారీ రైతుల ఎంక్వైరీ కమిటీ పలు జిల్లాలు పర్యటించి 1933 లో సంపూర్ణమైన రిపోర్టును తయారుచెయ్యగా, విజయవాడలో ప్రముఖులు ఎర్నేని లక్ష్మీనారాయణ ఆర్థిక సహకారంతో 'ఎకనామిక్ కండీషన్స్ ఆఫ్ జమీందారీ రైత్స్' గ్రంథాన్ని ప్రచురించి, 1935 లో మహాత్మా గాంధీజీకి అందించి జమీందారీ రైతుల వెతలను రంగాజీ వివరించారు. జనవరి 1934లో మహాత్మా గాంధీని వెంకటగిరికి ఆహ్వానించి జమీందారీ వ్యవస్థ రద్దుకు గాంధీచే ఆమోదం పొందటం జరిగింది. ఏలూరులో జరిగిన 3వ ఆంధ్ర జమీందారీ రైతుల మహాసభలో జమీందారీ వ్యవస్థ రద్దును డిమాండ్ చేస్తూనే, అది జరిగే లోపల జమీందారీ రైతులను కూడా రైతువారీ రైతులతో సమానంగా పరిగణించాలని, రైత్వారీ భూమిశిస్తుకు సమానంగా ఉండాలని, సర్వే సెటిల్‌మెంట్ చేయాలని, చెరువులు, ఇరిగేషన్ వనరులను అభివృద్ధి చెయ్యాలని, పంటలు పోయినపుడు రెమిషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి ఎన్నికైన రంగాజీ జమీందారీ రైతుల రక్షణ కొరకు పలు సూచనలను ఎ.ఐ.సి.సి. ముందు ఉంచారు. 1946 లో కాంగ్రెస్ సంస్థ జమీందారీ వ్యవస్థ రద్దును ఆమోదించ డంలో రంగాజీ కృషి ఎంతో ఉంది.

వెంకటగిరి సత్యాగ్రహం దరిమిలా రంగాజీ 1 సంవత్సరం కఠిన శిక్షను వెల్లూరు జైలులో అనుభవించారు. రంగాజీ అరెస్టు దరిమిలా శ్రీమతి భారతీదేవి జమీందారీ రైతు ఉద్యమంలో అత్యంత చురుకైన పాత్రను నిర్వర్తించారు. ప్రత్యేకంగా మందస జమీందారీ రైతు పోరాటంలో అసమానమైన ధీరత్వాన్ని ప్రదర్శించారు. పుల్లెల శ్యామసుందరబాబు, గౌతు లచ్చన్న మున్నగు నాయకులు ఆవిడకు అండగా ఉండి విశేషమైన కృషిసల్పారు. ఆ సందర్భంలోనే పోలీసుల తుపాకిగుళ్లకు వీరనారి గున్నమ్మ ప్రాణాలర్పించింది.

కోరివచ్చిన పదవులకన్నా విశాల జనబాహుళ్య సంక్షేమమే ప్రధానం

రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ప్రవేశపెట్టబడిన కంట్రోళ్లు, లైసెన్స్, పర్మిట్ల విధానం స్వాతంత్ర్యానంతరం కూడా కొనసాగించాలని నెహ్రూ అభిల షించారు. రైతుల స్వంత అవసరాలను సరిగా అంచనా వేయకుండా నిర్బంధంగా ధాన్యం ప్రొక్యూర్‌మెంట్ చేయటంతో గ్రామీణ ప్రజలకు కష్టనష్టాలు ఎదురవు

తున్నాయని, అవినీతికి, ఆశ్రితపక్షపాతానికి ఆస్కారం ఏర్పడుతూ ఉన్నందున ఈ విధానాన్ని రద్దు చేయాలని రంగాజీ కృషి చేశారు. క్లిష్టపరిస్థితులలో మద్రాసు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రాజాజీ - రంగాజీని తన మంత్రివర్గంలో ఉపముఖ్యమంత్రిగా చేరమని కోరగా 'నాకు పదవి వద్దు. కంట్రోళ్లు-లైసెన్స్-పర్మిట్ విధానాన్ని రద్దుచేస్తే సంతోషిస్తాను. కృషికార్ లోక్ పార్టీ మద్దతు మీకు ఉంటుంది' అని చెప్పడం తన స్వంత ప్రయోజనాలకన్నా బహుళ ప్రజానీకం యొక్క సంక్షేమమే ముఖ్యమని చాటిచెప్పిన త్యాగశీలి. అప్పటికే ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం ఉధృతంగా సాగుతూ ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు త్వరలో సాకారంకానున్న కీలకదశలో రంగాజీ ఉపముఖ్యమంత్రి పదవిని కాదన్న విషయాన్ని గుర్తించాలి.

గాంధీజీ కూడా కేంద్రస్థాయిలో కంట్రోళ్లు ఎత్తివేయాలని హెచ్చరించారు. నెహ్రూ మంత్రివర్గంలో చేరమని మహాత్మాగాంధీ సలహా ఇచ్చినా, నెహ్రూ దూతగా గోవింద వల్లభ పంత్ కోరినా, కంట్రోళ్లను ఎత్తివేయాలని తాను చేస్తున్న డిమాండ్‌ను విడనాడవలసి ఉంటుందన్న భావనతో ఆ ప్రతిపాదనను సున్నితంగా తిరస్కరించడం జరిగింది. ఈ నేపథ్యంలో నాడు ఆహార మంత్రిగా ఉన్న రాజేంద్రప్రసాద్ 1952 లో ఎత్తివేసినా తిరిగి 1959 లో కంట్రోళ్లను విధించడం జరిగింది. తర్వాత కొంతకాలానికి దేశవ్యాప్తంగా కంట్రోళ్లను తొలగించారు.

స్వేచ్ఛాయుత రైతాంగ వ్యవస్థను రక్షించిన రంగా

ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూపైన సోవియట్ రష్యా ప్రభావం గణనీయంగా ఉండేది. రష్యాలో ఉన్నట్లుగానే సహకార-సమిష్టి వ్యవసాయ క్షేత్రాలను మన దేశంలో కూడా ఏర్పాటుచేస్తే వ్యవసాయ ఉత్పత్తి బాగా పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. నాగపూర్ కాంగ్రెస్ మహాసభల్లో సహకార వ్యవసాయం చేపట్టాలని నిర్ణయించబడింది. రైతుస్వామ్యానికి, స్వేచ్ఛకు భంగం కలుగుతుందని అభిప్రాయపడి రంగాజీ తీవ్రంగా వ్యతిరేకించారు. అంతేకాక చిన్న కమతాలలో దిగుబడులు అధికంగా ఉంటాయని ఘంటాపథంగా చెప్పారు. ఉత్తర భారత రైతాంగ నాయకుడు చౌదరి చరణ్‌సింగ్ కూడా సహకార వ్యవ

సాయాన్ని వ్యతిరేకించారు. సహకార-సమిష్టి వ్యవసాయం పేరుతో సోవియట్ రష్యాలో లక్షలాదిమంది రైతులను అమానుషంగా సైబీరియాకు తరలించిన దారుణమైన పరిస్థితులను విశదీకరించుతూ రంగాజీ పెద్దయెత్తున దేశవ్యాప్తంగా ప్రచారం నిర్వహించారు. చిన్న చిన్న రైతువారీ భూఖండాలను కూడా 'ఎస్టేట్' నిర్వచనంలోకి తీసుకొనివచ్చిన 17వ రాజ్యాంగ సవరణ రైతు మెడకు యమపాశం కాగలదని పెద్దయెత్తున భారతదేశమంతటా ప్రచారం నిర్వహించటమే కాక పార్టీలకతీతంగా సహచర పార్లమెంట్ సభ్యులను కలిసి 17వ రాజ్యాంగ సవరణ వలన ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడటమేకాక వ్యవసాయరంగం తీవ్రమైన సంక్షోభానికి గురికాగలదని వివరించారు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీకి మూడింట రెండు వంతులు మెజారిటీ ఉన్నప్పటికీ 17వ రాజ్యాంగ సవరణ వీగిపోవటం రంగాజీ సాధించిన బ్రహ్మాండమైన విజయం.

ప్రజాచైతన్యమే ప్రజాస్వామ్యానికి రక్ష అని నమ్మిన రంగా

దాదాబాయ్ నౌరోజి, గోఖలే, తిలక్, మహాత్మా గాంధీల సారథ్యంలో కొన సాగుతున్న స్వాతంత్ర్య సమరంలో అప్పటివరకు అధికంగా పాలుపంచుకొంటూ ఉన్న పట్టణప్రాంత ప్రజలతో పాటు కోట్లాదిగా ఉన్న గ్రామీణ ప్రజానీకాన్ని కూడా స్వాతంత్ర్య సమరంలో భాగస్వాములను చేయాల్సిన అవసరాన్ని గుర్తించి అందుకు అనుగుణంగా వారిని చైతన్యవంతులను చేయడానికి, స్వతంత్ర భారతావనిలో వారి హక్కులు-ప్రయోజనాలు ఎలా మెరుగుపరచుకోవచ్చునో తెలియపరుస్తూ రైతు సంఘాలను, వ్యవసాయ కూలీ సంఘాలను చేనేత, ఇతర చేతివృత్తులవారి సంఘాలను ఏర్పాటుచేస్తూ స్వాతంత్ర్య సమరానికి కొత్త ఊపును తీసుకొనివచ్చిన ఘనత ఆచార్య రంగాదే.

బ్రిటీష్ పాలననుండి మన దేశం స్వాతంత్ర్యం సాధించిన దరిమిలా ప్రజాస్వామ్య పంథాలో అన్ని రంగాలలో శీఘ్ర పురోగతిని సాధించాలంటే ప్రజలను ముఖ్యంగా రాజకీయ నాయకులలో, కార్యకర్తలలో అవగాహనను పెంపొందించుట కొరకు అనేకచోట్ల రాజకీయ శిక్షణా తరగతుల కార్యక్రమాన్ని నిర్వహించారు. గౌతు లచ్చన్న, పి. రాజగోపాలనాయుడు, కందుల ఓబులరెడ్డి, చేగిరెడ్డి బాలిరెడ్డి, ప్రగడ కోటయ్య, సుంకర సత్యనారాయణ, పసుపులేటి

కోటేశ్వరరావు, యన్. విజయరాజకుమార్, యన్. వీరాచారి, కొణిజేటి రోశయ్య వంటి ఎందరో నాయకులను తయారుచేసిన ఘనత రంగాజీది. ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య కూడా రంగాజీ రాజకీయ శిక్షణా తరగతిలో తర్ఫీదు పొందినవారే. నాటి కేరళ ప్రాంతములో రంగాజీ రైతు యాత్రలు నిర్వహించినపుడు ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్ రంగాజీ యాత్రకు ఇన్‌చార్జిగా వ్యవహరించారు. వయోజన విద్య వ్యాప్తి కొరకు రంగాజీ ఎంతో కృషిసల్పారు.

ఒంగోలు కరువు, రాయలసీమ ప్రాంత కరువులతో అల్లల్లాడిన పరిస్థితులలో కరువు నివారణ చర్యలు చేపట్టాలని, సమీప అడవులలో పశువుల మేతకు అనుమతించాలని, ప్రజలకు ఆహారధాన్యాలను అందించాలని కోరారు. 1920 కు పూర్వం వలె ఆలిండియా ఫామిన్ (వరదలు మరియు కరువులు) ఇన్సూరెన్స్ ఫండ్‌ను ఏర్పరచాలని, దానికి రాష్ట్రాల నుండి, కేంద్రం నుండి సహకారం ఉండాలని డిమాండ్ చేశారు. సర్కారు జిల్లాల నుండి పశుగ్రాసంను కేంద్రం రాయలసీమకు తరలించింది. తుంగభద్ర ప్రాజెక్టు నిర్మాణంలో రంగాజీ కృషి ఉంది. అలాగే లోయర్ భవానీ ప్రాజెక్టు కొరకు కూడా రంగాజీ కృషి చేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కొరకు కృషి చేయటమేగాక, దాని నిర్మాణమునకు అనువైన ప్రదేశమును పరిశీలించుటకు ఖోస్లా కమీషన్‌ను రప్పించటానికి రంగాజీ, మోటూరి సత్యనారాయణ ప్రభృతులతో కృషి చేయడమేగాక కమీషన్ సభ్యులు ప్రయాణించుటకు అనుగుణంగా రహదారిని ముక్త్యాల రాజాగారు, కోనూరు కన్నయ్య ప్రభృతుల సహకారంతో తయారుచేయించి డ్యామ్ నిర్మాణం జరిగిన ప్రదేశమునకు తీసుకొనివెళ్లారు. ఖోస్లా కమీషన్ సదరు ప్రదేశం డ్యామ్ నిర్మాణమునకు అత్యంత అనుకూలముగా ఉన్నదని సిఫార్సు చేసింది. గుంటూరు చానల్ ఏర్పాటు, పెదవడ్లపూడి-పాతూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలలో కూడా రంగాజీ కృషి ఎంతో ఉంది.

పుచ్చలపల్లి సుందరయ్య గారు రైతాంగ విద్యాలయంలో ఉపన్యాసం మాత్రమే చేశారు.
-సుందరయ్యగారి ఆత్మకథ

సుభాష్‌చంద్రబోస్ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఉండగా జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతన నేషనల్ ప్లానింగ్ కమిటీ ఏర్పాటు అయ్యింది. రంగాజీ రూపొందించిన భూమిశిస్తు సంస్కరణ, వ్యవసాయ కార్మికుల అంశములను కమిటీ పరిశీలించడమేకాక వ్యవసాయంపై ఏర్పాటు అయిన సబ్-కమిటీకి రంగాజీ కన్వీనర్‌గా తీసుకోబడ్డారు. అప్పట్లో ప్రముఖ వ్యాపార-పారిశ్రామిక దిగ్గజాల నేతృత్వంలో 'బాంబే ప్లాన్', ఎం.ఎన్. రాయ్‌గారి 'పీపుల్స్ ప్లాన్' మరియు శ్రీమన్నారాయణ అగర్వాల్‌గారి 'గాంధియన్ ప్లాన్'లు ప్రజల ముందు ఉన్న సందర్భంలో రంగాజీ గాంధియన్ ప్లాన్‌కు మద్దతునిచ్చారు. మహాత్మా గాంధీజీ సమక్షంలో నెహ్రూ అధ్యక్షతన ఏర్పాటుచేయబడిన ఎకనామిక్ ప్రోగ్రాం కమిటీకి అనుబంధంగా రంగాజీ అధ్యక్షునిగా ఏర్పాటుచేయబడ్డ వ్యవసాయ కమిటీ రిపోర్టులో పరిశ్రమలు మరియు వాణిజ్య వర్గాలతో సమానంగా వ్యవసాయ దారులకు ప్రయోజనాలను చేకూర్చాలని, రైతులు, వ్యవసాయ కార్మికులకు పూర్తి ఉపాధి కల్పించాలని, కౌలు రైతులకు రక్షణ ఉండాలని, సహకార వ్యవస్థల ద్వారా రైతాంగానికి అవసరమైన సేవలు అందించబడాలని రికమండ్ చేశారు. రంగాజీ సభ్యుడుగా ఉన్న కాటేజ్ ఇండస్ట్రీస్ సబ్-కమిటీ రిపోర్టులో వ్యవసాయ ఆధార, కుటీర, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అధికప్రాధాన్యాన్ని, ప్రోత్సాహాన్ని ఇవ్వాలని సూచించబడింది. స్వతంత్ర భారత్‌లో మొట్టమొదటి క్యాబినెట్‌లో పరిశ్రమల మంత్రి శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అఖిలభారత కాటేజ్ ఇండస్ట్రీస్ బోర్డుకు రంగాజీని అధ్యక్షునిగా నియమించారు.

చేనేత కార్మికుల సమస్యలపైన లోతుగా అధ్యయనంచేసి పరిశోధనా పత్రాన్ని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి సమర్పించడమేకాక 'ఎకనామిక్స్ ఆఫ్ హేండ్లూమ్స్' అనే ప్రామాణిక గ్రంథాన్ని రంగాజీ రచించారు. 1925 లో వీవర్స్ కాంగ్రెస్‌ను ఏర్పాటు చేశారు. అప్పటినుండి చేనేత కార్మికుల సంక్షేమం కొరకు కృషిసల్పుతూ వచ్చారు. వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీలను ఏర్పాటుచేయడంలో ప్రగడ కోటయ్య, పెండ్యం వెంకటరాములు మున్నగువారికి ఎంతో మద్దతునిచ్చారు. కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, చేనేత, చర్మకార వృత్తులలో స్వయం ఉపాధిని పొందుతూవున్న కోట్లాదిమంది గ్రామీణ ప్రజల అభివృద్ధి జరగాలంటే గాంధీజీ

చూపిన బాటే ఏకైక మార్గమని రంగాజీ విశ్వసించి ఆ ఆశయ సాధనకే 'కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్' సిద్ధాంతాన్ని కారల్‌మార్క్స్ ప్రవచించిన 'కార్మికవర్గ నియంతృత్వం'నకు ప్రత్యామ్నాయంగా ప్రవచించి అందుకొరకు జీవితాంతం కృషిచేస్తూ వచ్చారు. ప్రపంచంలో ఏ దేశంలోనైనా పారిశ్రామిక కార్మికులకన్నా గ్రామీణ రైతులు, కూలీలు, ఇతర వృత్తిదారులే ఇతర వర్గాల చేతుల్లో ఎక్కువగా దోపిడీకి గురవుతున్నారన్న వాస్తవాన్ని ధైర్యంగా విశదీకరించారు.

అప్పట్లో హరిజనులతో సహపంక్తి భోజనాలు నిర్వహించటం, అస్పృశ్యతను వ్యతిరేకించటమేకాక విద్యావంతుడు, యువకుడు, సచ్ఛీలత కలిగిన దామోదరం సంజీవయ్య ఏ.ఐ.సి.సి. సభ్యునిగా ఎంపికకావటంలోను, వేలాదిమంది నిమ్నకులాలకు చెందిన పేద విద్యార్థినీ విద్యార్థులకు హాస్టళ్లను ఏర్పాటుచేసి విద్యావంతులను చేయటానికి కృషిచేసిన వేముల కూర్మయ్య వంటి నాయకులకు రంగాజీ తోడ్పాటును అందించారు. 1920 దశకంలోనే 'హరిజన నాయకుడు' అనే గ్రంథాన్ని రచించారు. హరిజనులలో అత్యధికులు వ్యవసాయ కార్మికులు. రేపల్లె తాలూకాలోని పల్లెకోనలో జరిగిన ప్రప్రథమ ఆంధ్ర వ్యవసాయ కూలీల మహాసభలను లండన్ ప్రయాణమును కూడా వాయిదా వేసుకుని అధ్యక్షత వహించి దిశానిర్దేశం చేశారు. అఖిల బర్మా లేబర్ కాంగ్రెస్‌కు అధ్యక్షత వహించి కనీస కోర్కెల చార్టర్‌ను ప్రకటింపజేశారు. అంతర్జాతీయ లేబర్ ఆర్గనైజేషన్ (ఐ.ఎల్.ఓ.) సమావేశాలలో పలు పర్యాయములు పాల్గొన్నారు. హరిజనులు, ఇతర వెనుకబడిన ప్రజానీకానికి వయోజన ఓటింగ్ హక్కు కల్పించుట కొరకు కృషి చేశారు. రాయల్ లేబర్ కమీషన్ వద్ద వ్యవసాయ కార్మికుల విషయాన్ని కూడా పరిశీలించాలని, వర్క్‌మెన్ కాంపెన్‌సేషన్ యాక్టు మరియు ట్రేడ్ యూనియన్ చట్టాలను కొద్ది మార్పులతో వ్యవసాయ కార్మికులకు కూడా వర్తింపజేయాలని కోరారు. కేంద్ర శాసనసభ సభ్యునిగా కనీస వేతనాల చట్టమును వ్యవసాయ కార్మికులకు కూడా విస్తరింపచేయాలని ప్రయత్నం చేసి కొంతమేరకు సాఫల్యం పొందారు. ప్రభుత్వ భూములను నిరుపేద హరిజన కుటుంబములకు పంచాలని ప్రయత్నం చేయటమే కాక భారతదేశంలో 1933 లోనే మొట్టమొదటి హరిజన సేవాదళ్‌ను ఏర్పరచారు రంగాజీ.

గ్రామ పంచాయతీల వ్యవస్థను బలపర్చిన రంగా

మహాత్మా గాంధీ 'భారతదేశం గ్రామాలలో నివసిస్తూ ఉంద'న్నారు. కానీ జవహర్‌లాల్ నెహ్రూ, బి.ఆర్. అంబేద్కర్‌లకు గ్రామాలపైన కొంత చులకన భావముండేది. పురాతనకాలం నుండి మన దేశంలో గ్రామాలు స్వయంపోషకత్వంతో, ప్రజాస్వామ్య పద్ధతిలో పరిఢవిల్లాయని, చదువు తక్కువైనా గ్రామీణ ప్రజలలో సంస్కారం, సమాజహితం, లోకజ్ఞానాలకు కొదవలేదని, కావున గ్రామ పంచాయతీలను బలపర్చి ప్రజాస్వామ్య పునాదులను నిర్మించుతూ అభివృద్ధి ఫలాలను అత్యధిక ప్రజానీకానికి అందించాలని కోరడమేగాక, ఆ రోజులలోనే కొన్ని వందల గ్రామ పంచాయతీలు ఏర్పడేదానికి రంగాజీ విశేషమైన కృషి చేశారు.

1948 నవంబరు 9న ముసాయిదా రాజ్యాంగం గూర్చి చర్చలో మాట్లాడుతూ దేశంలో కొత్తగా నెలకొల్పబడుతున్న ప్రజాస్వామ్యంలో సర్వజన వయోజన ఓటు హక్కు ద్వారా అనుభవంతో గ్రామాలలోని ప్రజలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలంటే వారికి అవసరమైనన్ని రాజకీయ వ్యవస్థలను ఏర్పాటుచేయాలని రంగా కోరారు. గ్రామ పంచాయతీల పునాదులు లేకుండా ప్రజాస్వామ్యంలో ప్రజలు తమ వంతు పాత్రను ఎట్లా నిర్వహించగలరని ప్రశ్నించారు.

జీవితపర్యంతం రంగాజీ ఆచార్యుడే!

విద్యార్థి దశనుండే తన దృష్టిలోనికి వచ్చిన విషయాల గురించి లోతుగా అధ్యయనం చేసే ధోరణి రంగాజీకి అలవాటు అయ్యింది. విద్యార్థిగా ఉండగానే 'రాణీరుద్రమదేవి' పుస్తకాన్ని రచించారు. వేసవిలో ఊటీ వెళ్లిన సమయంలో అక్కడ నివసిస్తూ ఉన్న షెడ్యూల్ తెగల ప్రజల స్థితిగతులను, జీవన విధానాన్ని పరిశీలించి 'ట్రైబ్స్ ఆఫ్ నీల్‌గిరీస్'ను రచించారు. ఇంగ్లీషు భాషలో సుమారు 35 పుస్తకములు, తెలుగులో 6 పైగా పుస్తకాలను రచించారు. రానున్న తరాలకు రంగాజీ రచనలు మార్గదర్శకత్వాన్ని ఇస్తూనే ఉంటాయి. తన భావాలను, సిద్ధాంతాలను దేశవ్యాప్తంగా వేలాది సభలు నిర్వహించి ప్రచారం గావించారు.

కారణజన్ముడు రంగాజీ

తాను నమ్మిన సిద్ధాంతం కొరకు, విధానం కొరకు రంగాజీ చాలా ఒడుదుడుకులను ఎదుర్కోవలసి వచ్చింది. స్వాతంత్ర్య పోరాట సమయంలో మహాత్మా గాంధీజీని ఎంతో అభిమానించినా శాంతియుత సత్యాగ్రహ సమరం విషయంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ కార్యాచరణకు దిగకుండా కాలయాపన చేస్తున్నందువలననే తాను బ్రిటీష్ ప్రభుత్వం పంపిన గృహనిర్బంధం ఉత్తర్వును ఉల్లంఘించి ప్రత్యక్ష పోరాటానికి దిగవలసి వచ్చిందని గాంధీజీ ఆదేశమును ధిక్కరించవలసి వచ్చిందని గాంధీజీకి సుదీర్ఘ లేఖను వ్రాశారు.

బొంబాయిలో ఎ.ఐ.సి.సి. సమావేశం జరుగుతూ ఉన్న సమయంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ మహాసభను రంగాజీ ప్రారంభించినందుకు కోపించిన సర్దార్ పటేల్ 'కాంగ్రెస్ నుండి ఎప్పుడు రాజీనామా చేయబోతున్నారని' రంగాజీని అడుగగా, 'నేనెందుకు రాజీనామా చేయాలి? ఈ కాంగ్రెస్ మీ సొత్తా' అని రంగా అడిగారు. అక్కడే ఉన్న రాజన్‌బాబు 'రంగాలో మరొక సర్దార్‌ను నీవు చూడటంలేదా' అని పటేల్‌ను అడిగారట. అనంతర కాలంలో సర్దార్ పటేల్ జీవితంలో చివరి 5 సం॥లు రంగాజీతో సన్నిహిత సంబంధం కొనసాగించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలోకి రంగాను తీసుకోకపోతే తాను కూడా చేరనని చెప్పి, రంగాను తీసుకొన్న తర్వాతే వర్కింగ్ కమిటీలో చేరారు.

జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానమంత్రిగా, దేశంలోని ప్రఖ్యాతి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్‌తో ఉంటూవుండగా కంట్రోళ్ల సమస్యపైన విభేదించి 'కృషీకార్ లోక్‌పార్టీ' పెట్టడం, సహకార–సమిష్టి వ్యవసాయంను వ్యతిరేకించి రాజాజీ ఆశీస్సులతో స్వతంత్ర పార్టీని స్థాపించడం రంగాగారిలో ఆత్మవిశ్వాసాన్ని, నిర్భీతిని స్పష్టపరుస్తుంది. కేంద్ర శాసనసభలో సభ్యునిగా ఉండగా పార్లమెంట్ భవనంపైన బ్రిటీషు పతాకాన్ని ఎస్.కె.డి. పల్లీవాల్, మోహన్‌లాల్ సక్సేనాలతో కలిసి దించివేసిన సాహసి.

తమకు బిడ్డలు ఉంటే కొద్దోగొప్పో స్వార్థం ఏర్పడటానికి అవకాశం కలగవచ్చు, కాబట్టి అందుకు తావివ్వరాదు అని రంగాగారు, భారతీదేవి నిర్ణయం తీసుకున్నారు. ఇదే రీతిలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యగారు కూడా నడిచారు.

భారతదేశంలో స్వయం ఉపాధిని కల్పిస్తూ ఉన్న రైతాంగ వ్యవస్థ, చేనేత, చేతివృత్తుల వ్యవస్థలను పరిరక్షించేందుకు మొక్కవోని ధైర్యంతో, అచంచలమైన విశ్వాసంతో జీవితాంతం రాజీలేని పోరాటం జరిపి నిలబెట్టిన రంగాజీ గ్రామీణ ప్రజలకు ఆత్మబంధువు. వారికొరకే అహరహం శ్రమించిన కారణజన్ముడు.

ఈ గ్రంథాన్ని రంగాజీకి అత్యంత సన్నిహితునిగా, తోడునీడగా మెలిగిన పాటూరి రాజగోపాలనాయుడుగారికి అంకితం ఇవ్వటం అత్యంత సంతోష దాయకం. రాయలసీమ గాంధిగా రంగాజీ చూపిన బాటలో నిరాడంబరంగా, నిస్వార్థంగా గ్రామీణ ప్రజానీకానికి ఎనలేని సేవలు అందించిన మహనీయుడు రాజగోపాలనాయుడు. రంగాజీతో పాటు 8వ లోక్‌సభలో సభ్యునిగా ఉండే అదృష్టం నాకు లభించింది. ప్రత్యేకంగా ఆ కాలంలో రంగాజీ-రాజన్నల ఆశీస్సులను, ఆదరాభిమానాలను పొందగలిగాను.

నేను విద్యార్థిగా ఉండగానే సహకార వ్యవసాయమును వ్యతిరేకించుతూ ఆచార్య రంగా చేసిన ప్రకటనలను, వార్తలను చదివి ఆయనపట్ల అభిమానంతో ఏకలవ్య భక్తి రీతిలో రాజకీయాలలో కొనసాగుతూ ఆయన చూపిన స్వార్థరహిత ప్రజాసేవ మార్గంలో చేతనైన మేరకు కృషిచేస్తూ ఉన్నాను. రైతాంగ ప్రయోజనాలకు భంగం కలుగుతూ ఉన్నదని భావించిన సందర్భాలలో అలా చేయటం తగదని పాలకులకు తెలియజెప్పేందుకు రంగాజీ చూపిన బాటలో కృషిచేస్తూ ఉన్నాను. మిత్రులు డా॥ జేక్కంపూడి సీతారామారావుగారితో చాలాకాలం నుండి సన్నిహిత సంబంధం ఉంది. రంగాజీ రచించిన 'ఫైట్ ఫర్ ఫ్రీడమ్' పుస్తకాన్ని తెలుగులోకి అనువదించి, దానికి ముందుమాట వ్రాయని నన్ను కోరినందుకు వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈ పుస్తకం రంగాజీ జీవితంలోని వివిధ పార్శ్వములను విశదీకరించుతుంది. రానున్న తరాలకు ముఖ్యంగా గ్రామీణ యువతకు, సామాజిక కార్యకర్తలకు మరియు పాలకులకు కరదీపికగా ఉపయుక్తముగా ఉంటుందని ఆశిస్తున్నాను.

-శ్రీ వడ్డే శోభనాద్రీశ్వరరావు
మాజీ వ్యవసాయ శాఖామాత్యులు, ఆం.ప్ర.
మాజీ లోక్‌సభ సభ్యులు

రంగాగారు - మా నాన్నగారు

రంగాగారు ఆంగ్లంలో వ్రాసిన 'ఫైట్ ఫర్ ఫ్రీడం' కు డా॥ జేక్కంపూడి సీతారామారావు గారు చేసిన ఆంధ్రానువాదం ఈ 'రంగా ఆత్మకథ'. రంగాగారు మా నాన్నకు పితృతుల్యులు. అంటే నాకు తాత గారన్నమాట. అనువాదం చేసిన సీతారామారావు గారు నాకు కాకినాడలో పరిచయం. ఆయన నాకు సోదరతుల్యులు. వారీ అనువాద రచనను మా నాన్న రాజగోపాలనాయుడుగారికి అంకితం ఇస్తున్నారు. ఆంగ్ల రచయిత, అనువాదకులు, గ్రంథ స్వీకర్త - ఈ ముగ్గురితో అనుబంధం ఉన్న నేనీ ముందుమాట వ్రాయడం నాకు సంతోషాన్ని కలిగించే విషయం.

నేను ఇక్కడ సీతారామారావుగారి అనువాద శైలిని గురించి, అనువాదంలో చూపిన అంశాల గురించి చెప్పదలచుకోలేదు. ఎందుకంటే వారు ఇంతకు పూర్వమే రంగాగారు రచించిన కాకతీయ నాయకులు, కర్షకవేదం అనువాదం చేసి పలువురి మెప్పుకు పాత్రులయ్యారు. అందుచేత నేను ఆ విషయాల జోలికి వెళ్లకుండా, రంగాగారి గురించి, మా నాన్న రాజన్న గురించి ఇతరులకు పెద్దగా తెలియనివి, నాకు మాత్రమే తెలిసినవి కొన్ని విశేషాలు తెలియజేస్తాను.

మా నాన్న రాజగోపాలనాయుడు అనంతపురంలో చదివే రోజులు. అప్పుడు మా నాన్న వామపక్ష భావాలను ఇష్టపడేవారు. ఒక రోజు రంగాగారు అనంతపురం వచ్చారు. మా నాన్న, ఆయన మిత్రబృందం రంగాగారిని తక్కువగా అంచనా వేశారు. రంగాగారి ఉపన్యాసం పూర్తయిన తరువాత మిత్రులందరూ

రకరకాల ప్రశ్నలు వేశారు. రంగాగారు ఎంతో ఓపికగా వారికి సమాధానం చెప్పారు. అంతటితో అయిపోలేదు. ఆరోజు సాయంకాలం తనను కలుసుకోమని రంగాగారు వారితో చెప్పారు. నాన్న మరో పదిమంది మిత్రులు రంగాగారిని కలిశాక రంగాగారు 'చక్కగా మాట్లాడావు' అంటూ నాన్నను మెచ్చుకున్నారు. 'ఇలాగే ఉండు' అని ప్రబోధించారు. ఇక అంతే, అప్పటినుండి మా నాన్న ఆయనకు భక్తుడయ్యాడు. అంతకు ముందు విదేశీ వస్త్ర బహిష్కారం మొదలైన కార్యక్రమాల్లో పాల్గొన్నా, రంగాగారితో పరిచయం అయిన దగ్గరనుండి రాజకీయాల నుంచి విరమించుకొనే వరకు నాన్న రంగాగారికి శిష్యునిగానే జీవించారు.

రంగాగారు రైతు బంధువని అందరికీ తెలిసిన సంగతే. రైతుల హక్కులను కాపాడడం రంగాగారి ధ్యేయం. రైతుకు సాయపడడం రంగాగారి లక్ష్యం. రంగాగారి సిద్ధాంతం మా నాన్నగారికి బాగా నచ్చింది. రంగాగారు రైతాంగ విద్యాలయం స్థాపించి, నిర్వహిస్తే మా నాన్న అందులో చేరారు. కొంతకాలం అందులో ఉపాధ్యాయునిగా పనిచేశారు. రంగాగారి స్ఫూర్తితో రైతు కూలీ సంఘాలు, చేనేత సంఘాలు, కల్లుగీత సంఘాలు ఏర్పాటుచేయడంలో, నిర్వహణలో నాన్నగారు ప్రముఖ పాత్ర పోషించారు. రంగాగారి రైతాంగ విద్యా లయంలో చేరినవారిలో చాలమంది తరువాతి కాలంలో మంచి మంచి రాజకీయ పదవులు పొందినవారున్నారు. అలాంటి చాలమంది రంగాగారిని విడిచి వెళ్లినా కడవరకూ మా నాన్న రంగాగారినిగాని, ఆయన సిద్ధాంతాలనుగాని విడిచి వెళ్లలేదు. అందుకే మా నాన్నను 'ఆంధ్ర గాంధి' అని, 'కిసాన్ గాంధి' అని పిలిచేవారారోజుల్లో.

రంగాగారు మా నాన్నను 'రాజా!' అని పిలిచేవారు. మా నాన్నకయితే బట్టల విషయంలో తగిన శ్రద్ధ ఉండేది కాదు. నేను ఆయనకు బట్టలు సర్ది పంపించేదాన్ని. నేను వచ్చిన తర్వాత చూస్తే, ఆయన ఆ బట్టలన్నింటిని ఎక్కడో పారేసు కునేవారు. ఈ విషయంలో రంగాగారు మా నాన్నను కేకలేసేవారు. అలా మా నాన్నను మందలించగలిగిన వ్యక్తి ఒక్క రంగాగారే! రంగాగారి మందలింపు మాటలకు నాన్నగారు ఎప్పుడూ నొచ్చుకొనేవారు కాదు.

నాకు ఒకటిన్నర సంవత్సరాల వయస్సులో మా అమ్మ గతించింది. నన్ను నాన్నే పెంచారు. రంగా దంపతులు నన్ను పెంచుకోవాలని అనుకున్నారు. భారతీదేవిగారు నన్ను నిడుబ్రోలు తీసుకొనివెళ్లారు. మా నానమ్మ గొడవపెట్టి, నన్ను తిరిగి తీసుకొని వచ్చింది. భారతీదేవి, రంగా – ఇద్దరూ నన్ను ఎంతో ప్రేమగా చూసేవారు. అప్పుడప్పుడు నేను రంగాభవన్‌లో ఉండేదాన్ని. వారిద్దరి అభిమానాన్ని రుచిచూసేదాన్ని.

నాకు ఆరు సంవత్సరాల వయస్సు వచ్చినప్పటినుండి మా నాన్న నన్ను తనతోపాటు సభలకు తీసుకొని వెళ్లేవారు. అలా సభలకు వెళ్లినప్పుడు గౌతు లచ్చన్న, జయప్రకాష్ నారాయణ, కల్లూరి మొదలైనవారితో ప్రత్యక్ష పరిచయం ఏర్పడింది. 1984వ సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో రంగాగారికి పార్టీ టిక్కెట్టు ఇచ్చింది. నాన్నగారికి ఇవ్వలేదు. రంగాగారు టిక్కెట్టు తెచ్చుకున్నారని, నాయుడుగారికోసం ప్రయత్నం చేయలేదని నాన్నగారి అభిమానులు భావించారు. రంగాగారిని విమర్శించడం ప్రారంభించారు. నానమ్మ కూడా వారితో జతకలిసి రంగాగారు మోసం చేశారని భావించింది. నాన్నగారి అభిమానులందరూ ఇంటిముందు గుమిగూడారు. నాన్నగారు బయటకు వచ్చి తన అభిమానులతో 'రంగా ఉంటేనే మనం, రంగాగారు పార్లమెంటులో లేకపోతే రైతుల పక్షంలో ఎవరు పోరాటం చేస్తారు? ఆయన పార్లమెంటులో ఉండాలి' అని నచ్చచెప్పారు. అప్పటివరకు నాయుడుగారికి టిక్కెట్టు సాధించకపోతే, రంగాగారు కూడా ఎన్నికల్లో పోటీ చేయకూడదని వాదించే వారందరూ నాన్న గారి మాటలతో మౌనం వహించారు. మా నాన్నకు రంగాగారంటే అంత భక్తి. భక్తి అనడంకంటే 'రంగాగారంటే అంత పిచ్చి' అనడం బాగుంటుందేమో!

నేను చిన్నప్పటినుండి నాన్నగారితో మీటింగ్‌లకు వెళ్లేదాన్ని కదా! సభలలో ఎలా మాట్లాడాలో నాకు బాగా తెలిసింది. ఇక్కడొక సంగతి గుర్తొస్తున్నది. అప్పుడు నాన్న స్వతంత్ర పార్టీ పక్షాన పోటీ చేస్తున్నారు. ఆ నియోజకవర్గంలో కొన్ని గ్రామాల్లో స్వతంత్ర పార్టీవారిని అడుగుపెట్టనిచ్చేవారు కాదు. అలాంటి ఊరు భూమిరెడ్డిపల్లి. నేను నాన్నగారి పక్షాన ప్రచారం చేస్తూ రాత్రి 9 గంటలకు భూమిరెడ్డిపల్లి వచ్చాను. నాతోపాటు మరికొంతమంది ఉన్నారు. మా రాక

గురించి తెలిసి ఊరి వారందరూ దివిటీలతో వచ్చారు. వెంటనే తిరిగి వెళ్లి పొమ్మన్నారు. కాదంటే మామీద విసరడానికి వాళ్ల చేతుల్లో రాళ్ళున్నాయి. పరిస్థితిని గ్రహించిన రామచంద్రనాయుడు, వాసుదేవనాయుడు 'చిన్నమ్మా! వెళదాం' అన్నారు. (వాళ్లంతా నన్ను చిన్నమ్మా అని పిలిచేవారు). నేను జీపు దిగాను. జీపు ముందు నిలబడ్డాను. 'మమ్మల్ని ఎందుకు తరమాలనుకుంటు న్నారు? నేను చెప్పేది వినండి. నచ్చకపోతే వదిలేయండి' అన్నాను. ఆ ఊర్లో అందరూ యాదవులు. బి.సి. వర్గానికి చెందినవారు. 'అర్ధరాత్రి అపరలక్ష్మి వచ్చింది. ఏమి చెబుతుందో విందాం!' అన్నారు. నేను మాట్లాడాను. నా ఉపన్యాసం పూర్తి అయిన తరువాత ఆ ఊరి వారందరూ భూమితల్లిమీద ప్రమాణం చేసి మా నాన్నకే ఓటు వేస్తామని చెప్పారు. ఆ రాత్రే మా స్వతంత్ర పార్టీ జెండాలు కట్టారు. రెండో పక్షంవాళ్ల జెండాలు తీసివేశారు. ఆరోజు ఇదో పెద్ద వార్త అయింది. దీనితో మా నాన్న అనుచరులు మాకు వ్యతిరేకంగా ఉన్న గ్రామాలన్నింటికి నన్ను తీసుకొని వెళ్లారు. నాన్న ఈ విషయాలు విని సంతోషించాడు. నేను ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన తరువాత కూడా ఆ గ్రామాల్లోని ప్రజలు ఆనాటి విషయాలు గుర్తుచేస్తుంటారు.

మా నాన్న గొప్ప రచయిత, పరిశోధకుడు. ఆయన విలువలున్న రాజకీయ నాయకునిగానే అందరికీ తెలుసుగాని ఆయనలోని ఈ కోణం గురించి తెలియదు. రాజకీయాల్లో ఎంత తీరిక లేకపోయినా, ప్రజాసేవలో ఎంత శ్రమ పడుతున్నా ఆయన రచనా వ్యాసంగం కొనసాగుతూనే ఉండేది. ప్రొద్దున 5 గంటలకు వ్రాయడం ఆయనకు అలవాటు. అప్పట్లో కరెంటు ఉండేది కాదుకదా! లాంతరు వెలుగులో వ్రాస్తూ ఉండేవారు.రైలులో ప్రయాణించేటప్పుడు, ఉద్యమాలలో పాల్గొని జైలులో ఉన్నప్పుడు ఆయన రచనా వ్యాసంగం సాగు తుండేది. ఆయన శైలి చిన్న చిన్న వాక్యాలతో, హృదయాన్ని తాకేది. ఆయన రామానుజుని ప్రతిజ్ఞ, బుద్ధం శరణం గచ్ఛామి మొదలైన రచనలు చేశారు. కౌరవ పాండవ యుద్ధాన్ని 'కురుక్షేత్ర' పేరుతో పరిశోధనాత్మకంగా వ్రాశారు. కొన్ని తాళపత్ర గ్రంథాలు కూడా పరిశోధించారు. ఆయన వ్రాసేవారే కాని

అవి ప్రచురించాలని ఎప్పుడూ అనుకోలేదు. నాన్న వ్రాసిన వీరశివాజీని, బుద్ధం శరణం గచ్ఛామిని నేను సేకరించి ప్రచురించాను.

నాన్న వ్రాసిన రామానుజుని ప్రతిజ్ఞమీద ఒక సమావేశం నిర్వహించమని తిరుమల-తిరుపతి దేవస్థానం వాళ్లను అడిగాను. వాళ్లు ఈ గ్రంథాన్ని త్వరలో ప్రచురిస్తున్నారు కూడా. నాన్నగారి పరిశోధన గ్రంథాల్లోని భావాలను తిరిగి చెప్పినవాళ్లు ఆయనను ఉట్టంకించకపోవడం నాకు బాధగా ఉండేది.

నాన్నకు సంస్కృతంతో పాటు మళయాళం, కన్నడం, కొంకిణీ భాషలు కూడా వచ్చు. 'పాటల్లో ఛందస్సు' అనే విషయం గురించి ఆయన చేసిన పరిశోధన అపూర్వమయింది. భగవాన్ పరశురామ, మున్షీ భాగవతానువాదం భవాన్స్ జర్నల్స్‌లో ప్రకటితమయ్యాయి.

రామచంద్రనాయుడుతో వివాహమయ్యాక నేను వారితో అమెరికా వెళ్లాను. సుమారు పది సంవత్సరాలు క్రిస్లర్ కంపెనీలో ఉద్యోగం చేశాను. రామచంద్ర నాయుడు నాకంటే ముందే ఇండియా వచ్చారు. నన్నూ రమ్మన్నారు. కొద్ది నెలలు పనిచేస్తే పది సంవత్సరాలు పూర్తవుతాయని, పెన్షన్ వస్తుందని, కాబట్టి తర్వాత వస్తానని అన్నాను. అప్పుడు మా నాన్నకు ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వలేదు. నన్ను రమ్మని రామచంద్రనాయుడు గట్టిగా కోరడంతో నేను ఇండియా వచ్చాను. మా నాన్నకు ఎందుకు టిక్కెట్టు ఇవ్వలేదో రాజీవ్‌గాంధీని అడగాలని అను కున్నాను. అంతకు చాలకాలం క్రితం నన్ను నాన్న ఇందిరాగాంధీకి పరిచయం చేశారు. నాన్న ఆ సమయంలో ఇందిరాగాంధి గురించి ఒక పుస్తకం వ్రాస్తున్నారు. ఆ పుస్తకం ఇందిరాగాంధీ మరణానంతరం నాన్న పూర్తిచేశారు. ఆ పుస్తకం రాజీవ్‌గాంధీగారికి ఇవ్వడానికి వెళ్లినప్పుడు నేనూ రాజీవ్‌గాంధీని కలిశాను. నాన్న వ్రాసిన పుస్తకం చూచి రాజీవ్‌గాంధీ బాగా సంతోషించారు. అప్పటికే నేను కూడా టిక్కెట్టు కోసం అప్లై చేశాను. నాకూ ఇవ్వలేదు. నేను చాలా బాధ పడ్డాను. రంగాగారు, నాన్న, నేను రాజీవ్‌గాంధీని కలిశాము. మా ఇద్దరికి టిక్కెట్లు ఇవ్వకపోవడానికి కారణమేమిటని రాజీవ్‌గాంధీని అడిగాను. రంగాగారు నన్ను వారించారు. నేను మాత్రం ఆపలేదు. నా అసమ్మతిని నిర్భయంగా

తెలియజేశాను. రాజీవ్‌గాంధీ సంకోచం లేకుండా నేను మాట్లాడే తీరును మెచ్చు కున్నారు. నన్ను టచ్‌లో ఉండమని అన్నారు. జార్జిని పిలిచి నేను ఎప్పుడు వచ్చినా తనను చూడడానికి పంపమని తెలియజేశారు. బయటకు వచ్చిన తరువాత రంగాగారు అలా మాట్లాడినందుకు నన్ను బాగా తిట్టారు. 'నా అభిప్రాయం చెప్పడంలో తప్పేమిటి?' అన్నాను. (అప్పుడే అమెరికా నుంచి రావడం వలన అంత ధైర్యంగా నా అభిప్రాయం చెప్పానుగాని, ఇండియాలోని రాజకీయాలు అర్థమయిన తరువాత ఇప్పుడయితే ఆవిధంగా మాట్లాడేదాన్ని కానేమో!)

రాజీవ్‌గాంధీ నాకు ఎం.పి. టిక్కెట్టు ఇస్తానని చెప్పారు. నేను సరేనన్నాను. వారు నా పేరే ప్రపోజ్ చేశారు. కొత్తగా వచ్చినవారికి ఎం.ఎల్.ఏ.గానే అవకాశం ఇవ్వాలని, ఎం.పి.గా ఇవ్వకూడదని పార్టీ నిర్ణయించడంతో నన్ను చంద్రగిరి నుండి ఎం.ఎల్.ఏ.గా పోటీచేయమని పార్టీవారు చెప్పారు. బూటాసింగ్ గారు స్వయంగా వచ్చి, నన్ను రాజీవ్‌గాంధీగారి ఇంటికి తీసుకువెళ్లారు. రాజీవ్‌గాంధీ ఫోను చేశారు. ఇతరులకు ఇవ్వడానికి గల కారణాలు వివరించారు. అయినా నేను అంగీకరించలేదు. వెంటనే నాన్న నా దగ్గరనుండి ఫోను లాక్కుని నేను పోటీ చేస్తానని రాజీవ్‌గాంధీకి మాట ఇచ్చారు. ఆ మాటతో నేను రాజకీయాల్లో ప్రవేశించాను.

మా నాన్న మాకందరికీ స్ఫూర్తి. ఆయన చేసిన ప్రజాసేవ మేమూ కొన సాగించాలనుకున్నాం. రాజకీయాల్లో కొనసాగుతూ ప్రజలకు సేవ చేస్తూనే మా ఫ్యాక్టరీ ద్వారా వచ్చే లాభాల్లో కొంత శాతం ప్రజలకోసం ఖర్చు చేస్తున్నాం. మావంతుగా ఇప్పటికి 17 కోట్లకు పైగా ప్రజలకోసం వెచ్చించాము. విద్య కోసం, వ్యవసాయదారులకోసం, వ్యవసాయంకోసం, స్కాలర్‌షిప్‌లతో విద్యార్థుల కోసం ఈ సొమ్మును ఖర్చుచేశాం. శ్రీకృష్ణదేవరాయ ఎడ్యుకేషనల్ ట్రస్టు ద్వారా ఎందరికో సాయం చేశాం. రాజన్న ట్రస్టు ద్వారా సొంతంగా ఒక పాఠశాలను నెలకొల్పి, కళాశాల స్థాయి వరకు దాన్ని అభివృద్ధి చేశాం. పేటమిట్ట, దిగువమాగం గ్రామాల్లో హాస్టల్స్ నిర్మించాం. దిగువమాగంలో నాన్న కోరిక

మేరకు, ఆయన స్మృత్యర్థం అందరూ మహిళలతో ఒక ఫ్యాక్టరీ పెట్టాం. ప్రతి ఇంట్లోని ఒక స్త్రీకి ఒక ఉద్యోగం ఇవ్వాలనే మా సంకల్పానికి స్ఫూర్తి మా నాన్న రాజన్నే. అంటే పరోక్షంగా ఆయనకు స్ఫూర్తి అయిన రంగాగారే.

జేక్కంపూడి సీతారామారావుగారు మేము కాకినాడలో ఉన్న కాలంలో నాన్నతో పరిచయం. అప్పటినుంచి ఆ పరిచయం కొనసాగుతూనే ఉంది. మా అబ్బాయి జయదేవ్‌కి తెలుగుదేశం గుంటూరు ఎం.పి.గా టిక్కెట్టు ఇచ్చినప్పుడు నేను ముందుగా ఫోను చేసింది సీతారామారావు గారికే. అధికారంలో ఉన్నవారికి తమ గ్రంథాన్ని అంకితం ఇవ్వాలనుకునే ఈ రోజుల్లో పాత పరిచయాన్ని మరచిపోకుండా, మరణించిన మా నాన్నగారికి ఈ పుస్తకం అంకితం ఇస్తున్నానని సీతారామారావుగారు చెప్పిన మాట నాకు ఎంతో ఆనందం కలిగించింది. ఇది సీతారామారావుగారి మంచితనానికి నిదర్శనంగా నేను భావిస్తున్నాను.

ఈ పుస్తకాన్ని మా నాన్నకు అంకితం ఇస్తున్నందుకు సీతారామారావుగారికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ, ఈ ముందుమాట వ్రాయమని కోరి మళ్లీ పాత జ్ఞాపకాలను గుర్తుతెచ్చుకొనే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు.

-శ్రీమతి గల్లా అరుణకుమారి

మాజీ మంత్రివర్యులు, ఆంధ్రప్రదేశ్

రైతు బాంధవులు ఆచార్య రంగాగారితో నా అనుబంధం

రైతు కుటుంబంలో జన్మించి విద్యార్థి దశనుంచి గ్రామీణ ప్రాంతాలలో రైతాంగం, రైతుకూలీలు, చేనేత కార్మికుల స్థితిగతులను పూర్తిగా ఆకళింపు చేసుకున్న ఆచార్య రంగాగారు లండన్ వెళ్లి ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీలో ఉన్నత విద్యాభ్యాసం చేసి తిరిగి వచ్చిన పిదప మద్రాసులోని పచ్చయప్ప కళాశాలలో ఆచార్య బాధ్యతలు స్వీకరించి విద్యార్థులకు దేశ రాజకీయ, ఆర్థిక స్థితిగతులపై క్షుణ్ణంగా అవగాహన కలిగించి, స్వాతంత్రోద్యంలో పాల్గొని, రాష్ట్రపతిగా పనిచేసిన శ్రీ ఆర్. వెంకట్రామన్ గారితో కలిసి కారాగార శిక్ష అనుభవించారు. దేశానికి బ్రిటీష్ దాస్యశృంఖలాల నుంచి విముక్తి కలిగిన తర్వాత మళ్లీ జాతీయ కాంగ్రెసులో చేరి ప్రధాన కార్యదర్శి బాధ్యతలు స్వీకరించారు. 1952-56 సం॥ల మధ్య రాజ్యసభకు ఎన్నికైన పిదప కాంగ్రెసు పార్టీ కార్యదర్శిగా వ్యవహ రించారు. ఆయన ఆశయాలకు, సిద్ధాంతాలకు ఆకర్షితుడనై శిష్యుడిగా, సహచరుడిగా వారితో నాకు గురుశిష్యుల అనుబంధం కలిగింది. వారి సిద్ధాంతాలను అనుసరిస్తూ వచ్చిన చిత్తూరు గాంధిగా రాయలసీమలో పిలువబడేటటువంటి కీ.శే. పాటూరు రాజగోపాలనాయుడుగారు వారికి ఆత్మీయ సహచరుడుగా వారిని అనుసరించారు. రైతాంగ వ్యవసాయ విధానాలపట్ల ఆచార్య రంగాగారు అప్పటి ప్రధాని పండిట్ నెహ్రూగారి సమిష్టి వ్యవసాయ క్షేత్రాలను మన దేశంలో రష్యా దేశాన్ని అనుకరించాలని ప్రయత్నం చేస్తున్న సిద్ధాంతాన్ని విభేదించి కృషికార్ లోక్ పార్టీని స్థాపించారు.

1949 సం॥ నుంచి బాలల మనోవికాసానికి పాఠశాల వదిలిన అనంతరం గ్రామాలలో **బాలానంద సంఘాల**ను చిత్తూరు జిల్లాలో ప్రారంభించాను. బాల సంఘాలను సందర్శించిన రాజన్న (రాజగోపాలనాయుడు) చిత్తూరు జిల్లా అంతటా ఈ కార్యక్రమం విస్తరిస్తూ గ్రామీణ ప్రాంతాలలోని బాలలకు మనో వికాసానికి సాంస్కృతిక కళాత్మకమైన కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రోత్స హించడానికి చిత్తూరు జిల్లాలో వీలైనన్ని బాల సంఘాలు ఏర్పాటు చేయించారు. నేను విద్యార్థి దశలో ఉన్నా తీరిక కలిగినపుడు గ్రామాలకు వెళ్లి అక్కడ యువతను ప్రోత్సహించి బాల సంఘాలు ఏర్పాటుచేయించాను. ఆ కార్యనిర్వహణను గుర్తించిన రాజన్నగారు 1954 సం॥ తిరుత్తణిలో రైతాంగ విద్యాలయం నిర్వ హించాలని నన్ను ప్రోత్సహించారు.

గ్రామీణ యువతకు, వ్యవసాయ చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి మార్గదర్శకాలు సూచించి యువతలో రాజకీయ పరిజ్ఞానంతోపాటు వ్యవసాయ, చేనేత రంగాలలో నూతన విధానాలను వివిధ రంగాలలో నిష్ణాతులైన రాజకీయ నాయకులు, ఆర్థికవేత్తలను ఆహ్వానించి, సామాజిక కార్యక్రమాలతోపాటు 20 రోజులపాటు 200 మందికి శిక్షణ శిబిరాన్ని రైతాంగ విద్యాలయం పేరుతో నిర్వహించాలని తపనపడ్డారు. గ్రామీణ ప్రాంతాలలోని యువతకు చైతన్యాన్ని కల్పిస్తూ రైతాంగ సమస్యలకు కృషి చేస్తున్న చిరంజీవులనాయుడు వారి సమన్వ యంతో నిర్వహించాలని కోరడం జరిగింది. 1954 సం॥ మే నెలలో నిర్వహించ దలచిన ఈ శిక్షణా శిబిరానికి గ్రామీణ ప్రాంత యువతకు శిబిరం యొక్క లక్ష్యాలను వివరించి, వారిని శిబిరానికి వచ్చేటట్లు ఉత్సాహం కల్పించడానికి నేను, చిరంజీవులునాయుడు, రాజన్న నాయకత్వంలో చిత్తూరు జిల్లాలో ముఖ్యంగా తూర్పుప్రాంతం గ్రామాదులను సందర్శించి యువతకు ఉత్సాహం కల్పించి శిబిరానికి వచ్చేటట్లు చేశాం. విద్యుచ్ఛక్తి కూడా చాలావరకు లేని గ్రామాలలో కిరోసిన్ లాంతర్ల సహాయంతో పొలాలలో పర్యటించి, దాదాపు 200 మంది పాల్గొనేటట్లు చేయగలిగాం. తిరుత్తణిలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ ప్రాంగణంలో 2 సత్రాలను తీసుకుని బస, భోజనాలకు ఒక సత్రం, శిక్షణా తరగతులకు మరో సత్రం ఉపయోగించాం. శిబిరంలో పాల్గొన్న యువత

ఉదయం సమయంలో కొన్ని గ్రూపులుగా ఏర్పడి చుట్టుప్రక్కల గ్రామాలకు వెళ్లి వ్యవసాయ పరిజ్ఞానంపై అవగాహన, గ్రామాల పారిశుద్ధ్యత, చెట్లు నాటడం, రహదారుల నిర్మాణం మొదలైనవాటి కొరకు శ్రమదానం చేసి మధ్యాహ్న భోజన సమయానికి తిరుత్తణి చేరుకునేవారు. శిబిరం క్రమశిక్షణ నిర్వహణ బాధ్యత పలమనేరుకు చెందిన శ్రీ టి.సి. రాజన్న, శ్రీ రాజన్న గార్లు నిర్వహించారు. యువకులకు భోజన వసతి, రవాణా సౌకర్యాలు, ఆహ్వానితుల స్వాగత సత్కారాల బాధ్యత నేను, చిరంజీవులనాయుడుగారు తీసుకొని ఏ లోపాలు లేకుండా యువతకు సంతృప్తిగా నిర్వహించాము.

ఈ శిబిరానికి శ్రీయుతులు పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, ఎన్.వి.నాయుడు, దరువూరి వీరయ్య, సర్దార్ గౌతులచ్చన్న, కందుల ఓబులరెడ్డి గార్లు విచ్చేశారు. ప్రతిరోజూ ఇద్దరు వివిధ రంగాలలో నిష్ణాతులైన వక్తలు ఉపన్యాసాలు ఇచ్చేవారు. కృషికార్ లోక్ పార్టీని రద్దుచేసి కాంగ్రెసు పార్టీలో చేరిన పిదప అనేక హోదాలు నిర్వహించి దాదాపు 60 ఏళ్లపాటు పార్లమెంటు ద్వారా తాను నమ్మిన సిద్ధాంతాలకు రాజీపడకుండా కృషిచేసిన రాజకీయ దురంధరులు. 1980సం॥లో పార్లమెంటుకు ఎన్నికైన తర్వాత లోక్‌సభలో కాంగ్రెసు పార్టీ ఉపనాయకులుగా వ్యవహరిస్తూ సభ ప్రారంభం నుంచి వాయిదా పడేంతవరకు సభలో ఉంటూ, పార్టీకి చెందిన మంత్రులుగాని, నాయకులుగాని, సభ్యులుగాని వారి ప్రవర్తన, సభ పట్ల తీసుకుంటున్న శ్రద్ధాసక్తులు నివేదికగా తయారుచేసి మరుసటిరోజు ఉదయానికల్లా ప్రధానికి పంపేవారు. 60 సం॥ల పాటు సుదీర్ఘంగా పార్ల మెంటులో సేవ చేసినందుకు ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీగారు పార్లమెంటరీ అవార్డు ఇచ్చి సత్కరించారు. గిన్నీసు రికార్డు గ్రంథంలో కూడా వారి సేవలు నమోదు చేయబడ్డాయి.

తరచూ కరవుకాటకాలకు లోనవుతూ దుర్భిక్ష సీమగా తయారైన రాయలసీమ జిల్లాలో రైతాంగానికి, బాలలకు, వయోవృద్ధులకు, దివ్యాంగులకు, (బుద్ధిమాంద్య యుత వికలాంగులు), మహిళల సంక్షేమానికి ప్రభుత్వ పథకాల ద్వారా అందడం లేదని ఒక స్వచ్ఛంద సేవాసంస్థను స్థాపించి, తద్వారా రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు,

దాతలు, సంస్థల నుంచి నిధులు సేకరించి, తక్కువ నిర్వహణా వ్యయంతో సత్ఫలితాలు సాధించవచ్చునని రాజన్నగారు ఆశించారు. ఆ సందర్భంలో నేను తిరుత్తణి నుంచి మద్రాసులో ముద్రణాలయం స్థాపించి, భాగస్వాములు సహక రించనందున తిరుపతికి రావడం జరిగింది. తిరుపతిలో 3 ఎకరాల స్థలంలో 'నేషనల్ ఆర్ట్ ప్రింటర్స్' అనే ముద్రణాలయం స్థాపించి, నా తోటి భాగస్వాములైన మాజీ మంత్రి కుమారుడు శ్రీ కిలారి కృష్ణమూర్తితో నిర్వహించేవాడిని. మహిళల్లో చైతన్యం కల్పించి, వారి సాధికారతకు 'మహిళ' అనే పేరుతో ఒక మాసపత్రికను మా అన్న కుమార్తె శ్రీమతి పద్మారత్నం సంపాదకత్వాన నిర్వహిస్తూ వచ్చాం. శ్రీ రాజన్నగారు 1980 సం॥లో రాయలసీమ ప్రాంత అభివృద్ధి సంక్షేమానికి కృషి చేయాలనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఆచార్య రంగాగారి అనుమతికై వారిని కోరినపుడు సంఘసేవ కూడా ప్రస్తుత పరిస్థితుల్లో కత్తిమీద సాములాంటి దని, సమస్యలపై అవగాహన లేనివారు రాగద్వేషాలతో మిమ్మల్నిగాని, సంస్థను గాని విమర్శిస్తే తనకు బాధాకరంగా ఉంటుందని అంటూ అనుమతి ఇవ్వడానికి ఒక ఏడాదిపాటు కాలం తీసుకున్నారు. చివరకు అనుమతి ఇవ్వగా 1981 సం॥ జనవరి నెలలో 'రాయలసీమ సేవాసమితి' పేరుతో రాజన్నగారు అధ్యక్షులుగా, నేను కార్యదర్శిగా, కిలారి కృష్ణమూర్తి, వెంకటరత్నం తదితర యువతతో స్థాపించడం జరిగింది. ప్రథమంగా 6 గ్రామాలలో శిశువిహార్ పేరుతో ప్రారంభించిన 'రాయలసీమ సేవా సమితి' ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిస్సా రాష్ట్రంలోని కోరాపుట్ జిల్లాలో వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించి దాదాపు 3 వేల గ్రామాలకు విస్తరించడం జరిగింది. తిరుపతి వచ్చినపుడల్లా వారం రోజులు వారి దత్తపుత్రిక శ్రీమతి పుష్పావతి, ఆచార్య నరసింహారావుగారి కుటుంబంతో ఉంటూ రాస్ కార్యక్రమాలను ప్రత్యక్షంగా సందర్శించి అభినందించేవారు. చివరి దశలో గుంటూరు లోక్‌సభ ఎన్నికల సందర్భంలో అప్పటి ప్రధాని శ్రీ రాజీవ్‌గాంధీ, వారు పార్లమెంటులో ఉపనాయకుడిగా ఉండాలన్న కోరికను నాద్వారా ఆచార్య రంగాగారి సందేశం పంపి ఎన్నికలలో పోటీచేసేటట్లు ఆమోదం పొందడం జరిగింది. దురదృష్ట వశాత్తు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి విజయం సాధించగలిగారు. ఆచార్య రంగా

గారు పదవికోసం కాకుండా రైతాంగం, రైతుకూలీలు, చేనేత కార్మికులు, కళాకారులు, యువత సమస్యలను క్షుణ్ణంగా ఆకళింపుచేసుకుని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి పార్లమెంటు సభ్యత్వాన్ని ఒక సాధనంగా ఉపయోగించేవారు. ఏమాత్రం తీరిక కలిగినా పార్లమెంటు గ్రంథాలయానికి వెళ్లి వివిధ అంశాలపై పరిశోధన చేసి సమస్యలను ఆకళింపుచేసుకొని సభలో ప్రతిపక్షాలు సైతం అభినందించే విధంగా ప్రసంగాలు చేసేవారు. శ్రీ రాజన్నగారు రెండు పర్యాయాలు లోక్‌సభకు ఎన్నికైనపుడు వీరిద్దరూ నార్త్‌ఎవెన్యూలోని ఒకే ప్రాంగణంలో ఉండేవారు. నేను వారితో ఉంటూ రాస్ సంస్థ కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు పొందడానికి అవకాశం కలిగింది. ఏ ప్రభుత్వ అధికారికిగాని, మంత్రులకుగాని సిఫార్సు ఉత్తరం ఇచ్చేవారుకాదు. రాజన్నగారు అధ్యక్షులుగా ఉన్నా వారికి కూడా ఈ ఆజ్ఞనే ఇచ్చారు. నేను స్వయంగా వెళ్లి అధికారయంత్రాంగాన్ని కలిసి పథకాన్ని గురించి ఒప్పించి, మెప్పించి కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్ర ప్రభుత్వంపై ఏ ఆర్థిక భారం లేకుండా రాజన్నగారి సూచనలతో, ఆమోదంతో నిర్వహించేవాడిని. వివిధ వర్గాలకు చెందినవారు బదిలీకావడానికో, ఉన్నతపదవులకో, ఏ వ్యక్తిగత లాభదాయక పనులకో వచ్చే వారిని సున్నితంగా మందలించి సంబంధిత అధికార్లను ఒప్పించి, వారి లక్ష్యాన్ని సాధించుకోమనేవారు. తనమీద గౌరవంతో ఉత్తరానికి విలువ ఇచ్చి చేసిన పని ఇతరుల అర్హతకు ప్రతిబంధకం కారాదని వారి ఉద్దేశ్యం. ప్రభుత్వ విధానాల పట్ల, ప్రజాసమస్యలపట్ల మాత్రం పోరాడగలనని నిర్మొహమాటంగా చెప్పేవారు. ఉదయం సభాసమావేశాలు జరుగుచున్నప్పుడు నేను, రాజన్న, ఆచార్య రంగా గారు కాలినడకన పార్లమెంటు భవనం వరకు వెళ్లి, వారిద్దరూ సభలో ప్రవేశించిన తర్వాత నేను ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేవాడిని. రాయలసీమ సేవాసమితిగా ప్రారంభించినందువల్ల దేశ సమైక్యతను, పథకాల విస్తరణను గుర్తించి 'రాష్ట్రీయ సేవాసమితి'గా మార్పు చేయాలని నిర్ణయించబడి పేరు మార్చబడమైనది. లబ్ధిదారులలోగాని, రాజకీయ యంత్రాంగంలోగాని, ఎన్నికలలోగాని పార్టీలకు కుల, మత, వర్గాలకు అతీతంగా సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా చేస్తున్న రాస్ సంస్థ ఆచార్య రంగా, రాజన్న గార్లు ఇచ్చిన స్ఫూర్తితో ఎన్నో సమస్యలను

కూడా అధిగమించి నిరంతరాయంగా కృషి చేస్తున్నందుకు రాస్ సంస్థకు, నాకు వ్యక్తిగతంగా 4 జాతీయ అవార్డులు రాష్ట్రపతి భవన్‌లో అప్పటి రాష్ట్రపతుల ద్వారా ఇప్పించి, సత్కరించడం జరిగింది. ఆచార్య రంగా, రాజన్న గార్లు సహచరులుగా అన్ని వర్గాలలో గుర్తింపు పొందిన నాకు వారు ఇచ్చిన స్ఫూర్తి నా జీవితం చరమదశ వరకు వారి లక్ష్యాలను సాధించాలని కృషి చేస్తున్నాను.

ప్రతిరోజూ లోక్‌సభ అనంతరం రాజకీయాలను రంగరించి నాకు చెప్పేవారు. ఆరోజులలో విద్యార్థి దశలో ఉండి, ఆయన ఆర్థిక సిద్ధాంతాలమీద పరిశోధన చేస్తున్న ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారిని గుర్తించి ఆయనలో ఉన్న నాయకత్వ లక్షణాలు, దీక్ష, పదిమందిని ప్రోగుచేసుకుని నిర్వహించల శక్తిసామర్థ్యాలు భవిష్యత్‌లో ఉజ్వలంగా రాణించగలరని నాతో చెప్పి అభినందించేవారు. 1981 సం॥లో శ్రీ చంద్రబాబునాయుడుగారికి, ఆచార్య రంగాగారి దత్తపుత్రుడు శ్రీ గోగినేని నాగేశ్వరరావుగారికి తలవని తలంపుగా మంత్రి పదవులు శ్రీ అంజయ్యగారి మంత్రివర్గంలో స్థానం లభించడం రాజకీయాలలో మరో మలుపు తిరిగింది. ఆచార్య రంగాగారికి, నాకు, రాజన్నగారికి, సర్దార్ గౌతు లచ్చన్నగారికి ఉన్న అనుబంధం వారి దేశంలోని అనుచర్ల గురించి వ్రాయాలన్నా అది ఒక గ్రంథం అవుతుందని భావిస్తున్నాను. వారిని స్మృతిపథంలో నిలుపుకోవడానికి 'ఆచార్య రంగా కృషి విజ్ఞానకేంద్రం' తిరుపతి సమీపంలో ఏర్పాటుచేయడం, వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించ డానికి మాజీ శాసనసభాపతి డా॥ శ్రీ అగరాల ఈశ్వరరెడ్డి సహకరించడం, వారిని సదా స్మరించుకుని వారి సిద్ధాంతాలకు ఉడతాభక్తిగా సేవ చేయడం నా ధర్మమని భావిస్తున్నాను.

–డా॥ గుత్తా మునిరత్నం
'పద్మశ్రీ' అవార్డు గ్రహీత
ప్రధాన కార్యదర్శి, రాస్–తిరుపతి

గాంధేయవాదానికి మచ్చుతునక శ్రీ రాజన్న

శ్రీ రాజగోపాలనాయుడుగారిని ఏబది సంవత్సరాల పైచిలుకు నుండి ఎరుగుదును. శ్రీ నాయుడుగారు చిత్తూరు జిల్లా పరిసరాల్లోనే ప్రాథమిక – మాధ్యమిక విద్యాభ్యాసం పూర్తిచేసు కొని, అనంతపురంలోని కళాశాలలో పట్టభద్రులై ఉద్యోగానికై పరుగులుదీయక ఆచార్య రంగా గారి రాజకీయాలపట్ల ఆకర్షితులైరి. అప్పట్లో జిల్లాలో రంగాగారి అనుయాయులుగా ఉంటూ రైతు ఉద్యమం ద్వారా ప్రజలకు తమ సేవ లందించుచున్న శ్రీ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, శ్రీ పాకాల యస్.వి.నాయుడు, శ్రీ పొనకల రామచంద్రారెడ్డి గార్లతో కలిసి రాయలసీమలో రైతు ఉద్యమ నిర్మాణానికి కృషి చేశారు.

1950 లో రాయలసీమలో భయంకర క్షామం వచ్చింది. ప్రజల్ని రక్షించే దానికి పాలకులు నిస్సహాయులయ్యారు. శ్రీమతి భారతీదేవిరంగాగారు తమ ఆధ్వర్యాన రాయలసీమ క్షామనివారణ కమిటీని ఏర్పరచి శ్రీయుతులు తిమ్మారెడ్డి, రాజగోపాలనాయుడు, ఓబులరెడ్డి, బాలిరెడ్డి గార్లతో జిల్లాలు పర్యటించి, అచ్చట నుండి తిండిగింజలను, పశుగ్రాసాన్ని వందల లారీలపై దింపి బీదప్రజలకు తిండి, పశువులకు గ్రాసాన్ని పంపిణీచేసి రాయలసీమ ప్రజానీకాన్ని ఆదుకొన్న సంఘటనలు కోకొల్లలు. ఇలాంటి విపత్కర పరిస్థితులు దాపురించినప్పుడల్లా శ్రీ రాజగోపాలనాయుడుగారు ప్రత్యక్షమై ప్రజా క్షేమ కార్యక్రమాల్లో ముందుండే

వారు. ప్రజాసేవా కార్యక్రమాల్లో వీరికి వీరే సాటి. అందుకే ప్రజలంతా వీరి వెంటే నిల్చారు.

శివగిరిలో రాజకీయ పాఠశాల నడిపారు రాజగోపాలనాయుడుగారు. దీనికి ప్రిన్సిపాల్ తిమ్మారెడ్డిగారే. రాష్ట్రంలోని చాలామంది రాజకీయ నాయకులు ఇచ్చట రాజకీయాలు నేర్చినవారే. తరువాత తిరుత్తణి, చెన్నూరులో కూడ రాజకీయ విద్యాలయాలు నడుపుటలో రాజన్నగారి చొరవ ముఖ్యం. చాలకాలం వరకు శ్రీ తిమ్మారెడ్డి-రాజన్నలది ఒకే మాట, ఒకే బాట. నాటి రోజుల్లో కాంగ్రెస్ ప్రచారం పట్టణాల వరకే. అచ్చట చదువులు నేర్చిన కొందరికే పరిమితమై ఉన్నది. శ్రీ రంగాగారి రాకతో గ్రామీణ ప్రజానీకంలో చైతన్యం వచ్చింది. రైతు కూలీల్లోని చదువు నేర్చిన యువకులే రాజకీయ చైతన్యంతో రంగాజీచే ప్రభావితులై - ప్రజాసేవకులుగా ఉంటూ దేశ నాయకులుగా, పరిపాలనా దక్షులుగా ఎదిగినారు.

నేను 1940లో గుంటూరు జిల్లాలోని ఇడుపులపాడు రైతాంగ విద్యాలయానికి రాజకీయాలు నేర్చుకొనుటకు పోతిని. గాంధీగారి నాయకత్వాన స్వరాజ్యం కోసం ప్రభుత్వంపై ప్రజలు పోరాటం చేయుటకు సిద్ధమయిన సమయం. కాంగ్రెస్ ఈ యుద్ధంలో బ్రిటీష్‌వారికి వ్యతిరేకంగా ప్రజలను ఆయత్తం చేస్తూ ఉంది. గాంధీగారు ఉద్యమం ప్రారంభించక పూర్వం రంగాగారు, సుభాష్ బోసులను ప్రభుత్వం అరెస్టు చేసింది. ఆ సమయంలో మా రాజకీయ పాఠశాల జరిగింది. మాకు రాజకీయ ఉపన్యాసకులుగా శ్రీ రాటకొంట నరసింహారెడ్డి, శ్రీ పి. తిమ్మారెడ్డి గారలు వచ్చారు. ఇద్దరూ చక్కటి వక్తలు, స్ఫురద్రూపులు. కళాశాల నుండి అప్పుడే బయటకు వచ్చి రంగాగారిచే ప్రభావితులైనవారే. మేమంతా 30 దినాలు గడిపి రాజకీయాల్లో అనేకమంది నిష్ణాతులచే ప్రభావితుల మైతిమి. నాటినుండి ఇప్పటివరకు చిత్తూరుతో నాకు సంబంధం ఏర్పడింది. అనుబంధంగా కూడ మారింది.

మా గ్రామం గోవాడ గుంటూరు జిల్లాలో రంగాగారికి, రైతు ఉద్యమానికి చాల ముఖ్యమైనది. రాష్ట్ర ధాన్యం ఉత్పత్తిదారుల మహాసభకు శ్రీ తిమ్మారెడ్డిగారిని తోడ్కొనిరమ్మని మా పెద్దలు నాకు పురమాయించారు. దాని ప్రకారం నేను

నేరుగా చిత్తూరు పోయి శ్రీ పొలకల నరసింహారెడ్డిగారిని కలవగా, వారు తమ కారు ఇచ్చి ముతక ఖద్దరు దుస్తులు ధరించి, సాదా సీదాగా ఉన్న ఒక వ్యక్తిని పంపారు. మేము అర్ధరాత్రికి శ్రీ తిమ్మారెడ్డిగారి స్వగ్రామానికి చేరి, వారి మిద్దెలో పరుండి మరునాటి ఉదయం ముగ్గురమూ చిత్తూరు ప్రయాణమైతిమి. దారిలో శ్రీ రెడ్డిగారు రాజగోపాలనాయుడుగారిని పరిచయం చేశారు. మరి వారిని గురించి ఎన్నెన్నో మంచిమాటలు చెప్పారు. ఇదే రాజగోపాలనాయుడుగారితో నా తొలి పరిచయం. ఆనాటి నుండి ఇప్పటి వరకు సుమారు 75 సంవత్స రాలుగా మా స్నేహం దినదిన ప్రవర్ధమానమైంది. ఏకోదరులుగానే ఉంటిమి. మామధ్య ఎలాంటి పొరపొచ్చాలు రాలేదు. వారి తల్లి లక్ష్మమ్మగారే, నన్ను పెంచి పోషించిన ముత్తువ తల్లి పేరు లక్ష్మమ్మగారే. నేటికీ మా రెండు కుటుంబాలు ఎంతో అన్యోన్యంగా ఉన్నాయి. గుంటూరు జిల్లాలో శ్రీ రాజగోపాల నాయుడుగారికి రంగాగారి తరువాత నాతోనే హెచ్చు పరిచయం. ఈవిధంగా దిగువమాగం నాకు యాత్రాస్థలమయింది. రాజన్నగారి తండ్రి చిన్నతనంలోనే స్వర్గస్తులైనారు. వివాహమైన కొద్దికాలానికే అర్ధాంగి అయిన అమరావతమ్మ కూడా కాలంచేసింది. పసిబిడ్డ అరుణమ్మను కంటికి రెప్పగా చూసుకొంటూ మా సోదరి ఇందిరమ్మ సాయంతో పెంచి పెద్దచేసింది మాతృమూర్తి మా అవ్వ లక్ష్మమ్మగారు. ఆ బిడ్డ పెరిగి, ఎదిగి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో చదువు నేర్చింది.

శ్రీ రాజన్నగారికి కుటుంబపు మంచి-చెడ్డలకంటే సామాన్య ప్రజల క్షేమ సమాచారాలే ముఖ్యం. విద్యావంతుడు, సుగుణసంపన్నుడు, వినయశీలి, కార్య శూరుడు, స్ఫురద్రూపి అయిన గల్లా రామచంద్రనాయుడు మా అమ్మాయికి భాగస్వామిగా లభించటం చాల అదృష్టమని రాజగోపాలనాయుడుగారు పలుమార్లు చెప్పటం విన్నాను.

ఆచార్య రంగాగారికి వారి శిష్యులంతా ఒకరి తరువాత ఒకరు దూరం అయిపోతూవున్న సమయంలో రాజన్న ఆ గురుదేవునే స్మరించుకొంటూ వారి తోనే ఉన్నారు. రాజగోపాలనాయుడుగారు రెండు పర్యాయాలు శాసనసభ్యులుగా, ఒక పర్యాయం శాసనమండలి సభ్యులుగా, రెండు పర్యాయాలు లోక్‌సభ

సభ్యులుగా 40 సం॥ల సుదీర్ఘ రాజకీయ జీవితాన్ని గడిపారు. వారు హైదరాబాద్‌లో ఉన్నా, ఢిల్లీలో ఉన్నా వారి వసతిగృహం అందరికీ అతిథిగృహం లాగే ఉంటూ కళకళలాడేది. ప్రజలకు సహాయం చేయటంలో వారికి ప్రాంతీయ భాషా భేదాలంటూ లేనేలేవు. దోషపూరిత, అవకాశవాద రాజకీయాలతో విసిగి, స్వచ్ఛందంగా ఎన్నికల్లో పోటీకి దిగక, రాయలసీమ సేవా సంఘ కార్యకలాపాల్లో నిమగ్నమై ఉంటూవున్న సమయంలో నేను తిరుపతి వచ్చి మా జిల్లాలో స్వామి సీతారామ్, తుమ్మల బసవయ్య దంపతులచే స్థాపించబడి, గాంధీగారిచే ప్రారం భించబడిన వినయాశ్రమ భారాన్ని స్వీకరించమని కోరగా అందుకు అంగీక రించారు. ఇది రంగాగారికి తెల్పగా వారు ఆ భారాన్ని స్వీకరించవలసిందిగా జాబు వ్రాసారు. ఇచ్చట రాయలసీమ సేవా సంఘ భారాన్ని సోదరుడు మునిరత్నం గారికి అప్పగించి, సరాసరి వినయాశ్రమానికి వచ్చారు. వీరి రాకతో ఆశ్రమానికి పూర్వ వైభవం వచ్చింది. వీరి కృషివల్ల చక్కటి ఆశ్రమ బాలికా ఉన్నత పాఠశాల, కేంద్రప్రభుత్వంవారు కోటి రూపాయలతో కృషి విజ్ఞాన కేంద్రమును స్థాపించారు.

వీరి కృషితో చుట్టుప్రక్క గ్రామాల్లో కూడ అనేక సేవాకార్యక్రమాలు చేపట్టారు. ఇంతలో వారికి ఆరోగ్యం క్షీణించింది. అయినా ఆశ్రమ వ్యవహారాలు చూస్తూనే ఉన్నారు. వీరి అందర్నీ 'అన్నా' అనేవారు. అందరూ వీరిని 'అన్నా' అనే సంబోధిస్తూ ఉంటారు. వీరికి రాజకీయ అస్పృశ్యత లేదు. ఆంధ్ర రాజకీయాల్లో వీరు అజాతశత్రువు. రాగద్వేషాలకు అతీతులు, దీనజనబాంధవులు. స్వంత లాభాలకు, బంధుప్రీతికి అతీతంగా ఉంటూ కాలం గడపటం చాలా కష్టమైనా మానవసేవకే ప్రాధాన్యాన్నిచ్చే మానవోత్తములు ప్రపంచంలో చాలా అరుదుగా జన్మిస్తారు. అలాంటి మహనీయుల కోవకు చెందినవారే మన రాజగోపాల నాయుడుగారు కూడా. రాజగోపాలనాయుడుగారిలాంటి మహనీయ వ్యక్తులు నేడు దేశానికి చాలా అవసరం. రాజన్న జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకం. ఆయన అడుగుజాడలే భావితరాలకు సువర్ణ సోపానాలు. ఆయనకివే నా హృదయపూర్వక అక్షర నీరాజనాలు.

-శ్రీ పావులూరి శివరామకృష్ణయ్య

తామ్రపత్ర గ్రహీత, స్వాతంత్ర్య సమరయోధులు

N.G. Ranga - a Legend

A legendery personality. In 1950 summer Andhra University conducted 'Economic Congress'. Prof. V.S. Krishna was the chief. Eminent Economists attended. Ranga inaugurated. What a brilliant academic speech!

It was a National Conference. Prof. V.K.R.V. Rao, who later became the Director of School of Economics presided. Eminent Economists National and International were invited. Acharya N.G. Ranga gave a scintillating inaugural speech. "Indian Economy is distinct. Agriculture is central nerve of it. Our economy should be farmer oriented. In the West it is industrial economy. We are not against modernisation. But, that should not destroy the individuality of Indian Agriculture. Cottage Industries that benefit Rural Economy should be promoted." His stress is on the development of Agricultural economy. Ranga's oratory and effective presentation were impressive. His command over English was superb.

–Sri Sankara Bhanu. Gorti

Nov. 20, 2016

M.Sc. (Chemistry)
Rangaraya Medical College, Kakinada.

విషయసూచిక

I.	మనవి	43
II.	ముందుమాట	45
1.	నా బాల్యం	49
2.	నా పూర్వీకులు	81
3.	ఆక్స్‌ఫర్డ్‌లో	89
4.	యూరోపు - ఆక్స్‌ఫర్డ్‌లలో	95
5.	1933-36 మధ్య ప్రజా ఉద్యమాలు	130
6.	చేనేత ఉద్యమం (1935-55)	153
7.	నా లోక్‌సభ ఎన్నిక (1957)	155
8.	కేంద్ర శాసనసభలు	158
9.	పార్లమెంటు సంఘాలు	163
10.	రైతాంగ విద్యాలయం - ఆలిండియా కాంగ్రెస్ వరకు	166
11.	రాయలసీమ, శ్రీకాకుళం, విశాఖలలో రాజకీయ పాఠశాలలు	173
12.	కిసానులు - వ్యవసాయ కూలీలు	176
13.	భారత జాతీయవాదం (1936-40)	180
14.	ఏకమయిన జాతీయవాదులు	191

15.	వామపక్ష సాహిత్య ప్రభావం - ఐక్య సంఘటన	195
16.	పలాస కాన్ఫరెన్స్	198
17.	మా కుటుంబ జీవితం	200
18.	అందం - బ్రహ్మానందం	205
19.	పర్యటనానుభవాలు	211
20.	శాస్త్రవేత్తలతో పరిచయాలు	221
21.	గాంధీగారు - యునైటెడ్ ఫ్రంట్ శకం	225
22.	భారతీదేవి సేవలు	227
23.	బాపూ నిర్మాణాత్మక కార్యక్రమం	234
24.	నెహ్రూ - రంగా సంబంధాలు	238
25.	సర్దార్ పటేల్‌తో నా సంబంధాలు	241
26.	ప్రజాస్వామ్య కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్ - సుభాష్‌బాబు ప్రోత్సాహం	246
27.	కె.యం.పి.రాజ్‌కు బాపూ ఆశీర్వాదం	249
28.	యుద్ధ నిర్బంధం	252
29.	వలస ప్రజల ఫ్రీడం ఫ్రంట్	255
30.	కాంగ్రెస్ పార్టీని రద్దు చేయాలి	257
31.	దేశ విభజన తరువాత	264
32.	భారత రాజ్యాంగ రచన	268
33.	కాంగ్రెస్ రాజకీయాలు	275
34.	ఆటుపోట్లు	287

35.	తలక్రిందులు - 11 ఏప్రియల్, 1951	289
36.	ఆలిండియా కాంగ్రెస్ వ్యవహారాలు	293
37.	కంట్రోళ్ళు	300
38.	ప్రణాళిక - నేను	309
39.	చేతివృత్తులవారు	317
40.	ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థ	321
41.	రెండవ ప్రపంచ యుద్ధం	328
42.	విదేశీ విధానం - విదేశీ సహాయం	332
43.	విదేశీ విధానం - విదేశీ పర్యటనలు	337
44.	కాంగ్రెస్‌కు రాజీనామా	355
45.	ఐక్య కాంగ్రెస్ కె.యల్.పి. హక్కులను నిర్లక్ష్యం చేసింది	367
46.	మీకా దమ్ముందా?	370
47.	ఐదుగురు కాంగ్రెస్ అధ్యక్షులు	377
48.	వినోబాభావే - రైతులు	382
49.	రాజాజీ ఆహ్వానం	386
50.	రాజీనామా తిరస్కారం	395
	వివరణలు	401

అనుబంధం

i)	సంవిధాన సభ - ఆంధ్రరాష్ట్రము	424
ii)	ఆచార్య రంగాజీ - రచనలు	427
iii)	ప్రశంస	430

మనవి

శ్రీ యన్.జి. రంగ గారు తన స్వీయచరిత్ర 'ఫైట్ ఫర్ ఫ్రీడం' ను ఆంగ్లంలో వ్రాసారు. 'స్వాతంత్ర్యం కోసం' నా తెలుగు అనువాదం.

రంగాగారి జీవితం ఒక తెరచిన పుస్తకం. రైతులకోసం, కుటీరపరిశ్రమల కోసం, చేనేతవారి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహాను భావుడు.

'ప్రజాస్వామ్యం బ్రతికి ఉండాలంటే బలమైన ప్రతిపక్షం ఉండాలి' అనేది వారి ఆశయం. అతిశయమైన ఏక పార్టీ నియంతృత్వానికి వారు వ్యతిరేకి. రాజ్యాంగం పెళుసుగా ఉండటం వారికిష్టంలేదు. (ఆధునిక రాజ్యాంగ వ్యవస్థలు).

వారు తన జీవితకాలంలో (క్రీ.శ.1900–1995) చరిత్ర, సమకాలీన, జాతీయ, అంతర్జాతీయ సమస్యలపై 35 పుస్తకాలు ఆంగ్లంలో, 6 పుస్తకాలు తెలుగులో ప్రచురించారు. 'కాకతీయ నాయకులు' (రెండవ ముద్రణ, 2008), 'కర్షకవేదం' (రెండవ ముద్రణ, 2015) లను నేను అనువదించాను. 'స్వాతంత్ర్యం కోసం' నా ఈ మూడవ అనువాదం.

ఎందరో వారి జీవిత చరిత్రను వ్రాసారు. కీ.శే. జాస్తి వేంకటనరసయ్య – కీ.శే. ధూళిపాళ సుబ్రహ్మణ్యం, శ్రీ జోసెఫ్, కీ.శే. గొట్టిపాటి వెంకటసుబ్బయ్య, శ్రీమతి అధరాపురపు తేజోవతి, శ్రీ అగరాల ఈశ్వరరెడ్డి, శ్రీ నాగభైరవ ఆదినారాయణ, కీ.శే. టి. కోదండరామయ్య (అముద్రితం) మొదలైనవారు.

నా ఈ వ్రాతకు ప్రేరణ శ్రీ J.S.R. తెనాలివారు.

తెలుగు అనువాదాన్ని ప్రజాబంధు కీ.శే. పాటూరి రాజగోపాలనాయుడు గారికి నేను అంకితం చేశాను. వీరు ఏనాడూ 'రంగ' ఆజ్ఞను మీరలేదు. ఆంగ్ల గ్రంథాన్ని రంగాగారు 'కాకతీయనాయకులకు' అంకితం చేశారు.

ఈ పుస్తకానికి ముందుమాటలు వ్రాసిన శ్రీ వడ్డే శోభనాద్రీశ్వరరావు (మాజీ మంత్రివర్యులు, ఆం.ప్ర.), శ్రీమతి గల్లా అరుణకుమారి (మాజీ మంత్రివర్యులు, ఆం.ప్ర.), పద్మశ్రీ శ్రీ గుత్తా మునిరత్నం, తామ్రపత్ర గ్రహీత, స్వాతంత్ర్య సమర యోధుడు శ్రీ పావులూరి శివరామకృష్ణయ్య, శ్రీ జి. శంకరభాను గార్లకు నా కృతజ్ఞతాంజలులు.

వాడుక భాషలో వ్రాయమని నన్ను ప్రేరేపించిన డా॥ శ్రీమతి అంచా విజయలక్ష్మి గారికి, ఈ పుస్తక ప్రచురణలో తప్పొప్పులు సరిచూసిన డా॥ నాగభైరవ ఆదినారాయణ గారికి, డా॥ ఎస్. చంద్రమౌళిశర్మ గారికి నా కృతజ్ఞతలు.

ఈ పుస్తకం వేరు వేరు కారణాల వలన ఒక సంవత్సరం ఆలస్యంగా వెలుగు చూచింది.

చక్కగా డి.టి.పి. చేసిన యస్.వి. రత్తయ్య గారికి, అందంగా ముద్రించిన శ్రీలక్ష్మిప్రెస్ అధినేతలు 'కర్షకమిత్ర' శ్రీ కాట్రగడ్డ బ్రహ్మయ్య, వారి కుమారుడు శ్రీ శ్యాంబాబు గార్లకు నా ధన్యవాదాలు.

అఖిల ఆంధ్ర ప్రజలు ఈ పుస్తకాన్ని చదువగలరని ఆశిస్తున్నాను.

భవదీయుడు

–డా॥ జేక్కంపూడి సీతారామారావు

యం.బి;బి.యస్.

యల్‌యల్.బి; యల్.యల్.యం.

ముందుమాట

ఈ కథనం హిమాలయాల నీడన వేదభూమిగా విలసిల్లే భరతవర్షానికి, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌కు - ప్రజాజీవితంలో నా పాత్రకు - ప్రాభవానికి సంబంధించినది. 1959 లో స్వతంత్ర పార్టీ ఆవిర్భావపు తళుకులు-మెరుపులు ఈ నా రచనలో ద్యోతకమవుతాయి.

నా జీవితంలో నిర్మాణాత్మక దశ నేను రాజాజీతో కలసి స్వతంత్ర పార్టీని నిర్మించడం. ఇది చాలామంది మిత్రుల అభిప్రాయం. రాజకీయ ఆలోచనలకు, గెలుపోటములకు, భయాలకు అతీతంగా నా స్థానానికి భంగం కలుగకుండా ఈ కొత్త వేదిక నిర్మించటం భారతీదేవికి సంతోష కారణం. (స్వతంత్ర పార్టీలో చేరడం భారతీదేవికి సంతోషం).

నా రాజకీయ జీవితం జవహర్‌లాల్ నెహ్రూగారి దయాదాక్షిణ్యాలపై ఆధార పడనందుకు సంతోషంగా ఉంది. మేమిద్దరం ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిని రెండు వేరు వేరు కోణాల నుండి చూశాము. ద్రవ్యోల్బణం రైతులకు హానికరమని నా నమ్మకం. వారు తద్విరుద్ధంగా ఆలోచించేవారు. ప్రపంచ దేశాలలో భారత దేశం అగ్రగామిగా ఉండాలని మా ఇద్దరి కోరిక. 'టిబెట్టు'లో జాతీయ స్వాతంత్ర్యం నా ఆరాటమయితే, వారు చైనాతో స్నేహానికి మొగ్గు చూపేవారు.

అందరు రాజకీయవాదులలాగా అధికారం కోసం, వ్యక్తిగత ప్రయోజనాల కోసం నేనారాటపడలేదు. నెహ్రూ మహద్వైభవానికి నేను ఈర్ష్యపడలేదు. ఈ సన్నని తెర నన్ను వారి నుండి దూరంగా ఉంచింది. మా రాజకీయ సంబంధాలు బలంగా లేవని నాకు తెలుసు. 1957 లోక్‌సభ ఎన్నికలలో ఈ కారణాల వల్లనే నేను వారి రాజకీయ నిరాదరణకు గురయ్యాను.

1962 లోక్‌సభ ఎన్నికలలో నేను పోటీచేయటాన్ని తన శాయశక్తులా ప్రతిఘటించి వారు విజయం సాధించారు. నేనప్పుడు స్వతంత్ర పార్టీ అధ్యక్షుణ్ణి. నేను బై-ఎలక్షనులో పోటీచేసినప్పుడు ఆంధ్ర, మైసూరు, మద్రాసు మంత్రులు, ముఖ్యమంత్రులు నాకు వ్యతిరేకంగా ప్రచారంచేశారు. ఇరవయ్యిద్దరు మంత్రులు, ఆంధ్ర, మైసూరు, మద్రాసు ముఖ్యమంత్రులు, ఇద్దరు కేంద్ర మంత్రులు (తరువాత కాలంలో ఇద్దరు ముఖ్యమంత్రులు) కాంగ్రెసు ప్రచారంలో అగ్రభాగాన నిలచి 'చిత్తూరు'లో జవహర్‌లాల్‌గారికి తమ విధేయత ప్రకటించుకున్నారు. కాంగ్రెసు అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నన్ను ఓడించి తమ విధేయతను జవహర్‌లాల్ దగ్గర రుజువు చేసుకోవటానికి ప్రయత్నించారు.

'భగవదనుగ్రహం'తో చిత్తూరు ప్రజలు నన్ను గెలిపించి నెహ్రూయిజాన్ని ఓడించారు.

చాలామంది కాంగ్రెసు మిత్రులు 1959 లో నేను కాంగ్రెసులోనే ఉంటే ఏం జరిగేది? అని ఆశ్చర్యపడుతుంటారు. అలా జరగకపోతే నేను, రాజాజీ, స్వతంత్ర పార్టీ, నెహ్రూగారి సహకార వ్యవసాయాన్ని ఎలా ఎదుర్కొనేవాళ్ళం? ప్రణాళికా సంఘపు తప్పుడు విధానాలను, కమ్యూనిస్టు ఎత్తుగడలను, ప్రాధాన్యత లను ప్రజలకు ఎలా తెలియచెప్పేవాళ్ళం?

నెహ్రూగారు 'గ్రామదాన్'తో తన మార్కు సహకార వ్యవసాయాన్ని ప్రవేశ పెట్టాలని చూసినప్పుడు వారి ప్రయత్నాలు ఫలించలేదు. 1963 లో 17వ రాజ్యాంగ సవరణ బిల్లు నెహ్రూకు గుర్తుకు వచ్చింది. నాకు, నా కిసాను సహచరులకు, దేశవ్యాప్తంగా రాజ్యాంగ సభకు నెహ్రూగారు చేస్తున్న కుట్ర, నమ్మకద్రోహం తెలిసింది. పార్లమెంటులో నా ప్రయత్నంతోను, రాజాజీ ఆశీర్వాదబలంతోను నెహ్రూగారు 'సీలింగు'కు లోబడిన రైతులందరినీ ఈ బిల్లు నుండి మినహాయించవలసి వచ్చింది.

మేము కాంగ్రెసు ప్రభుత్వపు కంట్రోళ్ళు, పర్మిట్లు, లైసెన్సు రాజ్యానికి వ్యతిరేకం. రైతులను మోసంచేసే పంపిణీ వ్యవస్థను, నిత్యావసర వస్తువుల తప్పుడు సరఫరాను ఎదుర్కొన్నాం. స్వతంత్ర పార్టీ, తరతరాల నుండి రైతులకు మెడలో గుదిబండలాగా ఉండే భూమిశిస్తును వ్యతిరేకిస్తున్నది. స్వతంత్ర పార్టీ

అధికారంలో ఉన్న ఒరిస్సా రాష్ట్రంలో భూమిశిస్తును తొలిగించాం. కాంగ్రెసేతర ప్రభుత్వాలున్న ఉత్తరప్రదేశ్, బీహారు, పంజాబులలో రాష్ట్ర ప్రభుత్వాలు భూమి శిస్తును తీసివేసి అక్కడ రైతులకు సాంత్వన కలుగజేశాం. ఇవి మేము సాధించిన కొన్ని విజయాలు.

ప్రణాళికా సంఘం వ్యవసాయాన్ని గౌరవప్రదమైన స్థానంలో నిలిపినట్లయితే 4 జూన్, 1959 న మద్రాసులో జరిగిన స్వతంత్ర పార్టీ సమావేశం నిజంగా స్ఫూర్తిదాయకమయ్యేది.

జనసంఘ్ వ్యవస్థాపకులు శ్రీ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీగారు గుత్తాధిపత్యానికి వ్యతిరేకంగా ఉదారవాదాన్ని రూపొందించి, ప్రచారం చేశారు. స్వతంత్ర పార్టీ ఆవిర్భావం జనసంఘ్‌కు మరింత బలాన్నిచ్చింది. ఈ రెండు పార్టీల కలయిక నెహ్రూ నాయకత్వానికి బలమైన ప్రత్యామ్నాయంగా నిలిచింది.

మనం మన ఆచరణ విధానాలను పునరాలోచించుకోవాలి. మన తటస్థ వైఖరిని మార్చుకోవాలి. ఆగ్నేయాసియా దేశాలలో శాంతి స్థాపనకు, చైనా విస్తరణవాదాన్ని అరికట్టి మన మిత్ర రాజ్యాలతో స్నేహంగా ఉండటానికి కృషి చేయాలి. దలైలామాను టిబెట్టు రాజ్యాధినేతగా గుర్తించాలి.

రాజాజీ అణుప్రమాదం నుండి ప్రపంచ దేశాలను రక్షించటానికి కృషి చేస్తున్నారు. నెహ్రూగారి హ్రస్వదృష్టి నుండి ప్రజలను కాపాడటానికి స్వతంత్ర పార్టీ పనిచేస్తున్నది.

రాజాజీ మాలాంటి వారినందరినీ 'నెహ్రూయిజం'ను ఎదుర్కోవలసిందని పిలుపునిచ్చారు. అందువలన 1959 లో నేను కాంగ్రెసును వదిలిపెట్టటం సరియైనదే.

నెహ్రూగారికి మా నైతిక విలువల 'ఛాలెంజ్' తెలుసు. కిసాను మజ్దూర్ పార్టీ, కృషికార్ లోక్‌పార్టీ, ప్రజా సోషలిస్టు పార్టీల్లాంటి చిన్న చిన్న పార్టీలు పరిశ్రమలలో, పంపిణీలో ప్రభుత్వ జోక్యపు ప్రమాదాన్ని ముందుగా పసిగట్టి కాంగ్రెసును వదిలి వెళ్ళాయి. దేశంలో నెహ్రూగారి ప్రణాళిక వలన ఏవిధమైన అభివృద్ధి లేనందువలన నేడు ప్రతిపక్షాలు వారిని ఎదుర్కొంటున్నాయి.

1967 లో నెహ్రూగారి కుమార్తె నాయకత్వంలో నేను జనరల్ ఎన్నికలలో ఓడిపోయాను. సర్దార్ లచ్చన్న ఖాళీచేసిన లోక్‌సభ స్థానం నుండి పోటీచేసి మరల విజయం సాధించాను.

రెండుసార్లు పార్లమెంటు ఎన్నికలకు నాలుగుసార్లు పోటీ చేయవలసి వచ్చింది.

మా ఓటర్లు కాంగ్రెసు ప్రలోభాలకు లొంగలేదు. కులం, మతం, స్త్రీ-పురుష తారతమ్యాలకు, భయాలకు, బాధలకు వారు స్థిరంగా ఎదురొడ్డి నిలిచారు. స్వతంత్ర పార్టీ వీరందరికీ 'సెల్యూట్' చేస్తుంది.

నా ప్రజాజీవితంలో నేను న్యాయబద్ధంగా, న్యాయసమ్మతంగా వ్యవహరించాను.

ఆర్థికశాస్త్రంలో 1926-30 లలో పచ్చయప్ప కళాశాలలో ప్రొఫెసరుగా పనిచేసినప్పటి 'రెండు అధ్యాయాలు' ఎక్కడో పోయాయి. నేను అప్పట్లో ప్రభుత్వానికి గౌరవ ఆర్థిక సలహాదారుగా కూడా పనిచేశాను. ఈ కాలంలోనే నేటి మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ సి. అన్నాదురై నా విద్యార్థులలో ఒకరుగా ఉండేవారు. వారు మా 'ఆత్మగౌరవ' ఉద్యమంలో పనిచేశారు.

1957 లోనే ఈ పుస్తకం చాలావరకు తయారయింది. 1959 లో స్వతంత్ర పార్టీ ప్రారంభంతో ఈ కథనం ముగుస్తుంది.

(శ్రీ ఎ.పి జైన్, Executive Secretary, Swatantra Party in Parliament, శ్రీ ఎ.కె. శర్మ, జాయింట్ ఎడిటర్, 'స్వరాజ్య' ముద్రణలలో వీరి సహాయానికి నేను ఋణపడి ఉంటాను.)

1. నా బాల్యం

నిడుబ్రోలు మా ఊరు. నేనిక్కడే పుట్టాను. కుళోత్తుంగచోళుడు ఒక వెయ్యి సంవత్సరాల క్రితం ఇక్కడ ఒక శివాలయం నిర్మించాడు. ఈతని రాజధాని కాంచీపురం. మా గ్రామం చుట్టూ అన్నీ పురాతన గ్రామాలే. కొండముది, చేబ్రోలు, భట్టిప్రోలు – ఇత్యాదులు. కొండముది మా ఊరికి రెండు మైళ్ళు. నాలుగు – అయిదు శతాబ్దాల మధ్యకాలంలో విష్ణుకుండినులు ఈ గ్రామంలో ఒక దేవాలయం నిర్మించారు. చేబ్రోలు మా గ్రామానికి పడమరగా ఏడు మైళ్ళు. బౌద్ధుల కాలంనాటి గ్రామం. తూర్పున–భట్టిప్రోలు–గౌతమబుద్ధుని అవశేషాలతో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 'అశోకస్తూపం' ఇక్కడ ఉంది.

పేరునుబట్టి మా గ్రామం చాలా పొడవైనదై యుండాలి. బుద్ధాం – ఇంకొక బౌద్ధుల కాలపు గ్రామం. మా గ్రామానికి ఆరు మైళ్ళలో ఉంది. బౌద్ధుల, విష్ణు కుండినుల, శాతవాహనుల స్ఫూర్తితో దక్షిణభారత భాగస్వామ్యంతో కూడుకొని ఉండాలి.

1900 వరకు మాది కృష్ణా జిల్లా. కృష్ణానదికిరువైపులా ఈ జిల్లా ఉండేది. 13వ శతాబ్దం వరకు దీనిని 'కర్మరాష్ట్రము' లేక 'కమ్మరాష్ట్రము' అనేవారు. బౌద్ధుల కాలంలో 'కర్మ', 'కమ్మ' పదాలు ఒకే అర్థానిచ్చేవి. వ్యవసాయం ఇక్కడ ప్రధానమయిన వృత్తి. వ్యవసాయం వృత్తిగా కలవారికి 'తెగలు' మూలం. ప్రతి తెగ కొన్ని శాఖలతో ఉంటుంది. వీరందరూ ఒకరికొకరు బంధువులు. అన్నా–చెల్లెలు, అక్కా–బావ, అత్తా–మామ వంటివారు. వివాహాలు ఈ చుట్టరికాన్నిబట్టే చేసుకుంటారు.

నా తండ్రిగారిది 'గోగినేని' శాఖ. మొదట 'కడప', తరువాత 'వరంగల్లు'. కొందరు కడప నుండి 'దివి'సీమకు వచ్చారు. అక్కడనుండి 'భట్టిప్రోలు'కు, నడింపల్లికి, ఆ తరువాత 'గూడవల్లి'కి వచ్చారు. రెండు వందల ఏభయి సంవత్సరాల తరువాత 'నిడుబ్రోలు'లో కుదురుకున్నారు. మా తల్లిగారిది మొదట కృష్ణాజిల్లా - పాములపాడు. అక్కడనుండి నిడుబ్రోలుకు వచ్చారు.

హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్లు-అందరం కలసిమెలసి ఉండేవాళ్ళం. వివాహాలలో అందరూ కలసే భోజనాలు చేసేవాళ్ళు. మాల-మాదిగలకు (వీరూ హిందువులే) పిలుపులుండేవి. కానీ వారు వేరుగా కూర్చొనేవారు. హిందువులలోని తారతమ్యం, సాంఘిక అసమానత్వం, అంటరానితనం దేశ అనైక్యతకు దారిచూపింది. కిసాను తెగలయిన కమ్మ, రెడ్డి, వెలమ, తెలగ, యాదవ కులాలను బ్రాహ్మణులు తక్కువ జాతివారిగా చూచేవారు. మాల - మాదిగలను ఈ కులాలు తక్కువగా చూచేవి.

'భూమి' సాంఘిక రక్షణకు ఉపయోగపడుతుంది. కిసానులు (రైతులు) వృత్తిపరులయిన వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, భట్టులకు (భట్రాజులకు) ధాన్యం ఇచ్చి, వారిని గుర్తింపు గలవారిగా చూచేవారు. వీరు స్వతంత్ర జీవనం గడిపే వారు. వీరి హోదా ప్రత్యేకం.

నేను పందొమ్మిది వందల సంవత్సరం, నవంబరు నెల, ఏడవ తేదీన (7-11-1900) జన్మించాను. ఆరోజు కార్తీకపౌర్ణమి. వెన్నెల రోజులు. కాళిదాస మహాకవి 'ఈ వెన్నెల'ను మనోహరంగా వర్ణించాడు. బౌద్ధులకు కూడా ఇది పర్వదినం.

మా అమ్మ తండ్రి రమణయ్యగారు చొరవ గల వ్యవసాయదారుడు. చుట్టు ప్రక్కల గ్రామాల్లో ఆయన ధైర్యం, శ్రమ, వ్యవసాయపు లాభసాటిదనాన్ని గురించి చెప్పుకునేవారు. మంచి భూములు. వీటిని మూడు రెట్లు పెంచారు. చెప్పుకో దగినంత ధనాన్ని వెనకేశారు. కుటుంబం సమృద్ధిగా ఉండేటట్లు చూశారు. నా అయిదవ సంవత్సరంలో వారు చనిపోయారు. ఆ ఆకట్టుకునే ముఖం, బలమయిన చేతులు, భుజాలు నాకింకా గుర్తున్నయ్. నన్ను తన భుజాలమీద

మోసుకుంటూ ప్రక్కన ఉన్న 'పొన్నూరు'కు తీసుకువెళ్ళేవారు. ఆయన భార్య 'అమ్మినియమ్మ'. బక్కపలుచగా, కొద్దిగా పొట్టిగా, అందంగా ఉండేది. ఈమె రమణయ్యగారికన్నా ఉదారపరురాలు. హరిజనులామెను కొల్చేవారు. ఈ భార్యాభర్త లిరువురూ హరిజనులలో, చేతివృత్తులవారిలో మంచి పేరు సంపాదించుకున్నారు.

నా తండ్రివైపు వారంతగా భాగ్యవంతులు కారు. వీరికి చొరవ తక్కువ. నా తాతగారికి పశువులపై మోజు. పశుపోషణ ఆయనకిష్టం. ఈ పశుపోషణలో వీరికి నష్టమే మిగిలేది. మా తాతగారు సగం పొలం ఈ పశుపోషణకు పోగొట్టు కున్నారు. మా నాన్న అప్పులలో మునిగిపోయాడు. మా నాయనమ్మ చాలా కష్టజీవి.

ఈ రెండు కుటుంబాలకు చుట్టరికం ఉంది. మా నాన్న 'నాగయ్య'కు, మా అమ్మ 'అచ్చమ్మ'నిచ్చి పెళ్ళిచేశారు.

గోగినేని, పాములపాటి కుటుంబాలు రెండూ ఏబయి సంవత్సరాల తరువాత మరలా కలిసాయి. రమణయ్యగారి తండ్రి బుచ్చినాయుడు(కు) అంకమ్మగారి చెల్లెలు బుల్లెమ్మకు గతంలో వివాహమయింది. ఈ సంప్రదాయం (మేనరికం) నేడంతగా వాడుకలో లేదు. మా బంధుత్వమంతా 'అప్పికట్ల', 'ఈతేరు'లలోనే. పొలాలతో పాటు ప్రజాసేవానురక్తి కూడా మా తాతగారి నుండి వచ్చింది.

మా ముత్తాత గోగినేని నాగయ్యగారు. వీరు 1790-1800 మధ్య రెవిన్యూ డిపార్టుమెంటులో పనిచేశారు. గ్రామంలో నాలుగో వంతు భూమిని బళ్ల బాటలకు, ఇతర అవసరాలకు వీరు ఇప్పించారు.పొన్నూరులోని భావన్నారాయణ స్వామివారి ఆలయానికి ఒక అశ్వ ప్రతిమను గోగినేని నాగయ్యగారు బహూకరించారు.

పాములపాటివారు మా ఊరిలో జరిగిన 'సతి'కి గుర్తుగా ఒక గుడిని 1700 సం॥లో నిర్మించారు. పాములపాటి వంశస్థుడు ఒకరు నల్లమల అడవులలో 'పులి'తో పోరాడి మరణించాడు. ఆ సంఘటనకు గుర్తుగా ఈ గుడిని కట్టారు.

తరువాత కాలంలో పాములపాటి రమణయ్య (నాగయ్యగారి మనవడు) గ్రామంలో ఒక చక్కని సత్రాన్ని నిర్మించాడు. ఈ సత్రం క్రీ.శ. 1933 లో ★రైతాంగ విద్యాలయానికి ఇవ్వబడింది. రమణయ్యగారు చాలామంది బ్రాహ్మణులకు ఉపనయనాలు, పెళ్ళిళ్ళు తన ఆర్థిక సహాయంతో చేసేవారు. మా అమ్మమ్మ బీదసాదలకు అండగా ఉండేది. వీరి కుమారుడు రామస్వామిగారు వీరి అడుగు జాడలలో నడచి మా గ్రామంలో (1910 లో) ఒక గ్రంథాలయం నిర్మించారు. పబ్లిక్ లైబ్రరీస్ చట్టం ద్వారా 1958 లో ఈ గ్రంథాలయాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.

మా కుటుంబం పలుకుబడి కలదేగాక దళితులను, అణగద్రొక్కబడేవారిని సోదరభావంతో చూచేది.

మా అమ్మ అచ్చమ్మగారు దైవభక్తిపరురాలు. ఈమెకు చాలా సంవత్సరాలు సంతానం కలుగలేదు. ఆమె తండ్రిగారు ఆమెను, ఇతర బంధువులను తీసుకొని తిరుమలలో వేంకటేశ్వరుని,శ్రీరంగంలో రంగనాయకస్వామిని దర్శించుకున్నారు. నేను కార్తీక పౌర్ణమి – బుధవారంనాడు జన్మించాను. అందుకే వేంకటేశ్వరస్వామి – రంగనాయకస్వామి పేరు కలసివచ్చేటట్లుగా నాకు నామకరణం చేశారు.

నా తల్లిదండ్రులు ఆత్మగౌరవం కలవారు. మా తండ్రి ఋణాలతో బాధ పడుతుండేవాడు. మా అమ్మ పట్టుచీరలు కట్టుకునేదికాదు. తనకున్న విలువైన నగలను ధరించేదికాదు. గ్రామంలో గాని, ప్రక్క గ్రామాలలో గాని శుభకార్యాలకు వెళ్ళేదికాదు. మా మామ రామస్వామి బాకీలు తీర్చటానికి సిద్ధమైనప్పుడు 'పసుపు–కుంకుమ' మినహా పుట్టింటి నుండి ఏమీ తీసుకోనని చెప్పింది. మా అమ్మ, నాన్న పొలాల్లో కష్టించి పనిచేసేవారు. చాలా పొదుపుగా ఉండేవారు. మా అమ్మ పశుపోషణ మొదలుపెట్టింది. మా అదృష్టం తిరిగింది. ఆరు సంవత్సరాలలో ఋణవిముక్తులమయ్యాము. అప్పుడు మాత్రమే మా అమ్మ మాకున్న విలువైన ఆభరణాలు పెట్టుకోసాగింది. పట్టుబట్టలు కట్టుకోవడం ప్రారంభించింది. నాకు ఎనిమిది సంవత్సరాలు, నా తమ్ముళ్ళు వెంకటప్పయ్యకు ఆరు సంవత్సరాలు, లక్ష్మీనారాయణకు మూడు సంవత్సరాల వయస్సులో ఆమె చనిపోయింది. ఆమె చాలా అందమైనది.

★ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్.

మా తండ్రిగారు పొట్టిగా, నల్లగా, ఆకర్షణీయంగా ఉండేవాడు. నేను పుట్టిన తరువాత ఆయన ముక్కు వంకరపోయింది. మా అమ్మ చనిపోయిన తరువాత ఆయన ఆరోగ్యం బాగుండలేదు. వారు ఏకాకిగా, ఏ విషయాలు పట్టించు కోకుండా ఉండేవారు. పిల్లలము మా మేనమామ గారింట్లో పెరిగాము. లంకంత కొంపలో ఒక్కడే ఉండేవాడు. మళ్ళీ వివాహం చేసుకోలేదు.

మా తండ్రి నన్ను 1920, ఆగస్టులో ఇంగ్లాండు పంపించాడు. ఐ.సి.యస్. చదువుతానని ఆశించాడు. రెవిన్యూవారి, పబ్లిక్‌వర్క్సువారి దుర్మార్గాలతో మా నాన్న చాలా నష్టపోయాడు. ప్రభుత్వం నిర్బంధంగా భూసేకరణ చేయవచ్చని ఆయనకు తెలియదు. పి.డబ్ల్యు.డి.వారు మా పొలానికి అడ్డంగా ఒక సాగునీటి కాలువ తవ్వుతున్నారు. మా నాన్న వారికి ఎదురుతిరిగాడు. వారిని మా చేలోకి రానీయకుండా అడ్డుకున్నాడు. డిపార్టుమెంటువాళ్ళు కోర్టులో కేసు వేశారు. “నేనెవరినీ అవమానపరచలేదు. నేనెవరినీ తిట్టలేదు, కొట్టలేదు. నా భూమిలోనికి రావడానికి వారికేం అధికారముంది?” అని కోర్టువారిని ప్రశ్నించాడు. కోర్టు మునసబుగారు ఆయన అమాయకత్వాన్ని అర్థంచేసుకొని ఆయనపై కేసు లేకుండా చేసి, కాలువ తవ్వుకోనివ్వవలసిందిగా సలహా ఇచ్చారు. ఈ పొలం ఇప్పుడు ‘రంగా ట్రస్టు’ క్రింద ఉన్నది.

ఇంకొకసారి రెవిన్యూవారు రైతులను రెచ్చగొట్టి 6 సెంట్ల భూమిని దురాక్రమణ చేయించారు. మా నాన్న కోర్టుకు వెళ్ళి చాలా డబ్బులు ఖర్చుచేసి ఈ దురాక్రమణను ఆపాడు. నేనీ అనుభవాలతో పొలాలు సర్వే ఎలా చేయాలో, పత్రాలు, ప్రాంసరీ నోట్లు ఎలా రాయాలో తెలుసుకున్నాను. తనఖా కాగితాలు, అమ్మకపు దస్తావేజులు, వకాలతులు ఇప్పించడం నేను పదిహేను-ఇరవయి సంవత్సరాల వయస్సులో నేర్చుకున్నాను. అందువల్ల మా నాన్న నేను ఐ.సి.యస్. పూర్తిచేయగలననుకున్నాడు.

ఆగస్టు 19 న నేను ఇంగ్లండుకు వెళ్ళేటప్పుడు ఆయన బొంబాయి రాలేదు. నేను కేంబ్రిడ్జ్‌కు వెళ్ళటం చూడలేక రాలేదు. నేను ఇంగ్లండు వెళ్ళిన తరువాత ఏడు నెలలకు ధరలు పడిపోయాయి. ధాన్యం ధర సగానికి తగ్గింది. నేనెప్పుడూ డబ్బు కొరకు ఇబ్బందిపడకూడదని ఆయన నా తమ్ముళ్ళకు చెప్పాడు.

మా తాత రమణయ్యగారు సంతకం మాత్రమే చేయగలరు. చదువు లేదు. వారికి ఆచారి అనే సెక్రటరీ ఉండేవాడు. ఈ ఆచారి రమణయ్యగారి డబ్బు చాలా కాజేశాడు. మా మేనమామ రామస్వామి కొద్దిగా చదువుకున్నాడు. మా మేనమామ దావా వేసి ఆచారి నుండి ఆ డబ్బును వసూలు చేశాడు. మా తండ్రి కూడా చదువుకోలేదు. అందుకే మా అమ్మ నేను చదువుకోవాలని గట్టి పట్టుబట్టింది. మా మేనమామ లైబ్రరీ నిర్మించటానికి ఇది ఒక కారణం.

నా చదువు మా అమ్మ కోరినట్లుగా జరగలేదు. మూడు-నాలుగు సంవత్సరాలు నేను బాగా చదవలేదు.

మంగమ్మగారు రమణయ్యగారి పెద్ద సంతానం. ఈమె పుట్టుకుంక. మంగమ్మమ్మ నన్ను దగ్గరకు తీసింది. నన్ను తోటలకు, దొడ్లకు తిప్పేది. నేనిదే పెద్దచదువనుకొనేవాడిని. మా మేనమామ నుండి 'సిరాబుడ్డి' తీసుకొని, ఆ సిరాతో బొమ్మలు గీస్తుండేవాడిని. పశువులు, పంటలు, పనిపిల్లలను గురించి మా అమ్మకు చెప్తుండేవాడిని. గ్రామంలో ఏయే పంటలు నాటుతున్నారో, ఎలా పండిస్తున్నారో క్షుణ్ణంగా తెలుసుకున్నాను. రైతుల, కవులుదార్ల మనోభావాలు చదవగల్గేవాడిని. మంగమ్మమ్మ అద్భుతమైన గురువు. ఆమెకు పంటలు, పంటల పైన వచ్చే తెగుళ్ళు, పంటమార్పిడులు అన్నీ కరతలామలకమే. పైరును తన సొంతబిడ్డలాగా చూసుకొనేది. ఆమెకు పనిచేయటం చాలా ఇష్టం. ఆమె తన సన్నని గొంతుతో మొక్కలతో ఆదరంగా మాట్లాడేది. నేనెల్లప్పుడూ ఆమె ప్రక్కనే ఉండేవాడిని. పక్షులమీద, ప్రకృతిసౌందర్యంమీద ధ్యాస నాకు తెలియకుండానే ఆమె సాహచర్యంలో అబ్బింది.

మా అమ్మ చదువుకోలేదు. ఆమెకు నేను బ్రాహ్మణులంతగా చదువుకోవాలని కోర్కె. నేను చదువును నిర్లక్ష్యం చేస్తున్నందుకు నాతోపాటు మంగమ్మమ్మకు చీవాట్లు పెట్టేది. ఆరోజుల్లో చదువు చెప్పటం అంటే పంతులుగారు బెత్తాలకు పనిచెప్పడమే. వారు చెప్పే చదువు నాకు వంటబట్టలేదు. నా ప్రవర్తనతో మా అమ్మకు అసంతృప్తి మిగిలింది. మా అమ్మ తన ఆఖరు రోజులలో మాత్రమే నా తెలుగు చదువు చూచి సంతోషించింది. నా తండ్రి తాతలవలె నేను చదువు లేనివాడనుకానని అర్థంచేసుకొన్నది. నా తమ్ముడు వేంకటప్పయ్య కూడా

చదువులో ముందుంటున్నాడు. మా అమ్మ మమ్ములను మంగమ్మమ్మకు, మా అమ్మమ్మ అమ్మినియమ్మకు, ఆమె పెంపుడు చెల్లెలు లక్ష్మీదేవికి అప్పజెప్పి కన్ను మూసింది.

ఒక రైల్వేకూలీ రామాయణ, భారతాలను పిల్లలకు చెప్తుండేవాడు. నేనా కథలను తోటిపిల్లలకు చెప్తుండేవాడిని. కొత్త కొత్త పుస్తకాలు తెచ్చి మాచేత చదివించేవాడు. ఇదంతా నాకు ఒక 'టానిక్'లా పనిచేసింది. నాలో కొత్త మార్పు వచ్చింది. దారి–తెన్నూ లేక తిరిగే నేను – ఇతరులకు ఉత్సాహంగా పంటలు – పశువులు, పంటతల్లిమీద కథలూ, కాలాల్లో వచ్చే మార్పులు, పక్షులు, కీటకాలు, పాములు, చేపలు, రకరకాల ధాన్యాలు, పప్పులు, ఆకులు, కూర గాయలు, పూలు, ఇంద్రధనుస్సులు, ఆకాశపు రంగులు, పంటల సువాసనలు గురించి చెప్పటం మొదలుపెట్టాను. మా అమ్మ మరణం తరువాత మంగమ్మమ్మే నాకు తల్లి అయింది. నేను రైల్వేకూలీ దగ్గర నేర్చిన కథలకు మంగమ్మమ్మే మొదటి శ్రోత. ఇంతలో 'నారాయణ' అనే హరిజనుడు దేవతలపై యుద్ధంచేసే 'శక్తుల' కథలు చెప్పటం మొదలుపెట్టాడు. నారాయణ శాక్తేయుడు.

జంపని ఆంజనేయులు మా మేనమామకు స్నేహితుడు. 1908 లో అమృతలూరులో సంస్కృతము – తెలుగు భాషలలో ఒక గ్రంథాలయం స్థాపించి, అబ్రాహ్మణులకు ఒక సంస్కృత కాలేజీని ప్రారంభించారు. మా మామ రామస్వామి, ఆంజనేయులుగారు మా గ్రామంలో ఒక గ్రంథాలయం ప్రారంభించారు. ఒకరోజు మా మామ రామస్వామికి అందంగా, కొత్త వాసనలతో బైండింగులతో ఉన్న ఒక పుస్తకాల కట్ట అందింది. నేను వాటిలో ఒక పుస్తకాన్నిప్పించమని మంగమ్మమ్మను అడిగాను. ఆమె రామస్వామి మామను అడిగింది. ఆయన ఆంజనేయులును మరుసటి రోజు ఉదయం వెళ్ళి అడగమన్నాడు. నేను ఆంజనేయులును ఒక పుస్తకం ఇవ్వమని అడిగాను. ఆయన నావైపు వింతగా చూచి 'ఏ పుస్తకము కావాలో చెప్ప'మన్నాడు. ఇరువయి పుస్తకాలను టేబులుమీద పరచాడు. నేను ఎంతో అందంగా బైండు చేసిన 'రాణీసంయుక్త' పుస్తకాన్ని ఎంచుకొన్నాను. ఒక వారం రోజులలో ఆ పుస్తకాన్ని తిరిగి ఇవ్వమన్నాడు. 'ఈ పుస్తకం చదివిన తరువాత వేరొకటి ఇస్తారా?' అని అడిగాను.

"నీకు కావలసిన పుస్తకాలన్నీ తీసుకోవచ్చు. కానీ ఒక షరతు - నీవు తీసుకున్న పుస్తకపు కథాసంగ్రహం నాకు చెప్పాలి" అన్నప్పుడు నా సంతోషానికి హద్దులు లేవు. నేను మంగమ్మమ్మతో మామూలుగా పొలానికి వెళ్ళాను. ఆ పుస్తకంలోని కథ నన్ను కట్టిపడేసింది. మూడు రోజులలో ఆ పుస్తకాన్ని చదివాను. పృథ్వీరాజు-సంయుక్తలు దేశం కోసం మరణించిన విధం, సంయుక్త తండ్రి అయిన జయసింహుడు ఆఫ్ఘనిస్తాను నుండి వచ్చిన ఆక్రమణదారులకు సహాయం చేయడం - అంతా చదివాను. ఈసారి ఆంజనేయులును ధైర్యంగా కలసి వేరొక పుస్తకం ఇవ్వమని అడిగాను. మా మామ రామస్వామి చాలా సంతోషించాడు. అక్కడ ఉన్న అందరూ "ఈ రంగా ఒక పండితుడగుతాడని" ప్రశంసించారు. ఈసారి రెండు పుస్తకాలు ఆంజనేయులిచ్చాడు. నేను గ్రంథాలయోద్యమంలో చేరి మద్రాసు, మచిలీపట్నం ప్రచురణలు, విజ్ఞానచంద్రిక, శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావు, డా॥ పట్టాభి గార్ల సంపాదకత్వంలోని ఆంధ్రప్రచారిణి - పుస్తకాలకు పరిచయమయ్యాను. చక్కటి ముద్రణ, అందమయిన బైండింగు, అక్షరాలు నా చిన్న మనస్సుపై చెరగని ముద్ర వేశాయి. నేషనల్ బుక్ ట్రస్టు వారి ప్రచురణలను నేనందుకే ఆహ్వానిస్తున్నాను.

నా ఈ కొత్త అనుభవాన్ని పంచుకోవటం కోసం నా స్నేహితులనందరినీ పోగుచేశాను. 1909-10 లలో నేనొక వింత ప్రపంచంలో ఉన్నాను. మహాభారతం, ప్రబంధాలు - వీటినుండి పద్యాలు నేర్చుకొని పాడుతుండేవాడిని. రాజస్థాను, బెంగాలు, ఇండిగోపంట (నీలిమందు), దేశభక్తి కథలు ఎక్కువగా చదివేవాడిని. ఆంజనేయులు నాకీ సమయంలో చాలా తోడుగా ఉన్నాడు. కథలు వినేవాడు. తెలుగులో నాకు తెలియని మాటలకు అర్థాలు చెప్పేవాడు. కథల చారిత్రక ప్రాధాన్యతను వివరించేవాడు. నన్ను నాటి రాజకీయ పరిస్థితుల కనుగుణంగా తీర్చిదిద్దాడు. వందలు, వేలమంది బ్రిటీషువారిపై చేస్తున్న తిరుగుబాటు విషయాలు చెప్పేవాడు. గతంలో హిందువులు ముస్లింలపై తిరుగుబాటు చేశారు. పొన్నూరు, చేబ్రోలు, చందోలులలో ఉండే ముస్లింల మూలం భారతీయులే కాని ముస్లింలు కాదని చెప్పేవాడు. హరిజనుల సంక్షేమం పట్టించుకొనకపోతే వారు క్రిస్టియన్లతో కలుస్తారు. కనుక హరిజనుల సంక్షేమం కోసం కృషి చేయమని బోధించేవాడు.

అప్పటికింకా కిసాన్లు (రైతులు), హరిజనులు, గ్రామీణ విద్యార్థులు మా గ్రామంలో స్కూళ్ళకు వెళ్ళటంలేదు. నేను నా దగ్గరకు వచ్చేవాళ్ళకు వారం చివరలో 'ట్యూషను' చెప్తుండేవాడిని. అందరూ చదువుకోవాలని నా కోరిక. అది ఆంధ్ర గ్రంథాలయోద్యమంలో ప్రథమ దశ. అయ్యంకి వెంకటరమణయ్య లైబ్రరీ పత్రిక మాలాంటి వారందరిపై ప్రభావం చూపేది.

శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావుగారి దినపత్రిక మాకు మార్గం చూపింది. వారంలో ఒక రోజు రైతుల ఇళ్ళ నుండి బియ్యం సేకరించేవాళ్ళం. ఈ బియ్యంతో బీదవిద్యార్థులకు స్కూలు ఫీజు చెల్లించేవాళ్ళం.

పల్నాడు, చోళ, కాకతీయ, యాదవ, విజయనగర రాజులందరూ క్షత్రియులే. వీరందరికీ వేరువేరుగా 'భట్టు' (భట్రాజు) లుండేవారు. ఈ భట్టులు ఈ తెగల గొప్పదనాన్ని పొగడేవారు. ఈ భట్టుల నుండి నేను చాలా విషయాలు నేర్చు కున్నాను. గ్రామంలోని యువకులందరికి ఉపయోగపడే చరిత్రను వీరు చెప్పే వారు. గ్రామస్థులు ఆసక్తితో వినేవారు. నాకు సంఘంలోని ఈ వర్ణవ్యవస్థపై ఆదరం లేదు. వీరేశలింగంగారు నాకు ఆదర్శం. రావెళ్ళ వెంకయ్య (నెల్లూరు) – అప్పటిలో నిడుబ్రోలులో ఉపాధ్యాయుడు. ఈయన నాకు ప్రోత్సాహం. నేను కులాలను లెక్కచేయకుండా సాంఘికంగా విందులు, లైబ్రరీ మీటింగులు ఏర్పాటుచేసేవాడిని. నేతవారికి, వడ్రంగివారికి, కమ్మవారికి, కుమ్మరివారికి ఈ సమావేశాలలో ప్రాధాన్యతనిచ్చేవాణ్ణి. సాంఘిక సమానత్వం, ప్రజాస్వామ్యపు ఆకాంక్షలపై నాలో చిన్నప్పుడే బీజాలు పడ్డాయి.

1910 నుండి 1916 లలో నన్ను ఆంజనేయులు సంస్కృతం, తెలుగు భాషలకు పరిచయం చేశాడు. కందుకూరి వీరేశలింగంగారి రచనలు చాలా ఇష్టంగా చదివాను. బెంగాలీ సాహిత్య ప్రభావం ఆరోజులలో తెలుగు సాహిత్యంపై చాలా ఎక్కువగా ఉంది. నేనీ సమయంలోనే కెమిస్ట్రీ, బాటనీ, ఫిజిక్సు, అనాటమీ లను, బ్రిటీషు, అమెరికా రాజ్యాంగాలను చదివాను. మాతృభాషలో చదువు నేర్పటం ఎంత అవసరమో గుర్తించాను. మా మామ రామస్వామిగారీ రోజులలో నేను పెద్ద విజ్ఞానిని కాగలనని ఊహించారు. వారు బాపట్లలో 1911 లో జరుగుతున్న ప్రథమాంధ్ర సభలకు నన్ను తీసుకొనివెళ్ళారు. ఆ సభల ప్రాముఖ్య

తను నాకు చెప్పారు. తరువాత రోజులలో బ్రిటీషు శాసనసభలో సభ్యుడైన శ్రీ బి.యస్. శర్మగారిని చూపి 'ఇంగ్లీషు నేర్చుకుంటావా?' అని అడిగారు.

ఆంజనేయులు నన్ను తెలుగులో మరింత కృషి చేయమని చెప్పాడు. రామస్వామిగారికి నాపై ఆదరణ రోజురోజుకు పెరగసాగింది. పొన్నూరులోని సంస్కృత పండితులు నాకు సంస్కృతం చెప్పడానికి నిరాకరించారు. రామస్వామి గారికి కోపం వచ్చింది. నన్ను పొన్నూరులోని ఇంగ్లీషు స్కూలులో చేర్పించాలన్న ఆలోచన వచ్చింది. నాకు చదువుమీద ఉన్న అభిరుచిని చూచి రామస్వామి మా అమ్మను తలచుకొని కళ్ళనీళ్ళు పెట్టుకొన్నాడు. "నేనెంతో ఖర్చుచేసి ఈ గ్రంథాలయాన్ని నిర్మించి, అభివృద్ధి చేశాను. రంగా దీనివలన నేడొక పండితు డైనాడు" అని రామస్వామి చెప్పేవాడు. ఆయన చాలా ఉదారహృదయులు, సున్నితమనస్కులు. దురదృష్టం – ఆయన 1911 లో జబ్బుపడి మరణించాడు. నేను ఇంగ్లీషు నేర్వడం ఆయన చూడలేదు. ఆయనకు నాపై, నా తమ్ముళ్ళపై ప్రేమ ఎక్కువ. మా అమ్మమీద ప్రేమానురాగాలు ఎక్కువ. ఆయన ఆస్తినంతా మాకు వ్రాసి, తన భార్య లక్ష్మీదేవి, చెల్లెలు మంగమ్మ, తల్లి అమ్మనియమ్మను సంరక్షకులుగా ఏర్పాటుచేసి చనిపోయాడు. లక్ష్మీదేవిగారి కుమార్తె అంతకు కొన్ని సంవత్సరముల క్రితం చనిపోయింది. లక్ష్మీదేవి భర్త మాటకు కట్టుబడి, మమ్మల్ని అందరినీ పెంచి, మా బాగుకై జీవితకాలం తపించి, శ్రమించింది. రామస్వామిగారి ఔదార్యం, లక్ష్మీదేవిగారి అంగీకారం, ప్రేమ లేనట్లయితే నేను ఆక్స్‌ఫర్డ్‌లో చదివేవాడనుకాదు.

నా 'క్రిడో ఆఫ్ వరల్డ్ పెజెంట్రీ' (ఈ రచయిత అనువాదం 'కర్షకవేదం') ని వారిరువురకూ అంకితమిచ్చాను.

నా ఇంగ్లీషు చదువు రెండేళ్ళు వెనుకబడింది. మంగమ్మమ్మ తేల్చుకోలేక పోయింది. నేను వ్యవసాయం, పొలం లెక్కలు చూడటం ఇందుకు కారణం. నన్ను రామస్వామిలాగా చూడాలని ఆమె కోరిక. నేను అక్కడ దొరికే తెలుగు పుస్తకాలనన్నింటినీ చదివాను. ఈ రెండు సంవత్సరాలు వ్యవసాయం, లైబ్రరీ అజమాయిషీ, రైతు మిత్రులకు చదువు చెప్తూ గడిపాను. ఈ రెండు సంవత్సరాల అనుభవం నా జీవితకాలం ఉపయోగపడింది.

నేను ఇంగ్లీషు నేర్వవలసిందేనని ఆంజనేయులు పట్టుబట్టాడు. నేను, ఆంజనేయులు మా నాన్నను ఒప్పించగలిగాము. ఎట్టకేలకు మంగమ్మమ్మ కూడా ఒప్పుకొన్నది.

1914 లో పొన్నూరులో నా ఇంగ్లీషు చదువు మొదలయింది. అప్పుడే మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమయింది.

ఉపాధ్యాయులు నన్ను ప్రేమతో చూచేవారు. వెంకయ్యగారు వర్డ్స్‌వర్తు అభిమాని. వారు నెల్లూరువారు. స్వామిరామతీర్థ అనుయాయి. పాఠ్యేతర అంశాలపై నాకున్న అభిరుచిని గ్రహించి, నేను, ఆంజనేయులు చుట్టుప్రక్కల గ్రామాల్లో లైబ్రరీలను నెలకొల్పడానికి సహకరించారు. వేదికలపై మాట్లాడటం నేర్పారు.

ప్రపంచ యుద్ధం విద్యాధికులను మేలుకొల్పింది. ఆంధ్రోద్యమం - ఇండియాకు స్వరాజ్యం కావాలని కోరుతున్నది. నా రాజకీయ ఆలోచనలు ఆంధ్రోద్యమ బాటలోనే సాగినయ్. 1917 లో నెల్లూరులో జరిగిన ఆంధ్రుల సమావేశానికి వెంకయ్యగారు, ఆంజనేయులుగారు నన్ను ప్రోత్సహించి పంపారు. ఆనాటి గవర్నరు గారు “విద్యార్థులు రాజకీయాలకు దూరంగా ఉండాల”ని ఉత్తర్వులిచ్చారు.

నేనీ సమావేశంలోనే అత్యంత ఉత్సాహవంతుడు, రచయిత, దేశభక్తుడు అయిన ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలక్రిష్ణయ్యను చూశాను. వారు పాడిన ‘రాయప్రోలు’ పాటలు, చిలుకూరి వీరభద్రరావు వ్రాసిన ఆంధ్రుల చరిత్రను గుర్తుచేసినయ్. ఉపన్యాసకులు ‘తిలక్’ త్యాగాలు వర్ణిస్తుంటే, కె.వి.లక్ష్మణరావు గారు వ్రాసిన ‘శివాజీ’ నాకు గుర్తుకొచ్చాడు. వారు స్వరాజ్యం కొరకు నినదిస్తూ ఉంటే, నేను ‘మాగ్నాకార్టా’ ‘బిల్ ఆఫ్ రైట్స్’ (హక్కుల బిల్లు) తెలుగు పుస్తకాలలో చదివిన ‘ఇంగ్లాండు రాజ్యాంగము’ నాకు స్ఫురించింది. ఈ సమావేశం నాకొక గొప్ప ‘కనువిప్పు’. బ్రిటీషు ప్రభుత్వానికి నేను కూడా నా అసమ్మతిని తెలియ జేసినందుకు గర్వించాను. ఐరిష్ దేశస్థురాలు డా॥ అనిబిసెంటు గొప్ప ఉపన్యాసకురాలు. దివ్యజ్ఞానసమాజ స్థాపకురాలు. ఆమెను బ్రిటీషు ప్రభుత్వం జైలులో పెట్టింది. ఈ దుర్మార్గాన్ని తెలుగులో ఉన్న పత్రికలన్నీ గర్హించినయ్.

ఆమె సంపాదకత్వం వహించే 'న్యూఇండియా'లో చాలా సాధారణమయిన ఇంగ్లీషు భాష వాడబడేది. నేనా సంపాదకీయాలను అర్థంచేసుకొనేవాడిని. ఆ సంపాదకీయాలు మాకు ధైర్యాన్నిచ్చేవి. ఆలోచింపజేసేవి. మాట్లాడజేసేవి. వ్రాయజేసేవి. ఆంజనేయులు, వెంకయ్య గారలు నాకు జాతీయ, అంతర్జాతీయ విషయాలు చెప్పేవారు.

గాంధీగారు దక్షిణాఫ్రికా నుండి ఆంగ్లేయులపై విజయం సాధించి వచ్చారు. తిలక్‌గారు ఆరు సంవత్సరాల బర్మా జైలుజీవితం నుండి విడుదలయ్యారు. అనిబిసెంటు జైలుశిక్షకు నిరసనగా మా గ్రామంలో ఊరేగింపు జరిపాను. వెంటనే పోలీసులు మంగమ్మమ్మను నా ప్రవర్తనపై హెచ్చరించి వెళ్ళారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నందుకు మా నాన్నగారు సంతోషించారు.

వీరేశలింగంగారి ప్రేరణతో నేను 'డైరీ' వ్రాయటం మొదలుపెట్టాను. యువకులు కథాకాలక్షేపాలకు, హరికథలకు, భజనలు చేయటానికి వస్తుండేవారు. శతావధానాలు, అష్టావధానాలు తెలుగు కవులు చేస్తూ ఉండేవారు. వీటన్నింటినీ నా 'డైరీ'లో వ్రాసిన గుర్తు. వీరేశలింగం పుస్తకాలు నన్ను ఉత్తేజపరిచినాయి. నేను నా పదమూడో ఏట నుండి పదిహేడవ సంవత్సరం వరకు చదివిన ఈ పుస్తకాలలో ఉన్న విషయాలను ఆచరించటానికి ప్రయత్నించాను. విగ్రహారాధనను మాని ఒక భగవంతునినే నమ్మాను. మాంసాహారం మానివేశాను. కేవలం పుట్టుకతోనే ఎవరూ గొప్పవారు కారని, వారి గొప్పతనం వారు చేసే పనులబట్టి ఉంటుందని విశ్వసించాను.

ఇరవయ్ సంవత్సరాలుగా చనిపోయాడనుకొన్న మా బంధువు దక్షిణాఫ్రికా నుండి వచ్చాడు (1917). గాంధీగారి జీవితం వారి నుండి తెలుసుకున్నాను. వీరు గాంధీగారితోపాటే దక్షిణాఫ్రికాలో జైలుజీవితం గడిపారు. వీరు గాంధీజీ–కస్తూరీబాయిల జీవితాన్ని కళ్ళకు కట్టినట్టు చెప్పేవారు.

హైస్కూలులో నేను ఆలస్యంగా చేరాను. నాకు అప్పటికే చదువుకున్నవాడినని, సంఘసేవకుడనని పేరు వచ్చింది. ఇంగ్లీషులో, లెక్కలలో వెనుకబడి ఉన్నాను. నాకు ప్రైవేటు చెప్పటానికి అప్పికట్ల నుండి మా బంధువు ఆచంట నాగయ్య,

స్కూలు మిత్రుడు గోపాలక్రిష్ణయ్యలు (వీరు గుంటూరులో విద్యార్థి) సాయపడ్డారు. నేను ఫిజిక్సు-మేథమేటిక్సులో వీరి బోధన వలననే మెట్రిక్యులేషను ప్యాసయ్యాను. 1919 లో వెంకయ్యగారు నెల్లూరుకు వెళ్ళారు. స్కూలులోని టీచర్లు నన్ను మర్యాదగా చూచేవారు.

1919 లో నేను స్కౌటు ఉద్యమంలో చేరాను. 1920 లో మా స్కూలులో జరిగిన జిల్లా కో-ఆపరేటివ్ కాన్ఫరెన్సులో నాయకునిగా ఎన్నిక అయ్యాను.

ఆంజనేయులు కవులనూ, వారి కవిత్వాన్నీ మెచ్చుకొనేవాడు. నేను కూడా పద్యాలల్లటానికి ప్రయత్నించాను. నిజానికి ఆంధ్రులందరూ 'కవిత్వాభినివేశం' కలవారే. ఆంజనేయులు ఫ్లూటు, ఫిడేలు, హార్మోనియం నేర్చుకొంటుండేవాడు. మేము ఒక నాటక సమాజాన్ని స్థాపించి చాలా నాటకాలు ప్రదర్శించాము. 'కురుక్షేత్రం' నాటకంలో నేను కూడా నటించాను. సంగీత విద్వాంసుడయిన శ్రీ పర్వతనేని వీరయ్యగారికి భారతాధ్యక్షుని గౌరవవేతనం తరువాత కాలంలో ఇప్పించగలిగాను.

ఆంజనేయులు, శ్రీ పాములపాటి వెంకటకృష్ణయ్యగారు మద్రాసు ప్రెసిడెన్సీ కమ్మ సంఘాన్ని నిర్మించాలని పట్టుదలతో ఉన్నారు. ఆరోజులలో 'కులసంఘాలు' అభివృద్ధి సూచికలు. మేమొక సమావేశాన్నేర్పాటుచేశాము. వింతగా బ్రాహ్మణేతరులు చాలామంది మా సమావేశాన్ని బలపర్చారు. ఈ సభకు బారిష్టరు వి. సుబ్బారావు, వెలగపూడి రామకృష్ణ, శ్రీ ఆవుల గోపాలక్రిష్ణయ్య గారలు ఆహ్వానితులు. స్వాగతపద్యాలను యువకవి తుమ్మల సీతారామమూర్తిగారు వ్రాశారు. వీరు తరువాత రోజులలో 'అభినవ తిక్కన'గా పేరుగాంచారు.

ఈ సమావేశం తరువాత మిగిలిన డబ్బుతో 'రైతు' అనే పత్రికను స్థాపించాలని నిర్ణయించాము. ఈ నిర్ణయం నా మెట్రిక్యులేషను పరీక్షకు ముందుగా జరిగింది. నా మిత్రులందరూ 1920 లో ఇంగ్లాండుకు వెళ్ళటానికి ఒక వీడ్కోలు సభ నేర్పాటుచేశారు.

1915 లో మా గ్రంథాలయ వార్షికోత్సవం జరిగింది. దీనికి మా గ్రామ కరణంగారిని ఆహ్వానించాము. వారికి కొద్దిగా సంస్కృతంలో కూడా ప్రవేశ ముంది. వారు చాలా సంతోషించారు. తరువాత సంవత్సరం శ్రీ త్రిపురనేని

రామస్వామిని పిలిచాము. వీరు కొద్దిరోజుల క్రితమే బారిష్టరు పరీక్ష పాసయి ఇంగ్లాండు నుండి వచ్చారు. తిరుపతి వేంకటకవుల శిష్యుడు. మంచి వక్త. వారు సమాజంలోని బ్రాహ్మణాధిక్యతను ప్రశ్నించారు.

రాజకీయాలు సరళంగా ఉండవు. దీనికి 1918-20 మధ్య జరిగిన సంఘటనలు చెప్పవచ్చు. రామస్వామిగారు జాతీయవాది. కృష్ణా, గుంటూరు జిల్లాలలోని బ్రాహ్మణులు వీరిని తీవ్రంగా వ్యతిరేకించారు. స్వామి సరస్వతి కమ్మ, తెలగ, రెడ్డి కులాలవారు కూడా క్షత్రియులేనని, వీరు కూడా జంధ్యం ధరించవచ్చని చెప్పసాగారు. చాలామంది కమ్మవారు జంధ్యం వేసుకొని, శర్మ, వర్మ పేర్లను ధరించసాగారు. ప్రభుత్వం కూడా వీరిని ప్రోత్సహించసాగింది.

బ్రాహ్మణులు మాత్రమే వేదం చదవటానికి అర్హులని చెప్పటం శాస్త్రబద్ధం కాదని రామస్వామిగారు వాదించేవారు. స్త్రీలు కూడా వేదవిద్యను నేర్వవచ్చని వీరు తీవ్రంగా ప్రచారం చేశారు. వీరేశలింగం బోధలు మనస్సుకు పట్టిన నాకు, ఆంజనేయులుకు ఈ విషయంలో ఏకాభిప్రాయం ఉండేది. కానీ శంబూక వధను మేం నమ్మలేకపోయాం. బ్రాహ్మణుల బోధచేత రాముడు శంబూకుని వధించాడనే విషయం మాకు నమ్మశక్యం కాలేదు. శంబూక వధను పదేపదే చదివిన తరువాత రాముడంతటి మహానుభావుడు కూడా బ్రాహ్మణుల బోధచేతనే ఈ పనిచేసి ఉంటాడని నమ్మకం కుదిరింది.

రామస్వామి ఉపన్యాసం తరువాత స్కూలులో బ్రాహ్మణులు నాపై కోపంగా ఉన్నారు. మంగమ్మమ్మ చదువు కొరకు పొన్నూరు వెళ్ళే నా రక్షణ కోసం భగవంతుని ప్రార్థించేది.

దళితుల ఆధ్వర్యంలో జరిగే గ్రామీణ పండుగలలో నేను, అబ్రాహ్మణ యువకులము చాలా ఉత్సాహంగా పాల్గొనేవారం. శాక్తేయుల ఉత్సవాలలో దళితులదే అగ్రతాంబూలం. వీరేశలింగంగారు ఈ ఉత్సవాలలో జరిగే జంతుబలులను నిరసించారు. ఆధిక్యం కొరకు శైవులు-వైష్ణవులు ఒకరితో ఒకరు బద్ధవైరంతో ఉండేవారు. క్రైస్తవులు హిందువుల విగ్రహారాధనను హేళన చేసేవారు.

పోతన కవిత్వం నాకు చాలా ఇష్టం. పోతన కృష్ణునిలో ప్రపంచంలోని ప్రేమను-కరుణను చూశాడు. భగవద్గీత చదివాను. నా వయస్సుకు అర్థంకాలేదు.

ఎందుకనో వీరేశలింగంగారి బోధలు నాకు భారతీయతను అర్థంచేసుకొనడానికి చాలవనిపించాయి.

పదిహేను-పదహారు సంవత్సరాల వయస్సులో 'రంగా' ఈ విషయాలను ఇంతగా ఎలా చర్చించగలుగుతున్నాడు? ఇదే భారతదేశపు ప్రత్యేకత. ప్రత్యేకంగా గ్రామీణ భారతదేశపు విశిష్టత. అతిథులు, అభ్యాగతులు, యాచకులు, భట్రాజులు, విచిత్రవేషధారులు, సంచార సన్యాసులు, కవులు, గాయకులు అందరివీ ఈ గ్రామీణ భారతదేశంలో (వారి పాటలు, మాటలు, తిట్లు, పొగడ్తలు అన్నీ) మతపరంగానే ఉంటాయి. అమెరికా మతబోధకులు ఉపమానాలు, అలంకారాలు వారి వ్యాపార వాణిజ్య రంగాల నుండి ఉటంకిస్తారు. భారతదేశంలో ప్రతివాడు ఈ దేశపు వేదాంతమే మాట్లాడుతాడు. అందువలన ఇవి ఏమీ నాకు క్రొత్తగావు. నా ఆలోచనలన్నీ ఇక్కడి దేవుళ్ళపైనే ఉండేవి. ఈ భక్తిభావంలో ఒక 'కలయిక' కొరకు వెతుకుతున్నాను. ఈ 'కలయిక' వివేకానందుని బోధలోనూ, రామతీర్థ ప్రవచనాలలోనూ నేను కనుగొన్నాను. వేదాంతముపై నిరర్థకపు ఆలోచనలను వారు నిరసించారు. ఇరువురు చెప్పినదీ ఒకటే - భగవంతునిపైన నమ్మకం.

తత్త్వమసి-త్వమేవాహం-అహం బ్రహ్మోస్మి-అయమాత్మా-ప్రజ్ఞానం బ్రహ్మ.

తత్త్వమసి	=	అదే నీవు అయివున్నావు. ఆ పరమాత్మే నీలో ఉన్నది. ఆ ఆత్మ నీలో ఉన్నది. ఆ ఆత్మవు నీవే అయివున్నావు.
అహం బ్రహ్మోస్మి	=	నేనే బ్రహ్మను అనే అనుభూతిని పొందటం.
అయమాత్మా	=	ఈ ఆత్మే బ్రహ్మ (దేహేంద్రియాదులు కానట్టే).
ప్రజ్ఞానం బ్రహ్మ	=	సంపూర్ణ జ్ఞానమే బ్రహ్మ.

కులాలు, బలులు ఇవన్నీ ఏమీ తెలియనివారి కొరకు పెద్దలు ఏర్పాటుచేసినవి. ఇవన్నీ ఒకే భగవంతుని ఆరాధన కొరకు,భగవంతుని ప్రేమ కొరకు, భగవంతుడు ఒక్కడే అనే నమ్మకం కొరకు ఏర్పాటుచేయబడినవి. వివేకానందుని గ్రంథాలు తెలుగులో 'వావిళ్ళ' వారు అచ్చు వేశారు. రామతీర్థగారివి ఇంగ్లీషులో చాలా సులభశైలిలో చదువగలిగాను. వీటిని తెలుగు చేయాలనే నా ఆలోచనకు

ఆంజనేయులు మద్దతిచ్చాడు. 1920 లో రెండువందల పేజీలు అనువదించాను. ఇవి 'సమదర్శని' లో ప్రచురించబడ్డాయి. ఇతర భాగాలు 1923 లో 'స్వరాజ్య'లో ముద్రింపించాను. నాలో క్రమశిక్షణకు, మానసిక ఆవేశాల అదుపునకు ఇవి కొంత కారణం.

వీరేశలింగంగారి జీవితం చదివిన తరువాత నేను 'రాణీరుద్రమ'ను గురించి వ్రాయాలని తలచాను. ఈమె ముప్పైఐదు సంవత్సరాలు ఆంధ్రావనిని పరి పాలించింది. మార్కోపోలో ఈమె వాణిజ్య-వ్యాపారాలను గురించి వ్రాశాడు. విక్టోరియా రాణీని గురించి, సెయింటు జోనును గురించి, ఫ్లోరెన్సు నైటెంగేలును గురించి వీరేశలింగం గారు వ్రాశారు. రుద్రమదేవి వ్యక్తిత్వం చాలా గొప్పది, విశిష్టమైనది. ఆంధ్రులచరిత్రలో చిలుకూరి వీరభద్రరావు గారు చాలా గొప్పగా ఈమెను గురించి వ్రాశారు. ఆమె రైతుల వంశంలోనే (నా వంశంలోనే) జన్మించిందని, నలుగురు బిడ్డల తల్లియని, వారికి నలుగురు వేరు వేరు కులాలవారితో పెళ్ళిళ్ళు జరిపించిందన్న విషయాలు చదివి మురిసిపోయాను. ఈమె జీవితచరిత్ర తెలుగులో వ్రాయటానికి సాహసించాను. 1919 లో తెలుగులో వ్రాసి నా గ్రామస్థులందరికీ వినిపించి వారి మన్ననలను పొందాను.

1917 నుండి మహాత్మాగాంధీ, తిలక్, అనిబిసెంటులను గూర్చి జాతీయ పత్రికలైన 'ఆంధ్రపత్రిక', 'న్యూఇండియా'లలో చదివి జాతీయవాదాన్ని అనుస రించాను. గాంధీగారు రెండవ ప్రపంచ యుద్ధంలో సైన్యసహకారమందించ వలసిందని భారతీయులను కోరారు. యుద్ధం తరువాత భారతదేశానికి 'స్వతంత్రం' వస్తుందని తలచి శ్రీ పాములపాటి వెంకటకృష్ణయ్య గారు హరిజను లను సైన్యంలో చేరమన్నారు. గాంధీగారు 'చంపరాన్' మేజిస్ట్రేటును ఎదిరించి మాట్లాడిన తరువాత మాకు మరింత ధైర్యం వచ్చింది. గాంధీగారు అహమ్మదా బాద్‌లో మిల్లులవారిని, మిల్లు పనివారిని క్రమశిక్షణతో మెలగవలసిందిగా కోరుతూ నిరాహారదీక్ష చేశారు. గాంధీగారు 'కైరా' ప్రజలను కరువు నుండి రక్షించటానికి ప్రభుత్వంతో ఘర్షణపడి విజయం సాధించారు. నేనీ విషయాన్ని చెప్పినప్పుడు 'గాంధీగారు నిజమయిన రైతు మిత్రుడు' అని మా నాన్నగారు నాతో అన్నారు. రైతుల భవిష్యత్తు గాంధీగారి చేతులలో భద్రంగా ఉందని

భావించాను. రైతుల భవిష్యత్తు, జాతీయవాదం గాంధీగారికి రెండు కళ్ళు అని అర్థంచేసుకున్నాను.

లార్డు మాంటేగుకు ఇవ్వనున్న కాంగ్రెసు ప్రణాళికపై సంతకాలు చేయమని గాంధీజీగారు కోరారు. నాతో లైబ్రరీలోనూ, రాత్రిపాఠశాలల్లోనూ పరిచయమున్న వారందరూ పత్రికలలో ఈ విషయం చదివారు. సంతకాల సేకరణకు నిశ్చ యించుకొని మా నాన్నగారిని ఈ పనికి కొద్దిగా డబ్బు ఇవ్వమని అడిగాను. మా నాన్నగారు "నాది మొదటి సంతకం కావాలి" అన్నారు. అలానే సంతకం చేశారు. మేము పది గ్రామాలు తిరిగి వేలుముద్రలు సేకరించాము. ఆంధ్రపత్రిక వారి సలహా ననుసరించి ఈ విషయం బయటపడకుండా జాగ్రత్తలు తీసు కున్నాము. అయినా పోలీసులు గుర్తించారని గమనించాము. నలభయి సంవత్సరాలనాటి ఈ విషయం తలచుకొన్నప్పుడల్లా 'మా నాన్నగారి మొదటి సంతకమే' నా జీవితానికి దారిచూపింది అనే విషయం గుర్తుకువస్తుంది. స్వదేశీ దుస్తులను ధరించటం, స్వదేశీ వస్తువులను వాడటం అలవాటు చేసుకున్నాను.

మా గ్రామంలో చేనేతవారు, కమ్మరివారు, వడ్రంగివారు, బంగారపు పనివారు ఉన్నారు. మా అమ్మ చనిపోయేవరకు రాట్నం వడుకుతుండేది. ఆమె వడికిన నూలును చేనేతవారికి ఇచ్చి బట్టలు నేయించేది. బట్టలు కొని రంగులద్దేది. ఈ విషయాలన్నింటినీ నేను శ్రద్ధగా గమనిస్తుండేవాడిని. చేనేతవారి పిల్లలతో ఆడుకునేవాడిని. వారిళ్ళలోనే అన్నం తినేవాడిని. నేను ఎన్ని పాఠాలు చేనేత ఇళ్ళలో నేర్చుకున్నానో! 1925 లో నేను చేనేత కాంగ్రెసును పొన్నూరులో ఏర్పాటుచేశాను. శ్రీ గోలి బసవయ్యగారు దానికి అధ్యక్షులు. నాకు కుమ్మరి వారి 'ఆముల'తో, కమ్మరివారి 'కొలుము'లతో, వడ్రంగివారి బాడిశెలలతో, బంగారు పనివారి అందమయిన ఆభరణాలతో, చర్మకారుల సూదులతో, కత్తులతో ఎంతో పరిచయం ఉంది. గంటలతరబడి వీరందరితో గడిపేవాణ్ణి. వీరందరూ నా స్నేహితులే. వారి పని తెలుసు. వారి ఆకలి తెలుసు. మా అమ్మమ్మ అనుమతితో ఎన్నోసార్లు బియ్యం, ఉప్పు, పప్పు, స్వీట్లు వారిళ్ళలో ఇస్తుండేవాడిని. మా అమ్మమ్మంటే వీరందరికీ ప్రాణం. గాంధీగారు చేతివృత్తుల వారినందరినీ ఆదుకోవాలని చెప్పేవారు. 1917 నుండి నేనీపనిలో ఉండి

వారి అవసరాలలో, బాధలలో పాలుపంచుకొనేవాడిని. గ్రామంలో నా సాంఘిక కార్యక్రమంలో వీరందరూ నాకు తోడుగా ఉండేవారు. నేనందరి ఇళ్ళకు వెళ్ళి గాంధీగారి ఆలోచనలు, స్వతంత్ర భారతదేశంలో వారి భవిత ఎంత ఆశావహమో చెప్పేవాడిని. గాంధీగారి వార్తలు నేను మా మంగమ్మమ్మకు చెప్పేవాడిని.

లైబ్రరీ ఉద్యమాలలో, వయోజనుల బడులలో, నిరక్షరాస్యతకు వ్యతిరేకంగా, సాంఘిక కార్యక్రమాలలో, కళాకారుల, హరిజనుల స్నేహంలో నా సోదరులు వెంకటప్పయ్య, లక్ష్మీనారాయణలు నా బాటలోనే నడచేటట్లు చూశాను. మంగమ్మమ్మ వెంకటప్పయ్య ఇంగ్లీషు చదువుకు కొద్దిగా అభ్యంతరం చెప్పింది. లక్ష్మీనారాయణ చదువుకు సమాధానపడింది. అప్పటికి నా కుటుంబానికి నేను పెద్దగా ఉన్నాను. నేను నా తమ్ముళ్ళకు ఉత్తమ ఉపాధ్యాయునిగా, సలహాదారుగా, స్నేహితునిగా ఉన్నానని నమ్ముతున్నాను. వెంకటప్పయ్య మెట్రిక్యులేషనుతో చదువు ఆపి వ్యవసాయంపై దృష్టిపెట్టాడు. లక్ష్మీనారాయణ యం.ఏ. పాసయి, తరువాత ప్లీడరయి 1935 వరకు 'లా' ప్రాక్టీసు చేశాడు. తరువాత నా ఉద్యమాలకు చేదోడువాదోడుగా ఉన్నాడు. వెంకటప్పయ్య మా గ్రామంలో వివేకానందుని విగ్రహం ఏర్పాటుచేశాడు.

నేను చదువుకున్న విద్యాసంస్థపై నాకు అభిమానం మెండు. ఈ స్కూలు మొదట ఒక మిడిల్ స్కూలు. పొన్నూరులో ఉండేది. మొదట ఈ స్కూలును బ్రాహ్మణులు స్థాపించారు. భావన్నారాయణ అనే ప్లీడరు దీనికి అధ్యక్షులుగా ఉండేవారు. పట్టయ్యగారు 5 ఎకరాల భూమిని ఈ స్కూలుకు విరాళంగా ఇచ్చారు. నేను 8వ తరగతికి వచ్చేసరికి ఈ స్కూలులో ప్రతి సంవత్సరం ఒక క్లాసు పెంచారు. మెట్రిక్ పాసయిన మొదటి అయిదుగురిలో నేనొకడిని.

ఈ స్కూలును హైస్కూలు చేయటానికి (గవర్నమెంటు) శ్రీ కె. లక్ష్మయ్యగారు రూ.7000/- విరాళం ఇచ్చారు. వీరు కడుబీదవారు. వారు నిడుబ్రోలులో ఈ హైస్కూలు కట్టించారు. రూ.2000/- ఈ స్కూలుకు ఖర్చుపెట్టారు. వారు పొలాలన్నింటినీ అమ్ముకున్నారు. పొలాలను కవులుకు తీసుకొని, అద్దె ఎడ్లబండి తోలి జీవనం సాగించారు. తన ధైర్యాన్ని వీడకుండా ప్రతి పైసాను ఈ స్కూలుకు ఖర్చు చేశారు. చివర రోజులలో వారికి కొంత ఆస్తి కలసివచ్చి సుఖంగా

జీవించారు. వారు నిరక్షరాస్యులు. వారు ఈ స్కూలుకు ఇచ్చిన విరాళం మరువ లేనిది. ★అభినవ తిక్కన వీరి గురించి 'వర్జువర్తు' స్థాయిలో ఒక పద్యం వ్రాశాడు. నేను పట్టయ్యగారిచ్చిన 5 ఎకరాల భూమిని దగ్గరలో ఉన్న గుడికిప్పించి దానికి బదులుగా ఈ స్కూలుకు 5 ఎకరాలు కలిపాను. దానివలన చక్కటి ఆటస్థలం ఏర్పడింది.

ఈ స్కూలులో చాలా సమర్థులయిన శ్రీ ప్రసాదరావుగారు, శ్రీ సుబ్బయ్యగారు హెడ్‌మాస్టర్లుగా ఉండి ఎంతోమంది అధ్యాపకులను, నాయకులను, బారిష్టర్లను, కవులను, డాక్టర్లను తయారుచేశారు. ఈ స్కూలు ఆంధ్రుల ప్రజాజీవితానికి చేసిన సేవ చాలా గొప్పది.

మా తండ్రి తన ఆరోగ్యం బాగుండనందున నాకు పెండ్లి చేయాలనే ఉద్దేశ్యంతో, ఆంజనేయులు సలహాతో దగ్గరలో ఉన్న 'మాచవరం'లో భారతీదేవి అనే అమ్మాయి నాకు తగిన వధువుగా నిశ్చయించాడు. ఆ అమ్మాయి చక్కనిది (ఆంజనేయులు చెప్పాడు). ఆమె తండ్రి వెలగా సుబ్బయ్యగారు కష్టపడే తత్వమున్న రైతు. ధైర్యమున్నవాడు. ఆంజనేయులు అత్తగారిది కూడా ఆ ఊరే. నా తండ్రికి ఈ సంబంధం నచ్చింది. నన్ను వెళ్ళి పిల్లను చూసిరమ్మన్నాడు. ఆంజనేయులుకు, మా తండ్రిగారికి నచ్చితే చాలు అన్నాను. వారు వెళ్ళి నిశ్చయ తాంబూలాలు తీసుకున్నారు. మా పెళ్ళి 1924 లో జరిగింది.

★**గీతిమాలిక :**

చేత నొక కుంభకోణంపుఁజెంబుతోడఁ, గక్షనొక వగ్గు వంకర కఱ్ఱతోడ
నొసటిపైఁ దిరునామంపుముసుఁగుతోడ, గునియు సనసన్నపసిఁడిపోఁగుల్లతోడ
మలఁచి కట్టిన నీర్కావివలువతోడ, డాపలించిన మీఁదిపుట్టమ్ముతోడ
బడలి పల్లకిబొంగైన యొడలితోడఁ, దఱపివెన్నెల విరియించు శిరముతోడఁ
దూలి గుంటలువడిన కన్దోయితోడఁ, దేపతేపకు బెదరెడి చూపుతోడ
నల్లనల్లన మనబడి కెల్లనాఁడు, వచ్చి గదిగది చూచు దేవళముఁ జేరి
వలగొనిన యట్ల బడిఁ జుట్టివచ్చుచుండు, నితనిఁ గన్నంతనే కుఱ్ఱ లిహిహి యంచు
వినుకలిం బాసి గోల గావించుచుండు, రితని రాయిడి నానాఁటి కెచ్చుఁదొడఁగె
నెవ్వఁ డీ వెఱ్ఱివాఁ డితం డెచటివాఁడు, గట్టిగా మందలింపక యిట్టివాని
నేల మన్నింతు రొజ్జలిదేమి తాల్మి.

ఆరోజులలో చారిత్రక, సాంస్కృతిక పర్యటనలు విద్యార్థులకు ఉండేవికావు. 1919 లో నేను మద్రాసు వెళ్ళాను. అంతకు పూర్వము గుంటూరు, నెల్లూరు, కృష్ణా జిల్లాలలో మాత్రమే తిరిగాను. అప్పటికి 'ఆంధ్రపత్రిక'లో రోజూ వార్తలు చదువుతున్నాను. రెండుసార్లు ఆదిశేషుడు కొలువైన మోపిదేవికి వెళ్ళాను. కృష్ణా నదిని దాటటం ఒక అనుభవం. ఎడ్లబండిమీద వెళ్తుండగా హఠాత్తుగా కృష్ణ పొంగింది. నా పుస్తకాలు ఎక్కడ తడిసిపోతాయోనని భయపడ్డాను. 'భట్టిప్రోలు' దిబ్బను చూచి ఆశ్చర్యచకితుడనయ్యాను. అక్కడ 'అశోకచక్రవర్తి' నిర్మించిన బుద్ధుని స్తూపం ఉండేది. దివిసీమలో 'గూడవల్లి', 'కళ్ళేపల్లి'లను చూశాను. దివిసీమవారి భారీవిగ్రహాలు నా మనస్సును హత్తుకున్నాయి. నేను, నా తల్లిదండ్రులు, సోదరుడు వెంకటప్పయ్య కోటప్పకొండకు వెళ్ళాము. ఈ ఎడ్లబండి ప్రయాణం నాకెంతో సంతోషం కల్గించింది. పోటీపడి వెంకటప్పయ్య, నేను కొండ ఎక్కాము.

నేను తండ్రిగారితో సంవత్సరానికి రెండు రోజులు ఏలూరు వెళ్తుండేవాడిని. అక్కడ పశువుల దాణాకు 'నూగుచెక్క', 'కొబ్బరిచెక్క' కొంటుండేవాళ్ళం. మా తండ్రి గీసి గీసి బేరమాడేవాడు. ఆ రెండు రోజులు నేను బాగా ఆనందించే వాడిని. అక్కడ చెరువులు, గుడులు చాలా ప్రత్యేకంగా ఉండేవి. ఆడవారు చుట్ట తాగడం చూచి అసహ్యించుకున్నాను. గోదావరి జిల్లా, కళింగ జిల్లాలలో (నేటి ఉత్తరాంధ్ర) ఈ పాడు అలవాటుంది. పాశ్చాత్య దేశాల స్త్రీలు సిగరెట్లు తాగటం నాకు తెలుసు. ఈ అలవాటు వాతావరణ కాలుష్యాన్ని పెంచుతుంది.

నేను విజయనగర రాజుల రాజధాని అయిన హంపీని, శిధిలాల్లో ఉన్న కాకతీయుల రాజధాని ఓరుగల్లు (వరంగల్లు) నగరాన్ని, పల్నాటి యుద్ధరంగ మయిన 'కార్యంపూడి' (కారెంపూడి) ని, వేంగీ కోటను, శాతవాహన రాజైన ఆంధ్రవిష్ణువు రాజధానిని, అజంతా, ఎల్లోరా, ఎలిఫెంటా గుహలను, హరిద్వార్, హృషికేశ్‌లను చాలా సంవత్సరాల తర్వాత చూశాను.

మా జిల్లా పచ్చిమిరపకాయలు, దోసకాయలకు పెట్టింది పేరు. నేను, నా తమ్ముడు వెంకటప్పయ్య కమ్మని గుంటూరు నెయ్యి, కొరవికారం, దోసకాయతో

కలిపిన ఉడుకుడుకు అన్నం మా అమ్మ పెడ్తే తిన్న అనుభవం నా మనస్సులో ఇప్పటికీ నిలచి ఉంది.

మా నాన్న కిరీటంలాగా తలపాగా చుట్టుకొని, గవిసెనలు కట్టిన కోడెలతో, రంగురంగుల చంద్రకోల చేతబట్టి, ఎద్దులబండిలో నన్ను, నా తమ్ముళ్ళను, మా అమ్మను కోటప్పకొండకు తీసుకెళ్ళటం ఇంకా గుర్తుంది. కోటప్పకొండ తిరునాళ్ళ శివరాత్రి ఒక్కరోజే అమావాస్యనాడు జరుగుతుంది. ఆకాశం అంత ఎత్తుండే ప్రభలు కట్టుకొని ప్రజలు వివిధ వాయిద్యాలతో శివుణ్ణి కోటప్పకొండలో దర్శించుకుంటారు. లక్షల సంఖ్యలో ప్రజలు ఇక్కడకు వస్తారు. నేను ఎంతో ప్రపంచాన్ని చూశాను. ఈ ప్రయాణ అనుభవం ప్రత్యేకమయింది.

మా తండ్రిగారు నన్ను, వెంకటప్పయ్యను సంవత్సరానికొకసారి గుంటూరు తీసుకొని వెళ్ళేవారు. గుంటూరులో 'వడ్లు' అమ్మేవాళ్ళం. రాత్రి బయలుదేరి తెల్లవారేసరికి గుంటూరు చేరేవాళ్ళం. అక్కడ కమీషను ఏజెంటు దగ్గర డబ్బులు లెక్కచూసి మా నాన్నకిచ్చేవాడిని. దొంగల భయం ఉండేది. ప్రయాణం చాలా జాగ్రత్తగా చేయవలసివచ్చేది.

1916–17 లలో ఆంజనేయులు మిత్రులతో కలసి భారతదేశ పర్యటనకు వెళ్ళాడు. పూరీ, కలకత్తా, బుద్ధగయ, వారణాసి, ప్రయాగ, ఢిల్లీ, కురుక్షేత్ర, హృషికేశ్, బొంబాయి, పండరీపురం, హైదరాబాద్‌లను చూశాడు. ఆంజనేయులు ఈ విశేషాల నన్నింటినీ ఉత్తరాలలో తెలియపర్చేవాడు. కాశీలో పండాల దురాశ నా మనస్సులో చాలాకాలం నిలిచిపోయింది. ఢిల్లీ పేరు గొప్ప ఊరు దిబ్బ. దానిలో సమాధులు మినహా బ్రతికినవారు ఎవరూ ఉన్నట్లు లేరు. పంజాబీల స్ఫురద్రూపం, పార్శీల అందం ఆంజనేయులును ఆకట్టుకొంది. విశాలమైన అవగాహన, చిత్రదర్శనానుభవం నాకు ఆంజనేయుల ఉత్తరాల ద్వారా కలిగింది. భారతదేశ చరిత్రపైనా అవగాహన పెరిగింది. మన బిడ్డలు, రైతులు ప్రయాణాలు చేసి అనుభవం సంపాదించుకోవాలి. శ్రీ యన్. వీరాచారి, శ్రీ వి.వి. రమణలు స్వాతంత్ర్యానంతరం ఈ పర్యటనలను ఏర్పాటుచేశారు. యువకుడు కె.వి. సుబ్బయ్య ఈ పర్యటనను గూర్చి అద్భుతంగా వ్రాశాడు.

నేను 1919 లో మద్రాసు, 1920 లో కాకినాడ, రాజమండ్రి, మచిలీపట్నం వెళ్ళాను. అవేవీ నాకు క్రొత్తగా కనుపించలేదు. ఆంజనేయులు తన పర్యటనలో ఈ పెద్ద పెద్ద బజార్లు, వీధులు, మేడలు అన్నీ చూచినట్లుగా వివరించాడు. మద్రాసులో ఆహారం ప్రత్యేకం. తమిళ రుచికి అనుగుణం. నేనీ తమిళ భోజనానికి అలవడ్డాను. బెంగాలీ వంటకాలు నాకు సరిపడలేదు. బొటానికల్ గార్డెన్స్, విశాలమైన మైదానాలు, ఆకట్టుకునే విగ్రహాలు, విక్టోరియా జ్ఞాపిక, యూనివర్సిటీ హాలు - ఇవన్నీ నా మనస్సును హత్తుకొన్నాయి. కలకత్తాలో విద్యాసాగర్ పార్కు, అక్కడి ఫౌంటెన్ నన్ను ఆకర్షించాయి. వీరేశలింగం గారు ఈశ్వరచంద్ర విద్యాసాగర్ జీవితకథ తెలుగులో వ్రాశారు. భర్తృహీనలయిన హిందూ స్త్రీల కొరకు విద్యాసాగర్ పాటుపడ్డాడు. బ్రిటీషు వైస్‌రాయ్ అడిగినా తాను చొక్కా ధరించలేదు.

ఇక్కడ గంగానదిని హుగ్లీనది అని పిలుస్తారు. ఈ పిలుపు నాకు నచ్చలేదు. రామకృష్ణపరమహంస ఇదే కాళీఘాట్‌లో రోజూ స్నానం చేసేవారని తెల్సింది. వివేకానందుడు, సోదరి నివేదిత వ్రాసిన పుస్తకాలలో చదివాను. నా బుల్లి బుర్రకు అప్పుడివన్నీ పెద్ద పెద్ద విషయాలు. గేదె తిన్న దెబ్బలు రామకృష్ణ పరమహంస ఎలా భరించిందీ నాకు ఆశ్చర్యం కలిగించింది.

కలకత్తా నుండి వస్తూ 'చిలుక సరస్సు'ను చూశాను. ఆ సంధ్యాసమయంలో నా మనస్సంతా ఆ 'చిలుక సరస్సు' దోచింది. చాలా సంవత్సరాల తరువాత భారతీదేవికి కూడా ఇదే అనుభవం కల్గింది.

కాకినాడలో రఘుపతి వేంకటరత్నంగారిని దర్శించుకొన్నాను. దళితులను తన బిడ్డలుగా పెంచుకున్నాడు. వీరికి బ్రిటీషు ప్రభుత్వం 'నైట్‌హుడ్' ఇచ్చి గౌరవించింది. మద్రాసు విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా ఎన్నికైనారు. వీరి ఆత్మకథను వీరేశలింగంగారు వ్రాశారు. శ్రీ గోపాలక్రిష్ణయ్యగారు వీరి 'షేక్స్పియర్ ఇంగ్లీషు'ను గొప్పగా చెప్పేవారు.

రాజమండ్రి వచ్చాను. ఆంధ్రుల అన్నపూర్ణ గోదావరి నదిని చూశాను. టౌనుహాలును, భర్తృహీనలైన స్త్రీల గృహాలను, ఆశ్రమాన్ని, నా గురువుగారైన వీరేశలింగంగారు కట్టించిన హైస్కూలును చూశాను. రెండు సంవత్సరాల

క్రితమే వారు చనిపోయారు. వీరేశలింగంగారు ఆర్థికంగా మధ్యతరగతివారు. బ్రాహ్మణుడు, ఉపాధ్యాయుడు, సంఘసంస్కర్తలలో మొదటి తరానికి చెందిన వాడు. 1860-1918 ల మధ్య జీవించాడు. అర్థంలేని సంప్రదాయాలు, ఛాందసత్వం, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, నిస్సహాయులకు, అణగదొక్కబడ్డ వారికి అండగా నిలిచాడు. వందకు పైగా గ్రంథాలు తెలుగులో గద్యంలో వ్రాశాడు. నేను రెండు రోజులు రాజమండ్రిలో ఉండి, గోదావరిలో స్నానంచేసి ఇంటికి తిరిగివచ్చాను.

పాశ్చాత్య విద్యాలయాల్లో చదువుకోవాలనే కోర్కెను మా నాన్నగారికి చెప్పాను. ఆర్థికంగా తూగలేమేమో అని మంగమ్మమ్మ భయపడింది. నేను గుంటూరు క్రిస్టియన్ కాలేజీలో చేరాను. ఆంజనేయులు మా తండ్రిగారితో మాట్లాడి, మద్రాసు వెళ్ళి పాసుపోర్టు తెచ్చుకోడానికి ఒప్పించాడు. నేను మద్రాసు మేయర్ పి.టి.చెట్టిగారిని కలిశాను. 'లండను వెళ్తున్నావా?' అని వారడిగారు. మా తండ్రిగారికి నేను ఐ.సి.యస్. చేయాలని ఉందని, కానీ నేను విద్యాధికుడనై తిరిగివచ్చి స్వరాజ్యం కొరకు పనిచేయాలని ఉందని చెప్పాను. వారు చాలా ఉదారులు. 1920 లో మద్రాసు ముఖ్యమంత్రిగా అవకాశం వచ్చినా, వృద్ధాప్యం రీత్యా శ్రీ సుబ్బరాయరెడ్డిగారి పేరు సూచించి తాను తప్పుకున్నారు. వారికి కృతజ్ఞతతో 1930 లో నేను వ్రాసిన 'ది ఎకనామిక్స్ ఆఫ్ హాండ్‌లూమ్స్ ఇన్ ఇండియన్ ఎకనామిక్స్' (The Economics of Handlooms in Indian Economics) అనే గ్రంథాన్ని అంకితమిచ్చాను. అప్పటికి వారు చనిపోయారు.

నేను ఇంగ్లాండుకు బయలుదేరే ఉదయమే పాసుపోర్టు అందింది. శ్రీ జంపాల సాంబయ్యగారు నా ప్రయాణపు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అంతకు క్రితంరోజు వీడ్కోలు సభ మా గ్రామంలో జరిగింది. ఈ సభలో 'రైతు' పత్రికకు శ్రీ త్రిపురనేని రామస్వామిగారు 'ఎడిటరు'గా ఉంటారని ప్రకటన చేయబడింది. రామస్వామిగారు నా ధ్యాసంతా చదువుమీద ఉంచవలసిందని చెప్పారు.

మంగమ్మమ్మ తన దుఃఖాన్ని బయటకు కన్పించకుండా బెట్టుగా ఉంది. సోదరి లక్ష్మమ్మ మాత్రం చాలా సంతోషంగా ఉంది. మా తండ్రిగారు నా

ప్రయాణానికి తగిన ఏర్పాట్లు చేశాడు. భట్రాజులు వచ్చి 'రాచగోచి' ఇచ్చి నేను 'పాంట్లు' ధరించే వరకు దీనిని ధరించమని చెప్పారు.

లేనిపోని ఆడంబరాలు మా తండ్రిగారికి ఇష్టంలేదు. నేను శ్రీ వెంకయ్య, శ్రీ కందుకూరి వీరేశలింగంల ప్రభావంతో సామాన్య జీవితం గడపదలచు కొన్నాను.

గ్రామీణ సాంఘిక వాతావరణం

నేను ఆగస్టు 15, 1957 న ఎఱ్ఱకోటలో (Red Fort) ఉన్నాను. గత పది సంవత్సరాల చరిత్రకు ఈ 'రెడ్‌ఫోర్టు' సాక్షి. మొదట్లో (1947) ఎండ చాలా ఎక్కువగా ఉండేది. నేడు చల్లగా చిరుజల్లులు పడుతున్నాయి. నా మనస్సులో రెండవ పంచవర్ష ప్రణాళికకు డబ్బులెక్కడ నుండి తేవాలన్న ఆలోచన చోటుచేసు కున్నది. ప్రధానమంత్రిగారు (నెహ్రూ) నాటి స్వాతంత్ర్య సమరయోధులను గురించి, ప్రథమ స్వాతంత్ర్య సమరాన్ని గురించి మాట్లాడుతున్నారు. నా మనస్సు గతంలోకి తొంగిచూచింది. 14వ శతాబ్దంలో మూడుసార్లు గోదావరి తీరంలో, 17వ శతాబ్దంలో కృష్ణాతీరంలో ముస్లిం దాడులను త్రిప్పికొట్టిన ఆంధ్రుల పౌరుష ప్రభావాలను నెమరువేసుకుంటున్నాను. మూడు శతాబ్దాల క్రితం పృథ్వీరాజ్ రాథోడ్ మన స్వాతంత్ర్యాన్ని (ముస్లింల నుండి) రక్షించాడు. ప్రతాప రుద్రుడు, ప్రోలయ్య, కాపయ్యలు ఆంధ్రదేశ విముక్తికై యుద్ధాలు చేశారు. నేతాజీ సుభాష్‌చంద్రబోసు దేశ స్వాతంత్ర్యం కోసం ఇటువంటి ప్రయత్నమే చేశాడు.

గాంధీగారి నాయకత్వంలో జరిగిన స్వతంత్ర పోరాటాన్ని గురించి నెహ్రూ గారు చెప్తున్నారు. గత శతాబ్దాల చరిత్ర నెమరువేసుకొంటున్నారు. లక్షలమంది దక్షిణాది నాయకులు గతంలో ముస్లింలపై యుద్ధాలు చేశారు. వీరెవరికీ దాసులు కాదు. వీరెవ్వరికీ యజమానులు కూడా కాదు. దేశ స్వాతంత్ర్యం కోసం నిలచి పోరాడినవారు.

మా ఊరిలో 'ఓరుగల్లు' ఇంటిపేరున్న వారున్నారు. మా మేనమామ ఇంట పెద్ద బుట్ట, ఒక పెద్ద కత్తి, చిన్న చిన్న కత్తులు ఉండేవి. డాలు కూడా ఉండేది.

ఈ బుట్టను అతి పవిత్రంగా భావించేవారు. ఈ ఆయుధాలు కాకతీయుల కాలంలో, తరువాత విజయనగర రాజుల కాలంలో మా పూర్వీకులు వాడి ఉండవచ్చు. సంవత్సరానికొకసారి దేశం కోసం ప్రాణత్యాగం చేసినవారిని స్మరించేవాడిని.

మా మేనమామ - వారి భార్య లక్ష్మీదేవి

రామస్వామిగారు చామనచాయగా ఉండేవారు. అందరితో కలివిడిగా ఉండేవారు. ఉదారగుణం కలవారు. డబ్బును లెక్కచేసేవారుకాదు. వారి తండ్రి రమణయ్యగారిచ్చిన డబ్బును కూడా ఖర్చుచేశారు. వారు కవులకు, కళాకారులకు అండగా ఉండేవారు. దళితుల నాదుకునేవారు. వారి భార్య లక్ష్మీదేవి చాలా అందమైనది.

బాల్యం నాకింకా గుర్తుంది. చింతచెట్లు ఎక్కేవాడిని. 'బలిగుడు' (చెడుగుడు) ఆడేవాడిని. ఈ ఆట ఎంత బీదవారైనా ఆడవచ్చు. (ఈరోజులలో ఇదే చాలా ఖరీదైంది). ఉయ్యాలలూగేవాడిని. మా గ్రామంలో చాలా చెరువులున్నాయి. 'గోభూమి'కి ఎదురుగా ఒకటి, రాజకీయ పాఠశాలకు ఎదురుగా వేరొకటి, శివునిగుడి కెదురుగా, ఎలిమెంటరీ స్కూలు ముందర పెద్దచెరువు ఉన్నాయి. ఒక చిన్న పడవ కూడా ఉండేది. ఈ చెరువులలో ఎవరినీ ఈత కొట్టనీయరు. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో తెప్పతిరునాళ్ళ జరుపుతుంటారు.

గ్రామీణ పండుగలు

ప్రతి సంవత్సరం వైశాఖమాసంలో భావనారాయణస్వామివారి ఉత్సవము జరుగుతుంది. సంవత్సరానికి కావలసిన వ్యవసాయ పరికరాలను రైతులు ఈ తిరునాళ్ళలో కొనుక్కొంటారు. సన్నాయి, తబలా వాయిద్యకారులు, భరతనాట్య కళాకారులు ఈ తిరునాళ్ళకు వచ్చేవారు. చేతితో చేసిన అందమయిన బొమ్మలు ఇక్కడ దొరికేవి. చాలాదూరం నుండి వచ్చిన జనం వీటిని కొనేవారు.

మా ప్రక్క గ్రామమయిన 'గోవాడ'లో శివరాత్రి జరపాలని గ్రామస్థులను కొన్నారు. ప్రభలు కట్టుకొని 'కోటప్పకొండ'కు వెళ్ళినట్లుగా ఇక్కడకు కూడా

ప్రజలు వచ్చేవారు. 1910 లో రామస్వామిగారితో కలసి నేనీ ఉత్సవాన్ని చూశాను.

సంగంజాగర్లమూడి, మర్రిపూడి, అప్పికట్ల బ్రాహ్మణులు యజ్ఞం చేయాలని నిర్ణయించుకొని ఆరు సంవత్సరాల పర్యంతం ఈ మూడు గ్రామాల్లో యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్రజాతికి ఒక లక్షమందికి భోజనాలు ఏర్పాటు చేశారు. పది లక్షలమంది సామాన్యజనం ఈ యజ్ఞాన్ని చూడటానికి వచ్చారు. భారత ప్రవచనాలు, భజనలు, ఊరేగింపులు జరిగేవి. అప్పికట్ల గ్రామస్థులు విష్ణ్వాలయంలో ఏభయి సంవత్సరాలుగా ఈ పండుగ జరుపుకుంటున్నారు. అంగలకుదురులో శ్రీరామ కథోత్సవాలు ఏప్రియల్ 1928 న జరిగాయి. రెండు లక్షలమంది బీదలకు అన్నదానం చేశారు.

వివిధ అభిరుచులు

వీరేశలింగంగారి రచనలు, సి.ఆర్. రెడ్డిగారి వ్రాతలు, త్రిపురనేని రామస్వామి గారి విమర్శలు నన్ను ప్రభావితుడ్ని చేశాయి. సుమతి, వేమన కవిత్వాలు నన్నాకర్షించాయి.

'రాళ్ళు దేవుళ్ళయిన రాసులు మ్రింగవా' అని వేమన అన్నాడు.

'కలకంఠి కంట నీరొలికిన ఇంట సిరి ఉండనొల్లదు' అని సుమతి చెప్పాడు.

'వడిగల ఎద్దులు కలిగిన మడిదున్నిక బతకవచ్చు' అని వ్యవసాయదారులను గూర్చి,

చదువు రానివాడిని పెద్దచేయటం 'కనకపు సింహాసనమున శునకమును కూర్చుండబెట్టి'నట్లుగా ఉంటుందని,

సిరి దావచ్చిన వచ్చును సలలితముగ
నారికేళ సలిలము భంగిన్
సిరి దాబోయిన బోవును
కరి మ్రింగిన వెలగపండు కరణిని సుమతీ! అని ధనాన్ని గూర్చి,

'బండ్లు ఓడలు కావటం – ఓడలు బండ్లు కావటం' – అదృష్ట దురదృష్టాలను గూర్చి,

'కొండ అద్దమందు కొంచమై ఉండదా' అని వినయవంతుడ్ని గూర్చి శతక కర్తలు చెప్పారు.

అలాగే జీసస్ బోధలు, భర్తృహరి సుభాషితాలు కూడా చదివాను. ఇవన్నీ నా మనస్సుకు పట్టినయ్.

భాగవతం అనువాదం చేసిన పోతన నాకు చాలా ఇష్టం. గొప్ప భక్తుడు. గొప్ప కవి. వారి పద్యాలను నేడు కూడా మననం చేసుకుంటుంటాను. 'కారే రాజులు రాజ్యముల్ కలుగవే–శిబిచక్రవర్తిని ఈరోజులలో ఎవరైనా మరచారా?' అని శుక్రాచార్యునికి బలి ఎంత గొప్పగా చెప్పాడు? కోయిలలు మధురంగా పాడే మామిడి తోటల్లో మగ్గాల ధ్వని వినపడుతుంటే ఎంత బాగుంటుంది? చింతచెట్లు ఎంత ఉపయోగకరం! మఱ్ఱిచెట్టు పశుపక్ష్యాదులకు ఎంత నీడ నిస్తుంది. గ్రామీణ రసజ్ఞతకు ఆనాటి రూపశిల్పులు ఎంతో దోహదం చేశారు. నేను స్కూలులో చేరకముందే వీటన్నిటినీ మంగమ్మమ్మ దగ్గర నేర్చుకున్నాను. స్కూలులో చేరిన తరువాత 'వర్డ్సువర్త్' (Wordsworth) లాంటి వెంకయ్య పంతులుగారు ఇవన్నీ చెప్పేవారు.

సమాజంలో నా పాత్ర

అనిబిసెంటుగారు, శంకరనారాయణగారూ గ్రామాల్లోని ప్రజాస్వామ్యాన్ని గురించి చెప్పారు. నేను గ్రామాల భవిష్యత్‌ను గురించి, పంచాయితీల స్వయం పాలన గురించి కలలు కనటం మొదలుపెట్టాను. మాంటేగుగారు ఓటు విశిష్టత గురించి తెలియజేశారు. ఈ విషయాన్ని రామకోటేశ్వరరావుగారు చిన్న కరపత్రంలో ప్రచురించారు.

ఈ ఆరు సంవత్సరాలు ప్రజలలో ఒకడిగా, లైబ్రరీలకోసం, పిల్లల చదువు కోసం, రాత్రి బడులలో చేర్చటంకోసం వారి ఇళ్ళకు వెళ్ళి వారి ఇంటి ముందు ఒక బుట్ట పెట్టేవాడిని. ఇష్టమున్న రైతులు బీద గ్రామీణ విద్యార్థులకోసం బియ్యాన్ని ఈ బుట్టలో వేసేవారు. లైబ్రరీ పుస్తకాలను రైతుల ఇళ్ళలో ఇచ్చేవాడిని. నలభయ్ సంవత్సరాల తరువాత కూడా 1920 లో నేను, నా స్నేహితులు చేసిన పనులు ఇంకా గుర్తున్నయ్.

శ్రీరామనవమికి, జన్మాష్టమికి, వినాయకచవితికి, విజయదశమికి, సంక్రాంతికి, పంటల పండుగలకు రైతులు ఖర్చుపెట్టే ఆచారం ఆనాడు ఉండేది.

పెద్దవారి తగాదాలు

బ్రిటీషువారిపై కుట్ర చేశారని బాలగంగాధరతిలక్‌కు ఆరు సంవత్సరాల జైలుశిక్ష విధించారు. వీరు జైలు నుండి విడుదలయిన సందర్భంగా ప్రజలు వీరికి లక్ష రూపాయలు బహూకరించారు. 'స్వరాజ్యం నా జన్మహక్కు' అనే వారి నినాదానికి ప్రజలు పోటెత్తారు. గోపాలకృష్ణగోఖలేగారికి తిలక్‌గారంటే పడదు. ఈ పెద్దల ప్రవర్తన నాకర్థంకాలేదు. నేను ఇంగ్లాండు వెళ్ళిన తరువాత అనిబిసెంటు గాంధీగారి సహాయ నిరాకరణోద్యమాన్ని వ్యతిరేకించింది. గాంధీ గారిని నానామాటలు అన్నది. శ్రీనివాసశాస్త్రి కూడా అలానే ప్రవర్తించాడు. నేను వీరి ప్రవర్తనను ఖండించాను (1921 లో).

1920 లో స్వామి దయానందసరస్వతి వ్రాసిన 'సత్యార్థప్రకాశిక' తెలుగులో చదివాను. కుల నిర్మూలన కోసం, అంటరానితనం నిర్మూలనం కోసం వారు వ్రాసిన విషయాలు ఎంతో గొప్పగా ఉన్నాయి. 1949 లో అజ్మీరులో స్వామివారు తపస్సు చేసిన భవనాన్ని చూశాను.

చాలామంది మాటకు–చేతకు భిన్నంగా ఉంటారు. న్యాయానికి–సాంప్ర దాయానికి దాసులుగా ఉంటారు. నా అలవాటు దీనికి భిన్నం. చివరి రోజులలో గాంధీగారు ఇదేవిధంగా ప్రవర్తించేవారు. భారతీయ వేదాంతులు ఆలోచనలకు, ఆచరణకు ప్రాధాన్యాన్నిచ్చారు. పద్నాలుగు సంవత్సరాల వయస్సులో నేనీ విషయాలలో జాగ్రత్తపడ్డాను. నేను అంటరానితనానికి వ్యతిరేకిని. వివిధ కులాలు – మతాలవారితో కలిసి ఉండేవాడిని. వీరేశలింగంగారు, దయానందసరస్వతి గార్లు విగ్రహారాధనను, శక్తి ఉపాసనను వ్యతిరేకించారు. వారి బాటలో నడవాలని మా గ్రామంలో జనంపై ఒత్తిడి తెచ్చాను. 1933 లలో రవీంద్రనాథ్ టాగూర్ గారు 'గోరా' నవలలో చిత్రీకరించిన మానసిక, నైతిక, సాంఘిక పరివర్తన 1916–20 లలో నావంటి గ్రామీణ యువతలో వచ్చింది.

యునైటెడ్ నేషన్స్ ఆఫ్ అమెరికా నా జీవితంలో ఎలా ప్రవేశించింది?

శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు వ్రాసిన అబ్రహామ్‌లింకన్ జీవితాన్ని స్కూలు రోజులలోనే చదివాను. 1917 లో ప్లూటార్క్ తెలుగు అనువాదాలు, ముఖ్యంగా బెంజమిన్ ఫ్రాంక్లిన్ జీవితచరిత్రను చదివాను. అమెరికాలో నీగ్రోలు ఎలా విముక్తి చెందినది తెలుసుకున్నాను. మన దేశంలో దళితులుగా పిలువ బడుతున్న పంచముల విముక్తి కొరకు కలలు కన్నాను.

ఒక దేశం వేరొక దేశాన్ని తన కాళ్ళ క్రింద తొక్కివేయడాన్ని నిరసిస్తూ భారత స్వాతంత్ర్యవాదులు చేసిన ప్రకటన చీకటిలో వెలుగుచుక్కలాగా కన్పిం చింది. ఉడ్రోవిల్సన్ పద్నాలుగు సూత్రాలను చెప్పాడు. భారతీయులు ఆనంద పరవశులైనారు. భారత ప్రథమ న్యాయాధికారి సర్. సుబ్రహ్మణ్య అయ్యర్ ఈ సూత్రాలు భారత్‌కు అన్వయించవన్నాడు. తమ సొంత విషయాలలో తలదూర్చ వద్దని ఉడ్రోవిల్సన్‌ను ఇంగ్లాండు ప్రభుత్వం హెచ్చరించింది. భారతదేశానికి ఈ చిన్న ఆశ కూడా లేకుండాపోయింది.

'నానాజాతిసమితి'లో భారతదేశం సభ్యురాలైంది. లార్డు సిన్హా, బికనీరు మహారాజా సంతకాలు చేశారు. దేశంలో 'హోమ్‌రూల్' ఉద్యమం ఊపందు కున్నది. భారత సైనికులకు 'విక్టోరియా క్రాస్'లు ఇచ్చారు. ఈ క్రాస్‌లకు బదులు భారతదేశానికి స్వతంత్రం ఇస్తే బాగుండేది కదా!

పల్లెలు - పట్టణాలు

గతంలో గ్రామీణ భారతదేశానికి, పాశ్చాత్య దేశాలకు మధ్య చాలా కాల విలంబముండేది (Timelag). ప్రపంచముపై రష్యా విప్లవ ప్రభావం నేనప్పటికి ఎరుగను. ఉడ్రోవిల్సన్ పద్నాలుగు సూత్రాలు కానీ, నానాజాతి సమితి గానీ ఎలా ఉపయోగపడుతుందో నాకు తెలియదు. పారతంత్ర్యానికి చివరి మెట్టుగా జమీందార్ల జులుంను భావించేవారం. ఈ దేశానికి ఐ.సి.యస్. చదివినవారు ఎలా ఉపయోగపడతారో విద్యావంతులకు కూడా అర్థంకాలేదు. ఐ.సి.యస్. చదువే జీవిత పరమావధా?

రౌలట్ చట్టాన్ని మితవాది అయిన శ్రీనివాసశాస్త్రిగారు కూడా వ్యతిరేకించారు.

జలియన్‌వాలాబాగ్ దురంతానికి వ్యతిరేకంగా మేమంతా నిరాహారదీక్షకు కూర్చున్నాము. దేశంలో జరుగుతున్న మార్పులు మాకు పూర్తిగా అర్థంకాలేదు. ప్రజలు 1920, 1930, 1931 లలో ఉద్యోగావసరాన్ని గుర్తించారు.

ప్రయాణం

నేనా రోజులలో బ్రాహ్మణులలాగా 'పిలక' పెట్టుకొనేవాడిని. సూటు వేసుకొని నిడుబ్రోలు నుండి బయలుదేరాను. 'టై' కట్టుకోవటం కూడా నాకు రాదు. నేను పూర్తిగా శాకాహారిని. స్టీమరు ఎక్కిన తరువాత మాంసాహారిగా మారాను. ఐరోపా ఖండంలో ఆరోజులలో శాకాహారిగా గడపటం కష్టం. కాఫీ, టీ తాగటం, కత్తులు, ఫోర్కులు ఉపయోగించటం నాకు కొత్త. టేబులు మానర్సుకు నేను అపరిచితుడ్ని.

300 మంది భారతీయ విద్యార్థులు, ఒక వందమంది ఐరోపావారు యస్.యస్. లాయల్‌టీ అనే సింధియా కంపెనీవారి ఓడలో ఆనాడు ప్రయాణించాం.

పి.సి. రే గారితో నా పరిచయం

సర్ పి.సి. రేగారు మాతోపాటే ఆ స్టీమరులో ప్రయాణించారు. వారు రసాయనశాస్త్రంలో ప్రసిద్ధులుగా నాకు తెలుసు. వారి త్యాగాలు కూడా నాకు తెలుసు. వారు 1917-18 లలో గోపాలకృష్ణగోఖలే హాలులో చేసిన ఉపన్యాసం నేను చదివాను. వెంకయ్యగారు వీరిని గురించి, గోపాలకృష్ణగోఖలే గురించీ నాకు చెప్పారు. వారితో కలసి మొదటి తరగతి ప్రయాణీకునిగా నేను ప్రయాణం చేయటం నా అదృష్టం. నేను ఏ యూనివర్సిటీలో చేరేది, ఏ సబ్జక్టు చదివేది తెలియదు అని చెప్పగా విని వారు ఆశ్చర్యపోయారు. స్వాతంత్ర్యముపై నాకున్న అభిరుచిని తెలుసుకొని నన్ను అభినందించారు. రామమోహనరాయ్, బంకించంద్ర చటర్జీ, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, రవీంద్రనాథ్ టాగూర్‌ల గురించి ప్రశ్నలడిగేవాడిని. అప్పటికే వారి జీవితచరిత్రలు తెలుగులో చదివాను. వారు రసాయనశాస్త్రంలో ప్రశ్నలకు చాలా సంతోషించేవారు. ప్రతిరోజు నడుస్తున్న

డెక్‌పై కూర్చొని వారితో కాలం గడిపేవాడిని. వారి స్నేహంతో నేను ఇంటిపై దిగులు వదిలిపెట్టాను.

హిందూమహాసముద్రం అల్లకల్లోకంగా ఉంది. ఎర్రసముద్రం అంత భయం కరంగా లేదు. మధ్యధరా సముద్రం ఆరోజులలో భీతావహంగా ఉంది. మూడు వారాలు ప్రయాణం చేసి 'మార్‌సెయిల్స్' (ఫ్రాన్సు) చేరాము. మార్‌సెయిల్స్ జాతీయగీతం నాకు గుర్తుంది. ఫ్రెంచివారు నవ్వుముఖాలతో, ముద్దుగా, బొద్దుగా, తెల్లగా ఉన్నారు. మాకు రైలులో బెర్తులు ఇచ్చారు. మరుసటి ఉదయం చలికి వణికిపోతూ నిద్రలేచాను. చెట్లతో పచ్చగా ఉన్న ఫ్రాన్సు గ్రామసీమలు, వరుసలు వరుసలుగా కట్టబడ్డ ఇళ్ళు, పొగగొట్టాలు, సన్నటి నీటిజాలులు నా మనస్సుపై బలమైన ముద్ర వేశాయి.

వారి అలవాట్లు భారతీయ విద్యార్థులకు ఆశ్చర్యంగా ఉన్నాయి. మగవాళ్ళను మగవాళ్ళు ముద్దుబెట్టుకోవటం వింతగా ఉంది. ఇంగ్లీషు ప్రయాణీకుడ్ని ఈ విషయమై అడిగాను. 'అది ఫ్రెంచి పద్ధతిలే' అని అతను బదులిచ్చాడు. రైన్ మరియు రోన్ (Rhine and Rhone Rivers) నదులు పొన్నూరు ప్రక్కనున్న తుంగభద్ర కాలువకంటే పెద్దవి కావు.

మార్‌సెయిల్స్ నుండి రైలులో బయలుదేరి రాత్రి పొద్దుబోయిన తరువాత ఇంగ్లీషు ఛానల్‌ను దాటి, సెప్టెంబరు 20వ తేదీన లండను చేరాము. గాడ్స్ స్ట్రీట్ (Gods Street) లో ఉన్న షేక్స్పియర్ హట్ (Y.M.C.A.) కు తీసుకొని వెళ్ళారు. టూర్ సెక్రటరీ మమ్మల్ని దుప్పట్లపై గాకుండా దుప్పట్లలో పడుకో మన్నాడు.

నా మెట్రిక్యులేషను సర్టిఫికెట్టు అక్కడ యూనివర్సిటీలో చదవటానికి సరిపోదని మరుసటి రోజు మధ్యాహ్నానికి అర్థం అయింది. చాలా నిరాశ చెందాను. ఎవరు సాయం చేశారో నాకు గుర్తులేదు. వి. రామకృష్ణకు టెలిగ్రాము ఇచ్చాను. రామకృష్ణగారిని నేను 1918 లో మా గ్రామంలో కలుసుకున్నాను. రామకష్ణగారు, టి.బి. రావుగారు నన్ను 'సెయింట్ కాథలిన్స్'లో ఉన్న బేకరు గారి దగ్గరకు తీసుకొనివెళ్ళారు. బేకరుగారు ఎంట్రన్స్ పరీక్ష (ప్రవేశ పరీక్ష)

పాసు అయితే తప్పనిసరిగా ఆక్స్‌ఫర్డ్‌లో సీటు ఇస్తానని మాట ఇచ్చారు. రామకృష్ణ నా ప్రవేశ పరీక్షకు ట్యూషన్ చెప్పాడు.

రెండు మైళ్ళ దూరంలో ఉన్న 'బాట్లీ' గ్రామానికి మారాము. రామకృష్ణగారు, టి.బి. రావుగారు ఎల్మ్‌ఫామ్‌లో, నేను ఎల్మ్ లాడ్జిలో అన్ని వసతులు ఉన్న ఒక కొత్త ఇంటిలో నివసించేవాళ్ళం. ఆక్స్‌ఫర్డ్ పెద్ద పట్టణం కాదుగానీ అధునాతన సౌకర్యాలన్నీ అక్కడ ఉన్నాయి. బాట్లీ గ్రామానికి వెళ్ళటం నాకో వరం. అక్కడి కాలిబాటలు, సన్నని గొందులు నాకు పరిచయమయ్యాయి. పక్కనే ఉన్న గ్రామాలు 'ఎన్‌షాల్', 'కమ్‌నర్'కు నేను నడచి వెళ్ళేవాడిని. సన్నని పాము వలె ప్రవహించే 'థేమ్స్' (Thames) నది, 'ఇసిస్' నది నాకు ప్రీతిపాత్రమైనవి.

ఇక్కడ ఎల్మ్స్ (Elms), ఓక్స్ (Oaks), చెస్ట్‌నట్స్ (Chest Nuts), పాపులర్ (Popular) చెట్లు నాకు భారతదేశంలోని నేరేడు, చింత, రావిచెట్ల వలె స్నేహాస్పదమయినవి.

ఇంగ్లీషు గ్రామీణ జీవితానికి నేను పరిచయమయ్యాను.

★ ★ ★

రామానీడు బిల్డింగ్స్ – నిడుబ్రోలు.

2. నా పూర్వీకులు

గత రెండు సహస్రాబ్దాల నుండి నా పూర్వీకులు శ్రమజీవులు. వారు తమ దేశంకోసం యుద్ధాలు చేశారు. చాలా దేశాలలో వ్యవసాయదారులు ఇలానే ఉండేవారు. బౌద్ధం ప్రబలిన రోజుల్లో క్షత్రియులను ఆర్యుల, దస్యుల పూజారి గణం అణగద్రొక్కారు. వ్యవసాయదారులను పడమర క్షత్రియులని, గంగా పరీవాహక ప్రాంతంలో కర్మకారులు–కుర్మీలని, మహానది, గోదావరి, కృష్ణా, పెన్న, తుంగభద్ర నదుల నడుమ కమ్మవారని పిలిచేవారు. బౌద్ధులు సంస్కృత పదాలను సరళంగా పలుకుతారు. ఉదా : ధర్మ–దమ్మ, కర్మ–కమ్మ. స్వతంత్రులైన వ్యవసాయదారులను, ఒరిస్సాలోని మహానదికి దక్షిణంగా ఉన్నవారిని కమ్మవారు అనేవారు. వీరు క్షాత్రంలోనూ, క్షేత్రంలోనూ పేరుపొందారు.

కమ్మవారు బౌద్ధం నుండి హిందూమతం వైపు మళ్ళారు. ఈ కమ్మవారు గ్రామాల్లో గౌరవప్రదమైన భాగస్వాములయ్యారు. పొలాలపై ఉన్న గాఢమయిన అనురాగం వ్యవసాయ ఆధునికత, పోరాటపటిమ వీరికి బౌద్ధం నుండి హిందూ మతంలోనికి మారటానికి ఉపయోగపడింది.

వీరంతా ఒకే వంశానికి చెందినవారని చెప్పలేము. పల్లవుల నుండి చోళుల వరకు నిరంతరం ఈ వంశాలతో కలయికలు జరిగి ఉండవచ్చు. పల్లవ, రాష్ట్రకూట, చాళుక్య, చోళ వంశాలతో కలిసిపోయి ఉండవచ్చు. కమ్మవారికి వీరితో సంబంధ బాంధవ్యాలు ఉండవచ్చు. అందువల్లనే వీరి ఇంటిపేర్లు పాలక వర్గాల పేర్లుగా ఉన్నాయి.

పల్లవులు 5 నుండి 6 శతాబ్దాల (A.D.) వరకు, రాష్ట్రకూటులు 6 నుండి 8 శతాబ్దాల వరకు, చాళుక్యులు 9–10 శతాబ్దాల మధ్యకాలంలో, చోళులు

(చోడులు) 10 నుండి 11 వ శతాబ్దం వరకు పాలించారు. 11 నుండి 13 వ శతాబ్దంలో కాకతీయులు, 14 నుండి 17 వ శతాబ్దం వరకు విజయనగర రాజులు పాలించారు.

ఈ కాకతీయులెవరు? కమ్మవారు వీరిని తమ పూర్వీకులుగా చెప్పుకుంటారు. వెలమ, తెలగ, మున్నూరు కాపులందరికీ ఈ క్షత్రియ వారసత్వం ఉంది. చోళుల పరిపాలనానుభవం, చాళుక్యుల వంశాచారం, పల్లవుల నౌకా నిర్మాణ శక్తి వీరిలో కన్పిస్తాయి. వ్యవసాయంలో, యుద్ధాలలో, సాంస్కృతిక కార్యకలాపాలలో ఈ కాకతీయులు నాటి పాలకవర్గాలను గుర్తుచేస్తారు.

ఓరుగల్లు లేక వరంగల్లు నేలిన కాకతీయులు, విజయనగరం, చంద్రగిరి, రాయవెల్లూరు పరిపాలించిన 'రాయలు', మధుర, తంజావూరు నాయకరాజులు వివిధ శాఖలుగా, తెగలుగా తమ అంతర్వివాహాల వలన మారారు.

ఆంధ్రుల చరిత్ర, భారత ప్రజల చరిత్రకన్నా వేరయినదేమీ కాదు. సామాజికంగా యుద్ధబలం వలన కొన్ని తెగలు విడబడి రాచరికపు పోకడలు పోయాయి. ఈ వేరుబడటం నాటి సమాజపు బలహీనత. ఈ కారణంగానే ముస్లింలు, ఐరోపావారు మనపై ఆధిపత్యం వహించారు.

దూరదృష్టి లేని స్థానిక నాయకత్వం వలన, మూర్ఖత్వం వలన, మతపెద్దల వలన మరలా మరలా చీలిపోయిన కమ్మవారు సాంఘికంగాను, సైనికశక్తిలోనూ, సంఖ్యాపరంగానూ బలహీనపడ్డారు.

ఈ శ్రమజీవుల నుండి వెలమ, రెడ్డి, మున్నూరుకాపు, తెలగ, కొప్పుల వెలమ, గాజులచెట్టి, బలిజ, గౌడలు ప్రత్యేక శాఖలుగా ఏర్పడ్డారు. మిగిలినవారు ఈనాటి కమ్మవారు. వీరందరిలో పల్లవుల, రాష్ట్రకూటుల, చోళుల, కాకతీయుల, రాయల, నాయకుల వీరోచిత నాయకత్వ లక్షణాలు ఉన్నాయి.

మూడు వందల సంవత్సరాల కాకతీయ పాలనలో కమ్మవారిని నాయకులు, నాయనింగారు, నీడు, రాయుడు, రాయలుగా పిలిచేవారు. ముఖ్యులు మూడు వందల మందిని మున్నూరుకాపులనేవారు.

గణపతిదేవచక్రవర్తి కాకతీయులలో ప్రసిద్ధుడు. 'బాణసీమ'కు చెందిన గంగయ్యసాహిణి వీరి ప్రధాని. గణపతిదేవుని కూతురు రుద్రమదేవికి కూడా వీరు ప్రధాని. కడప జిల్లాలోని గంగినేనికొండను వీరి వారసులు నిర్మించారు. చిత్తూరు, నెల్లూరు, కృష్ణా, ఖమ్మం జిల్లాలోని గ్రామాలు వీరి పేరు పెట్టుకొన్నాయి.

ఈ నాయకులు అల్లావుద్దీన్ ఖిల్జీని, అతని సైన్యాధిపతి మాలిక్ కాఫర్‌ను ఎదిరించి నిలువరించారు. రుద్రమదేవి మనుమడైన ప్రతాపరుద్రుడు రెండుసార్లు ఈ ముస్లింలపై గెలిచాడు. మూడవసారి ఢిల్లీవారు వరంగల్లు నాయకులతో సంధి చేసుకున్నారు. కొన్ని తెగల, శాఖల నాయకులలో మతపరమైన విభేదాలు పొడసూపినవి. కొందరు ద్రోహం చేశారు. కొందరు యుద్ధరంగాన్నుండి వైదొల గారు. మాలిక్ కాఫర్‌ను కన్యాకుమారి వరకు అడ్డుకునేవారు లేకపోయారు. కాకతీయ నాయకత్వం దీనితో విచ్ఛిన్నమైంది.

నాయకులు ఈ విచ్ఛిత్తిని దిగమ్రింగి ఊరకుండలేదు. వారొక దశాబ్దంలోనే త్రిప్పుకొని, మూడు శతాబ్దాల కాకతీయ నాయకత్వాన్ని తిరిగి ప్రతిష్ఠించారు. విప్లవ ధ్వజం తిరిగి ఎగురవేయబడింది. మూడు వందల నాయకులు ఒక్కటి అయ్యారు. వరాహ పతాకం గంగినేనికొండ, ఇతర దుర్గాలపై రెపరెపలాడింది. కాపయ్యనాయకుని నాయకత్వంలో వీరందరూ వరంగల్లుపై దాడిచేసి, ప్రతాప రుద్రుని వారసునిగా ప్రోలయనాయకుని మహారాజుని చేశారు.

కాపయ్యనాయకుడు ప్రోలయ మహారాజు పినతండ్రి కుమారుడు. రెండు దశాబ్దాలు గోదావరి దిగువ భాగాన్ని పాలించాడు. శైవ, జైన, లింగాయత, వైష్ణవ,స్మార్త అనుయాయిలు, హిందూమతాభిమానులు ప్రశాంతంగా జీవించారు. వ్యవసాయం ప్రధాన వృత్తి అయిన కమ్మవారిని, ఇతర కులాలవారిని ఢిల్లీ చక్రవర్తుల దోపిడీ నుండి కాపయ్య రక్షించాడు. గంగయ్యసాహిణి కుమారులు, మనుమలు, ఇతర నాయకులు ఈ స్వాతంత్ర్య సమరంలో ప్రథమశ్రేణిలో నిల్చారు. వీరు ఢిల్లీ సుల్తానును పారద్రోలారు. ప్రోలయ తరువాత కాపయ్యను ఆంధ్రరాష్ట్ర అధ్యక్షునిగా నిలిపాడు.

వీరి వారసులు జాతి గౌరవం, స్వాతంత్ర్యంకోసం పోరాడిన నాయకుల గుర్తుగా తమ పేర్లను పెట్టుకున్నారు. నా ఇంటి పేరు అటువంటిదే. గంగయ్య సాహిణి కుమారులు, మనుమలు గంగినేనికొండను విముక్తం చేశారు. దక్షిణాపథ స్వాతంత్ర్యోద్యమంలో ప్రధాన పాత్ర వహించారు. ఆవిధంగా నా కుటుంబం గంగినేని, గోగినేని, గోవిడి, గంగా పేర్లతో పిలువబడుతోంది.

క్రీ.శ.1366 లో కాపయ్య వెలమలతో యుద్ధంలో మరణించాడు. కమ్మ, రెడ్డి, వెలమ, తెలగ, బోయ నాయకులుగా చీలిపోయారు. గంగినేని వంశంవారు వ్యవసాయదారులైనారు. తమ వీరత్వానికి గుర్తుగా తమ పూర్వీకుల కత్తులను పూజించేవారు. నా చిన్నతనంలో నేను, నా తమ్ముళ్ళు ఈ వెదురుబుట్టలలోని కత్తులను పూజించటం ఇంకా గుర్తుంది. వీరు ఎప్పుడు ఎలా ఈ ప్రాంతాలకు వెళ్ళారో నేను చెప్పలేను. కడప నుండి చిత్తూరులోని గంగినాయనిపాలెంకు; వరంగల్లు, ఖమ్మం జిల్లాలోని గంగినేనిపాలెంకు; కృష్ణా, గుంటూరు జిల్లాలోని గోగినేనిపాలెంకు వలసలు వచ్చారు. వరంగల్లు చేజారిన తరువాత వీరు ఈ ప్రాంతాలలో కొత్తగా గ్రామాలు నిర్మించుకొన్నారు.

తరువాత తరాలవాళ్ళు విజయనగర రాజుల వద్ద, ఆ తరువాత నాయక రాజుల వద్ద, వ్యవసాయంలోనూ, సైనిక వృత్తిలోనూ కొనసాగారు. వీరగంధం, వీరమాచినేని, వాసిరెడ్డి, వీరపనేని, సూరపనేని, సూరిరెడ్డి అనే ఇంటిపేర్లతో పిలువబడ్డారు.

ఈ మున్నూరు నాయకుల వీరోచిత కృత్యాలను భట్రాజులు, పిచ్చుకుంట్లు – నేటికీ పాడుతుంటారు.

నా పూర్వీకులు గంగినీడు, అంకమ్మ, నాగయ్య, ఆనందయ్య, అంకినీడు, అంకమ్మ గారలు కాకతీయ సామ్రాజ్య పతనం తరువాత ఎప్పుడు వరంగల్లు నుండి ఈ ప్రాంతాలకు వలస వచ్చారో చెప్పలేను.

నా పూర్వీకులేనాడూ పరాయి పాలనలో సైనికులుగా లేరు. మున్నూరు నాయకులమైన మేమందరమూ ఆనాటి శౌర్యానికి గుర్తులుగా వీరఖడ్గాలను

పూజించేవారము. రాచగోచిలను ధరించేవారం. రాచగోచిని మాకందరకూ మా పెద్దలు ఇచ్చేవారు.

మా ముత్తాత విద్యావంతుడు. వైష్ణవ సంప్రదాయానికి చెందినవాడు. వారు కృష్ణా, గుంటూరు జిల్లాలకు భూమిశిస్తు వసూలుకు కలెక్టరు అయ్యారు. వీరి తండ్రి అంకినీడుగారు నిడుబ్రోలు గ్రామంలో నివసించటానికి నిశ్చయించుకొన్నారు. తరువాత నాగయ్యగారు అక్కడ వ్యవసాయ భూములను కొన్నారు. వారు దోవలు, డొంకలు పలువిధాలయిన ప్రజోపయోగకరమైన పనులకు తమ పొలాన్ని ఇచ్చి, చెరువులు తవ్వించి, తమ భూమిని సాగులోనికి తీసుకుని వచ్చారు. మొట్టమొదటి పెంకుటిల్లు ఈ గ్రామంలో వీరిదే.

నిడుబ్రోలుకు పది మైళ్ళలో ఉన్న 'గూడవల్లి'లో వీరి తాతగారు (నాగయ్యగారి) చాలా ఏళ్ళు నివసించారు. వీరి పూర్వీకులు గోగినేనిపాలెం (కృష్ణా జిల్లా)లో ఉండేవారు. వారు వరంగల్లు నుండి ఖమ్మం ద్వారా ఈ ఊరికి వచ్చారు. గ్రామంలోని అభివృద్ధికి నోచుకోని భూములను బాగుచేసి, చెరువులు తవ్వించారు. ఇప్పటికీ ఆ చెరువు బాగోగులు మేమే చూస్తున్నాం.

నాగయ్యగారు నిడుబ్రోలులోని 'విష్ణు' గుడి, పొన్నూరులోని భావన్నారాయణ గుడి సేవలలో ప్రధాన పాత్ర పోషించేవారు.

భారతీదేవి ఇంటిపేరు 'వెలుగు'. తూర్పుగోదావరి జిల్లాలో 'వెలుగుతోడు', పుంగనూరు తాలూకా చిత్తూరులో 'వెలగటేరు' అనే గ్రామాలున్నాయి. ఆమె నా జీవితానికే వెలుగు.

వారి తాతగారు కోటయ్యగారు. ముందుచూపు ఉన్న మనిషి. కారంచేడు వారితో కలసి ఇండియా, బర్మాలలో విదేశీ వ్యాపారం చేసేవారు. వీరి కొడుకు సుబ్బయ్య మంచి వ్యవసాయదారుడు. వడ్రంగం, పశువైద్యం కూడా చేసేవాడు.

గాంధి శకంలో కూడా ఈ కాకతీయ నాయకులు తమ వారసత్వాన్ని ఋజువు చేసుకున్నారు. 1924 లో మాగంటి అన్నపూర్ణ సహాయనిరాకరణోద్యమానికి తన నగల నన్నిటినీ గాంధీగారి కర్పించింది. పన్నులు ఎగవేత ఉద్యమానికి

వీరయ్యనాయక్ (పర్వతనేని వీరయ్యచౌదరి) పెదనందిపాడులో నాయకత్వం వహించాడు. ఉప్పుసత్యాగ్రహంలో నాగళ్ళ(నాగలి) కృష్ణయ్య పోలీసు లాఠీచార్జీలో ఎదురొడ్డి నిలిచాడు. మహిళా సత్యాగ్రహంలో జాయపనాయకుని 'చేబ్రోలు' మహిళలు ముందున్నారు.

సాంఘిక, ఆర్థిక అవసరాల దృష్ట్యా ముదిరాజు, ముతరాసు, బలిజ కులాలు ఆహారధాన్యాల వ్యాపారం; గానుగ, పెరికవారు నూనె వ్యాపారం చేసేవారు. చాలామంది రెడ్లు, గౌళ్ళు (గవర, గౌడ), యాదవులు, కమ్మవారు, తెలగవారు కొత్తగా లింగాయత మతంలో చేరారు. పల్లవుల వారసత్వాన్ని పల్లెకారులు స్వీకరించారు. వీరు నౌకా నిర్మాణం, చేపలు పట్టడం వృత్తిగా చేసుకున్నారు. సాంఘికౌన్నత్యం పోగొట్టుకున్న రాష్ట్రకూటులు, రట్టకూటులు కొండరెడ్లు అయ్యారు.

తెలంగాణా, రాయలసీమ, తమిళనాడు రెడ్లు ఆంధ్ర కమ్మవారి నుండి ఎలా, ఎప్పుడు విడిపోయిందీ తెలియదు. వారు కర్నాటకలో, ఆంధ్రలో రైతులుగా 10 లేక 11 వ శతాబ్దానికి ప్రత్యేక సంఘంగా గుర్తింపు పొందారు. వీరు కూడా ప్రారంభంలో 'మున్నూరు కాపు'లకు చెందినవారై ఉంటారు. కాకతీయ, రెడ్డి రాజ్యాలు అంతరించిన తరువాత వ్యవసాయం చేపట్టారు. 'తెలగ'వారు ముస్లిం సామ్రాజ్యాలు ఏర్పడిన తరువాత ప్రత్యేక తెగలుగా విడబడ్డారు. స్థానిక భాష 'తెలుగు' కావడంవలన వీరు 'తెలగ' వారయ్యారా? వీరు ముస్లింలు, తరువాత బ్రిటీషువారి వద్ద చాలాకాలం ఉన్నతోద్యోగులుగా పనిచేశారు.

వెలమవారు ముస్లింల వద్ద, బ్రిటీషువారి వద్ద భూస్వాములుగా ఇతర ఆంధ్ర నాయకులు విజయనగర రాజులు, నాయకరాజుల వద్ద సైన్యంలో మిగిలారు. వెలమలకు, ఆంధ్ర నాయకులకు విరోధం ఈ కారణంగా వచ్చి ఉంటుంది. మధ్యప్రదేశ్‌లోని బస్తర్ రాజులు కాకతీయులమని చెప్పుకుంటారు.

క్రీ.శ. 1820 లో మా గ్రామం, చేబ్రోలు, భట్టిప్రోలుల మధ్య ఉన్న గ్రామాలు బుద్ధుని స్తూపాలతో నిండివుండేవి. మాకు నాలుగు మైళ్ళ దూరంలో ధాన్యకటకం

– ఆంధ్రుల రాజధాని – నేటి చందోలు ఉంది. ఇక్కడ నాయకులు, నీడులు, నాయడులు నివసించారు. 11 వ శతాబ్దపు శివాలయంపై వ్రాసిన శాసనం దీనికి సాక్ష్యం. ఈ దేవాలయం 1089 లో రాజచోళదేవునిచే కట్టబడింది. క్రీ.శ. 1118-35 లో విక్రమచోళదేవునిచే భగవంతునికి అంకితం చేయబడింది. కుళోత్తుంగుడు ఆంధ్రదేశాన్ని, తమిళనాడును పరిపాలించాడు. కుళోత్తుంగుడు క్రీ.శ. 1178-1216 మధ్యకాలంలో 'నిడుబ్రోలు'ను రెండుసార్లు దర్శించాడు. యర్రంనాయకుడు వీరి కాలంలో రాజభాండారానికి పర్యవేక్షకునిగా ఉండేవాడు. వీరు నింబ్రోలు లేక నిడుబ్రోలు సుబ్బానాయకుని కుమారుడు. ఆరోజులలో కూడా తెలుగు చోళుల వద్ద నాయకులు పాలనలో ప్రధాన పాత్ర వహించేవారు. కొండముది మాకు 2 మైళ్ళు. 4వ శతాబ్దంలో విష్ణుకుండినులు ఇక్కడ విష్ణ్వాలయాన్ని నిర్మించారు. ఇప్పటికీ ఈ ఆలయ ధర్మకర్తృత్వం మాదే.

200 సంవత్సరాల క్రితం డిల్లీ పోలాసమ్మ గుడి నిర్మించబడింది.

మొదట ఉన్న రైతులు, వివిధ వృత్తులవారు ఏమయ్యారో తెలియదు. బ్రాహ్మణులు, విశ్వబ్రాహ్మణులు నిడుబ్రోలు లేక నీడుబ్రోలు అనే కుటుంబ నామాలతో ఉండేవారు. ఇదే ఇంటిపేరుతో నిడుబ్రోలు ఎర్రానాయక్, వీరి తండ్రి సుబ్బానాయక్ వంటి రైతులు 12 వ శతాబ్దంలో ఉన్నారు. వరంగల్లు నుండి వచ్చిన కొన్ని కుటుంబాలు 'ఓరుగంటి' పేరుతో ఉండేవి.

మా తాత రమణయ్య (మాతామహుడు) 'పాములపాటి' కుటుంబానికి చెందినవాడు. వీరి తండ్రి బుచ్చినాయుడు లేక రాయుడు. వీరి ముత్తాత నాగయ్య గారి అల్లుడు. వీరు గంగినేని కుటుంబానికి చెందినవారు. ఈ రెండు కుటుంబాలు చదువుకు విలువనిచ్చేవి. పండితులను, బ్రాహ్మణులను ఆదరించేవి. రమణయ్య హరిజనుల కొరకు బావి తవ్వించాడు. సత్రాలు నిర్మించాడు. ఒక చెరువును ప్రక్క గ్రామస్థుల కొరకు తవ్వించాడు. రమణయ్య సోదరుడు అంకినీడుగారు. వారి దాయాదులు మునసబుగారి కుటుంబంతో తగాదా పడేవారు. దురదృష్టవశాత్తూ ఆ వైరం తరువాతి తరాలకు కూడా ప్రాకింది.

రమణయ్య కుమారుడు రామస్వామి. మా గ్రామంలో మొదటగా లైబ్రరీ నిర్మించాడు. వీరు తన ఆస్తినంతా నాకు, నా తమ్ముళ్ళకు సంక్రమింపజేశారు. వీరి భార్య లక్ష్మీదేవి. అమ్మినియమ్మ వీరి తల్లి. మంగమ్మమ్మ వీరి చెల్లెలు. వీరే మా ముగ్గురు సోదరుల బాగోగులు చూశారు.

రామస్వామిగారు దానం ఇచ్చిన సత్రం ఇప్పుడు రైతాంగ విద్యాలయానికి కార్యస్థానం.

సర్ ఆర్థర్ కాటన్ మహానుభావుడు నిర్మించిన కృష్ణా బ్యారేజీ వలన మా పంటపొలాలకు నీళ్ళు వస్తున్నాయి. ఈ బారేజీతో కరువుకాటకాలు చాలా తగ్గిపోయి, సాంఘిక ఆర్థిక విషయాలపై ధ్యాస పెట్టటానికి రైతులకు అవకాశం వచ్చింది.

1923 నుండి నే చేపట్టిన ఉద్యమాల నన్నిటికీ ఇక్కడ రైతులు చాలా ఉత్సాహంగా స్పందించారు.

ఈ వాతావరణంలో నేను ఒక జాతీయ రైతు యువకునిగా ఎదిగాను.

★ ★ ★

ఆక్స్‌ఫర్డ్‌లో సహచరులతో రంగాజీ (1921)
రంగాజీ, వి.యస్. కృష్ణ, లింగం వీరభద్రయ్య చౌదరి, వి. రామకృష్ణ.

3. ఆక్స్‌ఫర్డ్‌లో

మొదటి భారత స్వాతంత్ర్య సమరపు శత జయంతి ఢిల్లీలో జరుపు కుంటున్నాము. ఈ పండుగ సభకు డా॥ రాజేంద్రప్రసాద్‌గారు అధ్యక్షత వహించారు. ఉపాధ్యక్షుడు రాధాకృష్ణన్ పండితుడు ఈ రెండు వందల సంవత్సరాల చరిత్ర చెప్పారు. క్రీ.శ. 1857 లో మొదటి భారత స్వాతంత్ర్య సమరం జరిగింది. గత 10 సంవత్సరాలుగా భారతదేశం వలస దేశాలకు ఒక చుక్కానిలాగా నిలిచింది. యూరోపులో మేము చదువుకునే రోజులలో కొన్ని వేలమంది మాత్రమే భారతీయులం ఉండేవాళ్ళం. ఈరోజున భారతీయు లందరూ స్వాతంత్ర్య ఫలాల ననుభవిస్తున్నారు. నాటి కొద్దిమంది ఆలోచన – ఈనాటి ప్రజలందరకూ ఆచరణగా మారింది.

ప్రధాని నెహ్రూ తన సందేశంలో "సొంత లాభము కొంత మానుకొని నేతలు ప్రజలకొరకు పాటుపడాలి" అని చెప్పారు.

నాటి నా ఆలోచనలు

సమకాలీన ఆంగ్ల సమాజం – భారతదేశాల మధ్య గల విభేదాలు తెలుసు కోవటం భారత విద్యార్థుల బాధ్యత. స్వర్గంలాగా కన్పించే ఇంగ్లీషు – యూరోపియన్ సమాజం భారతదేశంలో కూడా రావాలి. ఆర్.సి. దత్తు, బెనర్జీలు, ఆలీ సోదరులు, మహాత్మాగాంధీ, అరవిందఘోష్, సురేంద్రనాథ్ బెనర్జీ, మోతీలాల్‌నెహ్రూ, సి.ఆర్.దాసు, ప్రకాశం వంటివారు ఇంగ్లండులో విద్యాభ్యాసం చేశారు. భారత ప్రజలు, ప్రాగ్దేశాలలోని ఇతరులు యూరోపులో వలె తిరుగాడ గలరని, అది ఒక భగవద్దత్తమైన వరంగా భావించారు. పవిత్రమయిన బాధ్యతగా తలచారు. ఇచ్చటి పరిస్థితులకు నేను వింతగా అలవాటయ్యాను. సర్. పి.సి.రే

గారు నాలో జిల్లాలు, రాష్ట్రాలు అన్న ఆలోచన తొలగించి – దేశాన్ని గురించి ఆలోచించటం నేర్పారు. స్వాతంత్ర్య సమరయోధునిగా మారే అవకాశాన్ని ఆ మూడు వారాల ఓడ ప్రయాణంలో కలిగించారు. రామకృష్ణగారు ఆ ఆలోచనలు బలపడేటట్లు చేశారు. 1921 నాటి మహాత్మాగాంధీగారి గ్రామీణ ప్రచారాన్ని నేను అర్థంచేసుకున్నాను.

ఇంగ్లండు వెళ్ళిన మాలో ఆశ్చర్యకరమైన మార్పు చోటుచేసుకుంది. విముక్తుల మైనట్లుగా భావింపసాగాము. ఆనాడు ఐ.సి.యస్. (ఇండియన్ సివిల్ సర్వీస్) పరీక్షకు తయారవుతున్నవారు మాకు అందని ఎత్తులో ఉన్నట్లు అన్పించేది. వారు నేడు సామాన్యులవలె కన్పించసాగారు. జాతీయ కాంగ్రెసుపై మాకు చెప్పలేనంత ప్రేమ ఏర్పడింది. గొప్ప వక్తలుగా అందరి మన్ననలు అందుకొన్న శ్రీమతి అనిబిసెంటు, శ్రీ శ్రీనివాసశాస్త్రి గార్లు జాతీయోద్యమ వ్యతిరేకులుగా కన్పించసాగారు. అడ్డూఆపూ లేని స్వతంత్రతను అనుభవిస్తున్న ఆంగ్లేయులను, పార్లమెంటులో వారి బలాన్ని మేము చూశాం. వారినుండి రాజకీయ స్వాతంత్ర్యం, సాంఘికోన్నతి, ఆర్థిక పెరుగుదలలను గ్రహించగలుగుతున్నాం. భారతదేశపు పేదరికాన్ని, ఇంగ్లీషువారి శక్తిని, అభివృద్ధిని బేరీజు వేసు కుంటున్నాం. స్వేచ్ఛ కోసం తపించటం, కృషి చేయటం, ఆలోచించటం మాకు నిత్యకృత్యమైంది. యూరపులోని 'గాలి' కూడా మమ్ములను ఉత్తేజపరచేది. రాజకీయ, సాంఘిక పరిస్థితులను, దక్షిణ భారతదేశంలో బ్రాహ్మణ వ్యతిరేకత, ఉత్తర భారతదేశంలో హిందు–ముస్లింల తగాదాలు, బ్రాహ్మణోద్యమాలు, విగ్రహారాధన, నిరుద్యోగం వీటన్నిటినీ జాతీయ దృష్టితో చూడాలని గ్రహించాం.

1920 వ సంవత్సరం నా జీవితంలో చాలా ముఖ్యమైనది. గాంధీగారు కాంగ్రెసు నాయకత్వం చేపట్టారు. బాలగంగాధర తిలక్‌గారు చనిపోయారు. చట్టసభలలోనికి కాంగ్రెసువారి నిర్ణయానికి వ్యతిరేకంగా అడుగుపెట్టిన బ్రాహ్మణేతరుల పార్టీ ప్రజల ఆదరణకు నోచుకోలేదు. బ్రిటీషు ప్రధాని లాయిడ్ జార్జి నానాజాతి సమితి రక్షణోద్యమంలో ఉన్నాడు. హెచ్.జి. వెల్సు 'ఔట్‌లైన్స్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ' వ్రాశాడు. భారతీయులు స్వాతంత్ర్యంకోసం పోరాడుతుంటే, యూరోపులోని విజ్ఞానులందరూ ప్రపంచ ప్రభుత్వానికి (World Government)

ఇది ఒక అడ్డంకి అనుకొనేవారు. అమెరికాలో ఎన్నికలు వీరికి వ్యతిరేకంగా ఉన్నాయి. ఈ విషయాలనన్నింటినీ భారతీయ విద్యార్థులమందరమూ చర్చించు కుంటున్నాం. హెచ్.జి. వెల్సు వ్రాసిన 'Salvaging of the World' (ప్రపంచ రక్షణ), నార్మన్ ఏంజల్సు వ్రాసిన 'The Great Illusion' (భ్రమ) మాపై ప్రభావం చూపించాయి.

వేరొకవైపు సోషలిజం (సామ్యవాదం) ఉధృతమైన ఆలోచనలు మమ్మల్ని ముసురుకుంటున్నాయి. ఇంగ్లండులో లేబరు పార్టీవారు యుద్ధకాలపు మంత్రులుగా ఉన్నారు. ఐ.యల్.పి. (ఇండియన్ లేబర్ పార్టీ) సోషలిజాన్ని గురించి చాలా పుస్తకాలు ప్రచురించింది. ఫేబియన్ సొసైటీ నాయకులు సిడ్నీ మరియు వెబ్స్ విశ్వవిద్యాలయంలో చాలా పలుకుబడి కలవారు. నా స్నేహితుడు రామకృష్ణకు వెబ్స్ వ్రాతలపై గౌరవముంది. బెట్రాండు రస్సెల్‌ను మరీ మరీ అభిమానించేవాడు. రామకృష్ణ సాయంతో నేను రస్సెల్ రచనలు కొన్ని చదివాను. 'The Road to Freedom' (స్వేచ్ఛకు మార్గాలు) గ్రంథంలో పేదరికం, సాంఘిక అణచివేత, రాజకీయ దౌర్జన్యం గురించి వ్రాశాడు. ఐ.సి.యస్. విద్యార్థుల్లాగా మేమందరం మిల్స్ స్వాతంత్ర్య గ్రంథాన్ని చదువుకోవలసిందేనా? స్వాతంత్ర్యం ఒక్కటే అన్నిటికీ పరిష్కారమా? ఇంగ్లాండు ఎన్ని సమస్యలను ఎదుర్కొంటున్నది? సోషలిజంను అనుసరిస్తే ఏరకమైన సోషలిజాన్ని అనుసరించాలి? అంటరాని తనాన్ని విడనాడటం ఒక్కటే సరిపోతుందా? మన సాంఘిక ఔన్నత్యం, అణగ ద్రొక్కబడటం వీటన్నిటి నుండి బయటపడి బ్రిటీషువారిలాగా, ఫ్రాన్సువారిలాగా మనం కూడా స్వాతంత్ర్యాన్ని అనుభవించాలి.

బ్రిటనులో బొగ్గు కార్మికులు తమకు ఆదాయం చాలదని సమ్మె చేశారు. అంటే బ్రిటీషు ప్రజాస్వామ్య హక్కులు వారికి చాలటంలేదన్నమాట. బొంబాయి రేవు కార్మికులలాగానే అక్కడ కూలీల బ్రతుకులున్నాయి. బ్రిటనులో యూదులు అసంతృప్తితో ఉన్నారు. ఆక్స్‌ఫర్డులో ప్రొఫెసర్లు, పాత్రికేయులు సోవియట్‌లో సాధించిన విజయాలను గురించి మాట్లాడేవారు. ఈ విషయాలు నేను, రామకృష్ణ చర్చించుకొనేవాళ్ళం. రష్యాలో రైతులు, కార్మికులు రాజకీయాధికారం సంపాదించుకొన్నారని నేనభిప్రాయపడ్డాను. లేబరు పార్టీ మార్క్సు-లెనిన్

మార్గాన్ననుసరిస్తే, భారతదేశంలో రైతులు, కార్మికులు ఏదో ఒకరోజున బలమైన స్వతంత్ర శక్తిగా ఎదుగుతారని నేనాశించాను.

స్టూడెంట్‌గా నేను ఇండియన్ మజ్లిస్ (శాసనసభ), ఆక్స్‌ఫర్డు యూనియన్, ఏసియాటిక్ క్లబ్, లోటస్ క్లబ్బులకు వెళ్లి, అక్కడ చర్చలు వినేవాడిని. వీరెంతో బాధ్యతతో అంతర్జాతీయ విషయాలను చర్చించటం నాకు చాలా సంతోషం కలిగించింది. బ్రిటీషు మంత్రులు, అమెరికా రాజకీయవేత్తలు, ఫ్రాన్స్ ప్రధానులు, ఇండియాలో బ్రిటీషు మాజీ రాజ ప్రతినిధులు ఈ చర్చల్లో పాల్గొనేవారు. వీరు ఆక్స్‌ఫర్డులోని విద్యార్థులను ఎంతగానో గౌరవించేవారు.

1920 లో బ్రిటనులో స్త్రీలకు ఓటుహక్కు ఇవ్వబడింది. ★స్త్రీల హక్కులకై మిల్స్ చేస్తున్న పోరాటం విజయవంతం అయింది. భారతదేశంలో కూడా స్త్రీలకు ఈ హక్కులు రావాలి.

పెద్దల సభను (House of Lords) రద్దుచేయాలని సోషలిస్టులు కోరుతున్నారు. లిబరల్ పార్టీవారు సమూలమైన మార్పులు కావాలంటున్నారు. భారతదేశంలో రాజుల-యువరాజుల పెత్తనం లేకుండా ఉంటే ఎంత బాగుంటుంది!

ఫ్రెంచి విప్లవాన్ని గురించి చదువుకున్నాము. యూరోపులో జరిగిన విప్లవ పోరాటం గురించి హెచ్.ఏ.యల్. ఫిషర్ (ఆ దేశపు విద్యామంత్రి, ఆక్స్‌ఫర్డ్ ఆచార్యుడు) వ్రాశారు. జార్ కుటుంబానికి రష్యాలో జరిగిన అవమానం బాధాకరమైంది. ఈ సంఘటన భారతదేశంలోని రాజుల-యువరాజులపై మా అభిప్రాయాన్ని బలహీనపరచింది.

నాకు 'St. Catherin Deligacy' (సెయింట్ కాథరిన్ డెలిగసీ) లో ప్రవేశం ఇచ్చారు. నా సహచరులయిన ఆరుగురు ఐ.సి.యస్. విద్యార్థులు ఎంతో సంతోషించారు. షాబుద్దీన్ పాకిస్తాన్ సుప్రీంకోర్టుకు ప్రధాన న్యాయమూర్తి అయ్యాడు. శ్రీ యం.సి. చాగ్లాను వీరు చాలా అభిమానించేవారు. చాగ్లాగారు ఆక్స్‌ఫర్డ్‌లో మాట్లాడుతుండేవారు. తరువాత కాలంలో భారత విదేశాంగ శాఖామంత్రి అయ్యాడు. వెల్లోడిగారిది మలబారు. వీరెప్పుడూ చిరునవ్వులు నవ్వుతుండేవారు.

★ 1918 ఆక్టు ప్రకారం 30 సం॥ దాటిన మహిళలకు, 1928 ఆక్టు ప్రకారం 21 సం॥లు దాటిన అందరకూ ఓటు హక్కు ఇవ్వబడింది.

వీరు డిప్యూటీ కమీషనరుగా, ఇంగ్లాండులో స్వతంత్ర భారతదేశానికి ప్రతినిధిగా ఉండేవారు. తరువాతి రోజులలో నెహ్రూగారి మంత్రిమండలి సెక్రటరీగా పని చేశారు. శ్రీ టి. భాస్కరరావు కలెక్టరుగా పదవీ విరమణ చేసిన తరువాత ఒక పెద్ద పారిశ్రామిక సంస్థలో భాగస్వామి అయ్యాడు. శ్రీ వెలగపూడి రామకృష్ణ చాలా ఉత్సాహవంతుడు. దక్షిణ భారతదేశంలో పెద్ద పెద్ద పరిశ్రమల రూపశిల్పి.

ఇంగ్లీషు రాజ్యాంగంలోని ప్రాథమిక సూత్రాలను రామకృష్ణ నాకు అర్థమయ్యే విధంగా బోధించాడు. వారి వద్దనున్న పుస్తకాలనన్నిటినీ చదివాను. నా వ్రాతలను వారు ఎంతో ఓర్పుతో చదివేవారు. వారి మాటలు నాకు ఆత్మస్థైర్యాన్ని కలిగించేవి. ఆక్స్‌ఫర్డ్‌లో ఎందరో ఉపాధ్యాయులు నాకు పాఠాలు చెప్పారు. వారందరూ రామకృష్ణ ముందు దిగదుడుపే.

శ్రీ లింగం వీరభద్రయ్య చౌదరి, శ్రీ వి.యస్. కృష్ణా గార్లు (ఇరువురు రైతుబిడ్డలు) ఐ.సి.యస్. విద్యార్థులు. లింగం వీరభద్రయ్య చౌదరికి తెలుగు సాహిత్యంపై మక్కువ ఎక్కువ. కృష్ణకు ఇంగ్లీషు సాహిత్యంపై ప్రీతి. వారి చర్చలు, వాటిద్వారా నేను నేర్చుకున్న పాఠాలు నా 'తెలివిడి'కి ఉపయోగించుకున్నాను. చౌదరి నన్ను ఒక పుస్తకాలపురుగుగా చూచేవాడు. తెలివితేటలలో ఇతర ఐ.సి.యస్. విద్యార్థులతో పోటీపడేవాడు. కృష్ణ చిన్నవాడు. అంతర్ముఖుడు. మేము ముగ్గురము ఒక జట్టుగా ఉండేవాళ్ళం.

ఈ సుదీర్ఘ హేమంతం – చాలా చలిగా, క్రుంగదీసేటట్లుగా ఉంది. రామకృష్ణ మినహా మిగతా ఐ.సి.యస్. విద్యార్థులందరూ ఇదే అభిప్రాయంతో ఉన్నారు. ఇటువంటి భౌతిక విషయాలకు రామకృష్ణ చాలా దూరం. రామకృష్ణ, నేను ప్రశాంతమైన 'బాట్లీ' గ్రామీణ రోడ్లపై సాయంకాలం నడుస్తుండేవాళ్ళం. రాజకీయ, ఆర్థిక విషయాలను, ఇండియా, ఇంగ్లాండులోని వారి ఆలోచనా విధానాన్ని, రోగగ్రస్తమయిన ఈ దేశాల బాగుకోసం ఆలోచిస్తుండేవాళ్ళం. చదివే పుస్తకాలు, వార్తాపత్రికలే మాకు ప్రామాణికం. నేను ప్రతిరోజు ఈ ★'సోక్రటిన్' నడకలకై ఎదురుచూస్తుండేవాడిని. ప్రతి సాయంత్రం నడక నాకొక 'టానిక్'లా ఉపయోగపడేది.

★ సోక్రటీస్ నడక – చర్చించుకొంటూ సోక్రటీసు తన శిష్యులతో నడచేవాడు (ప్లేటో).

నేను రామకృష్ణపరమహంస, వివేకానంద, రామతీర్థలను అధ్యయనం చేయటంవల్ల ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల సాంఘిక జీవితపు ఊబిలో పడలేదు. రామకృష్ణ, ఇతర మిత్రుల సహచర్యంతో భారత-బ్రిటీషు దేశాల గ్రామీణ సమస్యలను అర్థంచేసుకొనేవాడిని. భారతదేశంలోని గ్రామీణ యువకుల ఆర్థిక స్థితిగతులు పెంపొందించే చట్టానికి రామకృష్ణ చేస్తున్న కృషిని గమనిస్తూ ఉండేవాడిని. ఇంగ్లాండు, ఇతర దేశాలలో జరుగుతున్న అభివృద్ధిని చూస్తున్నాను. నేను పూర్తిగా ఆక్స్‌ఫర్డ్ విద్యార్థిని కాకపోయినా, భారతదేశంలో జరుగుతున్న సాంకేతిక విప్లవం, సాంఘికాభివృద్ధికి ఒక ప్రతినిధి స్థాయిని అందుకొన్నాను. రామకృష్ణ నా ఆలోచనలకు చాలా సంతోషించేవాడు. నా ఆలోచనలు సరైన మార్గంలో ఉండేటట్లు చూసేవాడు. కనీసం ఒక సంవత్సరంపాటు యూనివర్సిటీ యూనియన్ సమావేశాలలో మాట్లాడవద్దని రామకృష్ణ చెప్పాడు. అప్పటికి నా ఆలోచనలే గాక ఇంగ్లీషు భాషా సామర్థ్యం పరిణితి చెందుతుందని వారు భావించారు. వారిచ్చిన ఈ సలహాను నేను పాటించాను.

1922 నుండి ఇంగ్లీషు మజ్లీస్, లేబరు క్లబ్బులలో మాట్లాడటం మొదలు పెట్టాను.

★ ★ ★



క్రాస్ దంపతులతో రంగాజీ.

4. యూరోపు-ఆక్స్‌ఫర్డ్‌లలో

నేను ఇండియన్ సివిల్ సర్వీసు పరీక్షలకు చదవటానికి, బారిస్టరు కావటానికి ఇంగ్లాండు వచ్చాను. శ్రీ వెలగపూడి రామకృష్ణ మార్గదర్శకత్వంలో ఈ రెండు పరీక్షలకు తయారవుతున్నాను. ఈలోగా గాంధీగారు చేపట్టిన 'సంవత్సరంలో స్వరాజ్యం' నినాదం నా ఆలోచనల్ని తారుమారు చేసింది. యూనివర్సిటీలను బహిష్కరించమని గాంధీగారిచ్చిన పిలుపుపై రవీంద్రనాథ ఠాగూర్ గారి స్పందన ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులలో అలజడి కలగజేసింది. శ్రీ మీనన్‌గారు గాంధీగారితో కలిసి పనిచేయటానికి ఇండియా వెళ్ళారు. వీరు తరువాత కాలంలో రాడికల్ డెమోక్రాట్‌గా శ్రీ యం.యన్.రాయ్ నాయకత్వంలో జాతీయ కాంగ్రెసును వ్యతిరేకించారు. నేనూ ఇంగ్లాండు వదిలి ఇండియా వెళ్దామనుకున్నాను. రామకృష్ణ, ఇతర ఐ.సి.యస్. విద్యార్థులు నా ఆలోచనను వ్యతిరేకించారు. ఎంతో వ్యయప్రయాసలకోర్చి ఇంగ్లాండుకు వచ్చిన నేను ఇండియాకు తిరిగి వెళ్ళటం భావ్యంకాదని, యూరోపులోని ఆర్థిక, రాజకీయ అభివృద్ధి పరిశీలన తరువాతకాలంలో భారతదేశానికి ఉపయోగపడుతుందని చెప్పారు.

సమర్థుల, నిజాయితీపరుల, ప్రజాస్వామ్యంపై నమ్మకం కలిగిన పాలకుల, లాయర్ల, ప్రొఫెసర్ల, ప్రవీణులైన ఇతరుల, దేశభక్తి కలిగిన నావంటి యువకుల అవసరం స్వతంత్ర భారతదేశానికి ఉందని, యూరోపులోని చదువు ముందు ముందు దేశానికి ఉపయోగపడుతుందని వారు నాకు చెప్పారు. వారిచ్చిన సలహాపై నమ్మకంతో నా ప్రయత్నాన్ని మానుకున్నాను. తరువాత చరిత్రే సాక్షిగా నిలచింది.

ఆక్స్‌ఫర్డ్‌లో మొదటి సంవత్సరం గాంధీగారి ప్రభావంతో గడిచిపోయింది.

సర్. రామచంద్రరావుగారు ఇంగ్లాండులో భారతీయ విద్యార్థుల చదువుల అవకాశాన్ని పరిశీలించటానికి వచ్చారు. గాంధీగారిని చూడటానికి కృష్ణానది ఒడ్డున చేరిన జనాన్ని తానంతకు ముందు కనీవినీ ఎరుగనన్నారు.

మొదటిసారిగా గాంధీగారు దేశ ప్రజలను 'ఒక కోటి రూపాయల' విరాళం కోరారు. తిలక్‌గారికి దేశం ఇచ్చిన విరాళంకన్నా ఈ విరాళం వంద రెట్లు ఎక్కువ. దీనికి 'తిలక్ ఫండ్' అని పేరు పెట్టారు. ఈ సొమ్ము అనుకున్న కాలానికంటే ముందే ప్రోగుపడింది. గాంధీగారు 'కోటిమందిని జాతీయ కాంగ్రెసు'లో సభ్యులుగా చేరమన్నారు. ఈ సభ్యత్వ నమోదు చాలావరకు విజయ వంతమయింది.

ప్రతి వారం గాంధీగారి పర్యటన, వారి ఉపన్యాసాలు ఆక్స్‌ఫర్డ్‌లో 'ఇండియన్ మజ్లీసు (శాసనసభ)'కు అందేవి. 'ప్రిన్స్ ఆఫ్ వేల్సు' పర్యటనను భారతీయులు బహిష్కరించారు. ఈ విషయం మమ్మల్ని ఉత్తేజపరచింది. ప్రతిరోజు ఒక కొత్త సందేశం మాకు ఇచ్చినట్లే భావించేవాళ్ళం. 'చోరీ–చోరా'లో ఆంగ్లేయుల హత్యలు, 'మొప్పిల విప్లవం' వెంటవెంటనే జరిగాయి. సహాయ నిరాకరణోద్యమం గాంధీగారు విరమించారు.

ఎందరో ఆక్స్‌ఫర్డ్–కేంబ్రిడ్జిలలో చదువును గురించి గొప్పగా వ్రాసారు. నేను కూడా వ్రాయడం అతిశయంగా ఉంటుంది. ఆ పురాతన విశ్వవిద్యాలయాన్ని భారతదేశంలోని పురాతన విశ్వవిద్యాలయాలైన అమరావతి, కాంచి, తక్షశిలలతో పోల్చి చూశాను. మద్రాసు, కలకత్తాలలోని విశ్వవిద్యాలయాలను చూసే అవకాశం కలిగింది. లండనులో భవనాలు, ఇండియాలోని విశ్వవిద్యాలయాల భవనాలు ఒకే మూసలో ఉన్నాయి. ఆక్స్‌ఫర్డ్ భవనాలు భారతదేశంలోని దేవాలయాలు, వాటి నలుచదరపు గదులు, పడిపోవటానికి సిద్ధంగా ఉన్న వాటి గోడలు, తమ వయస్సు గర్వానికి తొణికిసలాడుతూ, చదువులతల్లి సరస్వతీదేవి కొలువైనట్లు కన్పించేవి. నేనీ కాలేజీ భవనాలను చూచి ముగ్ధుడ నయ్యాను. ఇక్కడి పచ్చని బయళ్ళు, ఎత్తైన కట్టడాలు, విశాల ప్రాంగణాలు, వెలుతురు కోసం ఎదురుచూసే ప్రార్థనా మందిరాలు వీటన్నిటినీ మించి

భారతదేశంలోలాగా ఇటుకలతో నిర్మించిన సన్నని త్రోవలు, నదులపై విహారం చేసే యువతీయువకుల సమూహాలు నన్ను సమ్మోహనపరచాయి.

ఇక్కడ పాత కొత్తల మేలుకలయిక కన్పిస్తుంది. పాత కొత్తను ఆహ్వానిస్తుంది. కొత్త పాతకు అందాల నందిస్తుంది.

గాంధీగారికి ఆరు సంవత్సరాల జైలుశిక్ష విధించారు. నేనీ బ్రిటీషు ప్రభుత్వపు చర్యకు ప్రతిగా ఐ.సి.యస్. పరీక్ష వ్రాయదలచలేదు. గాంధీ వంటి జాతీయ నాయకునికి ఈ శిక్ష విధించడం అన్యాయం. ఈ అన్యాయాన్ని సహించి, నేను నా తండ్రిగారికిచ్చిన మాటకు కట్టుబడి ఉండలేకపోయాను. గాంధీగారు జాతీయోద్యమాన్ని ఆపినప్పటినుండి నా ఆలోచనలు ఈవిధంగానే ఉన్నాయి. ఈ నా నిర్ణయం తరువాత ఏం చేయాలి? ఈ సమస్యకు తగిన సలహానిచ్చే మిత్రులెవ్వరూ లేరు. నేనే నిర్ణయించుకోవాలి.

నేనప్పట్లో 'ఫేబియన్ కరపత్రాలను', హిండ్‌మన్ వ్రాసిన 'Awakening of India' (భారత్ మేలుకొలుపు), బెట్రాండు రస్సెల్ వ్రాసిన 'చైనా' చదువుతున్నాను. గ్లాడ్‌స్టోను జీవితచరిత్ర, బర్కు 'Present Discontents' (అసంతృప్తులు), బేజ్‌హాట్ 'బ్రిటీషు రాజ్యాంగం' నాకిష్టమైన గ్రంథాలు. ఫ్రెంచి, అమెరికా విప్లవాలను ఆసక్తితో చదివాను. థామస్ పెయిన్, థామస్ జెఫర్‌సన్లు నాకిష్టమైన తత్త్వవేత్తలు. విలియమ్ షెల్లీ, హెచ్.జి.వెల్సు, విలియమ్ మోరీస్, బ్లాచ్ పోర్టులు నా అభిమాన రచయితలు. నేను గాంధీగారి అనుచరుడినై జాతీయోద్యమంలో పనిచేయటానికి నిశ్చయించుకొన్నాను. అయితే ఈ నిర్ణయం ఒక్కటే సరి పోతుందా? గ్రామీణ భారతంలోని విరుద్ధ శక్తులు నాకు తెలియాలి కదా! నా దేశపు రైతులు అవినీతిని, రాచరికపు పాలనలోని నియంతృత్వ పోకడలను తట్టుకోగలరా? బర్క్ ఉపన్యాసాలను, సోషలిస్టుల, లేబరు పార్టీవారి ఆలోచనలను త్రోసిరాజనగలగాలి. నేనా రైతులకోసం ముందడుగు వేయాలి. వారిని జాగృతులను చేయాలి. బ్రిటనులోని ప్రజాస్వామ్య శక్తులన్నీ ఈ పనినే చేస్తు న్నాయి. భారతదేశంలో మతం, కులం అనే అడ్డంకులన్నిటినీ ఛేదించుకొని రైతులందరూ కలిసిరావాలి.

ఈవిధంగా ఆలోచించుకొని, బ్రిటీషు రైతులతో కలిసి ఉంటూ, నా చదువును ఆక్స్‌ఫర్డ్‌లోనే కొనసాగిస్తూ, భారత రైతుల రాజకీయ నాయకత్వం కొరకు కృషి చేయాలని ఉంది. భారతదేశపు రైతులు రాజకీయంగా శక్తిమంతులు కావడానికి మార్గాలు తెలుసుకోవాలని అనుకున్నాను.

ఈ నిర్ణయం తరువాత నేను రోజూ బ్రిటన్‌లోని, ఇతర దేశాలలోని రైతుల సమస్యలను భారతదేశపు సమస్యలతో పోల్చిచూడటం మొదలుపెట్టాను.

భారతదేశంలో ఈ సమస్యలను ఏవిధంగా పరిష్కరించాలి? ఏవిధంగా ఎదుర్కోవాలి? ఈ కోణంలో చూచినప్పుడు నేను పాశ్చాత్యుల నుండి ఎంతో నేర్చుకోవలసి ఉంది అని గ్రహించాను. వారి వ్రాతలు, చేతలు, సంఘ నిర్మాణం నాకు ఒక ఊపునిచ్చాయి. వారి వ్యవసాయం అశ్వశక్తి (Horse Power) పై ఆధారపడితే, మనమింకా ఎద్దులబండ్ల స్థాయిలోనే ఉన్నాము. వారి పశువులు మన పశువులకన్నా ఎక్కువ రెట్లు పాలివ్వగలవు. వారి పారిశ్రామిక సంపద మనకు అందనంత దూరంలో ఉంది. వారి వ్యాపారం అభివృద్ధి చెందింది. వారి క్రమశిక్షణ, వారి పరస్పర సహకారం, వ్యాపార సేవ, సంఘ నిర్మాణం మనకందనంత ఎత్తులో ఉన్నాయి. పనిచేసేవారిలో వర్గభేదం, లింగభేదం లేదు. పనిచేసే వారందరూ చదువుకున్నవారే. సంస్కృతీపరాయణులే. భౌతికంగా ముందడుగు వేస్తున్నవారే. భారతీదేవిగారన్నట్లు పాశ్చాత్యదేశాల నుండి మనం నేర్వవలసింది చాలా ఉంది. పాశ్చాత్య సంసర్గముల తోడ్పాటుతో నా విద్యాభ్యాసం సాగింది.

ఆక్స్‌ఫర్డ్‌లో ఎవరి నుండి ఎక్కువ లాభించానో తెలియదు, నేనిప్పుడు చెప్పలేను. చదువు చెప్పేవారి, పరీక్షలు నిర్వహించేవారి పాత్రలు గణనీయంగా ఉన్నాయి. విద్యార్థుల సాంఘికౌన్నత్యానికి, మేధావితనానికి ఆక్స్‌ఫర్డ్ క్లబ్బులు పదునుపెట్టేవి. నేను వీటినుండి ఎక్కువ లాభించాను. మాట్లాడే సామర్థ్యం, కలివిడితనం ఈ క్లబ్బుల్లో నేర్చుకున్నాను. కాస్మాపాలిటన్, ఆసియా క్లబ్బులు నన్ను చైనా, ఈజిప్టు, గోల్డ్‌కోస్టు, రోడ్స్ స్కాలర్సు, అమెరికా, కెనడా విద్యార్థులకు దగ్గర చేశాయి. వీరి సంబంధాలు, వలస, రంగు జాతుల (Colonial and

Coloured People) వారి స్వేచ్ఛకు బాటలు వేశాయి. ఇక్కడి బాటలు, ప్రక్కనే ఎప్పుడూ ప్రవహించే నదులు (కాల్వలు) నా నడతలను, చదువును, భావాలను విస్తృతపరచాయి.

చాలామంది ఆచార్యులు, అధ్యాపకులు, బోధకులు (Tutors) నా ఆక్స్‌ఫర్డ్ విద్యాభ్యాసంలో సాయం చేశారు. నాకు సాయం చేసిన కొద్దిమందిని చెప్తాను. వీరు నా సాంస్కృతిక భావపరిధిని విశాలం చేసినవారు. నా జ్ఞానాన్ని పెంపొందించినవారు. చరిత్రలో డా॥ కార్లయిల్, శ్రీమతి లిప్సన్, రాజకీయశాస్త్రంలో ప్రొ॥ ఆడమ్స్, సామాజికశాస్త్రంలో శ్రీమతి స్టాక్ మరియు బట్లర్, ఆర్థికశాస్త్రంలో ప్రొ॥ మెకరిగర్, టాడ్, సాండర్సు – వీరందరి సాయం నేను మరువలేనిది. తోటి విద్యార్థులంతా ఆటపాటలతో మునిగివుంటే నా ధ్యాసంతా చదువుమీదనే ఉండేది. నేను మిస్టర్ బేకర్‌ను నాకు ఇంకొక 'ట్యూటర్'ను కూడా ఏర్పాటు చేయమన్నాను. వారు 'ఇద్దరు ట్యూటర్లు చాలా, ముగ్గురు కావాలా?' అని అడిగారు. నేను సంతోషంగా ముగ్గురు ట్యూటర్లను ఏర్పాటు చేయమన్నాను. ప్రతి వారం విధిగా ఒక విద్యార్థి ఒక వ్యాసం వ్రాయాలి. నా విద్యాభ్యాస కాలంలో ముగ్గురు ట్యూటర్లు, మూడు విషయాలలో అజమాయిషీ చేస్తుంటే, నేను వారానికి మూడు చక్కని వ్యాసాలు వ్రాస్తుండేవాడిని. ఈ అలవాటు నా పరిశోధనా వ్యాసంగానికి, నా బుద్ధికుశలతకు దోహదం చేసింది.

వి.యస్. కృష్ణ, యల్.బి.వి. చౌదరి గార్లతో వివిధ విషయాలు మాట్లాడుతూ ఉండేవాడిని. వి.యస్. కృష్ణ తరువాత రోజులలో ఆంధ్ర యూనివర్సిటీకి వైస్–ఛాన్సలర్ అయ్యాడు. యల్.బి.వి. చౌదరిగారు నిలకడ కలవాడు. ఆధునిక భావాలు కలవాడు. సాంఘిక విషయాలలో అత్యంత ఆధునికుడు. రాజకీయ విలువలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చేవాడు. వీరిరువురూ నా ఆలోచనలు సరైన మార్గంలో ఉండేటట్లు చూసేవారు.

నేను ఆక్స్‌ఫర్డ్ క్లబ్ స్థాపకులలో ఒకడిని. ఆక్స్‌ఫర్డ్ మాసపత్రిక 'న్యూఆక్స్‌ఫర్డ్' (New Oxford) ప్రారంభికుడిని. బ్రిటనులో (1920–21 సం॥లలో) బొగ్గు కార్మికుల సమ్మె విఫలమయింది. ఈ నేపథ్యంలో శ్రామిక సమస్యలను చర్చించటానికి ఒక క్లబ్‌ను స్థాపించాలని యల్.బి. షార్టుగారు ఆశిస్తుండేవారు. మిస్

స్టాక్ ఈ క్లబ్బు అధ్యక్షురాలి హోదాను అందుకోగలిగింది. షార్టు, మిస్ విలియమ్స్ కార్యదర్శులు కాగలిగారు. ఐ.యల్.పి. నాయకుడు, భారతదేశంలో ఇంగ్లాండు రాజప్రతినిధి అయిన మాల్కోమ్ మార్షల్ తరువాత కాలంలో అధ్యక్షు డయ్యాడు. వి.యస్. కృష్ణ చాలా సంవత్సరాలు సభ్యునిగా ఉన్నాడు. నాకు ఆర్థిక, రాజకీయ, సామాజికశాస్త్ర బాధ్యతలున్నప్పటికీ వివిధ క్లబ్బులలో చురుకుగా వ్యవహరిస్తుండే వాడిని. లోటస్ క్లబ్, ఆసియాటిక్ క్లబ్, ఇండియన్ మజ్లీసులలో చురుకుగా పనిచేస్తుండేవాడిని. వలస విద్యార్థుల సంఘావశ్యకతను గుర్తించాను. నా చొరవతో అంతర్జాతీయ లేబరు సమాఖ్య ప్రారంభించబడింది. 'లేబరు' (లేబరర్) అనే మాటకు అర్థం "సోషలిజంలో నమ్మకం కలిగిన అందరం శ్రామికులు" అని మేము నమ్మాము. మిస్ స్టాక్ ఈ క్లబ్‌లో సభ్యురాలు. ఆమె నాతో స్నేహం చేయటం, నా ఆశయాలపైన, నా పనులపైన నమ్మకం కలిగి ఉండటం నా అదృష్టం. ముప్పయి అయిదు సంవత్సరాల స్నేహం మాది. ఇంగ్లాండులోని వివిధ రాజకీయ, సాంఘిక సంఘాలలో కలిసి పనిచేశాము.

జోమోకెన్యాటా

వలస ప్రజల స్వాతంత్ర్యానికై నేను ఇండియా, బర్మాలలో పనిచేశాను. జోమోకెన్యాటా, నేను కలిసి 1930-31 లలో రంగుజాతుల సంఘం స్థాపించాము. ఆమె (మిస్ స్టాక్) కెన్యా విజయానికి జోమోకెన్యాటాతో కలిసి ఇంగ్లాండులో పనిచేస్తున్నది. 1944లో గాంధీగారి ఆశీర్వాదంతో వలస మరియు రంగుజాతుల స్వాతంత్ర్య సంఘ నిర్మాణం చేపట్టాలనుకొన్నప్పుడు కూడా ఆమె నాకు సహకరించింది. బ్రిటనులో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఫెన్నర్ బ్రాక్‌వే యం.పి. ఆమెను కార్యదర్శిగా తీసుకున్నారు.

ఈమె స్నేహం చరిత్రలో ఏ ఉద్యమంలోనైనా, ఏ యుగంలోనైనా మరువలేనిది.

అక్కడి విద్యార్థి సంఘం నాకు, నావంటివారికి ఎన్నోవిధాల సహాయపడింది. ఈ వేదికనుండే నేను ధైర్యంగా మాట్లాడటం నేర్చుకున్నాను. ఉపన్యాసాల్లో

భాషాపటిమ, భావసౌకుమార్యం, ధారాళత, చాతుర్యాలను అందరూ ఇష్టపడే వారు. భారతీయ విద్యార్థులు ఇంగ్లీషు విద్యార్థులతో పోటీపడేవారు. కె.పి.యస్. మీనన్, టి.సి. గోస్వామి, యం.సి. చాగ్లా వంటివారు ఈ రంగంలో ముందుండే వారు. సిలోను ప్రధానమంత్రి బండారునాయకే ఈ కళాశాల వేదికపై ఎన్నోసార్లు గౌరవింపబడ్డారు. 'పంచ్'లోని హాస్యోక్తులను ఎక్కువమంది విద్యార్థులు ఈ చర్చలలో చెప్పేవారు. బ్రిటను, అమెరికా రాజకీయవేత్తలు ఈ వేదికపై నుండి మాట్లాడటానికి అత్యుత్సాహం ప్రదర్శించేవారు. నేను 1922-23 లలో, 1923-24 లలో చర్చలలో ప్రధానపాత్ర వహించాను. 1955 లో అక్కడ ఫోటోలో నేను పెద్ద తలపాగతో కనపడటం చాలా సంతోషాన్నిచ్చింది.

మిస్టరు బేకరు, డా॥ గిల్బర్టు స్లేటరు, డా॥ మెకరిగర్ గార్లు నా చదువుకు ఎంతో తోడ్పడ్డారు. ఆక్స్‌ఫర్డ్‌లో నిబంధనలను నేను తప్పుగా అర్థంచేసుకొని, ఒక్క విదేశీ భాష మాత్రమే నేర్చుకుంటే చాలని ఫ్రెంచి మాత్రమే అభ్యసించాను. జర్మను భాష కూడా నేర్చుకోవలసి ఉంది. బేకరుగారితో 'నేను అమెరికా వెళ్ళి చదువుకుంటాను, మా తండ్రిగారు ఈ అనవసరమయిన భాషలు నేర్చుకోటానికి నన్ను ఇక్కడకు పంపలేదు' అని వివాదపడ్డాను. బేకరుగారు నాకు ఇతర పాఠ్యాంశాలలో వచ్చిన మార్కులకు సంతసించి నాకోసం యూనివర్సిటీవారితో పోట్లాడి ఈ నిబంధనను తీసివేయించారు. రెండవసారి రెండు పాఠ్యాంశాలను ఎన్నుకోవలసి ఉంది. నేను రాజకీయ, ఆర్థిక విషయాలను ఎన్నుకొన్నాను. 'భారత విద్యార్థులు కరెన్సీ, బ్యాంకింగు, పబ్లిక్‌ఫైనాన్సింగ్ విషయాలలో వెనుకబడి ఉన్నారు. కనుక ఈ రెండు విషయాలలో ఏదో ఒకటి పాఠ్యాంశంగా నీవు తీసుకుంటే బాగుంటుందని' బేకరు గారన్నారు. నేను ఆ రెండు పాఠ్యాంశాలను తీసుకుంటాను, అవసరమైన సలహా ఇవ్వమని వారిని కోరాను. రెండు పాఠ్యాంశాలు తీసుకుంటే నీకు క్లాసు (ఫస్టుక్లాసు) కాదు గదా 'పాసు' కూడా రాదు అన్నారు. భారతీయులు వెనుకబడి ఉన్నారంటున్నారు కనుక నేను ఈ రెండు విషయాలు చదువవలసిందే అని పట్టుబట్టాను. అప్పుడు వారు నన్ను అడిగారు - "రంగా నీవు జీవితంలో ఏం చేద్దామనుకుంటున్నావు".

'నా దేశానికి సేవ చేద్దామనుకుంటున్నాను. కేంద్ర ప్రభుత్వానికి ఎన్నికై, నా ప్రజలను స్వరాజ్య సంపాదనకై ఏకం చేస్తాను' అని అన్నాను.

మరి నీ ఐ.సి.యస్. పరీక్ష?

'నేను ఐ.సి.యస్. చదువను. గాంధీగారు జైలులో ఉన్నారు. నేను నా దేశ రక్షణ కొరకు తయారుకావాలి.'

వారు నాకు 'షేక్‌హ్యాండిచ్చి' ఈ రెండు పాఠ్యాంశాలు తీసుకోవటానికి అనుమతినిచ్చారు. తరువాత వారు తనే ఈ పరీక్షలకు తయారవుతున్నారా అన్నంత శ్రద్ధ చూపించారు.

నేను బి.లిట్. (ఎకనామిక్స్) రెండు డిప్లమోల్లో ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణుడ నయ్యాను. ఈ సందర్భంగా బేకరు గారు వారింట్లో నాకు, భారతీదేవికి విందు నిచ్చారు. నన్ను సీనియర్ మెడల్ స్కాలర్‌షిప్‌కు యూనివర్సిటీవారు ఎంపిక చేసినప్పటికీ, నేను ఆక్స్‌ఫర్డ్‌ను వీడాలని నిశ్చయించుకున్నాను.

'రంగా ఉత్తమ విద్యార్థి' అని బేకరుగారు ప్రశంసాపత్రమిచ్చారు.

గిల్బర్టు స్లేటరు (Author of Dravidian Culture in Indian Culture) మొదట ఆర్థికశాస్త్రంలో ఆచార్యునిగా మద్రాసులో పనిచేసి, ఆ తరువాత ఆక్స్‌ఫర్డ్‌కు వచ్చారు. నా పరిశోధనలన్నీ వారి అజమాయిషీలోనే జరిగేవి. నా పరిశోధనల్లో నాలుగు అంశాలపై వారు శ్రద్ధ తీసుకున్నారు.

1. భారతదేశంలోని తెలుగు రాష్ట్రాలలో సామాజిక ఆర్థిక పరిస్థితులు.
2. దక్షిణ భారతదేశంలోని ప్రత్తి రైతుల పరిస్థితి.
3. చేతివృత్తులవారి ఆర్థిక స్థితిగతులు.
4. దక్షిణ భారతదేశంలోని ప్రత్తి మిల్లుల చరిత్ర.

పైవాటిలో మూడింటిని అర్థంచేసుకోవటానికి వారు ఏమీ కష్టపడలేదు. 1. స్వేచ్ఛా స్వాతంత్ర్యాల దృష్టితో చూశారు. నా అభివృద్ధి భావుకత్వాన్ని వారు అర్థం చేసుకొంటారని భావించాను. 2. భారతదేశంలోని భూమి శిస్తు విధానం, రైతులపై ప్రభుత్వపు నిర్లక్ష్యాన్ని కూడా వారు పట్టించుకోరనుకున్నాను. 3.భారత దేశంలోని ప్రత్తి మిల్లులు యూరోపులోని ప్రత్తి మిల్లుల వలె ప్రగతి సాధించ గలవని నేను వ్రాశాను.

భారతదేశంలోని ఆర్థికతకు, ఆర్థిక చరిత్రకు సొంత యాజమాన్యాలు దోహద పడగలవు. చేనేత పరిశ్రమ గురించి, చేతిమగ్గాల గురించి ఎంతో సానుభూతి

గల పరీక్షాధికారులు కూడా ఒప్పుకోకపోవచ్చని వారు భావించారు. మా ఇరువురి మధ్య ఈ విషయాలపై తీవ్ర చర్చ జరిగింది.

అదృష్టవశాత్తూ గిల్బర్టు స్లేటరు 'భారతదేశంలోని గ్రామాలు' అనే పుస్తకాన్ని మద్రాసు విశ్వవిద్యాలయ సహకారంతో ప్రకటించారు. నేను స్లేటరుగారి గ్రామీణ భారతదేశంలోని యథార్థ పరిస్థితులను, ఆ పుస్తకంలో వర్ణించిన విధంగా చూడవలసిందని కోరాను.

ప్రత్తి రైతుల ఆర్థిక పరిస్థితులపై నేను వ్రాసిన వ్యాసం నా పరీక్షాధికారులు సానుభూతితో అర్థం చేసుకున్నారు. కరవు నివారణ పథకాలను సర్ ఆర్థర్ మన్రో రోజుల నుండి చర్చించాను. గ్రామీణ భారతదేశంలోని చేతివృత్తులు ఏ విధంగా నిరుద్యోగపు కోరల్లో చిక్కుకున్నది వివరించాను. ఇందుకు సర్ విలియమ్ బివరిడ్జ్, కేంబ్రిడ్జిలోని ఆర్థికశాస్త్రవేత్త 'పిజో'ల పుస్తకాలు బాగా ఉపయోగపడ్డాయి.

చేతివృత్తులవారి పునరావాసానికి బ్రిటీషు లేబరు పార్టీవారు ప్రచురించిన కరపత్రాలు నా ఉద్యమానికి బలం చేకూర్చాయి. కోట్లాది భారతీయులు నిరుద్యోగంలో మగ్గుతున్నప్పుడు వ్యవసాయాన్ని మాత్రమే నమ్ముకోరాదని నేను బేకరు, టాడ్, మెకరీగర్‌లకు చెప్పాను. కేవలం పది లక్షల మంది ఉద్యోగ భద్రత కోసం బ్రిటీషువారు తపిస్తుంటే, కోట్లాదిమంది నిరుద్యోగుల కోసం నేను చేసే ఆలోచన తప్పా? (అని వారిని ప్రశ్నించాను). ఉద్యోగ భద్రత లేని బ్రిటీషు కార్మికుల కోసం పడే ఆరాటం భారతదేశంలో రాట్నం-మగ్గం కోసం తపనపడే ప్రజలపైన చూపలేరా? (అని ప్రశ్నించాను). "ఈ చేతివృత్తులన్నీ ఇంతకు క్రితమే పరీక్షించబడ్డాయి. బట్టల పరిశ్రమకు దాసోహం" అన్నాయని మిస్టరు స్లేటరు, మిస్టరు బేకరు వాదించారు. ఎండలో వీపులు కాలుతూ, రాళ్ళు కొట్టే భారత స్త్రీ పురుషులు బ్రిటీషువారికి కన్పించరా? వారిని మానవతా దృక్పథంతో చూడలేరా? అని నేను వారిని ప్రశ్నించాను.

మిస్టరు స్లేటరు, మిస్టరు బేకరుగార్లు నా ఆలోచనలకు ఏమాత్రం సంతోషంగా లేరు. వారొకరోజు నన్ను భోజనానికి పిలిచి నా పరిశోధనా వ్యాసంలో నూలు వడకటం, ఖాదీ అనే భాగాన్ని పరీక్షాధికారులు ఒప్పుకోరు కనుక మిగతా

మూడు భాగాలతో తృప్తిచెందవలసిందిగా కోరారు. నేనా ప్రతిపాదనను ఒప్పుకో లేదు. "నా అభిమాన విద్యార్థి బి.లిట్. డిగ్రీ తీసుకొంటాడని నేనెంతో ఆశించాను. నన్ను నిరాశపరచవద్దు" అని బేకరుగారు వాపోయారు.

"నాకు భారతదేశంలో పరిస్థితులు తెలుసు. నా దేశంలో సామాన్య ప్రజలు, స్త్రీలు కరవు రక్షణ శిబిరాల్లో పడే బాధలను కళ్ళారా చూశాను. ఒక బేడ ($\frac{1}{8}$ of Rupee) డబ్బు కొరకు మండే ఎండల్లో రాళ్ళు కొడుతున్నారు. ఒకటో రెండో సంకటిముద్దలు తమ అవిటి పిల్లల కోసం అడుక్కొంటున్నారు. ఒకటి, రెండు లేక మూడు అణాలు (అణా=$\frac{1}{16}$ రూపాయి) చేతివృత్తులమీద సంపాదించు కోవటం నేను భగవత్కృపగా భావిస్తాను. నేను ఢిల్లీలో గాంధీగారిని కలిశాను. గాంధీగారు నా ఆలోచనలు ఆక్స్‌ఫర్డ్‌లో కూడా విజయం సాధించాలి అని ఆకాంక్షించారు. నేను గాంధీగారి వద్దకే తిరిగి వెళ్తాను. వారు నన్ను ఆప్యాయంగా కౌగిలించుకొని, స్వాతంత్ర్యోద్యమంలోనికి ఆహ్వానిస్తారు" అని ఉద్వేగపూరితంగా వారికి చెప్పాను.

నా నిజాయితీని వారు అర్థం చేసుకున్నారు. నా సిద్ధాంత వ్యాసాన్ని పరీక్షాధి కారులయిన ఆర్థిక శాస్త్రవేత్తలు, పరిపాలనాదక్షులు మొదటి మూడు భాగాలను మాత్రమే ఆమోదించారు. ఖద్దరు-నూలు వడుకుట అనే అధ్యాయాలను తిరస్క రించారు.ఒకసారి నా వ్యాసాన్ని సరిచూడవలసిందిగా పంపారు. నేను రాట్నాన్ని-చేనేతను వదలలేదు. (నేను వ్రాసిన సిద్ధాంత వ్యాసాన్నే మరల బలపరచాను).

మిస్టరు స్లేటరు, మిస్టరు బేకరులు నేను వ్రాసిన సిద్ధాంత వ్యాసాన్ని బల పరచారు.

సాంకేతికమయిన, ఆర్థిక ప్రగతి ఇంగ్లాండులో ఉన్నట్లు భారతదేశంలో లేదు కనుక చరఖా-మగ్గాలను గుర్తించాలి అని మేము ముగ్గురమూ వాదించాము. పరీక్షాధికారులు ఆలోచనలో పడ్డారు. "ఆర్థికశాస్త్ర పునాదుల ఆధారంగా వాదన చేస్తున్నావా లేక భారతదేశపు రాజకీయం ఆధారంగానా?" అనే ముఖ్యమైన ప్రశ్నను నన్నడిగారు. రాజకీయాలు మాత్రమే నేను ఆలోచించి ఉంటే మిగతా మూడు భాగాలతో నేను తృప్తిపడేవాడినని వారికి బదులిచ్చాను.

వారు నా ఉద్దేశాలను గౌరవించారు. అధిక జనాభా, శ్రమ, ఒత్తిడి గల వ్యవసాయ దేశాలలో రాట్నం త్రిప్పటం, నూలు వడకటం వంటి వికేంద్రకృత పరిశ్రమలకు పాత్ర ఉంటుందని ఒప్పుకున్నారు. నా సిద్ధాంత వ్యాసంపై అధికార ముద్ర వేశారు. ఎంతోమంది కోరుకునే బి.లిట్. (B.Litt.) పట్ట ప్రదానం జరిగింది.

నా సిద్ధాంత వ్యాసం అదే సంవత్సరం 'ఎకనామికల్ జర్నల్'లో ప్రచురించ బడింది. నాలుగ వందల లక్షల మంది నిరుద్యోగులు, చిరుద్యోగులను గురించి నేను వ్రాసిన వ్యాసం హిందూ పత్రికలో ప్రచురించబడింది. ఐ.సి.యస్. ఆఫీసరు స్లేటరుగారు 1927 లో ఈ విషయాన్ని అంగీకరించారు. వీరూ, నా చదువుకు సాయపడ్డ స్లేటరు ఒకరు కాదు.

శ్రీమతి భారతీదేవిగారు 'రస్కిన్' స్కూలులో 'కళ' లను నేర్చుకునేవారు. ఆమె రచించిన చిత్రాలు గొప్ప పొగడ్తల నందుకున్నాయి. చరిత్ర గ్రామీణ ఆర్థిక విషయాలలో ఆమె ముందుంటున్నది.

అవి జీవితంలో మరపురాని రోజులు. చెట్లతో, పుస్తకాలతో, పడవలపైనా, లాకుల వద్ద స్నేహం చేసేవాళ్ళం. అక్కడి నిసర్గ సౌందర్యాన్ని అనుభవించేవాళ్ళం.

ఆమె ఇంగ్లాండులో, పారిస్‌లో కొంతకాలం గడిపింది. మధ్యతరగతి బ్రిటీషు వారి జీవితాన్ని తెలుసుకోగలిగింది. ఆమెకు వెంబ్లీ (Wembley), ఇంటర్నేషనల్ ఎగ్జిబిషను, బ్రిటీషు మ్యూజియం, లోవర్ మ్యూజియం, ప్రిన్స్ ఆల్‌బర్టు మ్యూజియం, నేషనల్ ఆర్ట్ గ్యాలరీలు చాలా ఉపయోగపడ్డాయి. దిగువ తరగతి స్త్రీల సాంఘిక పరిస్థితులను అధ్యయనం ఆమె చేసింది. ఆమె ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజీలు (ఉద్యోగానికి దరఖాస్తు చేసుకునే చోట్లు), నిరుద్యోగుల బీమా కార్యాలయాలు, పనిచేసే ఇళ్ళు, సమస్యాత్మకమైన పిల్లలు, అవిటి పిల్లలు నివసించే చోట్లను, వారి సాంఘిక కార్యక్రమాలపై అవగాహన ఏర్పరచు కొనేందుకు చూచింది.

ఆమె ఇంగ్లీషు నేర్చుకున్నది. భారతదేశం నుండి వచ్చేటప్పటికి ఆమెకు ఇంగ్లీషు బాగా రాదు. ఇంగ్లండును వదలి వచ్చేటప్పటికి ఇంగ్లీషులో మంచి

ప్రావీణ్యత సంపాదించింది. ఆమె ఇంగ్లండులో నేతచీరలనే కట్టేది. అవి ఆమెకు బాగా నప్పాయి. ఆమె ఎక్కడకు వెళ్ళినా ఆకర్షణీయంగా ఉండేది. ఆమె మృదు దరహాసం, నడవడి, గౌరవప్రదమైన ప్రవర్తన ఆమెను ఇంగ్లండులోని సభ్య సమాజంలోకి ఆహ్వానించేవి. ఆమెను యూరోపు తీసుకొనివెళ్ళాను. పేరుగాంచిన సోషలిస్టులు, క్వాకర్స్ (స్నేహితులు), శ్రామికులు, యూనివర్సిటీలో నన్ను రాజకీయంగా ప్రభావితం చేస్తున్న వారందరినీ కలుసుకొన్నది.

ఈ అనుభవాలే ఈ నలభై సంవత్సరాలలో మాకు ఎదురైన ఆటుపోట్లను తట్టుకొనేటట్టు చేశాయి.

పారిశ్రామిక విప్లవ కాలంలో బ్రిటీషువారు 'షేక్స్పియర్' నాటకాల ప్రచారంకు కృషి చేస్తున్నారు. మేము భారతదేశంలోని గ్రామీణ నాటకరంగంపై శ్రద్ధ చూపు తున్నాము. బ్రిటనులో కథాగానాలు (Ballods) గ్రామీణుల పాటలు, పదాలపై అభిరుచి పెరిగింది. సంస్కృత భాష, హాస్యంపై మా మనస్సు నిలిచింది. బ్రిటీషు వారి బృందగానాలు, వెల్స్ ప్రజల సంగీత సమ్మేళనాలు, మన గ్రామీణ భారతానికి దగ్గరగా ఉన్నాయి. గ్రామీణులతో స్నేహసంబంధాలు పెంచు కోవాలన్న వారి ఉద్యమం భారతదేశంలోని గ్రామీణ ఉద్యమంలాగానే ఉంది. వారి గ్రంథాల యోద్యయమము 'కార్నెగీ' సాయంతో శైశవదశలో ఉంది. భారతదేశంలో గ్రంథాలయోద్యమము 'యౌవన' దశలో ఉంది. మహిళా సంఘాలు, గ్రామ సంఘాలు మన దేశంలో ఉన్నట్లుగానే ఉన్నాయి.

బ్రిటనులో విద్యావేత్తలు, వయోజనవిద్యా ప్రచారకులు, సామ్యవాదులు చేసే కార్యక్రమాలు భారతదేశస్థుల సాంస్కృతిక కార్యక్రమాలలాగానే ఉన్నాయి. మన దేశపు విలువలను మనం పోగొట్టుకోకూడదు. యూరోపులో ఇప్పుడిప్పుడే కలుగు తున్న అవగాహన నుండి మనం నేర్చుకోవాలి. మనం ఆధునిక భారతదేశాన్ని నిర్మించాలి. మన సంప్రదాయాలను, మన కట్టుబాట్లను మనం నిలుపుకోవాలి. వీటి సాధన కోసం భారతదేశానికి తిరిగివెళ్ళాలని మా మనస్సులు తొందర పెడ్తున్నాయి.

1926 లో యమ్. సత్యనారాయణగారు (తరువాత కాలంలో యం.పి. అయ్యారు), యం.బి. నాయుడుగారు, నేను కలసి 'గ్రామాలకు వెళ్ళుదాం'

అనే ఉద్యమాన్ని ప్రారంభించాం. నాయుడుగారు ఒక పాటను వ్రాసి విజయవాడ రైతుసభలో పాడారు.

ఇంగ్లండులో కార్యకర్తలు 'లెక్కగాళ్ళు', పొదుపర్లు, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయరు. యూరోపులోని వారు పని 'అంతు' (అంతం) చూస్తారు. మనం కుందేలులాగా దోవలో నిద్రపోతాం. వారి మర్యాదకు తగిన గౌరవ వేతనం లభిస్తుంది. మనవాళ్ళు 'గాలి'లో బతకాలసిందే.

ఇంగ్లండులో వ్యవసాయదారులు, విద్యార్థులతో మాట్లాడి నేను చాలా లాభం పొందాను. మిస్టర్ యల్.బి. షార్ట్ (యూనిటేరియన్ మతాధికారి కుమారుడు), మిస్టర్ టామ్ విలియమ్స్(సౌత్‌వేల్సులో ఒక గని కార్మికుడు), మిస్ స్టాక్, ఆమె చెల్లెళ్ళు ఎలిజబెత్, ఆక్స్‌ఫర్డ్ విద్యావేత్తల కుమార్తెలు, మిస్ విలియమ్స్ (దిగువ మధ్యతరగతికి చెందిన స్త్రీ), మిస్టర్ ఫిలిప్ ధాంషన్స్ (లాంకుషైరులో జౌళి కార్మికుడు) – వీరందరితో నేను చాలా స్నేహంగా ఉండేవాణ్ణి. టామ్, ఫిలిప్‌లలో ఒకరు రస్కిన్ కాలేజీలో, మరియొకరు కాథలిక్ వర్కర్సు కాలేజీలో ఉపకార వేతనాలు పొందారు. వ్యాపార కూడళ్ళలో ఉండే ఇళ్ళకు వెళ్ళటం ద్వారా పారిశ్రామికుల పిల్లలు ఏవిధంగా లాభం పొందుతారో నేను గ్రహించాను. యల్.బి. షార్టు నా మనస్సుకు నచ్చిన మిత్రుడు, సామ్యవాది. వారి తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్ళు విశ్వవిద్యాలయాల్లో చదువుకున్నవారే. మిస్టర్ ఎల్.బి. షార్టు మిస్ విలియమ్స్‌ను పెళ్ళిచేసుకున్నారు. లేబరు పార్టీలో ఒడిదుడుకులు చూశారు. మిస్ స్టాక్ ఆంగ్ల సాహిత్యంలో దిట్ట. ఆమె కలకత్తాలో ఇంగ్లీషు ప్రొఫెసరయ్యింది. ఆమె చెల్లెలు కూడా విద్యావేత్తయే. మిస్టరు ఫిలిప్ ధాంషన్స్ కోర్టులో ★ప్రొబెషనరీ ఆఫీసరు. వీరందరితో స్నేహంగా ఉండటం నా అదృష్టం.

1920 లో ఎడింబరో వెళ్ళాను. చాలా చలి దేశం. ఆ వాతావరణం బాగా నచ్చింది. సహాయ నిరాకరణ పట్ల అక్కడి విద్యార్థులు చాలా సానుభూతితో ఉన్నారు. కొందరు మాత్రం వారి పెత్తందారీ గుణాన్ని వదలలేదు.

నేను స్కాట్లండులో ఇద్దరు భారతీయ విద్యార్థులను కలిశాను. ఒకరు కె. నరహరి. నరహరి భద్రాచలంలో లాభసాటియైన పొగాకు వ్యాపారం చేశాడు. రెండవవారు చౌదరిగారు. ఆయన డాక్టరు. ఇద్దరూ దేశభక్తి కలవారే.

★ ప్రొబెషనరీ ఆఫీసరు – నేరస్తుల పునరావాసానికి సాయపడేవాడు.

మేము ఎడింబరోలో 'హోలీరూడ్' భవనాన్ని చూశాం. చాలామందిమి భావోద్వేగానికి గురయ్యాం. రాణీ మేరీ మా మనస్సు దోచుకున్నది.

మొదటిసారిగా అక్కడ స్నానఘట్టాలకు వెళ్ళి చూశాను. భారతదేశంలో కూడా అటువంటివి ఉంటే బాగుంటుంది. జపానులో ఈ స్నానపుగదులు ప్రతి పట్టణంలో, ప్రతి పల్లెలో ఉన్నాయి. వారు ఏమాత్రం దాపరికం లేకుండా ఉంటారు. మన దేశంలో 'మళయాళీ' రాజకీయ ఖైదీలలో ఈ పద్ధతిని చూశాను.

ఆక్స్‌ఫర్డ్‌కు తిరిగిరాగానే మా తండ్రిగారు తీవ్రంగా అస్వస్థులైనారని తెలిసింది. వారిని మద్రాసు తీసుకువెళ్ళటానికి కూడా వ్యవధి లేదు. వారి మరణవార్త ఒక వారం తరువాత తెలిసింది. నాకు వారి సేవ చేసే భాగ్యం లేనందుకు విచారించాను. నేను నా చదువు, నా సాంఘిక కార్యక్రమాల్లో మునిగిపోయి వారి ఆరోగ్యం గురించి పట్టించుకోనందుకు తీవ్రంగా పశ్చాత్తాపపడ్డాను. స్వతంత్ర జీవనం, ఆత్మగౌరవం గ్రామ రాజకీయాలకు కావాలని, దూరంగా ఉండటం వంటి ఇంగ్లీషువారికి సొంతమయిన గుణాలన్నీ వారిలో చూశాను.

యల్.బి. చౌదరిగారు, నేను 1921 లో 'బ్రిటన్నీ' (వాయువ్య ఫ్రాన్స్) వెళ్ళాం. సెయింట్ బ్రూక్ అనే సముద్రపు ఒడ్డున గల గ్రామములో నివసించాము. ఈతలు కొడ్తూ, సెలయేళ్ళ సంగీతాలు వింటూ అడవి బాటల్లో తిరుగాడేవాళ్ళం. చౌదరికి తెలుగు సాహిత్యం ఇష్టం. పద్యాలు చదివేవాడు.

ఫ్రెంచివారు చాలా నిస్సిగ్గుగా ఉండేవారు. వారి ప్రవర్తన నాకు నచ్చలేదు. మన ప్రబంధాల్లో దిగజారుతున్న విలువల్లాగా, ఉమర్ ఖయ్యాం ప్రతినిధుల్లాగా వారు కన్పించారు.

అందమైన లాన్సింగ్ అనే 'ససెక్సు' గ్రామంలో ఆ నెలా గడిపాను. ససెక్సులో నేను తిరుగుతుండేవాడిని. అక్కడి ఎత్తు-పల్లాలను, గొర్రెల మెడల్లో మువ్వల చప్పుళ్ళను ఆస్వాదించేవాడిని. నేను, భారతీదేవిగారు 1939 లో బర్మాలో ఇటువంటి అనుభవాన్నే పొంది అక్కడ కొన్ని గంటలు ఆటవిడుపుగా గడిపాం.

1922 లో 'స్వాన్‌విక్' అనే దర్బాను గ్రామంలో భారతీయుల సమ్మేళనం జరిగింది. అక్కడ స్వరాజ్యాన్ని కోరుతూ మాట్లాడాము. వందలమంది భారతీయ విద్యార్థులు, వ్యాపారస్థులు, పరిపాలనాపరులు ఈ సమావేశాలలో పాల్గొన్నారు.

ఉపన్యసించారు. నేను చేసిన రెండు ఉపన్యాసాలు చాలా బాగున్నాయి. గాంధీజీ నాయకత్వానికి నా ధన్యవాదాలు.

కొంతమంది 'మాంటేగు-చెమ్సుఫోర్డు' సంస్కరణలను 1930 వరకు తాత్కాలికంగా అమలు చేయమన్నారు. ఈ ప్రతిపాదనకు నేనెంతమాత్రమూ అంగీకరించలేదు.'జలియన్‌వాలాబాగ్' కాల్పులు, జనరల్ డయ్యర్ నిరంకుశత్వం మా మనస్సులను కలచివేశాయి. మా తాపత్రయం జాతీయ గౌరవం కోసమే.

ఈ సమావేశం నా ప్రవర్తనలో తీవ్రమయిన మార్పుకు కారణమైంది.

నేను 'ఈస్టరు' పండుగ సందర్భంగా, చాడ్‌లింగటన్ గ్రామంలో ఒక రైతు కుటుంబంపు అతిథిని.

ఇక్కడి రైతులు ఏవిధంగా విదేశీ పోటీని తట్టుకోలేకపోతున్నారో నేను గమనించాను. పట్టణవాసులకు చౌకగా ఆహారాన్ని అందించటంకోసం ఈ రైతులను బలిపెడ్తున్నారు.

1922 వేసవి నాకొక గుర్తుగా మిగులుతుంది. బాంగర్‌లో కార్మికుల వేసవి పాఠశాలకు వెళ్ళాను. 'బిబ్లి' అక్కడ కార్యదర్శి. ఆమె మాంఛెష్టరు యూనివర్సిటీ నుండి ఎం.ఏ. డిగ్రీ పొందారు. హెన్రీక్లే, రెడ్‌ఫోర్టులు రాజకీయ, ఆర్థిక శాస్త్రాలలో ఉపన్యాసకులు. సంఘసేవ ఇక్కడ ప్రత్యేక పాఠ్యాంశం. వందమంది కార్మికులు వారి వారి సంఘాల తరఫున ఈ కాలేజీకి పంపబడ్డారు. వీరందరూ నలభై, ఏభయ్యేళ్ళవారు. సోషలిజంపై విశ్వాసం కలవారు. నేను హఠాత్తుగా ఒక కొత్త వాతావరణంలోనికి విసిరివేయబడ్డాను.

వీరికి ప్రిన్స్ ఆఫ్ వేల్సుపై ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులకున్నంత మోజు లేదు. ఇండియాలో ప్రిన్స్ ఆఫ్ వేల్సుకు నిరసనను వారు పట్టించుకోలేదు. భారతీయులు కూడా తమ తోటి బాధితులే అని తలచారు. భారత స్వాతంత్ర్య సమరం చేస్తున్నవారిపై వారికి సానుభూతి ఉంది. ఇది నాకొక కనువిప్పు బ్రిటీషు పాలనపై ఇంత వ్యతిరేకత ఉందా అని ఆశ్చర్యపోయాను. వీరి స్నేహంలో ఒక కొత్త విషయం అర్థమయింది. భారతదేశంలో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా రైతుల బీదరికం, అధికార రాహిత్యం ఇంగ్లాండు రైతుల వలెనే ఉంటుంది.

ఈ పరిస్థితులలో సాంఘిక న్యాయం ఎక్కడ? ధనవంతులు–పేదవారి మధ్య తారతమ్యం ఎలా తొలగించాలి? సాంఘికంగా ప్రజాస్వామ్యాన్ని ఎలా సాధించాలి? వాస్తవ దృక్పథాన్ని భారతీయులకెలా అందించాలి?

రోజూ ఏడెనిమిది గంటలు ఫ్యాక్టరీల్లో, మిల్లుల్లో, గనుల్లో, ఆఫీసుల్లో పనిచేసే ఈ కార్మికులు తమ విరామ సమయాన్ని కార్మిక సంఘాలలో గడుపుతుంటారు. వీరి రాజకీయ స్పృహ భారతదేశంలో అణగదొక్కబడినవారిలాగానే (హరిజనుల) ఉంది.

ఈ మూడు వారాలలో ఎంతోమంది స్నేహితులయ్యారు. ఫిలిప్ థాంప్సన్ ఒక నేతపనివాడు. నా ఆలోచనలను చక్కగా విని అర్థంచేసుకునేవాడు. 1952 నుండి నేనెప్పుడు లండను వెళ్ళినా ఒక వారం రోజులు ఎగువ దర్హాహాంలోని వారి ఇంట్లో ఉండేవాడిని. ఎల్సీబెర్రీ మాకంటె చిన్నది. మేమేదో మంచిపనులు చేస్తున్నామని నమ్మే ఈమె శ్రీమతి బెర్రీ కుమార్తెలలో ఒకరు. శ్రీమతి బెర్రీ 'చోర్లే'లో హాస్టలు వార్డను. ఈమెను 1946 లో మరలా కలిశాను. అప్పటికామె 'చోర్లే'లో ఒక ప్రముఖ సాంఘిక ఉద్యమకారిణి. ఈమె భర్త కుటుంబం కూడా ప్రసిద్ధిచెందిందే. 'క్రాస్‌స్ట్రీటు' వారి పేరుమీద పెట్టిందే. వారిద్దరూ డెమెక్రాట్లు. మా పాన్ ఆఫ్రికన్ స్నేహితులకు సాయం చేసేవారు.

నా ఆశయాలను, కార్యక్రమాలను మెచ్చుకుంటూ ప్రొ. స్టాక్ వ్రాసిన 'ముప్పై సంవత్సరాల రైతుఉద్యమం' వీరి ప్రెస్‌లోనే ముద్రింపబడింది. ఇరవై సంవత్సరాల తరువాత వీరిని మరలా కలిశాను. భారతీదేవిగారికి, నాకు ఈ కలయిక ఒక అద్భుతం. మాణిక్యారావు అనే హరిజన విద్యార్థిని నిడుబ్రోలు స్కూలులో చదివించేవాడిని. అతను లండను వెళ్ళాడు. యాదృచ్ఛికంగా లండనులోని బ్రివేరియన్ ప్రెస్‌కు వెళ్ళాడు. మిసెస్ క్రాసుగారు ఆయన్ను మీరు భారతదేశం ఏ భాగంనుండి వచ్చారు? మీకు 'రంగా'గారు తెలుసా? అని అడిగింది. మాణిక్యారావు సంతోషంతో నేను 'రంగాగారి గ్రామం నుండే వచ్చాను' అని చెప్పాడు. మాణిక్యారావును తన భర్తకు పరిచయం చేసింది. ఆమె మాణిక్యారావును ఇంట్లోకి తీసుకువెళ్ళి, మా ఫోటోలు అన్నీ చూపించింది. మరుసటిరోజు మధ్యాహ్నం వారింటికి భోజనానికి ఆహ్వానించింది.

నేను జైలు నుండి విడుదల అయిన తరువాత మాణిక్యారావు నాకు ఈ విషయం చెప్పాడు. కానీ అతను ప్రెస్సు ఉన్న బజారు పేరు మర్చిపోయాడు. నేను, భారతీదేవిగారు ఆ అడ్రసు గుర్తుచేసుకొని వారికి జాబు వ్రాశాము. ఆ జాబు వారికందింది. మా స్నేహం మరలా పునరుద్ధరింపబడింది.

మాణిక్యారావు ఇప్పుడు లేడు. గుండెజబ్బుతో మరణించాడు. మా ఉద్యమానికి ఎంతో నమ్మకమైనవాడు. కృషికార్ లోక్‌పార్టీకి 1952 లో మా అభ్యర్థిగా పోటీ చేశాడు. కానీ గెలవలేదు.

'క్రాస్' కుటుంబం నిడుబ్రోలులో 'జీన్' అనే హరిజన బాలికను అభిమానించే వారు. శ్రీమతి మార్గరెట్ రౌండ్ ఈ పిల్లను దత్తత తీసుకున్నారు. మిస్టరు విలియమ్ ఇవాన్సు నాకన్నా వయసులో పెద్దవాడు. (గ్రోవర్ టౌన్) కౌంటీకి కౌన్సిల్సు ఛైర్మన్‌గా, ప్రధాన రక్షకభటుడుగా ఎదిగాడు. నేను ఎప్పుడు వెళ్ళినా వారిని కలుస్తుంటాను.

జార్జి థాంప్సన్ (George Thompson) నాకు మంచి మిత్రుడు. లేబరు పార్టీకి వారొకసారి పార్లమెంటు అభ్యర్థి. మంచి ఉపన్యాసకుడు. వారు బోల్టన్ నగరానికి ఆల్‌డర్‌మెన్ (పెద్దల కమిటీ సభ్యుడు) గా (Alderman) పనిచేశారు. పట్టణ లేబరుపార్టీ అధ్యక్షులు. నాకన్న వయసులో పెద్దవారు. నా రాజకీయ ఆలోచనలు, అవగాహనపై శ్రద్ధ చూపించేవారు. నేను జైల్లో ఉన్న రోజులవి. వారితో ఉత్తర ప్రత్యుత్తరాలు ఎంతో సంతోషం కలిగించేవి. నేను 'పాన్ ఆఫ్రికన్ కాన్ఫరెన్సు'కు వెళ్ళినప్పుడు వారు, మిస్టర్ క్రాస్‌ను, నన్ను భోజనానికి ఆహ్వానించారు. ఎంతో సంతోషకరమయిన విషయం.

హెన్రీక్లేగారు బాంగూర్ సమావేశాల తరువాత మిత్రులయ్యారు. నా 'గిల్డు సోషలిజం'పై శ్రద్ధ చూపించేవారు. వారికి నే వ్రాసిన సిద్ధాంతవ్యాసం నచ్చింది. వివిధ వృత్తులు, కులాలు, తెగలు ఉన్న దేశంలో గిల్డు సోషలిజం ప్రాధాన్యతను గుర్తించాడు. క్లేగారు చెప్పే 'గిల్డు సోషలిజం' (శ్రేణీ సామ్యవాదం) భారతదేశానికి అవసరమని నేను భావించాను. 1930 లో వారు బ్యాంకు ఆఫ్ ఇంగ్లాండుకు డైరక్టరయ్యారు.

లాంక్‌షైరు, వేల్సు, బాంగర్ సమావేశాల తర్వాత చాలామంది మిత్రులయ్యారు. వారు నివసిస్తున్న పరిస్థితులను అర్థంచేసుకున్నాను. ఉద్యోగాలు దొరకని రోజులవి. చాలామంది నిరుద్యోగులు. నాకు ప్రత్యక్షంగా వారి క్లబ్బులు, ట్రేడ్‌యూనియన్లతో పరిచయమయ్యింది. వారి ఇనుము-ఉక్కు కర్మాగారాలకు వెళ్ళాను. పాలిటెక్నిక్‌లు వారిని మంచి మెకానిక్కులుగా తయారుచేస్తున్నాయి. వారి పారిశ్రామిక ప్రగతికి కారణాలు తెలుసుకున్నాను. ఎన్ని పుస్తకాలు చదివినా ప్రత్యక్షంగా చూచినదానికి సరిరావు. ఏంజెల్సు (Engels), హామండ్స్ (Hammands), వెబ్స్ (Webbs), ఫేబియన్స్ (Fabians), కన్నింగుహామ్ రచనల్లో క్రొత్త అర్థాలు స్ఫురించేవి.

గ్రామీణ పరిశ్రమలు, వికేంద్రీకరణ, ప్రాచీన కళలు, వృత్తులపై నా మనస్సు నిలిచేది. 1922 నుండి భారీ పరిశ్రమలు, నిత్యావసరాలపై నా ఆలోచనలను కేంద్రీకరించాను. ఈ రెంటిమీద (గ్రామీణ పరిశ్రమలు - భారీ పరిశ్రమలు) అవగాహనకు నాకు చాలాకాలం పట్టింది.

హౌసీ (House), వైజ్ (Wise) కుటుంబాల సాహచర్యంతో ఆక్స్‌ఫర్డ్‌కు వచ్చిన రెండు నెలల్లోనే ఇంగ్లీషు రైతుల సాంఘిక జీవితాన్ని గురించి తెలుసుకుంటున్నాను. రామకృష్ణ హౌసీ కుటుంబానికి డబ్బు చెల్లిస్తూ అతిథిగా ఉంటున్నాడు. నేను కూడా వారిలో ఒకరినయ్యాను. వారు పాడిపరిశ్రమ, మొక్కజొన్న, గోధుమ పంటలకు వచ్చే లాభనష్టాలను గురించి చెప్పేవారు. లాయడ్ జార్జి అయిదు సంవత్సరాల రైతు వ్యతిరేక విధానాలవల్ల వారి అదృష్టం తారుమారు అయింది. వ్యవసాయం మానుకొని ఒక కొడుకు ఆస్ట్రేలియా వెళ్ళాడు. ఇంకొకడు న్యూజిలాండ్ వెళ్ళాడు. ఒక అమ్మాయి కెనడా వెళ్ళి అక్కడ ఒక రైతును పెళ్ళి చేసుకున్నది. ఇంకొకడు వేరే దేశంలో స్థిరపడ్డాడు. "ఏ ప్రభుత్వాన్నీ శాంతి సమయంలో నమ్మకూడదు. ఇతర దేశాల దిగుమతులు ఎక్కువ. నేను మిసెస్ హౌసీ మాట విన్నాను కనుక దివాళా తీయలేదు. పాడిపరిశ్రమను ప్రోత్సహించి, గోధుమ పంటను తగ్గించమని హౌసీ నాకు చెప్పింది" అని మిస్టర్ హౌసీ అన్నారు. భారతదేశంలో కూడా అప్పుడే ధరలు తగ్గుతున్నాయి. "యుద్ధ కాలంలో

ధరలు పెంచి, శాంతి సమయంలో ధరలు తగ్గిస్తూ ఉంటే మీ లేబరుపార్టీ ఏం చేస్తున్నదని” హౌసీ గారినడిగాను. “లేబరుపార్టీ ఇప్పుడు బలహీనంగా ఉంది” అని అన్నారు.

ఇంగ్లాండులో వ్యవసాయదారులు, వారి జీవితాలను గురించి నేను బాగానే తెల్సుకున్నాను. అక్కడ ఆడపిల్లలు పట్టణ వృత్తులపై మక్కువ చూపిస్తున్నారు. మగపిల్లలు రకరకాల వ్యాపారాల్లోకి వెళ్తున్నారు. కొద్దిమంది మాత్రమే వ్యవసాయాన్ని నమ్ముకొన్నారు. 1952 లో కెనడా, అమెరికాలలో పరిస్థితులు ఇదేవిధంగా ఉన్నాయి. హౌసీ పెద్దకొడుకు ‘ఎడ్లీ’ పాడిపరిశ్రమను నూతన పద్ధతులతో అభివృద్ధి చేస్తానన్నాడు. అతని మేనకోడలు 1955 లో ఇదే వ్యాసంగంలో ఉంది. కొందరు పిల్లలు నేలమీద నడుద్దామనుకొంటారు. మిస్టరు వైజు తానొక కర్మాగారాన్ని పెట్టాలనుకుంటున్నాడు. ఈ కుటుంబాల వ్యవసాయ కూలీలతో నేను సన్నిహితంగా ఉండేవాడిని.

1946 లో నేను ఆక్స్‌ఫర్డ్ కౌంటీలో పర్యటిస్తున్నాను. అక్కడ రైతు ప్రతినిధులతో మొదటి ప్రపంచ సభలకు వెళ్ళాను. అక్కడ కౌంటీ రైతు నాయకుడు “బాట్లేలో మీరు ఎల్మ్‌పారంలో 1922, 1924లో ఉన్నారు కదా” అని అడిగాడు. అతను నా స్నేహాన్ని గుర్తు చేసుకున్నాడు. తాను డబ్బు దాచుకొని ఒక వ్యవసాయ క్షేత్రాన్ని అద్దెకు తీసుకొని, తానుగా ఒక వ్యవసాయదారుడనయ్యానని చెప్పాడు. ఆ తరువాత యుద్ధం వచ్చింది. “యుద్ధ సమయంలో వ్యవసాయం బాగున్నందు వల్ల ఒక వ్యవసాయ క్షేత్రాన్నే కొన్నాను” అని చెప్పాడు. నన్ను రైతు నాయకునిగా గుర్తించి అతను గౌరవించాడు. నేను ఈ ఆకస్మిక సంఘటనకు చాలా సంతోషించాను.

1953 లో మిసెస్ హౌసీ పూర్తి వయస్సులో చనిపోయారు. 1952 లో ఆమెను కలిశాను. 1952 లో ఆమె కారుని ఆమె నడుపుకునేది. “మిస్టరు రంగా రైతులున్నారన్న విషయం మా ప్రభుత్వానికి యుద్ధం వస్తేగాని తెలియలేదు. రైతు సంఘాల నిర్మాణమే ఈ సమస్యలకు పరిష్కారమని నీవు చెప్పిన విషయాన్ని నా భర్తకు చెప్పేదాన్ని. ప్రొ. రంగా! భారత రైతులకు నీవు చేస్తున్న సేవలకు నాకు చాలా సంతోషంగా ఉంది” అని అన్నారు.

ఈ పర్యటన తరువాత 'స్కార్‌బరో'లోని కార్మిక పరిశోధనా కేంద్రానికి వెళ్ళాను. జి.డి. హెచ్. కోల్ మరియు హాబ్సన్ హెచ్.యన్. బ్రెయిల్స్‌ఫర్డు, పేజ్ ఆర్నాల్డ్, ఆర్.పి. దత్తు, మిస్. ఎలెన్ విల్కినాన్, లేబరు మాసపత్రిక ఎడిటరు (తరువాత కాలంలో లేబరు ప్రభుత్వంలో కాబినెట్ మంత్రి), ఇతర ఉపన్యాసకులు నాకు మిత్రులైనారు. నేను వారికి ఉపన్యాసకుడను (Lecturer) మరియు విద్యార్థిని. లేబరుపార్టీ వారి వామపక్ష రాజకీయాలకు ఆకర్షితుడనయ్యాను. నానాజాతి సమితి నుండి రెండవ (సోషలిస్టు) ఇంటర్నేషనల్ వరకు సోవియట్ భవితవ్యం గురించి మాట్లాడుకునేవాళ్ళం. ఆ పదిహేను రోజులలో నేను రష్యాపట్ల లేబరుపార్టీవాళ్ళ దృక్పథం తెలుసుకున్నాను. వారు సోవియట్ రష్యాలో రైతులు కార్మికులతోపాటే శ్రమజీవులు అన్న నమ్మకంతో ఉన్నారు. రష్యాలో రైతుల నుండి నిర్బంధపు 'లెవీ' వసూలు చేస్తున్నారనీ, సోవియట్ సైన్యాలు వ్యవసాయోత్పత్తులను బలవంతంగా తీసుకుంటున్నారన్న అవగాహన లేదు. బాంగర్‌లో ఉపన్యాసకులు రాజ్యాంగబద్ధంగా, నెమ్మదిగా వలస ప్రజల స్వాతంత్ర్యాన్ని కోరుతున్నారు. మేమందరము త్వరలోనే భారత దేశం స్వరాజ్యం సంపాదించుకొంటుంది అన్న నమ్మకంతో ఉన్నాం.

మహాత్మాగాంధీని తీవ్రమయిన మితవాదిగా, డబ్బు కలవారి ఏజెంటుగా, ఆర్థిక ప్రగతికి వ్యతిరేకిగా రష్యా చేసే లోపాయికారీ విమర్శలు నన్ను కలవరపరుస్తున్నాయి. రైతులు ఏనాడైనా మరుగునపడవలసినవారే అని వారి అభిప్రాయం. వారు పెరిగిన సమాజం వారిని ఆవిధంగా ఆలోచింపజేస్తున్నది. వారి మాటల వలన భారతదేశానికి ఏమాత్రం లాభం ఉండదని గ్రహించాను. బ్రెయిల్స్‌పర్డు-గాంధీగారిపైన నమ్మకాన్ని కలిగివున్నారు. "ఈ కుర్రవాళ్ళు (Young Lecturers) రైతాంగ సమస్యలపై అవగాహన లేనివారన్నారు. ఎంతో గొప్పగా చాలా ఎక్కువగా చెప్పుకునే మార్క్సిజంలో అన్నిటికీ సమాధానాలు లేవన్నారు. ఎన్నో మతాలు, కులాలతో ఉన్న భారతదేశానికి శ్రేణీ సామ్యవాదమే (Guild Socialism) ఉపయోగపడుతుందన్నారు". ఇదే విషయం ప్రొ. క్లేతోనూ చెప్పారు.

మిస్టరు కోల్‌తో నేనీ విషయం మాట్లాడేవాడిని. మిస్టరు బ్రెయిల్స్‌పర్డ్ మా చర్చలలో భాగస్వామి. కులాల అడ్డుగోడలను నిర్మూలించటమే మా ధ్యేయం.

ఇంగ్లాండులో సహకార విధానం అంతా వినియోగదారులపైననే ఆధార పడింది. ఈ రైతుల సమస్యలకు పరిష్కారం డేనిష్ రైతుల సహకార సంఘాలలో దొరకవచ్చని బ్రెయిల్స్‌పోర్డ్ నాతో చెప్పాడు. మిస్టరు కోల్‌కు ఈ ఆలోచన నచ్చింది. నాకు డెన్మార్కుకు వెళ్ళే ఉద్దేశ్యం కలిగింది. బ్రెయిల్స్‌పర్డ్ నాకు డెన్మార్కు, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, ఇటలీ, జర్మనీ దేశాలలో పరిచయస్థులకు పరిచయ లేఖలిచ్చాడు.

“మరువలేని జాతీయవాది. మామూలు జాతీయవాది కాదు. నిర్మాణాత్మక మయిన ఆలోచనలు కలవాడు. గాంధీగారి ఆశయాలను నమ్మినవాడు” అని నన్నుగూర్చి వ్రాశాడు. ఈ మానవతావాదితో నా స్నేహం 1958 లో వారు చనిపోయేవరకూ కొనసాగింది.

ఇంగ్లండులో ఉండగా నేను అమెరికా గురించి ఎక్కువగా చదివాను. హెచ్.జి. వెల్స్ (H.G. Wells) తన ‘ప్రపంచ చరిత్ర’లో ఉడ్రో విల్సన్ (Woodrow Wilson) ను తీవ్రంగా విమర్శించాడు. ఆక్స్‌ఫర్డ్‌లోని భారతీయులకు వారిపై (Woodrow Wilson) గొప్ప గౌరవముంది. వారి జీవితచరిత్ర నేను పదేపదే చదివాను. వారు వ్రాసిన ‘క్రొత్త స్వాతంత్ర్యాన్ని’ చదివాను. రెండు పర్యాయములు అధ్యక్షునిగా ఎన్నికయిన వారిపై నా గౌరవం పెరిగింది. ఫ్రెంచి నాయకుల గురించి, బ్రిటీషు ప్రధానమంత్రి ‘లాయిడ్ జార్జి’ని గురించి చదివాను కానీ వీరిని అంతగా మెచ్చుకోలేకపోయాను. గార్డెనరు, స్పెండర్లల, బ్రిటీషు, యూరోపియన్ నాయకుల జీవితచరిత్రలను చాలా జాగ్రత్తగా చదివాను. విల్సన్, అబ్రహాం లింకన్ వంటి నాయకులను యుద్ధానంతరం చూడలేదు. 19వ శతాబ్దపు లిబరల్స్‌ను గురించీ చదివాను. అమెరికా సామ్రాజ్యవాదంపై బ్రిటీషు లేబరు నాయకులు చేసిన విమర్శలు, మిస్టర్ కోల్‌గారి పరిశీలన నాకు ఒక హెచ్చరికగా మిగిలాయి. కుక్లుక్స్‌క్లాను (Ku-Kluxclan) నీగ్రోలపై చేసిన దాడులు అమెరికావారి జాతి పక్షపాతానికి నిదర్శనం. నాకు అమెరికా రాజకీయంపై ఆసక్తి పెరిగింది.

ఈ మూడు సంవత్సరాలు నేను ఇంగ్లండులో ఉండటం యూరోపు రాజకీయాలను గురించి తెల్సుకోవటానికి ఉపయోగపడింది. ఐరీషు దేశాలు

పాక్షికంగా స్వాతంత్ర్యం సంపాదించుకొన్నాయి. ఐరిష్ సాయుధ విప్లవం ఇంగ్లాండుపై విజయానికి దోహదపడింది. శతాబ్దాల ఐరిష్ ప్రజల పోరాటం ఇంగ్లండు బలహీనతల్ని, ఇంగ్లండు 'విసుగు'ను తెలియచెప్పింది. డా॥ వెలారీ (Dr. Velari), గ్రిఫిత్స్(Griffiths), కోలిన్స్ (Collins) ఐరిష్ ప్రజల స్వాతంత్రానికి బాధ్యులు. బంగారు అవకాశాన్ని కాలదన్నుకొన్నారు. గ్రిఫిత్ గుండెజబ్బుతో మరణించాడు. మైకేల్ కోలిన్సును చంపేశారు. వెలారి తన పూర్వ మిత్రులతోనే యుద్ధం చేయాల్సివచ్చింది. ఇటువంటి పరిణామాలు భారతదేశంలో కూడా రావచ్చుని నేను భావించాను.

భారతదేశ విభజన ఇంతకన్నా ఎక్కువ దురదృష్టాన్ని మూటకట్టుకోవలసి వచ్చింది.

ఐరిష్‌వారి విజయం మాలో ఆశలు రేపింది. అటాటర్కు (Ata-Turk), ఇస్మత్ పాషాలు (Ismath Pasha) టర్కీపైనా, ఇంగ్లాండువారిపైన విజయం సాధించారు.

డి. వెలారి, అటాటర్కులు భారతీయులకు వెలుగుబాట చూపించారు. లేబరు పార్టీ భారతదేశానికి స్వాతంత్ర్యమిచ్చే ఉద్దేశ్యంతో ఉంది. లాలాలజపతిరాయ్ గారు ఆక్స్‌ఫర్డ్‌కు వచ్చారు. వారిని లేబరు పార్టీవారు ఆహ్వానించారు. మేమందరమూ లేబరు పార్టీవారికి ఎన్నికలలో సహాయం చేశాము. పెద్ద ప్రతిపక్ష పార్టీగా లేబరుపార్టీ ఎదిగింది (1923). లాయిడ్ జార్జి ప్రభుత్వ ఓటమికి, విన్‌స్టన్ చర్చిల్ డూండీ బై-ఎలక్షన్లలో ఓటమికి మేమెంతో సంతోషించాము.

ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ విద్యార్థులు యూరోపులో ఎండాకాలపు పర్యటనకు వెళ్ళేవారు. యూరోపులో సమస్యలు తెలుసుకోటానికి ఈ పర్యటనలు అనుకూలించేవి. నాలో ఈ పర్యటనలు విశ్వాసం పెంచాయి. జాతీయవాదిగానే కాక అంతర్జాతీయ వాదిగా మార్చాయి.

నేను నానాజాతి సభలోను, అంతర్జాతీయ కార్మిక సంఘంతోనూ చనువుగా ఉండేవాడిని. రవీంద్రనాథ్ టాగూర్ వ్రాసిన 'జాతీయవాదం' అన్న పుస్తకాన్ని చదివి నానాజాతి సమితిపై నాకున్న అభిప్రాయాలు సవరించుకున్నాను. గాంధీగారి-టాగూర్‌గారి చర్చలతో సహాయ నిరాకరణోద్యమాన్ని అర్థంచేసు

కున్నాను. ఆల్‌బర్టు థామస్ (డైరెక్టరు–అంతర్జాతీయ కార్మిక సంఘం) తో మాట్లాడి, ఈ అంతర్జాతీయ సంస్థలు రైతుల రక్షణ కొరకు పోరాడే రోజు ఒకటి వస్తుందని ఆశించాను.

ఇంగ్లీషు, యూరోపియన్ చరిత్రలను, రాజకీయ, సాంఘిక ఉద్యమాలను అధ్యయనం చేశాను. గాంధీగారి 'యంగ్ ఇండియా' చదవటంవల్ల గాంధీగారికి రోజురోజుకు దగ్గరయ్యాను. గ్రామీణ ఆర్థికాభివృద్ధికి గాంధీగారి కృషి నా మనస్సుకు చేరువయ్యింది. రస్కిన్ రచన 'చివరవరకు' (Unto the Last) గాంధీగారిని ప్రభావితం చేసింది. రస్కిన్ ఆ పుస్తకంలో కళలు–కళాకారులు, ఇతర వృత్తుల వారిని గురించి కూలంకషంగా చర్చించారు. నేనా శైలికి ముగ్ధుడనయ్యాను. ఎంత అందమయిన శైలి అది!

గాంధీగారు చెప్పినట్లుగా స్వరాజ్యం సంవత్సరంలో రాలేదు. ఇంగ్లండులో ఉన్న అందరం నిరాశ చెందాము. మేము వారిని విమర్శించలేదు. బ్రిటీషు పత్రికలు గాంధీగారి ఆర్థిక విధానాలను హేళన చేశాయి.

యూరోప్ అధ్యయన యాత్ర

అధ్యయన యాత్రకు యూరోపు వెళ్ళే ముందు ఒక పక్షం రోజులు లండనులో ఉన్నాను. కార్మికుల ఉద్యోగకల్పనా కార్యాలయాలు, నిరుద్యోగుల బీమా, రేవు కార్మికుల ఉద్యోగ పరిస్థితులు – అన్నీ కార్మిక సంఘాలలో తిరిగి తెలుసుకున్నాను. లండను కౌంటీ సభలు, బర్రో సభలు, గ్రామీణ సభలు, శాశ్వత పాలనా వ్యవస్థల కార్యక్రమాలనర్థంచేసుకున్నాను. చాలామంది కార్మిక నాయకులతో ముఖాముఖి మాట్లాడాను. *'బ్రిటన్ హౌస్ ఆఫ్ కామన్స్'ను గాలరీలో* కూర్చొని *చూశాను. ఆ నడవలు, చావళ్ళు, చిత్రాలు, శిల్పాలు, చిత్రపటాలు, కారిడార్లు, హాళ్ళు, పూర్వీకుల ఫోటోలు, గోడలపై వర్ణచిత్రాలు, రంగులద్దిన నేలతో చర్చిలా కనిపించే పార్లమెంటు భవనాన్ని చూస్తుంటే నా కళ్ళముందు బ్రిటీషు చరిత్ర మొత్తం కదలాడింది. ఎంత అలంకారం! ఎంత రాజసం! రాత్రివేళ థేమ్స్ నదిలో కనిపించే ఆ భవన ప్రతిబింబంతో 'ప్రజాస్వామ్య దేవాలయం' లాగా కన్పిస్తుంది. ఎప్పటికీ తరగని చరిత్రకు సాక్షి.* వారి పార్లమెంటరీ సాంప్రదాయాలు

చదివాను. బర్క్, బేజ్‌హాట్, పిట్, ప్లేస్, పారనెన్, కాబ్‌డన్, ఛారిస్టులు, సఫ్రోగేట్లు, గ్లాడ్‌స్టోను, డిజ్రాయల్, లాయిడ్ జార్జి, లార్డ్ లాన్సుబర్త్ వంటి సంస్కర్తలు ప్రపంచం కోసం చేసిన సేవలు వారు గుర్తుంచుకున్నారు. వారు ప్రపంచ కార్మికుల కోసం 'బిల్ ఆఫ్ రైట్స్' (ప్రాథమిక హక్కులు) కోసం పోరాడారు. రాత్రివేళ మహిళల, పిల్లల పని బహిష్కరణకు, బానిసత్వ నిర్మూలనకు, మురికికూపాల నుండి బయటపడటానికి, పత్రికా స్వేచ్ఛకు ఒకే వేదికగా, ఒకే ఆలోచనగా, ఒకే వ్రాతగా శ్రమజీవులందరూ పనిలో భాగస్వాములుగా, నివాసులుగా, ఓటర్లుగా ఉండేటందుకు కృషి చేశారు. అందరు సామ్యవాదుల వలెనే నేను కూడా ఇంగ్లాండు సామ్యవాద దేశం కాగలదని పూర్తి విశ్వాసంతో ఉండేవాడిని. *ఈ భవనంలో కాలు పెట్టినప్పుడల్లా ఎంతో ఉత్సాహంగా ఉండేది. ఒక పురాతన దేవాలయంలోనో, చర్చిలోనో, తాజ్‌మహల్ వంటి సుందర మందిరంలోనో, ఒక జామామసీదులోనో ఉన్నట్లు అనుకొనేవాడిని. నేను ఇంగ్లాండు వెళ్ళిన ప్రతిసారీ ఈ పార్లమెంటు భవనంలో కాలు పెట్టి ప్రపంచ ప్రజాస్వామ్యానికి ఈ పెద్దలు చేస్తున్న సేవకు అంజలి ఘటిస్తుంటాను.*

నేను టోయిన్‌బీ హాలులో ఈసారి విడిదిచేశాను. దీని సంరక్షకుడు (Warden) మిస్టర్ జె.జె.మాలన్ (J.J. Malan) నా చదువుకు సహాయం చేశాడు. దీని కార్యదర్శి మిస్టర్ కాచ్‌పూల్ (Catchpool) యువకుడు. ప్రజాస్వామ్యం, సోషలిజంలపై నాకున్న అభిమానం వారి ఆదరణకు నోచుకుంది. "రంగా అమెరికన్ల వలె ఎప్పుడూ ఎంతో ఉత్సాహంగా తీరిక లేకుండా ఉంటాడు" అనేవారు. వారిని 34 సంవత్సరాల తరువాత 1954 లో అనుకోకుండా ఢిల్లీ లోని క్వాకర్సు సెంటర్‌లో కలిశాను. *"ప్రపంచం అంత పెద్దదీ కాదు–మనుష్యుల మధ్య అంత దూరం లేదు" అనిపించింది.*

మొదటగా ఫ్రాన్సు వెళ్ళాను. నాకు ఇంగ్లీషు వచ్చినంతగా ఫ్రెంచ్ రాదు. మిస్టర్ పాల్‌ఫేవర్ (Paul Favre) నాకు సలహాదారు (Guide). వారు సామ్యవాది. 'హ్యూమనైట్' దినపత్రికకు సంపాదకుడు. ఫారిన్‌లో రాజకీయ పార్టీలు నన్ను గజిబిజి చేశాయి. వారి రాజకీయ విభేదాలన్నీ వ్యక్తిగతమయిన వనుకొన్నాను. వారి కార్మిక నాయకత్వం, అభిప్రాయ భేదాలతో కూడిన

సామ్యవాదంపట్ల ఆకర్షించబడ్డాను. ఇంగ్లీషువారికన్నా వీరికి రాజకీయ ధ్యాస ఎక్కువ. 1958 లో ఫ్రెంచ్ రాజకీయాలు అలానే ఉన్నాయి.

నేను వారం రోజులు డెన్మార్క్‌లో ఎంతో సంతృప్తికరంగా గడిపాను. రైతుల సమస్యలకు అక్కడ సమాధానం దొరికింది. రైతులు స్వయంకృషితో నడిపే సహకార సంఘాలలో వారి జీవితంలోని ప్రతి విషయానికి అర్థం దొరికింది. వారందరూ చిన్న రైతులు. వారు బానిసత్వం (Serefdom) నుండి రెండు సంవత్సరాల క్రితమే బయటపడ్డారు. ఎంతో రాజకీయ బలాన్ని, ఆర్థిక పరిపుష్టిని సాధించారు. వారి విజయానికి వారు నడిపే జానపద విద్యాలయాలే కారణం. మొదట ఈ జానపద విద్యాలయం 'గ్రంట్‌లిగ్' (Gruntlig) అనే చర్చి మతాధికారి ప్రారంభించాడు. వేసవిలో రెండు నెలల నుండి నాలుగు నెలల వరకు ఎంతో మంది రైతులు ఇక్కడ వారి మత సంబంధమయిన విషయాలే కాక చరిత్ర, భూగోళశాస్త్రం, ఆర్థిక, రాజకీయ శాస్త్రాలు, ప్రత్యక్షంగా వ్యవసాయ పరిశోధనలు నేర్చుకుంటారు. పబ్లిక్ స్కూళ్ళలో, విశ్వవిద్యాలయాల్లో నేర్పేవన్నీ ఇక్కడ నేర్పు తారు. వీరు 'హాస్టల్సు'లో నివసించి వారి మత విశ్వాసాల నేపథ్యంలో వారి జట్టు విజయానికై కృషి చేస్తుంటారు. ఈ డెన్మార్కు రైతుల విజయాలు నాకు ఆదర్శప్రాయం. ఈ జానపద విద్యాలయాలు స్కాండినేవియన్ దేశాలు, హాలెండు, స్వీడను, నార్వే, బెల్జియం, జర్మనీలలో నడపబడుతున్నాయి. ఇవి చూసిన తరువాతనే నేను భారతదేశంలో కూడా రైతాంగ పాఠశాలలను ప్రారం భించాలని నిర్ణయించుకొన్నాను. భవిష్యత్తులో ఈ రైతులే రైతు నాయకులవుతారని ఆశించాను.

1946 లో నేను భారత బృందానికి ప్రత్యామ్నాయ నాయకునిగా ప్రపంచ ఆహార వ్యవసాయ సంఘానికి (F.A.O.) వెళ్ళాను. ఆరోజే అంటే 2-9-1946న భారతదేశపు మొదటి మంత్రివర్గం ప్రమాణం చేసింది. ఆరోజు నేను రైతుల ఆర్థిక, రాజకీయ జీవితం కోసం ప్రార్థించాను. ఈసారి రివరెండ్ గ్రంట్‌లిగ్ స్మారక స్తూపాన్ని చూశాను. అక్కడ ఉన్న వ్యవసాయ ప్రదర్శనశాలను చూశాను. నా పూర్వ మిత్రుడు 'హాగ్స్‌బర్' (Hogsburgh) ని అక్కడ కలిశాను. మేమిద్దరం F.A.O. లో సభ్యులమే.

నానాజాతి సమితి సమావేశాలు జరుగుతున్నప్పుడు నేను జెనివాలో ఉన్నాను. ఆ సభలను చూడటానికి అనుమతి సంపాదించాను. బ్రిటను, ఫ్రాన్సు, ఇటలీ సభ్యుల ఉపన్యాసాలను విన్నాను. శాంతి సమయాలలో ప్రజలందరూ సోదరుల వలె ఉంటారు. యుద్ధ సమయాలలో కౌరవ పాండవుల వలె ఉంటారు. భారత దేశానికి ఆ సభలో ప్రాతినిధ్యం ఇవ్వటం ఎంత అసంగతం. అమెరికా తానా సమితిలో ఉండటానికి తిరస్కరించింది. అమెరికా చేరకుండా, రష్యాను చేర్చు కొన్నప్పుడు నానాజాతి సమితి సాధించేదేముంది. ప్రపంచ శాంతి కోసం ఈ సమితిని సమూలంగా మార్చవలసిందే.

జెనివా చాలా ఆకర్షణీయమయిన పట్టణం. సరస్సులతో, పర్వతాలతో, పచ్చటి పార్కులతో, నడచే బాటలతో ఎంతో అందంగా ఉంటుంది. దైనందిన కార్యకలాపాలతో అలసిన మనస్సులు అక్కడ సేదదీరవచ్చు.

నేను అంతర్జాతీయ కార్మిక కార్యాలయాన్ని సందర్శించాను. వారి ఆశయాలు, కార్యక్రమాలు ఎంతో బాగున్నాయి. శ్రామికుల హక్కుల రక్షణ, ఉద్యోగ కల్పన, వేతనాలు, ప్రతి శ్రామికునికీ అందాలనే వారి తపనను అర్థంచేసుకొన్నాను. పారిశ్రామిక కార్మికులను మాత్రమే ఈ సంఘంలోనికి ఆహ్వానిస్తారని తెలిసి నేను నిరాశ చెందాను. నిజానికి నావంటి కొద్దిమంది పార్లమెంటు మెంబర్ల వత్తిడితోనే వ్యవసాయ ప్రతినిధులను ఒకసారో అరసారో ఆహ్వానించారు. ఐ.యల్.ఓ. ఆఫీసు ఒకటి ఢిల్లీలో కూడా ఉంది. డాక్టరు పి.పి.పిళ్ళై అక్కడ పనిచేసేవారు. నాకు మంచి స్నేహితులు. నేను 1948లో, మరలా 1955లో భారత ప్రభుత్వ ప్రతినిధిగా శాన్‌ఫ్రాన్సిస్కో, జెనివాలలో ఐ.యల్.ఓ. సమావేశా లలో పాల్గొన్నాను. ఐ.యల్.ఓ. (అంతర్జాతీయ కార్మిక సంఘం) లో భారత రైతుల సమస్యలు చర్చించటానికి నేడొక శాశ్వత కమిటీ ఉంది.

రైతులకు కూడా ఇటువంటి సంఘం ఒకటి ఉంటే బాగుంటుంది. 1943-45 లలో మాత్రమే ఇది సాధ్యమయింది. స్విట్జర్లాండులోని ప్రజాస్వామ్యం భారత దేశానికి బాగా సరిపోతుంది. స్విట్జర్లాండు చిన్న దేశమయినా దాని స్వతంత్ర ప్రతిపత్తికి చాలా ఆనందించాను.

నేను ఇటలీ వెళ్ళేటప్పటికి అక్కడి ఫాసిస్టులు రైతులతో సహకార సంఘాలతో శత్రుత్వంతో ఉన్నారు. నేను రేవన్నా–మిలన్‌లలో అక్కడ సహకార సంఘాలు రైతులకు చేస్తున్న సేవలను చూశాను. వారు భూస్వాముల పొలాలను రైతు కూలీలకు 'కవులు' కిప్పిస్తున్నారు. ఋణాలతో పశువులను, వాటి మేతను కొంటున్నారు. పశువులకోసం 'గోడౌను'లను నిర్మిస్తున్నారు. వారి ఫలసాయాన్ని నిల్వ చేసుకొనేటందులకు సహాయపడుతున్నారు. 1943 లో అక్కడి మధ్యతరగతి ప్రజలు 'ముస్సోలినీ'ని కాల్చి చంపారు.

కొందరు బ్లాక్‌షర్టులు (నల్లచొక్కాలు వేసుకున్నవాళ్ళు – ఒక సంఘం) నన్ను ఒక సాయంత్రం కలసి, తెల్లవారేసరికల్లా మిలన్‌ను ఖాళీచేయమని హుకుం జారీచేశారు. లేకపోతే దేహశుద్ధి తప్పదని హెచ్చరించారు. నేను రైతు సంఘాల గొప్పతనం నిర్వచించడం దీనికి కారణం. నేను తరువాత మూడు రోజులు 'మిలన్' లోనే ఉన్నాను. నేను రోమ్–ఫ్లోరెన్సులలో రైతు సహకార సంఘాలను, వారి గ్రామాలను, వారి ఇళ్ళను చూశాను. సహకార సంస్థలు 'లిబరల్' మంత్రి వర్గం ద్వారా చాలా అధికారాన్ని సంపాదించుకొన్నాయి. బ్లాక్‌షర్టులు నాకు హెచ్చరికలు ఇవ్వటానికి ఇదీ కారణం. 'అవంతి' ఎడిటరు సెగ్రెట్. 'సెగ్రెట్' నాకు ఇక్కడ గైడు. నేను 'మిలన్' వదలివచ్చిన తరువాత 'ముస్సోలినీ' అధికారం లోనికి వచ్చాడు. సెగ్రెట్, మాటోటి చంపబడ్డారు. రైతులు తమకు ఇష్టం లేక పోయినా, ఫాసిజంతో స్నేహం చేశారు. ఫాసిస్టులు రైతు సహకార సంఘాలకు కార్పొరేట్ (మూకుమ్మడి) విధానాన్ని అమలుచేశారు.

ఇటలీలో పల్లెసీమలు చాలా అందంగా, చలికాగుతున్న – దక్షిణ భారతదేశపు ఊళ్ళను గుర్తుకుతెచ్చాయి. పట్టణాలు అధ్వాన్నంగా ఉన్నాయి. అక్కడ ద్రాక్ష, మకరోని (నూడిల్స్) లను చాలా ఇష్టపడ్డాను. అక్కడ 'నింఫ్' విగ్రహం వద్ద (Nymph) (1. అందమయిన వంపులు గల స్త్రీ. 2. గ్రీకు పురాణాలలో 'నింఫ్' అరణ్యాలలో, నీటిలో నివసించే ఒక అందమైన యువతి) అంతులేకుండా మ్యూజిక్ వాయిస్తుంటే, కాఫీ మెల్లగా త్రాగుతూ, అందమైన యువతీ యువకు లను, పిల్లలను చూస్తూ గడిపాను.

రంగాగారి హితులు - సన్నిహితులు

హెరాల్డ్ లాస్కి



హెచ్.డి.ఎల్. కోల్

బ్రెయిల్స్ ఫోర్డ్

గిల్బర్ట్ స్లేటర్

నేను జర్మనీలో మ్యూనిచ్(Munich), బెర్లిన్(Berlin), హాంబర్గ(Hamburge) లను చూశాను. సహకార సంఘాలు ద్రవ్యోల్బణం వల్ల చాలా నష్టపోయాయి. మంత్రివర్గంలో ఉన్న సోషలిస్టులు, లిబరల్స్ ద్రవ్యోల్బణం అరికట్టలేకపోయారు. అక్కడ ఉన్న సోషల్ డెమోక్రాటిక్ పార్టీపైననే ఆశలు పెట్టుకున్నాను. రెండవ యుద్ధానంతరం ఈ పార్టీ అధికారంలోనికి వచ్చింది. ఈ పార్టీ రైతు సహకారానికి 'ఆసరా' ఇచ్చింది. ప్రజాస్వామ్యం ఈ దేశంలోనికి రావటం అంటూ జరిగితే అది బ్రెయిల్స్‌ఫర్డ్, కోల్ వంటివారి వల్లనే. ఇటువంటి ఆర్థిక విధానాన్నే కీ.శే. మిస్టర్ ఆర్థర్ హాండర్సన్ (Arthur Henderson) అనే సామ్యవాద నాయకుడు ఇంగ్లాండులో కూడా ప్రవేశపెట్టాడు. నేను 'సోషలిస్టు డెమోక్రటిక్' పార్టీని క్షుణ్ణంగా అధ్యయనం చేశాను. మిస్టర్ బెరన్‌స్టీన్ (Bernstein) ఈ అధ్యయనానికి చాలా సహాయం చేశాడు.

నేను జర్మను ప్రజలను ఇష్టపడ్డాను. వారిలోని మంగోలియన్ జాతి లక్షణాలు నేను కలకత్తాలో చూచిన చైనావారిని గుర్తుకుతెచ్చాయి. మిస్టర్ మాక్సుముల్లర్ (Max Mullar) సంస్కృతాన్ని, వేదాలను చదివాడు. ఇతను జర్మను. జర్మను భాష నేర్చుకుంటున్న వి.యస్. కృష్ణ నన్ను జర్మనీ సంగీత కచ్చేరీలకు తీసుకొని వెళ్ళేవాడు. గోథె (Gothey), షిల్లర్ (Shillar), హాన్సు (Heines) లను గురించి నేను ఇంగ్లీషులో చదివాను. 'కాళిదాసు' కవిత్వం, ముఖ్యంగా 'శకుంతల' నాటకంపై గోథెకున్న అభిమానం నా మనస్సు నాకర్షించింది.

నేను లండనుకు రాగానే బ్రెయిల్స్‌ఫర్డును కలుసుకున్నాను. నా పర్యటన విజయవంతమయినందుకు నన్ను బ్రెయిల్స్‌ఫర్డు శ్రీమతి అభినందించింది. ఇటువంటి అధ్యయనము నేను మాత్రమే చేశానని బ్రెయిల్స్‌ఫర్డు అభిప్రాయము. భారత రైతులకు నా పర్యటన ఉపయోగపడగలదని బ్రెయిల్స్‌ఫర్డు భావించాడు.

ఈ నాలుగు దేశాలలో నా అనుభవాలను వారికి చెప్పాను. ఇటలీలో పరిణామాలు ప్రమాదభరితంగా ఉన్నాయని, డెన్మార్కులోని జానపద పాఠశాలలు భవిష్యత్తుకు బాటలు వేయగలవని వారభిప్రాయపడ్డారు. ప్రజోపకరమైన రోడ్లు వేయటం, బ్రిడ్జీలు నిర్మించడం, రైతులకు భూస్వాముల పొలాలను 'కవులు'కు

ఇప్పించడం వంటి ఇటలీ సహకారసంఘ కార్యక్రమాలు ముందురోజుల్లో భారత దేశంలో కూడా ఆచరణీయమే.

మార్క్సిజం-మార్క్సిస్టులను గురించి చదివాను. సోషలిస్టులు, మార్క్సిస్టుల మధ్య అంతర్గత వైరుధ్యాలను అధ్యయనం చేశాను. భారతదేశ రైతులకు విముక్తి ఇటువంటి సామ్యవాదం వలన వస్తుందా అని నేను సందేహించాను. వారెక్కడా రైతులను - (పారిశ్రామిక) కార్మికులను సమదృష్టితో చూడటంలేదు. నేను చెప్పిన అభిప్రాయాలతో ఏకీభవిస్తూ బ్రెయిల్స్‌ఫర్డ్ "సోషలిజాన్ని ఆదరించకపోయి నట్లయితే 'ఫాసిజం' వచ్చే అవకాశముంది" అన్నారు. నేను టాగూరుగారి 'నేషనలిజం'(జాతీయవాదం) పుస్తకాన్ని చదివానని, ఫాసిజం దౌర్జన్యాలను టాగూరు రచనల ద్వారా అర్థంచేసుకున్నానని చెప్పాను. పేజ్ ఆర్నాట్, ఆర్. పామేదత్తులను కలిసి మార్క్సిజం భారతదేశానికి ఉపయోగకారి కాదు అని చెప్పాను. వారు నా నిర్ణయానికి ఆశ్చర్యపోయారు. వారు నాకు లెనిన్ వ్రాతలు, కొన్ని కరపత్రాలు ఇచ్చి చదవమని కోరారు.

నేను తిరిగివచ్చిన తరువాత రెండుసార్లు విద్యార్థులను, ఒకసారి అంతర్జాతీయ కార్మిక సమాజాన్ని ఉద్దేశించి మాట్లాడాను.

గ్రామీణుల, పట్టణవాసుల సాంఘిక, ఆర్థిక స్థితిగతులపైనా, మురికివాడల్లో నివసించే యూరోపు ప్రజలపైనా, భారతదేశంలోని రైతులు - బడుగువర్గాలవారి పైనా, వారి బాధలపైనా నేను నా దృష్టి సారించాను. అప్పటికే డాక్టరు పి.పి.పిళ్ళై గారు ఈ విషయాలపైన పుంఖానుపుంఖాలుగా వ్రాస్తున్నారు.

1923-24 సంవత్సరాలలో బి.లిట్. మరియు సోషల్‌సైన్సు డిప్లమోలను నా అభిమాన విషయాలుగా ఎంచుకొన్నాను. కొన్ని గ్రామాల ఆర్థిక స్థితిగతులు, ప్రత్తి రైతుల స్థితి, చేతితో నూలు వడకటం, చేనేత పరిశ్రమలు, దక్షిణ భారత దేశంలోని మిల్లులలో నేత పరిశ్రమలు నా అభిమాన విషయాలు. మిస్టర్ బేకరుగారు నన్ను ప్రోత్సహించారు. నన్ను చూచి గర్వపడుతున్నానని అన్నారు. విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు, ఆర్థిక శాస్త్రోపన్యాసకులు నా అభిమాన విషయంపై ఏమీ అభ్యంతరం చెప్పరన్నారు. ఆక్స్‌ఫర్డ్‌లో నా మొదటి విద్యార్థి దశ ముగిసింది. 1923 వ సంవత్సరంలో ఆక్స్‌ఫర్డ్‌ను వీడి మాతృదేశానికి తిరిగివచ్చాను.

జాన్ డ్రింకువాటర్ (John Drink Water), సర్ విలియన్ ఆర్‌పెన్ (Sir William Orpen) లు ఇంగ్లీషు చరిత్ర, కళలను గురించి దశలవారీగా ప్రచురిస్తు న్నారు. వి.యస్. కృష్ణ, యల్.బి. చౌదరి, నేను వాటిని శ్రద్ధగా చదవటం మొదలుపెట్టాము. చరిత్ర ఆధారంగా మా చర్యలు సాగుతుండేవి. తెలుగు పద్యాలు, వివిధ ఛందోరీతులపై నాకు ఆదరం పెరిగింది. ఇంగ్లీషు కవిత్వాన్ని తెలుగుతో సమంగా చూడలేకపోయాను. పాశ్చాత్య చిత్రకళ నన్ను ఆకట్టుకొన్నది.

ఆర్‌పెన్‌గారి మార్గదర్శకత్వంలో యూరోపులో గల అన్ని కళాకేంద్రాలు చూశాను. రూబెన్ (Ruben), వాన్‌డైక్ (Vandike), లీటన్ (Leighten) చిత్రాలు నన్ను ఆకర్షించాయి. చర్చీలు, వెస్ట్‌మినిస్టరు అబ్బే (West Minister Abby), సెయింట్ పాల్స్ (St. Pauls), సెయింటు పీటర్సు (St. Peter), సెయింట్ స్టీఫెన్సు (St. Stephens), రోమ్, నోటర్‌డామ్ డిపారిస్ (Notredam Deparis) లలో వాస్తు శిల్పకళలను చూచిన తరువాత భారతదేశపు పురాతన దేవాలయాల ప్రాచీనతను, మతాన్ని, వినమ్ర మానవత్వాన్ని మనం ఎంతగా నిర్లక్ష్యం చేసింది నాకు అర్థమైంది.

నేనెప్పుడు ఎక్కడ చర్చీలను, వాటి అందమైన కిటికీలను, టాపిస్ట్రీ (Tapestry – బొమ్మల తెరలు) లను ఇంగ్లాండు, యూరోపు, రష్యా, అమెరికాలలో చూచినా, ఆక్స్‌ఫర్డ్‌లోని స్నేహపూర్వక వాతావరణం గుర్తుకువస్తుంది. ఆదివారం ఆక్స్‌ఫర్డ్‌లో మ్రోగే చర్చి గంటలు నన్ను మేలుకొలిపేవి. ఎక్కడో సుదూరతీరాలకు వెళ్ళిన అనుభూతి కలిగేది. రెండు సంవత్సరాల తరువాత త్యాగరాజస్వామి కీర్తనలు ప్రభావితం చేసినట్లు ఈ సంగీతం నన్ను ప్రభావితం చేయలేదు. జాజ్ (ఒక రకమయిన పాశ్చాత్య సంగీతం) కొందరిని ఊపేస్తుంది. అలానే రాగ, తాళ, లయబద్ధమైన భారతీయ సంగీతం కూడా. పాశ్చాత్య సంగీతాన్ని అర్థంచేసు కోవటం నాకెంత కష్టమో, భారతీయ సంగీతం పాశ్చాత్యులు అర్థంచేసుకోవటం కూడా అంతే కష్టం. బహుశా నేను వారి సంగీతాన్ని సరిగా అర్థంచేసుకొని ఉండను. పాశ్చాత్యుల ఆర్కెస్ట్రాకు (వాయిద్య సమ్మేళనం) ముగ్ధుడనయ్యాను. ఇండియాలో కూడా ఇటువంటి ఆర్కెస్ట్రాల అవసరాన్ని గుర్తించాను. నేను 'వేల్సు'లో విన్న 'వెల్ష్ ఈస్టర్‌పాడ్' ఆర్కెస్ట్రా సాటిలేనిది.

నేనీ అనుభూతులనెలా వర్ణించాలి? అందమయిన ఏథెన్సు శిల్పాలను, మెల్లగా ప్రవహించే 'సియాన్' నదిని, విక్టర్ ఎమాన్యుయేల్ స్క్వేర్ నుండి ఎంతో పొందికగా రూపొందించిన 'వెర్‌సెల్స్ గార్డెన్' వరకు, సెయింటు పీటరు, సెయింటు స్టీఫెన్సు చర్చీల బంగారు కాంతులు నన్ను చకితుడ్ని చేశాయి. నేను కంచి, మద్రాసు, శ్రీరంగం, రామేశ్వరం దేవాలయాలను చూసేవరకు 'సెయింటు పీటర్సు' చర్చి ఎంతో గొప్పదిగా భావించేవాడిని. ఇంకా (INCA) బంగారు నిల్వల నుండి ఈ రోమ్ దేవాలయానికి బంగారము దోచుకొని వచ్చారన్న విషయం నాకు చాలా సంవత్సరాల తరువాత తెలిసింది. పారిస్, రోమ్ నగరాలు వాటి చరిత్ర ద్వారా గుర్తించబడుతున్నాయి. 19వ శతాబ్దపు తిరుగుబాటు వాతావరణం ఫ్రాన్సులో చూడవచ్చు. (టుల్లరీస్ అనే పేరు గల ఉద్యానవనాలు నేడు కూడా ఉన్నాయి. బాస్టిలి, నెపోలియన్ సమాధి, ప్లేస్ డి లక్సంబర్గ్, ఇంకా చాలా చూశాను.) భారతీదేవి ఒక వారం ఫ్రాన్సులో గడిపింది. ఫ్రెంచి వాతావరణాన్ని ఆనందించింది. 'వర్‌సైల్సు' లోని విశృంఖలత్వాన్ని ఇష్టపడలేదు.

'రోమ్' నగరం నాకు పోతనగారి ★'కారే రాజులు రాజ్యముల్ కలుగవే' పద్యాన్ని గుర్తుకుతెచ్చింది. సమన్యాయం, పరిపాలనా సౌష్ఠవం రోమ్‌లో కన్పించలేదు. అంతర్జాతీయ వ్యవసాయ విద్యాలయాన్ని చూశాను. 17 సంవత్సరాల ఫాసిస్టు పాలనకంటే రోమన్ల ఇటలీనే బాగుందనిపించింది. ఒక సంవత్సరం తర్వాత నేను ఢిల్లీ వెళ్ళాను. అక్కడ ఇటలీలో లాగానే సమాధులు. ఈ రాజులు నిర్మించినచోటనే మరల ఎందుకు రాజధానులను నిర్మిస్తారు? స్వతంత్ర భారతదేశంలో ఢిల్లీ ఇటువంటిదే కదా!

6-9-1957 సాయంత్రం బ్రిటీషు హైకమీషనర్ రైట్ ఆనరబుల్ మాలకోమ్ మెక్‌డొనాల్డ్ (Rt. Hon. Mackolm Mecdonald) ని, భారత విదేశాంగ శాఖ ప్రతినిధులను కలిశాను. మెక్‌డొనాల్డ్‌ను పరిచయం చేస్తూ "మెక్‌డొనాల్డ్‌గారు

★శా. కారే రాజులు? రాజ్యముల్ గలుగవే? గర్వోన్నతిం బొందరే?
వారేరీ సిరి మూటగట్టికొని పోవంజాలిరే? భూమిపైఁ
బేరైనం గలదే? శిబి ప్రముఖులుం బ్రీతిన్ యశఃకాములై
యీరే కోర్కులు? వారలన్ మరచిరే యిక్కాలమున్ భార్గవా!

నాకు ముప్పై సంవత్సరాల మిత్రుడు. నేను ఆక్స్‌ఫర్డ్ లేబరు క్లబ్బుని స్థాపించి అధ్యక్షునిగా, వారు కార్యదర్శులుగా ఉన్నాము. తరువాత వారు అధ్యక్షుడయ్యారు. వారీరోజున ఎంత ప్రముఖ దౌత్యవేత్తో, ఆరోజులలో కూడా అంత ప్రసిద్ధుడు. అప్పట్లో మేమందరం సోషలిస్టులమే. సోషలిజం వారి కుటుంబంలోనే ఉంది. సాంఘికన్యాయం, స్వతంత్రత ఆదర్శాలుగా మనం భారతదేశంలో నివసిస్తున్నాం. వారు నేడు ఇంగ్లండు శ్రేయోరాజ్య ప్రతినిధి" అని అన్నాను.

ప్రొఫెసరు ఎ.జి. స్టాక్ సెక్రటరీగా ఉన్నప్పుడు మెక్‌డోనాల్డ్‌గారు ఆక్స్‌ఫర్డు లేబరు క్లబ్బుకు అధ్యక్షునిగా ఉన్నారు. తర్వాత ఎ.బి. స్టాకు అధ్యక్షుడయ్యాడు.

మాల్‌కోమ్ మెక్‌డోనాల్డ్‌గారి తండ్రి రామసే మెక్‌డోనాల్డ్ (Ramsay Mecdonald) గారు బ్రిటీషు పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడు. వారు సివిల్ సర్వీసులన్నిటినీ భారతీయం చేయటానికి తమ సమ్మతిని తెలియజేశారు. వారు భారతదేశంలో 'స్వపరిపాలన'ను సమర్థిస్తూ ఒక పుస్తకం కూడా వ్రాశారు. ఆరోజులలో గుర్తింపు గల నాయకుడు. మొట్టమొదటి సోషలిస్టు నాయకునిగా (1924) బ్రిటీషు ప్రధానమంత్రి అయ్యారు. ఈ పరిణామానికి భారతీయు లందరూ సంతోషించారు. కేర్ హార్డీ (Keir Hardey) గారికి సన్నిహితులు. కేర్ హార్డీగారు 'ఇండిపెండెంటు లేబరు పార్టీ' వ్యవస్థాపకులలో ఒకరు.

1925 లో ఇండియా సౌహార్ద్ర సభ్యునిగా నేను న్యూయార్కులో జరిగిన సభకు హాజరయ్యాను. 1920 తరువాత లేబరు ప్రభుత్వం భారతదేశంలో అత్యవసర పరిస్థితికి అనుకూలంగా వ్యవహరించింది. భారతీయులందరూ తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. నేను 'రామసే'గారిని ఆ సభలో కలసి వ్రాత పూర్వకంగా 'బెంగాల్‌లో అణచివేతను, లార్డ్‌ఆలీవరు చర్యను ఎలా సమర్థిస్తారు?' అని అడిగాను. తరువాత ముఖాముఖీలో కూడా ఇదే విషయం ప్రస్తావించాను.

రామసేగారు చెప్పిన సమాధానం మమ్మల్నందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. "లేబరు పార్టీ అధికారంలోనికి క్రొత్తగా వచ్చింది. పత్రికలవారు 'బ్రిటీషువారి ఆస్తులను లేబరు పార్టీ నిలబెట్టగలదా?' అని సంశయము వ్యక్తం చేస్తున్నారు. "ఇంగ్లండు తన సామ్రాజ్యం నిలబెట్టుకోవాలి. ఇప్పుడు ప్రభుత్వాన్ని రద్దు చేయ లేము. భారతదేశం పూర్తిగా స్వాతంత్ర్యాన్ని సంపాదించుకోవటానికి అర్హత

కలిగి ఉంది. భారతదేశానికి రాష్ట్రీయ ప్రతిపత్తిని ఇచ్చే అవకాశముంది" అని అన్నారు. భారతీయులు తీవ్రమయిన అసంతృప్తితో ఉన్నారని, అత్యవసర స్థితి (Emergency) ని సహించరని చెప్పాను. ప్రతినిధులలో అత్యధికులు నాతో ఏకీభవించారు.

వారు తరువాత రోజులలో 'కన్సర్వేటివ్' పార్టీకి సమాధానం చెప్పలేక పోయారు. క్రమేపి బలహీనపడ్డారు. 1930 లో మొదటి రౌండుటేబుల్ కాన్ఫరెన్సులో వారిని కలిశాను. వారి నాయకత్వంమీద నాకు నమ్మకం పోయింది. భారతదేశ స్వాతంత్ర్యంపై నీళ్ళు చల్లినట్లుగానే 1931 లో లేబరు పార్టీని కూడా ముంచేశారు.

వారు చేయలేని పనిని 1947 లో 'అట్లీ' చేసి చూపించారు. భారతదేశానికి 'లేబరు పార్టీ' స్వాతంత్ర్యం ఇచ్చింది. 1858లో 'డిస్రాయిలి' (Disraili) విక్టోరియా రాణి తలపై కిరీటం పెట్టాడు. డిస్రాయిలి ఒక సామాన్యుడు. అతనికీ కిరీటాల పిచ్చి ఎక్కువ. మరలా ఒక సామాన్యుడు 'అట్లీ' రూపంలో భారతదేశానికి స్వాతంత్ర్యం ఇచ్చాడు. పది రోజుల క్రితమే 'మలయా' స్వతంత్రమైంది. నైజీరియా త్వరలో స్వాతంత్ర్యం తెచ్చుకోనుంది. 'టునీసియా' (Tunicia), మొరాకో (Moraco), ఇండో-చైనా(Indo-China), సిలోను(Ceylone), బర్మా(Burma), ఫిలిప్పైయిన్స్ (Philippines), ఇతర ఫ్రెంచి-ఆఫ్రికన్ దేశాలు స్వతంత్ర మయ్యాయి.

మాల్కోమ్ మెకడోనాల్డ్గారు ఇలా అన్నారు "ఆఫ్రికావారూ, ఆసియావారూ స్వతంత్రులు కావటం శుభసూచకం. ఎన్నో తరాల పోరాటంతోనే ఇది సాధ్య పడింది. ఈ ఆసియా ఉదాహరణ దేశాల తారతమ్యాలను తుడిచివేసింది. ఈ విప్లవానికి కేంద్రబిందువు భారతదేశం."వారు మాట్లాడుతుంటే మా కలలు, ఆశలు తీరే కాలం వచ్చిందని సంతోషించాము.

1960 లో ఫ్రాన్సు-అల్జీరియాకు స్వాతంత్ర్యమిచ్చింది. కెన్యాలో గ్రేట్‌బ్రిటన్ 'జోమోకెన్యటా'ను, వేలాదిమంది అతని అనుయాయులను జైళ్ళలో పెట్టింది. ప్రభుత్వేతర విదేశీ విధానపు సంఘం ద్వారా నేను నా ఆందోళనను తెలియ జేశాను. ఈరోజు కాకపోతే రేపయినా ఈ దేశాలకు స్వతంత్ర్యం ఇవ్వవలసిందే.

మిస్టర్ యమ్. మారిస్‌ఫౌరి (Marice Fauri) కి భారత ప్రధానమంత్రి విందు ఇచ్చిన సందర్భంగా నేను మరలా నా అభ్యర్థనను వారికి విన్నవించాను.

నేనీ ఆశలతో ఎందుకు జీవిస్తున్నాను? 1926 లో మాల్‌కోమ్, స్పాను, షార్టు, చెన్‌లు ఆక్స్‌ఫర్డ్‌లో ఈ విషయాలు చర్చించాము. 1930 లో జోమోకెన్యటా, నేను, మూడి; 1945–46 లలో పీటర్ అబ్రహాం, కోయీనేగీ (Koinangi), పెన్నర్ బ్రూక్‌వే మొదలైన వారందరం కలిసి సమాలోచనలు చేశాం. రొడీషియా మినహా ఆఫ్రికా మొత్తం స్వతంత్రమైంది.

మిస్టరు యమ్. మారిస్‌పారే 1957 లో భారత ప్రధానమంత్రికి విందు నిచ్చారు. మారిస్‌పారే 'ఘనా' ఆర్థికమంత్రి. పరిశ్రమల మంత్రి. నేను వారిని ఈ విందులో కలిశాను. 'ఘనా' జనాభా 5 మిలియన్లు. ఈ ఆఫ్రికా నాయకులను కలుసుకోవటానికి ఎందరో దౌత్యవేత్తలు బారులుతీరారు. ఈ పరిణామం ఆశ్చర్యకరం! ఈ ఆఫ్రికా దేశం తన స్వతంత్రం కోసం పెద్దగా ఘర్షణ పడలేదు. ఇంగ్లాండు, ఫ్రెంచి ప్రజాస్వామ్యాలు వీరి పోరాటాన్ని పట్టించుకోలేదు.

నా మూడు దశాబ్దాల పోరాటానికి అర్థం ఉందనిపించింది. 1920–1950 వరకు నా స్నేహితులు జార్జి పాడ్‌మోర్, డొరోతీ, మెకనాన్, పాన్ ఆఫ్రికా కార్యకర్తలు డా॥ మూడీ ఈ విప్లవజ్యోతిని ఆరకుండా చూశారు.

చిన్న దేశాల స్వాతంత్ర్యం ఈరోజునైనా భద్రంగా ఉందా? బ్రిటీషువారు, ఫ్రెంచివారు – ఈజిప్టులో; అమెరికా, లెబనాన్ – జోర్డానులో; రష్యావారు హంగరీలో వీరిని స్వతంత్రంగా బ్రతకనిస్తారా? జాతి వివక్ష ఈ దేశాలలో ఇకపై చెల్లుతుందా? చైనా పంచశీలను ఆచరణలో పెడ్తుందా? ఇవన్నీ ప్రశ్నలే. ఈరోజు ప్రపంచంలో వీటి అవసరం ఎక్కువగా ఉంది. నేను ఆక్స్‌ఫర్డ్‌లో చదివిన రోజులకు, నేటికీ భేదం అంతగా లేదు.

★ప్రపంచ దేశాల యువత కలలు కనాలి. ఆలోచించాలి. వ్యూహరచన ఈ దిశగా చేయాలి. ప్రజలందరూ నిరంతర జాగరూకతతో ఉండాలి.

ఇది నేను 10, 11 డిసెంబరు 1957 న భారతదేశం తరఫున కామన్వెల్తు పార్లమెంటరీ కాన్ఫరెన్సులో ఇచ్చిన ఉపన్యాస సారాంశం.

★ ★ ★

★ అబ్దుల్ కలాం కూడా ఇదేవిధంగా మాట్లాడారు.

5. 1933-36 మధ్య ప్రజా ఉద్యమాలు

సుభాష్‌బాబును 1931 వ సంవత్సరంలో కరాచీలో రెండుసార్లు కలిశాను. నేను నిర్మిస్తున్న రైతాంగ ఉద్యమంపై వారు ఆసక్తి చూపించారు. వేంకటగిరిలో (నేను మొదలుపెట్టిన) జమీందారీ ఉద్యమాన్ని వారు మెచ్చుకొన్నారు. ప్రభుత్వానికి, రైతులకు మధ్య దళారీలను వారు ఒప్పుకోలేదు. మంచి మిత్రుడు. సంభాషణాచతురుడు.

జాతీయ కాంగ్రెసు సమావేశాలలోనే సేవాదళ్ కార్యకర్తలయిన డా॥ హార్డికర్ గారిని, బులుసు సాంబమూర్తిగారిని కలిశాను.

ఋణాల వాయిదా (1930-34)

1931 న కాంగ్రెసు సమావేశాలకు 'బార్డోలీ' నాయకుడు సర్దార్ పటేలు గారు అధ్యక్షత వహించారు. గాంధీగారి వద్ద కాంగ్రెసుపై నా సంతృప్తిని వ్యక్తం చేశాను. వారు నన్ను జవహర్‌లాల్, సుభాష్‌లతో సహకరించి పనిచేయ వలసిందని కోరారు. జవహర్, సుభాష్‌లు ప్రజలను ప్రేమిస్తారని, దేశ భవిష్యత్తులో పెద్ద పాత్రను పోషించగలరని గాంధీగారు చెప్పారు.

ఆరోజులలో 'కరాచీ' ఒక ఆధునిక నగరం. ఒక దేశభక్తుడు దానికి మేయరు. కోటంరాజు పున్నయ్యగారు 1920 లలో కరాచీ వెళ్ళారు. వారు 'సింధ్ అబ్జర్వర్' పత్రికకు సంపాదకుడు. చనిపోయేవరకు అక్కడే పనిచేశారు. వారు నన్ను వెతికి పట్టుకొన్నారు. మంచి మిత్రులు. 1930 లో ఇంగ్లాండులో నా కార్య క్రమాలను, కేంద్ర శాసనసభలో నా పాత్రను మెచ్చుకున్నారు. స్వాతంత్ర్య యోధులకు ఈ మెప్పు ఒక గొప్ప ఊరట.

చాలామంది నన్ను ఈ సమావేశానికి వెళ్ళమని ప్రోత్సహించారు. ఈ సమావేశాలలో గాంధీ-ఇర్విన్ ఒడంబడిక చర్చా విషయము. రెండవ రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్సుకు ప్రతినిధులను నిర్ణయించవలసి ఉంది. నన్ను ఒక ప్రతినిధిగా ఎన్నుకున్నారు. ఆలిండియా కాంగ్రెసు కమిటీలో జైలు నుండి తిరిగివచ్చిన వారెందరో ఉన్నారు. నేను ఆలిండియా కాంగ్రెసు (అఖిలభారత కాంగ్రెసు) కమిటీకి ఎన్నికవుతానో లేదో చెప్పలేను. ఈ సమావేశానికి వెళ్ళటానికే నిర్ణయించుకున్నాను.

ఈ సమావేశాల కాలంలోనే బ్రిటీష్ ప్రభుత్వం దేశభక్తుడు భగత్‌సింగ్‌ను ఉరికంబము ఎక్కించాలని నిర్ణయించింది. మహాత్మా గాంధీగారు ఈ దేశభక్తుని రక్షించాలని, ఉరిని రద్దు చేయాలని చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. సామ్రాజ్య వాదుల దుర్మార్గాలు ఇలానే ఉంటాయి. అభివృద్ధిని ఆశిస్తున్నామంటూనే ఇటువంటి దుర్మార్గాలకు తెరతీస్తారు. భారత కమ్యూనిస్టు పార్టీ మీరట్ విచారణ తర్వాత గాంధీ-ఇర్విన్ ఒడంబడికను స్వార్థానికి వాడుకోవాలని చూస్తున్నది. సుభాష్‌చంద్రబోసు గాంధీ-ఇర్విన్ ఒడంబడికను తీవ్రంగా వ్యతిరేకించారు. వారు కాంగ్రెసు పార్టీని 'రిపబ్లికన్ పార్టీ'గా మార్చాలనే ఉద్దేశ్యంతో ఉన్నారు.

బొంబాయి నుండి కరాచీకి నా సముద్ర ప్రయాణం ఆసక్తికరంగా సాగింది. వందలకొలదీ కాంగ్రెసువారు నాతో కలసి ప్రయాణించారు. విజయంపై నమ్మకం అందరిలో కన్పిస్తుంది. జైలు నుండి విడుదలయినవారు వీరిలో ఉన్నారు. వారి అనుభవాలు అందరిలో ఉత్సాహాన్ని నింపుతున్నాయి. నేను కరాచీ నుండి రైలులో తిరిగివచ్చాను.

ఈ సభలు గాంధీగారి అనుభవానికి ఒక చెరగని ముద్ర వేశాయి. ఈ సభలలోనే గాంధీగారు ***'గాంధీ చనిపోవచ్చు. కానీ గాంధీ తత్త్వము మాత్రము చనిపోదు'*** అని అన్నారు. వారి క్లుప్తమయిన, చరిత్రాత్మక వివరణకు నేను సంతోషించాను.

ఉప్పుసత్యాగ్రహానికి ముందే లార్డ్ ఇర్విన్ (Lord Irvin) కు ప్రాథమిక హక్కుల శాసనం (Charter of Fundamental Rights) పై నెహ్రూగారిచ్చిన నివేదికను, గాంధీగారి నిష్కర్ష వైఖరిని నేను మనస్ఫూర్తిగా అంగీకరించాను. సుభాష్‌చంద్ర

బోసు 'రౌండు టేబుల్ కాన్ఫరెన్సు'కు ముందే స్వరాజ్య ప్రకటన బ్రిటీషువారు చేయాలన్నారు. గాంధీగారి నిర్ణయానికే నేను మొగ్గు చూపాను.

లాహోరులో లజపతిరాయ్ భవనానికి వెళ్ళి వారికి నివాళులర్పించాను. నేను వారిని ఆక్స్‌ఫర్డులో కలిశాను. వారిలాగా నేను కూడా రాజకీయ పాఠశాలను ఆంధ్రలో స్థాపించదలచాను. జహంగీరు కోటను, మసీదును చూశాను. ఇంత తక్కువ కాలంలో భారతదేశానికి పట్టిన దౌర్భాగ్యానికి బాధపడ్డాను. మహారాజా రంజిత్‌సింగు వాడిన పెద్ద ఫిరంగిని చూశాను. మన బక్కచిక్కిన రైతులు కూడా బ్రిటీషువారి నెదిరించగలరు. సిక్కుల గురువు రంజిత్‌సింగులాగా జాతీయ నాయకులు పోరాడాలి. ఈ పర్యటనలో 'వీర్రాజు' అనే అమలాపురపు కార్యకర్త నాకు తోడుగా ఉన్నాడు.

భారత రైతులు, చేతివృత్తులవారు 1931 లో ప్రపంచవ్యాప్తంగా వచ్చిన 'ఆర్థిక మాంద్యం'చే పీడింపబడ్డారు. వ్యవసాయ ధరలు 1930 నుండే తగ్గ సాగాయి. రైతులను, వడ్డీవ్యాపారులను - బ్యాంకులు బాకీల చెల్లింపుకై వెంట బడ్డాయి. పెద్ద రైతులకు మినహాయింపు లేదు. బాకీదారులను జైళ్ళలో పెట్టాలని బ్యాంకులు కోర్టుకెక్కాయి. చాలామంది రైతులు తమ పొలాలను నామమాత్రపు ధరలకు అమ్ముకున్నారు. రైతు కుటుంబాలు దివాళా తీశాయి. బంగారం మార్కెటును ముంచివేసింది. చెప్పలేని దుఃఖం దేశంలో తాండవిస్తున్నది.

కీ.శే. గూడవల్లి రామబ్రహ్మంగారు రైతు రక్షణోద్యమాన్ని తెనాలిలో మొదలు పెట్టారు. ఈ సభలకు నేను మే-జూన్ 1931 లో అధ్యక్షత వహించాను. నా ఉపన్యాసాన్ని ఇంగ్లీషులో వ్రాసి 'కోర్టులు' దానిని చదవడానికి వీలుగా ప్రచురించాను. ఈ ఉపన్యాసం అందరు జడ్జీలందరికి అందేటట్లు చూశాను. రైతు ఋణాలను వాయిదా (Maritorium) వేయాలని విజ్ఞప్తులను అందజేశాను. వ్యవసాయ పనిముట్లు, పశువులు, పశువుల దాణా, రైతులకు అవసరమయిన ఆహారధాన్యాలు, ఇళ్ళలోని పాత్రలు, స్త్రీల ఆభరణాలు 'సివిల్ ప్రొసీజరు కోడు'లో చెప్పినట్లుగా వ్యక్తిగతమైన 'వారంట్ల' ను అమలుచేయవద్దని, కోర్టులలో 'డిక్రీ' (Decree) లను పూర్తిగా నిలుపుదల చేయవలసిందని కోరాను.

ఈ (ఋణాల వాయిదా) ఉద్యమం 1937-38 వరకు సాగింది. రైతు రక్షణ కమిటీ నుండి దక్షిణ భారత ఫెడరేషనుకు, వ్యవసాయ కార్మికులకు, వారి నుండి అఖిలభారత కిసాను సమ్మేళనానికి ప్రాకింది. భారతీయుల కోర్కెలలో ప్రధానమయింది. 1937-38 లో కాంగ్రెసు మంత్రివర్గం మద్రాసు రాష్ట్రంలో ఏర్పడింది. రాజాజీగారు సాహసోపేతమయిన నిర్ణయం తీసుకున్నారు. ఋణాల వాయిదా ప్రకటించారు. దురదృష్టవశాత్తు అప్పటికే మూడు వంతుల మంది రైతులు తమ పొలాలనమ్ముకున్నారు. సగంమందికి పైగా మధ్యతరగతి రైతులు ఋణాల వత్తిడికి, ధరల తగ్గుదలకు తలలొగ్గారు. 1931 లో జరిగిన తెనాలి సమ్మేళనం కొత్త దిశానిర్దేశం చేసింది. ఈ ఋణాల వాయిదాతోపాటే ప్రభుత్వం భూమి పన్నును 18¾% కు పెంచింది. కృష్ణా, గోదావరి జిల్లాలలో నేను వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టాను. నేను సెక్రటరీగా ఉన్న రీసెటిల్‌మెంటు ఆర్థిక కమిటీ (పునరావాస కమిటీ) ఈ భూమిశిస్తు పెంపుదలను వ్యతిరేకించింది. మూడు సంవత్సరాల క్రితం 'బార్డోలి'లో రీసెటిల్‌మెంటుపై హైకోర్టు న్యాయమూర్తితో విచారణ చేయించింది. అదేవిధంగా ఇప్పుడు కూడా విచారణ చేయించవలసిందిగా కోరాను. ప్రభుత్వం ఇష్టపడలేదు. నేను ఈ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేశాను. ఈ పోరాటంలో శ్రీ కె. మధుసూదనరావు, శ్రీ గొట్టిపాటి వీరయ్య, శ్రీ డి. నారాయణరాజు (పశ్చిమగోదావరి జిల్లా), రాజమండ్రి నుండి శ్రీ వి. సత్యనారాయణలు పాల్గొన్నారు. మేము గ్రామాల్లో రైతు కమిటీలు నిర్మించి, వారి నుండి కార్యకర్తలను ఈ కార్యక్రమంలోనికి తీసుకున్నాం. 'బార్డోలి' సత్యాగ్రహంలో పనిచేసిన గాంధీగారి అనుచరులు శ్రీ కాక కలేల్కర్, డాక్టరు జె.సి. కుమారప్ప గారలను ఈ జిల్లాలలో పర్యటించ వలసిందిగా కోరాం. ఆంధ్ర నాయకత్వం కూడా ఈ ఉద్యమాన్ని బలపర్చింది. దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు, అయ్యదేవర కాళేశ్వరరావు గారలు వీరిలో ప్రముఖులు. ప్రధాన కార్యదర్శి శ్రీ యన్. సుబ్బారావు, శ్రీరామ చంద్రరావులు కూడా ఈ ఉద్యమానికి సహకరించారు. మా కార్యక్రమాలను నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వును ప్రకటించింది.

ఈ కార్యక్రమాలను రైతులు మెచ్చుకున్నారు. నేను తెలుగులో మంచి

ఉపన్యాసకునిగా రాటుదేలాను. భారతీదేవి కూడా విసుగు విరామం లేకుండా పర్యటించి ప్రజల మన్ననలను పొందింది.

జమీందారీ పద్ధతిపై వ్యతిరేకోద్యమం

కరాచీ కాంగ్రెసు సమావేశాల నుండి రాగానే ఆంధ్రలో జమీందారీ రైతులపై దృష్టి పెట్టాను. దక్షిణాది జమీందారీ విధానం, ఉత్తరప్రదేశ్‌లోని తాలూకాదారి విధానం (మాల్‌గుజారి విధానం) బెంగాల్, బీహార్, మహారాష్ట్ర మరియు మధ్యప్రదేశ్‌లో (Central Provinces) లాగానే ఉంది. మద్రాసు రైతులు ఎస్టేటు లాండ్ 1908 చట్టం ద్వారా, శాశ్వత కవులు, భూమిని అమ్మే హక్కు, తనఖా పెట్టే హక్కు, బహుకరణగా ఇచ్చే హక్కులను సంపాదించుకున్నారు. ఉత్తరప్రదేశ్, బీహారు, బెంగాలు, మధ్యప్రదేశ్‌లలో రైతులకు ఈ హక్కులు లేవు. ఉత్తర భారత దేశంలో కూడా ఈ హక్కులు లేవు. వారెంతో వెనుకబడి ఉన్నారు. మద్రాసు జమీందారీ రైతులు కౌలు తగ్గించమని, అడవులమీద మరికొన్ని హక్కులు ఇవ్వమని, పుల్లరి తగ్గించమని, పొలాలు సర్వే–సెటిల్‌మెంట్లు (ఆవాసాలు) చేయవలసిందని, ముఖ్యంగా నీటిపారుదల సౌకర్యం కల్పించమని కోరుకుంటు న్నారు. జమీందార్లు ప్రభుత్వం వలె ప్రవర్తిస్తున్నారు. నేను జమీందారీ విధానంపై రైతులను తిరుగుబాటు చేయమని కోరాను. అడవులపై హక్కులు, బంజర్లపై హక్కులు, పొలాలపై 'లెవీ' హక్కులు జమీందార్లే అనుభవిస్తున్నారు. ఇటువంటి నిరర్థకమైన మధ్యవర్తిని వదిలించుకొమ్మని రైతులకు చెప్పాను.

కీ.శే. రామదాసుగారు, శ్రీ బిస్వనాథదాసుగారు (వీరు తరువాత కాలంలో ఒరిస్సా ముఖ్యమంత్రి అయినారు) జమీందార్ల తలతిక్క పనుల నెదిరించి నిలిచారు. నా సాహసోపేతమైన నిర్ణయాలను వారామోదించారు. జమీందారీ వ్యవస్థను రద్దు చేయాలని వారు బద్ధకంకణులైనారు.

నెల్లూరు జిల్లా రైతుల సమావేశము 'అల్లూరు' కొవ్వూరు తాలూకాలో 1931లో జరిగినది. నేను అధ్యక్షునిగా, యన్.వి. రామానాయుడు (ఎడిటర్, జమీన్ రైతు పత్రిక), సెక్రటరీగా, పి.వి. సుబ్బారెడ్డి, ఎమ్. సీతారామిరెడ్డి సభ్యులుగా ఎన్నుకోబడ్డాము. వెంకటగిరి సంస్థానపు బంధువులైన కటికనేని

(కళ్యాణరావు) సోదరులు మాకు వెంకటగిరిలో వసతి కల్పించారు. వెంకటగిరి జమీందారుకు ఆ జిల్లాలోని భూములలో నాలుగో వంతు నుండి మూడో వంతు వరకు ఉన్నాయి. ప్రజలు జమీందారు ఇంటినే బ్రిటీషువారి కోట అనుకునేవారు. వారు ఎస్టేటు భూముల చట్టాన్ని మించి తమ హక్కులు ప్రదర్శించేవారు. వారినొక స్వతంత్రుడైన రాజుగా రైతులు భావించేవారు. వెంకటగిరి, సూళ్ళూరు పేట ప్రాంతాలలో మా పర్యటన రాజాగారి స్నేహితులలో సంచలనం కలుగ చేసింది. అక్కడ జాగృతులైన రైతులు మేము వెంకటగిరిలోనే సమావేశాలు జరుపుటకు తోడ్పడ్డారు.

పలుకుబడి గల జమీందారు స్నేహితులు నన్ను ఆపాలని చూశారు. జమీందార్లకు శాసనసభ్యులతో, పత్రికలవారితో, కవులు-మేధావులతో పరిచయాలు చాలా ఎక్కువ. అక్కడ 'మేల్కొన్న రైతులు' నా జమీందారీ పోరాటానికి వత్తాసుగా నిలిచారు.

ఈ సమావేశానికి పార్లమెంటు సభ్యుడు సత్యమూర్తి, దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు, శ్రీ బిస్వనాథదాసు గారలు హాజరయ్యారు. జమీందారు స్నేహితులు జిల్లా పోలీసు సూపరింటెండెంటును మా సమావేశం జరగకుండా ఆదేశాలు ఇవ్వవలసిందని కోరారు. కాంగ్రెసు వారందరూ ఈ జమీందారీ విధానానికి వ్యతిరేకంగా నిలిచారు.

ఏవిధమైన ప్రజా ప్రదర్శనలు లేకుండా అక్కడ సమావేశం జరిగింది. ప్రజలకు, ప్రజాప్రతినిధులకు ఏవిధమైన అసౌకర్యం కలుగలేదు. మరుసటిరోజు పోలీసువారికి ఈ విషయం తెలియజేశాము. మద్రాసు పత్రికలన్నీ మాకు అనుకూలంగా ప్రచారం చేశాయి. ప్రభుత్వపు చర్యలను ఖండించాయి. సమావేశాలలో ఉన్న మద్రాసు శాసనమండలి, ప్రభుత్వపు చర్యలపై ఆందోళన ప్రకటించింది.

శాసనసభ ద్వారా జమీందార్లను రద్దు చేయాలని నేను కోరాను. ఈ తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించబడింది. నేను భారతదేశానికంతటికీ ఈ విషయంలో మార్గదర్శకుడనయ్యాను. ఈ తీర్మానాన్ని 1946 లో అఖిలభారత కిసాను

కాంగ్రెసు, ఆ తరువాత కాంగ్రెసు పార్టీ ఆమోదించాయి. 1966 సంవత్సరానికి జమీందారీ వ్యవస్థ పూర్తిగా రద్దు అయింది. యన్. వెంకటరామానాయుడుగారి గేయం 'మాకొద్దీ జమీందారీ పొత్తు' ఇంటింటా ప్రతిధ్వనించింది.

ఈ సమావేశం తరువాత జమీందార్లు రైతులను భయపెట్టడం, బాధించడం ప్రారంభించారు. ఈ అణచివేతకు రైతులు తిరగబడ్డారు. నా సలహాకై ఎదురు చూశారు. వెంకటగిరి అడవుల సత్యాగ్రహాన్ని మొదలుపెట్టదలిచాను.

మద్రాసు వెళ్ళి పత్రికలవారందరికీ ఈ విషయం చెప్పాను. ఇంగ్లీషు దినపత్రిక 'స్వరాజ్య' నాకు తోడుగా నిలిచింది. ఉత్తర భారతదేశంలోని పత్రికలవాళ్ళు కూడా నా సత్యాగ్రహ కారణాలను తెలుసుకున్నారు. 1935 లో కాంగ్రెసు సోషలిస్టు పార్టీ ఏర్పాటు, నా 'జమీందారి రైతులు–ఆర్థిక పరిస్థితి' అనే పుస్తక ప్రచురణ జరిగిన తరువాత, బీహారు రైతులు 'స్వామీజీ', ఇతరుల ప్రోద్బలంతో జరిగింది.

రెవెన్యూ బోర్డు మెంబరు రాకకు నేను మచిలీపట్నం వెళ్ళవలసి వచ్చింది. మచిలీపట్నం జనసముద్రంగా మారింది అని ముట్నూరి కృష్ణారావుగారు 'కృష్ణా' పత్రికలో వ్రాశారు. నేను ముఖ్య ఉపన్యాసకుడిని. మాకెవ్వరూ రెవెన్యూ బోర్డు మెంబరును పరిచయం చేయలేదు.

నాలుగు రోజులలో నేను వెంకటగిరి తిరిగివెళ్ళి సత్యాగ్రహాన్ని ప్రారంభించవలసి ఉంది. నేను బెజవాడ వెళ్ళి, అక్కడ కార్యకర్తలకు ఇవ్వవలసిన సలహాలు ఇచ్చి రైల్వేస్టేషనుకు వచ్చాను. నేను రైలు ఎక్కబోతున్న తరుణంలో పోలీసులు నన్ను అరెస్టు చేశారు. శివశంకర్ ఐ.సి.యస్. ఎదుట హాజరుపరిచారు. వారు ఒక సంవత్సరం రైతులను రెచ్చగొట్టవద్దని, అలా అయితే విడుదల చేస్తానని చెప్పారు. నేను ఆ ప్రతిపాదనలను త్రోసిపుచ్చాను. నేను అటువంటి 'సెక్యూరిటీ' ఇవ్వను అని చెప్పాను. నన్ను స్థానిక సబ్‌జైలులో ఉంచారు. నన్ను జైలులోనికి తీసుకొనివెళ్తుండగా శ్రీ సూర్యనారాయణపంతులుగారు వచ్చి, నన్ను కౌగిలించుకొని భోరున ఏడ్వసాగారు. వారు పెదవడ్లమూడి నీటిపారుదల సంఘాధ్యక్షుడు. "గవర్నమెంటువారు మిమ్ములను జైలుకు పంపినా, మా సొసైటీ మీ

నాయకత్వంలో పోరాడుతుంది" అన్నారు. నేను జైలు నుండి తిరిగివచ్చేసరికి వారు మరణించారు.

వెంకటగిరి రైతు సత్యాగ్రహం అనుకున్న సమయానికి ప్రారంభమయింది. కృష్ణా జిల్లా నుండి సత్యాగ్రహోద్యమాలలో అనుభవము గలవారు ఒక వారం రోజులు అక్కడ మకాం చేశారు. శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు. తరువాత కాలంలో వారు ఆంధ్ర ముఖ్యమంత్రి. వారు "తనకు ఈ సత్యాగ్రహంతో ఏమీ సంబంధం లేదని" ప్రకటన చేశారు. జమీందారు ఏజెంట్లు దీనిని అవకాశంగా తీసుకొని, వేలాది కరపత్రాలతో ఈ ప్రకటన పాఠాలు విడుదల చేశారు. ఇది నాకు, ఉద్యమానికి తగిలిన పెద్ద దెబ్బ.

వెంకటగిరి సత్యాగ్రహం కొన్ని నెలలపాటు కొనసాగింది. తీర్థలపాడుకు చెందిన శ్రీ పి. గోవిందరెడ్డి మంచి కార్యకర్తగా ఎదిగాడు. జమీందారీ అధికారులు వేలాది పశువులను దొడ్లలో ఉంచారు. ఈ పశువులను వేలంవేసినా, గడ్డి వాములకు నిప్పు పెట్టినా రైతులు మొక్కవోని ధైర్యంతో నిలిచారు. గవర్నమెంటు దిగివచ్చింది. రైతులకు, జమీందారీ ఉద్యోగులకు రాజీ చేసింది. రైతులు దగ్గరిలో ఉన్న అడవులమీద అధికారము మళ్ళీ సంపాదించుకొన్నారు. నా నాయకత్వాన్ని వారు నమ్మారు.

నాకు ఒక సంవత్సరం కఠిన కారాగారవాస శిక్ష, రూ. 500 లు జుల్మానా ప్రభుత్వం విధించింది. జిల్లా మేజిస్ట్రేటు నాకు ఆక్స్‌ఫర్డులో 'జూనియర్'. నా ఉపన్యాసాలను 'బర్క్'★ ఉపన్యాసాలతో పోల్చాడు. ఆక్స్‌ఫర్డ్‌లో చదివి కూడా, నేను రైతులకు చేస్తున్న సేవను, నా సేవాతత్పరతను అతను అభినందించాడు. అతను తరువాత రోజులలో నిజాయితీపరుడైన ఉద్యోగస్థునిగా, ప్లానింగు మరియు నీటిపారుదల శాఖలలో పనిచేశారు. నాకు మంచి మిత్రుడైనాడు. నీటిపారుదల కట్టడాల నిర్మాణాలలో నాకు తోడుగా నిలిచాడు. మా స్నేహం నాగార్జునసాగర్ నిర్మాణంలో చాలా ఉపయోగపడింది.

★ వారన్ హేస్టింగ్స్ (ఇంగ్లాండు) అభిశంసన. బర్క్ అహోరాత్రాలు మూడు రోజులు నేరారోపణ చేసిన గొప్ప ఉపన్యాసకుడు.

మొదటిసారి జైలులో

నేను జైలుకు వెళ్ళేందుకు రైల్లే ప్లాట్‌ఫారంమీద ఉన్నాను. భారతీదేవిగారు విషణ్ణవదనంతో ప్రాన్పడి నిలిచారు. వాతావరణం అంతా విషాదభరితంగా ఉంది. "ఒక్కసారి నవ్వండి - చంద్రోదయం అవుతుంది" అని నేనన్నాను. ఆమె నవ్వింది. అందరూ నవ్వారు. రైలు స్టేషనును వదిలింది.

నేను జైలుకు వెళ్ళిన తర్వాత భారతీదేవి వెంకటగిరి సత్యాగ్రహాన్ని తలకెత్తు కున్నది. జమీందార్ల తాబేదార్లు ఆమె ఉపన్యసిస్తుండగా రాళ్ళు రువ్వారు. ఆమె ఈ దాడిలో తీవ్రంగా గాయపడింది.

ఆమె 'చుక్కమ్మ'ను తోడుతీసుకొని గోదావరి, కృష్ణా జిల్లాల్లో ఒక నెల రోజులు పర్యటించింది. కిసాను సమ్మేళనాలను ఏర్పాటుచేసింది. స్త్రీలను సత్యాగ్రహానికి ప్రోత్సహించింది. ప్రభుత్వం పది వారాల తరువాత ఆమె ఆచూకీ తెల్సుకొని, ఆమెను అరెస్టు చేశారు. మేజిస్ట్రేటుగారు ఆమె కార్యనిర్వహణా దక్షతకు, సాంఘిక న్యాయం కోసం ఆమె పడే ఆరాటానికి, ఆమె సహజ ఉపన్యాస శైలిని అభినందిం చారు. మేమిద్దరమూ 'వెల్లూరు' జైలులోనే ఉన్నాము. జైలు గోడలు మాత్రమే మమ్ము విడదీశాయి.

నా ఎ.ఐ.సి.సి ఎన్నిక - జవహర్ ధోరణి

ఇరవయి సంవత్సరాల ముందుగా ఆలోచించివుంటే నా రాజకీయ భవిష్యత్తు నాకు అర్థం అయివుండేది. 1931 లో రాష్ట్ర కాంగ్రెసు కమిటీ ఎలక్షన్లు, క్రొత్త సంచాలకులను ఎన్నుకోవటం జరుగుతున్నది. నా ఎంపికకు చాలామంది సిద్ధంగా ఉన్నారు. కానీ చాలామంది నా జిల్లావారే, జైలుకు వెళ్ళివచ్చినవారే వ్యతిరేకంగా ఉన్నారు. జైలుకు వెళ్ళి వచ్చిన అన్ని కులాలవారు, అన్ని జిల్లాల వారు నాతోనే ఉన్నారు. నేను అత్యధిక ఓట్లతో గెలుపొందాను. చాలామంది కాంగ్రెసు నాయకులు ఓడిపోయారు.

నేను ఒకే ఒక ఎ.ఐ.సి.సి. మీటింగుకు హాజరయ్యాను. బొంబాయిలో జరిగిన ఈ సమావేశంలో ప్రాథమిక హక్కులకు మెరుగులు దిద్దాను. గాంధీ గారిని ఏకైక కాంగ్రెసు ప్రతినిధిగా ఎన్నుకొన్నాం. నెల్లూరులోని జమీందారీ

వ్యతిరేక పోరాటం కాంగ్రెసు కమిటీకి తెలియజేశాను. నెహ్రూగారితో సహా కాంగ్రెసు నాయకులకు ఇది నచ్చలేదు. జమీందారీ పోరాటం బ్రిటీషు పోరాటం అని వారు భావించటంలేదు. యు.పి., బీహార్, బెంగాల్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ కాంగ్రెసు మెంబర్లు జమీందార్లే. మహాత్మాగాంధీగారు నన్ను అభినందించారు. రైతుల రక్షణ కొరకు మరికొంతకాలం ఆగాలి అన్నారు. నెహ్రూగారితో స్నేహం ఉపయోగకారి అని చెప్పాడు. నేను కమలాదేవి చటోపాధ్యాయతో స్నేహం సంపాదించాను. నా తీర్మానాలన్నింటినీ ఆమె బలపర్చింది. తరువాత రోజులలో కూడా ఆమె ఇదేవిధంగా బలపర్చేది. చాలామంది సోషలిస్టులు తమ సంతోషాన్ని తెలియజేశారు.

గ్రామ పంచాయితీ ఉద్యమము

1933-35 లలో గ్రామ పంచాయితీలను ఏర్పరచటంతోనే గడిచిపోయింది. శ్రీ పి.వి. నరసింహారావుగారు (భారత ప్రధాని కాదు), నేను కలసి పంచాయితీల ఉన్నతి కోసం కృషి చేశాము. నేను ఆక్స్ఫర్డ్కు వెళ్ళక ముందునుండే ఆంధ్రపత్రిక చదివి, పంచాయితీలను ఏర్పాటుచేయాలనే ఉద్దేశ్యంతో ఉన్నాను. కీ.శే. శంకరన్నాయర్గారు పంచాయితీలు బుద్ధుని కాలంనుండే ఉన్నవన్నారు. అనిబిసెంటుగారు చోళుల కాలంలో పంచాయితీలు పేరందుకొన్నవని చెప్పారు. ఇంగ్లాండులో ప్రజాసేవ చేస్తున్న చర్చి కమిటీలను నేను చూశాను. 1927-30 లలో నేను ఆలమూరు సత్యనారాయణగారికి పంచాయితీలను ఏర్పాటుచేయడం, గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలు చేయటంలో సహాయం చేశాను. తాడేపల్లి గూడెంలో ఈ విషయమే ఉపన్యాసం చేశాను. 1931లో డాక్టరు జె.సి. కుమారప్ప గారితో కలసి ఆర్థిక విచారణ, గ్రామ పంచాయితీలు, సహకార సంఘాలు కలిసి చేస్తున్న పనులను కూడా చూశాను. కృష్ణా, గుంటూరు జిల్లాలలో నా శక్తినంతా కేంద్రీకరించాను. శ్రీ పి.వి.యన్. రావుగారు నిస్వార్థపరులు. వీరికి సీతారామయ్యగారు (పర్చూరు), పిచ్చయ్యవర్మగారు (దోనేపూడి) సహాయకులుగా ఉన్నారు. గోపాలస్వామి అయ్యంగార్ పంచాయితీ రిజిస్ట్రార్ జనరల్గా ఉన్నారు. వారికి పంచాయితీలపై విశ్వాసముంది. 'రెడ్టేపిజం' పోతేగాని పంచాయితీలు ప్రజోపయోగకరమైన పనులు చేయవని చెప్పేవారు. నిర్ణీత సంఖ్యలో ప్రజలు

పంచాయితీలను ఏర్పాటు చేయమని కోరాలి. రెవెన్యూ ఉద్యోగులు విచారణ జరపాలి. ఆ తరువాత ప్రజలకు తెలియజేయాలి. ఎవరికైనా వ్యతిరేకత ఉందా అనేది తెలుసుకోవాలి. తరువాత ఒక సుదీర్ఘ ప్రణాళిక ద్వారా సభ్యులను ఎన్నుకోవాలి. ఇదంతా జరగటానికి మూడు సంవత్సరాలు పడ్తుంది. ప్రజల అర్జీ మద్రాసు నుండి తిరిగివస్తుంది. అక్కడ నుండి తహశీల్దారు, తరువాత సంబంధిత గుమస్తా ఆమోదించిన తరువాత రిజిస్ట్రారు జనరల్‌గారికి పంపబడు తుంది. తర్వాత ఒక ప్రత్యేక అధికారిని నియమించాలి.ఆ తర్వాత మాత్రమే 'ఫండు' పంచాయితీకి వస్తుంది. రైతులు ఈ ధనాన్ని (ఫండు) రోడ్లు, కల్వర్టులు, స్కూలు బిల్డింగులు, వాటి మరమ్మతుల కొరకు ఉపయోగించుకోవచ్చును. ఇది పనినిబట్టి గానీ, మొత్తంగా గానీ 50% వరకు ఉండవచ్చు. ఈ పరిస్థితులలో నేను ఐదువందల పంచాయితీలను ఏర్పాటుచేశాను. ఇంకొక రెండువందల పంచాయితీలను పునరుద్ధరించాను. గవర్నమెంటు నిధులు (గ్రాంట్సు) అన్నింటికీ అందేటట్లు చూశాను.

మేము తాలూకా, జిల్లా స్థాయిలలో పంచాయితీ సమావేశాలను ఏర్పాటు చేసేవారం. ఈ సమావేశాలు పనులు జరగటానికి ఉపయోగపడ్డాయి. ప్రభుత్వ సహాయం పెద్దగా వీటికి లేదు.

శ్రీ పి.వి.యన్. రావుగారు తన స్వంత కారులో తిరిగి రాత్రింబవళ్ళు శ్రమ పడ్డారు. ఆఫీసు సిబ్బందితో బాగా మెలిగేవారు. కీ.శే. యన్. సత్యనారాయణ, బి. వియ్యన్న గార్లు కూడా ఈ ప్రచారాన్ని కొనసాగించారు.

మెజారిటీ పాలన గ్రామ జీవితానికి సరిపడదు

పంచాయితీ ఎన్నికలలో కులాల కుమ్ములాటలు బయటపడ్డాయి. క్రొత్త ఘర్షణలు చెలరేగాయి. కులం, డబ్బు ఓట్ల కొనుగోలులో ప్రాధాన్యత సంతరించు కున్నాయి. ఇవి ప్రజల సామాన్య జీవితానికి అవరోధాలు. ఈ చెడు ఎలా మారాలి? బ్రిటనులో అల్పసంఖ్యాకులకు కూడా వీటిలో ప్రాధాన్యత ఉంటుంది. చోళుల కాలంలో 'లాటరీ' విధానమున్నట్లు ఉత్తరమేలూరు గుడిపై వ్రాతలు చెపుతున్నాయి. 'భారత గ్రామాల్లో ఆర్థిక నిర్మాణం' అనే ఇంగ్లీషు పుస్తకాన్ని 1928 లో ప్రచురించాను. 1926 లో 'స్థానిక స్వపరిపాలన' అనే పుస్తకాన్ని

తెలుగులో వ్రాశాను. 1947 లో కరపత్రాలు ప్రచురించాను. నిర్ణీత సంఖ్యలో యువజన ఓటింగు ద్వారా కొందరిని, మరల వీరినుండి లాటరీ ద్వారా కార్యవర్గాన్ని ఎన్నుకోవటం నా ఆలోచన. ఈ పాతిక సంవత్సరాలలో పంచాయితీలు గ్రామాలలో అనైక్యతకు కారణమయ్యాయి. అధిక సంఖ్యాకులు అల్పసంఖ్యాకులకు కూడా అవకాశమివ్వాలి. నేను 1959 లో ఈ నా ఆలోచన లను జయప్రకాశ్‌నారాయణగారికి చెప్పాను. అప్పటి నుండి జయప్రకాశ్ నారాయణగారు ఈ విధానం అమలుకై కృషి చేస్తున్నారు.

ఉత్తర భారతంలో ఈ పంచాయితీ ఉద్యమం బలపడుతున్నది. అక్కడ కూడా ఈ దౌర్భాగ్య పరిస్థితులే ఉన్నాయి. కాంగ్రెసువారు పంచాయితీలను తమ స్వంత ప్రయోజనాలకు వాడుకుంటున్నారు. ప్రభుత్వం చేతిలో ఇవి కీలుబొమ్మలు. వికేంద్రీకరణ ఒక సాకు మాత్రమే. రైతులు ఏ పంటలు వేసుకోవాలి, ఏ పంటలు పండించాలి, ఎలా నిల్వచేసుకోవాలి, ఎలా అమ్మాలి, ఎలా వీటిని పంచాలి – ఇవన్నీ పంచాయితీ బాధ్యతలు. అంతేగాక భూమిశిస్తు, ఎరువుల పంపిణీ, పోస్టలు బాధ్యతలు కూడా పంచాయితీలపైననే పెట్టాలని ప్రభుత్వం ఆలోచన. పంచాయితీ పాలనపై మాకవగాహన ఉంది. ప్రభుత్వ జోక్యంతో గ్రామాలను కాంగ్రెసువారు విషపూరితం చేస్తున్నారు.

నెహ్రూగారు, కాంగ్రెసువారు గ్రామాలలో వారి జోక్యంతో పంచాయితీలను నాశనం చేస్తున్నారు. వినోబాబావేగారి ఆదర్శాలను వంటపట్టించుకొని, ప్లానింగు కమీషను (ప్రణాళిక) వారు అనుభవరాహిత్యంతో ముందడుగు వేస్తున్నారు. వినోబాబావేగారు 'గ్రామదాన ఉద్యమం'లో చిన్నరైతులు కూడా తమ పొలాలను పంచాయితీలకు ఇవ్వాలని కోరుతున్నారు. వ్యతిరేకంగా నా పోరాటం, 1957లో నెహ్రూ, వినోబాబావే గార్లకు కోపకారణమైనది. అందుకు నేను రాజకీయ శిక్ష చెల్లించవలసి వచ్చింది.

రైతులు - రాజకీయాలలో భూస్వాములు

1932 లో జైలు నుండి విడుదలయ్యాను. పాక్షికంగా అడవులమీద హక్కులు వచ్చినందుకు, జమీందారే ప్రభువు అన్నది నిజం కాదని తెలిసినందుకు వెంకటగిరి రైతులందరూ సంతోషంగా ఉన్నారు. వారు నన్ను జిల్లా బోర్డు,

తాలూకా బోర్డు ఎన్నికలకై సాదరంగా ఆహ్వానించారు. పోటీ జమీందారీ మెంబర్లకు-రైతు మెంబర్లకు. జమీందారుగారి మనుషులు ఎన్నికలలో ఓడి పోయారు. వెంకటగిరి, సూళ్ళూరుపేట జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులుగా రైతులు గెలిచారు. ఈ గెలుపుకు కీ.శే. యన్.వి. నాయుడుగారి పాటలు ముఖ్య కారణం. యన్.వి. నాయుడుగారు 'రైతు భజనావళి'కి ఎక్కువ ప్రచారం కల్పించారు. *'కులముతో మనకేమి జోలియన్నా' అనే పాట విశేష ప్రచారం పొందింది.

గాంధీగారి ఆశీస్సులు

మా రైతు ఉద్యమానికి కొందరు కాంగ్రెసు నాయకులు సంతోషంగా లేరు. ముగ్గురు నాయకులు చాటుగా గాంధీగారీ ఉద్యమానికి వ్యతిరేకులని ప్రచారం చేశారు. గాంధీగారు వెంకటగిరికి జనవరి 1934 లో వచ్చారు. కటికనేని (కళ్యాణరావు) వారి ఇంట్లో సమావేశం జరిగింది. 'పర్దా'లో ఉన్న స్త్రీల తరపున భారతీదేవిగారు మాట్లాడారు. అడవి సత్యాగ్రహం చేసిన రైతులు అధిక సంఖ్యలో వచ్చారు. వీరందరూ సత్యాగ్రహంలో లాఠీదెబ్బలు రుచి చూసినవారే. వీరు తమ బాధలను గాంధీగారితో చెప్పుకున్నారు. జమీందారు పార్టీ, బ్రిటీషువారు ఒకరేనని చెప్పారు. గాంధీగారు ఓర్పుతో విన్నారు. 'జమీందారీ విధానం నశించాలి' అనే మా నినాదంపై ఆలోచించారు. "జమీందారీ విధానం రద్దుకు మీ పోరాటం మెచ్చదగినదే. మీరందరూ సత్యాగ్రహం చేయటానికి సిద్ధంగా ఉన్నారా?" అని అడిగారు. రైతులందరూ 'సిద్ధం - సిద్ధం' అన్నారు. "అలాగయితే రంగా ఇక నీవు రైతుల వెంటనే ఉండు" అన్నారు.

వారిచ్చిన ధైర్యంతో జాతీయ స్థాయిలో జమీందార్లకు వ్యతిరేకంగా పోరాటం చేశాను.

జమీందారీ వ్యతిరేకోద్యమం

వెంకటగిరి ఉద్యమం తరువాత, ఇతర జమీందారీ రైతుల నుండి కూడా నాకు ఆహ్వానాలు వచ్చినయ్. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సంపాదకులు "దీనిని ఒక

* రైతు భజనావళి పాటలు.

జాతీయోద్యమంగా చేయమ”ని నన్ను కోరారు. మూడవ జమీందారీ వ్యతిరేకో ద్యమం నా అధ్యక్షతన ఏలూరులో జరిగింది. తీర్మానాలు చాలా జాగ్రత్తగా రాశాను. జమీందారీ విధానం రద్దు చేయాలి. జమీందారీ రైతులను రైతువారి రైతులుగా గుర్తించాలి. ఈ తీర్మానాల వలన రైతులు భూమిశిస్తు, లాండు సర్వే, భూ సెటిల్‌మెంట్లు, పంటల నష్టాల చెల్లింపులు, చెరువులు, నీటిపారుదల సౌకర్యాలు మెరుగుపరచటం వంటివి చేయాలి. సర్వే చేయని పొలాలకు భూమి శిస్తు చాలా ఎక్కువగా చెల్లించవలసి ఉంటుంది. నేను, యన్.వి. నాయుడు, ఆర్.వి. శర్మ ఎస్టేట్లు మొత్తం తిరిగాము. వేలాది రైతులను కలిశాము. స్థానిక నాయకులతో మాట్లాడాము. జమీందారీ రికార్డులు లోతుగా పరిశీలించాము.

వింత అనుభవాలెదురయ్యాయి. నన్ను కొట్టటానికి, వీలైతే నా ఎముకలు విరగదీయటానికి తీవ్ర ప్రయత్నాలు జరిగాయి. చాలా దుర్భాషలు పడవలసి వచ్చింది. తాగుబోతులు, జమీందార్ల తొత్తులు రైతు నాయకులను దోవకాచి కొట్టేవారు. పశువుల కొట్టాలకు నిప్పు పెట్టేవారు. పంటలను నాశనం చేసేవారు. బొబ్బిలి ఎస్టేటులో బాధలు చెప్పనలవికాదు. కొన్నిచోట్ల మారువేషాలతో తిరగ వలసి వచ్చేది. రైతులు భయపడ్డారు. బొబ్బిలి రాజాగారప్పుడు ముఖ్యమంత్రి. యన్.వి. నాయుడుకు, నాకు ఆశ్రయమిచ్చినందుకు ఒక కరణం నిరాశ్రయు డయ్యాడు.

చాలామంది స్థానిక కాంగ్రెసు నాయకులు మాకు రహస్య సమాచారం అందించేవారు. కొందరు రహస్యంగా ఉంటానికి చోటు ఇచ్చేవారు. ఎవరెవరిని కలుసుకోవాలో తెలియజెప్పేవారు. కీ.శే. గాంధీకృష్ణమూర్తి, న్యాపతి నారాయణ మూర్తి, ప్రఖ్యాత తెలుగు భాషా పరిశోధకుడు శ్రీ గిడుగు రామమూర్తి పంతులు, శ్రీ సాలా సీతారామయ్య (బొబ్బిలి), గొర్రెపాటి వెంకటసుబ్బయ్య (దివి తాలూకా) మాకు సహాయం చేశారు. నా అదృష్టంకొలది గొర్రెపాటి వెంకటసుబ్బయ్య తన జీవితకాలం అంతా నాకు విశ్వాసపాత్రుడుగా ఉన్నాడు. 1943 లో కిసాను సమ్మేళన అధ్యక్షునిగా, తరువాత స్వతంత్ర పార్టీలో ఆంధ్ర విభాగానికి అధ్యక్షునిగా పనిచేశారు (1959-60).

అవిశ్రాంతంగా ఐదు నెలలు ఏ ఇతర కాంగ్రెసు నాయకులు తిరగని ప్రదేశాల నన్నింటిలో తిరిగాము. మా విచారణ, దర్యాప్తు పూర్తిచేశాము. ఈ విషయాలు 'స్వరాజ్య', 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రికలలో శ్రీ ఖాసా సుబ్బారావుగారు, శ్రీ సంతానంగారు ప్రచురించారు. జమీందారీ రైతుల కడగండ్లను ప్రజలందరూ వీరివలన తెలుసుకున్నారు. 1933 న ఎర్నేని లక్ష్మీనారాయణ (విజయవాడ)గారి ఆర్థిక సహకారంతో 'జమీందారీ రైతుల ఆర్థికస్థితి' పైన మొత్తం రిపోర్టు ప్రకటించాం. జనవరి 1934 లో గాంధీగారికి సమర్పించాం. వారు నన్ను అభినందించారు. ఈ రిపోర్టు ప్రచురణతో జమీందార్లపై నా పోరాటం దేశ వ్యాప్తంగా తెలిసింది. రైతుల దురవస్థలను కలకత్తా, అలహాబాదు, బొంబాయి లోని పత్రికలు ప్రభుత్వం దృష్టికి తెచ్చాయి.

మేమందరమూ జైలులో ఉన్న సమయంలో (1932–33) ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల రైతులు ప్రభుత్వంవారి 18¾% శిస్తు పెంపుకు అంగీకరించారు. దీనిని అంచెలంచెలుగా వసూలు చేస్తారు. ఉదా : 1932 లో ఒక అణా (రూపాయిలో 16వ వంతు), రెండు అణాలు 1933 లో, మూడు అణాలు 1934 లో – తరువాత పూర్తిగా వసూలు చేస్తారు. మేము జైలులో ఉన్నప్పుడు ఒక అణా మాత్రము వసూలు చేశారు. నేను ఈ శిస్తు పెంపుదలపై తీవ్ర ఆందోళన లేవదీశాను. ప్రభుత్వం దారికొచ్చింది.

రైతుల కోర్కెలను రాష్ట్ర సమావేశాలలో తీర్మానాల రూపాలలో ఇవ్వాలి. అన్ని జిల్లాలకు ఈ తీర్మానాలు అందాలి. ఈ తీర్మానాలు ఆమోదించబడాలి. వీటిని ప్రభుత్వంవారికి, పత్రికలకు తెలియజేయాలి. వీటన్నిటిపై రెవెన్యూ అధికారులు ఏమి చర్యలు తీసుకున్నారో తెలుసుకోవాలి. నేను ప్రవేశపెట్టిన విధానాలలో ఇది ఒకటి.

రైతు వారోత్సవాలు

రైతు వారాలు – రైతు మార్చ్ (Ryot March) లను మొదలుపెట్టాను. తాలూకా నుండి జిల్లా కేంద్రం వరకు ఇవి సాగేవి. నా సోదరులు, నా బాల్య మిత్రుడు ఆచంట నాగయ్య గారలు మార్చి 1933 న మొదటగా గుంటూరులో

ఈ 'మార్చ్'లో పాల్గొన్నారు. రెండవ వారోత్సవం నవంబరు మొదటి వారంలో జరిగింది. నా సోదరుడు వెంకటప్పయ్య తన పాటలతో ఈ వారోత్సవాలను విజయవంతం చేశాడు. ఇరువది ఐదు మైళ్ళు బండ్లు కట్టుకొని రైతులు వచ్చారు. నా చిన్న తమ్ముడు లక్ష్మీనారాయణ, జి.వి. సుబ్బయ్య, అప్పికట్ల నుండి ఎ. నాగయ్య, భారతీదేవి, కీ.శే. లావు అంకమ్మ – వీరందరూ ఈ కార్యక్రమం జయప్రదం కావటానికి కృషి చేశారు. నవంబరు 7వ తేదీన కలెక్టరు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. డెబ్బయ్ ఏళ్ళ వృద్ధుడు శ్రీ వెంకటాచలపతి గారి ఆధ్వర్యములో జి.వి. అప్పయ్య, యన్. మల్లయ్య గారలు మచిలీపట్నంలో ఈ కార్యక్రమాలు జరిపారు. శ్రీ యమ్. రామచంద్రరావు (R.T.C. Fame), యన్. సుబ్బారావు గారలు భీమవరం, రాజమండ్రిలలో ఈ 'మార్చ్'లు నిర్వహించారు. 'కలసివుంటే నిలచి ఉంటాము' అన్న విషయం నవంబరు 7వ తేదీ జరిగిన రైతు వారోత్సవాలు రుజువు చేశాయి. రైతుల కొరకు మాట్లాడే నాయకునిగా నాకు గుర్తింపు వచ్చింది. శ్రీమతి కమలాదేవి చటోపాధ్యాయ ఈ రైతు వారోత్సవాలలో పాల్గొని, నన్ను అభినందించింది.

గోదావరి, కృష్ణా జిల్లాలలో మార్చి, ఏప్రియల్ నెలల్లో అదనంగా విధించిన రెండు అణాల పన్ను వసూళ్ళను ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది. తరువాత 12½% వసూలును జిల్లాలో ఆపివేశారు. రెండవసారి చర్చలలో 12% ను అన్ని జిల్లాలలోనూ, 18¾% భూమి శిస్తును ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలలో నిలుపుదల చేశారు. 23 జిల్లాల ప్రజలందరికీ ఇది ఉపయోగపడుతుంది. అప్పటినుండి నన్ను 'పన్నులు తగ్గించే రంగా' అని ప్రజలు పిలువనారంభించారు.

ఈరోజు కాంగ్రెసు మంత్రివర్గం ఎలా ఉంది? సర్దార్ లచ్చన్న, భారతీదేవి గారు ఐదువేలమంది ప్రజలతో 1962 లో సెక్రటేరియట్ ఎదుట, 100 నుండి 300 శాతం వరకు పెంచిన శిస్తుకు వ్యతిరేకంగా ప్రదర్శన చేశారు. కమ్యూనిస్టులు కూడా పాల్గొన్నారు. 750 మంది కిసానులు జైలుకు వెళ్ళారు. కానీ కాంగ్రెసు ప్రభుత్వం వీరి మాటను పెడచెవిన పెట్టింది. ఈ శిస్తు పెంపు కోర్టులలో కొట్టివేశారు.

ఇదేనా స్వరాజ్యం?

హరిజనుల బాగుకోసం 1933 లో గాంధీగారు 21 రోజులు నిరాహారదీక్ష చేశారు. నేను జిల్లా హరిజన సేవా సమాఖ్యకు అధ్యక్షునిగా, తాలూకా శాఖలను ఏర్పాటుచేశాను. రేపల్లె, తెనాలి తాలూకాలలో పదిమంది హరిజన కార్యకర్తలతో ఈ ఊళ్ళన్నీ తిరిగాను. మొదటలో కొద్దిగా ప్రతిఘటన వచ్చినా, తరువాత హరిజన కార్యకర్తలు నన్ను స్వాగతించారు. చాలా గ్రామాల్లో బావులు, చెరువు లలో అందుబాటు కల్పించాము. కొన్నిచోట్ల దేవాలయాలలోనికి హరిజనులకు వెళ్ళనిచ్చారు.

గాంధీజీ ముద్ర

కాంగ్రెసు నాయకుడు సీతారామశాస్త్రి అనుచరుడు యమ్. ప్రసాదరావు సెక్రటరీగా నేను గుంటూరు జిల్లా పర్యటన చేశాను. లక్షమంది జనాన్ని కలుసు కున్నాను. వందలకొలదీ బావులు, చెరువులు హరిజనులకంకితము చేయ బడ్డాయి. శ్రీ కె. మధుసూదనరావు సహకారంతో ఒక వారం రోజులు గాంధీ గారి నిరాహారదీక్షా శిబిరంలో నేను కృష్ణా జిల్లాలో ఉద్యమం నడిపాను. డా॥ ఘంటసాల, యస్. శర్మ, శ్రీ జియ్యర్‌దాసులు నాకు తోడుగా ఉన్నారు. శ్రీ జియ్యర్‌దాసుగారు తరువాత కాలంలో యం.ఎల్.ఏ. అయ్యారు. వీరిరువురూ సేవాదళ్ కార్యకర్తలే.

హరిజనులకు ప్రభుత్వ భూములు

1923 నుండీ నా సోదరులు జి.వి. అప్పయ్య, ఆచంట నాగయ్య, నేను హరిజనులకు ప్రభుత్వ భూముల నిప్పించేందుకు కృషి చేశాము. 5000 ఎకరాలు హరిజన క్రిస్టియన్లకు పెదవడ్లపూడి - పాతూరులలో 1926-32 లలో ఇప్పించి నీటిపారుదల సౌకర్యం కల్పించాను.

శ్రీ వి. కూర్మయ్యగారితో వెళ్ళి నెల్లూరు జిల్లా పొయ్యూరులో 2000 ఎకరాల ప్రభుత్వ పొలాలకు నీటిపారుదల సౌకర్యం కల్పించాను. ఈ పొలాలను బడా

వ్యవసాయదారులు సొంతంచేసుకోవాలని ఉన్నారు. శ్రీ కూర్మయ్యగారు బెనారస్‌లో ప్లీడరీ చదువుకుంటున్నారు. తరువాత మద్రాసు ప్రభుత్వంలో హరిజన శాఖామాత్యులయ్యారు. స్థానిక రైతులు కూడా నాకు సహకరించారు.

హరిజనుల బాగుకోసం హరిజనులు కూడా కృషి చేయాలి

గాంధీగారు అస్పృశ్యతా నివారణ కొరకు సవర్ణులను కృషి చేయమని కోరారు. నేను హరిజనులు కూడా ఈ కార్యక్రమంలో హిందువులుగా, జాతీ యోద్యమకారులుగా బాధ్యతను స్వీకరించేటట్లు చేశాను. శ్రీ కమతం షణ్ముఖం (వీరూ యం.ఎల్.ఏ. అయ్యారు), శ్రీ నూతక్కి వెంకటేశ్వర్లు (హరికథకునిగా పేరుతెచ్చుకున్నారు), శ్రీ అంజనప్ప (హరిజన పట్టభద్రుడు మా కాలేజీలో - తరువాత యం.పి.) గారలు కూడా ఈ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

మా గ్రామంలో పర్యటించటానికి, నివసించటానికి, హరిజనుల సేవ చేయటానికి నాకు అవకాశం కలిగింది. దళితులలో మార్పును చూశాను. శానిటరీ పరిస్థితులు బాగుపడుతున్నాయి. పెరడులలో కూరగాయల పెంపకం మొదలుపెట్టారు. కానీ వారి సాధారణ స్థితిగతులలో పెద్దగా మార్పు రాలేదు. దీనికొరకు నేనెంతగానో కుమిలిపొయ్యేవాడను.

వ్యవసాయ కూలీలు - లేబరు కమీషనరు

హరిజనులలో అధికులు వ్యవసాయ కూలీలే. ప్రభుత్వం ఒక విచారణ సంఘాన్ని 1928-29 లలో నియమించింది. వ్యవసాయదారులు కూడా కూలీలే. ఈ విషయం ప్రభుత్వానికి గుర్తుచేయటానికి ఒక రిపోర్టు తయారు చేశాను. కార్మిక నష్ట పరిహార చట్టం (Workmans Compensation Act) ద్వారా వీరికి కూడా నష్ట పరిహారమివ్వవలసిందిగా కోరాను. యూనియన్ చట్టాలను వీటికి అనుగుణంగా మార్చవలసిందిగా, సరైన కూలీ నిర్ధారించ వలసిందిగా వారికి తెలిపాను. అసంఘటితంగా ఉన్న బీడీ మరియు చర్మకారులను యూనియన్ పరిధిలోకి తీసుకొనిరావలసిందని కోరాను.

అంతర్జాతీయ కార్మిక సంఘంలో నేనీ విషయాన్ని తరువాత రోజులలో మాట్లాడాను. కనీస కూలీ నిర్ధారణలో నేను కొంత పురోభివృద్ధి సాధించాను.

కేంద్ర శాసనసభలోనూ, అంతర్జాతీయ కార్మిక సంఘంలోనూ, ఇండియాలో జరిగిన త్రైపాక్షిక (Tripartite) సంఘంలోనూ అందరూ నన్ను పట్టు విడువని విక్రమార్కునిగా వర్ణించారు.

వయోజనుల ఓటు హక్కు

దళితుల, వెనుకబడిన తరగతులవారి ఉద్ధరణకు 1923 లో నేను వయోజన ఓటు హక్కుపై పోరాడాను. తెల్లవాడైన 'సైమన్ కమీషన్'కు వ్యతిరేకంగా మోతీలాల్ కమిటీ ప్రచురించిన భారత రాజ్యాంగాన్ని ప్రజలందరూ ఆమో దించారు. లిబరల్స్, ముస్లింలు కూడా సహకరించారు. వయోజనుల ఓటింగుకై ఈ సందర్భంలో నేను త్రివేణీ మాసపత్రికలో ప్రచురించబడిన నా ప్రచురణను కూడా వారికిచ్చాను. వయోజనుల ఓటు హక్కును మోతీలాల్ కమిటీ తమ రాజ్యాంగంలో చేర్చింది. 'త్రివేణి'లో గవర్నరు స్వతంత్ర భారతంలో ఎంతో ఉపయోగకారి అని నేను వ్రాసిన విషయాన్ని శ్రీ పట్టాభి (సీతారామయ్య) గారు ఎగతాళి చేశారు. ఈ స్వతంత్ర భారతంలో వారే తర్వాత 'గవర్నరు' అయ్యారు.

హరిజనులకు చట్టసభలలో కొన్ని సీట్లు కేటాయించాలని కోరాను. ఈ విషయం ప్రముఖ ఇంగ్లీషు పత్రికలలో ప్రచురించబడింది. మహాత్మా గాంధీ గారు మొదటి, రెండవ రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్సులలో నా ప్రతిపాదనకు వ్యతి రేకంగా ఉన్నారు. 'పూనా'లో జరిగిన సమావేశంలో నా ప్రతిపాదనను అంగీక రించారు.

మన జాతీయ నాయకుల అలసత్వం వలన మొదటి రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్సులో ముస్లింలకు అదనపు సీట్లు కేటాయించారు. దీనివలన ఇండియా–పాకిస్తాను చీలిక ఏర్పడింది.

పూనా-పాట్నా ఎ.ఐ.సి.సి.

గవర్నమెంటు నిషేధం కాంగ్రెసుపై కొనసాగుతునే ఉంది. గాంధీగారు తన నిరాహారదీక్షను విరమించటంతో తాత్కాలికంగా విడుదల చేయబడ్డారు. శ్రీ యస్.యమ్. ఆనే గారు విదర్భ నాయకుడు. భవిష్యత్ కార్యక్రమం కోసం

అధ్యక్షుడుగా ఉన్నాడు. ఆ సంవత్సరంలోనే 'వ్యక్తి' సత్యాగ్రహం కాంగ్రెసు మొదలు పెట్టినా, పూర్తిచేయలేకపోయింది. శ్రీ సత్యమూర్తి, శ్రీ భూలాబాయ్‌దేశాయి గారలు ఛాందసవర్గాల నుండి ప్రతిఘటనను ఎదుర్కొన్నారు.

మహాత్మాగాంధీగారి దర్శనం కొరకు ఆ సమావేశంలో అందరూ ఎదురు చూపులు చూస్తున్నారు. నాకు గాంధీగారు స్ఫూర్తిదాత. వారిలో మనుష్యులలోని లోటుపాట్లు, భగవంతునిలోని విశిష్ట గుణాలు ఉన్నాయి. కోట్లాదిమంది హరిజనులకు, అల్పసంఖ్యాక వర్గాలకు బ్రిటీషువారి దోపిడీ నుండి రక్షణ కల్పించడమే గాంధీగారి సంకల్పం. భారతదేశంలోని సాంప్రదాయవాదులను చాలావరకు మార్చగలిగారు.

శ్రీమతి కమలాదేవిగారి అధ్యక్షతన ఈ పూనా సమావేశంలోనే భారత జాతీయ వాదంపై ఒక సమావేశం జరిగింది. శ్రీ బి.కె. రావు, శ్రీ బి. గోపాలరెడ్డి ప్రభృతులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ముసాయిదా తీర్మానాన్ని ఆమోదించి, దీనిని పాట్నా సమావేశంలో ప్రకటించాము.

అమ్మమ్మ నిర్యాణము

1933 శివరాత్రి రోజున జిల్లా కాంగ్రెసు సమావేశం కొరకు నరసరావుపేట తాలూకా, కోటప్పకొండకు నేను వెళ్ళవలసి ఉంది. మా అమ్మమ్మ ఈ శివరాత్రి రోజున నిర్యాణం కోసం ఎదురుచూస్తున్నదని మంగమ్మమ్మ చెప్పింది. మా అమ్మమ్మ 'అమ్మినియమ్మ' "నాయనా నీవా సభకు వెళ్ళు. నేనీరోజు చనిపోతే నేను శివసాయుజ్యం పొందుతాను. నిన్ను నానుంచి ఎవరూ విడదీయలేరు" అన్నది. నేను నరసరావుపేట నుండి వచ్చేసరికి ఆమె చనిపోయింది. తన చుట్టూ ఉన్నవారిని నవ్వుతూ చూస్తూ ఆమె మరణించింది. ఆమెకు భగవంతునిపై విశ్వాసం చాలా ఎక్కువ. ఆమె చాలా అందంగా ఉండేది. నాకు ఆమె ఒక దేవతగా కన్పించేది.

గాంధీజీ ఉద్యమం

ఆంధ్రాలో గాంధీగారు డిసెంబరు 1933 నుండి జనవరి 1934 వరకు హరిజన పర్యటన చేశారు. శ్రీ మాగంటి బాపినీడు ఆంధ్రప్రదేశ్ సేవాదళ్

కార్యదర్శిగా దీనిని ఏర్పాటుచేశారు. గాంధీగారి పర్యటన మా ఊళ్ళో జరిగింది. ఒకరోజు మాత్రమే నేను వారిని తెనాలి స్టేషనులో కలిశాను. గుంటూరు నుండి రేపల్లె వరకు వారి కారులోనే ప్రయాణించాను. నన్ను వారు తన కారులోనికి ఆనందంగా నవ్వుతూ ఆహ్వానించారు. అసంఖ్యాక ప్రజానీకం ఒక వెల్లువలాగా వారిని చుట్టుముట్టారు. వారిని కారులో ఎక్కించటానికి చాలా కష్టపడ్డాం. ఎవరిదో ఒక చేయి వారి తలకు తగిలింది. నేను బిత్తరపోయాను. వారు చిరునవ్వు నవ్వారు. వారి ఈ నలుబది మైళ్ళ ప్రయాణం దేవతలు అసూయ పడేటంతగా సాగింది. గ్రామగ్రామాన పూలదండలు. ప్రతి గ్రామంలో పండుగ వాతావరణమే. ప్రతి గ్రామంలో 'మహాత్మాగాంధీకి జై' అనే నినాదమే. ప్రొఫెసరు మల్కానీగారు గాంధీగారి కార్యదర్శి. వారికి నన్ను పరిచయంచేస్తూ 'ప్రొఫెసరుతో – ప్రొఫెసరు' అంటూ గాంధీగారు నవ్వారు.

చేబ్రోలులో కార్యక్రమం ఏర్పాటు చేయలేదు. ఇక్కడనుండే మహిళలు అధిక సంఖ్యలో జైళ్ళకు వెళ్ళారు. కాంగ్రెసుకు ముఖ్యమైన గ్రామం. కొద్ది నిమిషాలు ఆగి మాట్లాడుటకు గాంధీగారిని ఒప్పించాను. తరువాత పన్నెండు సంవత్సరాలు ఆంధ్ర మహిళా రాజకీయ శిబిరం చేబ్రోలులోనే నడుపబడింది.

రైతాంగ విద్యాలయ ఆవిర్భావం

మునిపల్లె, పచ్చలతాడిపర్రులలో ప్రజలు గాంధీగారిని క్రమశిక్షణతో ఆహ్వానించారు.

రామానీడు రైతాంగ విద్యాలయాన్ని గాంధీగారు ప్రారంభించారు. జి. లక్ష్మీనారాయణ, యన్.వి. సుబ్బయ్య ఎడిటర్లుగా కిసాను ప్రచురణలను నా 'హరిజన నాయకుడు' అనే తెనుగు పుస్తకంతో ప్రారంభించారు. మంగమ్మమ్మ ఆ గంటసేపు గాంధీగారి కాళ్ళవద్దనే కూర్చున్నది. భారతీదేవి మా గ్రామస్థులిచ్చిన డబ్బుతో నిండిన ఒక బరువయిన పర్సును, తన చేతి గాజులను గాంధీగారి కిచ్చింది. శ్రీమతి భారతీదేవిగారు కుట్టిన తన 'బొమ్మ'ను గాంధీగారి తిరిగి ఇచ్చారు. ప్రఖ్యాత సినీనటుడు సి.యస్.ఆర్. ఆంజనేయులు, ఇతరులు కూడా

తమ తమ 'పర్సు'లను బహూకరించారు. గాంధీగారు అరగంట మాట్లాడారు. ఈ ఉపన్యాసంలో భారత రైతాంగ విద్యాలయపు ప్రాముఖ్యతను వివరించారు. చేబ్రోలు మహిళలను, భారతీదేవిని అభినందించారు.

నా సోదరులను, పి.బి. నాయుడుగారిని (పాములపాటి బుచ్చినాయుడు) ఒప్పించి, మా పూర్వీకులు నిర్మించిన సత్రమును 'రామానీడు విద్యాలయం'గా మార్చాను. బాపూజీ నన్నీ విద్యాలయానికి గౌరవ కార్యదర్శిగా నియమించారు. "ఈ విద్యాలయాన్ని, రంగాను నేనభినందిస్తున్నాను" అని బాపూజీగారు ఆశీర్వదించారు. బాపూజీ ఆశీస్సులతో 'మా అమ్మ మంగమ్మ' నా సోదరులకొరకు, నాకొరకు పడిన బాధలన్నీ తీరినట్లుగా భావించింది.

మా గ్రామం నుండి 'తాళ్ళపాలెం' హరిజన గ్రామానికి వెళ్ళాము. ముందురోజు వర్షం కురిసింది. అందువలన బాపూజీ ఈ ఒకటిన్నర మైలు నడచే వచ్చారు. వందలకొద్దీ జనం వారితో నడచారు. భారతీదేవి కాలికి ఎదురురాయి తగిలింది. నెత్తురు కారుతుంటే చూసి బాపూజీ బాధపడ్డారు. తాళ్ళపాలెంలో వేలమంది హరిజనుల నుద్దేశించి బాపూజీ మాట్లాడారు. "అణగారిన హరిజనుల సాంఘికోన్నతికి హరిజనులే బాధ్యత తీసుకోవాలి" అని ఉద్బోధించారు.

సాయంత్రం రేపల్లె చేరాము. ఆ మధ్యాహ్నము వినయాశ్రమంలో విడిది. వినయాశ్రమం బాపూగారికంకితము చేయబడింది. గ్రామీణ యువతుల కార్యక్రమాలు, జ్ఞానకేంద్రావిష్కరణ గాంధీగారికి బాగా నచ్చాయి. స్వామీ సీతారామ్, ఆశ్రమ దాతలు బసవయ్య, బసవయ్యగారి భార్య బాపూజీగారి శిష్యులు.

బాపూ దర్శనం కొరకు వచ్చిన 'కృష్ణాతీరవాసు'లందరితో రేపల్లె నిండిపోయింది. గాంధీగారిని అతి ప్రయాసతో కార్యకర్తలు స్పెషలు రైలులో ఎక్కించగలిగారు. వారు తెనాలి వెళ్ళారు. వారి దర్శనంతో తెనాలి ధన్యమైంది. గాంధీగారు భారతీదేవి నిర్మాణాత్మక కార్యక్రమాలకు ఆకర్షించబడ్డారు. వారామెను తనతోపాటుగా ప్రయాణించమని కోరారు. ఆమె వారిని వెంకటగిరిలో కలుస్తానని చెప్పింది. వారు సంతోషించారు.

లక్షలాది జనాభాకు బాపూజీ దర్శనము ఒక పెద్ద పండుగ. నేను ఎక్కువ మందిని వారికి పరిచయం చేశాను. బాపూ నా ఉద్దేశ్యం అర్థంచేసుకున్నారు. "నిన్ను కూడా రంగా ఇలా తరిమి తరిమి పనిచేయిస్తాడా" అని భారతీదేవి గారిని ప్రశ్నించారు.

నేను వారిని మరల వెంకటగిరిలో కలిశాను. కటికనేని (కళ్యాణరావు) వారింట్లో బాపూజీ విడిది. సంస్కారవంతులైన కటికనేని కుటుంబం చేసిన సపర్యలకు బాపూజీ సంతోషించారు.

శ్రీమతి పొనక కనకమ్మ కాంగ్రెసు సత్యాగ్రహి, కస్తూరిబా విద్యాలయ నిర్మాత, జైలులో భారతీదేవిగారికి సహచరులు. బాపూజీగారితో చాలాసేపు సంభాషించారు. బాపూజీ కనకమ్మ, భారతీదేవి గార్లతో ఉదయపు నడక నడిచారు.

"రంగా నీకు నా అభినందనలు" అంటూ బాపూజీ రైలెక్కారు.

★ ★ ★

'జమీన్‌రైతు' పత్రిక రజతోత్సవ సందర్భంలో (1954)
కూర్చున్నవారు : కటికనేని కల్యాణరావు, రంగాజీ, నెల్లూరి వెంకట్రామానాయుడు.
నిల్చున్నవారు : వెంకటరెడ్డి, మహానంద, రామమూర్తి, లచ్చన్న, నాగినేని వెంకయ్య, వెంకటసుబ్బానాయుడు.

6. చేనేత ఉద్యమం (1935-55)

1925 లో నేను చేనేత ఉద్యమము ప్రారంభించే సమయానికి ఈ ఉద్యమం నిద్రావస్థలో ఉంది. చేనేత పనివారిలో విద్యాధికులైన (1936 లో) శ్రీ శ్రీకంఠం గారు, శ్రీ పెండెం రాములుగారు మొదటిసారిగా దీనిని ఒక ఉద్యమ పంథా లోనికి తీసుకువచ్చారు. శ్రీ పెండెం వెంకటరాములు కాంగ్రెసువాది. జైలుకు కూడా వెళ్ళివచ్చారు. వారు ఈ చేనేత సంఘాన్ని నిర్మించటానికి ముందుకు వచ్చారు. వారు ఆరు సంవత్సరాలు నా మార్గదేశికత్వంలో నడచి ఈ సంఘాన్ని నిర్మించారు. 1938-40 లలో చాలా నేతపనివారి సంఘాలు, గవర్నమెంటు వారు మొదలుపెట్టించారు. ఈ సంఘాలకు సంవత్సరానికి 10 లక్షల వరకు 'సబ్సిడీ' ద్వారా ధనసహాయమందేది.

1940 లో చాలా బలమైన నాయకత్వం వచ్చింది. శ్రీ ప్రగడ కోటయ్య, శ్రీ టి. రామకోటేశ్వరరావు, వీరభద్రరావులు నన్ను వారి అభ్యర్థిగా మద్రాసు చేనేత సంఘానికి పోటీచేయమన్నారు. జస్టిస్‌పార్టీవారిమీద, ప్రభుత్వ అభ్యర్థులమీద నేను అఖండమైన మెజారిటీతో గెలిచాను. నా ఇతర బాధ్యతల వలన నేను నాలుగు నెలలు మాత్రమే ఈ సంఘానికి అధ్యక్షునిగా ఉన్నాను. శ్రీ ప్రగడ కోటయ్యగారిని రాష్ట్ర నమూనా తయారుదారుగా, శ్రీ జి. మల్లయ్యగారిని గౌరవ నమూనా తయారీదారుగా నియమించాను. రకరకాల ప్రింటులు, డిజైను కేంద్రాలను నెలకొల్పాము.

1940 లో నేను జైలుకు వెళ్ళేటప్పుడు శ్రీ యమ్. సోమప్పగారికి నాయకత్వం అప్పజెప్పాను. ఈ అధ్యక్ష పదవి ద్వారా వారు 10 మిలియన్ల నేతపనివారికి నాయకుడయ్యారు. వారు మొదటి సహకార నూలుమిల్లుకు అధ్యక్షులు కూడా కాగలిగారు.

నేతపనివారికి శిక్షణ తరగతులు భారత రైతాంగ విద్యాలయం ద్వారా ఏర్పాటుచేశాము. ప్రత్యేకంగా వీరికి స్కూళ్ళను, నేతపనివారి ప్రదర్శనలను అనేక జిల్లాలలో నడిపాము.

యుద్ధ కాలంలో శ్రీమతి భారతీదేవిగారు రాష్ట్ర నేతపనివారికి గౌరవాధ్యక్షు రాలుగా ఉన్నారు.

కిసాను ఉద్యమంపై కాంగ్రెసు సోషలిస్టు పార్టీవారికి, కమ్యూనిస్టు పార్టీవారికి సానుభూతి లేదు. వారీ ఎన్నికలలో గెలవలేక వ్యతిరేకులయ్యారు. ఈ హస్తకళలు అన్నీ నశించేవి అనేది మార్క్సిస్టుల నమ్మకం. వారికి గాంధీగారిమీద భక్తిభావం లేదు. నన్ను ఎగతాళి చేసేవారు. వారీ సంఘాలను నాశనం చేయకుండా శ్రీమతి భారతీదేవి, శ్రీ ప్రగడ కోటయ్య గారలు అడ్డుపడ్డారు.

కొందరు కాంగ్రెసువారు కూడా ఈ సంఘాలకు వ్యతిరేకంగా ఉన్నారు. అదృష్టవశాత్తు బాపూజీగారి మానవతా దృక్పథం నాకు సాయపడింది. శ్రీమన్నారాయణ అగర్వాల్‌గారిని నా పనికి తోడ్పడమని గాంధీగారే చెప్పారు.

నేను 1947-52 లలో భారత జూట్ మిల్లుల సంఘానికి ఉపాధ్యక్షునిగా ఎన్నుకోబడ్డాను. 40 లక్షల మంది కార్మికులతో సహకార సంఘాలు, వృత్తి సంఘాలు ఎన్నుకొనేటట్లు చేశాను.

★ ★ ★

కీ.శే. ప్రగడ కోటయ్య
చేనేత ఉద్యమ నాయకుడు

7. నా లోక్‌సభ ఎన్నిక (1957)

ఆంధ్రప్రదేశ్ మూడు కోట్ల జనాభాతో ఏర్పడింది. రెండు సంవత్సరాల క్రితమే అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆంధ్రలో పార్లమెంటు ఎన్నికలు, తెలంగాణాలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు 1957 లో జరిపారు. కృషికార్ లోక్‌పార్టీ నుండి నేను, శ్రీ లచ్చన్నగారు మాత్రమే ఎన్నికల ఎంపిక సంఘంలో ఉన్నాము. అప్పటివరకు లచ్చన్నగారితో ఉన్న గోపాలరెడ్డిగారు, శ్రీ సంజీవరెడ్డి గారితో కలిశారు. నేను గతంలో కృషికార్ లోక్‌పార్టీలో, ప్రజాపార్టీలో ఉన్న కాంగ్రెసు సభ్యులను ఎంపిక చేశాను. గ్రూపుల ప్రభావం కాంగ్రెసు పార్టీలో ఎక్కువగా ఉంది. మేము గట్టిగా అడిగితే శ్రీ కె. బాలిరెడ్డిగారిని మాత్రమే ఆంధ్ర కాంగ్రెసు పార్టీ తాత్కాలికంగా ఎంపిక చేసింది. సంజయ-నారదుల వంటి ఇద్దరిని, మేము గట్టిగా అడిగిన తరువాత మరో ఇద్దరిని తీసుకున్నారు. కాంగ్రెసువారు 1954-55 నాటి పరిస్థితులను పెద్దమనుషుల ఒప్పందాన్ని మరచిపోయారు. మా నిరసనను ఎ.ఐ.సి.సి. వారు పట్టించుకోలేదు.

నేను గానీ, భారతీదేవిగారు గానీ ఎవరో ఒకరు మాత్రమే పోటీచేయాలని ఎ.ఐ.సి.సి. భావించింది. ఎ.ఐ.సి.సి.వారు మాత్రం భారతీదేవిగారు పోటీ చేయాలన్నారు. కానీ నేనే తెనాలినుండి పోటీ చేశాను. కాంగ్రెసు నాయకులు, రాష్ట్ర కమ్యూనిస్టు నాయకులు ఒక స్వతంత్ర అభ్యర్థిని నిలిపి నన్ను ఓడించాలని తలచారు. ఈ ఆలోచనలు నేను పట్టించుకోలేదు. ప్రక్క సీటుకు మారలేదు.

రెండు వారాల తరువాత కాంగ్రెసువారు రహస్యంగా కమ్యూనిస్టులతో చేతులు కలిపి, ఒక కమ్యూనిస్టును పోటీకి నిలపాలని ప్రయత్నం చేశారు. నామినేషను వేసేవరకు కమ్యూనిస్టులు అభ్యర్థిని బయటపెట్టలేదు. కాంగ్రెసువారి ఒత్తిడిమేరకు ఒక కమ్యూనిస్టు అభ్యర్థిని ఎంపిక చేశారు.

ఈ ఎన్నికలలో ఇద్దరు నాయకులు మాత్రమే నన్ను బలపరిచారు. ఒకరు శ్రీ ప్రగడ కోటయ్యగారు. రెండవవారు నన్ను బలపరచినా, ఒక జిల్లా నాయకుని ప్రోద్బలంతో వారు తెనాలిలో ఓడింపబడ్డారు. ఈ జిల్లా నాయకుడు బాపట్లలో మాట్లాడుతూ "ప్రొ॥ రంగా ఓటమి నెహ్రూగారి ఓటమి కాదు. ఓడిపోతే ఆ బాధ్యత వారి స్నేహితులదే" అన్నారు. ఎలక్షనుకు రెండు రోజుల ముందు జరిగిన తెనాలి బహిరంగసభలో ఈ నాయకుడు నా పేరే ఎత్తలేదు. "రంగాకు ఎన్నికల గుర్తు మాత్రమే ఇచ్చారు. ఇంకేమీ ఇవ్వలేదు" అనేది ఆరోజులలో పెద్ద 'జోకు'. ప్రక్క నియోజకవర్గాలలో, వారి కులంవారి వద్దకు వెళ్ళి, కృషికార్ లోక్‌పార్టీవారు మనలను బలపరచడంలేదని ప్రచారం చేశారు. బ్రాహ్మణ, తెలగ, వైశ్య, రెడ్డి వర్గాలలో, ముస్లింలలో నన్ను ఏకాకిని చేయాలని చూశారు. 25 శాతం ఓటర్లు మాకున్నారని చెప్పుకొనే కమ్యూనిస్టులు, ప్రజాసోషలిస్టులు నన్ను వారికి బలమైన ప్రత్యర్థిగా భావించారు.

ఒక కేంద్రమంత్రిగాని, ఒక రాష్ట్రమంత్రిగాని నా నియోజకవర్గంలో అడుగు పెట్టలేదు. జవహర్‌లాల్ నెహ్రూగారు విజయవాడ వచ్చారు. కానీ నా నియోజక వర్గానికి మాత్రం రాలేదు. కేంద్ర ఆర్థికమంత్రి గుంటూరు వచ్చారు. నా గురించి మాట్లాడలేదు. నాకు వీరెవరూ రాలేదని దిగులు లేదు. కృషికార్ లోక్‌పార్టీ కార్యకర్తలు, గాంధీగారి అనుచరులైన కాంగ్రెసువారి బలం ఉంది. గ్రామాలు నా ఎన్నికకు అండగా నిలిచాయి. గ్రామస్థులు నా ఎన్నికల ఖర్చు కొరకు ధన సహాయం చేశారు.

కిసానులు, చేతివృత్తులవారు, ముఖ్యంగా నేత కార్మికులు, హరిజనులు కమ్యూనిస్టులకు వ్యతిరేకులు. వీరు కొద్దిమొత్తాలలో చందాలు వేసుకొనేవారు. ఎన్నికల ఖర్చులకు వాడుకొనేవారు. నేను గడప గడపకు ప్రచారం చేశాను. నాకిదొక అనుభవం. రోజూ ఆరు నుండి పది సమావేశాలలో మాట్లాడేవాడిని. పదహారు గంటలు పనిచేసేవాడిని. వారు ఏర్పాటుచేసిన ఇతర వినోదాలలో పాల్గొనేవాడిని. గుంటూరు జిల్లాలో ఉన్న మూడు పార్లమెంటు సీటులకు ప్రచారం చేసేవాడిని. నా ఆరోగ్యం ఈ పరిస్థితులనన్నిటినీ తట్టుకొన్నది. రైతుస్వామ్యం, రైతుల ఆర్థిక విధానంపై నా శిష్యులు శ్రీ పసుపులేటి కోటేశ్వరరావు, యన్.

విజయరాజకుమార్, యన్. వీరాచారి గారలు ప్రచారం చేశారు. కృషికార్ లోక్‌పార్టీ, కిసాన్ సమ్మేళన సందేశాన్ని భారత పార్లమెంటులో విన్పిస్తుంది, రైతుల హక్కులను, రైతుల ఆలోచనలను ప్రచారం చేస్తుంది అని చెప్పారు. వీరందరూ నేను–బాపూజీ మాట్లాడుకున్న విషయాలను ప్రజలకు వివరించారు. కమ్యూనిస్టులు ఏవిధంగా రైతులకు వ్యతిరేకులో, వారి ఆర్థికవిధానం, వారి ఉద్యోగ రక్షణ విధానాలలో ఏవిధమైన లోపాలున్నాయో వీరా సభలలో చెప్పే వారు.వారు కాంగ్రెసులో ఉంటూ ఏవిధంగా సహప్రయాణికులుగా (కమ్యూనిస్టుల కొరకు) ఉన్నదీ చెప్పారు. నేను 27 వేల ఓట్ల మెజారిటీతో గెలిచాను. రైతాంగపు ఆలోచనలు, రైతులపై పక్షపాతం, చిన్న సన్నకారు రైతులు, అల్పాదాయ వర్గాలు నా విజయానికి కారణం.

ఎన్నికల తరువాత 'కూచిపూడి'లో జరిగిన అభినందన సభలో జవహర్‌లాల్ గారు ఏవిధమైన 'సహకార సేద్యం' రైతుల నెత్తిన రుద్దబోతున్నది నేను చెప్పాను. "శ్రీ కె. రఘురామయ్యగారు, జవహర్‌లాల్‌గారు అటువంటి ఆలోచనలు చేయరు" అని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని పత్రికలన్నీ ఆలోచనలో పడినవి. సంవత్సరం తిరగకముందే *'ఏల్‌వాల్' సమావేశంలో జవహర్‌లాల్‌గారు, రాష్ట్రపతిగారు, కాంగ్రెసు అధ్యక్షులు దేభర్‌గారు, జయప్రకాశ్‌నారాయణగారు, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియావారు, ప్రజా సోషలిస్టులు 'భూదానోద్యమాన్ని' గ్రామదాన్ ఉద్యమంగా మార్చి, పొలాలనన్నింటినీ పంచాయితీలకు అప్పజెప్పే విధానాన్ని శ్రీ వినోభాబావేగారి ద్వారా మొదలుపెట్టించారు. ఇది ఆర్థిక వినాశనానికి, సాంఘిక బానిసత్వానికి దారితీస్తుందని నేను రైతువేదికలమీద నుండి చెప్పాను. అధికారాపేక్షతో చాలామంది ఆంధ్ర నాయకులు నెహ్రూగారితో నా రాజకీయ విభేదాలను చిలువలు పలువలుగా చెప్పేవారు.

నేను రైతుల కొరకే శ్రమిస్తూ గాంధీగారి ఆశయాలను ప్రబోధిస్తూ 1948లో పార్లమెంటరీ బోర్డు సెక్రటరీగా, నెహ్రూగారి నాయకత్వంలో పనిచేశాను.

నేను గాంధీగారి ఆలోచనలకు అనుగుణంగా నడుస్తున్నానని నా గెలుపు వారికి చెప్పింది.

* * *

*పేజీ నెం. 384 చూడండి.

8. కేంద్ర శాసనసభలు

1935-46 లలో మొదటి కేంద్ర శాసనసభలలో శ్రీ భూలాభాయ్‌దేశాయిగారి నాయకత్వంలో నేను పనిచేశాను. కాంగ్రెసు నాయకునిగా ఎన్నికైనప్పుడు వారంత ప్రముఖ వ్యక్తి కాదు. కొద్దికాలంలోనే గొప్ప ఉపన్యాసకునిగా కేంద్ర శాసనసభలో పేరు తెచ్చుకున్నారు. అద్భుతమైన జ్ఞాపకశక్తి గలవారు. వారి వాగ్ధాటి, వారి మాటల పొందిక చాలా ఆహ్లాదకరంగా ఉండేది. వారితో ఎలా మాట్లాడి గెలవాలో తెలియక ప్రభుత్వంలోని మంత్రులుండేవారు. ప్రతిపక్షంలో ఉన్న మేము వారి ఉపన్యాసాలకు ఉత్తేజితులమయ్యేవారము. మహమ్మద్ జిన్నాగారు దేశాయ్‌గారి తరువాత మాట్లాడేవారు. వారు కవితాత్మకంగా విషయాలు చెప్పే వారు. ప్రభుత్వ పక్షంవారు వీరి మాటలకు సంతోషిస్తున్నట్లు కన్పించేది.

గోవిందవల్లభపంత్‌గారు మాకు ఉపనాయకుడు. ఆర్థిక పరిస్థితిమీద, బడ్జెటు మీద వీరి ఉపన్యాసాలు ఆర్థిక మంత్రులకు కంపరం పుట్టించేవి. వారి ఉపన్యాసం ఒక గంగా ప్రవాహం.

ప్రశ్నల సమయంలో శ్రీ సత్యమూర్తిగారి వాగ్వివాదం, జవాబుకు ప్రతిజవాబు ఇచ్చే నేర్పు ఎంతో గొప్పగా ఉండేది. వారు ఎంతో శక్తిమంతులు. పనిలో నిష్ణాతులు. వారి ఉపన్యాసాలు రైఫిలు గుండ్లవలే ప్రభుత్వ పక్షంపైకి దూసుకొని వెళ్ళేవి. గిరిజాశంకర్ బాజపేయ, యన్.యన్. సర్కారీతో గానీ వారి వాగ్వివాదం చూడవలసిందే. ట్రెజరీ బెంచ్ (మంత్రుల స్థానం) లో ఉన్న తెల్లవారు కూడా వారికి సాటిరారు. వారు దేశ విదేశాలలో ప్రఖ్యాతి చెందారు.

శ్రీ యం.యస్. ఆనేగారు ఒక విలక్షణమైన ఉపన్యాసకుడు. నోటిలో 'సుపారీ' (కిళ్ళీ) తో వారు మాట్లాడుతుండేవారు. వీరు నేషనలిస్టు పార్టీకి చెందినవారు.

ఎంతో సమర్థులైన ఉపన్యాసకులు. జిన్నాగారి కవితాత్మక ఉపన్యాసంతో సరితూగ దగ్గ ఉపన్యాసం చేసేవారు. ఎనభై సంవత్సరాలు మించినా (1959 నుండి 1967 వరకు) వారు పార్లమెంటులో మెంబరుగా ఉన్నారు.

బొంబాయి నుండి మరి ఇద్దరు ఉపన్యాసకులు ఉన్నారు. ఒకరు శ్రీ హెచ్. మోడీగారు. వేరొకరు సర్ కౌవాస్‌జీ జహంగీర్‌గారు. వీరిరువురూ సమర్థులైన ఉపన్యాసకులే.

స్పీకరు ఎంతో బాధ్యతతో వ్యవహరించాలి. విటల్‌బాయ్‌పటేలుగారు మొట్ట మొదటగా ఎన్నుకోబడిన భారతీయుడు. వారు స్పీకరు పదవికి వన్నె తెచ్చారు. తరువాత మేమెంత ప్రయత్నం చేసినా ఆ పదవి చేజిక్కించుకోలేకపోయాము. మహమ్మద్ జిన్నాగారి మంత్రాంగం వలన ఆ పదవి సర్ అబ్దుర్ రహీంకు దక్కింది. సత్యమూర్తిగారు తన వాదనాబలంతో ప్రభుత్వపు ప్రతిష్ఠను దెబ్బతీసే వారు. స్పీకరు ప్రతిపక్షానికి సానుభూతిపరుడు కాదు. మేము చాలామందిమి 'ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్స్'కు (ఆనాటి మంత్రులు) సరిపోయేవారం కాదు. ప్రతి ఒక్కరం సమావేశాలలో పాల్గొనేవారం. కాంగ్రెసు చాలా సమస్యలు ఎదుర్కోవలసి వచ్చేది. కేంద్ర శాసనసభలో వైస్రాయ్ ప్రసంగాలకు కాంగ్రెసువారు హాజరు కాలేదు. 1932లో గాంధీగారు మొదటి రౌండ్‌టేబుల్ సమావేశం నుండి తిరిగి వచ్చారు. వైస్రాయ్ లార్డ్ వెల్లింగ్‌టన్ గాంధీగారికి 'ఇంటర్వ్యూ' ఇవ్వలేదు. కాంగ్రెసును, గాంధీగారిని అవమానపరచాడు. గాంధీ–ఇర్విన్ ఒప్పందాన్ని భగ్నం చేశాడు. తరువాత లార్డ్ లిన్‌లిత్‌గో వైస్రాయ్ అయ్యాడు. గాంధీగారిని ఇంటర్వ్యూ చేశాడు. గ్రామీణాభివృద్ధికి, వ్యవసాయాభివృద్ధికి ఒక కోటి రూపాయలను 'గ్రాంటు'గా ఇచ్చారు. ఈ సమయాలలో మాలో చీలికలు వచ్చేవి. ఆఫీసర్ల సాంఘిక బహిష్కరణకు కాంగ్రెసు వారందరూ సిద్ధమే. ఇండియాలోని ఇన్సూరెన్సు కంపెనీలకు రక్షణ కల్పించాలి. సర్ జేమ్స్ గ్రిగ్స్ దీనికి వ్యతిరేకి. యన్.యన్. సర్కారు (న్యాయ శాఖామంత్రిగారు) దీనికి అనుకూలురు. జాతీయ రక్షణ కొరకు కాంగ్రెసు ఈ బిల్లును 'పాస్' చేసింది.

విదేశాలలో, ముఖ్యంగా సౌత్ ఆఫ్రికాలో ఉన్న భారతీయుల కొరకు ప్రతిపక్షం పట్టుబట్టేది. భారత వ్యాపారాల రక్షణలో కూడా కాంగ్రెసు ఇదేవిధంగా

ప్రవర్తించేది. మిస్టర్ జిన్నా సవరణలను ఇష్టంలేకపోయినా అంగీకరించేది. ఈ సమయాలలో భూలాబాయ్‌దేశాయ్‌గారు ఆగ్రహోదగ్రులయ్యేవారు. కానీ వారు కూడా చివరకు అంగీకరించేవారు.

ప్రభుత్వం శ్రామిక వర్గాలకు వ్యతిరేకంగా ఉండేది. శ్రీ యన్. యమ్. జోషి, శ్రీ వి.వి. గిరి, నేను వ్యాపార వివాదాలలో, జీతాల బిల్లులలో, బొగ్గు గనుల చట్ట సవరణ బిల్లులో, ఐ.యల్.ఓ. (ఇండియన్ లేబర్ ఆర్గనైజేషన్) సమాచారంలో, కార్మికుల సమ్మేళనాలలో కలిసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేసేవారం. కాఫీ, టీ కూలీల రక్షణ కొరకు మేము ముగ్గురం పాటుపడ్డాము. రైల్వేలలో, పోర్టులలో గుత్తకూలీల విధానానికి వ్యతిరేకంగా ప్రభుత్వంతో పోరాడాము. కార్మిక సమస్యలు తలయెత్తినప్పుడు ప్రభుత్వం 'నచ్చజెప్పే' ధోరణిలో ఉండాలని మేము వాదించేవారము. శ్రామిక వినియోగ కేంద్రాలను (Labour Exchange) బలపరచాలని, వ్యవసాయ శ్రామికుల రక్షణ కొరకు కేంద్ర శాసనసభలో పోరాడాము.

నేను మంచి వక్తగా పేరుతెచ్చుకొన్నాను. మాంచెస్టర్ గార్డియన్ పత్రిక నన్ను అసెంబ్లీలో 'మాక్స్‌టన్' (ఎక్కువ సమయం తీసుకొనేవానిగా) గా పిలిచింది. కె.టి. షాగారి బాంబే క్రానికల్ నన్ను 'గాంధీ సోషలిజానికి' వ్యాఖ్యాత అని అన్నది. "రైతుల కొరకు నిరంతరం తపించే వ్యక్తి"గా సర్ ఫ్రెడరిక్ జేమ్స్, ఆంగ్లో-ఇండియన్ పార్టీవారు వారి నివేదికలో చెప్పారు. "నిజాయితీగా ప్రజల కొరకు మాట్లాడే ఏకైక వ్యక్తి" అని సర్ జేమ్సు గ్రిగ్స్ అన్నారు.

కొన్నిసార్లు కాంగ్రెసులోని భాగ్యవంతులు ప్రభుత్వ పక్షంలోని భాగ్యవంతులతో కలిసేవారు, వారు విదేశీయులైనా సరే. ఇటువంటి సమయాలలో "చిరుతపులి తన మచ్చలు పోగొట్టుకోగలదు. కానీ ధనవంతులు మాత్రం కాదు" అని అనే వాడిని. నేను ధనవంతులకేనాడు అనుకూలంగా లేను. బిర్లా టెక్స్‌టైల్ మిల్లులో సమ్మె చేస్తున్న కార్మికులను నేను బలపర్చాను. ఆ మేనేజిమెంటుపై నా అసంతృప్తిని బహిరంగంగా వెళ్ళగ్రక్కాను. ఇది హిందుస్తాన్ టైమ్స్ పత్రిక ఆగ్రహానికి కారణమైంది. ఇది బిర్లాల పత్రిక.

శాసనసభలో మంచి లైబ్రరీ ఉంది. డా॥ కుంజు, ఆనె, నేను ఈ లైబ్రరీలో ఎక్కువగా చదివేవారము. ఆనె నా పుస్తకాభిరుచిపై నన్ను అభినందించేవారు. ప్రభుత్వపు ఉత్తర్వుల నన్నింటినీ గాంధీగారికి తెలియజేసేవాడిని. గాంధీగారు చాలా సంతోషించేవారు. సత్యమూర్తిగారి వాక్చాతుర్యానికిచ్చిన ప్రాధాన్యత వారు మాట్లాడే ఇతర విషయాలకు పత్రికలు ఇచ్చేవికావు. లైబ్రరీ సంరక్షకుడు కీ.శే. ముఖర్జీగారు మాకు చాలా సహాయకారి. వారు కూడా మంచి చదువరి.

నేను ప్రతి విషయాన్ని బాధ్యతతో అందరకూ నచ్చే విధంగా అసెంబ్లీలో చెప్పేవాడిని. సర్దార్ పటేలుగారు తన దగ్గరకు వచ్చిన విజ్ఞాపనలను, ముఖ్యంగా రైతుల విజ్ఞాపనలను నాకు పంపేవారు. 1935–36 లలో గుజరాత్ రైతుల విజ్ఞప్తిని నాకు పంపారు. వారికి అంత నమ్మకం. 'ఉప్పు'కు సంబంధించిన గాంధీ–ఇర్విన్ ఒప్పందాలను గాంధీగారికి నివేదించాను. వారు చాలా సంతోషించారు.

నాగార్జునకొండ, భట్టిప్రోలులలో వాస్తుశిల్ప రక్షణకు మోటారు ప్రయాణానికి వసతియైన రోడ్లను ప్రభుత్వం నా నివేదికతో ఏర్పాటుచేసింది. రైతు యూనియన్ చట్టానికి, ఋణగ్రస్తులైన రైతులను సివిల్ ప్రొసీజరు కోడ్ నుండి రక్షణకు జైళ్ళలో నిర్బంధానికి, నేను ప్రవేశపెట్టిన బిల్లులను ప్రభుత్వం తిరస్కరించింది.

శాసనసభలో రైతు సంఘానికి డా॥ ఖాన్‌సాహెబ్‌గారు అధ్యక్షునిగా ఉండటానికి అంగీకరించారు. భూలాబాయ్‌దేశాయ్‌గారు, సర్దార్ వల్లభాయ్ పటేలుగారు అనుకూలురు కారు. గాంధీగారు నన్ను బలపర్చేవారు.

దురదృష్టవశాత్తు ఒకటి, రెండుసార్లు అసెంబ్లీలో మాట్లాడినవారు మంత్రులయ్యారు.

నేను, యస్.కె.డి. పల్లివాలా, మోహన్‌లాల్ సక్సేనా అసెంబ్లీపైకి ప్రాకి, అక్కడ ఉన్న బ్రిటీషు ప్రభుత్వపు జెండాను 1939 లో దించివేశాము. జెండా ఎగరటం ఎన్నికైన సభ్యులకు అవమానంగా భావించాము. స్పీకరుగానీ, ప్రభుత్వంగానీ ఏమీ చేయలేకపోయింది. 'అసెంబ్లీరూల్స్'లో ఎక్కడా ఒక విదేశీ జెండా ఎగరాలని లేదు. ఏమీ చేయలేక గాంధీగారికి మొరబెట్టుకున్నారు.

స్వతంత్రానికి ఎనిమిది సంవత్సరాల ముందే రాబోయే స్వతంత్రను స్వాగతించాము. విదేశీ విధానంపై చర్చించే హక్కు అసెంబ్లీకి లేదు. నేరస్థతెగలవారిపై మాత్రం అధికారం ఉంది. ఖాన్‌సాహెబ్‌గారు ఈ విషయాలలో నిష్ణాతులు. ప్రతి సంవత్సరం ఈ తెగలను నాశనం చేయటానికి బాంబులు నిర్దయగా వేయటాన్ని డా॥ గిల్బర్ట్ స్లేటరుగారు తీవ్రంగా వ్యతిరేకించారు.

స్వతంత్రం వచ్చిన తరువాత ఈవిధమైన పనులు చేయటానికి అవకాశం లేదు. పాకిస్తానులో కూడా ఈ నేరస్థ తెగలవారిపై దాడులు లేవు. ఆర్థికంగా వారికి చేయూతనిచ్చే కార్యక్రమాలు పాకిస్తాన్ ప్రభుత్వం చేపట్టింది. 'వైశాక్' ఆనకట్ట నిర్మాణము ఈ నేర తెగల మధ్యనే చేపట్టింది.

ఈ సమయంలోనే కాంగ్రెసు అసెంబ్లీని 'బాయ్‌కాట్' చేసింది. బ్రిటీషువారు ఏవిధమైన సమాచారం ఇవ్వకుండా భారతదేశాన్ని రెండవ ప్రపంచ యుద్ధంలోనికి లాగారు. నాలుగు సంవత్సరాలు బాయ్‌కాట్ కొనసాగించాము. ఈ సమయంలోనే అత్యవసర బిల్లును బ్రిటీషు మన దేశంవారిపై రుద్దింది. నాలుగు సంవత్సరాల తరువాత అసెంబ్లీ ఎన్నికలలో నవంబరు 1944 లో పాల్గొన్నాము. 1943 లో 'అమ్రోతి' జైలులో శ్రీ సత్యమూర్తి గారు చనిపోయారు. వారు ఏనాడూ మంత్రి కాలేదు. వారు లేక అసెంబ్లీ బీదదైంది.

శ్రీ భూలాభాయ్‌దేశాయ్‌గారు లియాకత్ ఆలీఖానుతో కుల-రాజకీయపరమైన ఒప్పందాలు చేసుకున్నారు. నాయకులందరూ అహమ్మదాబాద్ జైలులో మగ్గుతున్నారు. భూలాభాయ్‌దేశాయ్‌గారు చాలా తప్పు చేశారు. భూలాభాయ్‌దేశాయ్ గారు జాతీయ నాయకుల విశ్వాసాన్ని నిలుపుకోలేకపోయారు. తరువాత వచ్చిన జనరల్ ఎలక్షన్లలో వారు పోటీచేయలేదు. వారు ఇండియన్ నేషనల్ ఆర్మీ (I.N.A. సుభాష్‌బాబు) రక్షణ కొరకు తరువాత పిలువబడి మరలా 'హీరో'గా ఒక వెలుగు వెలిగారు. ***'బానిసత్వంలో ఉన్న జాతికి తిరుగుబాటు చేసే అధికారముంది'*** అనేది వారి చివరి ఉపన్యాసం. వారు జీవించాలి అనే కోర్కెను వదులుకున్నారు. జాతి, అసెంబ్లీ ఒక మహనీయుని కోల్పోయింది.

★ ★ ★

9. పార్లమెంటు సంఘాలు

సలహా సంఘాలు (Standing Committees) ప్రజాస్వామ్యానికి పునాది రాళ్ళు. బ్రిటీషువారు ఈ సంఘాలను మంత్రివర్గంలో ప్రజాస్వామ్యబద్ధంగా నియమించేవారు. నెహ్రూగారి పెత్తనంలో ఇవి లేకుండా పోయినయ్.

నేను ప్రజాపద్దుల సంఘానికి, వ్యవసాయ సంఘానికి కేంద్ర అసెంబ్లీ ద్వారా ఎన్నికయ్యాను. మూజువాణీ పార్లమెంటులో కూడా నేను అంచనాల కమిటీకి, ఆహారం వ్యవసాయ శాఖలు, వ్యాపారాలు రవాణా శాఖల కమిటీకి ఎన్ని కయ్యాను. అనుభవం గల పార్లమెంటు సభ్యుడు ఆ సంఘాలలో జరిగే అక్రమాలను అరికట్టగలడు. ఈ కమిటీలనిప్పుడు సాంప్రదాయేతర సలహా సంఘాలుగా పిలుస్తున్నారు.

ఎస్టిమేట్స్ కమిటీ (అంచనాల సంఘం) ఈనాటికీ చాలా ఉపయోగకారిగా ఉంది. నేడు కూడా ప్రజాపద్దుల కమిటీ నిర్మాణాత్మక కార్యక్రమాలు చేపడుతూ, అవసరమయితే విమర్శిస్తూ, వివిధ శాఖలపై అజమాయిషీ చేస్తూ, జరిగే తప్పొప్పులను చెప్తూ ఉంటుంది. దురదృష్టవశాత్తూ మంత్రులే ఈ విషయంలో వెనుకబడి ఉన్నారు. రాజ్యసభకు కూడా ఈ కమిటీలలో ప్రాధాన్యత ఇవ్వటం ముదావహం. ఈ కమిటీలన్నింటికీ అధికార భాగస్వామ్యమిస్తే మరింత మంచిది.

ఈ పార్లమెంటు సంఘాలే కాక మంత్రులకు సలహాలిచ్చే సంఘాలు కూడా ఉన్నాయి. ఈ సంఘాలను మంత్రులే నియమించుకుంటారు. ఎంతో ఆర్థిక స్తోమత ఉన్నా ఈ కమిటీలను మంత్రులు సక్రమంగా వినియోగించుకోవటం లేదు. పబ్లిక్ అకౌంట్సు కమిటీని 1964 లో పదిమంది లోక్‌సభ, ఐదుగురు

రాజ్యసభ సభ్యులతో నిర్మించారు. నేను కూడా ఈ కమిటీలో ఉన్నాను. బట్టల తయారీ, చేనేత బోర్డు, కుటీరపరిశ్రమలు, వ్యవసాయ యంత్రాల కమిటీ, వ్యవసాయ సమాచార సంఘం, భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ, దీనికి సంబంధించిన ఉపసంఘాలలో, జాతీయ వినియోగదారుల కమిటీ తదితరాలలో సభ్యుడిని.

రాజ్యాంగబద్ధంగా నెలకొల్పబడిన సంఘాలకు డబ్బు ప్రత్యేకమయిన సెస్సుల ద్వారా వస్తుంది. పరిశోధనలకు పరిశోధన సంస్థలకు వీటిద్వారా ధన సహాయం అందించబడుతుంది. సెస్సుల ద్వారానే కాక అదనంగా ఈ సంస్థలకు ఇంకా కొంత ధన సహాయం ఇవ్వాలన్న నా కోరికను ప్రభుత్వం తిరస్కరించింది. నేనీ సంఘాల అభివృద్ధికి పాటుపడ్డాను. జి.యు.రావ్ గారు నా తరువాత ఇదే పనిని చేశారు.

ఆహార వ్యవసాయ సంఘం (F.A.O.) తను సభ్యులుగా ఉన్న ప్రభుత్వాలలో ఇటువంటి ఆహార వ్యవసాయ సంఘాలను ఏర్పాటుచేయమన్నది. మూడు సంవత్సరాలు ఆందోళన తర్వాత మాత్రమే జాతీయ ఆరోగ్య వ్యవసాయ సంఘాన్ని వ్యవసాయ మంత్రి అధ్యక్షతన ఏర్పాటుచేసింది. 1950 నుండి 1957 వరకు నేనీ సంఘంలో సభ్యునిగా, మంత్రి లేని సమయంలో అధ్యక్షునిగా ఉన్నాను. ప్రభుత్వపు నిదాన ధోరణి, తాత్సారం వలన మేము ఎక్కువగా పని చేయలేకపోయాం.

భారత వ్యవసాయ సంఘానికి డా॥ రాజేంద్రప్రసాద్ అధ్యక్షునిగా, నా సేవలకు గుర్తింపుగా, నన్ను ఉపాధ్యక్షునిగా ఎన్నుకొన్నారు. రెండు సంవత్సరాల వ్యవధిలో భారత ఆర్థిక శాస్త్రవేత్తల సహకారంతో కొన్ని ప్రయోగాత్మక చర్యలు చేపట్టాము. గ్రామీణ ధరలు, జీతాలపై గణాంక వివరాలు సేకరించవలసిందిగా అడిగి ప్రభుత్వాన్ని అంగీకరింపజేశాము.

చాలామంది పార్లమెంటు సభ్యులను వివిధ కమిటీలలోకి 'నామినేట్' చేసుకునే అలవాటు కాంగ్రెసు పార్టీకి ఉంది. 1955-59 లలో చాలా కమిటీలలో సభ్యుడిని. మంత్రులందరూ నాకు సహకరించేవారు. జవహర్‌లాల్ నెహ్రూ

నన్ను విదేశాంగ విధాన కమిటీకి 'సంయోజక్' (Convener) గా నియమించారు. లాల్‌బహదూర్‌శాస్త్రి తరువాత శ్రీమతి ఇందిరాగాంధీ గారు స్వర్ణజిత్‌సేన్‌ను ఈ ప్రత్యేక విభాగానికి మంత్రిగా నియమించారు. నేను 1947 నుండి ఈ మార్పు కొరకు ఆందోళన చేస్తున్నాను. జవహర్‌లాల్‌గారి ఆలోచనా విధానాన్ని మాత్రమే ఈ కమిటీలో చెప్పాలి. నేను నెహ్రూ అలీన విధానాన్ని 1959 నుండి ప్రశ్నిస్తున్నాను.

పార్లమెంట్ కమిటీలు ఎక్కువగా ఉండి, ఈ కమిటీలకు అధికారాలుండి, ఎక్కువమందికి ప్రాతినిధ్యం వహించి, మంత్రులను తమ సలహాలతో, సంప్రదింపులతో అదుపులో ఉంచుకొని, మంత్రులను గోతులలో పడకుండా పార్లమెంటు సంఘాలు కాపాడుతవి. ప్రతిపక్షం 1967 ఎలక్షను తర్వాత ఒక అనధికార చైర్మన్‌ను ఈ కమిటీలకు నియమించవలసిందని కోరింది.

★ ★ ★

10. రైతాంగ విద్యాలయం-ఆలిండియా కాంగ్రెస్ వరకు

రైతాంగ విద్యాలయం - రామానీడు విద్యాలయంలో 1934 లో ప్రారంభించబడి ఆరు వారాలు సాగింది. రాజకీయ-సాంఘిక నాయకులనందరినీ ఈ సభలలో ఉపన్యసించవలసిందిగా కోరాను. 75 మంది విద్యార్థులు చేరారు. కొందరు కాంగ్రెసు నాయకులు విద్యార్థులను ఈ విద్యాలయంలో చేర్పించారు. కొందరు నాయకులు వ్యతిరేకంగా పనిచేశారు. హిందూ విద్యార్థులు, హరిజనులు అందరూ కలసిమెలసి చదువుకునేవారు. కలసి భోజనం చేసేవారు. శ్రీ యన్.వి. సుబ్బయ్య (ఎడిటరు కిసాను పబ్లికేషన్స్) గారు రైతు భజనావళి నుండి, ఇతర భజనల నుండి జాతీయ పాటలను ఎంపికచేసి పాడించేవారు. దేశోద్ధారక నాగేశ్వరరావు తమ ఉపన్యాసాల ద్వారానేగాక తమ ఆంధ్రపత్రిక ద్వారా చేసిన సహాయం ఎంతైనా కొనియాడతగింది. ఆంధ్రపత్రిక మా ఉద్యమానికి బహుళ ప్రచారం చేసింది.

వయోజనవిద్యనందిస్తూ మా రైతాంగ విద్యాలయం యువకులలో చైతన్యం కలిగించింది.

శ్రీ పి. నాగేశ్వరరావుగారు 1933 నుండి నాకు సహాయకారిగా ఉన్నారు. వారు మంచి జర్నలిస్టు. వాహినికి ఎడిటరుగా పనిచేసి, తరువాత ఆంధ్రపత్రికకు ఎడిటరైనారు.

శ్రీ కందుల ఓబులరెడ్డి, శ్రీ డి.యన్. రెడ్డి, శ్రీ ప్రగడ కోటయ్య, యం.యల్.ఏ., శ్రీ కె. శ్రీమన్నారాయణ (పి.బి.యన్. కళాశాల ప్రిన్సిపల్), శ్రీ కె. పాపయ్య (హరిజన నాయకుడు), శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్య - వీరందరూ ఈ విద్యాలయంలో చదువుకున్నారు.

ఏప్రియల్ 1933 నుండి ప్రభుత్వంవారు ఒక ప్రత్యేక సి.ఐ.డి.ని, ఒక కానిస్టేబుల్‌ను నామీద నిఘా ఉంచారు. నేను రోజుకు నాలుగైదు గంటలు ఉపన్యాసాలు చేసేవాడిని. నేను స్పెషల్ బ్రాంచివారిని నా ఉపన్యాసాలు విననిచ్చే వాడిని. ఈ ఉపన్యాసాలు వారు వ్రాసుకోవటానికి వీలులేదు. ఈ ఒప్పందంతో వారు తమ పని చేశారు. ప్రభుత్వ ఆంక్షలు ఉన్నా, ఈ విద్యాలయానికి ఉన్న పేరుప్రఖ్యాతుల వలన ఎందరో ఈ విద్యాలయంలో చదువుకోటానికి వచ్చేవారు. ఈ విద్యార్థులెవ్వరూ ఉద్యోగాల కొరకు వచ్చేవారు కారు. కాని కాంగ్రెసు నాయకులు నాకు వ్యతిరేకం.

ఈ ఉపన్యాసాలు మొదట శ్రీ కె. సంతానం (ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సంపాదకులు) ప్రారంభించారు. దేశభక్త కొండా వెంకటప్పయ్యగారు ఆ సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నేను (వ్రాసిన (Political Institutions), తెలుగులో వ్రాసిన 'ఆధునిక రాజ్యాంగ సంస్థలు') రెండు వాల్యూములను వారికి బహూకరించాను. ఈ వాల్యూమ్‌లను బాలాంత్రపు సత్యనారాయణగారు కాకినాడ నుండి ప్రకటించారు. వీటిని శ్రీ వెంకటప్పయ్యగారికి అంకితం చేశాను. శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ గారు (వినయాశ్రమ వ్యవస్థాపకులు) శ్రీ సీతారామ శాస్త్రిగారు ఆశీర్వదించారు. రాయలసీమలో 1936-37 లలో; మదనపల్లిలో 1938 లో; విశాఖపట్నం, శ్రీకాకుళంలలో 1938-39 లలో; కడప, గుంటూరు జిల్లాలలో 1940-41 లలో; చల్లపల్లి, గ్రామాలలో 1947 లో; తిరుత్తనిలో 1953 లో; మరలా మదనపల్లిలో 1965 లో ఇవిగాక ప్రతి సంవత్సరం నిడుబ్రోలులో ఈ విద్యాలయాలు జరుగుతుండేవి. చాలామంది ఈ విద్యాలయ పట్టభద్రులు ఇటువంటి స్కూళ్ళను ఏర్పాటుచేసేవారు. నేను వెళ్ళి రెండు లేక మూడు రోజులు ఉండి ఉపన్యాసాలు చేసి వస్తుండేవాడిని.

నా సోదరుడు వెంకటప్పయ్య ఈ సభలలో బుర్రకథలు, జంగంకథలు కూడా చెప్తే బాగుంటుందన్నాడు. ఈ సంప్రదాయ కళలు నాకూ ఇష్టమే. శ్రీ యన్.వి. రామానాయుడు, శ్రీ యన్.వి. సుబ్బయ్య గారలు నాకు ఇందులో తోడ్పడ్డారు. మరెందరో సంప్రదాయ కళాకారులను ప్రోత్సహించారు. ఈ కళలు, ఈ పద్యాలు, ఈ పాటలు 1935 నుండి చాలా విజయవంతంగా, నా రాజకీయ

పాఠశాలలో ఉపయోగించుకున్నాను. తరువాత కాలంలో కమ్యూనిస్టులు ఈ పద్ధతులు విజయవంతంగా కొనసాగించారు. కాంగ్రెసువారు కూడా ఈ దోవనే ప్రయాణం చేశారు.

సాంఘిక, రాజకీయ సమస్యలపై వ్రాసిన రచయితలను, కవులను గౌరవించాను. 'మాకొద్దీ తెల్లదొరతనము' అన్న పాట గరిమెళ్ళ సత్యనారాయణ 1920 లో రాసారు. శ్రీ అడవి బాపిరాజు, శ్రీ శివశంకరస్వామి, గుర్రం మల్లయ్య వంటి కవులనెందరినో మా రైతాంగ విద్యాలయం గౌరవించింది. కవిబ్రహ్మ ఏటుకూరి వేంకటనరసయ్య, శ్రీ వెంకటకవి, పల్నాటికవి వీరభద్రాచారి గార్లచే ప్రత్యేకంగా రైతు సమస్యలపై వ్రాయించాము. ప్రఖ్యాత రైతు కవి 'శెట్టిపల్లి' ప్రతి సంవత్సరం రెండు, మూడు పాటలు ఈ విద్యాలయానికి రాసేవారు (1934-39). 1939 లో హఠాత్తుగా తన 26 వ ఏట మృతి చెందారు. వారి జ్ఞాపకార్థం వారు రాసిన పద్యాలు, కవితలు ఇంగ్లీషులో ప్రచురించాము. వీటికి ఎ.జి. స్టాక్‌గారు పరిచయం రాసారు.

రైతు యాత్రలు 1934, 1935 లో ఆంధ్రలోను, తమిళనాడులోను, దక్షిణ కెనరాలోను మంచి గుర్తింపు పొందాయి. జిల్లా కలెక్టరు, తహశీల్దార్లు ఈ రైతు యాత్రలకు తమ ఆఫీసులో ఉండి రైతులు చెప్పే విషయాలను శ్రద్ధతో వినేవారు. రాష్ట్ర కాంగ్రెసువారికి ఈమాత్రం శ్రద్ధ కూడా లేదు.

నేను మలబారు, తమిళనాడు, ఆంధ్రలలో విస్తృతంగా పర్యటించాను. ఈ పర్యటనలు స్థానికంగా బాగా ఉపయోగపడినవి. శ్రీ శంకరన్ నంబూద్రిపాద్‌గారు నా పర్యటనలను మలబారు (కేరళ) లో ఏర్పాటుచేసేవారు. తరువాత వారు కేరళలో కమ్యూనిస్టు మంత్రివర్గంలో చేరారు. రైతుల దౌర్భాగ్యానికి, దళితుల సాంఘిక అణచివేతకు, ఆర్థిక వెనుకబాటుతనానికి నేను విచలితుడనయ్యాను. నేనీ విషయాలలో వారికెంతో అండగా ఉన్నాను. శ్రీ నంబూద్రిపాద్‌గారు 1940 వరకు నా పర్యటనలను ఉపయోగించుకున్నారు. వారప్పటికే కమ్యూనిస్టు మార్గాన్ని అనుసరించ దలచుకున్నారు. తమిళనాడులో కాంగ్రెసు బలం పుంజుకున్నది.

1934 లో సాధారణ ఎన్నికలు మంచి ఊపులో ఉన్నాయి. ఈ సమయంలో రాయలసీమ కనీవినీ ఎరుగని 'కరువు' బారినపడింది. ఇదే సమయంలో భారతీదేవిగారు తీవ్ర అస్వస్థతకు గురైనారు. ఈ పరిస్థితులలో ప్రజలకు నేనొక విజ్ఞాపన చేశాను. ఈ విజ్ఞాపన ఆ రైతులకు ఉపశమనం కలిగించింది. నెల రోజుల తరువాత భారతీదేవి ఆరోగ్యము బాగుపడటం మొదలయింది. నన్ను భారతీదేవి రాయలసీమ వెళ్ళమంది. శ్రీ కందుల ఓబులరెడ్డిగారు కర్నూలు, బళ్ళారి, అనంతపురం, కడపలో పర్యటించారు. స్థానిక కాంగ్రెసు నాయకులు నాతో కలసి నడచారు. హిందూ పత్రిక నా ప్రకటనలకు అత్యంత విలువనిచ్చింది. "పైరు పచ్చలు ఇచట లేవు" అని నేను వ్రాసిన విషయాన్ని సంపాదకీయంలో ప్రముఖంగా ప్రచురించింది. 1926 లో ఒంగోలు కరువులో నాకున్న అనుభవం ఇప్పుడు బాగా ఉపయోగపడింది. రాష్ట్ర సహాయం చాలదు, కేంద్రం ఆదుకోవాల్సిందే, ప్రభుత్వ సహాయం తప్పనిసరి అని నేను చెప్పిన విషయాన్ని స్థానిక కాంగ్రెసు నాయకులు ఆచరణలో పెట్టారు.

ప్రభుత్వాన్ని కాలహరణం చెయ్యవద్దని, కరువు నివారణ చర్యలు వెంటనే చేపట్టాలని, పనులు లేనివారికి వెంటనే పనులు కల్పించాలని, ప్రక్క రాష్ట్రం నుండి గడ్డి కొనుగోలు చేయాలని, ఈ గడ్డిని ఉచితంగా పంపిణీ చేయాలని, పశువులను రక్షించాలని నేనాందోళన చేశాను. ప్రభుత్వం చౌక దుకాణాలు తెరవాలని, సర్కారు జిల్లాల నుండి ఆహారధాన్యాలు దిగుమతి చేసుకోవాలని, భూమిశిస్తును రద్దుచేయాలని, సహకార రుణాలు అతి తక్కువ వడ్డీకి ప్రజలకు ఇవ్వాలని కోరాను. కరువు నివారణకై ఇన్సూరెన్సు పథకాలను అమలుచేయమని కోరాను. ఇప్పటివరకు ఏ ప్రభుత్వమూ ఈ చర్య చేపట్టలేదు.

ఈ పర్యటన ముగిసే సమయానికి మా కారుకు ఏక్సిడెంటు అయింది. శ్రీ ఓబులరెడ్డి ఒక నెల రోజులు తీవ్రంగా అస్వస్థులయ్యాడు. శ్రీ హరిసర్వోత్తమ రావు నరాల బలహీనతకు లోనయ్యాడు. నా ముక్కుకు దెబ్బ తగిలింది.

తరువాత ఐదు నెలల కాలం నేను ఢిల్లీ కేంద్ర అసెంబ్లీలోనూ, ఆంధ్రలోనూ ఈ కరువు నివారణ పథకంపై తీవ్రంగా ఆందోళన చేశాను. అప్పటి మంత్రి శ్రీ ఫ్రాంక్‌నోయిస్‌గారు "రంగాగారి ఆందోళనను నేను పూర్తిగా అర్థంచేసు

కున్నాను. కానీ వారు శాసనసభ జరగటానికి సహకరించాలి కదా" అని అన్నారు. గోపాలస్వామి అయ్యంగారు కరువు నివారణ కమీషనరుగా నియమించబడ్డారు. వారు పూర్తిగా నాకు సహకరించారు. సర్కారు జిల్లాల నుండి గడ్డి, కరువు ప్రాంతాలకు నిధులు పుష్కలంగా ఇచ్చారు. దశాబ్దాల నుండి మూలన పెట్టిన 'తుంగభద్ర' ప్రాజెక్టును కరువు నివారణ కొరకు ఉపయోగించ మని కోరాను. కేంద్ర ప్రభుత్వం నా సలహాను ఆమోదించి మద్రాసు, మైసూరు, హైదరాబాద్‌లతో ఒప్పందం చేసుకొమ్మని నన్ను కోరింది. ఈవిధంగా బహుళార్థ సాధక తుంగభద్ర ప్రాజెక్టు 1941-43 లలో రూపుదిద్దుకొన్నది. రాయలసీమ నాయకులు శ్రీ కోటిరెడ్డి, శ్రీ కందుల ఓబులరెడ్డి గార్ల ప్రయత్నాలు ఫలించాయి. అనంతపూర్, కర్నూలు, బళ్ళారి, రాయచూర్ జిల్లాలకు మాటిమాటికి వచ్చే కరువు తగ్గింది.

దిగువ భవానీ ప్రాజెక్టు కొరకు రైతులు ఆందోళన చేశారు. మద్రాసు మంత్రి వర్గంలో అది కూడా రూపుదిద్దుకొంది. సేలం జిల్లా ఇప్పుడు ఆర్థిక మాంద్యం నుండి బయటపడింది. ఋణాల వాయిదా కొరకు రైతులు పోరాడుతుంటే బ్రిటీషు వారు తాము 1930, 31 లలో ఇది అమలుచేశామని తిరస్కరిస్తూ వచ్చారు. ఎప్పుడైతే రూజ్‌వెల్టు ఋణాల వాయిదా మాత్రమే కాక, నిలకడ ధరలను గురించి కూడా చెప్పటం మొదలుపెట్టాడో, అప్పుడు బ్రిటీషు ప్రభుత్వం నేను ఆందోళన చేస్తున్న ఋణాల వాయిదాను గురించి నాతో మాట్లాడసాగింది. దక్షిణ భారత సహకార సంఘాల ఋణాల వాయిదా, నిలకడ ధరలమీద మద్రాసు అసెంబ్లీలో నేను చేసిన ఉపన్యాసాన్ని 'మద్రాసు ఎకనామిస్టు' మరియు ప్రభుత్వ దినపత్రిక అయిన 'మెయిల్' ప్రచురించాయి.

నా అనుబంధ ప్రశ్నలు, బడ్జెటుపై కోత తీర్మానాలు, ప్రైవేటు మెంబర్ల తీర్మానాలు, గవర్నమెంటు సలహాలకు మార్పులతో కేంద్ర శాసనసభలో ప్రభుత్వానికి 'నిద్ర' లేకుండా చేశాను. సయామీస్ (Siamees) బియ్యంపై దిగుమతి సుంకం వెయ్యాలన్న నా తీర్మానానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. అప్పట్లో 'బ్రోకెన్ రైసు' (Broken Rice - ముక్కల బియ్యం) ధర రూ. 2-8-0 లు. (రూ. 2-50 పై) నుండి రూ. 3-8-0 (రూ. 3-50 పై) వరకు ఉండేది. ఈ దిగుమతి సుంకం వలన రూ. 4-0-0 నుండి రూ. 4-8-0

(రూ.4-50 పై) ల వరకు పెరిగింది. మెలమెల్లగా బియ్యం ధర రూ.6-8-0 (రూ.6-50 పై) లకు పెరిగింది. ఇదేకాలంలో రైతుకూలీలను గురించి ఆందోళన చేశాను. గోధుమ రైతులకు కూడా ఇదేవిధమైన రక్షణ కల్పించబడింది.

నేను బియ్యానికి, గోధుమలకు, జూట్‌కు, ప్రత్తికి కనీస ధరలు నిర్ణయించమని ప్రభుత్వాన్ని కోరాను. ప్రభుత్వం తన అసహాయతను తెల్పింది. 1955 వరకు ఈ ధరల కొరకు ఆగవలసి వచ్చింది.

కాంగ్రెసు ప్రభుత్వాలు ఈ ధరల పెంపునకు వ్యతిరేకంగా ఉన్నయ్. నేను, ఇతర సభ్యులు, ఇండిపెండెంటు సభ్యులు కలసి డా॥ ఖాన్‌సాహెబ్‌గారి అధ్యక్షతన మొదటిసారిగా రైతు శాసనసభ్యుల ఫ్రంటు ఏర్పాటుచేశాము. 1935-37లలో నేను కేంద్ర శాసనసభలో చేసిన ఉపన్యాసాలను 'మోడరన్ ఇండియన్ పెజెంటు' అనే పుస్తకంలో చూడవచ్చు.

నేను గ్రామీణ ప్రాంతాలలో 'పోస్టలు వసతి' కొరకు, మూడవ తరగతి రైలు ప్రయాణీకుల సౌకర్యాల కొరకు పోరాడాను. ప్లాంటేషను కూలీలకోసం, ఫ్యాక్టరీలోని కార్మికులకోసం, వ్యవసాయ కూలీలకోసం పాటుపడ్డాను. శ్రీ వి.వి. గిరిగారికి, శ్రీ యన్.యమ్. జోషీగారికి (కార్మిక నాయకుడు) నా మద్దతు ఎప్పుడూ ఉండేది. జీతభత్యాల బిల్లులపైన, వాణిజ్య వివాదాలపైన నా రెండు పార్లమెంటు ఉపన్యాసాలను సోషలిస్టులు మెచ్చుకున్నారు.

శ్రీ జి.బి. ఆనేగారు, శ్రీ జి.బి. పంతులుగారు నా సలహాలను ఎప్పుడూ గౌరవించేవారు.

1936 లో నేను, సత్యమూర్తిగారు, బి. దాసుగారు ప్రజాపద్దుల కమిటీకి ఎన్నుకోబడ్డాము. పెజెంట్సు అండ్ అగ్రికల్చరల్ వర్కర్స్ కమిటీకి నేను సమర్పించిన తీర్మానం శ్రీ వి.వి. గిరిగారు, శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు, శ్రీ దేశోద్ధారక నాగేశ్వరరావుగారు ఆమోదించారు. దేశోద్ధారక నాగేశ్వరరావు ఈ కమిటీకి అధ్యక్షులు. 1935 లో మద్రాసులో అఖిలభారత రైతు సదస్సుకు (All India Peasants and Workers Conference) శ్రీ వి.వి. గిరిగారు అధ్యక్షునిగా నన్ను ఎంపిక చేశారు. శ్రీమతి కమలాదేవి చటోపాధ్యాయ ఈ సదస్సును ప్రారంభించారు. కమ్యూనిస్టులు ఈ సదస్సులో జొరబడి ఈ సదస్సును

ముక్కలుచేయాలన్న ఉద్దేశ్యంతో నాయకత్వంలో భాగాన్నాశిస్తున్నారు. అలహాబాద్, కటక్, బెనారస్, కలకత్తాలలోని సోషలిస్టులను కలిశాను. రైతుల కొరకు రైతులచే ఏర్పాటుచేయబడుతున్న ఈ వేదిక వారికి నచ్చలేదు. వారు కూడా ఈ నాయకత్వంలో భాగం మాత్రం కావాలంటున్నారు. నా ఈ అలీన విధానాన్ని సంయుక్త సంయోజక్ (Joint Convener) గా ఉన్నప్పుడు మాత్రమే నమ్మారు. జనవరి 1936 లో ఈ సంయుక్త సమావేశం జరపబడింది. అప్పటి ఆ సమావేశంలో రైతు ప్రాతినిధ్యం నాకు ఒక్కడికే దక్కింది. ఈ సమావేశానికి శ్రీమతి కమలాదేవి చటోపాధ్యాయ అధ్యక్షత వహించి అఖిల భారత కిసాను సమ్మేళనం లక్నోలో జరిపే కాంగ్రెసు సభలో ఈ విషయమై మాట్లాడవచ్చుగదా అని చెప్పి నన్ను అంగీకరింపజేశారు.

లక్నో కిసాను సమ్మేళనంలో 'స్వామీజీ'ని అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. నేను రైతుల కొరకు వ్రాసిన రైతాంగ శాసనాన్ని అందరూ మెచ్చుకున్నారు. ఇందూలాల్ యాగ్నిక్‌గారు కూడా నా ఆహ్వానాన్ని మన్నించి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

నన్ను, స్వామీజీని, జయప్రకాశ్‌నారాయణను – మా ముగ్గురిని రైతాంగ శాసనానికి సంయోజకులుగా ఎన్నుకున్నారు.

★ ★ ★

కుడి ప్రక్క నుంచి : గౌతు లచ్చన్న, కందుల ఓబులరెడ్డి, చలసాని వాసుదేవరావు, నెల్లూరు వెంకట్రామానాయుడు, వల్లభరావు ప్రేమానందస్వామి.

11. రాయలసీమ, శ్రీకాకుళం, విశాఖలలో రాజకీయ పాఠశాలలు

నేటికి బాపూజీ మరణించి పది సంవత్సరాలు అయింది. వారి ప్రబోధంతో, వారి ప్రభావంతో నేను చేపట్టిన పనులను తలచుకొంటున్నాను. రాయలసీమ ఐదు జిల్లాలలోను, విశాఖపట్నం, శ్రీకాకుళం రెండు జిల్లాలలోను 1925 లో కాంగ్రెసు కార్యకర్తలు తక్కువగా ఉండేవారు. నేను పర్యటించినప్పుడు (1928–29) ఉభయగోదావరి జిల్లాలలోను, గుంటూరు, కృష్ణా జిల్లాలలోనూ దిగువ మధ్యతరగతి కార్యకర్తలు ఎక్కువగా ఉండేవారు. నాయకులు ఎక్కువ కావటం వలన ఆంధ్రదేశంలో అనైక్యత ఎక్కువగా ఉండేది. తెలుగు వార్తాపత్రికల కథనాలు నాకు ఆశ్చర్యం కలిగించేవి. కార్యకర్తలు ఒకటో రెండో కులాలకు చెందినవారై ఉండేవారు. ఈ విషయం నేను గాంధీగారితో మాట్లాడాను. 'స్కాండినేవియన్' దేశాలలో జానపద కళాశాలలను గురించి వారితో చెప్పాను. "యువకులను ఎక్కువమందిని చేర్చుకొని వారికి రాజకీయాలలో తర్ఫీదు ఇవ్వాలి. వారే నిజమైన కార్యకర్తలు, ప్రజాసేవకులు" అని బాపుగారు అన్నారు. ఈ ఆలోచనా ఫలితమే నేను 1933 లో నిడుబ్రోలులో స్థాపించిన రామానీడు విద్యాలయం.

భారతీదేవిగారు, నేను మా వ్యవసాయ ఆదాయాన్ని, నా అసెంబ్లీ జీతాన్ని చాలావరకు ఈ విద్యార్థుల శిక్షణ కొరకు ఖర్చు చేశాము. కొన్ని వందలమంది రాయలసీమ, కళింగ విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చాము. బీదవారైన ఈ విద్యార్థుల కొరకు నేను ఈ విద్యాలయాలను వారున్న ప్రదేశాలలోనే నడిపేవాడిని. నా పూర్వ విద్యార్థులు నాకు సహాయం చేసేవారు. నేను వారి ప్రదేశాలకు వెళ్ళి, శిక్షణ శిబిరాలు నిర్వహించి, వాటిలో ఉపన్యాసాలు ఇచ్చేవాడిని. భారతీదేవి

1945 లో చేబ్రోలులో ఏభయిమంది మహిళలకు శిక్షణనిచ్చింది. శ్రీమతి రాజ్యలక్ష్మీదేవిగారు ఈ కార్యక్రమాలకు నిర్వాహకురాలు. శ్రీమతి రాజ్యలక్ష్మీదేవి గారు తరువాత 'తెలుగుదేశం' అనే పత్రికకు సంపాదకురాలయ్యారు. చాలామంది స్థానిక మహిళలు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకున్నారు.

చేనేతవారిని, దళితులను, వెనుకబడిన తరగతులవారిని ఎక్కువమందిని చేర్చుకొని, వారికి కొద్దిగా ధన సహాయం కూడా చేసేవాడిని. గాంధీగారి అడుగు జాడలలో నడిచేవాడిని. 1940 లో నా రిపోర్టులు చూసి బాపుగారు సంతోషించారు.

గ్రామీణ యువకులకు ఎక్కువ ప్రాధాన్యత ఉండేది. రాజకీయ నాయకత్వం, రాజకీయంగా కలసిమెలసి ఉండాలని నమ్మేవారిలో నేనొకడిని. కర్షకులు, కార్మికులు, చేతివృత్తులవారు అందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములే. 'బాపూ' గారు ఎంతో గర్వించారు. నేను దేశానికి చేసిన సేవలో ఈ యువ కార్యకర్తల తర్ఫీదు చాలా ప్రముఖమైనది.

నేను తర్ఫీదు ఇచ్చిన ఈ విద్యార్థులను కాంగ్రెసు సోషలిస్టు పార్టీ, కమ్యూనిస్టు పార్టీలవారు తమలోకి తీసుకునేవారు. ఇంతమంది నాయకులు, ఇన్ని పార్టీలలో నిర్మాణాత్మకంగా పనిచేయటం సంతోషదాయకం.

రాయలసీమ గ్రామీణులపై నా దృష్టి కేంద్రీకరించి, రాయలసీమ రైతు సమావేశాలు, రాయలసీమ ఆర్థికాభివృద్ధి సమావేశాలు, రాయలసీమ అడవి రైతుల సమావేశం, రాయలసీమ ఉపాధ్యాయుల సమావేశం, రాయలసీమ విద్యార్థుల సభలు, రాయలసీమ యువకుల సభలు, రాయలసీమ రచయితల సభ, రాయలసీమ ప్రత్తి ఉత్పత్తిదారుల సభ, రాయలసీమ నూనెగింజల ఉత్పత్తి దారుల సమావేశం, రాయలసీమ కరువు నివారణ సమావేశాలు, రాయలసీమ నీటిపారుదల సమావేశం – ఇంకా ఇటువంటివాటిని స్త్రీలకోసం, పంచాయితీల కోసం, సహకార సంఘాలకోసం నిర్వహించాను. ఈవిధంగా వేలాది రైతులు ఈ సమావేశాలలో పాల్గొని తమ కాలాన్ని, ధనాన్ని కొంత సంఘం కొరకు ఖర్చు చేసేవారు.

కళింగలో రెండు జిల్లాలు జమీందార్ల పెత్తనంలో ఉండేవి. ఇక్కడ నా దృష్టిని కేంద్రీకరించాను.

నేను చేసే పనులు కాంగ్రెసు నాయకులకు రుచించలేదు. నాయకత్వం పట్టణాల నుండి పల్లెలకు పాకుతున్నందుకు వారు సంతోషంగా లేరు.

ప్రతి సంవత్సరం నేను నా 'రిపోర్టు'లను బాపూకు ఇచ్చేవాడిని. 'శహబాష్ రంగా' అనేవారు. నా వెన్ను తట్టేవారు. ఉత్తర భారతంలో ఈవిధమైన ఉద్యమాలు ఎక్కువగా లేవు.

చాలామంది యువ నాయకులు నాతో తగాదా పెట్టుకొని, నన్ను ఎదుర్కొని, ఓడించడానికి కూడా ప్రయత్నించారు. అయితే ఇదంతా 1940 తరువాతి చరిత్ర.

★ ★ ★

12. కిసానులు-వ్యవసాయ కూలీలు

దక్షిణ భారత రైతుల, వ్యవసాయ కూలీల సంస్థను ఏర్పరిచి, వారి కనీస కోర్కెల 'నిర్ధారణ పత్రాన్ని' (Charter) 1935 లో విడుదల చేశాను. ఈ రెండు రంగాలవారిలో విభేదాలు తేవాలనే కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా వారి ఆలోచనలకు అడ్డుకట్ట వేయగలిగాను.

రైతులు, వ్యవసాయ కూలీల మధ్య విభేదాలు ఉండనవసరంలేదు. 1923 నుండి ఇది నా నమ్మకం. ఈ నమ్మకంతోనే 1928-29 లలో లార్డు అట్లీ ముందు రాయల్ కమీషనుకు నేను వ్యవసాయ కూలీల 'నిర్ధారణ' పత్రాన్ని అందజేశాను.

1936-37 లలో శ్రీ పి. సుందరయ్యగారు వ్యవసాయ రంగంలో 'సమ్మెలు' చేయటం మొదలుపెట్టారు. శ్రీ సుందరయ్యగారు ఈనాడు వామపక్ష కమ్యూనిస్టు నాయకుడు. శ్రీ జె. రామలింగయ్యగారు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియాకు దూరమయ్యారు. వారి ఆలోచనలు నాకు నచ్చలేదు. కనీస వేతనాలను ప్రభుత్వం రైతులకు, రైతుకూలీలకు సమాన నిష్పత్తిలో అమలుచేయాలని నా ఉద్దేశ్యం. రైతులందరి ఐక్యం కోసం కమ్యూనిస్టులు విముఖులు. వారు 'లెనిన్' రైతులను రష్యాలో వలె 'కులక్'లు (భూస్వాములు), మిగతా సన్నకారు, చిన్నకారు రైతులను వ్యవసాయ కూలీలుగాను పరిగణిస్తున్నారు. సహజంగానే కాంగ్రెసువారు, సి.పి.ఐ. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా వారు ఒకరితో ఒకరు విభేదించారు. ఇది రైతుల ఐక్యతను దెబ్బతీసింది.

ఈ కాలంలోనే సర్వెంట్సు ఆఫ్ ఇండియా (భారతదేశ సేవకులు) సంఘ సభ్యులయిన శ్రీ కె.యన్. శివస్వామిగారి సహకారాన్ని పొందాను. వారు గ్రామీణ

రైతుల 'ఆర్థికత'పై విచారణ, విమర్శ చేస్తున్నారు. తిరుచినాపల్లి, తంజావూరు, మద్రాసు జిల్లాలలో రైతువారి పట్టాదారులు, చాలా పెద్ద భూస్వాములు వారి కిష్టమైనవారికి కౌలుకు ఇచ్చిగానీ, వందల సంఖ్యలో కూలీలతోగాని పొలాలు సాగుచేస్తుండేవారు. ఈ వ్యవసాయ కూలీల దుర్భరస్థితి హృదయవిదారకంగా ఉంది. ఈ రైతులకు కనీసం ఐదు సంవత్సరాల వరకు కౌలుగా పొలాలు ఇవ్వాలని చట్టం చేయాలని, కనీస వేతనాలను కూలీలకు ఇవ్వాలని మేము ఆందోళన చేశాము.

1937-39 మధ్య కాంగ్రెసు మంత్రివర్గం మద్రాసు రైతుల పరిస్థితులను దూరదృష్టితో చూడలేదు. మిరాశీదారులు అంటే భూస్వాములకే అన్ని అవకాశాలు ఇచ్చి, రుణ విముక్తిచేసి నిజమయిన వ్యవసాయదారులను పట్టించుకోలేదు. శివస్వామిగారు వీరి పరిస్థితులకు విసుగుచెంది కమ్యూనిస్టు విధానాలయిన సమ్మెబాట పట్టారు. రైతులకు సహకారమందివ్వని విధానాలు బలపరుస్తున్నారు. ఏదియేమయినా వారు రైతులకు-రైతుకూలీలకు ఉపయోగకరమయిన పనులు చేసేవారు. వారు మరణించేవరకు రైతుల ఆర్థికత (Economy) పై ఎన్నో కరపత్రాలను విడుదల చేశారు.

వేరొక మిత్రుడు వి. రాఘవయ్యగారు జమీందారీ రైతు ఫ్రంటులో 1930 వరకు పనిచేశారు. తరువాత వారు రైతులతోపాటు నడవలేదు. వారు 'యానాదు' లను నేరజాతివారి విముక్తికై కృషి చేశారు. వారు కూడా తనకు తెలియకుండానే శ్రీ పి. సుందరయ్యగారితో కలసి సమ్మెలు చేయించటం ప్రారంభించారు. నా ప్రయత్నాలన్నీ వారికి వర్గభేదాలుగా అనిపించాయి. వ్యవసాయ కూలీలు వ్యవసాయదారులుగా పెరగాలి. ప్రభుత్వ ఆక్రమణల్లో ఉన్న భూములన్నీ వ్యవసాయ కూలీలకిచ్చి వీరిని రైతులుగా చేయాలి. మరికొంతమంది వర్తక వాణిజ్యాలలోకి వెళ్లగలగాలని నేను నా 'కిసాన్ హాండ్‌బుక్' 1938 లో వ్రాశాను. కాంగ్రెసు వ్యవసాయ కూలీ కమిటీలను సర్కారు జిల్లాల్లో స్థాపించి ఈ విషయాలపై ప్రత్యేక దృష్టితో ప్రచారం చేశాను. వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలివ్వాలని, వ్యవసాయ కూలీలందరు ఐక్యంగా ఉండాలని వారికి బోధ చేశాను. నెల్లూరు జిల్లా 'హొయ్యేరు'లో గవర్నమెంటు ద్వారా కొత్తగా సాగులోకి

వచ్చిన వేయి ఎకరాల భూమిని దళితులకు, ఇతర కులాలవారికి ఇప్పించాను. ఆ పొలం ఈరోజు ఎకరా రూ. 5,000/- లు చేస్తుంది. యుద్ధకాలంలో 'ఆహారం ఎక్కువగా పండించండి' అనే ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా రైలుపట్టాల ప్రక్కన కూడా పంటలు పండించేందుకు కృషి చేశాను. కిసాను కాంగ్రెసు కార్యకర్తలు కంట్రోళ్ళ సమయంలోనూ, యుద్ధ సమయంలోనూ పెద్ద రైతులచే తక్కువ ధరకు ఆహారధాన్యాలు వ్యవసాయ కూలీలకు ఇప్పించారు.

కౌలుదార్లు హరిజన కో-ఆపరేటివ్‌ల ద్వారా లంకలలో కృష్ణా, గోదావరి నదుల ప్రక్కన యుద్ధకాలంలో పంటలు పండించుకునేవారు. ఈ తరుణంలో శ్రీ యన్. సత్యనారాయణ నాకు తోడుగా ఉన్నారు.

వ్యవసాయ కూలీలకు ఇళ్లు ఎంత అవసరమో నాకు తెలుసు. నేను కిసాను కాంగ్రెసువారిని చిన్న చిన్న కాలనీలను నిర్మించుకోమని చెప్పాను. శ్రీ గౌతు లచ్చన్న 'బారువా పంచాయితీ'కి అధ్యక్షుడుగా ఒక కాలనీ కట్టించాడు. శ్రీ జియ్యర్‌దాసు ఒక దళితుడు. గుంటూరులో అసంఖ్యాకంగా ఇళ్లను, కాలనీలను నిర్మించాడు. 'యానాది' వారికోసం ఒక ప్రత్యేక గ్రామాన్ని 'గరికపాడు' దగ్గర జియ్యర్‌దాసు పేర నిర్మించారు. చిత్తూరు జిల్లాలో శ్రీ పి. రాజగోపాలనాయుడు, (యం.యల్.ఏ.) ఇటువంటి కాలనీలనే నిర్మించాడు. ఈరోజుకు కూడా స్వతంత్ర భారతదేశంలో ఈ ఇళ్ల కొరత ఎక్కువగానే ఉంది.

కొన్ని లక్షలమంది ఈ దేశంలో నేరజాతులుగా గుర్తించబడ్డారు. నేను ప్రవేశ పెట్టిన సవరణను అసెంబ్లీ గుర్తించలేదు. శ్రీ రాఘవయ్య, మరికొందరి దశాబ్దాల పోరాట ఫలితంగా ఈ బిల్లును స్వరాజ్ ప్రభుత్వం ఆమోదించింది. ఒక్క కలం పోటుతో ఈ జాతుల వారందరూ విముక్త జాతులవారు అని పిలువబడి చదువు కుంటూ, ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఎక్కువమంది వ్యవసాయ కూలీలు దళితులే. దళితులనే మచ్చ లేకుండా వీరు సమాజంలో బ్రతకగలిగారు. వీరందరి కొరకు కాంగ్రెసు వారందరికంటే నేనెక్కువ మనస్సు పెట్టి పనిచేశాను. రైతాంగ విద్యాలయపు పట్టభద్రులందరూ వీరి అభివృద్ధి కోసం పాటుపడ్డారు. నేను పర్యటనకు వెళ్లిన ప్రతిచోటా దళితులతో కలసిమెలసి ఉండటం, కలసి వారితో భోజనం చేయటం, మా సమావేశాలకు వారిని ఆహ్వానించటం చేస్తుండేవాడిని.

నా సహచరులందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొనేవారు. కిసాను కాంగ్రెసువారు నిజాయితీగా వీరందరి సేవకులుగా గుర్తింపు పొందారు. 1940-44 లలో జాతీయోద్యమాలు, సాంఘిక ఆర్థిక పరిస్థితులు, యుద్ధకాలపు నిర్మాణాల పటాలాలలో చేరటం వంటివి వీరి ఆర్థికాభివృద్ధికి దోహదమైనవి.

ఆంధ్రదేశంలోని కమ్యూనిస్టులు కూడా యుద్ధకాలంలో తమదైన శైలిలో దళితుల అభివృద్ధికి ఎంతగానో శ్రమించారు. పెద్ద రైతులు 'ప్రజాయుద్ధం' పేర కమ్యూనిస్టులు చేస్తున్న పనిని ఆమోదించలేదు. అందువలన కమ్యూనిస్టులు అట్టడుగున పడివున్న దళితులతో స్నేహం చేశారు. వారి మద్దతు కూడగట్టు కొన్నారు. ఈ విషయంలో వారు చెప్పుకోదగిన విజయం సాధించారు.

యుద్ధకాలంలో ధరల పెరుగుదలను కిసాను కాంగ్రెసువారు స్వాగతించారు. మా దీర్ఘపోరాటంలో మేము వ్యవసాయ కూలీలకు ఆహార భద్రత కోసం, గిట్టుబాటు ధర కోసం కృషి చేశాం. వారి వేతనాలు ఎక్కువగా ఉండాలని, కంట్రోళ్ళ కాలంలో మేం పోరాడాం. వ్యవసాయ కూలీల వేతనాలు ఎక్కువగా ఉండాలని నా ఆశయం. ఈ విషయంలో కమ్యూనిస్టులు తప్పుడు ప్రచారం ప్రారంభించారు. నేను జైలులో ఉండటాన్ని ఆసరాగా తీసుకున్నారు. భారతీదేవి, జి. లక్ష్మీనారాయణ, జి.వి. సుబ్బయ్య గార్లు, స్నేహితులు కమ్యూనిస్టుల నెదిరించి నిలిచారు.

★ ★ ★

13. భారత జాతీయవాదం (1936-40)

1936-40 మధ్య ఐదు సంవత్సరాలు కమ్యూనిస్టులు, సోషలిస్టులు - ముసోలినీ, హిట్లర్ల ఫాసిజంను అరికట్టే ప్రయత్నంలో ఉన్నారు. పండిట్ జవహర్ లాల్, సుభాష్‌చంద్రబోస్‌లు యూరోపులో ఉన్నారు. వీరిద్దరూ నిజాయితీపరులే. ఫాసిజంకు వీరు వేరువేరుగా స్పందించారు.

భారతదేశం శ్రీమతి కమలానెహ్రూ మరణానికి తీవ్రంగా విచారించింది. నెహ్రూగారు లక్నోలో నేషనల్ కాంగ్రెసు అధ్యక్షునిగా ఎన్నుకోబడ్డారు (1936). వీరి స్వీయచరిత్ర ఈ సమయంలోనే ప్రచురించబడింది. వారి ఆలోచనలకు ఆ పుస్తకం అద్దంపట్టింది. ప్రజలలో వారికి ఎంతో సానుభూతి వచ్చింది. ఇది ఒక అద్భుతమయిన సాహిత్య ప్రక్రియ, ప్రచార కార్యక్రమం.

జవహర్‌లాల్‌గారు ఉత్తరప్రదేశ్, బీహారులలో ఉన్న సోషలిస్టు స్నేహితులను కాంగ్రెసులో ఒక ప్రత్యేక విభాగంగా తయారుచేశారు. గాంధీగారికి ఇదే సమయంలో వ్రాసిన ఉత్తరములు 'విధర్ ఇండియా' (Where India? - ఇండియా ఎక్కడ?) అనే పేర ప్రచురించబడ్డాయి. నాలాంటి వారందరమూ ఈ పుస్తక ప్రచురణను అభినందించాము. మేము చేసే కార్యక్రమాలన్నింటికీ మరింత అండగా ఉంటుందని తలచాము. 1934 లో కాంగ్రెసు సోషలిస్టు పార్టీ ఆవిర్భవించింది. సోవియట్ రష్యా విజయాలలో నమ్మకం ఉన్న వారందరినీ తన చుట్టూ తిప్పుకొన్నది.

కమ్యూనిస్టులు-కాంగ్రెసు సోషలిస్టు పార్టీ కార్యక్రమాలను, ఆలోచనలను (సి.యస్.పి.) వ్యతిరేకిస్తున్నారు. సామ్రాజ్యవాద దేశాలు, ఫాసిజంకు వ్యతిరేక దేశాలు అన్నీ ఒకటిగా ఉండాలని రష్యా ఆశించింది. భారత కమ్యూనిస్టులు, కాంగ్రెసు సోషలిస్టు పార్టీ వేదికలను 1934 నుండి వాడుకొంటున్నారు.

పండిట్ నెహ్రూ, జాతీయవాదులు సామ్రాజ్యవాద వ్యతిరేకులతో కలసి ఫాసిజానికి వ్యతిరేకంగా కాంగ్రెసు వామపక్షీయులను కూడగట్టారు. వీరు 1936 లో జయప్రకాశ్‌నారాయణ, ఆచార్య నరేంద్రదేవ్, అచ్యుత పట్వర్ధన్‌లను కాంగ్రెసు వర్కింగు కమిటీలోనికి తీసుకున్నారు. నేను కమ్యూనిస్టును, కాంగ్రెసు సోషలిస్టు పార్టీవాడిని కాను. నేను దక్షిణాది రైతుల నుండి వచ్చి రైతుల కొరకు కృషి చేస్తున్నవాడిని. నేనీ కర్షకోద్యమం అఖిలభారత రాజకీయ శక్తిగా దేశమంతా ఎదగటానికి పాటుపడుతున్నాను. నా యత్నాలను కాంగ్రెసు సోషలిస్టు పార్టీ, కమ్యూనిస్టు పార్టీ వ్యతిరేకించాయి. సాంప్రదాయ కాంగ్రెసువాదులు రైతుల ప్రత్యేక వేదికపై దృష్టి పెట్టలేదు. కిసాను కాంగ్రెసు ప్రాముఖ్యంతో జాతీయ కాంగ్రెసు ప్రజాబలం తగ్గుతుందని భయపడ్డారు. అందువలన జాతీయ కాంగ్రెసు అఖిలభారత కిసాను కాంగ్రెసుకు దూరమైంది.

రెండో కిసాను సమ్మేళన్ 1936 లో 'ఫైజాపూర్'లో జరిగింది. ఫైజాపూర్‌లో నెహ్రూగారు మూడవసారి పార్టీ అధ్యక్షుడయ్యాడు. కాంగ్రెసు సోషలిస్టు పార్టీ వారు, కమ్యూనిస్టులు ఒకరితో ఒకరు పోటీపడి ఈ సంఘంలో జొరబడ్డారు. కిసాను కాంగ్రెసు–కాంగ్రెసు వేదికకు ప్రత్యామ్నాయంగా మారింది.

పండిట్ నెహ్రూగారు కమ్యూనిస్టులను ఆల్ ఇండియా కాంగ్రెసు కమిటీ (అఖిలభారత కిసాను కమిటీ) లోనికి ఆహ్వానించి, కామ్రేడ్ డాంగేను, ఇతరులను ఎ.ఐ.సి.సి. లోనికి తీసుకున్నారు. కమ్యూనిస్టులు ఒక ఉద్యమంలాగా కాంగ్రెసు సోషలిస్టు పార్టీలోనికి ప్రవేశించసాగారు. నేను ఈ అయిదు సంవత్సరాలు కాంగ్రెసు సోషలిస్టు పార్టీతోనూ, కమ్యూనిస్టులతోనూ కలసి కాంగ్రెసు నాయకత్వంలో పనిచేశాను. ఇకముందు ఈ ఐక్యవేదికతో కలసి పనిచేయాలా, వద్దా అన్న మీమాంసలో పడ్డాను. జయప్రకాశ్‌నారాయణగారు వ్రాసి ప్రచురించిన 'సోషలిజం ఎందుకు?' (Why Socialism?) అనే పుస్తకంతో వారు ఎంత తీవ్రమయిన 'మార్క్సిస్టో' (Marxist), వారెంతగా కుటీర పరిశ్రమలకు, కళాకారులకు వ్యతిరేకో అర్థంచేసుకొన్నాను. కళాకారులకు, కుటీర పరిశ్రమలకు గాంధీగారి ఆశీస్సులున్నాయి. నేను ఈ కమ్యూనిస్టుల భారత వ్యతిరేక ధోరణిని, మార్క్సిస్టు పంథాను అంగీకరించలేకపోయాను. స్వామి సహజానంద సరస్వతి

నూటికి నూరు పాళ్ళు రైతుల పక్షపాతి. ఇందులాల్ యాగ్నిక్ వీరికి దూరంగా ఉన్నారు. మేము ముగ్గురం కలసి పనిచేశాం.

కిసాను కాంగ్రెసు జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో నిర్వహించటం సామాన్య మైన పని కాదు. ఆంధ్రప్రదేశ్, బీహార్‌లలో మాత్రమే స్వతంత్రంగా వ్యవహరించే స్థాయి గల కిసాను సంఘాలున్నాయి. ఇతర రాష్ట్రాలలో ఇవి కాంగ్రెసు సోషలిస్టు పార్టీ, కమ్యూనిస్టులకు అనుకూలంగా ఉన్నాయి. ప్రజా నాయకులు అయిన స్వామీజీ, నేను అఖిలభారత కిసాను కాంగ్రెసులో నిర్విరామంగా కృషి చేయటం వలన కిసాను పక్షపాతం గల స్థానిక నాయకులు మా నాయకత్వాన్ని అంగీక రించారు. 1939-40 ల మధ్య ఈ పరిణామం జరిగింది.

ఆంధ్రలో నేను తర్ఫీదు ఇచ్చిన రైతు పట్టభద్రులు ఉండటం వలన కిసాను కాంగ్రెసు నాయకత్వాన్ని ఇతర పార్టీలు అంగీకరించక తప్పలేదు. కిసానులు, కళాకారులు, దళితులు ఎక్కువమంది కిసాను కాంగ్రెసులో చేరారు. ఈ పరిణామం చూసి కమ్యూనిస్టులు కూడా 1937, 1938, 1939 లలో శిక్షణ శిబిరాల నిర్వహణకు పూనుకున్నారు. కాంగ్రెసు సోషలిస్టు పార్టీవారు కూడా ప్రయత్నించారు. కొంతమంది రైతాంగ విద్యాలయాల్లోకి దొంగతనంగా హాజ రయ్యారు. వీరు నిడుబ్రోలు, మదనపల్లి, తునికిపాడు, ఇదుపులపాడు, ఇచ్ఛాపురా లలో ప్రయత్నించి ఆంధ్రరాష్ట్ర కిసాను కాంగ్రెసునే స్వాధీనం చేసుకోవాలను కున్నారు. కానీ వారు సఫలీకృతులు కాలేదు.

ఇది వారు చేసిన ఒక తప్పు. మేము 1940 వరకు కొన్ని స్థానాలను కమ్యూనిస్టు పార్టీకి, కాంగ్రెసు సోషలిస్టు పార్టీకి వదలివేశాము. ప్రెసిడెంట్ కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి చాలా పట్టుదల గల వ్యక్తి. గాంధీగారన్నా, నేనన్నా ఎంతో అభిమానం కలవారు.

కమ్యూనిస్టులు జాతీయ ఐక్యవేదిక (National United Front) పై ధ్యాసతో ఎంత త్వరగా దీనిని స్వాధీనం చేసుకుందామన్న ఆలోచనలో ఉన్నారు. ఎన్ని వేదికలు దొరికినా వారికి సరిపోవటంలేదు. కమ్యూనిస్టులు వారి సహయాత్రీకులు (Fellow Travellors) అయిన కొందరు కిసాను కాంగ్రెసు వారు 'పలాస'లో జరిగిన అఖిలభారత కిసాను సంఘ ఎన్నికలలో పాల్గొన్నారు. అతి స్వల్ప

ఆధిక్యతతో మేము (రంగా–కె.యస్.యన్. మూర్తి) గెలిచాము. ఈ పరిణామానికి మేము దిగ్భ్రాంతి చెందాము.

జాతీయ ఐక్యవేదిక ఎంత ఉపయోగకరమైనదో నాకు 'పలాస' ఎన్నికలలో అర్థమైంది. నా పర్యటన పంజాబులో 1948 లో విజయవంతమైనదని కాంగ్రెసు వారూ, పత్రికలవారూ భావించారు. నేనిచ్చిన నినాదాలు రైతులకు అనుకూలంగా ఉన్నాయి. నా కిసాను మజ్దూర్ రాజ్‌ను వారు ప్రచారంలో అడ్డుకున్నారు. బెంగాల్‌లో ఎన్నికలు సక్రమంగా జరగనీయలేదు. పంజాబులోనూ వ్యతిరే కించారు. ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో వారు అల్పసంఖ్యాకులు. ఇక్కడ కూడా కమ్యూనిస్టులు కాంగ్రెసు సోషలిస్టు పార్టీవారిని చాలా ఇబ్బంది పెట్టారు. వారి ప్రచారంతో ఎట్టకేలకు 'స్వామీజీ'ని బుట్టలో వేసుకున్నారు. వారిని స్వామిజీ బలపరచటం మొదలుపెట్టాడు. వారు చెప్పే మార్క్సిజం భారత కిసానులకు నిరుపయోగం అని స్వామీజీ అర్థంచేసుకోలేకపోయారు. నేను 1940 లో జైలులో ఉన్నప్పుడు భారతీదేవి, లక్ష్మీనారాయణ గార్లు భారత కిసానుల బాధ్యత తీసుకున్నారు. రష్యా రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొనటం, కమ్యూనిస్టుల ప్రజాయుద్ధపు నినాదాలు – భారత కమ్యూనిస్టులు, కిసాను కాంగ్రెసువారి మధ్య ఒక పెద్ద వివాదమయింది. భారతీదేవిగారు కిసాను కాంగ్రెసు – కమ్యూనిస్టుల మధ్య ఎటువంటి సహకారముండదు అని తేల్చిచెప్పారు. ఐక్యవేదిక చరిత్ర ఆవిధంగా ముగిసింది.

ఈ ఐక్యవేదిక వలన భారత కిసానులకు చాలా అపకారం జరిగింది. చివరలో స్థానిక నాయకులు వారిలో వారు కలహించుకొని ఈ ఐక్యవేదికను భగ్నం చేశారు.

రాజకీయాలలో కూడా పెద్దయెత్తున మార్పులు జరిగాయి. కాంగ్రెసు సోషలిస్టు పార్టీ (సి.ఎస్.పి.) ఆంధ్రా, తమిళనాడు, కేరళ, పంజాబులలో కమ్యూ నిస్టులతో నిండిపోయింది. ఈ పార్టీ విభాగాలన్నీ రాత్రికి రాత్రే కమ్యూనిస్టు పార్టీలోకి మారాయి. కాంగ్రెసు కమిటీలలో కూడా కమ్యూనిస్టులు స్థానిక నాయకులలో గ్రూపు విభేదాలు రెచ్చగొట్టారు. చిన్న చిన్న గ్రూపులకు, మెజారిటీ గల గ్రూపులకు తగాదాలు పెట్టారు. ఇదంతా కాంగ్రెసు సోషలిస్టు పార్టీ

ముసుగులో ఉండి చేసింది. 1938, 1939 లలో జిల్లా కాంగ్రెసుకు జరిగిన ఎన్నికలలో తీవ్రంగా పోటీ జరిగింది. పండిట్‌జీ నిర్వ్యాపారత వారికి బలంగా మారింది. నేను ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీకి అధ్యక్షునిగా పోటీ చేసినప్పుడు కాంగ్రెసు సోషలిస్టు సభ్యులు, కమ్యూనిస్టులు నన్ను ఓడించటానికి తీవ్రంగా కృషి చేశారు. అప్పటి వారి అభ్యర్థి శ్రీ పుచ్చలపల్లి సుందరయ్యగారు. ఇప్పుడు వారు మార్క్సిస్టు పార్టీలో నాయకులు. వారు కార్యదర్శిగా పోటీ చేశారు. వారికి అతి స్వల్పంగా మాత్రమే ఓట్లు వచ్చాయి. కమ్యూనిస్టులు ఐక్య సంఘటనపై మాకు (రంగా) నమ్మకం లేదని నిందించారు. ఇదే పరిస్థితి కాంగ్రెసువారికి చాలా రాష్ట్రాలలో ఎదురైంది. నెహ్రూగారు అధ్యక్షునిగా ఉన్న రెండు సంవత్స రాలలో బాగా పుంజుకొంది. నెహ్రూగారి క్షమాగుణానికి అంతులేకుండా పోయింది. అఖిలభారత కార్మిక సంఘం – కిసాను కాంగ్రెసు జెండాను, ఎర్ర జెండాను ఒకేసారి ఎగురవేసి, సభలలో వేరే 'ధ్వని' వచ్చేవిధంగా మాట్లాడేవారు. ఇది సాకుగా తీసుకొని మేము కూడా ఇదేవిధంగా మాట్లాడసాగాము. ఈరోజుల్లో సర్దార్ పటేలుగారు, రాజాజీగారు ఐక్య సంఘటనకు వ్యతిరేకం.

రెండవసారి జరిగిన ఎ.ఐ.సి.సి. ఎన్నిక తరువాత ఐక్య సంఘటన ఇంకా విస్తృతమైంది. గాంధీగారు మినహా నాయకులందరూ వ్యతిరేకం. మొదట కాంగ్రెసు సోషలిస్టు పార్టీ సుభాష్‌బాబు అధ్యక్షతన బలపడింది. కానీ కమ్యూనిస్టు పార్టీని బలహీనపరచింది. శ్రీ మసానీగారు, సి.యస్.పి.కి కార్యదర్శిగా లాహోర్ కాన్ఫరెన్సులో ఎన్నుకోబడ్డారు. వారు కమ్యూనిస్టులు చేస్తున్న మోసాన్ని గ్రహించి కాంగ్రెసు సోషలిస్టు పార్టీ, కమ్యూనిస్టు పార్టీల ఐక్యవేదికను ఎదిరించారు. వారు చేసిన ప్రయత్నం 1938 లో సాగలేదు. సుభాష్‌బాబు రెండవసారి అధ్యక్షునిగా పటేలుగారి వర్గానికి వ్యతిరేకంగా పోటీ చేసినప్పుడు కాంగ్రెసు సోషలిస్టు పార్టీ వారిని బలపరచిందనేది సందేహమే. ఎలక్షను జరిగిన తరువాత గాంధీగారు సుభాష్‌బాబు ఎలక్షనును వ్యతిరేకించిన తరువాత ఆల్ ఇండియా కమ్యూనిస్టు పార్టీవారు సుభాష్‌బాబును నెత్తికెత్తుకున్నారు. ఇది మిత వాదులకు, అతివాదులకు మధ్య తగాదాకు కారణమయింది. నేను, జయప్రకాశ్ నారాయణ ఈ పరిస్థితిని చక్కదిద్దాలని చూశాం. కానీ మా ప్రయత్నాలను కమ్యూనిస్టులు

అడుగడుగునా అడ్డుకున్నారు. మేము గత్యంతరం లేని పరిస్థితుల్లో అతివాదులతో కలిశాము. చాలామంది కాంగ్రెసువాళ్లం గాంధీగారి ప్రవర్తనకు బాధపడ్డాము. వారు తమ అసంతృప్తిని సుభాష్‌బాబుపై బహిరంగంగా వెలిబుచ్చారు. వారు తీసుకున్న ఈ తొందరపాటు చర్య మమ్ము నిరాశపరచింది. బాపూజీ వ్యతిరేకతకు *కారణం బ్రిటీషువారి నాజీ వ్యతిరేకత కావచ్చు. ఫాసిస్టులతో, నాజీలతో సుభాష్‌బాబుకు గల పూర్వ పరిచయం కావచ్చు. నాజీలతో, ఫాసిస్టులతో ఉత్తర ప్రత్యుత్తరాలు కావచ్చు. కానీ సుభాష్‌బాబు ఎప్పుడూ ఈ నమ్మలేని విషయాలను గురించి మాట్లాడలేదు. సుభాష్‌బాబు ఎన్నిక తరువాత ఈ పరిణామం మాకు ఆందోళన కలుగజేసింది. నెహ్రూగారి పాత్ర సందేహంగా ఉంది.* వారు సుభాష్‌బాబును బలపర్చుతున్నదీ, పటేలు గారిని వ్యతిరేకిస్తున్నదీ అర్థంకావటం లేదు. గాంధీగారి నిర్ణయం నన్ను, నాలాంటి వారిని ఈ ఆరు నెలల కాలం బాధపెట్టింది. కలకత్తా అఖిలభారత కాంగ్రెసు సభలలో నేను, జయప్రకాశ్ నారాయణగారు, ఇతరులము జవహర్‌లాల్‌ను కలసి ఈ సమస్యకు పరిష్కారము చూపించవలసినదని కోరాము. వారు తమ అశక్తతను వెలిబుచ్చారు. మేము సుభాష్‌బాబుతో మాట్లాడాము. గాంధీగారి కోర్కెలకు ఒప్పుకోవలసిందిగా కోరాము. వారు తనకు కావలసిన ఇద్దరు లేక ముగ్గురు సభ్యులను వర్కింగు కమిటీలో నియమించటానికి గాంధీగారు నిరాక రిస్తున్నారని చెప్పారు. గత్యంతరములేని స్థితిలో సుభాష్‌బాబు రాజీనామా చేసి నప్పుడు మేము వారితోనే కలసి ఉన్నాం.

ఈ పరిణామానికి కమ్యూనిస్టులు, వారి సహయాత్రీకులు చాలా సంతో షించారు. సమావేశ స్థలంలో గొడవలు సృష్టించారు. సుభాష్‌బాబు ఫార్వర్డ్‌బ్లాకు ఏర్పాటు చేసినప్పుడు కమ్యూనిస్టులు వ్యతిరేకించారు.

ఫార్వర్డ్ బ్లాకు - నా సహాయం

సుభాష్‌బాబు సాహసోపేతమయిన ఈ నిర్ణయానికి అభినందించాను. వారు ఫార్వర్డ్ బ్లాకును ఏర్పాటుచేయటంలో, ఫార్వర్డ్ బ్లాకు అని నామకరణం

చేయడంలో నా పాత్ర కూడా ఉంది. శ్రీ సి.ఆర్.దాసుగారు నిర్వహించిన పత్రిక 'ఫార్వర్డు'ను ఫార్వర్డ్ బ్లాకుగా మేము రూపొందించాము. కిసాను కాంగ్రెసు వారు కిసాను మజ్దూర్ ఆశయాలతో వామపక్షాలుగా ఉన్నారు. సుభాష్‌బాబు అనుచరులు ఎక్కువమంది పట్టణ మధ్యతరగతివారు కనుక మేము ఎవరికి వారు ప్రత్యేకంగా ఉంటూ ఒకరితో ఒకరు సన్నిహిత సంబంధాలు కొనసాగించాలి అని నిర్ణయించుకొన్నాం.

కమ్యూనిస్టులు ఈ విషయంలో ఎక్కువగా లాభించారు. మేము ఈ పరిస్థితి నుండి లాభించడానికి – వామపక్షం, రాయిస్టులు, సోషలిస్టులు, కాంగ్రెసు సోషలిస్టులు స్వతంత్రంగా ఉన్న కమ్యూనిస్టులు, కిసాను కాంగ్రెసువారు, మజ్దూర్ సభవారు – వీరందరూ కలసి వచ్చారు. జయప్రకాశ్‌నారాయణగారు కూడా ఇదే ఆలోచనలో ఉన్నారు. సుభాష్‌బాబు, మేమందరం కలసి ఎ.ఐ.సి.సి. సమావేశాల సమయంలో ఏకీకృత వామపక్షాన్ని నిర్మించాము. కాంగ్రెసులోని సోషలిస్టులకు మా వామపక్ష ఏకీకృత సంఘం (ఎల్.సి.సి.) (Left Consolidation Committee) నచ్చలేదు.

'ఫార్వర్డ్ బ్లాక్'ను కవాస్‌జీ జహంగీర్ హాలులో సుభాష్‌బాబు ప్రారంభించాడు. సుభాష్‌బాబు ఎంతో సహృదయంతో నన్ను ప్రారంభోపన్యాసం చేయమన్నాడు. నేను ఫార్వర్డ్ బ్లాక్‌లో సభ్యుణ్ణి కాదు.

కొద్ది నెలలలోనే రెండవ ప్రపంచ యుద్ధం వచ్చింది. సుభాష్‌బాబు ఈ విషయమై హెచ్చరికలు చేస్తున్నాడు. బ్రిటీషువారితో ఏవిధమైన 'సయోధ్య' వద్దని చెప్పాడు. కాంగ్రెసు ఆయన మాటలు పట్టించుకోలేదు. కమ్యూనిస్టులు చొరవ తీసుకున్నారు. బ్రిటీషు ప్రభుత్వం కాంగ్రెసువారిని జర్మనీతో యుద్ధానికి దించుతున్నారని కాంగ్రెసు మంత్రులందరూ రాజీనామాలు చేశారు. వామపక్ష ఏకీకృత కూటమి తృప్తిపడలేదు. దేశవ్యాప్తంగా వ్యతిరేకోద్యమం నిర్మించాలని మేము భావించాం. గాంధీగారు ఇటువంటి ఉద్యమం వద్దని, హింసకు దారి తీస్తుందని చెప్పారు. నేను గాంధీగారితో ఈ విషయం మాట్లాడి నేనే సత్యాగ్రహం చేస్తానన్నాను. కమ్యూనిస్టు పార్టీవారు కూడా నాకు ఇదేవిధమైన హామీ ఇచ్చారని చెప్పాను.గాంధీగారు "ఈ నిర్ణయం నిజాయితీతో కూడినదేనా" అని ప్రశ్నించారు.

నేను అజయ్‌ఘోష్‌ను వార్ధా తీసుకొని వెళ్లాను. సంభాషణలు దీర్ఘంగా జరిగాయి. కమ్యూనిస్టు పార్టీవారు వీలయినంత కాలం 'అహింస' నవలంబిస్తారని, గత్యంతరంలేని పరిస్థితులలో 'హింస'కు వ్యతిరేకం కాదని అజయ్‌ఘోష్ చెప్పారు. ఇది నాకొక కనువిప్పు. 'అహింసతో ఉద్యమం నడుస్తుందా?' అని గాంధీగారు నన్ను ప్రశ్నించారు. నా సందేహాలను వారి ముందుంచి, సుభాష్‌బాబుతో మాట్లాడుతానని చెప్పాను. నా నిజాయితీని వారు మెచ్చుకొని చిన్న చిరునవ్వు నవ్వారు, కమ్యూనిస్టులతో పొత్తు లేకుండా సత్యాగ్రహం జరగాలని, ఇదే విషయం సుభాష్‌బాబు గారితో చెప్పాలని నేను అనుకున్నాను. నేను కలకత్తా త్వరగా వెళ్ళి సుభాష్‌బాబుగారితో చెప్పాను. వారు నా సలహాను తిరస్కరించారు. వారు సత్యాగ్రహం చేయటానికే నిశ్చయించుకున్నారు. ఈ సందర్భంలో 'శ్రామికపంథా' అనే కరపత్రాన్ని సుభాష్‌బాబుగారు చూశారు. ఏకీకృత వామపక్షాన్ని రెచ్చగొట్టాలని కాంగ్రెసు, కిసానులు, ఫార్వర్డ్ బ్లాక్, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీవారితో జైళ్ళను నింపాలని వారందులో వ్రాశారు. కమ్యూనిస్టు అగ్రనాయకులందరూ ఈ ఉద్యమానికి దూరంగా ఉండాలని వ్రాశారు. ఏకీకృత వామపక్షంవారి బలవంతంతో కాంగ్రెసువారు కూడా ఈ ఉద్యమంలోనికి స్వతంత్రంగా దూకి అరెస్టు కాగలరని ఈ కరపత్రపు సారాంశం. యుద్ధం ఒక దశను చేరుకున్నప్పుడు రష్యా తన 'ఎర్ర'సైన్యాన్ని భారతదేశం పంపి, భారతదేశాన్ని తన వశం చేసుకొంటుందని, కమ్యూనిస్టులందరూ అధికారాన్ని హస్తగతం చేసుకుంటారని దీని సారాంశం. ఈ కరపత్రం సి.పి.ఐ. వారు ప్రచురించిందే అని నిర్ణయానికి వచ్చిన తరువాత మా ఏకీకృత వామపక్షం కమ్యూనిస్టులతో కలసి నడవదని సుభాష్‌బాబు చెప్పాడు. నేను గాంధీగారితో మాట్లాడిన తరువాత నాకుగాని, ఏకీకృత వామపక్షానికి గానీ ఏమీ సంబంధం లేదని చెప్పాను. జయప్రకాశ్ నారాయణగారు కూడా కొద్ది వారాల క్రితమే జైలుకు వెళ్ళారు. కమ్యూనిస్టు పార్టీవారు తమ పత్రికల ద్వారా, వారికున్న ప్రజాసంఘాల ద్వారా మమ్మల్ని ప్రభావితం చేస్తున్న విషయాన్ని అంతవరకు గమనించలేదు. కాంగ్రెసు సోషలిస్టు పార్టీని ప్రజలు నమ్మటంలేదు. సుభాష్‌బాబును బలపర్చాలనే నిర్ణయం తీసుకున్నాను. నేను త్రిపురలో స్వతంత్రంగా ఉండలేకపోయాను. కమ్యూనిస్టు వ్యతిరేక

శక్తులను బలపరచే కార్యక్రమం తీసుకున్నాను. 'రామఘర్' కాంగ్రెసు జరిగేవరకు సుభాష్‌బాబు స్వతంత్రంగా సత్యాగ్రహం చేయటానికి స్వామి సహజానంద సరస్వతి ప్రోద్బలంతో నిర్ణయించుకున్నారు. నేను వారితో విభేదించాను. నాకు 30, ఏప్రిల్ 1940న జైలు ఉత్తర్వులు వచ్చినయ్. కమ్యూనిస్టులతో రాజకీయ సంబంధాలు పూర్తిగా తెగతెంపులు చేసుకున్నాను. నెహ్రూగారు ప్రారంభించిన సంఘాలకు, కమ్యూనిస్టు ఆలోచనలకు దూరంగా జరిగాను.

1938 లో నా గురించి కమ్యూనిస్టు సహయాత్రీకులు చిన్న జీవితచరిత్రను ప్రకటించారు. దానికి అల్లూరి సత్యనారాయణరాజు (కమ్యూనిస్టు - కాంగ్రెసు సెక్రటరీ) ముందుమాట వ్రాశాడు. కమ్యూనిస్టులు ఈవిధంగా నా సహచరులను దగ్గరకు తీసుకొనే ప్రయత్నం చేశారు.

1939 లో కమ్యూనిస్టుల రంగు బయటపడింది. కమ్యూనిస్టు ప్రధాన కార్యదర్శి రాసిన నివేదికలో నన్ను, భారతీదేవిగారిని, జి.యస్. నారాయణ గారిని, రైతాంగ పట్టభద్రులను పూర్తిగా విస్మరించారు. కిసాను ఉద్యమంలో మా పాత్ర ఏమీ చెప్పలేదు. ఈవిధమైన ఎత్తుగడలపై పి. తిమ్మారెడ్డిగారు తీవ్రంగా స్పందించారు. వల్లభాయ్ పటేలుగారు 1934 లో కమ్యూనిస్టులు నా కేంద్ర అసెంబ్లీ సభ్యత్వాన్ని వ్యతిరేకించారని చెప్పారు.

నేను తెలుగు పత్రికలలో లెనిన్-గాంధీల తారతమ్యం గురించి వ్రాశాను. దీనికి ఎ.యస్. రాజుగారికి కోపం వచ్చింది.

సోవియట్ రష్యాలో జరిగే పరిణామాలు పది సంవత్సరాల వరకు బయటి ప్రపంచానికి తెలియవు. సైబీరియా జైళ్ళలో రైతులు మగ్గుతున్న విషయం కూడా బయటి ప్రపంచానికి తెలియదు. ఈ సమాచారం మేం నమ్మలేకుండా ఉన్నాం. వెబ్స్ వ్రాసిన 'సోవియట్ కమ్యూనిజం' రవీంద్రనాథ ఠాగూర్, నెహ్రూగారి వ్రాతలతో రష్యాలో అద్భుతమయిన నాగరికత ఉన్నదని మేము భ్రమించాము.

రష్యాలో నిరంకుశత్వానికి, అణచివేతకు, వీటివలన వచ్చే అనర్థాలకు బాధపడి వెల్లూరు జైలులో నేను తెలుగులో వ్రాసిన 'ఆధునిక రాజ్యాంగ వ్యవస్థలు'

అనే పుస్తకాన్ని 1932 లో, రైతుపాటలు అనే పుస్తకాన్ని 1934 లో ప్రచురిస్తూ రష్యాలోని అద్భుతమయిన ప్రయోగాలు, నూతన పురోగామి సమాజపు వాస్తవాలు గురించి వ్రాశాను. ఐక్య సంఘటన మమ్మల్ని గుడ్డివారిగా మార్చిందని, రైతులు అణచి వేయబడుతున్నారని పాశ్చాత్యదేశాల నుండి మెల్లమెల్లగా వస్తున్న సమాచారం మాకు తెలియచెప్పింది. ఐక్య సంఘటన విచ్ఛిత్తి తర్వాతనే మేమీ విషయాలను ఆలోచించడం మొదలుపెట్టాం. అందుబాటులో ఉన్న సాహిత్యాన్నంతా చదివాం. రష్యాలో రైతులతో ఏవిధంగా ప్రవర్తించారో తెలుసుకున్నాం. మార్క్సిస్టు–లెనినిస్టు, స్టాలినిస్టులు రచించిన 'రాతికవచాల' పునాదులను అర్థం చేసుకున్నాం. "కమ్యూనిస్టులకు పని కావాలి. అది ఏవిధంగా అని కాదు" అని గాంధీగారు చెప్పేవారు. మార్క్సు, కాలినిన్, స్టాలిన్, లినటోవ్ గార్ల రైతు వ్యతిరేక పుస్తకాలనన్నిటినీ చదివాను. ఆ వ్రాతలలోని సరియైన సమాచార సేకరణ తరువాత 1945 లో 'కిసానులు–కమ్యూనిస్టులు' అనే పుస్తకాన్ని ప్రచురించాను. ఇది 1938 లో నేను వ్రాసిన 'కిసానులు–కాంగ్రెసు' అనే పుస్తకానికి అనుబంధం.

1936 లో ఒక దురదృష్టకరమైన అనుభవం కలిగింది. జాగర్లమూడి కుప్పుస్వామిగారు అప్పటికి తొమ్మిది సంవత్సరాల నుండి జిల్లా బోర్డు అధ్యక్షులు. నేనీ జిల్లా బోర్డు రాజకీయాలలో తలదూర్చదలచలేదు. కుప్పుస్వామిగారు సాధారణ అసెంబ్లీ ఎన్నికలలో నన్ను బలపరచారు. ఇది సాకుగా అధికార కాంగ్రెసు పక్షంవారు నన్ను నిందించారు. నేను ఈ విషయంలో విధిగా కుప్పుస్వామిగారికి వ్యతిరేకం చేయవలసి వచ్చింది. కేంద్ర అధికార కాంగ్రెసు వారు 1934 లో నేను కేంద్ర అసెంబ్లీకి ఎన్నిక కాకుండా చూడాలని చూశారు. కానీ గాంధీగారు జమీందారీ వ్యతిరేకోద్యమంలో నన్ను బలపరచటం వారికి బాధాకరమయింది. ఈ జిల్లా బోర్డు ఎన్నిక ఉచ్చులోనికి లాగాలని వీరు చూశారు. భారతీదేవిగారు గానీ, లక్ష్మీనారాయణగారు గానీ, నేనుగానీ ఈ ఎన్నికలను ఎక్కువగా పట్టించుకోలేదు.

1933 లో భూస్వాములు మద్రాసులో ఒక రైతు సంఘాన్ని ఏర్పాటు చేయాలని చూశారు. నేను అంగీకరించలేదు. నేను సహకరించలేదు. 1955–65 లలో నేను భాగ్యవంతులైన రైతు ప్రతినిధిననటం తప్పుకాదా?

1935 లో దక్షిణభారత రైతుల సమాఖ్య (The South Indian Federation of Peasants and Agricultural Workers) ను ఏర్పాటుచేశాను. దీనిలో రైతులు, వ్యవసాయ పనివారు, నేతపనివారు, ఇతరులు ఉన్నారు. ఇది కిసాను కాంగ్రెసువారికి మనోధైర్యాన్నిచ్చింది. ఇతరులపై ఆధారపడటం తగ్గింది. 1923 నుండి నేనీ నిజాన్ని రైతులతో ఒప్పించేందుకు కృషి చేస్తున్నాను. అఖిల భారత కిసాను కమిటీ వేదికపై కొలదిగా బీహారువారు అభ్యంతరం చెప్పారు. జయప్రకాశ్‌నారాయణగారు 1939 లో గయ సమావేశంలో దీనికి అంగీకరించారు.

1936 లో నిడుబ్రోలులో జరిగిన ఆంధ్ర కిసాను సభలు గుర్తింపు పొందాయి. రైతుల కనీస కోర్కెలు ఆమోదింపబడ్డాయి. కౌలు రైతుల రక్షణకు చర్యలు తీసుకోబడ్డాయి. కిసానులను బీద, మధ్యతరగతి, ధనిక రైతులు అనే కిసాను కాంగ్రెసును నేను ఆమోదించలేదు. రైతులందరూ ఒకటే అనేది నా నినాదం. ఈ తారతమ్యాల వల్లనే రష్యాలో రైతులు తమ ఉనికిని పోగొట్టుకొన్నారు.

ఈ సమయంలో నేను కాంగ్రెసు పెద్దలయిన ప్రకాశం, పట్టాభి గార్లతో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు కమిటీకి పోటీచేసి పరాజయం పొందాను. నేను ఫార్వర్డ్ బ్లాక్‌లో లేకపోయినా సుభాష్‌బాబు నన్ను సమర్థిస్తున్నారు. వారు 'నేతాజీ'గా ఎదిగిన తరువాత కూడా ఇదేవిధమైన నమ్మకం నాపై ఉంచారు. భారత జాతీయ ప్రభుత్వంలో పెద్దలను నాపై విశ్వాసం ఉంచవలసిందని కోరారు. నా అరెస్టు తెలిసిన బెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్ ప్రజలు కూడా అరెస్టయ్యారు. నేను సుభాష్‌బాబుతో కలసి ఈ సత్యాగ్రహం చేస్తున్నానన్న అపోహలో గాంధీగారు ఉన్నారు. తరువాత తన అభిప్రాయాన్ని మార్చుకొని జయప్రకాశ్‌గారికంటే నేనే ఎక్కువ అని అన్నారు. (ఎక్కువగా గాంధీ అనుయాయుడను).

ఈ సందర్భంగా సుభాష్‌బాబు నన్ను బలపరచుతూ ఫార్వర్డ్ బ్లాకులో ఒక సంపాదకీయం వ్రాశారు. శ్రీమతి భారతీదేవి, శ్యాంబాబు, కిసాను కాంగ్రెసు వారు నన్ను బలపరచారు.

★ ★ ★

14. ఏకమయిన జాతీయవాదులు

నేను 1944 లో జైలు నుండి విడుదల అయ్యాను. ప్రజాయుద్ధ నినాదాలతో కమ్యూనిస్టు పార్టీవారు ప్రచార కార్యక్రమంలో ముందున్నారు. 1944 లలో అఖిలభారత కిసాను సభ విజయవాడలో కమ్యూనిస్టులు విజయవంతంగా జరిపారు. చాలా కరపత్రాలు, పుస్తకాలు ఈ సందర్భంగా ప్రజలకు పంచిపెట్టారు. ఎ.కె. రావు అనే కాంగ్రెసువాది మాత్రమే వారికి ఎదురుతిరిగాడు. కాంగ్రెసు వారు కమ్యూనిస్టుల నైతిక హనన దాడులను ఎదుర్కొనగలిగారు.

నాపై ప్రచారం మరీ దుర్మార్గంగా సాగింది. కిసానులను నానుండి దూరం చేయాలని వారి ప్రయత్నం. రైతులలో నాపై విషప్రచారం చేశారు. దేవీజీ, గొర్రెపాటి, జి.యల్. నారాయణ, యన్.వి. నాయుడు వారి ప్రచారాన్ని సమర్థ వంతంగా ఎదుర్కొనలేకపోయారు. కాంగ్రెసువారు, కిసానులు జైళ్ళలో ఉన్నారు.

నేను జైలు నుండి విడుదల కాగానే కమ్యూనిస్టుల ప్రజాయుద్ధపు నినాదాలను ఎదిరించాను. గాంధీగారితో నా సంభాషణలు, కిసానులలో, నేతపనివారిలో ధైర్యం కలుగజేసాయి.

దేశభక్తి లేని కమ్యూనిస్టుల ప్రచారాన్ని కాంగ్రెసువారితో కలసి ఎదుర్కొన్నాను. కాంగ్రెసు కమిటీలన్నీ అప్పుడు నిర్బంధంలో ఉన్నాయి.

ఈ పరిస్థితులలో కూడా పాత కాంగ్రెసువారు కిసానులకు, కళాకారులకు అండగా నిలువలేదు. వారు గాంధీగారి నుండి నిర్ద్వంద్వమైన వాగ్దానాన్ని ఆశించారు. గాంధీగారు కిసాన్ మజ్దూర్‌రాజ్‌కు ఆశీస్సులందించారు.

ఎట్టకేలకు పాత కాంగ్రెసువారు నా వ్యతిరేకులతో సహా కాంగ్రెసు సభలు నిర్వహించటానికి అంగీకరించారు. 1945 లో గోవాడలో 40 వేల మంది కిసానులతో సభ జరిపారు. శ్రీ భక్తవత్సలం (తరువాత కాలంలో మద్రాసు ముఖ్యమంత్రి) ఈ సభనుద్దేశించి ప్రసంగించారు. శ్రీ ఎ.కె.రావు ప్రత్యేకోపన్యాసం చేశారు. నేనా సభకు అధ్యక్షునిగా ఉన్నాను. మా ఉపన్యాసాలన్నీ కమ్యూనిస్టుల ఎత్తుగడలపైన, వారు చెప్పే కంట్రోళ్ళమీద జరిగాయి. కిసానులు గిట్టుబాటు ధరలకై ఆందోళన చేస్తున్నారు. తెనాలి, రేపల్లె తాలూకా ప్రజల స్పందన కమ్యూనిస్టులలో ఆందోళన కలిగించింది. కమ్యూనిస్టులు అమృతలూరు నుండి తిరిగివస్తున్న కిసాను కార్యకర్తలపై దాడులకు దిగారు.

జైలు నుండి విడుదల అయిన సుందరరావు, అమ్మయ్యల సహకారంతో విద్యార్థి కాంగ్రెసును బలోపేతం చేశాను. నా చిన్న పుస్తకం (విద్యార్థుల పాత్ర) ఇందుకు చాలా ఉపయోగపడింది. మచిలీపట్నంలో (బందరు) ఏర్పాటుచేయ బడిన ఈ సమావేశానికి వేలాదిగా యువకులు హాజరయ్యారు. విద్యార్థులలో మా బలం నిరూపించుకున్నాము. కమ్యూనిస్టులపై మా గెలుపులు అప్రతిహతంగా సాగాయి. శ్రీ డి. సెక్రేకర్ ప్రధాన కార్యదర్శిగా ఉత్తర భారతదేశమంతా తిరిగి ప్రచారం చేశారు. ఈ అఖిల భారత విద్యార్థి సదస్సుకు సోషలిస్టులు, పాత కాంగ్రెసువారు సహకరించారు.

యువజన కాంగ్రెసు అప్పుడప్పుడే గుర్తింపు పొందుతున్నది. వీరు కూడా కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా పోరాడారు. బెంగాలు, బీహారు విద్యార్థి నాయకులు బాపూజీని కలిశారు. వారి అనుమతితో అఖిల భారత విద్యార్థి కాంగ్రెసును ఏర్పాటుచేసుకోవటానికి అనుమతి తీసుకున్నారు. 1945 లో అఖిల భారత విద్యార్థి కాన్ఫరెన్సు బొంబాయిలో కలిసింది. వి.యల్. సుందరరావు సలహాతో కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్‌గా గాంధీగారి ఆలోచనలకు అనుగుణంగా ఏర్పడింది. 1945 లో మేము 'సిటిజన్‌షిప్' (ప్రజా కళాశాలలు) కాలేజీలను బొంబాయి, నాగపూర్, కలకత్తా, లాహోర్, మద్రాసులలో ప్రారంభించాం. శ్రీ యస్.కె. పాటిల్‌గారు కమ్యూనిస్టుల నెదుర్కొని నా కార్యక్రమాలకు చేదోడువాదోడుగా ఉన్నారు. శ్రీ రామచంద్రన్, ముఖ్యమంత్రి శ్రీ ప్రబోధచంద్రగారు, మంత్రులు

పంజాబులో సిటిజన్‌షిప్ కళాశాలలకు సహకరించారు. కిసాను మజ్దూర్ ప్రజారాజ్‌ను బలపర్చారు.

1945 లో నిడుబ్రోలులో జరిగిన ఈ కాలేజీలో 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

నా సోదరుడు వెంకటప్పయ్య కమ్యూనిస్టుల నెదుర్కోవటానికి జంగంకథలు, పాటలు, పద్యాలు రాశాడు. చాలామంది నాయకులు ఇదేవిధంగా రాసి వారి వారి ట్రూపుల ద్వారా ప్రచారం చేశారు. ఇవన్నీ మా ప్రచార సాధనాలు.

రష్యాను బలపరచే కమ్యూనిస్టులు ఆంధ్రలో ప్రచారం సాగించారు. శ్రీ కందుకూరి వీరేశలింగంగారిని కామ్రేడ్ వీరేశలింగం అని పిలువసాగారు. ఈ ప్రచారానికి ప్రతిగా శ్రీ శివయ్య-ఈమని 'కామ్రేడ్ మంగమ్మ' అనే నవల రాశారు. దీనిని నేను విడుదల చేశాను.

ఇంగ్లీషు, తెలుగు పుస్తకాలను యువకులకు పరిచయం చేయసాగాము. మసానీ, కీ.శే. మెహరాలి నా పుస్తకాలు యువతకు అందుబాటులో ఉంచి కొత్త లైబ్రరీల నిర్మాణం, పాత లైబ్రరీలను బాగుచేసే కార్యక్రమం చేపట్టాము.

యుద్ధకాలంలో (రెండవ ప్రపంచ) ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్‌లో కమ్యూనిస్టులు జొరబడ్డారు. 1948 కి ఇండియన్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసును జి.యల్. నందాగారు, శ్రీగిరిగారు, మేము ఏర్పాటుచేశాం.

ఈ సమయంలో కమ్యూనిస్టులు భారత్‌కు ఈశాన్యదిశగుండా తమ ఎర్ర సైన్యంతో - బలహీనపడిన బ్రిటీషు సామ్రాజ్యంపైన దాడిచేసి కార్మిక నియంతృత్వాన్ని స్థాపించాలనే ఉద్దేశ్యంతో ఉన్నట్లు మేము ప్రజలకు చెప్పగలిగాం. దీనికి కావలసిన సమాచారం కమ్యూనిస్టు సాహిత్యంలో కావల్సినంత దొరికింది. కానీ ఆ పార్టీ సెక్రటరీ పి.సి. జోషిగారు కమ్యూనిస్టులు దేశభక్తిపరులని, కాంగ్రెసు వారే ఈ బాటను వీడారని గాంధీగారితో చెప్పసాగారు. తరువాత గాంధీగారు నిజాన్ని గ్రహించి కాంగ్రెసువారిని కమ్యూనిస్టులతో పొత్తు పెట్టుకోవద్దని చెప్పారు. 16 నెలల మా శ్రమకు ఫలితంగా బాపూజీ నిర్ణయం దొరికింది.

ఈ సమయంలో నేను పంజాబు, బొంబాయి, బెంగాల్, ఒరిస్సా, తమిళనాడు, కేరళ, హైదరాబాదు, మధ్యప్రదేశ్, ఆంధ్రలో పర్యటించాను. విద్యార్థులను, కళాకారులను కలిశాను. లాహోర్‌లో జరిగిన సమావేశానికి 25 వేల మంది హాజరయ్యారు. బెంగాల్‌లో 15 వేల మంది వచ్చారు.

ఈ సమయంలో ఇందులాల్ యాగ్నిక్, స్వామీ సహజానంద కమ్యూనిస్టులతో విడిపోయారు. వీరిద్దరూ గాంధీగారి సలహా కొరకు మరలా వెళ్ళారు. ఇందులాల్ యాగ్నిక్‌కు గాంధీగారు 'రంగా'ను కలిసి మాట్లాడవలసిందని చెప్పారు. 1946లో ఈ ఇరువురూ నన్ను కలిశారు. పటేలు గారింట్లో రెండుసార్లు మనస్సు విప్పి మాట్లాడుకున్నాం. గాంధీగారి, పటేలుగారి నమ్మకానికి పాత్రుడనయ్యాను. పటేలు గారిని తరచూ కలవమని గాంధీగారు చెప్పారు. కిసాను కాంగ్రెసు నిర్మాణంలో నేనున్నప్పుడు బాపూజీ నాయకుల నందరినీ నన్ను సంప్రదించమని చెప్పారు. ఇదేవిధమయిన నమ్మకాన్ని గాంధీగారు వారి మరణం వరకు నాపై ఉంచారు. నా దృష్టి అంతా కిసానులమీద, యువకులమీదనే ఉంది.

నేను 1946 ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు కమిటీకి ఎన్నికయ్యాను. కమ్యూనిస్టుల ప్రచారోద్ధతిని కాంగ్రెసు పత్రికల సహాయంతో తీవ్రంగా ఎదుర్కొన్నాను.

★ ★ ★

ఇందూలాల్ యాగ్నిక్, స్వామి సహజానంద, శ్రీమతి భారతీదేవి

15. వామపక్ష సాహిత్య ప్రభావం-ఐక్యవేదిక

ఐక్య సంఘటన కాలంలో మాకందరికీ వామపక్ష సాహిత్యంపై అధికాదరణ కలిగింది. లెఫ్ట్-బుక్స్ క్లబ్ (వామపక్ష పుస్తకాల కేంద్రం) సోవియట్ సాహిత్యం, జాన్‌స్ట్రాచీ, జవహర్‌లాల్, ఎడ్గార్‌స్నో, మాక్సింగోర్కీ, జి.డి. హెచ్‌కోల్ గార్ల రచనలు చాలా ప్రజాదరణ పొందాయి. చైనా సాహిత్యం ప్రత్యేకంగా లిన్‌యు టాంగ్, పెరల్ యస్. బక్, ఎడ్గార్‌స్నో (ముఖ్యంగా రెడ్‌స్టార్ ఓవర్ చైనా అనే పుస్తకం) చాలా ప్రచారంలో ఉన్నాయి. టెన్‌డేస్ దట్ షుక్ ద వరల్డ్, సోవియట్ యూత్, సోవియట్ ఉమెన్, సోవియట్ కమ్యూనిజం చిరకాలం మా మనస్సుల మీద తమ ముద్రను వేసాయి. జాన్‌గంధర్ వ్రాసిన 'ఆసియాలో', 'యూరోపులో', 'లాటిన్ అమెరికాలో' పుస్తకాలు మాలో సామ్రాజ్యవాద వ్యతిరేకతను పెంచాయి. అప్‌టన్ సింక్లెయిరుగారి 'కోఆపరేటివ్స్' మమ్ముత్తేజపరచాయి. రూజ్‌వెల్టు న్యూ డీలును బాగా చదివాను. వ్యవసాయం, వ్యవసాయ రక్షణ కొరకు ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొన్న తీరు, రైతుల రక్షణకు ఋణాల వాయిదా, ధరల నిర్ధారణలకు పడ్డ శ్రమలకు నేనాకర్షించబడ్డాను. బ్రిటను సోషలిస్టు రచయితలు న్యూడీలుపై స్పందన నన్ను అసంతృప్తికి గురిచేసింది. జి.డి. హెచ్‌కోల్‌గారి రచనలు 'What Marx Really Meant?' (మార్క్సు నిజంగా ఏమి చెప్పాడు?) అలానే 'Twelve Studies' (పన్నెండు రచనలు), పెంగ్విన్‌వారి 'The God that Failed' (భగవంతుని వైఫల్యం) నా ఆలోచనలకు సరిపోయాయి.

ఈ మార్పు నేను 'రైతు భజనావళి'ని మార్చేటంతగా పనిచేసినవి.

నేను గాంధీగారి ఆలోచనా విధానాన్ని, నా రైతు మూలాలను నమ్ముకున్నాను. ఫైజాపూర్ కాంగ్రెసు (డిసెంబరు 1936) లో, నా అధ్యక్షతన జరిగిన కిసాను

కాంగ్రెసులో ఈ రెండు విషయాలు కొట్టవచ్చినట్లు కనిపించాయి. గాంధీగారి అనుచరులు సోషలిస్టులూ తమ హర్షాన్ని తెలియజేశారు. లాహోర్ నుండి ప్రకటించబడే 'కంటెంపరరీ ఇండియా' అనే పత్రిక నా ఉపన్యాసాన్ని ప్రముఖంగా ప్రచురించింది. నెహ్రూగారి సిద్ధాంతవ్యాసం 'విధర్ ఇండియా'కు సరితూగే ప్రచురణ అని అందరూ అన్నారు. డాక్టరు షెల్వంకర్‌గారు (1940 లో) పెంగ్విన్‌బుక్స్‌లో ఈ 'కంటెంపరరీ ఇండియా'లోని కొన్ని భాగాలు ప్రచురించారు. నా సిద్ధాంతవ్యాసం మద్రాసు నుండి వెలువడే 'ది త్రివేణి' అనే ఆంగ్లపత్రికలో ప్రచురించబడింది.

నా సంపాదకత్వంలో 'సైనిక్' అనే రోజువారీ పత్రిక హిందీలో ఆగ్రా నుండి వెలువడింది. కిసాను ఉద్యమాన్ని ఎంతవరకు నడపవచ్చు అనేదే నా ఆలోచన. రైతులకు రష్యాలో ఏమి జరుగుతుందన్నదానిపై నాకు అవగాహన లేదు. అంతా ఏకపక్షమే అనేది నా ఆలోచన. రష్యాలో ప్రణాళికాబద్ధమైన ప్రయోగాలు జరుగుతున్నవన్నది నా విశ్వాసం. వారి పంచవర్ష ప్రణాళిక నన్ను సమ్మోహనపరచింది. నేను, గిరిగారికి ఇటువంటి ప్రణాళికాబద్ధమైన వ్యూహాన్ని అనుసరించాలి అని చెప్పాను. కానీ ధనలోపం దీనికి ప్రతిబంధకంగా ఉంది. బ్రిటీషు ప్రభుత్వం అంగీకరించటంలేదు. నేను సెంట్రల్ అసెంబ్లీ ఉపన్యాసాలలో వీటినే చెప్పేవాడిని. నిరుద్యోగ నిర్మూలనపై తేజబహదూర్ సప్రూ కమిటీ నివేదిక ప్రచురించింది. ఉక్కు పరిశ్రమ ఉపకరణాలు, యంత్రాలు, రైళ్ళు, వ్యాగన్‌ల తయారీవంటి ప్రాథమిక పరిశ్రమలు విదేశీ సాయంతో చేయాలని నా ఆలోచన.

1937 లో కిసాను స్పీక్స్ అనే నా పుస్తకాన్ని ఐ.యల్.ఓ.వారు, బ్రిటీషు లేబరు పార్టీవారు మెచ్చుకున్నారు. పంటల క్రమబద్ధీకరణ, కుటుంబ పరిశ్రమలు, అవినీతి నిర్మూలనోద్యమము, నీటిపారుదల, అభివృద్ధి, అవిద్యా నిర్మూలన వంటి పుస్తక భాగాలు మన దేశంలోనూ, విదేశాల్లోనూ ఎక్కువ ప్రచారం పొందాయి.

1942-44 లలో రష్యాలో రైతుల అణచివేతను తెలుసుకున్నాను. 1955లో రష్యా, యుగోస్లేవియాలలో పర్యటన జరిపాను. భారత పార్లమెంటు గ్రూపుకు నా అభిప్రాయాలు తెల్పాను. మిస్టరు కృశ్చేవ్, 1956 లో జరిగిన 'సోవియట్

కమ్యూనిస్టు కాంగ్రెసు సభలలో' స్టాలిన్ హయాంలో జరిగిన రైతు అణచివేతను తీవ్రంగా విమర్శించాడు.

సుభాష్‌బాబు జాతీయ ప్రణాళికా సంఘం (National Planning Committee) లో నెహ్రూగారిని ఉండవలసిందని కోరారు. ప్రొఫెసర్ కె.టి. షా గారు నా 'కిసాన్ స్పీక్స్' పుస్తకాన్ని అభినందించారు. వారు ఈ కమిటీకి సెక్రటరీ అయ్యారు. నెహ్రూగారు భారీపరిశ్రమలు, పారిశ్రామికవేత్తలపైన ఎక్కువగా దృష్టి పెట్టారు. వ్యవసాయం, కుటుంబ పరిశ్రమలు, మధ్యతరగతి పరిశ్రమలమీద వారి చూపు లేదు. నేను గాంధీగారి ఆలోచనలను నమ్మాను. 'భూమి పన్ను' వ్యవసాయ శ్రమ అని నేను ప్రచురించిన పత్రాలను జాతీయ కాంగ్రెసు ప్రణాళిక గుర్తించింది.

గాంధీగారి సలహాతో నన్ను, కుమారప్పగారిని జాతీయ ప్రణాళికా సంఘం లోనికి చురుకైన కార్యకర్తలుగా నెహ్రూగారు తీసుకున్నారు. నన్ను వ్యవసాయ ఉప సంఘానికి, కుమారప్పగారిని కుటుంబ పరిశ్రమలకు 'కన్వీనర్లు'గా తీసుకున్నారు. మా ఆలోచనలను నెహ్రూగారు ఆహ్వానించారు. నేషనల్ ప్లానింగు కమిటీ కూడా ఆమోదించింది.

★ ★ ★

16. పలాస కాన్ఫరెన్స్

సర్దార్ గౌతు లచ్చన

ఆంధ్ర కిసాను సభ 'పలాస'లో 1940 లో భారీ జనసమీకరణ చేసింది. లక్షమందికన్నా ఎక్కువ ప్రజలు వచ్చారు. భారతీదేవిగారిని ఈ లక్షలాది జనం విశాఖపట్నంలో, శ్రీకాకుళంలో 'అమ్మ'గా భావించారు. కీ.శే. శ్యామసుందర్ గారు, శ్రీ గౌతు లచ్చన్న, శ్రీ డి.యన్.రెడ్డి, శ్రీ హరికృష్ణ చౌదరి గార్ల నాయకత్వ లక్షణాలు గణుతికెక్కాయి. కమ్యూనిస్టులు తమ అసంతృప్తిని వెలిబుచ్చారు. స్థానిక కాంగ్రెసు నాయకులు సహాయ నిరాకరణ చేశారు. కాంగ్రెసు సోషలిస్టులు, ఫార్వర్డ్‌బ్లాక్ వారు ఈ అపూర్వ జనసమీకరణకు సంతోషించారు.

ఆంధ్ర కమ్యూనిస్టులు ఆంధ్ర కిసానుల విజయ వైఫల్యాన్ని ఆశించారు. వారిది 'పైచేయి' అని నిరూపించుకోవాలని చూశారు. ఇది వారి వైఫల్యానికి ముఖ్య కారణం. ఈ కారణంవల్లనే కిసాను కాంగ్రెసువారికి కమ్యూనిస్టు ఐక్య సంఘటనపై విశ్వాసం పోయింది.

విశాఖపట్నం, శ్రీకాకుళం జమీందార్లు ఈ మహాసభను జరగనీయకుండా చూశారు. ఎన్నో అడ్డంకులు కల్గించారు. మేము ఇది ఒక సవాలుగా తీసుకొని రైతు యాత్రను నిర్వహించాము.

స్థానిక పోలీసువారు జమీందార్ల పక్షం. రైతులతో చిన్న పెద్ద తగాదాలు పెట్టుకొనేవారు. రైతులు తగులబెట్టదలచిన బొమ్మకు వారనుజ్ఞ ఇవ్వలేదు. పోలీసులను కాదని కిసానులు ఈ బొమ్మను తగులబెట్టారు. పోలీసువారు ఈ జనబలం ముందు ఏమీ చేయలేకపోయారు. రెండు రోజుల తరువాత 'మందస' జమీందారీ రైతులు తిరిగి వెళ్తుండగా వారిపై కేసులు పెట్టారు. ఇవి కోర్టులో నిలువలేదు.

కిసాను గున్నమ్మ వీరమరణం

కిసానులు అడవిలోని కలపను దొంగతనం చేస్తున్నారని కేసు పెట్టారు. రైతులను అరెస్టు చేయాలని చూశారు. ఈ ఘర్షణలో కిసాను గున్నమ్మ సబ్‌కలెక్టరు పక్షపాతబుద్ధిని ప్రశ్నించింది. ఆమెను పోలీసులు కాల్చి చంపారు. ఆమె చివరి శ్వాస వరకు పోలీసులతో పోరాడింది. చాలామంది రైతులు ఈ కాల్పులలో మరణించారు. నాపై కోర్టులో కేసు పెట్టారు. ఈ కేసు కోర్టులో 'వీగి'పోయింది.

వేలాదిమంది రైతులీనాటికీ 'వీరగున్నమ్మ'కు అశ్రుతర్పణం విడుస్తుంటారు. జమీందారీల రద్దు వీరగున్నమ్మ మరణానికి గుర్తుగా మిగిలిపోయింది.

ఆమె సంవత్సరీకానికి భారతీదేవి వెళ్ళినప్పుడు లక్షమంది జనం అక్కడ పోగయ్యారు.

★ ★ ★

17. మా కుటుంబ జీవితం

1930 లో నా కాలేజీ ఉద్యోగానికి ఉద్వాసన చెప్పాను. 1946-47 లో భారతదేశపు అదృష్టం మలుపుతిరిగింది. ఈ 16 సంవత్సరాలు (1930-46) భారతీదేవి జీవితంలో ముఖ్యమైనవి.

మేము వ్యక్తిగత జీవితంలోనూ, ప్రజాజీవితంలోనూ ఇతరులకు మార్గదర్శకులుగా ఉండాలనుకున్నాము. మేమీ ప్రయత్నంలో చాలా బాధలుపడ్డాము.

1930 లో ఉద్యోగానికి రాజీనామా చేసి జాతీయోద్యమంలోనికి మేమిద్దరం దూకినప్పుడు మేము కొన్ని నిర్ణయాలు తీసుకున్నాము. భారతదేశంలో పూర్తి కార్యకర్తలుగా జాతీయోద్యమంలో పనిచేసేవారికి వారి సామాన్య జీవితావసరాలకు ఏవిధమైన ఆర్థిక సహాయం ఉండదు. గోపాలకృష్ణ గోఖలేగారి 'సర్వెంట్సు ఆఫ్ ఇండియా' వారు, శ్రీ లాలాలజపతిరాయ్‌గారి 'సర్వెంట్సు ఆఫ్ పీపుల్ సొసైటీ' వారు మాత్రమే సహాయం చేస్తారు. కనుక మేము మాకున్న కొద్దిపాటి భూవసతిమీదనే ఆధారపడ్డాము. 1930-34 లో వచ్చిన ఆర్థికమాంద్యం వలన మాకున్న ఆదాయం రూ. 250 నుండి రూ. 125 కు తగ్గింది. మద్రాసులో ఉండగా రూ. 1500 ఖర్చుచేసే మేము రెండు సంవత్సరాలలోనే మా ఖర్చును రూ. 125 కు తగ్గించుకోవలసి వచ్చింది. మా పెద్దలందరూ వద్దన్నా నిడుబ్రోలు ఊరి మధ్యలో ఉన్న ఇంటిని వదలి రెండు ఫర్లాంగుల దూరంలో జననివాసం లేని, గ్రామ రాజకీయాలకు దూరంగా ఉండే గొడ్ల కొష్టానికి మారాము. భారతీదేవి ఈ ఇంటికి మారటానికి మనస్ఫూర్తిగా అంగీకరించారు. అది ఒక తోట. రెండువైపుల మాగాణి. పాములు, తేళ్ళు, దోమలు, క్రిమికీటకాలు, పొలాలలో తిరిగే పిట్టలు ఉండేవి. అక్కడ నివసించటం ఆమెకు మరీ బాధాకరం.

నేను నా రాజకీయ ప్రయాణాలతో ఎక్కువ కాలం గడుపుతుంటాను. ఆమె మాత్రము 'పొద్దస్తమానం' అక్కడే గడపాలి. ఆనందంకన్నా బాధే ఎక్కువ. 1945 వరకు రోడ్డు వసతి కూడా లేదు. వర్షాకాలంలో ఈ దోవలో నడవడం ఇంకా బాధాకరం. చాలాసార్లు బురదలో జారిపడ్డాను. జయప్రకాశ్‌నారాయణ ఒకసారి వచ్చి ఈ అనుభవం ఈ జీవితానికి చాలు అనుకున్నాడు. దీనిని మేము 'గోభూమి' అని పిలిచేవాళ్ళం.

పడమటి వైపు వరండాలో ఒక గది మాత్రం భారతీదేవికి ఉండేది. ఎండా కాలంలో ఈ గది మరీ వేడిగా ఉండేది. ఉన్న పెద్ద హాలు మేము, మా కార్యకర్త లతో నిండి ఉండేది. తడికెలతో కట్టిన వంటగది ఒకటి ఉండేది. మద్రాసులో ఉన్న పెద్ద భవనాన్ని, ఊరి మధ్యలో ఉన్న ఇంటిని వదలి ఇక్కడ పంచలలో, హాళ్ళలో 1930 నుండి 1945 వరకు నివసించటం దేవీజీకి ఒక వీరోచిత కృత్యమే. ఈ నిరాడంబర జీవితానికి గాంధీగారే ఆదర్శం.

దొంగల భయం మాత్రం లేదు. జాలి, దయతో దొంగలు కూడా ఆమె ఉన్న చోటుకు వచ్చేవారు కాదు.

పాములంటే వాళ్ళ తండ్రి వెలగా సుబ్బయ్యగారికి ఏమాత్రం భయం లేదు. దేవీజీ కూడా అలాగే ఉండేవారు. 1948 లో ఒక విషపు పాము కరిచింది. అప్పటినుండి ఆమెకు పాములంటే భయం. మా వంటగది పైకప్పులో చాలా విషపు పురుగులు ఉండేవి. దేవీజీని ఇవన్నీ కుట్టుతుండేవి. ఆమె అనారోగ్యానికి ఇదే కారణమని డాక్టర్లు భయపడ్డారు. ఢిల్లీ, యూరోపులలో నివసించి వచ్చిన దేవీజీని ఈ పరిస్థితులలో జాతీయ నాయకులు కొండా వెంకటప్పయ్య గారు, కాశీనాథుని నాగేశ్వరరావుగారు, ప్రకాశంగారు, జయప్రకాశ్‌నారాయణగారు, ఇందూలాల్ యాగ్నిక్‌గారు, జె.వి.గారు, భరతన్ కుమారప్పగారు, వి.వి.గిరి గారు చూసి ఆశ్చర్యపోయేవారు.

నిరంతరం అక్కడకు వచ్చే విద్యార్థులకు, ప్రజా సేవకులకు, కిసాన్లకు, కళాకారులకు, శ్రమజీవులకు, యూత్ ఆర్గనైజేషన్లకు ఆమె వండి వార్చి భోజనాలు ఏర్పాటుచేసి, మరలా వచ్చి మా సంభాషణల్లో పాల్గొనటం ఒక గొప్ప అనుభవం.

వారి తండ్రిగారు వృద్ధాప్యంలో 1941 లో చనిపోయే వరకు కొన్ని సంవత్సరాలు ఇక్కడే ఉన్నారు. నేను ఈ రాజకీయాలలో దేశం పట్టుకు తిరగటం కన్పించేది. ఇంట్లో డబ్బులు ఉన్నాయా లేదా పట్టించుకోకపోవటంతో వారికి నా నిర్లక్ష్యమే కనిపించేది. భారతీదేవిని ఇక్కడ అడవిలాంటి ప్రదేశంలో వదలి నేను ఊళ్ళు పట్టుకు తిరగడం వారికి బాధగా ఉండేది. వారు మా (గాంధీగారి) సామాన్య జీవితానికి సానుభూతి ప్రకటించేవారు. నా ప్రజాసేవను, వారి కుమార్తె త్యాగానికి మురిసేవారు. చివరి రోజులలో వారు మా బాధలను పంచుకున్నారు.

మాంసాహారం పూర్తిగా మానివేశాం. బ్రాహ్మణ అతిథులను ఆహ్వానించడం తేలిక. మాకెవ్వరయినా భోజనాలు ఏర్పాటు చేయాలన్నా ఇబ్బంది ఉండదు. ఖద్దరు బట్టలు కాస్త ఖరీదే. సాధారణంగా ఖాదీ బహూకరణలు జరగవు. ఖద్దరు వస్త్రధారణ నాకు అన్నివిధాలా సరిపోయింది. భారతీదేవికి కూడా ఇదే ఇష్టం. మంచి మంచి డిజైన్లు నేయించుకొనేది. ఆమె ధరించే డిజైను చీరలకు డిమాండు కూడా ఎక్కువగానే ఉంటుంది. నాకు ఆమె చాలా హుందాగా, ఆకర్షణీయంగా కనిపించేది. ఈ బరువైన బట్టలతో ఎండాకాలమెట్లా గడిపేదో నాకనూహ్యం.

మా ప్రయాణాల్లో మేము మూడవ తరగతి రైలులోనూ, విడిగా బస్సులలోనూ ప్రయాణం చేసేవాళ్ళం. ఈ మూడవ తరగతి ప్రయాణం కాస్త బాధాకరమైనది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఈ రైళ్ళలో ప్రయాణాలు మరీ కష్టతరమయ్యాయి. జనసమ్మర్ధం ఎక్కువగా ఉండేది. ఈ విషయంలో ప్రభుత్వంవారితో చర్చించాను. రైల్వే వినియోగదారుల సంఘాల నేర్పరిచాను.

1935 లో దేవీజీ వ్యవసాయం చేయడం మొదలుపెట్టింది. రైతులతో ఎలా వ్యవహరించాలో ఆమె తెలుసుకోవాలి. నాజూకుతనం, సంస్కృతీ ప్రభావం మాత్రం ఆమెను వదలలేదు. రైతుల మాటలు, సామెతలు అన్నీ పట్టణాల నుండి పల్లెలకు వెళ్ళేవారు నేర్చుకోవాలి. ఆమె మాకున్న అప్పులు తీర్చటానికి కొంత పొలం అమ్మింది. పొలాల ధరలు రూ.3500 నుండి రూ.750 కు పడిపోయాయి. అప్పులవాళ్ళను పిలిచి 6 శాతం వడ్డీతో వాళ్ళ బాకీలు తీర్చింది. ఆమెకున్న బంగారు ఆభరణాలు కూడా అమ్మింది.

1934 లో సెంట్రల్ అసెంబ్లీకి ఎన్నికలు వచ్చాయి. డబ్బులు లేవు. "ఆయన దగ్గర డబ్బులు లేవు. ఆయన పోటీచేయలేడు" అని అందరూ అంటున్నారు. అప్పు ఇచ్చే నాథుడు కరువైనాడు. మా చెల్లెలు లక్ష్మీదేవి తన బాధ్యతమీద బయట అప్పుచేసి, నన్ను కాంగ్రెసు కాండిడేటుగా నిలబెట్టింది. ఈ సంఘటన దేవీజీ హృదయంలో బలంగా నాటుకుంది. ఈ బాకీ తీర్చటానికి నాకు ఆరు సంవత్సరాలు పట్టింది. నేను ఢిల్లీలోని కాంగ్రెసు సమావేశాల ద్వారా వచ్చే డబ్బును అక్కడ నా ఖర్చులు పోగా మిగతాది నా ప్రయాణాలకు, బాకీల వాయిదాలకు, ప్రజాజీవితానికి ఖర్చుపెట్టేవాడిని. భారతీదేవి ఇక్కడ పొలంపై వచ్చే ఆదాయం ఈ గోభూమిమీద, ఇక్కడ అప్పులు చెల్లువేయటంమీద ఖర్చు పెట్టేది.

ఇన్నాళ్ల బాధల తరువాత ఆమె గోభూమిపైన ఒక అంతస్తు వేస్తే ఎలా ఉంటుందని జైలులో ఉన్న నన్ను అడిగింది. అప్పుడు మధ్యప్రదేశ్ జైలులో ఉన్నాను. ఈలోపల ఆమె నరాల బలహీనతతో మంచంపట్టింది. నేను ఇల్లు కట్టటానికి నా అంగీకారం తెల్పాను. 1951 లో పై అంతస్తు నిర్మాణం పూర్తి అయింది. 'పాలు పొంగించటం' వంటి కార్యక్రమాలు ఏమీ లేకుండానే కొత్తగా కట్టిన ఇంట్లోకి ప్రవేశించాము. ఈవిధమైన కార్యక్రమాలు రైతులనింకా అప్పుల ఊబిలోకి దించుతాయి.

ఇది చాలదన్నట్లుగా ఆమె, గోగినేని లక్ష్మీనారాయణ నా నికర వ్యవసాయ ఆదాయంలో నాలుగో వంతు జాతీయోద్యమానికి ఖర్చుపెడ్తున్నారు. వాహినీ పత్రిక అప్పటికే మద్రాసులో అప్పులతో నడుస్తున్నది. ఈ బాకీలు కూడా వారే తీర్చటానికి సిద్ధమయ్యారు.

ఢిల్లీలో, సిమ్లాలో అసెంబ్లీ సెషన్సులో చాలా పొదుపుగా ఉండేవాళ్ళం. ఈ పొదుపు కోసమే నేను 'కారొనేషను' హోటలులో సిమ్లాలో ఉండేవాడిని. జాతీయోద్యమంలో నాతో కలసి పనిచేసినవారుగాని, ఇతర దేశసేవకులు గానీ 'రంగా' ఇంత పొదుపుగా ఎలా జీవిస్తున్నాడు? ఆక్స్‌ఫర్డ్ జీవితానికి అలవాటుపడ్డ రంగా ఈ ఐచ్ఛిక దారిద్ర్యాన్ని ఎలా భరిస్తున్నాడు అని ఆశ్చర్యపడేవారు. బాపూకు కొంతమంది ద్వారా ఈ పొదుపు విషయం తెలిసింది. అందుకని వారు నాకు

చాలాసార్లు ఆర్థిక సహాయం చేస్తానని అనగా నేను నాక్కావలసిన దానికన్నా అధికంగానే ఉన్నదని, దేవీజీ పొదుపు నాకు శ్రీరామరక్ష అని చెప్పే వాడిని. వారు చాలా సంతోషించేవారు. భారతదేశ సమాజంలో బిడ్డలు లేనివారు వారి బంధువుల పిల్లలను పెంచుకుంటారు. నా బంధువులు నన్నెవ్వరూ ఇబ్బంది పెట్టలేదు. మా బాధ్యతలమీద వారు కూడా దృష్టి పెట్టారు. భారతీదేవి ప్రతి పైసాను ప్రజల కొరకు బాధ్యతతో ఖర్చుపెట్టేది.

భారతీదేవి ఆమె చెల్లెలు కుమార్తెను, సుశీలాదేవి, పుష్ప, బుజ్జి అనే ఆమె సోదరుని కుమార్తెలను గోభూమిలో ఉంచి మా ఊరి హైస్కూలులోనే చదివించేది. వారికేనాడు ఖరీదైన బహుమతులు ఇవ్వలేదు. వారు కూడా ఆశించలేదు. నా తమ్ముళ్ళకు చాలామంది పిల్లలున్నారు. కానీ వారు కూడా ఏనాడూ మానుంచి ఏమీ ఆశించలేదు. వారికి మా ధన్యవాదాలు చెప్పాలి. ఘంటశాల, గోవాడ, బుర్రిపాలెంలోని కొన్ని రైతు కుటుంబాలు మాకు ఖద్దరు బట్టలు పెట్టేవి. మా పర్యటనల్లో చాలా రైతు కుటుంబాలు ఇదేవిధంగా చేసేవారు. ఈ ప్రజల అనురాగం మా మనస్సుల్లో ఎప్పుడూ ఉంటుంది.

రైతులు డబ్బులకు పడే ఇబ్బందులు నాకు తెలుసు. వారు ప్రజాజీవితానికి డబ్బు ఖర్చు పెట్టలేరు. అందుకని నేనెంతో అవసరమైతేనే వారి దగ్గర డబ్బు చందాల రూపంలో తీసుకొనేవాడిని. సమావేశాల ఏర్పాట్లకు, వాహిని, జమీన్ రైతు పత్రికల చందాలు మాత్రమే తీసుకొనేవాడిని. మా ఉద్యమం ఉధృత మవుతున్న సమయంలో ప్రజలు నాకు పర్సుల రూపంలో చిన్న చిన్న మొత్తాలను ఇవ్వసాగారు. నేను ఈ డబ్బును యువకుల కార్యక్రమాలకు, నేతపనివారి, కిసానుల సమావేశాలకు ఖర్చుపెట్టేవాడిని. ఈ డబ్బును నేను స్థానిక కార్యకర్తలకు ఇచ్చేవాడిని. ప్రజలు తమ డబ్బు మరలా తమకే ఖర్చు అవటంతో సంతోషించే వారు. ఈ డబ్బును నేను జమీన్‌రైతు, వాహిని పత్రికలకు కూడా ఉపయోగించే వాడిని. 'నిడుబ్రోలు' రైస్‌మిల్లర్లు ఈ కార్యక్రమంలో ముందుండేవారు.

భారతీదేవి, నా సామాన్య జీవితం చూసిన తరువాత రైతులలో మాపై విశ్వాసం పెరిగింది.

★ ★ ★

18. అందం-బ్రహ్మానందం

నా పర్యటనలన్నీ కూడా అంతగా శ్రమతో కూడుకున్నవి కావు. చాలావరకు నా సాంస్కృతిక విద్యకు, మానసిక తృప్తికి కారణాలు. నేను యూరోపులో పేరుగాంచిన 'చర్చి'లను, అసెంబ్లీ లేక పార్లమెంటు భవనాలను, చిత్రప్రదర్శన శాలలను, అందమైన ప్రదేశాలను చూచినప్పుడు, భారతదేశంలోని చూడదగిన సుందర దృశ్యాలను, సాంస్కృతిక, చారిత్రక ప్రదేశాలను నా సంచార కార్యక్రమంలో ఒక భాగంగా చూచేవాడిని. భారతదేశంలోని నాగరికత విలువలను గ్రహించేవాడిని. "చాలామంది యూరోపులో చదివిన భారతీయ యువకులు భారతదేశ చరిత్ర, సాంస్కృతిక విజయాలపైన, రాజకీయాలపైన అవగాహన తక్కువగా ఉన్నవారే. వారికి ఐరోపా నాగరికతను గురించి తెలిసినంతగా భారత దేశ నాగరికత తెలియదు" అని తన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా'లో నెహ్రూగారు వ్రాసినది యదార్థమే.

మా అమ్మ మంగమ్మ, ఆంజనేయులు, వెంకయ్యగార్ల సహచర్యం, 1908-1929 వరకు జాతీయోద్యమం వలన ఈ దేశంలో వచ్చిన రాజకీయ మార్పులు, రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, స్వామి రామతీర్థ, తిలక్, గాంధీల ఆలోచనల ప్రభావం నామీద ఉండటం నా అదృష్టం. నేను భారతదేశాన్ని గురించి చదివింది కూడా తక్కువే.

నేడు అందంగా అమెరికావారు ఎంతో గర్వంగా కొండలపైన చెక్కించిన శిల్పాలు - ఏకశిలా నిర్మాణాలయిన ఏడు పగోడాలు, ఎలిఫెంటా గుహలు, లేపాక్షి అనంతుడు, శయ్యాగతుడయిన బ్యాంకాక్ బుద్ధుడు, పొలనువాడ, అజంతా శిల్పాలు, కామకూర-శ్రావణబెళగొళలోని బౌద్ధ జైన విగ్రహాలకు సాటిరావు.

యూరోప్ పర్యటనలో వారి సంస్కృతీ, నాగరికతలను, అలవాట్లను తెలుసుకున్నాను. కళాకేంద్రాలు, చిత్రప్రదర్శనలు, పెద్ద పెద్ద చర్చీలను చూశాను. నాకు 1930 వరకు భారతదేశపు కళలు, శిల్పాలు, సాంస్కృతిక విజయాలపై అవగాహన తక్కువగా ఉండేది. నేను భారతదేశపు శిల్పాలు, కళలను గూర్చి ఎక్కువగా నేర్చుకోవలసి ఉంది. 'హవెల్స్' పుస్తకాలు కళలను నాకు పరిచయం చేశాయి. 1931 లో లేపాక్షి దేవాలయ (విరూపాక్ష దేవాలయం) లోకప్పులపై చిత్రాలను చూచేటంతవరకు, ఆల్బర్ట్ (లండను) మ్యూజియంలో ఉన్న మొగలుల చిత్రాలే గొప్ప అన్న అభిప్రాయంలో ఉండేవాడిని. రవివర్మ చిత్రాలు నన్ను ఆకర్షించలేదు. 1937 లో నేను భారతదేశంలోని అజంతా గుహలను సందర్శించాను. ఇటాలియన్ చిత్రకారుడు మైకేల్ ఆంజిలియో చిత్రాలను రోమన్ చర్చీలలో చూశాను. మైకేల్ ఆంజిలియో జీవితంలోని అద్భుతాలను అడిగి తెలుసుకున్నాను. దేవిజీ అజంతా చిత్రాలకు చాలావరకు ప్రతిచిత్రాలు రచించింది.

అజంతా చిత్రాలు రంగులలో, వంపులలో, అనుభవంలో, మూర్తులలో, సున్నితమైన భావప్రకటనలో, అందంలో అంతర్జాతీయంగా పేరుగడించాయి. ఇటువంటి చిత్రాలను నేను 'సిరిగురి' (సిలోను) లో చూశాను. ఇలాంటివాటినే జపాను, థాయిలాండ్, ఇండోనేసియా, బర్మా, మలబార్, హిమాలయాలలో చూశాను. ఈ బౌద్ధచిత్రాలు అంతర్జాతీయ స్థాయికెదిగినవి.

మొగలుల మసీదులు, గోరీలు, కోటలు, ఉద్యానవనాలలో, భారతీయ కళల్లో కన్పించే సాంప్రదాయాలు నన్ను ఆనందపరవశుణ్ణి చేశాయి. తాజ్‌మహల్,

---

1. ఏడు పగోడాలు – మహాబలిపురం.
2. ఎలిఫెంటా గుహలు – బొంబాయి.
3. లేపాక్షి అనంతుడు – లేపాక్షిలోని విరూపాక్ష దేవాలయంలో గల ఏడు తలల సర్ప విగ్రహం.
4. బ్యాంకాక్ – కామకూర – జపాను బుద్ధ విగ్రహం.
5. శ్రావణబెళగొళ – మైసూరు – బాహుబలి దిగంబరమైన విగ్రహం.

కొండలపై చెక్కిన శిల్పాలు – జార్జి వాషింగ్‌టన్, థామస్ జెఫర్‌సన్, అబ్రహాం లింకన్ విగ్రహాలు చెక్కించారు. అవే ఇవి కావచ్చు.

జుమ్మా మసీదు ప్రపంచ ఖ్యాతి చెందినవి. తెల్లతెల్లని గోపురాలు, ప్రకృతి దృశ్యాలకు వన్నెతెచ్చినవి. కన్నాట్‌ప్లేస్‌లో (ఢిల్లీలోని కూడలి) నిలుచుని ఎన్నిసార్లు జుమ్మా మసీదు అందాలను చూశానో! సర్ లూటెన్స్‌కు (ఢిల్లీ రూపశిల్పి) ఎన్ని అభినందనలు తెల్పినా తక్కువే. వారు నిర్మించిన ఈ కొత్త నగరం లలితమై, సుందరంగా ఉంది.

భువనేశ్వర్ (దక్షిణ భారతదేశం) లోని దేవాలయాల ఔన్నత్యం, దృశ్యసంపద, శిల్పకళాభినివేశం సాటిలేనివి. మనలో చాలామంది చెప్పలేనివాటిని ఆనంద కుమారస్వామి చెప్పాడు. ఈ దేవాలయాలు భారతీయ సంస్కృతీ భాండాగారాలే. రామేశ్వరం, మధుర, శ్రీరంగం, కాంచీపురాల్లో చెక్కిన సింహాల వరుసలు, వివిధ అవతారాలు మనస్సుల నూపుతాయి. కపాలేశ్వరం, తిరువత్తూరు, శ్రీరంగం, తిరుచినాపల్లి, కంచికామాక్షి కొలువైన కాంచీపురం (కంజీవరం), మధుర మీనాక్షి నిలిచిన మధురలోని సమున్నత శిఖరాలను, మరలా మరలా చూచి, రాళ్లలో రతనాలు చెక్కిన విశ్వకర్మల పనితనానికి ఆనందపరవశుడ నైనాను. శిల్పాలుగా చెక్కటానికి ఎంతో ఎత్తుకు ఈ రాళ్లను మోసిన శ్రామికులకై నా హృదయం ద్రవిస్తుంది. నా ఆంధ్రదేశం కూడా ఈ విన్నాణాలలో మిన్నే. హనుమకొండ, వరంగల్లు, రామప్పల కాకతీయ శిల్పాలు, హంపీ, నెల్లూరు, పెనుగొండ, తాడిపత్రి, ఒంటిమిట్ట, సింహాచలం దేవాలయాలలో మన విశ్వ బ్రాహ్మణులు దిద్దిన అందాలు చోళ, చాళుక్య సాంప్రదాయాలకు గీటురాళ్లు. వైవిధ్యంలో ఏకత్వం తెలియజెప్పే భారత నాగరికతకు ఇవి ఉదాహరణలు. మైసూరులోని హలిబేడు, మేల్కోటేలలో కాకతీయ శిల్పం కన్పిస్తుంది.

గ్రీకు విగ్రహాల అందాలను, రోమన్ విగ్రహాల గొప్పదనాన్ని, సర్ జాకోబ్ ఎప్‌స్టీను (ఇంగ్లీషు శిల్పి) సమస్యాత్మక విగ్రహాలను చూశాను. వందలకొలదిగా ఉన్న నందులను, వేలకొలదిగా ఉన్న అప్సరసల విగ్రహాలను, ఏనుగులు, గుఱ్ఱాలను, శిలోపరితలాలపై చెక్కిన శిల్పాలను, వాటి నిండుతనాన్ని చూచి నివ్వెరపోయాను. మంగళగిరిలోని రాజ్యలక్ష్మీదేవిని, సితాబ్జ ప్రకాశమైన వివేకానంద కాలేజి మద్రాసులోని సరస్వతీదేవిని, ఒంటిమిట్టలోని జగన్మోహన మయిన శ్రీరామ విగ్రహాన్ని, శ్రీరంగంలోని రంగనాథుణ్ణి, అలౌకిక ఆనందప్రదాత

అయిన పొన్నూరు భావనారాయణస్వామిని, సారనాథ్ బుద్ధ విగ్రహాన్ని, వీటి అందాలను చూచి, ఆ నిగారింపులను చెక్కిన విశ్వకర్మల అసమాన చాతుర్యానికి ఆశ్చర్యచకితుడనయ్యాను. ఈమధ్యనే (1965) కన్నడ-తెలుగు సినిమా అమరశిల్పి జక్కన, హిందీ సినిమా 'గీత్‌గయా పత్తరోం'లనే చలనచిత్రాలు ప్రదర్శించబడినాయి.

బుద్ధ విగ్రహాలలోని జీవకళను, అందాన్ని అనుభవించాను. పాశ్చాత్య దేశాలలో వీటికి దీటైన విగ్రహాలనెక్కడయినా చూడగలమా? ఉత్తర భారతదేశంలో ముస్లింలు విరుగగొట్టిన విగ్రహాల అందాలను నిర్వచించగలమా? మద్రాసులోని సెయింట్ థామస్ కాథడ్రెల్, బేలూరులోని రామకృష్ణ మఠం, న్యూఢిల్లీలోని శ్రీనారాయణ దేవాలయం మనస్సులకు ఊరట కల్గిస్తాయి.

ఈమధ్యనే (27-1-1958) వరంగల్లు 'వేయి స్తంభాల మంటపము', కోట, రామప్ప గుడులను చూశాను. ఇవి 12, 13వ శతాబ్దపు కాకతీయ యుగ నిర్మాణాలు. ఇవి నిన్నటి మొన్నటి శిల్పాలుగా కనబడతాయి.

అద్భుతమైన కాకతీయ రాతి తోరణాలు సాంచీలోని తోరణ శిల్పాలకు ఏమీ తీసిపోవు. కృష్ణా, గోదావరి ప్రాంతాల శిల్పులు ఈ చోళుల దేవాలయాల ప్రాంతాలయిన తంజోర్ (తంజావూరు), మధుర, మేల్‌కోటె, కాంచీపురాల్లో నివసించి ఉంటారు. హంపీ, పెనుగొండ, తాడిపత్రి, వెల్లూరు, మేల్‌కోటేలలోని శిల్పులు కాకతీయ శిల్పాల నుండి నేర్చుకొని ఉంటారు.

తిరుపతిలో తన దేవేరులతో కూడిన కృష్ణదేవరాయల కాంస్య విగ్రహాలు అద్భుతమైన చరిత్రాత్మక నిర్మాణాలు. మన చరిత్రకు సాక్షీభూతాలు. అభిషేక వేళలో వేంకటేశ్వరస్వామి దయామృత తరంగాలు సకల ప్రాణికోటిపై వర్షిస్తూ ఉంటాయి. వరంగల్లు శిథిలాలలోని గణపతిదేవుని శిరస్సు ఆనాటి కాకతీయ శిల్ప నిర్మాణానికి మచ్చుతునక.

శతాబ్దాల ఈ సజీవ శిల్పాలు 1955 లో నేను 'డాన్-వోల్గా' నది ఒడ్డున చూచిన స్టాలిన్ బృహద్విగ్రహాన్ని మించినవి. ఏకశిలా నిర్మాణాలయినవి. సప్త దేవాలయాలు (సెవెన్ పగుడాలు), ఎలిఫెంటా గుహలు, లేపాక్షిలోని అనంతుడు

(విరూపాక్ష దేవాలయం), శయ్యాగతుడైన 'బాంకాకు' పొలనువాడ, అజంతా, 'కామకూర', శ్రావణబెళగొళలోని ఉపవిష్ట బుద్ధులలోని 'తేటదనం'తో కొండకొమ్ములపైని శిల్పాలకు నేడు అమెరికన్లు ఎంతో గర్వంగా భావించే వారి శిల్పాలు సాటిరావు.

నా అభిరుచికి కారకులయిన కీ.శే. అడవి బాపిరాజుగారికి, డా॥ సత్య నారాయణగారికి, లింగం వీరభద్రయ్యచౌదరికి, భారతీదేవికి, చిత్రలకు నా ధన్యవాదాలు.

బాపు భారత గృహిణుల నిజమైన అందాలను, పూరిగుడిసెలలోని సామాన్యతను నాకు నేర్పారు.

గతం–వర్తమానంతో ఎలా కలిసిపోతుందో ఇప్పటికీ నాకు అర్థంకాదు. మొహంజొదారో, ఏథెన్సు, రోమ్, అలెగ్జాండ్రియా, ఢిల్లీ, లండను, పారిస్, వరంగల్లు, కంచి, శ్రీకాకుళం వంటివి అక్కడనే మరల మరల నిర్మించబడటానికి కారణాలేమిటి? పదో, అంతకు ఎక్కువో నగరాలు 'ఇంద్రప్రస్తం' వద్ద ఎందుకు కట్టబడ్డాయి? ఈ శ్మశానాలనే వారెందుకు ఎంచుకున్నారు? విద్యార్థులు, విజ్ఞానులు ఏథెన్సు నగరాన్నే ఎందుకు చూడాలనుకొంటారు? సోక్రటీసు, పెరిక్లీసు, ప్లాటో, అరిస్టాటిల్‌ల వంటి మేధావులు రోమ్ నగరాన్ని, గర్విష్ఠులైన సామ్రాజ్యాధినేతలను, రక్తదాహంతో ఉన్న ప్రేక్షకులను ఆనాటి దర్శనాస్థలాల్లో ఎందుకు చూచేవారు? భ్రాతృ హత్యలతో నిండిన కురుక్షేత్రానికి ఇన్ని వేల ఏండ్లుగా భారతీయులెందుకు ఆకర్షించబడ్డారు? వీటికి సరైన సమాధానం నావద్ద లేదు. మనిషికి సంతృప్తి ఎక్కడ? వారి బలంలో, గొప్పదనంలో, ధనంలో, అధికారంలో, ఆడంబరాలలో, కోర్కెలలో, పేరులో, అనుయాయులలో, చిరంజీవత్వంలో లేక చావులో లేదు. గొప్పవారందరూ వారి కోర్కెలను అణచుకున్నారు. ఇతరుల బాధలను పోగొట్టటానికి ప్రయత్నించారు. ఇతరుల సంతోషంలో తమ సంతోషాన్ని చూచుకొన్నారు. ఈ దేవాలయాలలో, చర్చీలలో, మసీదులలో, లైబ్రరీలలో, యూనివర్శిటీలలో ఉన్న అన్నీ మానవ విజయాలకు, సంతోషాలకు దారి చూపేవిగా భావించారు. భారతీయ కళాకారులందరూ తమ కృషితో మానవ సౌభాగ్యానికి బాటలు వేశారు. వీరిపట్ల నాకు భక్తి ఎక్కువ.

ఈ శిల్పులు విగ్రహాలకు ఇన్ని చేతులు, తలలు ఎందుకు చెక్కుతారనేది నాకు అర్థంకాని విషయం. క్రమేపి భరతనాట్య భంగిమలను అర్థంచేసుకున్నాను. వీటిలోని సహజత్వం నాకు బోధపడింది. స్టాక్ సోదరీమణులు నాకు బహూకరించిన నటరాజ విగ్రహానికి ఎదురుగా నా ముస్లిం మిత్రుడొకరు కూర్చొని 'లైటు'ను కదిలిస్తూ, చీకటిగదిలో, ఒక భంగిమలో నాలుగు చేతులకు మారుగా రెండు చేతులే కన్పిస్తున్నాయి అని చెప్పాడు. ఢిల్లీలో 1957 లో అంతర్జాతీయ ఛాయాచిత్ర ప్రదర్శనలో ఒక ప్రఖ్యాత నాట్యకత్తె విన్యాసాలలో ఇరవైకి మించి కాళ్ళను చాలా చమత్కారభరితంగా చూపించారు. నా ఈ అనుభవాలకు ముస్లిం సోదరులు, క్రైస్తవ సోదరులు సహకరించారు. అత్యంత విలాసంగా నృత్యం చేస్తున్న ఒక అప్సరస విగ్రహాన్ని ఒక నాస్తిక మిత్రుని ఇంట్లో చూశాను. అతను ఒక గ్రామీణ మూఢభక్తునిలాగా ఆ విగ్రహానికి అంకితమయ్యాడు.

ఇది ఎలా జరిగింది? వివిధ భంగిమలలో నటరాజ విగ్రహాలున్నాయి. అవి సంపూర్ణ కళాకృతులు. అందాలకు చిహ్నాలు. రష్యన్ల 'బాలే' (సంగీత నృత్య రూపకం) లో వారి అందాలను చూడవచ్చు. మనోమయ జగత్తులో చలనము, స్వతంత్రత, మనశ్శక్తి, ఏకాగ్రతలు ఈ నటరాజ విగ్రహాలలో ద్యోతకమవుతాయి. నేను చిదంబరం, తంజావూరులోని ఈ విగ్రహాలను చూశాను. ఒక సమ్మోహనకరమైన నటరాజ విగ్రహం మా 'గోభూమి'లో ఉంది. బర్మా నుండి తెచ్చిన బుద్ధుని కాంస్య ప్రతిమ, ఒక దంతపు విగ్రహము, కృష్ణుడు, రుక్మిణిల విగ్రహాలు నా మనస్సుకు శాంతిని, ఆనందాన్ని కల్గిస్తాయి.

నా పర్యటనల వలన నేనీదేశపు 'వేదాంతాన్ని' వంటబట్టించుకున్నాను. ధర్మాచరణ, సత్యానుసరణ, జీవులపై దయ, సేవ, స్వతంత్రతలో నమ్మకం, పవిత్రతలు గొప్పవిగా గుర్తించాను. మొగలాయిల కోటలు, చక్రవర్తుల రాజ్యాలు చరిత్రలో కలిసిపోయాయి. దేవాలయాలు దోపిడీ చేయబడి మట్టిలో కలిశాయి. భగవద్ధ్యాస, అమృతత్వం, శ్రమజీవుల ఆశలు – ఈ విశ్వకర్మల నిర్మాణాలలో చిరంజీవత్వం పొందాయి.

★ ★ ★

19. పర్యటనానుభవాలు

1933 నుండి 1967 వరకు గ్రామాల్లో పర్యటించేవాడిని. ప్రతి జిల్లాలో ఒక రోజు ఈ పర్యటన సాగేది. ఏ గ్రామానికీ నాలుగు సంవత్సరాలలో రెండు సార్లుకన్న ఎక్కువ వెళ్లేవాడినికాదు. ఉదయం 7 గం.ల నుండి రాత్రి 1 గం. వరకు ఈ పర్యటన సాగేది. ప్రజలను కలుస్తుండేవాడిని. ఒక్కొక్క సమావేశం అరగంట నుండి గంట వరకు సాగేది. 1939 వరకు మైకు ఆవశ్యకత లేదు. నేను సభలోని యువకులను మాట్లాడమని కోరేవాడిని.

స్వాగత పత్రాలు ఇచ్చేవారు. రైతు ఉద్యమానికి నేను, నా తోటివారు చేస్తున్న సేవలను గుర్తుచేసేవారు. ఈ సభలలో బాండుమేళంగానీ, సన్నాయిగానీ ఉండేది. ఉత్సాహవంతులైన ప్రజల మధ్య చాలా హుషారుగా గడిచేది. ప్రజల బీదరికం, అసహాయత నన్ను ఎక్కువగా బాధించేవి. ఈ సభలలో వయోజనవిద్య, చరిత్రను చెప్పేవాడిని. వారిని సంఘ నిర్మాణానికి ప్రోత్సహించేవాడిని.

ఈ సమావేశాలు ప్రజలకు ధైర్యాన్నిచ్చేవి. అధికారాన్ని, సృజనను తెలియ చెప్పేవి. సాంఘిక అవగాహన, మానసిక ధైర్యం ఆధ్యాత్మికావేశాన్ని కలిగించేవి. రైతు ఉద్యమంలో పెద్దలందరినీ చేరమనేవాడిని. 5-10 రోజుల ముందునుండే వారీ విషయాలను చర్చించుకునేవారు. నా ఉద్యమానికి ఈ పర్యటనలు ఊపిరి.

1935 నుండి ఇతర రాష్ట్రాలలో నా పర్యటనలు మొదలయ్యాయి. వసంత కాలంలో పంజాబులో పర్యటించాను. లాయిల్‌పూర్, జలంధర్, లాహోర్, అమృతసర్ ప్రాంతాలలోని గ్రామాలలో నా పర్యటన సాగింది. వారి పంజాబీ భాష నాకేమీ అడ్డుకాలేదు. శీతాకాలంలో తమిళనాడు, మలబారు (కేరళ)

లలో పర్యటించాను. రైతు నాయకునిగా స్థానిక పత్రికలకు, కాంగ్రెసు పెద్దలకు నేను పరిచితుడనే.

లాహోర్‌లో లాలాలజపతిరాయ్ భవన్‌లో కొన్నాళ్లున్నాను. లజపతిరాయ్‌గారు స్థాపించిన 'సర్వెంట్సు ఆఫ్ ది పీపుల్' (ప్రజా సేవకుల సొసైటీ) వారు నిమగ్న మయిన కార్యక్రమాలు చూశాను. *(రంగాగారు తాను రైతాంగ విద్యాలయాన్ని స్థాపించటానికి ఈ సొసైటీ ఒక కారణమని వేరేచోట వ్రాశారు).*

శ్రీ మోహన్‌లాల్‌గారిని చూశాను. నా మొదటి ఇంగ్లీషు ప్రచురణ 'ఎకనామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా' (ఇండియాలో ఆర్థిక సంస్థ) 1929 కు, సమీక్ష వ్రాసినది వీరే అని తెలుసుకున్నాను. లాలాలజపతిరాయ్‌గారు అస్పృశ్యతా నివారణ కొరకు పాటుబడినవారిలో ఎన్నదగిన నాయకుడు.

1936 లో తిరిగి ఆంధ్ర, తమిళనాడు, మలబార్, కర్ణాటక, పంజాబులలో పర్యటించాను. చాలామంది కాంగ్రెసు సోషలిస్టు పార్టీవారిని, కాంగ్రెసువారిని కలిశాను. బెంగాల్, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్‌లలోని కాంగ్రెసువారిని కలిశాను. 'ఆల్ ఇండియా కిసాన్ సమ్మేళన్'ను ప్రారంభించటానికి వారి సహాయం అర్థించాను. ఫైజ్‌పూర్‌వారి ప్రజా ప్రదర్శనను చూశాను. వారిని జవహర్‌లాల్‌నెహ్రూ గారికి పరిచయం చేస్తూ "వీరు గంగా-యమున ప్రవహించే ప్రాంతానికి చెందిన శ్రామికులు. కాంగ్రెసువారు వీరికి చేదోడు-వాదోడుగా ఉండాలి" అని చెప్పాను.

1938 లో హరిపురా (గుజరాత్) లో ఇటువంటి ప్రదర్శనే జరిగింది. సుభాష్‌బాబు దీనిని స్వాగతించారు. తమిళనాడులోని 'రాజుపాళెయం' అనే పెద్ద గ్రామంలో జరిగిన సభకు అధ్యక్షత వహించాను. (ఆంధ్ర నుండి వెళ్ళిన క్షత్రియుల ఊరు. ఈనాటికీ వారు చక్కని తెలుగు మాట్లాడుతారు. తెలుగులో విద్యాబోధన కూడా ఉంది. ఈ గ్రామం 'శబరిమలై' వెళ్ళే త్రోవలో ఉంది.) ఈ సభకు సుభాష్‌బాబు ప్రత్యేక సందేశాన్ని పంపారు. (నూరు ఆరు వర్షాలయింది. అని. ఈనాడు (30 ఏళ్ళ క్రితం) వచ్చిన రాజులు చెప్పారు.)

1937, 38, 39 సం॥లలో రాజస్థాన్, హైదరాబాద్, మైసూరు, ఒరిస్సా, తూర్పు బెంగాల్, అస్సాం, బీహార్, యు.పి., మధ్యప్రదేశ్‌లలో నా పర్యటన

సాగింది. కాన్పూరు జిల్లాలో నాతోపాటు భారతీదేవిగారు పర్యటించి, కిసాను మహిళల సభలో మాట్లాడారు.

నన్ను కిసాను రాష్ట్రపతి అని, రైతు ఉద్యమనేత అని ఈ పర్యటనలో పిలువ సాగారు.

శ్రీమతి కమలాదేవి చటోపాధ్యాయ పిలుపుతో దక్షిణ కెనరా రాష్ట్రంలో 1938లో పర్యటించాను. 1933లో వారు నా మొదటి రైతు యాత్రను చూశారు. అయిదు రోజులపాటు నాతో పర్యటించి నన్ను కిసాను నాయకునిగా ప్రతిచోటా పరిచయం చేశారు. ఆమె కిసానుల-కళాకారుల స్నేహితురాలు. కర్ణాటకలో వర్షాలు అధికంగా ఉండేవి. వర్షాకాలంలో కర్ణాటక అందాలు చూడవలసిందే. ఏకశిలా నిర్మాణమైన ప్రసిద్ధ 'గోమతేశ్వరుని' చూశాను. 1957 లో 'శ్రావణ బెళగొళ'లో 'మహావీరుని' విగ్రహాన్ని నేను, భారతీదేవి చూశాము.

తమిళనాట రైతులు ప్రత్యేకంగా ఉంటారు. వారందరూ వరుసలో ఈ సభలకు హాజరయి, నన్ను అభినందించి, సన్మానపత్రాన్నిచ్చి అంతే వేగంతో దిగిపోతారు. సభలలో నిశ్శబ్దం పాటిస్తారు. రాజాజీగారు, నేను మా 1959-1963 లలో పర్యటించినప్పుడూ వారీవిధంగా క్రమశిక్షణతోనే మెలిగారు.

పంజాబులో సిక్కులు జలంధర్, రోహటక్ జిల్లాలవారు ఎర్రని తలపాగాలతో, అందమైన ముఖాలతో ఈ సభలలో పాల్గొనేవారు. జతేదార్ యన్.నగోకిగారి నాయకత్వం నాలో ధైర్యాన్ని నింపింది. స్వతంత్ర పార్టీ ఏర్పాటుచేసినప్పుడు వీరందరూ నాతోనే ఉన్నారు. "నేను విశ్వామిత్రుణ్ణి. రంగాను రామచంద్రుని వలె తయారుచేస్తాను" అన్న రాజాజీ మాటలకు వారు ఎంతగా సంతోషించారో!

బెంగాలులోని రైతులను భూస్వాములు అణగద్రొక్కారు. వారి బీదరికం కొట్టవచ్చినట్లు కన్పిస్తుంది. వారి 'గుడిసెలు' కేరళలోని గుడిసెలలాగా నిశ్శబ్దపు అందాలను తొణికిస్తాయి. కొబ్బరి, అరటి, ధాన్యం పంటలతో 'ప్రకృతి' అందాలతో నిండి ఉంటుంది. భావావేశంతో వారు పాడే గీతాలు మా సభలను పునరుజ్జీవింపజేసేవి. బెంగాల్ సోదరీమణులు, మాతృమూర్తులు మాకు ఆహ్వానం పలికేవారు.

మహారాష్ట్రలోని రైతులు (మన రాయలసీమ రైతుల్లాగా) సన్నగా, కొంత ఎత్తు తక్కువగా ఉంటారు. వారు 'కదం' త్రొక్కుతుంటే తమిళియన్ల వలె కన్పిస్తారు. వాతావరణంతో నిరంతరం పోరాటమే. బాకీలవాళ్ళు అధిక వడ్డీలు వారి దగ్గర గుంజుతుంటారు. గాంధీగారితో ఇవన్నీ చెప్తుండేవాడిని. ఈ రైతుల పూర్వీకులందరూ అలెగ్జాండరు, మహమ్మదీయులు, మొగలులకు వ్యతిరేకంగా శివాజీ, రాణాప్రతాప్, రంజిత్‌సింగు, కాకతీయులు, విజయనగర పాలకులతో, నాయకులతో భుజాలు భుజాలు కలిపి పోరాటం చేశారు. వీరు షావుకార్లకు, మతబోధకులకు, ప్రభుత్వ ఉద్యోగులకు ఎదురు నిలిచారు.

1935 వరకు కిసాను మజ్దూర్ పార్టీ (రైతుకూలీ పార్టీ) నా ఆదర్శం. తరువాత డెమొక్రటిక్, కిసాను, మజ్దూర్, కళాకార్, బుద్ధిజీవుల రాజ్యంగా నా ఆదర్శం మారింది. (ప్రజాస్వామ్య, రైతుకూలీ, కళాకార్, బుద్ధిజీవుల రాజ్యం).

ఆంధ్ర, మహారాష్ట్ర, కర్ణాటక, పంజాబు, తమిళనాడు రైతులు అధిక వడ్డీలతో, భూమిశిస్తుతో, నీటివసతి లేకపోవడం వలన బాధపడుతున్నారు. వీరు ఆత్మగౌరవం కలవారు. స్వరాజ్యం కొరకు త్యాగాలు చేశారు.

అలంకారయుతమైన, ప్రజల నోట్లో నానే భాషలో వీరితో రైతుల, కళాకారుల ఉద్యమాలను గురించి మాట్లాడుతూ ఉండేవాడిని. జాతీయోద్యమంలో రైతుల ప్రముఖ పాత్రను ప్రస్తావిస్తూ ఉండేవాడిని. నా తోటి ఉపన్యాసకులను కూడా ఇదేవిధంగా మాట్లాడవలసిందిగా కోరేవాడిని.

స్వరాజ్యం, స్వరాజ్యంపైన నిజాలుతో మా ఉపన్యాసాలు సాగేవి. రాజకీయ, ఆర్థిక, సాంఘిక విషయాలతో వయోజన విద్యాబోధన జరిగేది.

భారతీదేవితో కలసి మూడు వారాలు 'బర్మా'లో పర్యటించాను. ఆమె ఈ పర్యటనను బాగా అర్థంచేసుకున్నది. నా రాజకీయంపై ఆమెకు నమ్మకం పెరిగింది. ప్రపంచంలో ఏ దేశంలోనైనా నేనీ విషయాలను ఇంతే సాధికారతతో మాట్లాడగలనని ఆమెకు అర్థమైంది. రంగూన్‌లోని 'పెగూ', మోల్‌మిన్‌లోని 'పగోడా'లను చూశాము. ఆకాశమంత ఎత్తుగా ఉండే శిఖరాలను, వరుసలతో ఉండే అక్కడి మెట్లను, దయార్ద్రహృదయుడైన బుద్ధుని విగ్రహాలను చూశాము.

మా బర్మా పర్యటన, దోబామా సంఘం బర్మా–ఇండియన్ అసోసియేషన్ వారి సౌజన్యంతో జరిగాయి. అక్కడ ముఖ్యమైన ప్రదేశాలను, నూనె బావులతో సహా చూడటం జరిగింది. అక్కడ రోడ్డు ప్రయాణాలు, 'ఇర్రవాది' నదిపై ప్రయాణం సంతోష వాతావరణంలో జరిగాయి. మా ఇంగ్లీషు ఉపన్యాసాలను హిందీలోనికిగానీ, బర్మా భాషలోనికిగానీ అనువదించేవారు. వేలాది శ్రోతలు సంతోషంగా ఈ పర్యటనలలో పాల్గొనేవారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నేను చేసే ఉపన్యాసాలను వారు అర్థంచేసుకునేవారు. రంగూన్ డైలీ గెజిటు నన్ను అరెస్టు చేయమని కూడా కోరింది. కానీ భారతీదేవి ఉపన్యాసాలను బాగా గౌరవించేది. మాజీ మంత్రి థెయిన్‌మాంగ్, వారి కుమార్తె, భార్యలకు నేనక్కడ అతిథిని. ముఖ్యమంత్రి ఇంగ్లీషులో మంచి వక్త. డా॥ బామా నా హోరుగాలి వలె సాగిన ఉపన్యాస సభకు అధ్యక్షత వహించారు. వారి అభినందన బ్రిటీషువారి కోపానికి కారణమైంది. జపాను, కెనడాలలో స్వరాజ్ ఇండియా రాయబారి, రంగూన్‌లో ప్రముఖ లాయరు అయిన మిస్టర్ రవూఫ్ వేరొక సభకు అధ్యక్షత వహించారు. గాంధీ, నెహ్రూ, సుభాష్‌బాబులే కాక భారతదేశపు నాయకులందరినీ పొగడ్తలతో ముంచాడు. నేను బర్మా లేబరు కాన్ఫరెన్సుకు అధ్యక్షత వహించాను. బర్మా ప్రభుత్వం, పత్రికలవాళ్ళు నా చొరవను మెచ్చుకున్నారు.

క్రిక్కిరిసిన సభలు, ఉత్తేజకరమయిన సంఘటనలు, పత్రికా గోష్ఠులతో దీర్ఘ కాలం సాగిన ఈ పర్యటనానుభవంతో భారతీదేవి రాబోయే (సంవత్సరాలలో) కష్టకాలంలో ఆంధ్ర కిసాను కాంగ్రెసు, ఆల్ ఇండియా కిసాను కాంగ్రెసు బాధ్యతలను నెత్తికెత్తుకుని, ప్రభుత్వ దుర్మార్గాల నుండి, కుట్రల నుండి, అణచివేత నుండి, కమ్యూనిస్టుల ఊహల నుండి రైతులను రక్షించగలిగింది.

ప్రణాళికాబద్ధమైన ఈ పర్యటన ప్రజలలో నూతన చైతన్యాన్ని నింపింది. నేను కూడా ఒక రైతుబిడ్డనే అని, నా పూర్వీకులు తరతరాలుగా దేశ స్వరాజ్యం కొరకు పోరాడినవారే అని వారికి చెప్పేవాడిని. దేశంకొరకు వారి యువత కూడా నాలాగా పోరాడగలదని, రాజకీయాధికారం సంపాదించగలదని వారికి చెప్పేవాడిని. గాంధీజీ 40 సంవత్సరాలుగా గ్రామీణ ప్రజలకు చేసిన సేవలను

నేను, భారతీదేవి వారికి చెప్పేవాళ్ళ. ఈ పర్యటనలు రైతుల సేవకు, పార్ల మెంటులో నా పనికి, పుస్తకాలు వ్రాయటానికి ఉపయోగపడ్డాయి.

రైతు యాత్రను నేను ఒక బలమైన ఆయుధంగా వాడుకున్నాను. బీహారులో 1938 లో స్వామి సహజానందగారు (పాట్నాలో) లక్షమంది, భీషాంబర్, పి. త్రిపాఠి గార్లు ఒక లక్షమంది ప్రజలతో ఈ రైతు యాత్రలకు నడిపారు. 'హరిపురా' కిసాను యాత్రలో సర్దార్ పటేలు రైతులను కూడా కూడగట్టాను. 1928 లో సర్దారుతో పాటు బార్డోలి సత్యాగ్రహం చేసిన శ్రీ కుశాలభాయ్ పటేల్ ఇప్పుడు స్వతంత్ర పార్టీలో ప్రముఖులు.

కాంగ్రెసు పార్టీ మొదట ఈ యాత్రలకు విముఖత ప్రదర్శించినా చివరలో లొంగివచ్చింది.

కిసాను యాత్ర (ఇచ్ఛాపురం నుండి మద్రాసు వరకు)

ఆంధ్రలో ఈ చివర నుండి ఆ చివర వరకు సాగిన యాత్ర చిరస్మరణీయ మైనది. ఇచ్ఛాపురం (శ్రీకాకుళం) నుండి మద్రాసు వరకు సాగిన యాత్ర అధిక సంఖ్యలో ఉన్న గ్రామాల మధ్య సాగింది. ప్రతి జిల్లాలోని రైతులు ఈ యాత్రలో పాల్గొని ఈ యాత్రకు బలం చేకూర్చారు. ముఖ్యమైన గ్రామాలను చేరలేని గ్రామాల ప్రజలు వచ్చి ఈ యాత్రలో కలిశారు. పెద్ద పెద్ద కూడళ్ళలో వీరు చేరేవారు. నేను, భారతీదేవి ఈ యాత్రను ఇచ్ఛాపురంలో ప్రారంభించాము. మధ్య మధ్య ఈ యాత్రలో కలుస్తుండేవారము. కీ.శే. కె.యస్.యన్. మూర్తి, ఆంధ్ర కిసాను అధ్యక్షులు ఈ యాత్రలో చివర వరకూ నడిచారు. (వీరు కీ.శే. డా॥ కొమ్మారెడ్డి రాజారామమోహనరావుగారి తండ్రి. కొమ్మారెడ్డి సత్యనారాయణ మూర్తి గారు రంగాగారి అనుంగు శిష్యుడు, సోషలిస్టు. ఏలూరు జిల్లా కాంగ్రెసు ఆఫీసు వీరి పేరనే ఉంది. వీరి తండ్రిగారు వడ్డీ వ్యాపారం చేసేవారు. వీరు రూ.50,000/-ల పాలేరుల బాకీ నోట్లన్నిటినీ తగలబెట్టి, ఆ బాకీదారులకందరికీ భోజనాలు పెట్టినవారు.) నేను తయారుచేసిన కోర్కెల పత్రాన్ని అప్పటి ఆంధ్ర ముఖ్యమంత్రి శ్రీ సి. రాజగోపాలాచారిగారికి ఇచ్చారు.

నా సోదరులు లక్ష్మీనారాయణ, అప్పయ్యలు, శ్రీ యన్.వి. సుబ్బయ్య, నాగయ్య గారలు, కిసాను గ్రాడ్యుయేట్లు గౌతులచ్చన్న, శ్రీ శ్యామసుందరరావు, శ్రీ కె. ఓబులరెడ్డి, శ్రీ డి.యస్.రెడ్డి, శ్రీ రావిపాటి మహానంద, శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్య గార్లు పేరునకెక్కారు. శెట్టిపల్లి వ్రాసిన విప్లవ గీతాలను శ్రీ సుబ్బారావు, శ్రీ యన్.వి. సుబ్బయ్య, శ్రీ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి గారలు ఆలపించేవారు.

అంతర్జాతీయ లేబరు గ్రూపులో పనిచేసిన కుమారి దీనాస్టాక్ రష్యా, చైనాల ద్వారా ఇండియా వచ్చి, నిడుబ్రోలులో మా అతిథిగా ఉంది. చుట్టుప్రక్కల గ్రామాలను శ్రీమతి భారతీదేవితో కలసి పర్యటించింది. ఆమెను మహాత్మాగాంధీ గారి వద్దకు సేవాగ్రామ్‌కు వెంటబెట్టుకొని వెళ్ళాను. నాతోపాటే పంజాబులో పర్యటించింది. సామ్రాజ్యవాద వ్యతిరేకి. అక్కడ నాయకులు మాస్టరు కాబూలి సింగ్, బి.పి.యన్. బేడీ దంపతులు ఆమె సామ్రాజ్యవాద వ్యతిరేక ధోరణిని మెచ్చుకున్నారు. ఆమె నా కిసాను హాండ్‌బుక్‌కు అభినందనలు తెలియజేసింది. 1948-1965 మధ్య పాకిస్థాన్, ఇండియాలలో ఉండి కలకత్తా, ఢక్కా, రాజస్థాన్ యూనివర్శిటీలలో ఆంగ్లభాషోపాధ్యాయినిగా పనిచేసింది. నాకు నైతికబలాన్నిచ్చింది.

1936 లో ఢిల్లీలో వయోజన విద్యాకేంద్రాన్ని స్థాపించినవారిలో నేనొకడిని. సెక్రటరీగా, ఆ తరువాత వైస్-ప్రెసిడెంటుగా ఈ సొసైటీకి ఎన్నికయ్యాను.

1914 నుండి వయోజనవిద్యా కార్యక్రమాలను చేస్తున్నాను. 1916-20 మధ్య శ్రీ అయ్యంకి వెంకటరమణయ్యగారు ఆంధ్రలో గ్రంథాలయోద్యమాన్ని ప్రారంభించారు. నేను గ్రామీణ గ్రంథాలయాలను ఏర్పాటుచేస్తుండేవాడిని. 1920-26 లలో ఆక్స్‌ఫర్డులో కార్మిక విద్యాసంఘాలలోనూ, వయోజనవిద్యా సంఘంలోనూ, లేబరు కాలేజీలోనూ ఉత్సాహంగా పనిచేసేవాడిని. నేను భారత దేశానికి వచ్చిన తరువాత గ్రామీణ గ్రంథాలయాలు, వయోజనవిద్యా కేంద్రాలను, నిరక్షరాస్యతలను గురించి శ్రమించాను.

1926-39 వరకు వై.యం.సి.ఎ. (యంగ్‌మన్స్ క్రిస్టియన్ అసోసియేషన్) వయోజనవిద్య కోసం పనిచేసింది. విద్యార్థులు, యువకులు, రాజకీయ

అవకాశాలు, గ్రామ పునర్నిర్మాణం, విద్యాకేంద్రాలు, అక్షరాస్యత కొరకు పాటు పడేవారు. ఈ కార్యక్రమాలన్నిటిలో మద్రాసు కాలేజీలో పనిచేసినప్పుడు, ఆ తరువాత కూడా నిమగ్నమయ్యాను.

నేను, అయ్యదేవర కాళేశ్వరరావు సహజమయిన భాషలో కొన్ని పుస్తకాలు వ్రాశాము. శనివారపు సుబ్బారావుగారు వీటి ముద్రణను చూసేవారు. 1931-32 సంవత్సరాలలో వెల్లూరు జైలులో ఉన్నప్పుడు, మరల 1943-44 లలో పన్నెండు పుస్తకాలు రచించాను. వీటిలో నాలుగు ముద్రణకు నోచుకున్నవి. 1. హరిజన నాయకుడు, 2. ఆధునిక రాజ్యాంగ వ్యవస్థలు, 3. కిసానులు - కమ్యూనిస్టులు. 4. పాకిస్థాను. ఆంధ్ర గ్రంథాలయ సంఘం తరఫున శ్రీ పాతూరి నాగభూషణంగారు (విశ్రాంత వ్యవసాయాధికారి), శ్రీ జి.భోగరాజుగారు శాస్త్రీయ విజ్ఞానాన్ని గురించి రచించిన పుస్తకాలను ముద్రించారు. పశువులు-ఆయుర్వేద వైద్యాన్ని గురించి శ్రీ శ్రీరాములుగారు పది పుస్తకాలు వ్రాశారు. నా స్నేహితుడు, హిందీ అభిమాని శ్రీ సత్యనారాయణ, యం.పి. ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం 12 భాగాలు వ్రాశారు. శ్రీ జగన్నశాస్త్రి, తణుకువారు 20 పుస్తకాలు సమకాలీన రాజకీయాల గురించి వ్రాశారు. శ్రీ విజయరాజకుమార్ నేను వ్రాసిన 'రివల్యూషనరీ పెజెంట్సు' (విప్లవ రైతాంగం), పెజెంట్సు&కో-ఆపరేటివ్ ఫార్మింగు (రైతులు-సహకార వ్యవసాయం), రాజాజీ గారు వ్రాసిన స్వతంత్ర మూవ్‌మెంటు(స్వతంత్రోద్యమం-రైతులు), రామాయణం, మహాభారతాలను తెనుగు చేశాడు.

కొన్ని పట్టణాలలో ప్రజా సమస్యలను గురించి మాట్లాడటానికి పిలిచేవారు. స్ప్రింగ్ లెక్చర్స్ (వసంతకాలపు ఉపన్యాసములు) పూనాలోను, సాహిత్య అకాడమీ లోనూ జరుగుతుండేవి. నేను పూనాకు 1939 లోను, వేటపాలేనికి 1938, 1957 లలో ఆహ్వానింపబడ్డాను.

1945 వరకు శ్రీ పాతూరి నాగభూషణంగారు ఈ ఉద్యమాన్ని కాంగ్రెసు వారి సహకారంతో నడిపారు. కాంగ్రెసు మంత్రివర్గము ఏ సహకారము అందించ లేదు. కర్ణాటక ప్రభుత్వం ఈ విషయంలో సహకరించింది. 1945 లో

బెంగుళూరులో వయోజనుల కొరకు ప్రచురణలు కూడా ముద్రింపబడి, ప్రకటింపబడ్డాయి.

శ్రీ జి. హరిసర్వోత్తమరావుగారిని, మంత్రి అయిన అవినాశలింగం మొదలియార్‌గారి సాయంతో ఆంధ్ర నుండి ఆహ్వానించాము. శ్రీ హరిసర్వోత్తమ రావుగారు దేశభక్తుడు. ఆంధ్రలో వయోజనవిద్య కొరకు ఎంతో చేసినవారు.

1954 లో తిరుపతిలో జరిగిన వయోజనవిద్యా కార్యక్రమానికి ఆహ్వానించబడ్డాను. 17 సంవత్సరాల తరువాత 'నిరక్షరాస్యత' ఇంకా ఈ దేశంలో తాండవిస్తూనే ఉంది. రష్యా, చైనాలు మొదటి పది సంవత్సరాలలోనే విద్యా విషయంగా ఎంతో ప్రగతి సాధించాయి. ప్రభుత్వాలు చాలా డబ్బును ఖర్చు చేస్తున్నాయి. మద్రాసు ప్రభుత్వం 1946 లో లైబ్రరీ చట్టాన్ని రూపొందించింది. గ్రామీణ లైబ్రరీలను నెలకొల్పింది. నేషనల్ ఎడ్యుకేషన్ స్కీము, రాత్రి బడులను నిర్వహిస్తూ ఉంది. అయినా నిరక్షరాస్యత ఇంకా ఈ దేశాన్ని వీడిపోలేదు.

కీ.శే. యస్.సుబ్బారావు, శ్రీ గరిమెళ్ళ సత్యనారాయణ, నేను ఆంధ్ర వయోజన విద్యా సంఘాన్ని స్థాపించి 1934 నుండి నడుపుతున్నాము. సామాన్యంగా ఇటువంటి సంస్థలు స్థాపించినవారి మరణం తరువాత కనుపించవు. ఇంగ్లాండులో డా॥మ్యాన్స్‌ఫీల్డ్ తరువాత కూడా గ్రంథాలయోద్యమం నడుస్తున్నది. నేను ఈ ఉద్యమాన్ని పటిష్ఠంగా నడపటం కోసం 'ఆల్ ఇండియా అడల్టు ఎడ్యుకేషన్ మూమెంటు' (భారత వయోజనవిద్యా కార్యక్రమము), 'అడల్టు ఎడ్యుకేషన్ ఫర్ సౌత్ ఇండియా' (దక్షిణభారతపు వయోజనవిద్య) రచించాను. శ్రీ సుబ్బారావుగారు ఇంగ్లీషులో వీటిని ప్రచురించారు. ఈ పుస్తకాలకు బర్మా, మలయా, సింగపూర్‌లలో కూడా ప్రజాదరణ బాగుంది. ఆంధ్రా యూనివర్శిటీ వారు 1954 లో వయోజనవిద్యపై ఉపన్యాసాలు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమాలను ప్రారంభించే అవకాశం నాకు దక్కింది. యునెస్కోవారు ఇండియాలో, సౌత్ ఈస్ట్ ఆసియాలో ప్రారంభించిన ఈ ఉద్యమానికి నేను సహకరించాను.

రైతు ఉద్యమాలను గురించిన గ్రంథాలు ఈ కాలంలో వ్రాశాను. 1936 నుండి 'వాహిని' తెలుగు వారపత్రికను మద్రాసు నుండి నడుపుతున్నాను. 'మోడరన్ ఇండియన్ పెజెంటు'లో నా పార్లమెంటు ఉపన్యాసాలు, రైతుల తలసరి ఆదాయాలను గురించి, 'కిసాను స్పీక్స్'లో నిరక్షరాస్యతా నిర్మూలన,

అవినీతి వ్యతిరేక ఆందోళన, పంచాయితీలలో స్థానిక అభివృద్ధులను గురించి 1938 లో వ్రాశాను. History of Kisans (రైతు చరిత్ర), కాంగ్రెసు-కిసానులను కూడా ఇదే సంవత్సరంలో ప్రచురించాను. 'శెట్టిపల్లి' వారి స్మృత్యర్థం 1939లో ఇంగ్లీషు-తెలుగులో వ్రాశాను. వీటన్నిటినీ 'వాహినీ' ఎడిటర్ శ్రీ వి. నాగేశ్వర రావుగారు ప్రచురించారు. శ్రీమతి దీనాస్టాక్‌గారు నా రైతుపాటల అనువాదానికి పరిచయం వ్రాశారు. ఇవి కాంటెంపరరీ ఇండియాలో ముద్రించబడ్డాయి. రైతుల విముక్తి కొరకు నేను చేస్తున్న పోరాటాన్ని డా॥ స్లేటరుగారు (ఆక్స్‌ఫర్డు యూనివర్శిటీ) అభినందించారు. 1938 లో శ్రీ ఎస్.కె.డి. పల్లివాల్ (సైనిక్ - హిందీ ఎడిటరు), కిసాను స్పెషలును నా ఎడిటర్‌షిప్‌లో ప్రచురించారు.

ఈ ప్రచురణలన్నీ రైతాంగ ఉద్యమానికి ఊపిరి. 1934 లో జమీందారీలను రద్దు చేయాలన్న నా ఆందోళనకు ఊతగా 'జమీందారీ రైతుల ఆర్థికత' (Economic condition of Zamindari Ryots) ను గురించి తిరుగులేని విధంగా వ్రాశాను. 1936లో Manchester Guardian (మాంచెస్టరు గార్డియన్) పత్రికకు, 1938 లో ఆసియా మాగజైనుకు వారి కోరికపై రచనలు చేశాను. 'జాతీయోద్యమ రేఖలు' (Outlines of National Revolutions), కిసానులు - కమ్యూనిస్టులు పుస్తకాలకు తెలుగులో అనువాదాలు వచ్చాయి.

★ ★ ★



కీ.శే. కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి, ఆంధ్ర కిసాన్ అధ్యక్షులు

20. శాస్త్రవేత్తలతో పరిచయాలు

1957, పార్లమెంటు చర్చా సంఘ సమావేశంలో డా॥ హోమీ జహంగీర్ బాబాగారు (సైంటిస్టు) అహమ్మదాబాద్‌లో పెట్టనున్న 'అణువిద్యుత్ కేంద్రాన్ని' గురించి చర్చించారు. అహమ్మదాబాద్‌కు అణువిద్యుత్ ఎంత లాభమో చెప్పారు. బీహారులోని 'ఝరి' బొగ్గుగనుల నుండి విద్యుత్ తయారీకి గల కష్టనష్టాలను గణాంకాలతో, సులభగ్రాహ్యంగా వర్ణించారు. వారి వ్యాపారదృష్టిని మెచ్చు కున్నాను.

1955 లో పండిట్ నెహ్రూగారి ఇంట్లో కీ.శే. డా॥ సరోజినీనాయుడుగారి చిత్రపటాన్ని చూశాను. ఆ చిత్రాన్ని రచించిందెవరు అని ఇందిరాగాంధీగారి నడిగాను. 'బాబాగారు' అని చెప్పి, 'మీకు తెలియదా? వారు అద్భుతంగా వీణ కూడా వాయించగలరు' అన్నది. వారు చాలా విషయాలలో నేర్పరి అన్నది. బాంబే నుండి కెయిరో వరకు విమాన ప్రయాణంలో వారెంత సరసులో గ్రహించాను.వారు విమాన ప్రమాదంలో చనిపోవటం శాస్త్రవేత్తలు జీర్ణించుకోలేక పోయారు.

శాస్త్రీయ–వ్యాపార పరిశోధనలను అణు పరిశోధన, శాస్త్రీయ పరిశోధనలుగా విభజించారు. ఈ రెండింటిని డా॥ శాంతిస్వరూప్‌భట్‌న్‌గర్‌గారు చూసేవారు. వారు నిశ్చయమైన అభిప్రాయాలు కలవారు. నేను విద్యుత్ రసాయన పరిశోధన ప్లానింగు కమిటీలో (Electro-Chemical Research Institute) సభ్యునిగా ఉన్నాను. వీరు అలగప్పచెట్టియార్‌గారిని ఉత్సాహపరచి రూ. 20 లక్షలు, వందల ఎకరాల స్థలం ఈ సంస్థకు ఇప్పించారు. వారు వెంటబడి కరైకుడిలో కొత్త భవనం నిర్మించేవరకు ఊరకుండలేదు. వారు నిర్దాక్షిణ్యమయిన వ్యాపార

దృక్పథంతో ఈ పనిని సాధించారు. సామాన్యులకు కష్టమైన విషయాలను అర్థంకాగల రీతిలో చెప్పగల వ్యక్తి.

డా॥ సి.వి. రామన్‌గారు ఆకర్షణీయమైన, సజీవ భాషలో ఉపన్యసిస్తారు. 1923 లో వారిని మొదటిసారి పచ్చయ్యప్ప కళాశాలలో కలిశాను. నా విద్యార్థులకు ఒక అత్యున్నత భారతీయుని, రామన్ ఎఫెక్టు కనుగొన్నవారిని పరిచయం చేసే అవకాశం నాకు కల్గింది. నాకా రామన్ ఎఫెక్టు ఏమీ అర్థంకాలేదు. కానీ సైన్సు తీసుకువస్తున్న మార్పులను నేను స్వాగతిస్తున్నాను. వారి భారీవిగ్రహం, అనర్గళమైన ఉపన్యాసం, తలగుడ్డ నన్ను ఆకర్షించాయి.

నేను, వారు కలసి 1950 లో అనుకుంటాను, బొంబాయి నుండి మద్రాసు వరకు కలసి ప్రయాణం చేశాము. మేమిరువురమూ పెద్దవాళ్ళమయ్యాము. వారు తన వాక్చాతుర్యంతో నన్ను కట్టివేశారు. వారు మాటిమాటికి రైలు తలుపులు మూసివేసి వస్తుండేవారు. ఎవరైనా రైలు నుండి జారిపడ్డారేమోనని చూస్తుండేవారు. ఈ వింత ప్రవర్తన చూసి, వీరు కూడా మామూలు మానవుడే అన్పించింది. రామన్ ఎఫెక్టు, ఐన్‌స్టీను సాపేక్ష సిద్ధాంతం నాకు అర్థమయ్యేలా, ఆకర్షణీయంగా చెప్పారు. అద్భుతమైన వారి ఉపన్యాసం విన్న తరువాత, ఎంతో క్లిష్టమైన విషయం ఇంత సామాన్యమైనదా అనిపించింది. వీరి కుమారుడు మాతో జైలులో ఉన్నాడు. కమ్యూనిస్టు భావాలు గల వ్యక్తి. రామన్‌గారి వింత ప్రవర్తన మినహా ఏ గొప్పతనమూ వీరిలో లేదు.

అందరిలాగానే రామన్‌గారు కూడా తోటి సైంటిస్టులమీద ఆరోపణలు చేసేవారు. గొప్ప శాస్త్రవేత్త, లెక్కలలో అద్వితీయుడు అయిన రామానుజంలో ఈ బలహీనతలు లేవు.

తమిళనాడులోని వీరి 'రామన్ ఇన్‌స్టిట్యూట్'కు సరైన ఆర్థిక సహాయం, గుర్తింపు లేవని పార్లమెంటులో ముత్తులింగనాయకర్‌గారు వాపోయేవారు. నేను కూడా వీరితో కలసి ఈ ప్రసిద్ధ శాస్త్రజ్ఞునికి న్యాయం జరిగేటట్లు చూశాను.

బెంగుళూరులోని 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్'కు 'తాతా'వారు భూరి విరాళం ఇచ్చి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్‌కు మార్గదర్శకులయ్యారు.

కరైకుడిలో డా॥ యం.యస్. కృష్ణన్, డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఫిజికల్ లాబరేటరీ (భారతీయ భౌతికశాస్త్ర పరిశోధన కేంద్రం) వారిని కలిశాను. వారికి సంస్కృతంలో పాండిత్యముంది. డా॥ రామన్ వంటివారు కాదు. రామన్ గొప్ప ఉపన్యాసకుడు. వీరు మౌనంగా ఉండి, (ఉపనిషత్తులలో చెప్పబడిన) తన గురువు కనుగొన్న 'రామన్ ఎఫెక్టు' గొప్పతనానికి నిదర్శనంగా ఉండేవారు.

లెదర్ రీసెర్చిలో శేషాచలం మిత్రులు శివయ్యగారు 'క్రీమ్ లెదర్' (క్రోమియం – మెటల్ పూయబడిన) లో గణనీయమైన పరిశోధనలు చేశారు. శ్రీ నాయుడమ్మ గారు 36 సంవత్సరాలకే మద్రాసు 'లెదర్ ఇనిస్టిట్యూట్'కు అధ్యక్షులయ్యారు. వీరిది నిడుబ్రోలు దగ్గర ఉన్న 'ఎలవర్రు' గ్రామం. ఈ ముగ్గురు రైతు కుటుంబాల నుండి వచ్చినవారే.

(శ్రీ ఎలవర్తి నాయుడమ్మగారు సెప్టెంబరు 10, 1922 న జన్మించారు. వీరు జూన్ 23, 1985 న అట్లాంటిక్ సముద్రంలో, విమాన ప్రమాదంలో మరణించారు. బెనారస్ యూనివర్శిటీలో చదివారు.)

ఢిల్లీలో ఆంధ్ర శాస్త్రవేత్త 'సామిరాజు' గారిని కలిశాను. వీరు మొదట సన్యాసం తీసుకున్నారు. జర్మన్లను తన ఆలోచనలతో అబ్బురపరచారు. వీరు జాతీయ భౌతిక సంస్థకు డిప్యూటీ డైరెక్టరయ్యారు.

ఎల్లాప్రగడ సుబ్బారావుగారు యాంటీబయాటిక్స్ గురించి అమెరికాలో విజయవంతంగా పరిశోధనలు చేశారు. డా॥ కామేశం ఉస్మానియా యూనివర్శి టీలో ప్రొఫెసరయ్యాడు. కెమిస్ట్రీలో ప్రొఫెసర్ కె. సూర్యనారాయణగారు. మొహంజదారో–హరప్పాల పుట్టుపూర్వోత్తరాలపై పరిశోధన చేశారు. ఇక్కడ ప్రజలు శివుని పూజించేవారని, పంచద్రావిడులని, ఆంధ్ర, మహారాష్ట్రవారికి పూర్వులని, వీరి భాష నుండే దక్షిణాది భాషలు పుట్టినవని చెప్పేవారు.

చాలా తక్కువమంది భారతీయ భాషలలో వ్రాశారు. ఈ రెండు దశాబ్దాలలో కొద్దిమంది ఈ ప్రయత్నం చేశారు. 'బెనారస్' (వారణాసి) నుండి కె. కొండయ్య గారు తెలుగులో మంచి పత్రికను ప్రచురించేవారు. వ్యవసాయ సంబంధిత పుస్తకాలను శ్రీ జోగిరాజుగారు వ్రాశారు. తెలుగులో, మరాఠీలో, హిందీలో – సైన్సులో ఒక చిన్న విజ్ఞాన సర్వస్వం ప్రచురించబడింది.

వారి విజ్ఞాన సర్వస్వం ఇంగ్లండులో ప్రచురించబడి, బర్మాకు వచ్చిన సందర్భంగా బర్మా ముఖ్యమంత్రి 'నూ', బర్మా ప్రజలు ఎంతో సంతోషించారు. భారతదేశంలో శాస్త్రవిజ్ఞానం పెరగాలి. శాస్త్రజ్ఞులకు, ఇంజనీర్లకు మంచి జీతాలివ్వాలి. శాస్త్రజ్ఞులను, శాస్త్రీయ విజ్ఞానాన్ని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూగారు బాగా ఆదరిస్తున్నారు.

డా॥ కె.యల్. రావు గారు, శ్రీ ఖోస్లాగారు 30 లక్షల ఎకరాలకు నీరందించే నాగార్జునసాగర్‌ను నిర్మించారు. తుంగభద్ర, భవాని, హీరాకుడ్, దామోదర్ వాలీ, భాక్రానంగల్, చంబల్, కోసీ మొదలైన ప్రాజెక్టులను మనం నిర్మించుకున్నాం.

ఇంటర్మీడియట్ వరకు మాత్రమే చదువుకున్న డా॥ బి.వి. నాథ్‌గారు మొదట పూనాలో, తరువాత ఢిల్లీలో చేసిన సేవలకు వారికి డైరెక్టర్, నేషనల్ రీసెర్చి ఇనిస్టిట్యూట్‌కు నియమించి, క్లర్కుగా జీవితం ప్రారంభించిన శ్రీ వి.పి. మీనన్ గారిని సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్‌లోనికి తీసుకున్నారు. మీనన్‌గారు 600 సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయడానికి సర్దార్ పటేలుగారికి ఎంతగానో తోడ్పడ్డారు.

డా॥ జోసెఫ్‌గారు తన ప్రమోషనుకోసం, జీతంకోసం ఆత్మహత్య చేసుకొని దుర్మరణంపాలైనారు. మంత్రులమీద చాలా ఫిర్యాదులు పార్లమెంటుకు అందుతున్నాయి.

ఈ ప్రపంచంలో జీవం లేని వస్తువు లేదు. ఈ సూత్రం ఆధారంగా జైన మతం వృద్ధిచెందింది. శ్రీ జగదీశచంద్రబోస్‌గారి పరిశోధనలు ఈ విషయాన్నే చెపుతున్నాయి.

మహాత్మాగాంధీగారి జీవితం ఈ నమ్మకంతోనే నడుస్తున్నది.

★ ★ ★

21. గాంధీగారు-యునైటెడ్ ఫ్రంట్ శకం

1936-40 సంవత్సరాలలో గాంధీజీతో నా సంబంధాలు చాలా బాగు న్నాయి. Why Socialism?(సోషలిజం ఎందుకు?) అనే పుస్తకంలో జయప్రకాశ్ నారాయణగారు గాంధీజీపై తీవ్ర విమర్శలు చేశారు. స్వామి సహజానందగారు కిసాను కాంగ్రెసు అధ్యక్షులు. వీరు రైతుల అహింసాతత్త్వంపై దండెత్తారు. నేను కిసాను కాంగ్రెసుకు కార్యదర్శిగా ఉంటూ సహజానందతో విభేదించాను. కాంగ్రెసు మంత్రులు ఈ విషయాలన్నీ గాంధీగారికి చెప్పారు. బీహార్‌లో జమీం దార్ల దుర్మార్గాలను ఎండగట్టాను. 'కర్ర'లతో జమీందార్లకు బుద్ధిచెప్పండని కోరాను. స్వామి సహజానందలాగానే 'రైతులను కర్రలతో జమీందార్లకు బుద్ధి చెప్పమన్నాడని' టైమ్స్ ఆఫ్ ఇండియా వ్రాసింది. నా ఉద్దేశ్యంలోని నిజాయితీని గ్రహించి గాంధీగారు సహజానందపై విమర్శల జోరు తగ్గించారు.

గాంధీగారు కిసాను కాంగ్రెసును ఒక అడ్డంకిగా భావించేవారు. కాంగ్రెసు మంత్రులు చాలా నెమ్మదిగా స్పందిస్తున్నారని మేమనుకునేవారం. యు.పి., బీహార్, ఆంధ్రలలో రైతులకు ప్రభుత్వం భూమి హక్కునిస్తుందేమో అన్న భయంతో అక్కడ జమీందార్లు రైతులను తమ పొలాల నుండి వెళ్లగొట్టారు. మా వ్యతిరేకత చెవిటికి శంఖమూదినట్లుగా ఉంది. మేము జమీందారీలను రద్దు చేయవల సిందిగా కోరాము. తాత్కాలిక ఉపశమనాలతో యు.పి., బీహార్‌లలో కౌలు కాలాన్ని పెంచుతూ, కౌలు రేట్లు తగ్గిస్తూ మద్రాసు, బొంబాయిలలో ఎంక్వయిరీ కమిటీలను కాంగ్రెసువారు నియమించారు. అప్పులలో కూరుకున్న రైతుల ఋణాలను వాయిదా వేయాలని మేము కోరాం. మద్రాసు ప్రైమ్ మినిస్టరు రాజాజీగారు ఋణాల వాయిదాను అమలుచేశారు. అసలుకంటే వడ్డీ రెండు రెట్లకు మించరాదని నిర్ణయించారు. అసలును 'డాండూపట్' అని వ్యవహరించే

వారు. ఈ నిర్ణయం రైతులకు ఉపయోగపడింది. అయితే పన్నులను తగ్గించలేక పోయింది. కాంగ్రెసు మంత్రివర్గం చేపట్టిన ఈ చర్యలను నేను ఆహ్వానించాను. సి.పి.ఐ.వారికి, స్వామి సహజానందకు ఈ చర్యలు తృప్తిని కలిగించలేదు. స్వామి సహజానంద అప్పటికే సి.పి.ఐ. ధోరణితో ఉన్నారు.

రైతు సమస్యలను చర్చించటానికి ఆరునెలలకొకసారైనా తనను కలవమని గాంధీజీ ఆదేశం. ఒకసారి 7 నెలలు గడిచిపోయాయి. రైలులో గాంధీగారిని హడావుడిగా దర్శించుకున్నాను. వారు మాట్లాడకుండా మౌనంగా ఒక చిరునవ్వు నవ్వారు. వారు మౌనం పాటిస్తున్నారని నాకు తరువాత అర్థమైంది.

'దీనాస్టాక్'తో కలసి సేవాగ్రామ్‌లో వారిని దర్శించుకొన్నాను. అహింసతో, జాతీయభావాలతో సత్యాగ్రహానికి అంకితం కావాలని గాంధీజీ ఉద్బోధించారు.

1938 లో కృష్ణా జిల్లాలోని ఒక జమీందారుపై రైతులను రెచ్చగొట్టానని నాపై ఆరోపణ వచ్చింది. ఈ ఆరోపణను ఎలా సమర్థించుకుంటావని నన్ను గాంధీజీ అడిగారు. జమీందార్లు రైతులపై, వారి కుటుంబాలపై దౌర్జన్యానికి పూనుకున్నారని, రైతులకు ఇటువంటి దౌర్జన్యాలు సాగనీయవద్దని చెప్పానని వారితో అన్నాను. వారు విరగబడినవ్వి 'రంగా అనిపించుకున్నావు. రైతులకు అన్యాయం జరగనీయవు' అని అన్నారు. కానీ కాంగ్రెసు ప్రబోధించే 'అహింస' అది కాదుగదా అన్నారు. 'కాంగ్రెసు ధోరణితో వ్యవహరించాలంటే శతాబ్దాలు గడిచిపోతాయి' అన్నాను. వారు ప్రేమగా నన్ను చూశారు. సుభాష్‌బాబు అక్కడనే ఉన్నారు. గాంధీజీ ప్రేమను ఎలా పొందింది వారర్థంచేసుకున్నారు.

★ ★ ★

22. భారతీదేవి సేవలు

1944 లో తంజావూరు జైలులో 300 మందికి రాజకీయ పాఠశాల నడిపాను. ఈ అనుభవాలనే నేను 1.'వరల్డ్ రోల్ ఆఫ్ నేషనల్ రివల్యూషన్', 2. 'ఔట్‌లైన్స్ ఆఫ్ రివల్యూషనరీ పాత్', 3. 'వై ఫోర్ క్రోర్ ఆర్టిసన్స్ హెయిల్ గాంధియన్ పాత్, పాకిస్తాన్' మరియు ముద్రించబడని 'మానిఫెస్టేషన్స్ ఆఫ్ అమెరికా అండ్ యు.ఎస్.ఎస్.ఆర్. - దైర్ స్ట్రగుల్ ఫర్ వరల్డ్ డామినేషన్' అనే గ్రంథాలుగా వ్రాశాను.

నా జైలు అనుభవంతో నా చరిత్ర జ్ఞానానికి పదును పెట్టుకున్నాను. మార్చి 1940 నుండి నవంబర్ 1944 వరకు జరిగిన విశేషాలను నా పుస్తకం 'లైఫ్ అండ్ థాట్స్ ఆఫ్ ఎ పొలిటికల్ ప్రిజనర్'(రాజకీయ ఖైదీ-జీవితం-ఆలోచనలు) అనే పుస్తకంలో వ్రాశాను. ఆ అనుభవాలను ఇక్కడ సంక్షిప్తంగా పొందుపరుస్తు న్నాను.

మార్క్సిజంపై శాస్త్రీయమైన, విమర్శనాత్మకమైన అవగాహన నాకు కలిగింది. పెట్టుబడి, సామ్రాజ్యవాదాలపై నా పరిశోధనా గ్రంథం 'క్రెడో ఆఫ్ వరల్డ్ పెజెంట్రీ' ఈ సమయంలోనే రూపుదిద్దుకొంది. (Credo of World Peasantry - 'కర్షకవేదం' పేరుతో ఈ రచయిత అనువదించిన గ్రంథము.) 1947-57 మధ్యకాలంలో 'రివల్యూషనరీ పెజెంటు' (విప్లవ రైతాంగము), కిసాన్స్ అండ్ కమ్యూనిస్ట్స్ (రైతులు-కమ్యూనిస్టులు), 'కలోనియన్ అండ్ కలర్డ్ పీపుల్' (వలసవాదులు-రంగు జాతులు), 'క్రిడో ఆఫ్ వరల్డ్ పెజెంట్రీ' (కర్షక వేదం) గ్రంథాలు ఈ సమయంలో వ్రాసినవే. ప్రపంచ రైతులను దోపిడీ చేస్తున్న అన్ని వర్గాల అణచివేతను ఎదుర్కొనాలి. రైతులపై నమ్మకంతో రైతుల భాగ స్వామ్యంతో మాత్రమే ప్రపంచ శాంతి సాధించగలమని నా అభిప్రాయం.

దుర్భరమైన జైలు జీవితం గడిపాను. కానీ ఉత్తేజకరమైన ఆలోచనలతో, స్పందనలతో, అభిరుచి గల సంభాషణలతో నా జైలు జీవితం గడిచింది. భారతీదేవిగారు ఈ సమయంలో ఎక్కువ బాధపడ్డారు. నేను జైలుకు వెళ్లిన తరువాత ఆమె ఒంటరిదైపోయింది.

రైతు సమస్యలపై ఆమె ఒంటరి పోరాటం చేయవలసి వచ్చింది. 'మందసా' రైతులపై ప్రజాభిప్రాయ సేకరణ చేసింది. వారికి కోర్టులో రక్షణ కొరకు, ఫండు సేకరణకోసం శ్రమించింది. ఈ బాధ్యతలు చూస్తున్న శ్రీ శ్యాంబాబుగారు ఇచ్ఛాపురం జైలులో నిర్బంధింపబడి, కొద్ది వారాల తరువాత హఠాత్తుగా మరణించారు. శ్రీ లచ్చన్నగారు కూడా వారి స్వగ్రామం 'బారువా'లో నిర్బంధంలో ఉన్నారు. కీ.శే. వల్లభరావు వీరికి తోడుగా ఉండి రైతుల రక్షణకు సహకరించారు. ఈ బాధ్యతలన్నీ ఆమె నెరవేర్చవలసి వచ్చింది.

'ఇడుపులపాడు'లో రైతాంగ విద్యాలయం నడపటం, ధన సేకరణ, ఉప న్యాసాలు ఏర్పాటుచేయడం, విద్యార్థులతో సఖ్యతగా మెలగటం, నియమాలతో నడవటం వంటి పనులన్నీ ఆమె చేసేది. 1941లో చెన్నూరు(కడప జిల్లా) లో మరియొక రైతాంగ విద్యాలయం నడిపింది. చెన్నూరు రైతాంగ విద్యాలయానికి శ్రీ ఆర్.యన్. రెడ్డిగారు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు.

గాంధీగారు నన్ను ప్రభుత్వపు ఉత్తర్వులమేరకు జైలు నుండి విడుదల కావలసిందని కోరారు. "నా వ్యతిరేకత కాంగ్రెసు పార్టీపై వ్యతిరేకత"గా వారు భావించారు. ఇది ఒక తాత్కాలికమైన అపార్థం మాత్రమే. భారతీదేవిగారిని ఇది చాలా బాధించింది. కాంగ్రెసువారు గాంధీగారి ఉత్తర్వులకు చంకలు గ్రుద్దు కున్నారు. రైతులందరూ రెచ్చిపోయారు. వారు నన్ను కాంగ్రెసును 'వీడి' రమ్మన్నారు. వీటన్నింటినీ భారతీదేవి భరించవలసివచ్చింది. గాంధీగారి వ్యక్తి సత్యాగ్రహపు ఏర్పాట్లలో తీరికలేకుండా పనిచేసింది.

నా సోదరుడు లక్ష్మీనారాయణను అనారోగ్య కారణాల వలన జైలు నుండి విడుదల చేశారు. కానీ వారిని 'నిడుబ్రోలు'లో రాజకీయ నిర్బంధంలో ప్రభుత్వం ఉంచింది. భారతీదేవికి కొంతవరకు సాయపడగలిగాడు.

ఉభయ గోదావరి జిల్లాల వరద బాధితులకు సహాయ చర్యలు చేయడంలో శ్రీ పి. కోదండరామయ్య, శ్రీ వల్లభరావు గారలు మాత్రమే సహకరించారు. చాలామంది కాంగ్రెసు నాయకులు ముఖాలు చాటువేశారు. ఆమె ఈ ప్రజల మన్ననలు పొందినది.

ఆమె ఆంధ్ర కిసాను అధ్యక్షురాలైంది. కిసాను కాంగ్రెసుకు ప్రధాన కార్యదర్శిగా కూడా పనిచేసింది. సోదరుడు లక్ష్మీనారాయణ, నేను జైలు నుండి విడుదల అయ్యేవరకు ఈ కార్యక్రమాలు చూస్తుండేవాడు. నేను జైలు నుండి విడుదల అయ్యేందుకు రూ. 500/-లు చెల్లించింది. ప్రభుత్వం ఆ డబ్బు తీసుకొని ఆ రోజే విడుదలచేసి, మరలా ఆరోజే నిర్బంధం చేసింది. తిరుచినాపల్లి జైలు నుండి వెల్లూరు జైలుకు మార్చింది.

కిసాను కాంగ్రెసు, కమ్యూనిస్టులు అంతర్గత విభేదాలతో తన్నుకుంటున్నారు. ఆమె కిసాను కాంగ్రెసు తరుపున నిల్చింది. కిసాను కాంగ్రెసు, ఫార్వర్డ్ బ్లాకు, సి.పి.ఐ. (కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా) వాళ్లు బీహార్, యు.పి.లలో విభేదాలతో ఉన్నారు. సి.పి.ఐ.వారు 'పీపుల్స్‌వార్' నినాదం తీసుకున్నారు. యుద్ధమేఘాలు తూర్పున రష్యాను, పడమర యునైటెడ్ స్టేట్స్‌ను కమ్ముకుంటు న్నాయి. కమ్యూనిస్టులు భారత స్వాతంత్ర్యాన్ని గురించి పట్టించుకోలేదు. రష్యాకు సాయం చేయాలన్న ధ్యేయంతో ఉన్నారు.

లక్ష్మీనారాయణ జైలు నుండి విడుదల అయిన తర్వాత భారతీదేవికి తోడుగా బెంగాలు, బీహారు, మధ్యప్రదేశ్‌లకు వెళ్లాడు. అక్కడ వామపక్షాలతో ఆమె చర్చలు జరిపింది. కమ్యూనిస్టులు పీపుల్స్‌వార్ నినాదంతో అఖిల భారత కిసాను కాంగ్రెసును వేదికగా చేసుకోలేకపోయారు. కాంగ్రెసువారు 'క్విట్ ఇండియా' ముసుగులో ఉన్నారు. కమ్యూనిస్టులు సామ్రాజ్యవాదులకు అనుకూలంగా పని చేస్తున్నారు. మూడు నెలలకొకసారి మాత్రమే జైలు అధికారులు ఆమెను నన్ను జైలులో కలవటానికి అనుమతించేవారు. మా సంభాషణలను జైలులో పోలీసు వారు రహస్యంగా వినేవారు. కిసాను గ్రూపులలోని విభేదాలు ఆమెను నిరుత్సాహ పరచాయి.

ఎట్టకేలకు నేను విడుదల అయ్యాను. అప్పటికి ఆర్థికంగా చితికిపోయాం. 'వాహిని' పత్రికను మా గ్రామానికి తరలించాను. ఆమె ఈ అప్పులను తట్టుకొని కార్యక్రమాలు చేపట్టటం ఆశ్చర్యమైంది. జాతీయ ప్రభుత్వం ఏర్పాటుచేయాలంటే కమ్యూనిస్టులు 'పీపుల్స్‌వార్' వాదాన్ని ముందుగా ప్రకటించాలంటున్నారు. ఆల్ ఇండియా కిసాను కాంగ్రెసు సమావేశాలలో వారిని ప్రతిఘటించగలిగాము. 1942 లో బీహార్‌లో కూడా మా మాటే నెగ్గింది. కానీ ఫార్వర్డ్ బ్లాకు మానుండి చీలిపోయింది.

1942 లో నా అజ్ఞాత కార్యక్రమాలకు నన్ను మరలా అరెస్టు చేశారు. రెండు సంవత్సరాలు భారతీదేవి ఈ కార్యక్రమాలు నడిపే బాధ్యత తీసుకున్నది. అజ్ఞాతంలో ఉన్నవారికి కావలసిన ఆర్థిక సహాయం చేసేది. పోలీసుల నుండి రక్షణ కల్పించేది. కిసాను కాంగ్రెసుకు – చేనేత కాంగ్రెసుకు అండగా నిలిచేది. ఈ కాలంలో ప్రభుత్వం ఆహార వస్తువులు, వస్త్రాలమీద కంట్రోళ్ళు విధించింది. నూలు, అద్దకపు రంగులు ప్రభుత్వ రక్షణరంగం నుండి ఇప్పించడం ఆమె బాధ్యతగా తీసుకున్నది. రక్షణ విభాగాలలో కంట్రోళ్ళు ఎత్తివేయాలని, చేనేత వస్తువులకు గిట్టుబాటు ధర కావాలని ఆమె నిత్యం ఆందోళన చేసేది. రైతులు కూడా తమ ఉత్పత్తులకు రక్షణ కావాలని, ప్రభుత్వ ఉద్యోగులు అంచనాలను సక్రమంగా తయారుచేయాలని, ప్రొక్యూరుమెంటు (ధాన్య సేకరణ) సరియైన కాలంలో చేయాలని కిసానుల తరఫున ఆమె ఆందోళన చేసేది. ఏ చిన్న ప్రొక్యూర్‌మెంటు ఉద్యోగైనా రైతుకు వ్యతిరేకంగా ఫిర్యాదు చేస్తే, ఆ రైతును యుద్ధ వ్యతిరేకిగా ముద్రవేసి జైలుకు పంపేవారు. ఆమె ఈ చర్యలన్నింటినీ చాలా బాధ్యతాయుతంగా నిర్వర్తించేది. మద్రాసు ప్రభుత్వం వీరి సలహాలు తీసుకునేవారు. ధాన్యం, బియ్యం సేకరణలలో ఆమె మాటకు విలువుండేది. శ్రీ బి. రామచంద్రారెడ్డిగారు చేస్తున్న సాయాన్ని నాకు చెప్పేది. వారు అప్పట్లో జస్టిస్ పార్టీలో ఉండేవారు (1959 లో స్వతంత్ర పార్టీ స్థాపించినవారిలో ప్రథములు).

స్టూడెంటు ఫెడరేషనును బలపరచవద్దని, స్వతంత్రంగా భారత విద్యార్థి

కాంగ్రెసును ఏర్పాటుచేయవలసినదని, విద్యార్థి ప్రముఖులతోనూ, వి.యల్. సుందరరావుతోనూ నా నిర్బంధానికి ముందే చెప్పాను. వి.యల్. సుందర రావు ప్రభుత్వపు కన్నుగప్పి ఆంధ్రా అంతా తిరిగి, భారతీదేవి, లక్ష్మీనారాయణల సహకారంతో ఈ స్టూడెంటు కాంగ్రెసు విభాగాలను పర్యవేక్షించారు. ఈ ఉద్యమానికి భారతీదేవి ముఖ్య కార్యకర్తగా గుర్తింపు తెచ్చుకున్నది. భారతీదేవి రాష్ట్ర కాంగ్రెసుకు గుంటూరులో చేసిన ఉపన్యాసము ఎంతో ఉత్తేజకరమైనది. ఆ తరువాత స్టూడెంటు ఫెడరేషను చాలావరకు తన ఉనికిని కోల్పోయింది. విద్యార్థిగా కాంగ్రెసు సమావేశాల తర్వాత చాలామంది కార్యకర్తలను ప్రభుత్వం జైళ్లలో పెట్టింది.

సుందరరావు, భారతీదేవిగార్ల సహకారంతో నిడుబ్రోలు వాస్తవ్యుడు దివంగత కె. అమ్మయ్యగారు జాతీయ యువకుల విభాగాన్ని నిర్మించారు. భారతీదేవి మూడుసార్లు ఆంధ్రదేశంలో పర్యటించింది. రైతులతో, చేనేతవారితో, యువకులతో, విద్యార్థులతో, జాతీయ మహిళా ఉద్యమకారులతో మాట్లాడేది. బహిరంగ సభలలో ప్రసంగించి సి.పి.ఐ.వారి 'పీపుల్స్‌వార్' ఉద్యమాన్ని బలహీనపరచింది. ప్రభుత్వం ఆమెను జైలులో పెట్టటానికి భయపడింది. సి.పి.ఐ.వారి పీపుల్స్‌వార్‌కు వ్యతిరేకంగా మహిళా కార్యకర్తలను తయారుచేసింది. కిసాను కాంగ్రెసు మొదలిడిన వనమహోత్సవాలకు, అధికాహారోత్పత్తికి కృషి చేసింది. పొలాలు లేని వ్యవసాయ జీవులకు ప్రభుత్వ భూములనివ్వాలని, వీటన్నిటినీ అధికాహారోత్పత్తికి ఉపయోగించవచ్చని ఆమె వాదించింది. 1929 నుండి రాయలసీమ వారు ఆందోళన చేస్తున్న తుంగభద్ర ప్రాజెక్టుకై ఆమె కృషి చేసింది. శ్రీ యు.వి. రామమూర్తిగారి సలహాలతో ఈ ప్రాజెక్టును చేపట్టటం, రాయలసీమ కరువు నివారణకు, అధికాహారోత్పత్తికై ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం ఒప్పుకోవడం ఆమెకు సంతోషం కల్గించింది.

కిసాను కాంగ్రెసువాళ్ళం గాంధీగారి నిర్మాణాత్మక పోరాటానికై సహకరిస్తూ జైలులో ఉంటే, బయట ఉన్న కాంగ్రెసు నాయకులు మేము చేసే కార్యక్రమాలను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు. శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్య 1930

నుండి చల్లపల్లి జమీందారీ రైతులను సమీకరించి జమీందారుపై పోరాటం చేస్తున్నాడు. 1943 లో రాష్ట్ర కిసాను కాంగ్రెసు బాధ్యతలను స్వీకరించి దేవీజీకి బాసటగా నిలిచాడు.

దేవీజీ, లక్ష్మీనారాయణ, వి.యల్. సుందరరావు, అమ్మయ్య, బి. సుబ్బారావు, యన్.వి. రామానాయుడు, గొర్రెపాటి వెంకటసుబ్బయ్య తదితరులు సామ్రాజ్య వాదులతో సంఘర్షించారు.

నేను డెమోక్రటిక్, కిసాను మజ్దూర్, కళాకార్, బుద్ధిజీవుల రాజ్య స్థాపనకై చేస్తున్న పరిశోధన ఫలించింది. జైలులో, బయట ఉన్న కార్యకర్తల సంతోషానికి అంతంలేదు. మార్క్సిజంలోని డొల్లతనాన్ని, కమ్యూనిజపు ఆర్థిక దోపిడీని, శ్రమజీవులందరికంటే రైతులే ఎక్కువగా దోపిడీకి గురవుతున్నారన్న సత్యాన్ని బయలుపరచాను. సొంతంగా వ్యవసాయం చేసుకుంటూ, స్వయం ఉపాధికి పాల్పడుతూ, ఇతరులను దోపిడీ చేయకుండా జీవిస్తున్నంత కాలం ఇవేవీ (వ్యవసాయ ఆస్తి) వీరి ఆస్తిగా భావించరాదు. (ఆస్తి సమాజపరంగా ఉండాలి. సొంతంగా ఉండకూడదు అని మార్క్సిజం చెపుతుంది. ఈ ఉద్దేశ్యంలో సొంత వ్యవసాయదారుడు అంటే ఫ్యూడల్ అయిన వ్యవసాయదారుడు). అమెరికాలోని రూజ్వెల్టు ప్రభుత్వపు హయాంలో వ్యవసాయ ధరలు 25 శాతం పెరిగాయి. వ్యాపార ధరలకు – వ్యవసాయ ధరలకు మధ్య వ్యత్యాసం తగ్గింది. మనం కూడా ఇతర దేశాలతో (భారతదేశంతో సహా) పోరాడి ఈ అంతరాన్ని తగ్గించాలి. అప్పుడే నిజమైన సోషలిజం వస్తుంది.

భారతీదేవి, లక్ష్మీనారాయణ ఈ సిద్ధాంతాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. నేను జైళ్లు తిరుగుతుంటే, తాను 'గోభూమి'లో నివసిస్తూ, వ్యవసాయం చేస్తూ, ఇంటిపనులన్నీ చూసుకోవటం చాలా భారమైన పని. ఈ బాధ్యతలనన్నింటినీ ఆమె నిర్వర్తించింది. అజ్ఞాతంగా పనిచేసే కార్యకర్తలకు ఆశ్రయం కల్పించేది. వారికి బట్టలు, ఆహారం అందజేసేది. పోలీసుల బారిన పడకుండా కాపాడేది. ఇవేవీ చిన్నపనులు కావు. ఈ కార్యక్రమాలన్నీ చాలా బాధ్యతాయుతంగా, వీరోచితంగా చేసేది.

సేవాగ్రామ్‌లో పనిచేసే మహిళా కార్యకర్తలందరికీ ఆమె ఆదర్శంగా ఉండాలని గాంధీజీ భావించారు. ఆమె ఆర్థిక ఇబ్బందులను అధిగమించటానికై గాంధీజీ ఎన్నోసార్లు 'ధన సహాయం' చేస్తానన్నా ఆమె నిరాకరించింది. గాంధీగారి జీవిత విధానమే తన జీవిత విధానంగా భావించింది.

1941 లో జయప్రకాశ్‌నారాయణగారు సోషలిస్టులకు వ్రాసిన ఉత్తరంలో "సోషలిస్టులు భారతీదేవిని ఆదర్శంగా తీసుకోవాల"ని పేర్కొన్నారు. ఈ ఉత్తరం ప్రభుత్వం చేతిలో పడింది. సోషలిస్టులు ఆమె సహాయం తీసుకొనకపోవటాన్ని జయప్రకాశ్‌నారాయణగారు తప్పుపట్టారు.

ఆమె పర్యటనలు, విద్యార్థులతో పరిచయాలు ఉత్తేజకరంగా ఉండేవి. ఆమె నిర్మాణాత్మక కార్యక్రమాలు ప్రజాదరణకు నోచుకున్నాయి. ప్రభుత్వం ఏమీ తోచక ఊరకుంది. పేరుగల నాయకులందరూ జైళ్లలో మగ్గుతున్న తరుణంలో ఆమె ప్రజలకు ఒక 'ఆశాజ్యోతి'గా భాసించింది.

★ ★ ★

23. బాపూ నిర్మాణాత్మక కార్యక్రమం

అభివృద్ధి, పంచాయితీరాజ్, బ్లాక్ డెవలప్‌మెంట్లు కలిసిన యుగం. చాలామందిమి స్వచ్ఛందంగా ఈ నిర్మాణ కార్యక్రమాల్లో పాల్గొన్నాము. నెహ్రూ 17 సంవత్సరాల పాలనలో వీరు జీతాలు, అలవెన్సులు అడిగే దశకు వచ్చారు. V.L.W. (Village Level Workers), B.D.O. (Block Development Officers) లు ఎక్కువ జీతాలు, సౌకర్యాలు కోరుతున్నారు. ప్రభుత్వం వందల కోట్ల రూపాయలను గ్రామీణ నిర్మాణానికి ఖర్చుచేస్తున్నది. గాంధీ అనుయాయుల మైన మేము ప్రజలను వీరికంటే ఎక్కువ మేల్కొల్పగలిగాము. ఈ పని గట్టి పునాదులమీద వేయబడింది. సాంఘిక, ఆర్థిక విధానాలన్నీ గాంధీజీ చెప్పినవే. వీటన్నిటినీ రైతులు, కళాకారులు నెరవేర్చేవారు. 1925 నుండి నాకు వీరిని నడిపించే అదృష్టం కలిగింది. నా 'పరిశోధన వ్యాసం' 1925 లో వివిధ భాషలలో ప్రకటించాను. అర్థికాభివృద్ధికి, పంచాయితీరాజ్ కార్యక్రమాలకు పనిలో 50 శాతం విరాళాలుగా ఇవ్వాలని నేను కోరాను.

గాంధీగారు 'హింద్ స్వరాజ్' పత్రికలో ఈవిధంగా వ్రాశారు : "భారతదేశం జయింపబడలేదు. తన సాంఘిక, ఆర్థిక వనరులను, నిర్మాణ దక్షతను పోగొట్టు కొన్నది." గాంధీజీ స్వరాజ్యం వచ్చేవరకు ఆగలేదు. 1920-23 సం॥లలో ఖాదీ, జాతీయ విద్య, గ్రామ పంచాయితీలు, పంచాయితీ కోర్టులు, అస్పృశ్యతా నివారణ, అణగద్రొక్కబడిన వారిలో సాంఘిక, ఆర్థిక పునర్నిర్మాణం, జాతీయ భాషగా హిందీ అనేవానిని నూతన కార్యక్రమాలలో చేర్చుకొన్నారు. వేలాదిగా గాంధీగారి అనుచరులు ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు. కాంగ్రెసు కార్యక్రమా లకు, సత్యాగ్రహాలకు దూరంగా ఉండటానికి గాంధీజీ వీరికి అనుమతినిచ్చారు. వీరంతా జైళ్లకు వెళ్ళకుండా గాంధీజీ గొడుగు నీడన ఈ కార్యక్రమాలు చేశారు.

1936 లో చాలా రాష్ట్రాలలో కాంగ్రెసు మంత్రివర్గాలు ఏర్పడ్డాయి. గాంధీజీ 'వార్ధా'లో ప్రాథమిక విద్యపై సమావేశం ఏర్పాటుచేశారు. శ్రీ జకీర్ హుస్సేను గారు, శ్రీ ఆర్యనాయకంగారు ఈ విద్యావ్యాప్తికై కృషి చేశారు. ఆచార్య కృపలానీ గారు 'కొత్త వింత' (New Fad) అనే పుస్తకాన్ని ఈ సందర్భంగా విడుదల చేశారు. నేను ఈ నిర్మాణాత్మక కృషిలో పాల్గొన్నాను. శ్రీ జి.బి. ఖేర్, శ్రీ శ్రీకృష్ణ సిన్హాలు ఈ విషయంలో ముందున్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లు ఈ కార్య క్రమాలలో (విద్యావ్యాప్తి) ముందున్నాయి. నేను ఈ 'ప్రాథమిక విద్య'ను ప్రత్యేక శ్రద్ధతో విస్తరించాను. 'గాంధీజీ-విద్య' అనే పుస్తకాన్ని ప్రచురించాను. 1936 నుండి జరిగిన విద్యావ్యాప్తికై ఒక సమావేశం ఏర్పాటుచేసి గాంధీగారు 1946 లో నన్ను కూడా ఆ సమావేశానికాహ్వానించారు.

అఖిల భారత గ్రామీణ పారిశ్రామిక సంస్థను 1934 కాంగ్రెసు సెషన్లలో గాంధీగారు ప్రారంభించారు. డాక్టరు జె.సి. కుమారప్పగారు అఖిల భారత నూలు కార్మిక సంఘానికి కార్యదర్శిగా పనిచేశారు. నా హృదయపూర్వకమయిన మద్దతుకు వారెంతగానో సంతోషించారు. కమ్యూనిస్టులు (సి.పి.ఐ.), కాంగ్రెసు సోషలిస్టులు వారికి వ్యతిరేకంగా ఉన్నారు. నేనందరితో స్నేహంగా ఉండేవాడిని. రైతాంగ విద్యాలయపు గ్రాడ్యుయేట్లు ఈ కార్యక్రమాన్ని బలపరిచారు. స్వామీ సీతారాంగా పిలువబడే సీతారామశాస్త్రి, 'శారదానికేతన్' (బాలికా పాఠశాల)ను

నడుపుతున్న శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ, శ్రీ యస్. రామస్వామిచౌదరి, శ్రీ పాతూరి నాగభూషణం గారలు ఆంధ్రలో గ్రంథాలయాలను నడుపుతున్నారు. దక్షిణ భారత హిందీ ప్రచార సభ – ప్రచారకులు శ్రీ యం. సత్యనారాయణ, హరిజన సేవాసంఘ కార్యకర్తలు అణచివేయబడిన వారి ఉన్నతికై కృషి చేస్తున్నారు. పంచాయితీ కార్యకర్తలు అందరినీ మనస్ఫూర్తిగా బలపరచారు.

భారతీదేవి, కనకమ్మ (పొనకల), చుక్కమ్మ, దుర్గాబాయి, లక్ష్మీబాయి గారలు మహిళా రాజకీయాలలో, సాంఘికోద్యమాలలో ముందున్నారు.

డాక్టరు వేజండ్ల శ్రీరాములు పశువులకు ఆయుర్వేద వైద్యం చేసేవారు. గాంధీజీ ఆదర్శంతో మేము ఆయుర్వేదం, నాచురోపతి పచ్చికూరలు, విటమిన్ల ఆహారంగా ప్రచారం చేశాము. దంపుడు బియ్యం వలన ఆరోగ్యమే కాక స్త్రీలకు ఉపాధి దొరుకుతుందని స్వామీ సీతారాం ప్రచారం చేశారు. నా పర్యటనలలో చాలామంది కొద్దిగా ధన సహాయం చేసేవారు. నేనా డబ్బును ఈ కార్యకర్తలకు ఇచ్చేవాడిని. మలేరియా వ్యాధి కలిగిస్తున్న నష్టాన్ని అసెంబ్లీలో చర్చకు తెచ్చాను. ఢిల్లీలోని పత్రికల నుండి మలేరియా గురించి వ్రాశాను.

గాంధీజీ సేవాగ్రామం (సేవాగ్రామ్) లో నివసించటాన్ని మనస్ఫూర్తిగా అభినందించాను. ఈ సేవాగ్రామ్ మధ్యప్రదేశ్‌లో ఉంది. మలేరియా చాలా ఎక్కువ. గాంధీగారు కూడా ఈ వ్యాధి బారిన పడ్డారు వారిని నాగపూర్ హాస్పటల్‌లో చేర్చారు. మలేరియా నివారణను ప్రజలందరూ ఒక బాధ్యతగా తీసుకున్నారు.

బాపూజీ 'ఓపెన్ ఎయిర్ లెట్రిన్స్' (పాయిఖానాలు) ద్వారా వచ్చే ప్రతి వ్యర్థాన్ని పొలాలకు వాడమని చెప్పేవారు. వారే లెట్రిన్స్ వాడకములోనికి తెచ్చారు. కార్యకర్తలమందరం ట్రెంచ్, బోర్‌వెల్ లెట్రిన్లను ప్రచారంలోనికి తెచ్చాము. (గుంట తీయుట, లోతుగా త్రవ్వే పాయిఖానాలు).

కంట్రోళ్ళ రాజ్యం ఇంకా కొన్ని సంవత్సరాలు ఉంటుందని అర్థమయింది. గ్రామీణ ప్రజా సమస్యలను తీర్చే మరికొన్ని సంఘాలు వచ్చాయి. రాజకీయంగా కొన్ని, రాజకీయ ప్రమేయం లేకుండా కొన్ని. 'రూరల్ పీపుల్స్ ఫెడరేషన్',

'ఫెడరేషన్ ఆఫ్ రూరల్ పీపుల్స్ ఆర్గనైజేషన్' (యఫ్.ఆర్.పి.ఓ.) ను నేను అధ్యక్షునిగా, శ్రీ యన్.వి. నాయుడు, శ్రీ సి.యల్. పటేలు గారలు కార్యదర్శులుగా ప్రారంభించాము. ఈ సంస్థ నేటికీ గ్రామీణ ప్రజలకోసం పనిచేస్తూనే ఉంది. దీనికనుబంధంగా భారత్ కిసాన్ సమ్మేళన్, ఆల్ ఇండియా హాండ్‌లూమ్ వీవర్సు కాంగ్రెసు, భారత్ గ్రామోద్యోగ సమ్మేళన్‌లు వచ్చాయి.

యఫ్.ఆర్.పి.ఓ. తరుపున ఒకటి, రెండు, నాలుగు ప్రపంచ సమావేశాలలో నాయకత్వం వహించాను. నేను ఐ.యఫ్.ఎ.పి. (ఇంటర్నేషనల్ ఫెడరేషన్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్) లో క్రియాశీలక సభ్యుణ్ణి. ఐ.యఫ్.ఎ.పి. 1944–52 లలో దేశంలోని కంట్రోళ్ళు ఎత్తివేయాలని ఆందోళన చేసి సఫలీకృతమైంది. దురదృష్టవశాత్తు నెహ్రూ మరల 1959–60 లలో కంట్రోళ్ళ రాజ్యం తెచ్చాడు.

ఫెడరేషన్ ఆఫ్ రూరల్ పీపుల్స్ ఆర్గనైజేషన్ చురుకుగా పనిచేసింది. శ్రీ సి.యల్. పటేలుగారు చనిపోయేవరకు (1962) ఈ సంస్థకు గౌరవాధ్యక్షునిగా కొనసాగారు. చాలా సమర్థుడైన వ్యక్తి. ఇటువంటి వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారు. వీరు రైతులకు, శ్రామికులకు, కిసాను ప్రజలందరికీ చేసిన సేవలు చిరస్మరణీయం. వీరు 'కారమసద్' (సర్దార్ పటేలుగారు జన్మించిన గ్రామం) లోనే జన్మించారు.

★ ★ ★

24. నెహ్రూ-రంగా సంబంధాలు ఎంత దగ్గరో అంత దూరం



నిజానికి నేను, నెహ్రూ మంచి మిత్రులుగా ఉండాలి. కానీ మా ఇరువురి మధ్య సఖ్యత కొరవడింది. మొదటిసారిగా ఆల్ ఇండియా కాంగ్రెసు కమిటీలో ప్రాథమిక హక్కులపై (Fundamental Rights) జరిగిన చర్చలో ఇరువురమూ చెరియొక పక్షానికి చెందిన వారిలాగా వాదించాము. సెప్టెంబరు 1931 న బొంబాయిలో జరిగిన A.I.C.C. లో ప్రాథమిక హక్కులపై చర్చ జరిగింది. నెహ్రూగారు ప్రాథమిక హక్కుల కమిటీవారు చెప్పినదానికల్లా తలూపి, వర్కింగు కమిటీలో ఈ చర్చాంశాన్ని యధాతథంగా ప్రవేశపెట్టాలని ఉన్నారు. నేను రైతుల కొరకు చాలా సవరణలు ప్రతిపాదించాను. జమీందారులు ప్రతి సంవత్సరం 30 కోట్ల రూపాయలను రైతుల నుండి వసూలు చేస్తున్నారు. భూమి యాజమాన్యపు హక్కును కాలరాస్తున్నారు. కౌలుదారుల హక్కులను కూడా దోచుకుంటున్నారు. నెహ్రూగారు కూడా మా ఉద్దేశ్యంతో ఉన్నా, తటస్థమైన వైఖరి నవలంబించి, నా సవరణలన్నింటినీ త్రోసిపుచ్చారు. మా మధ్య మానసిక మయిన ఘర్షణ మొదలయింది. వాడిగా వేడిగా చర్చలు జరిగాయి. నా సమాధానాల్లో ***"వారు నాడు సామ్రాజ్య వ్యతిరేక ధోరణి - నేడు జమీందారీల అనుకూల ధోరణి"*** ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశాను. (సామ్రాజ్యవాదులపైన వ్యతిరేక ధోరణి - సామ్రాజ్యవాదులయిన జమీందార్లపైన అనుకూల ధోరణి ప్రదర్శిస్తున్నారని అర్థం). వారికి నా మాటలు

చాలా 'అసంతృప్తి' కలిగించాయి. వారికివి రుచించలేదు. తరువాత 32 సంవత్సరాలు ఈ మాటలే వారి మదిలో ప్రతిధ్వనిస్తున్నాయి. ఈ సంఘటన జరిగిన సాయంత్రం గాంధీజీ నాతో "నెహ్రూతో తప్పుగా ప్రవర్తించవద్దని" చెప్పారు.

1933 లో నేను, నాతోపాటు ఉన్న వారందరమూ శాసనసభల్లో ప్రవేశించ టానికి ఇదే సమయం అని నెహ్రూగారికి చెప్పాము. నెహ్రూగారు కాంగ్రెసు సోషలిస్టు పార్టీ వారితో శాసనసభలను బహిష్కరించమని చెప్పారు. జమీందార్లు గత నాలుగు సంవత్సరాలు శాసనసభలో ఉండి బలపడ్డారు. జమీందారీ రైతులకు మేలు జరగాలంటే రైతులమయిన మేము శాసనసభలను బహిష్కరించటం సరికాదన్న నిర్ణయానికొచ్చాము. నెహ్రూగారి సలహాతో ఎలక్షన్ల చివరి దశలో C.S.P. ఎలక్షన్లు బహిష్కరించమని కోరింది. నేను 'కేంద్ర శాసనసభ'లో ప్రవేశించటం వారికి (నెహ్రూ) చాలా అయిష్టం ఉంది. కానీ వారి కేంబ్రిడ్జి మిత్రుడు శ్రీ ప్రకాష్ శాసనసభ్యుడుగా ఉండటం మాత్రం వారికిష్టమైంది. వారు లక్నో, ఫైజపూర్ సెషన్లలో మంత్రివర్గంలో కాంగ్రెసువారు చేరడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. కానీ తన చెల్లెలు (విజయలక్ష్మి పండిట్), రఫీ అహమ్మద్ కిద్వాయి గార్ల ప్రవేశం వారికిష్టమయ్యింది. ఇంత 'నిలకడ' లేని నాయకత్వాన్ని నేనెట్లా సహించేది? రాష్ట్ర రాజకీయాలు వామపక్షంవారికి ఇష్టమైతే కావచ్చు. కాంగ్రెసు ఆదేశంతో నేను శాసనసభలో ఉండటం తప్పుకాదు గదా!

రైతు రక్షణ యాత్ర (ఇచ్ఛాపురం నుండి మద్రాసు వరకు) చాలా గొప్పగా జరిగింది. నేను ఆల్ ఇండియా కిసాను కాంగ్రెసు అధ్యక్షుణ్ణయ్యాను. 1936లో ఫైజపూర్ కాంగ్రెసులో వారు నన్ను అసలు పట్టించుకోలేదు. చాలా సామాన్యునిగా చూశారు. వారి కనుసన్నలలో వామపక్షం ఉన్నది. పాత కాంగ్రెసు కాపులకు, పత్రికలవారికి నేను జవహర్‌లాల్‌ను వ్యతిరేకించడం గుర్తున్నది. "అలాగయితే నీ చర్చాంశాన్ని ఒక నిమిషంలో ప్రవేశపెట్టు (టేబుల్)" అని పెత్తందారీ ధోరణితో అన్నారు. "నా చర్చాంశాన్ని తయారుచేయటానికి నాకు వ్యవధి కావాలి. మీ నిరంకుశత్వం చెల్లదు" అని నేను వారికి జవాబిచ్చాను. సభ మొత్తం హర్షాతి రేకంలో మునిగిపోయింది. దాంతో వారీలోకంలోనికి వచ్చారు. వారు కాంగ్రెసు

సోషలిస్టులతో ఎక్కువగా పూసుకొని తిరిగేవారు. ఆల్ ఇండియా కిసాను కాంగ్రెసులో నాతోపాటు పోటీచేసి C.S.P. వారు ఘోర పరాజయం పొందారు. ప్రజలలో బలం లేదన్న సంగతి వారికి తెలుసు. సర్దారు పటేలు రైతు ప్రతిజ్ఞకు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకొన్నప్పటికీ నెహ్రూగారు నన్ను (ఆల్ ఇండియా కిసాను కాంగ్రెస్‌ను) బలపరచలేదు.

1938-42 లలో నేను విద్యార్థి ఉద్యమానికి బాసటగా నిలిచాను. వారికిదీ ఇష్టంలేకపోయింది. జమీందార్లకు వ్యతిరేకంగా రైతులు లాఠీలు చేపట్టాలి అనే స్వామి సహజానంద ఉద్యమానికి నెహ్రూ వ్యతిరేకి. నేను సుభాష్‌చంద్రబోస్‌ను బలపర్చడం వారికి నచ్చలేదు. కాంగ్రెసు సభల్లో రైతులకు అధిక ప్రాధాన్యత కోసం పోరాడేవాడిని. నేనీ విషయమై ఒత్తిడి తెచ్చేవాడిని. నా ఒత్తిడికి తోడుగా కాంగ్రెసులో తగాదాలు వారిని చికాకు కలిగించివుండవచ్చు. దేశాన్నంతటినీ కమ్యూ నిస్టులు తమ చేతులలోనికి తీసుకోవాలని ప్రయత్నాలు - ముఖ్యంగా కాంగ్రెసు సంస్థను. ఈ ప్రయత్నంలో భాగంలో ఎఱ్ఱజెండాల ప్రదర్శనలు, కాంగ్రెసు ఊరేగింపులో కమ్యూనిస్టులు కూడా ఉండటం వారికి నచ్చి ఉండక పోవచ్చు.

నన్ను సానుభూతితో అర్థంచేసుకోకపోవటం, ప్రేమ లేకపోవటం ఇవన్నీ వారి అసంతృప్తికి ముఖ్య కారణాలు. గాంధీగారు నాపై చూపే దయను వారు అర్థం చేసుకోలేదు.

త్రిపుర ఎలక్షన్లలో నేను, సుభాష్‌బాబు, వామపక్షీయులందరమూ అనుకూలంగా ఉన్నాము. రైటిస్టులతో సయోధ్యకు సహకరించలేదు. వారి నాయకత్వం నన్ను చాలా నిరాశపరచింది. వారు మహాత్మాగాంధీ తరువాత స్థాయి గల నాయకుడు. 1940-44 మధ్యకాలంలో నేను జైలులో ఉన్నప్పుడు వారి నాయకత్వంమీద నా అభిప్రాయం మారింది. వారి సామర్థ్యంమీద నా నమ్మకం పెరిగింది.

వారి ఆటోగ్రఫీ (జీవితచరిత్ర) చాలా చక్కని గ్రంథము. వారి రచనలు చాలా అందంగా ఉంటాయి.

★ ★ ★

25. సర్దార్ పటేల్‌తో నా సంబంధాలు

పటేలుగారు ఈరోజున ఉంటే మన దేశాన్ని ఫలానా ఫలానా సమస్యలనుండి గట్టెక్కించేవారని చాలామంది జర్న లిస్టులు, యం.పి.లు అనుకొంటూ ఉంటారు. చనిపోయిన తరువాత పేరు సంపాదించుకొనేవారు తక్కువ. సర్దారు పటేలుగారు ఈ కోవలోనివారు.

వారి దక్షిణాది మిత్రులైన రాజాజీ, పట్టాభిగారలు నాకు పటేలు వద్ద ప్రవేశం లేకుండా చేశారు. శ్రీ ఇందూలాల్ యాగ్నిక్‌తో పటేలుగారికి సరిపడేది కాదు. నేను యాగ్నిక్‌ను కిసాను కాంగ్రెసు అధ్యక్షునిగా చేశాను. యాగ్నిక్‌తో నా స్నేహం వలననే వారు కిసాను కాంగ్రెసుకు శత్రువయ్యారు. నేను సుభాష్ చంద్రబోసుగారితో సన్నిహితంగా ఉండేవాడిని. సుభాష్‌గారు బ్రిటీషువారితో యుద్ధం చేసయినా దేశానికి స్వాతంత్ర్యం తీసుకొనిరావాలని భావించేవారు. సర్దారు పటేలుగారు కాంగ్రెసు హయాంలో మంత్రివర్గాలకు ఎక్కువ అధికార ముండాలని అనేవారు. వారికి సుభాష్‌బాబుపై వ్యతిరేకత పెరిగిన కారణంగా నా రాజకీయంపైన కూడా కోపం పెరిగింది. ఎ.ఐ.సి.సి. బొంబాయిలో జరుగు తున్నప్పుడు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ప్రారంభోత్సవానికి వెళ్లి నేను దానిని ప్రారంభించాను. ఇది నేతాజీగారి సంస్థ. ఇది వారికి కోప కారణమైంది. మరుసటి రోజు రాజేంద్రప్రసాద్‌గారి గదిలో నన్ను చూడగానే “కాంగ్రెసు నుండి

ఎప్పుడు రాజీనామా చేస్తున్నావు" అని గద్దించి అడిగారు. "నేనెందుకు రాజీనామా చేయాలి? కాంగ్రెసు పార్టీ ఎవరి సొత్తు? మీ సొత్తా?" అని నేను తీవ్రంగా బదులిచ్చాను. రాజేంద్రప్రసాద్‌గారు మాకు సఖ్యత కుదిర్చారు. "సర్దార్! నీవు రంగాలో ఇంకొక సర్దారును చూడటంలేదా?" అని అన్నారు. సర్దారు పటేలు తన అందమయిన పలువరుస కన్పించేటట్టు మనస్ఫూర్తిగా నవ్వారు. "రంగా! నీవు ఫార్వర్డ్ బ్లాకులో చేరావు కదా! మరి కాంగ్రెసులో ఎందుకున్నావు?" అన్నారు. "సర్దార్‌జీ! నేను ఫార్వర్డ్ బ్లాక్‌లో చేరానని మీకెవరు చెప్పారు? వారి కార్యక్రమాన్ని ప్రారంభించానంతే!" అన్నాను. వారి కోపం అయితే తగ్గింది గానీ నాపై అసంతృప్తి మాత్రం పోలేదు.

ఉక్కు మనిషి పటేల్

చాలామంది కాంగ్రెసువారికి మేము అభిప్రాయ భేదాలతో విడిపోయి స్నేహితులుగా మెలగటం ఆశ్చర్యం కలిగించేది. గాంధీజీ నన్ను నమ్మారు. సర్దారుగారు నాపై అభిమానం పెంచుకున్నారు. వారు జీవించిన చివరి అయిదు సంవత్సరాలు నాతో స్నేహంగా ఉండేవారు. ఆయన నాపై నమ్మకంతో నా సలహాలు వినడం తోటి కాంగ్రెసువారికి ఆశ్చర్యం కలిగించేవి. అసూయ కలిగించేవి. నన్ను ఒక కాంగ్రెసు ప్రెసిడెంటుగా ఉన్న వ్యక్తి కార్యవర్గంలోనికి తీసుకోలేదు. పటేలుగారు తను కూడా కార్యవర్గంలో ఉండనన్నారు. ఆరు వారాలు ఈ గొడవ జరిగింది. అధ్యక్షులవారు నన్ను కార్యవర్గంలోనికి తీసుకున్న తరువాతనే పటేలుగారు కార్యవర్గ సమావేశానికి హాజరయ్యారు. తను నమ్మిన వారికి, తనను నమ్మినవారికి సాయం చేయడానికి ఎంత దూరమైనా వెళ్లేవారు. నేను ప్రజలకు, దేశానికి సేవ చేయడం వెనుక వారి ఉత్తేజకరమైన నాయకత్వం ఉంది.

కశ్మీరును పాకిస్తాను ప్రేరణతో ఆటవికులు ఆక్రమించినప్పుడు కాంగ్రెసు నాయకత్వం సెక్యూరిటీ కౌన్సిలుకు తెలివితక్కువగా పరుగెత్తింది అని వారు అభిప్రాయపడ్డారు. "ఏ క్రిమినల్ లాయర్ అయినా వాదికన్నా ప్రతివాదిగా ఉండటం మేలని చెప్తాడు" అని వారన్నారు. "మీరు క్రిమినల్ లాయరే గదా"

అన్నాను. వారి కళ్ళలో చిన్న మెరుపును చూశాను. వారు కశ్మీరు విషయమై తన అసమ్మతిని పలుమార్లు బహిరంగపరచారు.

హైదరాబాద్‌లో హిందువులకు రజాకార్ల నుండి రక్షణ లేదని దేశం అంతా బాధపడింది. రజాకార్లు 1 కోటి 70 లక్షల మంది హిందువులను బాధించారు, అవమానించారు. ఫాసిస్టుల్లాగా ప్రవర్తించారు. నేనా రోజులలో ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షుడిని. నెహ్రూగారిని, పటేలుగారిని, మౌలానా అబుల్‌కలాం ఆజాద్‌గారిని పలుసార్లు కలిశాను. పటేలుగారు 'హార్టు అటాక్' (గుండెపోటు)తో బాధపడుతూ కొన్ని నెలలు ముస్సోరిలో ఉన్నారు. తిరిగివచ్చిన తరువాత ప్రజల అసంతృప్తిని వారికి చెప్పాను. "మీ మిత్రుడు జవహర్‌ను అడగండి. వారు నన్ను ముస్సోరి నుండి 'గట్టి వాగ్దానం'తో తీసుకొని వచ్చారు. ఒక స్థిరమయిన నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. 15 రోజులు గడచినా ఏమీ జరగలేదు. ఇప్పుడు పార్లమెంటు సమావేశాలలో ఉన్నాం" అని అన్నారు.

బ్రిటీషు టోరీలు (కన్సర్వేటివ్‌లు), పాకిస్థాన్‌వారు రజాకార్లకు ఆయుధా లందిస్తున్నారని, ఆయుధ కర్మాగారాలను హైద్రాబాద్‌లో నిర్మిస్తున్నారని నేను వారితో చెప్పాను. "భయం వద్దు, మన మిత్రుడు (నెహ్రూ) అనుమతిస్తే ఇది ఒకటి రెండు రోజుల పనే. మిలటరీతో మాట్లాడాను" అన్నారు.

శ్రీ కె.యం. మున్షీగారిని హైద్రాబాద్ చుట్టుప్రక్కల ప్రాంతాలకు తీసుకొని వెళ్ళి చూపించాను. వారిని పటేలుగారు తన ప్రతినిధిగా నియమించారు. మున్షీ కూడా నా భయాలు వాస్తవమయినవేనని అన్నారు. పోలీసు చర్య మొదలయిన తరువాత రెండు రోజులలో హైద్రాబాద్ రాజ్యం భారత హస్తగతమయ్యింది.

నేను, సర్దారు విమానంలో మద్రాసు వెళ్ళాము. అక్కడ రాజాజీ హాలు ప్రారంభం. రాజాజీగారి నిలువెత్తు చిత్రపటావిష్కరణ ఉంది. విమానం ఎక్క బోతున్నాం. న్యూస్‌పేపర్లు వారి చేతిలో పెట్టారు. "తారాసింగ్‌ను రాత్రి అరెస్టు చేశారు" అని వారి సహాయకులు చెప్పారు. "ఏమైనా గొడవ జరిగిందా?" అన్నారు. 'లేదు' అని సమాధానం. "చాలా చక్కగా జరిగింది" అన్నారు. ఆ తరువాత రోజులలో వేలకొద్దీ అకాలీలు అరెస్టు అయ్యారు. నేను పంజాబులో జరిగిన 'చక్కని చర్యగా' దానిని భావించలేదు.

ఆరోజు వారికి, రాజాజీగారికి గల సత్సంబంధాలను, గాంధీగారికి రాజాజీపై గల ప్రేమను గురించి చాలా నిజాయితీగా ఉపన్యసించారు.

పత్రికలవారంతా నన్ను చుట్టుముట్టారు. పి.టి.ఐ. (ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా) "మీరు కేంద్ర మంత్రివర్గంలో చేరుతున్నారటగదా" అని నన్ను ప్రశ్నించింది. ఇంతకు పూర్వం ఇటువంటి 'రూమర్ల'కు నవ్వి తప్పించుకునేవాడిని. కానీ పటేలు సమక్షంలో నేనాపని చేయలేకపోయాను. విమానంలో ప్రయాణిస్తూ నెహ్రూగారి మంత్రివర్గంలో చేరటానికి నా అసమ్మతిని తెలియజేశాను.

"నెహ్రూగారిని కాదని నన్ను బలపరచే ఒక్క వ్యక్తి కూడా మంత్రివర్గంలో లేడు. నాకు ప్రాధాన్యత లేని వేరొక కమిటీలో నేను చేరదలచలేదు. నా మనస్సులో ఈ బాధతో నేను వారితో మంత్రివర్గంలో ఉండలేను. నేను అందరిలో ఒకరిగా ఉండలేను. నెహ్రూగారిని ఈ దేశం ఎంతో ప్రేమిస్తున్నది. వారి అడుగులకు మడుగులొత్తడం నాకు చేతకాదు" అని అన్నాను.

"ఒక అవకాశము తీసుకోవచ్చుగదా?" పటేలుగారన్నారు.

"వారి దయతో బతకటం నాకిష్టంలేదు. వారు కంట్రోళ్ళు ఎత్తివేయరు. బలవంతపు ధాన్య సేకరణ ఆపరు. నేనీ విషయాల్లో వారితో రాజీపడను" అన్నాను.

రంగా-పటేలు సంభాషణలు

నేను రాజేంద్రప్రసాద్‌గారిని, నెహ్రూగారిని ఆహారపదార్థాల కంట్రోళ్ళు ఎత్తివేయవలసిందని పలుమార్లు కోరాను. పటేలుగారు కూడా నాతో ఏకీభవించేవారు. ఎట్టకేలకు కంట్రోళ్ళు ఎత్తివేశారు. అప్పుడు వారెంతో సంతోషించారు. కానీ జవహర్‌లాల్‌గారు మరలా కంట్రోళ్ళు విధించారు. వారు నిస్సహాయులుగా మిగిలిపోయారు.

రాజభరణాలను ఆపకుండా తప్పనిసరిగా ఇస్తూ ఉంటామని, ఆఫీసర్ల జీతాలు, రక్షణలు పొడిగిస్తామని నాకు చెప్పిన రెండు విషయాలు నాకు బాగా గుర్తున్నాయి. ఈ విషయాలను పార్లమెంటులో సభ్యులందరూ ఒప్పుకున్నారు. సంస్థాగతమైన విషయాలలో మౌనంగా ఉండేవారు. నేను ఉద్రేకపడుతుండే

వాడిని. వారు తన ఎడమచేయి నా భుజంమీద వేసి నన్ను సముదాయించే వారు. వారి ఆత్మీయత, వారి ధైర్యసాహసాలు, వి.పి. మీనన్, సి.సి. దేశాయి, శంకర్‌బెనర్జీ వంటి నా మిత్రులెందరినో ప్రభావితం చేశాయి.రాష్ట్ర పునర్నిర్మాణాల బాధ్యతను బాగా నిర్వహించిన వి.పి. మీనన్‌గారు, వారి కుమారుడు దయాభాయి పటేలుగారు, వల్లభాయ్ యూనివర్శిటీ నిర్మాత శ్రీ బైలాభాయ్ పటేలుగారు ఈ స్వతంత్రోద్యమంలో (స్వతంత్ర పార్టీ) ఉన్నారు. చరిత్ర పరిణామాలకు రాజాజీ వంటివారు కూడా చకితులౌతుంటారు. పటేలు గారి స్నేహాన్నిప్పటికీ గౌరవిస్తూ ఉంటారు. "వారి ఆలోచనలు, వారి పనులు నా మనస్సులో మెదలుతూనే ఉన్నాయి" అని రాజాజీగారనేవారు. వారు ధైర్య సాహసాలకు మారుపేరు. ఏలూరులో (పశ్చిమగోదావరి జిల్లా) వారి చిత్రపటాన్ని 1960 లో రాజాజీగారు ఆవిష్కరించారు.

1965లో 17వ రాజ్యాంగ సవరణకు వ్యతిరేకంగా మేము చేసిన పార్లమెంటు యాత్రను రాజాజీగారు ఆశీర్వదించారు. పార్లమెంటు సెంట్రల్ స్ట్రీట్‌లో ఉన్న పటేలుగారి విగ్రహానికి గులాబీలు, బంతిపూలు సమర్పించడంతో మా యాత్ర మొదలయినది.

★ ★ ★

26. ప్రజాస్వామ్య కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్ – సుభాష్‌బాబు ప్రోత్సాహం

23–1–1967 న నిడుబ్రోలు రామానీడు విద్యాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జన్మదినాన్ని జరుపుకున్నాం. నా ఉపన్యాస సందర్భంగా 1940న మద్రాసు 'వాహిని' పత్రిక సంపాదకవర్గాన్ని, కార్మికులను, వారు నాకందిస్తున్న సహకారాన్ని చూచి వారిని సుభాష్ చంద్రబోస్ ఎలా అభినందించింది గుర్తుచేసుకున్నాను. వారు 'ఇది నీ విప్లవ కార్యకర్తల కర్మాగారం' అని అన్నారు. ఒక కార్యకర్త 'నిడుబ్రోలులో మా ముఖ్య కార్యస్థానముంది' అన్నారు. 'ఆ ఆ రైతాంగ విద్యాలయం కూడా నాకు గుర్తుంది' అన్నారు. వారు స్నేహాన్ని ఆవిధంగా వృద్ధిచేసుకొనేవారు. ఆ సాయంత్రం బీచ్‌లో (దేశోద్ధారక ఘాట్) జరిగిన అతిపెద్ద సభలో నేను మాట్లాడుతూ "ఈ దక్షిణ భారతీయ సభ ఒక హిమాలయ సదృశమైన ధైర్యవంతుణ్ణి చూస్తున్నది. సుభాష్‌బాబు నేటి కాంగ్రెసు మంత్రివర్గంతోనూ, బ్రిటీషు సామ్రాజ్యవాదులతోనూ ఢీకొంటున్నారు" అని అన్నాను. ఈ సభలో కాంగ్రెసు మాజీ అధ్యక్షుడు కీ.శే. యస్. శ్రీనివాస అయ్యంగార్ కూడా మాట్లాడారు.

---

1. ఆలిండియా ఫార్వర్డ్ బ్లాకు, నెహ్రూలని ఉద్దేశ్యం.
2. ఇప్పటికే 9 మంది ఫార్వర్డ్ బ్లాకువారు జైళ్లలో మగ్గుతున్నారు. ఆచార్య రంగా, స్వామి సహజానంద గార్లు జైలులోనే ఉన్నారు.

(ఈ ఉపన్యాసాలు 1962 సెంట్రల్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియావారు ప్రచురించిన – సుభాష్ చంద్రబోస్ ఉపన్యాసాల నుండి)

1939 లో తమిళనాడు రాష్ట్ర కిసాన్ నాయకులకు ఒక సందేశం ఇస్తూ 'నిజాయితీపరుడు, అత్యంత విలువైన స్నేహితుడైనాడు' అని నా గురించి చెప్పారు.

ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాకుకు జూన్ 1941న నాగపూర్‌లో చేసిన అధ్యక్షోప న్యాసంలో గత 12 నెలల ఉదంతాలు మా అంచనాలు సరైనవే అని నిరూపించి నవి. స్వామి సహజానంద, ఆచార్య రంగా, కామ్రేడ్ ఇందూలాల్ యాగ్నిక్, ఫార్వర్డ్ బ్లాకువారు ఎవరున్నారు మితవాదుల్లో. (వారి ఉద్దేశ్యంలో రైటిస్టులంటే గాంధీ, పటేలు, నెహ్రూలని).

1931 లో కరాచీ కాంగ్రెసు సభలలో స్వరాజ్యం వచ్చిన తరువాత 'నాయకత్వమెవరిది' అని మేము చర్చించాం. కమ్యూనిస్టులు ఆరోపించినట్లు బోసు 'ఫాసిస్టు' కాదు. రైతులు–కార్మికులకు తగిన భాగస్వామ్యముండవలసిందే నని వారన్నారు. మా 'కిసాను మజ్దూర్‌రాజ్'ను బలపరచటానికి సిద్ధమైనారు. 1939 లో రామ్‌ఘర్ సమావేశం తరువాత వారు వెనుకాడారు. యుద్ధాల మధ్యకాలంలో యూరోపులోని మధ్యతరగతివారు రైతులు – కార్మికులకు వ్యతిరేకంగా ఉండటమే దీనికి కారణం.

వారు నాతో "రంగాజీ! మీ నినాదాన్ని ఇంకా విశాలతరం చేయండి. మధ్య తరగతి వారందరినీ భాగస్వాములను చేయండి. వారికి కూడా గౌరవప్రదమయిన చోటు కల్పించండి. మీ నినాదం కిసాను మజ్దూర్ రాజ్యం మంచిదే కానీ విశాలమైనది కాదు. మన దేశంలో కూడా తరతరాలుగా మధ్యతరగతివారు స్వదేశం కొరకు చేసిన త్యాగాలు మరువలేనివి గదా" అన్నారు.

వారు నిజాయితీగా చేసిన ఈ విమర్శ (వెల్లూరు–తిరుచినాపల్లి జైళ్ళలో 1940–41లో) నన్ను తీవ్రంగా ఆలోచింపజేసింది. సాంఘికంగా, నిజాయితీగా ముందు నడిచే మధ్యతరగతివారిపై నా ఆలోచనలు ప్రసరించినవి.

నేను ఫాసిస్టులను గూర్చి, నాజీలను గూర్చి అధ్యయనం మొదలుపెట్టాను. ప్రజాస్వామ్యంపైనా, మార్క్సిజంపైనా ఈ 'ప్రతీఘాతశక్తుల' ప్రభావాన్ని ఆలో చించాను. పట్టణాలలోని మధ్యతరగతివారు, మధ్యయుగాల్లో ఎలా ఈ సాంఘిక ప్రతీఘాత శక్తులకు స్పందించారో ఆలోచించాను. 'మార్క్సు నిజంగా ఏం చెప్పాడు?' (What Marx really means) అనే 'కోల్' గ్రంథము నుండి, జాన్‌స్ట్రాచ్ వ్రాతలను బట్టి, మధ్యతరగతివారు లేకపోతే బ్రిటీషు లేబరు పార్టీ లేదు, 1929 లో అధికారానికి వచ్చేదికాదని తెలుసుకున్నాను. ప్రజాస్వామ్యానికి

ఈ మధ్యతరగతివారే మార్గదర్శకులు అని నమ్మి, వీరి వత్తాసు కూడగట్టాలని నిర్ణయానికి వచ్చాను. 1942 కు కిసాను, కళాకార్, మజ్దూర్, బుద్ధిజీవుల రాజ్యంగా, స్వరాజ్యం రావాలని ఆకాంక్షించాను. దీనికి క్లుప్తంగా 'కిసాను మజ్దూర్ ప్రజారాజ్యం' అనే పేరు పెట్టాను. 'ప్రజా' అనేది సమాజంలోని అన్ని వర్గాల శ్రామికులకు సంకేతం.

నేషనల్ యునైటెడ్ ఫ్రంటు విచ్ఛిన్నం, కమ్యూనిజంపై ఉన్న భ్రమలు తొలగిపోవడం, ప్రభుత్వ గుత్తాధిపత్యంపై వ్యతిరేకత, ప్రజాస్వామ్యంపై ప్రత్యేక శ్రద్ధ మా నినాదాన్ని డెమోక్రాటిక్ (ప్రజాస్వామ్య) కిసాను మజ్దూర్ ప్రజారాజ్‌గా మార్చేటట్లు చేసింది.

నేనీ ఆదర్శాన్ని 'కనుగొన్నందుకు' చాలా ఆనందించాను. ప్రజాస్వామ్య కిసాను మజ్దూర్ ప్రజారాజ్ అనే మాటకు నా మనస్సంతా ఆనందంతో ఊగిపోయింది (అప్పుడు వెల్లూరు-దావో జైళ్ళలో ఉన్నాను).

1942 ఏప్రిల్‌లో నేను జైలు నుండి విడుదలయ్యాను. క్రిప్సు రాయబారం విఫలం అయింది. గాంధీగారు, ఇతర నాయకులు రెండవ జాతీయ సమరం సాగించడానికి సిద్ధమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో 'వార్ధా'లో రెండుసార్లు గాంధీ గారిని కలిశాను. వారికిక్కడ పొలాల్లో పనిచేసేవారిని గురించి చెప్పాను. సుభాష్ చంద్రబోస్‌తో నా చర్చలు చెప్పాను. కమ్యూనిస్టుల వ్యతిరేకతా చెప్పాను. స్వరాజ్యం వచ్చిన తరువాత 'రైతులను' మీరు మరచిపోతారని అన్నాను. ఇది భారతదేశంలోనే కాదు స్వతంత్రం వచ్చిన తరువాత చాలా దేశాల్లో జరిగిందని చెప్పాను. గాంధీగారు సరైన సమయంలో నేనీ విషయమై నీతో మాట్లాడతాను అన్నారు.

జవహర్‌లాల్‌తో నేనీ విషయమై చర్చించాను. ఎట్టకేలకు బొంబాయి ఎ.ఐ.సి.సి. సమావేశం ఆగస్టు 1942 లో రాజకీయాధికారం పొలాల్లో శ్రమించే కర్షకులకు, ఫ్యాక్టరీలలో శ్రమించే కార్మికులకు చెందుతుందని జాతీయ ప్రభుత్వం హామీ ఇచ్చింది. నేను సంతోషంతో ఉప్పొంగిపోయాను.

నవంబరు 1944 న గాంధీగారు నాతో మాట్లాడుతూ 'డెమోక్రటిక్ కిసాను మజ్దూర్‌రాజ్‌కి జై' అని నినదించి 'నీకిప్పుడు సంతృప్తిగా ఉందా?' అని అడిగారు.

నా కష్టాలు గట్టెక్కాయని భావించాను. సుభాష్‌బాబు ఆశయం కూడా సిద్ధించిందని నేను సంతోషించాను. అప్పటికే వారు 'నేతాజీ' అనే పేరు ప్రజలలో సంపాదించుకున్నారు. ★

27. కె.యం.పి.రాజ్‌కు బాపూ ఆశీర్వాదం

నా ఆలోచనలను బాపూ ఆమోదించారు. ఆనంద సంభ్రమంలో ఉన్నాను. నా ఎన్నో ఏళ్ళ కల ఫలించింది. రెండు దశాబ్దాల నా అపనమ్మకానికి, విశ్వాస రాహిత్యానికి తెరపడింది.

చాలామందికి (కిసాను కాంగ్రెసువారితో సహా) కిసాను రాజ్యం వస్తుందని నమ్మకం లేదు. ఆచార్య నరేంద్రదేవ్ గయ కిసాను కాంగ్రెసుకు 1938 లో అధ్యక్షత వహించారు.వారు కిసానురాజ్‌కు ఆమోదం తెలిపారు. కమ్యూనిస్టులకు, సోషలిస్టులకు ఈ భావన విజయవంతమవుతుందని నమ్మకం లేదు. కాంగ్రెసు అధ్యక్షులు సుభాష్‌చంద్రబోసు కిసానురాజ్‌కు ఆశీస్సులిద్దామని తలచారు. మేము కిసాను మజ్దూర్‌రాజ్‌కు ఆశీర్వాదం ఇవ్వమని కోరాము. అంటే రైతుకూలీ రాజ్యం. వారు సందిగ్ధంలో పడ్డారు. కమ్యూనిస్టులకు, వారి సహయాత్రికులకు రాజకీయంగా, సాంఘికంగా అణగద్రొక్కబడిన రైతుకూలీలపై నమ్మకం లేదు.

రైతులు, కళాకారులు (చేతివృత్తులవారితో సహా) రాజకీయాధికారం కోసం, సాంఘిక న్యాయం కోసం పరుగులెత్తడం నేను అర్థంచేసుకున్నాను. రైతు రాజ్యాన్ని నేను, నా సహచరులు భగవద్వాక్యంగా ప్రచారం చేశాము.

నేనీ ఉదాత్తమయిన ఆశయ సాధన కోసం బాపూజీ ఆశీస్సులకై అర్రులు సాచాను. ధార్మికభావన గల రాజకీయ ప్రచారం వారి ఆశీస్సులతోనే సాధ్యం అని, ప్రజల మనస్సులలో ఈ భావన చిరస్థాయిగా ఉండగలదని తలచాను.

వెల్లూరు-తంజావూరు జైళ్ళలో కిసాను మజ్దూర్ ప్రజారాజ్యం గురించి తీవ్రంగా ఆలోచించాను. అక్కడ ఉన్న నా సహచరులతో చర్చించాను. 1942లో జైలు నుండి విడుదలకాగానే గాంధీజీ ఆదరణపూర్వక, ఆనందమయిన నవ్వును చూడగనే నేను స్థిమితపడ్డాను. ఆర్థిక, రాజకీయ అధికారంలో రైతుకు గల

వాటాకు వారు హామీ ఇవ్వగనే ఆ క్షణం తిరిగిరాదేమో అన్నంత సంతోషం కల్గింది. మా కిసాను కాంగ్రెసు తపస్సు వృధా కాలేదు.

బాపూగారి అనుమతి మనస్ఫూర్తిగా ఇచ్చినదే అనే నమ్మకం, కానీ వారి సలహాదారులు అడ్డుపడతారేమోనన్న అపనమ్మకం నా ఆలోచనల్లో చోటుచేసు కున్నాయి. వారు స్వేచ్ఛగా, ఏవిధమైన అరమరికలు లేకుండా మాట్లాడిన తీరు నాకానందాన్ని కలిగించింది. మరుసటి రోజు మరలా కలిశాను. "కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్‌కు ఇంకా ఏమి కావాలి?" అని వారడిగారు. ఆ మాటకు నేనెంతో ఉద్విగ్నుడనయ్యాను.

"ఉదయపు చర్చలను వ్రాసి ఇవ్వగలవా?" అన్నారు. నేనా సాయంత్రం వ్రాతపనిలో నిమగ్నుడనయ్యాను. కుర్షిద్‌బెన్ జోషిగారు (దాదాబాయ్ నౌరోజీ గారి మనుమరాలు) నాకు ఈ పనిలో సాయపడ్డారు.

శ్రీమతి భారతీదేవి, నేను చాలాసార్లు వారి సాయంకాలపు ప్రార్థనల్లో పాల్గొన్నాము. ఆ భగవదారాధన మాకెంతో స్థైర్యాన్నిచ్చింది. ఈ మహత్తు మేము చేసే వివిధ మతాల ప్రార్థనల వలన కలుగుతున్నదా? లేక గాంధీగారి ఉత్కృష్ట దర్శనం వలన కలుగుతున్నదా? భగవదారాధనలో వారు గొంతెత్తి పాడేవి, మౌనంగా చేసేవి (ప్రార్థనలు) తనతో ఉన్న వారందరినీ భగవత్ కృపకు పాత్రులను చేసేవి. నేనీ నైతికశక్తిని వారి సన్నిధిలోనే సంపాదించుకున్నాను. నవంబరు 1944 న వారితోకలసి రెండు రోజులు నేను చేసిన ప్రార్థనలో నాలో అలౌకిక భావప్రకంపనలను కలిగించినవి.

ఒకటి రెండుసార్లు ప్రార్థన చేస్తున్న బాపూను కళ్ళెత్తి చూశాను. పాట మొదలుకాగానే వారు తనపై ఉన్న వస్త్రాన్ని సర్దుకొని కూర్చునేవారు. అభివ్యక్తీకరించలేని ఒక అలౌకిక భావనలో వారు, వారితోపాటే ఉన్న మేము అదే అనుభూతిని పొందేవారము. క్షణాల క్రితం మాతో ఎంతో సన్నిహితంగా నవ్వుతూ మాట్లాడిన వ్యక్తి వీరేనా అని సంశయిస్తాము. ఏకాగ్రత, ఆత్మనిగ్రహం, ఆధ్యాత్మికత వారినందరినీ సన్నిహితులను చేసింది. కొన్ని క్షణాల క్రితం మాతో సన్నిహితంగా ఉన్న వ్యక్తి, చిరునవ్వులు చిందిస్తూ మాట్లాడుతూ అందరితో కలసిమెలసి ఉన్నది వీరేనా అనిపిస్తుంది.

కిసాను, మజ్దూర్, కళాకార్, బుద్ధిజీవుల రాజ్య స్థాపనకు వారు ఆమోదించి నప్పుడు వారు ఎంత బరువును నాపై ఉంచారో నాకర్థమైంది. అన్ని చేతివృత్తుల కొరకు వారి ప్రచారం, కళాకారులపై గల ప్రేమ, స్వతంత్రులు, సహకార జీవనులు, ప్రజానురక్తి గల రైతులను వారు ఎంతగా ప్రేమిస్తున్నది నేనాడు అర్థంచేసుకున్నాను. 1920లో ఈ విభాగాల రక్షణకై వారు కంకణధారులయ్యారు. గ్రామీణ నాగరికతను అభినందిస్తూ యాంత్రిక వికేంద్రీకరణ, దోపిడీలను వారు నిరసించారు. ఏ రాష్ట్రానికి బానిసగా ఉండని రైతులను వారభిమానించారు.

ప్రపంచవ్యాప్తంగా రంగుజాతులవారికోసం, అణగద్రొక్కబడుతున్నవారికోసం, స్వతంత్రం కోసం అగ్రులుచాచే వారికోసం వారేవిధంగా శ్రమిస్తున్నది నేనర్థం చేసుకున్నాను. వారి దూరదృష్టి, కలుపుగోలుతనం, మానవ సంతోషానికై వారు పడుతున్న తపనలు నన్నాకర్షించాయి.

బాపూ ఆలోచనలలో గుత్తాధిపత్యానికి, ఒక వర్గానికి, అధికారస్వామ్యానికి, అల్పసంఖ్యాకులపై దౌర్జన్యానికి స్థానం లేదు. వారిది 'గాంధీ మార్గం'.

ప్రార్థన ముగిసిన తరువాత నన్నారాత్రి 9 గంటలకు కలువవలసిందిగా గాంధీగారు కోరారు. ఒక అరగంట మాట్లాడిన తరువాత వారు అలసిపోవడం గమనించాను. వారి వద్ద నుండి ఆరోజుకు సెలవు తీసుకున్నాను.

1934 లో నేను ప్రారంభించిన 'రైతాంగ విద్యాలయం' ఆలోచనలలో, సంఘ నిర్మాణంలో ఎలా ముందుకు సాగుతున్నదో వారికి వివరించాను. భారత దేశానికంతటికీ ఇటువంటి సమాజ నిర్మాణపు అవసరాన్ని, అహమ్మదాబాద్‌లో మజ్దూర్ సంఘం పనితీరును, వారు ప్రజలకేవిధంగా బాధ్యులుగా ఉన్నదీ తెలుసుకోవలసిందని చెప్పాను. పటేలు అధ్యక్షులుగా, గుల్జారీలాల్ నందా కార్యదర్శిగా ఉన్న హిందూస్థాన్ మజ్దూర్ సేవక్ సమాజ్ ప్రభావాన్ని గురించి వ్రాయమన్నారు. వారి రాజ్యాంగంలో గాంధీగారు కె.యం.పి.రాజ్ ఆదర్శాలను పొందుపరచేటట్లు చూశాను. తర్వాత అఖిల భారత విద్యార్థి కాంగ్రెసు, యువజన కాంగ్రెసు ఇదే బాటలో నడిచాయి. ★

అహమ్మదాబాద్ నుండి (గాంధీగారి వ్రాతలను ప్రచురించే) 'నవజీవన్' ఒక ప్రత్యేక కరపత్రాన్ని ప్రచురించింది. 1950, 1962 లలో గాంధీగారిని గురించి భారత ప్రభుత్వం విడుదలచేసిన పుస్తకంలో దీనిని ఐదవ అధ్యాయంలో చూడవచ్చును.

28. యుద్ధ నిర్బంధం (1940)

30–3–1940 న ప్రభుత్వం నాకు గృహ నిర్బంధం విధించింది. గృహ నిర్బంధాన్ని నేను అంగీకరించలేదు. గవర్నమెంటు 18 నెలల కఠిన కారాగార వాసం విధించింది. గాంధీగారు గృహ నిర్బంధాన్ని అంగీకరించమని, జైలు నుండి బయటపడమని నన్ను ఆదేశించారు. ఈ విషయం తెలియగనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నన్ను విడుదల చేయటానికి సంతోషంగా ఒప్పుకున్నారు. ఈ దురదృష్ట పరిణామం నన్ను బాధించింది. బ్రిటీషు సామ్రాజ్యవాదుల ఎదుట 'మోకాళ్ళు వంచడాన్ని' నేను వ్యతిరేకించాను. గాంధీగారి ఆదేశాన్ని నేను తిరస్కరించాను.

గాంధీగారు నాపట్ల నిర్దయగా వ్యవహరించారు. కాంగ్రెసు క్రమశిక్షణను ఉల్లంఘించానని, సుభాష్‌చంద్రబోసుతో కలసి ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటానికి సిద్ధపడ్డానని వారు భావించారు.

నా అరెస్టు, నాకు విధించిన శిక్ష తెలియగనే బీహారు, బెంగాలు, ఉత్తరప్రదేశ్‌ల లోని ప్రజలు అరెస్టుకు సిద్ధమై, ప్రభుత్వ ఆదేశాలను గౌరవించకుండా, ఉద్యమం లోనికి ఉరికారు. నేను, వామపక్షాలవారు దీనికి కారణం అని గాంధీగారు అనుకున్నారు. స్వతంత్రంగా సత్యాగ్రహం చేయటం క్రమశిక్షణా రాహిత్యమేనని గాంధీగారు తలచారు. నాపై ఈ అన్యాయపు నిర్ణయాన్ని ప్రకటించారు. దేశం లోని వివిధ ప్రాంతాల ప్రజలు గాంధీగారి నిర్ణయాన్ని ప్రశ్నించారు. గాంధీగారు వారం రోజుల తరువాత నా గురించి కొన్ని సానుభూతి మాటలు పలికి "జయప్రకాశ్ నారాయణకన్నా నేనే తనకు ఎక్కువ ఇష్టుడన"ని చెప్పారు.

బ్రిటీషు ప్రభుత్వం గాంధీగారి అభిప్రాయాన్ని నాకు తెలియజేసింది. జవాబుగా

25 పేజీల సమాధానాన్ని ప్రభుత్వం ద్వారా గాంధీగారికి పంపాను. దీని పూర్వాపరాలు, కాంగ్రెసు కార్యవర్గ బాధ్యతారాహిత్యం వలన తమ విలువైన కాలాన్ని ఎలా పోగొట్టుకున్నది వారికి తెలియజేశాను. గాంధీగారి విధానమే నేను అవలంబిస్తున్న స్వతంత్ర విమోచనకు ముఖ్యోద్దేశము వారికి తెలియజేశాను.

మార్చి 1940 న 'మందసా' రైతులను రెచ్చగొట్టినందుకు ప్రభుత్వం వేరొక 'కేసు' నాపై పెట్టింది. ★గాంధీగారు నన్ను ఈ ఆరోపణలకు సమాధానం చెప్పమన్నారు. వారి ఈ ప్రకటనతో ఈ రెండు నెలల్లో మా ఇరువురి మధ్య జరుగుతున్న పోరాటానికి తెరపడింది. గాంధీగారి నిష్పక్షపాత వైఖరి నాకు బోధపడింది. 'మందసా' రైతులను రెచ్చగొట్టినందులకు ప్రభుత్వం సంవత్సరం జైలు శిక్ష విధించింది. గాంధీగారు నాపై క్రమశిక్షణాచర్యలను ఉపసంహరించుకున్నారు.

నా బ్రిటీషు వ్యతిరేకతను సమర్థిస్తూ సుభాష్‌చంద్రబోసు తన 'ఫార్వర్డుబ్లాకు' పత్రికలో సంపాదకీయం వ్రాశారు. మితవాదుల సంతోషాన్ని వారాక్షేపించారు. మితవాద మిత్రుల కుట్రగా దీనిని వర్ణించారు. శ్రీమతి భారతీదేవి, సోదరుడు లక్ష్మీనారాయణ, శ్యామ్‌బాబు, గొట్టెపాటి ప్రభృతులు నా వెనుకనే నిలిచారు.

★ The following extracts from Tendulkar's book on the Mahathma will indicate the approach of Gandhiji towards the proposal of struggle against Government that Rangaji and Subash Babu were making in 1940 and also how Gandhiji felt about Rangaji.

"So far as I can see, at present, Mass Civil Disobedience is most unlikely."

"Both Prof. Ranga and Sri Jayaprakash Narayan", wrote a correspondent "have been punished under the law. But while you were moved by the latter's sentence, you have denounced Ranga." Gandhiji replied "there is no room in public life for partial friendships. Real friendship is in no need of partiality, I have none for Sri Jayaprakash. Nor have I any antipathy towards Prof. Ranga. I have perhaps less differences with Prof. Ranga, than Sri Jayaprakash. I also warn those who accept Congress disciplines against such breeches." As what Rangaji did in defying the Government's order, without obtaining Gandhiji's permission (Volume V, Page 276).

ప్రభుత్వ అధికారానికి వెరువలేదు గాని గాంధీగారి నైతిక శక్తికి మేము భయ పడ్డాము. సుభాష్‌చంద్రబోసుతో నా స్నేహాన్ని చాలామంది కాంగ్రెసు పెద్దల వలెనే గాంధీగారు కూడా ఆమోదించలేదు. అసంతృప్తికి గురయ్యారు. సుభాష్ చంద్రబోసు ఐచ్ఛిక అజ్ఞాతవాసం తరువాత గాంధీగారు నన్ను బలపరిచారు. 1944 నవంబరులో నా జైలుశిక్ష పూర్తి అయింది. వెంటనే వారిని కలిశాను. వారు నన్ను తన గుండెలకు హత్తుకొన్నారు. నా రెండు నెలల బాధను తన ఆలింగనంతో తీసివేశారు. వారు తన ప్రవర్తనకు విచారం వ్యక్తపరిచారు. 1944 నుండి వారి మరణం వరకు మనస్ఫూర్తిగా నాపై నమ్మకం ఉంచారు.

నాకు, గాంధీజీకి అభిప్రాయ భేదాలు వచ్చినందుకు కాంగ్రెసులోని మిత వాదులు, కమ్యూనిస్టులు చంకలు గుద్దుకున్నారు. తరువాత కాలంలో గాంధీగారికి నాపై గల నమ్మకానికి నిరాశ చెందారు. గాంధీగారు అత్యున్నత విలువలు గల మహానుభావుడు. వారు తనంత తానుగా నా స్నేహితుడు 'నేతాజీ' గొంతును (ఉపన్యాసాన్ని) రేడియోలో విన్నాను అని చెప్పారు. వారికి నేనంటే ఎంత ప్రేమో!

★ ★ ★

29. వలస ప్రజల ఫ్రీడం ఫ్రంట్

రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో చాలామంది బ్రిటీషు సోషలిస్టులు, కార్మిక నాయకులు మా (ఇండియా) జాతీయోద్యమ ప్రస్తావనకు వ్యతిరేకంగా ఉన్నారు. మా ప్రవర్తనతో వీరు 'షాక్'కు గురయ్యారు. ఫాసిస్టులు, నాజీలు యుద్ధంలో ఓడిన తరువాత కూడా వీరు తమ అసమ్మతిని తెలియజేస్తున్నారు. 1946 లో వ్యవసాయ ఉత్పత్తులపై జరిగిన మొదటి ప్రపంచ సమ్మేళనంలో వీరీవిధంగా ప్రవర్తించారు.

"బ్రిటీషు పాలనలో ఉన్న భారతదేశం - అమెరికా, రష్యాల వలె స్వతంత్ర దేశమే! 1935 లో మా ప్రమేయమేమీ లేకుండానే మేమీ యుద్ధంలోనికి లాగ బడ్డాం. చట్టబద్ధంగా ఏర్పాటయిన రాజ్యాలను ఇటాలియన్ ఫాసిస్టులు, హిట్లరు నాజీలు కూల్చుతుంటే బ్రిటీషు ప్రభుత్వం తటస్థ వైఖరిని అవలంబించింది. జపాను చైనాపై దాడిచేసినప్పుడు కూడా బ్రిటన్ ఇదే నిర్లక్ష్య ధోరణి నవలం బించింది. అబిసీనియా స్వేచ్ఛను ముస్సోలినీ హరించినప్పుడు ఫ్రాన్స్, ఇంగ్లాండు, అమెరికాలు ఏవిధమైన స్నేహ హస్తం అబిసీనియాకు అందించలేదు. చెకోస్లోవేకియాపై ఇంగ్లాండు, ఐరోపాలోని దేశాలు, ఫ్రాన్సు ఈ వైఖరినే అవలం బించాయి. 'పెరల్ హార్బరు'పై బాంబింగ్ జరిగినప్పుడు గాని అమెరికా కళ్ళు తెరవలేదు. రష్యా హిట్లరుతో ఒప్పందం చేసుకున్న తరువాతనే జర్మనీ పోలాండుపై దురాక్రమణ జరిపింది. పోలాండులో సగభాగాన్ని జర్మనీ కాజేసింది.

భారతీయులందరూ స్పానిష్, చెకోస్లోవేకియా (సూడెటాను), అబిసీనియా పక్షాన ఉన్నారు. ఆహారపదార్థాలను ఒక పడవ నిండా నింపి రిపబ్లిక్ ఆఫ్ స్పెయిన్‌కు (భారతదేశం పంపింది) పంపాము.

మాకు మా స్వాతంత్ర్యం ముఖ్యం. బ్రిటను మాకు స్వతంత్రం ప్రకటించే వరకు మేము తటస్థంగానే ఉన్నాము.

స్వాతంత్ర్య ప్రియులయిన ఇంగ్లీషు ప్రజల క్షేమం కోసం గాంధీగారిచ్చిన పోరాట పిలుపును, సామ్రాజ్యవాదుల యుద్ధంగా వర్ణించమని కమ్యూనిస్టులు చెప్పారు. రష్యా యుద్ధంలో చేరగానే దానిని 'ప్రజాయుద్ధం' (పీపుల్స్ వార్) గా ప్రకటించి, గాంధీగారిని, కాంగ్రెసువారిని కమ్యూనిస్టులు వెన్నుపోటు పొడిచారు.

భారతదేశం మనస్ఫూర్తిగా యుద్ధంలో (రెండవ ప్రపంచ యుద్ధం) సాయం చేయాలని బ్రిటనులోని అన్ని వర్గాలవారూ కోరారు. కానీ ఇంగ్లీషువారు భారతీయుల స్వేచ్ఛకు, స్వాతంత్ర్య పోరాటానికి మద్దతు పలకలేదు. స్వేచ్ఛ కొరకు, స్వాతంత్ర్యం కొరకు నాజీలపై పోరాటం చేస్తున్న ఇంగ్లీషువారికి నేను, కాంగ్రెసు మద్దతు పలికాము.

దీనాస్టాక్, ఫెన్నర్‌బ్రూక్, ఐరోపాలోని సామ్యవాద మిత్రులు నా జాతీయోద్యమంపై విశ్వాసం ప్రకటించారు. అభినందించారు. ఎవరు విజేతలయినా వారికి వలస జాతులు, రంగు జాతుల ఫ్రీడం ఫ్రంటువారి సహాయం కావాలి. దీనికై గాంధీగారి ఆశీస్సులందుకున్నాం.

యుద్ధాంతానికి పాశ్చాత్య శక్తులు బలహీనపడతాయని, వలస ప్రజలకు స్వాతంత్ర్యం ప్రకటించవలసి వస్తుందని, ఫాసిస్టు శక్తులపై పోరాటం ఆపరాదని యం.యన్. రాయ్ హెచ్చరిక చేశారు. గాంధీగారి అనుయాయులమైన మేము భారత కమ్యూనిస్టులలాగా, ఇండోనేసియా సుకర్ణోలాగా మా అసమ్మతి తెలియ చెప్పలేదు. ఆసియా, ఆఫ్రికా, కారిబెన్ ద్వీపాలలో స్వతంత్రం త్వరగా వచ్చేటందుకు 'అట్లీ', డిగాలె, సామ్రాజ్యవాద వ్యతిరేకులయిన అమెరికా సంయుక్త రాష్ట్రాలు కారణం. నూతన సామ్రాజ్యవాదాన్ని ఆగ్నేయాసియాపై రుద్దాలని రష్యా ప్రయత్నిస్తున్నది.

యుగోస్లేవేకియా సోవియట్ రష్యా నియంతృత్వం నుండి 1968 లో బయట పడింది. 1956 లో హంగరీలోనూ, పోలెండులోనూ కమ్యూనిస్టులు స్టాలిన్ నియంతృత్వాన్ని ధిక్కరించారు. నేనీ విషయాలనే నా 'జాతీయ విప్లవంలో ప్రపంచపు పాత్ర' మరియు 'విప్లవరేకులు' అనే పుస్తకాలలో 1944-45 లో వ్రాశాను. కమ్యూనిజపు సామ్రాజ్యవాదం నుండి పోలెండు, రుమేనియా, అల్బేనియాలో స్వాతంత్ర్య కాంక్ష పెరిగింది. ఆసియాలో చైనా సామ్రాజ్యవాదం పెరుగుతున్నది. ఈ నూతన సామ్రాజ్యవాదంపై స్వతంత్రవాదులెప్పుడూ ఒక కన్ను వేసి ఉంచాలి. ★

30. కాంగ్రెస్ పార్టీని రద్దు చేయాలి

(గాంధీజీ ఆఖరి సందేశం)

'కాంగ్రెసు పార్టీని రద్దు చేయకుంటే, అది కాంగ్రెసు నాయకులను శాశ్వతంగా లేకుండా చేస్తుంది'–కార్యవర్గపు చివరి సమావేశంలో గాంధీగారు ఈ విషయాన్ని ప్రధానంగా చర్చించారు. స్వాతంత్ర్యం వచ్చింది కనుక, స్వాతంత్ర్య యోధు లందరూ తమ తమ అభీష్టాలమేరకు, సాంఘిక ఆర్థిక స్థోమతల మేరకు వేరు వేరు రాజకీయ విభాగాలుగా ఉండటం మంచిదనిపిస్తుంది. ఇది ఒక ఆరోగ్య కరమైన రాజకీయ నాయకత్వానికి దారితీస్తుందని కాంగ్రెసు సోషలిస్టు పార్టీ, రైతులు, శ్రామికులు నమ్మేవారు. రాజకీయ గుత్తాధికారానికి ఇది చెల్లుచీటీ. కాంగ్రెసులోని అల్పసంఖ్యాకులు అధిక సంఖ్యాకుల దాష్టీకాన్ని తట్టుకొని నిలబడా లంటే ఇదే మంచి మార్గం. బాపూ ఈ విషయాన్ని గ్రహించారు. ***కాంగ్రెసు అధికసంఖ్యాక వర్గం తమ బలంతో అల్పసంఖ్యాకులను అణచివేసే అవకాశ ముంది.***

కాంగ్రెసు పేరు కొరకు, దాని చరిత్ర కొరకు తాపత్రయపడేవారుంటారు. ఇతర పార్టీల విధానాలు వారికి నచ్చినా అలవాటు ప్రకారం కాంగ్రెసును అంటిపెట్టుకొని, అధికారంలో ఉన్న పార్టీని 'సపోర్టు' చేసే ఇటువంటివారు గాంధీగారికి తెలుసు.

దేశ విభజనతో అల్లకల్లోలంగా ఉన్న కారణంగా గాంధీగారి ఆలోచనలు కాంగ్రెసు పెద్దలకు నచ్చలేదు. ఇండియన్ నేషనల్ కాంగ్రెసుకు ప్రత్యామ్నాయం వారికి కనుపించలేదు. నిర్మాణాత్మక కార్యక్రమాలతో వేరే సంఘాలు ఏర్పాటు

చేస్తామని కాంగ్రెసు పెద్దలు గాంధీగారికి నచ్చజెప్ప చూశారు. దురదృష్టవశాత్తూ గాంధీగారు ఈలోపున మరణించారు.

కాంగ్రెసు కార్యవర్గం కాంగ్రెసు పార్టీని రద్దు చేయలేకపోయింది. స్వాతంత్ర్యం వచ్చిన తరుణంలో గాంధీగారందించిన ఈ అవకాశాన్ని ఉపయోగించుకోలేక పోయింది.

శాంతియుతంగా, రాజ్యాంగబద్ధంగా పనిచేసే రెండు లేక మూడు పార్టీలు ఉండటం అవసరం. అసహనపరులయిన కాంగ్రెసు మెజారిటీకి, స్వయం రక్షణ కొరకు తాపత్రయపడే మైనారిటీకి ఇది ఒక సరియైన పరిష్కారమనుకొన్నాను. గాంధీగారి చివరి కోరికగా కాంగ్రెసు పార్టీని రద్దు చేయాలన్నదే నా ఉద్దేశ్యం.

ఆంధ్రలో గ్రూపుల బెడద ఎక్కువగా ఉంది. నేను రెండు, మూడుసార్లు కాంగ్రెసు కార్యవర్గంలో ప్రస్తావించి గాంధీగారి ఆలోచనమేరకు కాంగ్రెసు పార్టీని రద్దుచేసి, దానిని రెండు మూడు విభాగాలుగా చేయాలని కోరాను. మెజారిటీవారి ఆశీస్సులతో, గాంధీగారి ఆశయ సఫలత కొరకు నేను యత్నిస్తానని చెప్పాను. ఈ నిర్మాణాత్మక సూచన కూడా భారత ప్రజాస్వామ్యానికి దోహదం చేయదని మెజారిటీ సభ్యులనుకొన్నారు. కోడిపుంజులలాగా తన్నుకుంటూ, గాంధీగారి సలహాను కాంగ్రెసు వర్కింగు కమిటీ పెడచెవిన పెట్టింది.

1948 లో కాంగ్రెసు వర్కింగు కమిటీ అధ్యక్షుని పదవికి డా॥ పట్టాభి (భోగరాజు పట్టాభి సీతారామయ్య), శ్రీ పురుషోత్తమదాస్ టాండన్‌ల మధ్య గట్టి పోటీ జరిగింది. జవహర్‌లాల్, సర్దార్ వల్లభాయ్ పటేల్‌లు చెరి ఒక వైపున ఉన్నారని కాంగ్రెసువారందరూ అనుకున్నారు. నేను ఒక ఆంధ్రునిగా ఒక ఆంధ్రుని గెలుపు కొరకు కృషి చేశాను. పట్టాభిగారు గెలిచారు.

పట్టాభిగారు కాంగ్రెసు అధ్యక్షులు కాగానే మంత్రివర్గములోనివారిని కూడగట్టి, నా మైనారిటీ గ్రూపుకు వ్యతిరేకంగా పనిచేయడం మొదలుపెట్టారు. కళా వెంకట్రావుగారు రెవిన్యూ మంత్రి పదవికి రాజీనామా చేసి, కాంగ్రెసు జనరల్ సెక్రటరీ అయ్యారు. నన్ను ప్రదేశ్ కాంగ్రెసు పదవి నుండి తప్పించడం, నా పార్లమెంటరీ సభ్యత్వం లేకుండా చేయడం, కిసాను కాంగ్రెసు విభాగాన్ని రద్దు

చేయించడం కళా వెంకట్రావు ధ్యేయాలయ్యాయి. నా కార్యవర్గ సభ్యత్వం ఉండవలసిందేనని సర్దార్ పటేలుగారు పట్టుబట్టారు. కిసాను కాంగ్రెసు వ్యవహారం అసలు కాంగ్రెసు కమిటీ చర్చకు తీసుకోలేదు.

డా॥ పట్టాభి, శ్రీ కళా వెంకట్రావులు 1931 నుండి నాపై, నా అనుచరులపై కోపంగా ఉన్నారు. వారు పదవిలో ఉన్న రెండున్నర ఏళ్ళు నా మధ్య, పట్టాభి వర్గం మధ్య ఉన్న తగాదా 'గొరిల్లా' యుద్ధాన్ని గుర్తుచేసింది.

తరువాత జరిగిన కాంగ్రెసు అధ్యక్ష పదవికి పోటీ ఆచార్య కృపలానీ, శ్రీ పురుషోత్తమదాస్ టాండన్ల మధ్య జరిగింది. ఈ పోటీ చివరి నిమిషం వరకు ఉత్కంఠభరితంగా ఉంది. శ్రీ పురుషోత్తమదాస్ టాండను ఎన్నికైనారు. ఈ పరిణామం నెహ్రూగారికి కంటగింపుగా ఉంది. పట్టాభిగారిని కార్యవర్గం నుండి తప్పించారు. కళా వెంకట్రావు కార్యదర్శిగానే కొనసాగుతున్నారు. నెహ్రూ గారు కాంగ్రెసు సెక్రటరీలపై చాలా అసహనంగా ఉన్నారు. సెక్రటరీలు రాజీనామా చెయ్యాలని నెహ్రూగారు పట్టుబట్టారు. టాండన్‌గారు అంగీకరించలేదు. నెహ్రూ గారు కాంగ్రెసు సభ్యత్వం వదులుకొన్నారు. టాండనుగారు కాంగ్రెసు అధ్యక్ష పదవికి రాజీనామా చేయవలసివచ్చింది. నెహ్రూగారే మరల కాంగ్రెసు అధ్యక్షు డయినారు. కళా వెంకట్రావుగారితో సహా అందరు కార్యదర్శులు రాజీనామా చేశారు. నెహ్రూగారు భారత ప్రధానిగా విదేశాంగ శాఖ, అణుశక్తి మరియు శాస్త్రీయ పరిశోధనల బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ పరిణామం హాస్య స్ఫోరకమో, విషాదభరితమో నాకర్థంకాలేదు. నెహ్రూగారు ప్రధానమంత్రిగా, కాంగ్రెసు అధ్యక్షునిగా ప్రజలలో అధికారాన్ని, పార్టీపై ఆధిపత్యాన్ని సంపాదించు కున్నారు. మంత్రివర్గానికి, కాంగ్రెసు పార్టీకి తేడా లేకుండాపోయింది. భారత ట్రేడ్‌మార్కు గల ప్రజాస్వామ్య నియంతృత్వం ఆవిష్కరించబడింది.

జవహర్‌లాల్ తన వారసులుగా చిన్న చిన్న రాష్ట్రాల మంత్రులను కాంగ్రెసు అధ్యక్ష పదవిలో తరువాత నియమించసాగారు. ఈ కొత్త అధ్యక్షుడు ప్రధానికి సలహాలివ్వగలవాడు కాదు. నెహ్రూగారు తన బుర్రలో పురుగు తొలచినప్పుడు అధ్యక్ష సలహాలను తన కుమార్తె నుండి వినేవారు. ఈ ఆలోచన మొదట్లో

ఆయనకు లేదంటారు. కానీ తన ధాటికి తట్టుకొనే అధ్యక్షులే వారికి కనుపించ లేదు. ప్రధానమంత్రి కుమార్తె పార్టీ అధ్యక్షురాలు కావటం భజనపరులకు 'గ్లామర్'గా కనిపించింది. ఈ భజనపరుల బాధంతా ఒక్కటే, మోతీలాల్ నెహ్రూ గారు కాంగ్రెసు అధ్యక్ష పదవిని నేరుగా జవహర్‌లాల్ గారికి అందించారు. ఈ పని జవహర్‌లాల్ చేయలేకపోయారు. ఈ భజనపరులు మూడు తరాల నెహ్రూ వంశీకులు కాంగ్రెసు గద్దె నెక్కారని గొప్పగా చెప్పుకొనేవారు. తాత నుండి మనుమరాలు వరకు ఎంతో అధికారమున్న ఈ పదవికి 'పల్టీలు కొట్టడం' పూర్తి అయింది. మగతనం లేకుండాపోయింది. ప్రధానమంత్రికి కాంగ్రెసు అధ్యక్ష పదవి జేబు సంస్థగా మారింది.

నెహ్రూగారి కుమార్తె తరువాత సంజీవరెడ్డిగారు ఈ పదవికి ఎంపిక చేయ బడ్డారు. 1951 నుండి నాతో ఉన్న విరోధం, నేను స్వతంత్ర పార్టీ అధ్యక్షునిగా ఎన్నికకావడం సంజీవరెడ్డిగారు కాంగ్రెసు అధ్యక్షులు కావటానికి ఉపయోగ పడిందని అందరూ అనుకొన్నారు. వారికి కూడా అధికారలుప్తమైన ఈ పదవిపై విసుగుపుట్టింది. సంజీవరెడ్డిగారు నెహ్రూగారిని ఒప్పించి ఆంధ్రరాష్ట్రంలో తన పూర్వపు పదవి సంపాదించుకున్నారు. సంజీవరెడ్డిగారి తరువాత శ్రీ సంజీవయ్యను ఈ గద్దె వరించింది. భవిష్యత్తు చాలా ఉందని, పార్టీకి సేవ చేయటానికి వెనుకాడ రాదని నెహ్రూగారు వీరికి నచ్చచెప్పారు. సంజీవయ్యగారు తాను వయస్సులో చాలా చిన్నవాడినని, గాంధీగారు దక్షిణాది రాష్ట్రాల పర్యటనలో కూడా వారి దర్శనం చేసుకోలేదని చెప్పారు. ఈ పార్టీ కవాతు కొన్నాళ్ళు చేసిన తరువాత సంజీవయ్య కేంద్రంలో 'లేబరు' మంత్రిగా నియమింపబడ్డారు. అప్పటినుండీ పార్టీ అధ్యక్ష పదవి నుండి కేంద్ర మంత్రిగా నియమింపబడటం ఒక ఆనవాయితీ అయింది.

సంజీవయ్య మంచి వక్త. ధైర్యశాలి. కాంగ్రెసు పెద్దలు తమ పదవుల నడ్డం పెట్టుకొని చాలా డబ్బు సంపాదించుకొన్నారని బహిరంగంగా చెప్పేవాడు. సంజీవయ్య తరువాత కామరాజ్ నాడార్ అధ్యక్షుడైనారు. వారు 'పార్కలాం' అనే మాట మినహా వేరే మాట మాట్లాడేవారు కాదు. (పార్కలాం అంటే చూద్దాం

అని.) కలకత్తా ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభను 'ధన్యవాదాలు' అనే ఒకే ఒక మాటతో ముగించారు. స్కూలుకు జడివానలో తడుస్తూ వెళ్ళాననే విషయాన్ని వారు ఎప్పుడూ చెప్తుండేవారు. వారికి ఇంగ్లీషు అంతగా రాదు. హిందీ అంతకన్నా రాదు. కానీ వారికి అధికారమెక్కడుందో మాత్రం తెలుసు. వారు తమిళనాట ఎదురులేని నాయకునిగా కాంగ్రెసులో తలలు మార్చే స్థాయికి ఎదిగారు. 1952లో కమ్యూనిస్టులు తమిళనాడులో అధికారం చేజిక్కించుకునే స్థితిలో రాజాజీగారిని బ్రతిమిలాడి రాష్ట్ర ప్రధానిని (ముఖ్యమంత్రిగా) చేశారు. ఆ గండం గడవగానే తనే ఆ పదవిని కోరుకున్నారు. గద్దెలు ఎక్కించడం మాని తనే గద్దె నెక్కాడు. కింగ్‌మేకర్ కింగ్ అయ్యాడు.

నెహ్రూగారి వారసుని ఎన్నుకోవడం వీరు చేసిన గొప్ప పని. పదవుల కొరకు తన్నులాట వీరి హయాంలో ఎక్కువైంది. 1963 లో కామరాజ్ ప్లాన్‌కు రూపశిల్పి నాడార్. పార్టీ కొరకు పనిచేయడం ముఖ్యం అని, పదవులు కాదని ఈ ప్లాను అంతరార్థం. ఈ ప్లాను ఇప్పుడు మూలబడింది. శ్రీ జగజీవన్‌రామ్, శ్రీ మొరార్జీదేశాయ్ గారలు ఈ ప్లానుకు బలియై, తమ పదవులను వదులు కున్నారు. ఎంతో సామాన్య జీవితం గడుపుతూ, మాటలకంటే చేతలకు ప్రాధాన్యా న్నిచ్చే వీరి హయాంలో స్వార్థపరులు, తిరుగుబాటుదారుల బాధ ఎక్కువైంది.

1951 లో, 1959 లో మాలాంటి కొందరు కాంగ్రెసు పార్టీని వదిలాము. కాంగ్రెసు సిద్ధాంతాలకు అంకితమైనవారికన్నా తమకు పదవులు రాలేదని 'అలిగి' వెళ్ళినవారే వీరిలో ఎక్కువ. వీరు ప్రజలతో తాము కాంగ్రెసు కార్యక్రమాన్ని ఇంకా బాగా చేయగలమని చెప్పారు. కాని కాంగ్రెసు పార్టీకి ప్రత్యామ్నాయం చూపించలేదు. పార్టీల నిర్వహణలో వీరికి అనుభవం లేదు. కాంగ్రెసుకు వ్యతి రేకంగా ప్రచారమూ చేయలేదు. ఇతర ప్రజాస్వామ్య పక్షాల నుండి వీరు ఏమీ నేర్చుకోరు. ***ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం విలువను వీరెరుగరు.***

1951–52 జనరల్ ఎన్నికలలో ఉత్తరప్రదేశ్ చక్కెర మిల్లుల నుండి ఆ రాష్ట్రపు 'కంట్రోళ్ళ' మంత్రి డబ్బు వసూలు చేశాడు. ఈ విషయం పార్లమెంటులో రచ్చ అయింది. జవహర్‌లాల్ ఈ అవినీతిని సమర్థించారు. ఇతర దేశాలలో

ఈ అలవాటు ఉందని పార్లమెంటులో చెప్పారు. ఈ చెడు సాంప్రదాయం నాటి నుండి మరీ ఎక్కువైంది. 1957 లో ఒక మిల్లరు 10 లక్షల రూపాయలు, వేరొక మిల్లరు 25 లక్షల రూపాయలు చందాల రూపంలో ఇచ్చారు. కాంగ్రెసు మనస్సాక్షికి ఇది వ్యతిరేకం. ఈ పరిస్థితులలో కాంగ్రెసులో ఇమడలేక ఆంధ్ర కిసాను వర్గానికి చెందిన మేము 'కృషికార్ లోక్‌పార్టీ'ని నిర్మించాము.

"అవినీతిని అరికట్టే ప్రభుత్వం ఇప్పుడు లేదు. అవినీతిని కోరుకునే ప్రభుత్వం ఇప్పుడు ఉంది" అని సిద్ధార్థ శంకరరాయ్ చెప్పారు. మార్చి 1958 న బెంగాల్ మంత్రివర్గం నుండి రాజీనామా చేశారు. వారు కాంగ్రెసులో అంతర్గత రాజ కీయాలు చక్కదిద్దుకోవాలని 1947-51 మధ్య సంఘటనలను ఎత్తిచూపారు.

శ్రీ డి.ఆర్. మన్‌కేకర్‌గారు ఎ.ఐ.సి.సి. పూనాలో మాట్లాడుతూ – కాంగ్రెసు సెషన్సు, గతాన్ని మరల మరల చెప్పటానికి, కాంగ్రెసులో ఉన్న అవినీతిని కప్పిపుచ్చటానికి, యువతకు నాయకత్వం లేకుండా చేయటానికి పనికొస్తున్నాయి అని జూన్ 1960 లో అన్నారు.

1965 కు ఈ 'కొరుకుడు వ్యాధి' పార్టీలో ముదిరిపోయింది. బోగసు సభ్యత్వాలు ఎక్కువైనాయి. గ్రూపు తగాదాలు, ముఠా తగాదాలు పార్టీని కుంగ దీస్తున్నాయి. కులాల, భాషల దురభిమానం, బీహార్, మైసూర్, ఆంధ్ర, మహారాష్ట్ర, పంజాబు, అస్సాం, ఒరిస్సా, రాజస్థాన్‌లలో పెచ్చరిల్లింది. అవినీతి ఊబిలో పంజాబు ముఖ్యమంత్రి ప్రతాపసింగుకైరాన్, ఒరిస్సా ముఖ్యమంత్రులు బిజూ పట్నాయక్, బిరేన్‌మిశ్రాలు కూరుకుపోయారు. ఈ పరిస్థితులలో కాంగ్రెసును వదలకుండా గద్దెలను కాంగ్రెసు అవినీతిపరులు ఆక్రమించుకున్నారు. సిగ్గు లేకుండా అధికారం కొరకు తన్నుకుంటూ, దళారీలను వెతుక్కుంటూ కాంగ్రెసు కాలం ఖర్చు చేస్తున్నది. ఎన్నికలలో చదువు లేని ఓటర్ల మధ్య మాత్రం "తామంతా ఒకటే" అని ప్రచారం చేసుకుంటున్న కాంగ్రెసువారికి 'ప్రజల అవిద్య' బాగా ఉపయోగపడింది.

'నాకు ఈ పదవులపై మోజు లేదు'. అందువలననే 1951 లో ఒకసారి, 1959 లో మరోసారి గాంధీగారి నైతిక సూత్రాలను ప్రజలలోకి తీసుకొని వెళ్ళగలిగాను.

గాంధీజీ అడుగుజాడలలో నడిచిన ఈ పెద్దలు ఈవిధంగా ఎందుకు ఈనాడు ప్రవర్తిస్తున్నారో తెలియదు. ఈ కాంగ్రెసు నాయకులను మూడు ఎన్నికలలో ఎదుర్కొని వారి పరాజయానికి కృషి చేస్తున్నాను. దురదృష్టవశాత్తూ ధనం, కార్యకర్తలు, చివరకు ఓట్లతో ఈ కాంగ్రెసునే మరల మరల గెలిపిస్తున్నారు. కాంగ్రెసు నాయకులు గాంధీ సిద్ధాంతాలను మరచిపోయారు.

ఈ నిరాశాజనకమైన రాజకీయ వాతావరణంలో కూడా నేను 1952 లో, మరలా 1962 లో ఓటర్లను కాంగ్రెసుకు వ్యతిరేకంగా ఓటు వేయించగలిగాను. ప్రజల అవిద్య వలన (చదువు లేకపోవటం) రాజాజీ వంటి మహానాయకుని నాయకత్వం కొరకాకుండా పోయింది.

ఈ పరిస్థితులలో కాంగ్రెసు అవినీతి, ఆశ్రిత పక్షపాతం, రాజకీయ అనైక్యతకు అంతం ఎక్కడ?

★ ★ ★

31. దేశ విభజన తరువాత

దేశ విభజనను మేమంతా వ్యతిరేకించాం. ముస్లింలీగు దేశ విభజన కోరింది. డా॥ రాజేంద్రప్రసాద్ 1945–46 లలో విడబడే భారతదేశంపై ఒక పరిశోధనా వ్యాసాన్ని ప్రకటించారు. ఈ విభజన పరిణామాలను ఆయన ఈ వ్యాసంలో చెప్పారు. నేను 1945లో 'పాకిస్తాను' అని తెలుగులో ముస్లింలీగుకు, కమ్యూనిస్టు ప్రచారానికి వ్యతిరేకంగా వ్రాశాను. దేశంలోని కాంగ్రెసు నాయకుల ఆలోచనలకు వ్యతిరేకంగా, దేశ విభజనను ఒప్పుకోవలసి వచ్చింది. ఈ దురదృష్టకరమైన నిర్ణయం నేను ఇంగ్లాండులో ఉన్నప్పుడు తీసుకోబడింది. నేను వచ్చిన తరువాత బాపూతో నా అసంతృప్తిని వెలిబుచ్చాను. నా అసంతృప్తితో వారు కూడా ఏకీభవిస్తూ సర్దార్ పటేలు, మౌలానా ఆజాద్, రాజేంద్రప్రసాద్, నెహ్రూ గారలు దేశం విచ్ఛిన్నకరశక్తుల చేతిలో నాశనంకావటంకంటే సంకీర్ణ ప్రభుత్వంలోని ముస్లిం మంత్రుల మాట మన్నించడమే మేలనుకొన్నారని చెప్పారు. ఈ సంకీర్ణ ప్రభుత్వంలో కలకత్తా, ఢిల్లీ, పంజాబులలో అల్లర్లు ఆగలేదు. శాంతిభద్రతలను పరిరక్షించవలసిందిగా గవర్నర్లను ఆదేశించవలసిందని లార్డు పెథిక్ లారెన్సును కోరి విఫలుడనయ్యాను. భారత స్వాతంత్ర్యతకు విభజన అవసరమనుకొన్నారు నెహ్రూ, పటేలు. ఈ దురదృష్టకరమైన నిర్ణయానికి తన బాధ్యత లేదని మౌలానా ఆజాద్ చెప్పటం తప్పు.

హిందువుల–ముస్లింల కొట్లాటలు బెంగాల్, పంజాబు, సింధు, ఈశాన్య రాష్ట్రాలలో జన హననానికి దారితీశాయి. వేలాది కుటుంబాలు చెల్లాచెదు రయ్యాయి. అసహ్యకరం, విషాదభరితమైన ఈ సంఘటనలు చెప్పడానికి, వినడానికి బాధాకరం.

లక్షలకొద్దీ శిక్కులు, జాటులు, గుజ్జర్లు, వాయువ్యరాష్ట్రాల ప్రజలు(N.W.F.P.) తమ రాష్ట్రాల నుండి తరిమికొట్టబడ్డారు. ప్రజల ఆస్తులు దోచుకోబడి నిరాశ్రయు లైనారు. హిందువులు ఇంటికి ఒకరో, ఇద్దరో తూర్పు పాకిస్తానులోని గుర్తు తెలియని శ్మశానాల్లో పాతివేయబడ్డారు. స్వతంత్ర భారతదేశం చీకట్లో చిరుదివ్వెలా వీరికి ఉపశమనం కలిగించింది. ఈ దుర్భర పరిస్థితులను తట్టుకొని దేశభక్తితో, మనఃస్థైర్యంతో ఈ ప్రజలందరూ నిలిచారు.

ఢిల్లీ, పశ్చిమ పంజాబు, ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్‌లు దురదృష్టవంతులైన కాందిశీకులతో నిండిపోయాయి. కాందిశీకులకు ఈ రాష్ట్రాల ప్రజలు కూడూ, నీడా ఇచ్చారు. ఈ శరణార్థులకు తాత్కాలికంగా నివాసాలివ్వవలసిందని నెహ్రూ గారు విజ్ఞప్తి చేశారు. వారి శరణార్థులను అభ్యంతరం లేనిచోట నివాసాలు ఏర్పాటుచేసుకోమన్నారు. పార్లమెంటు సభ్యులందరూ శరణార్థులకు తమ ఆవాసాలలో నివసించటానికి ఏర్పాట్లు చేశారు. నాలుగు సంవత్సరాలు రెండు శిక్కు కుటుంబాలు నాతో నివసించాయి. వారంతా ఎంతో హుందాగా ప్రవర్తించే వారు. వారు పడిన కష్టాలను మరచి కొత్త జీవితాలను వెతుక్కున్నారు. సందుల్లో, గొందుల్లో, వరండాలలో కూడా చోటు లేనివాళ్ళు, చిన్నపాటి మట్టి గుడిసెలు కట్టుకున్నారు.

దుర్భరమైన నాటి వేదనామయ జీవితాన్ని ద్వేషం, పలాయనంతో శరణార్థు లుగా బ్రతుకవలసిరావడాన్ని ఒక కాళిదాసు మహాకవో, ఒక టాగోరు మహాశయుడో మాత్రమే చిత్రించగలడు. మానవులలోని మంచి చెడ్డలను బయల్పరచిన రోజులవి. స్వాతంత్ర్యాన్ని శాంతితో సాధించినందుకు మూల్యం చెల్లిస్తున్న కాలమది. నిప్పులతో అభిషేకించి క్రీస్తు భగవానుడు ప్రజలను పునీతు లను చేసినట్లు, స్వతంత్ర భారతం బాధ్యతతో పరిణితి చెందుతున్న రోజులవి.

బాపూ జాతిపిత, కర్మయోగి. సామాన్యులలో సామాన్యునిగా తిరుగుతూ, బాధితులెక్కడ ఉన్నారో అక్కడ ప్రత్యక్షమయి అమృతమయమయిన తన కర స్పర్శతో వారికి నెమ్మది కలుగజేస్తూ, పాపాలు ప్రక్షాళించే క్రీస్తు వలె "భయపడ కండి, చెడ్డపనులు చేయకండి, భగవంతునిపై నమ్మకం ఉంచండి" అని వారికి ధైర్యం చెప్తున్నారు. కలకత్తా, నౌఖాలీలలో జరిగిన దురంతాలకు వారు కదలి

పోయారు. తూర్పు బెంగాల్ నుండి వచ్చే కాందిశీకులు రోజు రోజుకు ఎక్కువయ్యారు.

మహాత్ముని హత్యతో జాతి స్తంభించిపోయింది. ఈ విపత్తు నూతన భారతానికి గొడ్డలిపెట్టు. దేశానికి నిజంగా అవసరమైనప్పుడు గాంధీజీ లేకుండాపోయారు. నాలుగు దశాబ్దాలుగా వారిని పూజించే భారతీయులు ఈ విషాదాన్ని, బాధను మరచి జీవించడానికి ఎన్నో ఏళ్ళు పట్టవచ్చు. నావంటి కార్యకర్తలకు ఇది వ్యక్తిగతంగా నష్టం.

తాత్కాలికంగా ఏర్పాటయిన పార్లమెంటు ప్రభుత్వం వీలయినంత సహాయాన్ని కాందిశీకులకందిస్తున్నది. ఈ శరణార్థులకు తాత్కాలిక నివాసాలు ఏర్పాటుచేసి, వీరికి తిండి బట్టలు ఏర్పాటుచేసి సంవత్సరాల పర్యంతం వీరిని ఆదుకొంటున్నది. ఈ అసంఖ్యాక కాందిశీకుల కుటుంబాలకై ఉత్తర భారతదేశమంతా పారిశ్రామిక వాడలు, చిన్న చిన్న పట్టణాల వంటివాటిని నిర్మించింది. చాలా పొరపాట్లు కూడా జరిగాయి. ఏదియేమైనా ప్రభుత్వం 50 లక్షల మంది శరణార్థులకు అందించిన సహాయం కనీవినీ ఎరుగనిది. హొరేస్ అలెగ్జాండరు లాంటివారు తమ పుస్తకాలలో ఈ సాయాన్ని మెచ్చుకున్నారు.

శ్రీ పురుషోత్తమదాస్, మరికొంతమందిమి శరణార్థులకు 'పరిహార' మిప్పించాలని తీవ్రంగా ప్రయత్నించాము. జవహర్‌లాల్‌గారు ఇది ఒక అదనపు భారంగా భావించారు. 1951-52 జనరల్ ఎన్నికల తరువాత పరిహారమివ్వటానికి ఒప్పుకొన్నారు.

తూర్పు పాకిస్తాన్ శరణార్థుల బెడద దేశానికి ఎక్కువయింది. సర్దార్ పటేలు గారు భారతీయులపై జరుగుతున్న దుర్మార్గాలకు తీవ్ర నిరసన తెలిపారు. పాకిస్తాను యుద్ధ ప్రయత్నాలు మొదలుపెట్టింది. సర్దారు పటేలుగారు నన్ను బీహారు, బెంగాలు వెళ్ళమన్నారు. అక్కడకు వెళ్ళి మంత్రులతో చర్చించాను. "భారతదేశం మీ వెనుకనే ఉన్నది" అని అక్కడి ప్రజలతో చెప్పాను. పాకిస్తాన్, భారతదేశ ప్రధానమంత్రులు శాంతియుత సహజీవనమే మేలు అన్న నిర్ణయం తీసుకున్నారు. నెహ్రూ-లియాకత్ (ఆలీఖాన్) ఒడంబడిక జరిగింది. పాకిస్తాను

ఈ ఒడంబడికను అమలుచేయలేదు. హిందువులు తూర్పు పాకిస్తాన్ నుండి తరిమికొట్టబడుతూనే ఉన్నారు. వీరు పంజాబు నుండి వచ్చిన నిర్వాసితుల వంటివారు కాదు. వీరి వద్ద డబ్బు లేదు. అత్యంత పేదరికం ఉన్న ఆ దేశంలో అణగద్రొక్కబడిన హిందువులు. వీరికొరకు మొదలుపెట్టిన 'దండకారణ్య' ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తికాలేదు. బెంగాలు శరణార్థులకు నేటికీ సరియైన పరిష్కారం లేదు.

దక్షిణాది రాష్ట్రాలయిన ఆంధ్ర, హైదరాబాద్, మద్రాసు, మైసూరు, కొచ్చిన్, తిరువాన్కూరులలో ఈ మతాల పిచ్చి ముదరలేదు. హిందూ-ముస్లింలు సఖ్యతగానే ఉన్నారు. ఈ ప్రదేశాలలో ఏ చిన్న సంఘటనా జరుగలేదు. ముస్లింలు అల్పసంఖ్యాకులయినా, ముస్లింలీగు రాజకీయం నడుపుతున్నా, రాష్ట్రాలలోని ఇతర మతాలవారికి ఇబ్బందిగా ఉన్నా ముస్లింలీగు నాయకులు వీరిని రెచ్చగొట్ట లేదు. మౌలానా అబుల్ కలామ్ ఆజాద్‌కు ఉత్తరభారత హిందువులలో ఎంతో మంచి పేరున్నది. ఈ జాతీయ అత్యవసర పరిస్థితులలో దక్షిణాది రాష్ట్రాల ముస్లింలు ఒక్కటిగా నిలిచారు.

హైదరాబాద్‌లో కాశీం రజ్వీ, అతని అనుచరులు నెహ్రూ, ఆజాద్‌ల ఆదుర్దాని బలహీనమనుకున్నారు. ఈ రాష్ట్రంలో ముస్లింలు 15 శాతం మాత్రమే. రజాకార్లు నాజీ పద్ధతుల ననుసరించారు. సామ్రాజ్యవాద అధికారాన్ని చెలాయించాలను కున్నారు. రజాకార్లు హైదరాబాద్‌లో బీభత్సాన్ని సృష్టించారు. ప్రజల బాధలు చెప్పనలవికాదు. ప్రధానమంత్రి నెహ్రూగారి అతిమెత్తని, బలహీనమయిన ధోరణికి సరిహద్దులలో ఉన్న ఆంధ్రులు, మహారాష్ట్రులు, మైసూరువారు తమ అసంతృప్తిని వెలిబుచ్చారు. రజ్వీ చెప్పినట్లల్లా హైదరాబాద్ నవాబు ఆడాడు.

స్వతంత్ర రాష్ట్రం కొరకు పాకిస్తాన్‌తో నవాబు చర్చలు మొదలుపెట్టాడు. పాకిస్తాన్‌తోను, ఇంగ్లీషు సామ్రాజ్యవాదులతోను నైజాం ప్రవర్తన భారతదేశానికి బాధాకరమైంది. దేశం అంతా సర్దార్ పటేలుగారి వైపే చూస్తున్నది. సర్దార్‌గారు అప్పుడు గుండెపోటుతో ముస్సోరిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఢిల్లీకి వచ్చి కేంద్రపు అనుమతితో 'హైదరాబాద్'లో పోలీసు చర్య చేపట్టారు. రజాకార్లను అణచివేసి మూడు రోజులలో నైజాంను భారతదేశంలో విలీనం చేశారు. ★

32. భారత రాజ్యాంగ రచన

బొంబాయికి చెందిన అఖిల భారత హరిజన నాయకుడు, న్యాయశాఖా మంత్రి డా॥ బి.ఆర్. అంబేద్కర్‌గారి సంవత్సరాల కృషి ఫలితమే నేటి భారత రాజ్యాంగ రచన. అతను చదువుకున్న వాడు, ఉపన్యాసకుడు, వాదనాఘటి కుడు, న్యాయశాస్త్ర ప్రవీణుడు. వేలాది సంవత్సరాలుగా మతాలు, కులాలు చేసిన అన్యాయాలు, మనువు నుండి శుక్రుని వరకు బోధించిన విపరీతాలు సరిచేసే అవకాశం వీరికొచ్చింది. గాంధీగారి నుండి ప్రేరణ పొందిన కాంగ్రెసు వారందరు ఈ అవకాశానికి సంతోషించారు.

1935 పార్లమెంటు చట్టం ద్వారా 1946లో రాజ్యాంగ సభకు మేమందరము ఎన్నికయ్యాము. భారతదేశంలోని రాజులందరూ తమ ప్రజామండళ్ళ నుండి కొందరిని ఎంపిక చేసుకున్నారు. భీష్ముని వలె గాంధీ గారీసభలలో అడుగు పెట్టలేదు.

కాంగ్రెసు తిరుగులేని మెజారిటీతో ఉన్నా, ముస్లింలతో సహా కాంగ్రెసేతర న్యాయనిపుణులను రాజ్యాంగ సభ సభ్యులుగా తీసుకున్నారు. మొదట 'ముస్లిం లీగు' రాజ్యాంగ సభలో చేరి, తరువాత రాజ్యాంగ సభను బహిష్కరించింది.

దేశ విభజన తరువాత రాజ్యాంగ సభ త్వరత్వరగా పనిచేయడం మొదలు పెట్టింది. రాజుల ఏలుబడిలో ఉన్న రాష్ట్రాలు ఏ త్రోవబట్టేది తెలియదు. ఈ

రాష్ట్రాలు రాజ్యాంగ కూటమిగా ఏర్పడి రక్షణ, వాణిజ్యం, విదేశీ వ్యవహారాలలో భారత్‌తో సహకరిస్తాయనుకొనేవారు. పాకిస్తాను ఏర్పడిన తరువాత చాలా రాష్ట్రాలు(Kingly States) భారత్‌కు దగ్గరకాజొచ్చాయి. మైసూరు, తిరువాన్కూరు రాజ్యాలు స్వతంత్రం కోరాయి. సర్దారు పటేలు ఈ రాష్ట్రాల నన్నిటినీ బ్రతిమిలాడి, బుజ్జగించి, భయపెట్టి, చర్చించి భారతదేశంలో చేర్చారు. మొదటి సంవత్సరం లోనే ఈ రాష్ట్రాలలో చాలా మార్పు వచ్చింది. చాలా రాష్ట్రాలు భారత ఏకచ్ఛత్రాధి పత్యాన్ని అంగీకరించాయి. ఈ కృషిలో నాటి రక్షణ కార్యదర్శి శ్రీ వి.పి. మీనన్ గారి భాగస్వామ్యం కూడా ఉంది. (4-6-1959 న శ్రీ వి.పి. మీనన్ గారు స్వతంత్ర పార్టీలో చేరారు.) 1950 నాటికి ఈ రాష్ట్రాలన్నీ భారతదేశంలో భాగాలయ్యాయి. ఈ కార్యక్రమం పూర్తి అయినప్పటి నుండి 'రాజ్యాంగ సభ' మరింత త్వరగా పనిచేయ మొదలుపెట్టింది. కాందిశీకుల సమస్యలను, విభజన సమస్యలను, ప్రపంచ సమస్యలను, అంతర్గత సమస్యలను అధిగమించి, సమర్థ వంతంగా నెహ్రూ, పటేలుల నాయకత్వంలో ముందడుగు వేసింది. రాష్ట్రాల అసమర్థ నాయకత్వాన్ని త్రొక్కివేసి కేంద్ర నాయకత్వం బలపడింది. రాజ్యాంగ రచన మొదలైన మూడు సంవత్సరాలలో బలమైన రాష్ట్రాలు అనే నినాదం బలమైన కేంద్రం అనే నినాదానికి మారింది. ప్రణాళికా సంఘం ప్రభావంతో పంచవర్ష ప్రణాళికలు, కేంద్రాన్ని బలోపేతం చేశాయి.

రాజ్యాంగ రచనలో అమెరికా, బ్రిటను రాజ్యాంగాలు, లిఖిత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను ఐరిష్, వీమర్ రాజ్యాంగాలు ప్రభావితం చేశాయి. కమ్యూనిస్టు దేశాల ఉద్యమ స్ఫూర్తితో ఆదేశికసూత్రాలు వ్రాశారు. శ్రీ కె.యమ్. మున్షీగారు పట్టుబట్టి ప్రాథమిక హక్కుల అధ్యాయాన్ని రాజ్యాంగంలో వ్రాయిం చారు. జవహర్‌లాల్‌గారు రాజ్యాంగంలోని 31వ క్లాజుకు - ఆస్తి కలిగి వుండటానికి, అమ్మటానికి, వంశపారంపర్యంగా అనుభవించటానికి వ్యతిరేకం (ప్రపంచ కమ్యూనిస్టు ప్రభావం). ఈ ప్రాథమిక హక్కులకు భంగం కలిగి నప్పుడు ఎవరైనా సుప్రీంకోర్టు తలుపులు తట్టవచ్చు.

రైతులకు వ్యతిరేకంగా, పొలాలపై హక్కులకు భంగకరంగా కమ్యూనిస్టు ఆలోచనలకు అనుగుణంగా ప్రాథమిక హక్కులు సవరణలకు గురైనాయి.

వయోజన ఓటింగు హక్కును పార్లమెంటులో అందరం అంగీకరించాం. 1925 నుండి నేనీ వయోజన ఓటింగు హక్కుకై కృషి చేస్తున్నాను. పత్రికా స్వేచ్ఛ కొరకు, వేదికలమీద మాట్లాడే హక్కుల కొరకు బ్రిటీషువారు, అమెరికా వారు, ఫెడరలిస్టులు, ఫ్రెంచి విప్లవకారులు ఎన్నో త్యాగాలు చేశారు. ఐక్యరాజ్య సమితి ప్రవచించిన మానవ హక్కులను చాలా సంవత్సరాల క్రితమే మన రాజ్యాంగంలో పొందుపరిచాం.

దేశాధ్యక్షుని పెద్దగా గణతంత్ర రాజ్యాన్ని (రిపబ్లిక్) స్థాపించుకున్నాము. (క్రమం తప్పకుండా అధ్యక్ష ఎన్నికలు అమెరికాలో 4 సం॥లకు, భారతదేశంలో 5 సం॥లకు జరుగుతవి.) భారత అధ్యక్షునికి అమెరికా అధ్యక్షుని వలె విస్తృతమైన అధికారాలేమీ లేవు. ఫ్రెంచి అధ్యక్షునిలాగానే ఉంటాడు. మొదట గవర్నర్లను ఎన్నుకుందామనుకున్నాం. ఖరీదైన ఎన్నికల ఖర్చుకు దడిసి ఎంపిక చేసుకొన టానికే మొగ్గుచూపాం. మంత్రివర్గాలను రద్దుచేసి 'అత్యవసర పరిస్థితి' (ఎమర్జెన్సీ) విధించేందుకు అధ్యక్షునికి అధికారాలిచ్చాము. తెలంగాణాలో కమ్యూనిస్టుల తిరుగుబాటుకు, 30 జనవరిలో జరిగిన విషాదానికి పరిష్కారంగా ఇది నిర్దేశించ బడింది. దురదృష్టవశాత్తు అత్యవసర స్థితి పాక్షిక దృక్పథంతోగా అమలు చేయబడింది.

పార్లమెంటులో ఉభయ సభల (లోక్‌సభ, రాజ్యసభ) ఏర్పాటుకు అనుమతి నిచ్చాం. అసెంబ్లీలలో ఉభయ సభలను ఎన్నుకోవచ్చు లేక శాసనసభను మాత్రమే కల్గివుండవచ్చు. ఇది ఎన్నికైన శాసనసభల ఇష్టానిష్టాలపై ఆధారపడి ఉంటుంది. నేను, టంగుటూరి ప్రకాశంపంతులు 'స్విస్' విధానాన్ని అమలు చేయమని కోరాం. ఎన్నికయిన సభ్యుల పనితీరు సక్రమంగా లేనట్లయితే 'రిఫరెండం' పెట్టి ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా వారి సభ్యత్వాలు రద్దు చేయమని కోరాం. సోషలిస్టులు మాకు సహకరించారు. కానీ పార్లమెంటులో ఈ విషయం చర్చకు రాలేదు.

జమీందారీ విధానానికి మేము వ్యతిరేకం. వారికి భరణాలు ఇవ్వడం ఎంత కష్టమో ప్రభుత్వానికి తెలుసు. ప్రభుత్వం తల బద్దలు కొట్టుకుంది.

బ్రిటీషు పార్లమెంటరీ సంప్రదాయాలకు అనుగుణంగా మంత్రివర్గాల ఏర్పాటును గవర్నర్‌లకు అప్పచెప్పాం. ఇది ఎంత తప్పు నిర్ణయమో మాకు వెంటనే తెలిసింది. మొదటి దశాబ్దంలోనే మూడు మంత్రివర్గాలు కూలిపోయాయి, గవర్నర్లు ప్రభుత్వ బాధ్యతను స్వీకరించారు.

భారత రాజ్యాంగం 20 మిలియన్ల ట్రైబల్స్‌కు (తెగల) సాంఘిక ఆర్థిక స్వాతంత్ర్యం ఇచ్చే ఉద్దేశ్యంతో ఉంది. ట్రైబల్స్‌కు అందరిలాగానే పార్లమెంటులో ప్రాతినిధ్యముంది. వారి స్వతంత్ర రాజకీయ విభాగాలకు సహాయం కావాలి. భారత రాజ్యాంగం కొత్త పుంతలు త్రొక్కి ఈ చిన్న పెద్ద తెగలకు సహాయం చేయాలి. మనం నాగా, మిజో, ఇతర తెగల నమ్మకం సంపాదించుకోవాలి.

భారతదేశపు సంస్కృతీ–నాగరికతలపై మచ్చగా మిగిలిన అస్పృశ్యతా నివారణకు గాంధీగారు సల్పిన కృషి అనుపమానం. కులాలు, జాతులు, మతాలు అన్నీ ఒకటే అనే భావన చట్టంలో రూపుదిద్దుకొన్నది. మానవులందరూ ఒకటే అనే ఆదర్శం మన రాజ్యాంగంలో చెప్పబడింది. షెడ్యూల్డు జాతులు, వెనుకబడిన జాతులు, అణగద్రొక్కబడిన జాతులు, ఆటవిక జాతులకు భారత అధ్యక్షుడు ఒక కమీషనరును నియమించారు. తరువాత కాలంలో అస్పృశ్యతా నివారణకు చట్టం చేయబడింది.

భారతదేశపు సంస్కృతీ–నాగరికతలపై మచ్చగా మిగిలిన అస్పృశ్యతను తొలగించటానికి గాంధీగారు నాలుగు దశాబ్దాలుగా చేసిన పోరాటానికి గుర్తుగా భారత రాజ్యాంగం 'మానవులందరూ సమానులే' అని, అస్పృశ్యతను కులాలు, మతాలకు అతీతంగా బహిష్కరించాలని తీర్మానించింది. వెనుకబడినవారుగా బ్రిటీషు హయాంలో ముద్రవేయబడినవారి రక్షణకు, అభివృద్ధికి మన రాజ్యాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. దురదృష్టవశాత్తూ హరిజనులకు, వెనుకబడిన తరగతులవారికి ఏమీ చేయలేకపోయాం. కానీ వీరిని నేరజాతుల చట్టం నుండి తీసివేసి 'విముక్త జాతి' లేక 'స్వతంత్ర జాతుల' సంఘాలుగా ఏర్పాటుచేశాం.

రాజ్యాంగం 'న్యాయపాలనను' (Rule of Law) ఒక పవిత్ర కర్తవ్యంగా తలచింది. రూల్ ఆఫ్ లాకు విస్తృతమైన అర్థం ఉంది. న్యాయపాలన లేక చట్ట పాలన లేక (ఆర్టికల్–14) అందరూ సమానులు అనే భావన వగైరాలు.

దీని రక్షణను కోర్టులకప్పజెప్పింది. ప్రాథమిక హక్కులు, రాజ్యాంగం ఇచ్చే ఇతర హక్కులకు సుప్రీంకోర్టు బాధ్యత వహించాలి. ఈ విషయంలో అమెరికాను ఆదర్శంగా తీసుకున్నాం. జవహర్‌లాల్‌గారి నాయకత్వంలో ఈ 17 సంవత్సరా లలో ఈ హక్కులను తృణీకరించడం జరుగుతున్నది. సుప్రీంకోర్టు జడ్జి శ్రీ కోకా సుబ్బారావుగారు, మెజారిటీ సభ్యులు ప్రాథమిక హక్కులకు సవరణలు చేయకూడదనే అభిప్రాయంతో ఉన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పుకు పార్లమెంటు కట్టుబడుతుందా?

జాతీయ భాషను గురించి భేదాభిప్రాయాలున్నాయి. సాంస్కృతికంగా, రాజ కీయంగా హిందీ భాష జాతీయ భాషగా ఉండాలని ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్,మధ్యప్రదేశ్ రాజ్యాంగ సభలలోని పార్లమెంటు సభ్యులు శ్రీ పురుషోత్తమ దాస్‌టాండన్‌గారి నాయకత్వంలో కోరారు. జాతీయ సమైక్యతకు హిందీ దోహద కారి యని భావించారు. దీనిని ఒక్కదానినే జాతీయ భాషగా గుర్తించటానికి చాలా వ్యతిరేకత ఉంది. వేయి సంవత్సరాల పైబడిన చరిత్ర కలిగిన స్థానిక భాషలున్నాయి. ఇంగ్లీషు భాష ఉత్తరాదికి, దక్షిణాదికి వారధిగా ఉంటుందని మరికొందరు భావించారు. దక్షిణాది రాష్ట్రాలు బెంగాలు, అస్సాం, బాంబేవారు ఇంగ్లీషు భాషను హిందీ కొరకు త్యాగం చేయటానికి సిద్ధంగా లేరు. ఉత్తరాది రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వంలో ఎక్కువగా ఉద్యోగాలు సంపాదించుకొని, దక్షిణాది రాష్ట్రాలను నిర్లక్ష్యం చేస్తాయని భావిస్తున్నారు.

భాషాపరంగా అల్పసంఖ్యాకులకు రక్షణ కల్పించాం. పంచవర్ష నివేదికను అధ్యక్షునికి సమర్పించవలసిందిగా ప్రత్యేక సంచాలకుణ్ణి కోరాం. భారతీయు లందరూ ఒకే పౌరసత్వం కలిగివుండాలని తీర్మానించాం.

శ్రీ హెచ్.వి. కామత్, ఇతర సోషలిస్టులు సాంఘికంగా, ఆర్థికంగా బల పడేందుకు కొన్ని సవరణలు ఇచ్చారు. భారత ప్రజాస్వామ్యాన్ని విశాలతరం చేయటానికి ఉపయుక్తమైన రిఫరెండం, రీకాల్, ప్రపోర్షనల్ రిప్రజెంటేషను (ప్రజాభిప్రాయ సేకరణ, శాసనసభ్యులను వెనక్కు పిలవటం, దామాషా ప్రాతినిధ్యం) వంటి సలహాలనిచ్చారు. భూస్వామ్యం త్వరగా అంతరించటానికి

జవహర్‌లాల్ ప్రవేశపెట్టిన ఆర్టికల్-31 ని కూడా తాత్కాలిక పార్లమెంటు ఆమోదించింది. తరువాత కాలంలో భూమిపైన హక్కులు లాక్కునే ఆర్టికల్-17 ప్రభుత్వం ప్రవేశపెట్టింది. పొట్టిశ్రీరాములుగారి ఆత్మార్పణతో భాషాప్రయుక్త రాష్ట్రాలకు నాంది పలికారు. వీటి పునర్నిర్మాణం ఆంధ్ర, మైసూరు, కేరళలు 1959 లో, బొంబాయి, గుజరాత్‌లలో 1960 లో వచ్చాయి. విదర్భ, అస్సాం లలో ఇప్పటికీ రాలేదు. (భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటుకాలేదు).

పాశ్చాత్య నాగరికతతో పరిచయం గల అల్లాడి కుప్పుస్వామి, బి.యన్. రావు, గోవిందవల్లభ పంత్, కె.యమ్. మున్షీల ఉదారవాదం రాజ్యాంగపు ముందస్తు తయారీకి ఉపకరించింది. రాజ్యాంగసభలో ఏకాభిప్రాయం రానప్పుడు రాజ్యాంగ భవనంలో, కాంగ్రెసు సభలలో ప్రత్యేకంగా చర్చించేవారం. ఈ సభకు అధ్యక్షునిగా శ్రీ జె.బి. కృపలానీగారు నవంబరు 1947 వరకు ఉన్నారు. రాజకీయ నాయకులు కానటువంటి డాక్టరు కుంజ్రూ వంటివారి సలహాకు విలువ ఉండేది. కృపలానీగారు కాంగ్రెసు అధ్యక్షులుగా ముఖ్యభూమిక పోషించేవారు. అధికారపు హద్దులు, స్థానిక స్వతంత్రం, సివిల్ సర్వీసులను అదుపులోపెట్టడం వంటి గాంధీ ఆశయాలు అధికారం కొరకు ఆరాటపడే కాంగ్రెసు పార్లమెంటు పెద్దలకు నచ్చేవికావు.

నౌఖాలిలో బాపూ యాత్ర చేస్తూ, రాజ్యాంగ రచనకు దూరంగా ఉన్నారు. గ్రామపంచాయితీల, జిల్లాపరిషత్తుల ఎన్నికలు గాంధీగారి నాయకత్వం లేకుండానే జరిగాయి.

మానవతకు, స్వేచ్ఛకు మన రాజ్యాంగం ఒక నమూనా. సోషలిజంకు ఇది ఒక అడ్డంకి అని నెహ్రూగారు అనుకునేవారు. 17 సవరణలను 17 సం॥ల కాలంలో మన రాజ్యాంగం చేయటానికి ప్రధాన కారణం నెహ్రూనే. అమెరికా 6 రాజ్యాంగ సవరణలను 170 సంవత్సరాలలో ప్రవేశపెట్టింది (Rigid).

దేశ విభజన తరువాత మన పార్లమెంటు మనకుండాలి. భారత రాజ్యాంగ పరిషత్తును (సభను) తాత్కాలిక సభగా మార్చాం. అసెంబ్లీలలో ఉన్నవారిని తాత్కాలిక పార్లమెంటులోనికి తీసుకోలేదు.

జి.వి. మౌలంకర్‌ను మొదటి పార్లమెంటుకు స్పీకరుగా ఎన్నుకొన్నాం. రాజ్యాంగ పరిషత్ అధ్యక్షునిగా, జాతీయ సమైక్యతావాదిగా, గాంధీగారి ఆత్మీయుడుగా, కారుణ్యమూర్తిగా, సమ్యక్‌దృష్టి గలవానిగా ప్రజలందరికీ మౌలంకర్ చేరువయ్యాడు. ఉపసభాపతిగా క్రైస్తవ నేత శ్రీ ముఖర్జీగారు వీరికి సరియైన జోడి అయినారు. పార్లమెంటు మర్యాదలు తెలిసినవారు, కేంద్ర అసెంబ్లీ స్పీకరుగా పనిచేసిన మౌలంకర్ మొదటి పార్లమెంటు స్పీకరుగా ఎన్నిక కాబడ్డారు. పార్లమెంటు మర్యాదలకు పునాదులు వేశారు. 1956 లో వారు చనిపోవటంతో భారతదేశం విషాదగ్రస్తమయింది.

జనవరి 26, 1950 న మన రిపబ్లిక్ అవతరించింది. రాజన్‌బాబు మొదటి అధ్యక్షునిగా, డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యక్షునిగా ఎన్నుకోబడ్డారు. 1962లో రాధాకృష్ణన్ దేశాధ్యక్షుడైనారు.

ఏ చక్రవర్తికీ తలవంచని భారత రిపబ్లిక్ కామన్వెల్తు దేశాలలో సభ్యత్వం తీసుకొన్నది. బ్రిటీషు రాణి కామన్వెల్తు అధ్యక్షురాలు. జవహర్‌లాల్ చేసిన నిర్వాకమిది.

నేనారోజులలో మద్రాసు రాజకీయాలు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు కమిటీ అధ్యక్ష పదవి, ప్రత్యేక ఆంధ్ర ఉద్యమాలలో తలమునకలై ఉన్నాను. చాలా అంతర్జాతీయ సభలలో కూడా పాల్గొనవలసివచ్చేది. ప్రతి సాయంత్రం కాంగ్రెసు వర్కింగు కమిటీ సమావేశాలలో చురుకుగా పాల్గొనేవాడిని. సంఘంలో గౌరవాదరాలకు నోచుకోని 'వెనుకబడిన తెగల' వారిని నా ఉపన్యాసాలతో ప్రభావితం చేసేవాడిని.

నేను భారత రాజ్యాంగ పితలలో ఒకడినైనందుకు గర్విస్తున్నాను.

★ ★ ★

33. కాంగ్రెసు రాజకీయాలు

నాకు కాంగ్రెసు అంతర్గత కీచులాటలలో అభిరుచి లేదు. దేశోద్ధారక నాగేశ్వరరావు కాంగ్రెసు మంత్రులపై అవిశ్వాస తీర్మానం పెట్టి విఫలుడయ్యాడు. కాంగ్రెసు మంత్రివర్గం కిసాను కాంగ్రెసు కార్యకర్తలపై వేధింపులకు పాల్పడు తున్నది. కిసాను కాంగ్రెసును బలహీనపరుస్తున్నది. ఒక్క పి. శ్యాంసుందర బెనర్జీ మినహా కిసాను కాంగ్రెసువారి కెవ్వరికీ అసెంబ్లీ సభ్యత్వం ఇవ్వలేదు. 1937–38 లలో కాంగ్రెసువారి ఆగడాలు పెరిగాయి. ఈ కారణాలతోనే నేను శ్రీ పట్టాభి (భోగరాజు పట్టాభి సీతారామయ్య) పై ఆంధ్ర రాష్ట్రీయ కాంగ్రెసుకు అధ్యక్షునిగా పోటీచేసి స్వల్ప తేడాతో ఓడిపోయాను.

ఈ ఎలక్షను జరిగిన తరువాత నేను గాంధీగారిని కలిశాను. గ్రూపు రాజ కీయాలను వారి దృష్టికి తీసుకువెళ్ళాను. రైతు నాయకులను నిర్లక్ష్యం చేయడం తగదని చెప్పాను. "కాంగ్రెసు నాయకత్వంపై ఆశ లేదని, కిసాను కాంగ్రెసు కార్యక్రమాలలోనే ఉన్నానని బహిరంగంగా చెప్పు" అని గాంధీగారన్నారు. "ఇది న్యాయం కాదు" అని గాంధీగారితో అన్నాను.

1946 లో నేను ఇంగ్లాండు వెళ్ళాను. అప్పటికే ప్రకాశంగారికి అనుకూలంగా ఒక గ్రూపు, వ్యతిరేకంగా మరొక గ్రూపు కాంగ్రెసులో ఉన్నాయి. చాలామంది కిసాను కాంగ్రెసువారు ఈ కాంగ్రెసు కమిటీలో సభ్యులుగా ఉన్నారు. శ్రీ ప్రకాశం గారు ముఖ్యమంత్రి అయ్యారు. శ్రీ కె. ఓబులరెడ్డికి ప్రకాశంగారి ఆధిక్యత అసెంబ్లీలో సరిపోదనిపించింది. ప్రకాశంగారు కూడా నేను అధ్యక్షునిగా (కాంగ్రెసు అధ్యక్షుని) ఉంటే బాగుంటుందన్న అభిప్రాయంతో ఉన్నారు. పట్టాభి గ్రూపువారు కూడా తమ గ్రూపుపై అసంతృప్తితో ఉన్నారు. వారు కూడా నన్ను బలపరుస్తామన్నారు.

నేను ఇంగ్లాండులో ఉండగనే, నా ప్రమేయం ఏమీ లేకుండానే, రాష్ట్ర కాంగ్రెసుకు ఎన్నికలు జరిగాయి. నేను శ్రీ మల్లిపూడి పళ్ళంరాజుగారిపై గెలిచాను. పట్టాభి గ్రూపు నాపై తీవ్ర అసంతృప్తితో ఉంది. పట్టాభిగారు నా వర్కింగు కమిటీని రద్దుచేయమని, గత కాంగ్రెసు కమిటీ చేసిన తప్పులకు నన్ను బాధ్యుణ్ణి చేయమని అఖిల భారత కాంగ్రెసు కమిటీలో ఆరోపణలు చేశారు.

సర్దారు పటేలు అప్పట్లో పట్టాభికి మంచి స్నేహితుడు. పట్టాభిగారి అభ్యర్థి ఓడిపోయినందుకు వారికి తీవ్రమయిన మనస్తాపం కలిగింది. ప్రకాశంగారిని కూడా వారు ముఖ్యమంత్రిగా ఆమోదించలేకపోయారు. గాంధీగారు కూడా ప్రకాశంగారి ముఖ్యమంత్రిత్వానికి వ్యతిరేకంగా ఉన్నారు.

నేను ఎలక్షను జరిగిన ఒక నెల తర్వాత యూరప్ నుండి వచ్చాను. 'భంగీ' కాలనీలో ఉన్న గాంధీగారిని కలిశాను. వారిని కొద్ది రోజులలో జరుగనున్న కిసాను కాంగ్రెసు సమ్మేళనాన్ని ఆశీర్వదించమని కోరాను. "నీవు కాంగ్రెసు అధ్యక్షుడవైనా, కిసాను కాంగ్రెసును మరచిపోలేదు" అన్నారు. "ఈ పదవులన్నీ రైతులకు, కళాకారులకు ఉపయోగపడటానికేగదా!" అన్నాను. నా సమాధానానికి వారెంతగానో సంతోషించారు. కిసాను సమ్మేళనానికి ఇతోధికంగా సహాయం చేయవలసిందని వారిని కోరాను.

"ఇప్పటి పరిస్థితులు నీకు, నాకు, అందరికీ అనుకూలంగా ఉన్నాయి. నేను నీకు తప్పనిసరిగా సహాయం చేస్తాను" అన్నారు. ఆ తర్వాత రాష్ట్ర కాంగ్రెసు (P.C.C. - ప్రొవిన్షియల్ కాంగ్రెసు కమిటీ) కమిటీ విషయం మాట్లాడుతూ "మద్రాసు కాంగ్రెసు కమిటీ మంత్రివర్గం ప్రజోపయోగకరమైన పనులు చేయాలని, పరిపాలన అవినీతిరాహిత్యంగా ఉండాలని, రాజకీయ దుర్వినియోగం చేయకూడదని నాకు సలహానిచ్చారు.

నేను ఆంధ్రకు వచ్చి రాష్ట్ర కాంగ్రెసు పగ్గాలు చేపట్టాను. రామానీడు విద్యాలయం, నిడుబ్రోలులో మొదటి సమావేశం జరిగింది. (ఇక్కడి రాజకీయ పాఠశాల నుండే శ్రీ కె.ఓబులురెడ్డిగారు, శ్రీ గౌతు లచ్చన్నగారు పట్టభద్రులైనారు.)

పునశ్చరణ తరగతుల ఆవశ్యకతను కార్యకర్తలకు వివరించాను. కార్యకర్తలకు నెలసరి వేతనాలు ఇవ్వాలని, నెలసరి ఖర్చులకు వారు బాధపడకూడదని చెప్పాను.

1923 నుండి నేనీ నెలసరి వేతనాలను గురించి ఆలోచిస్తున్నాను. బ్రిటీషు లేబరు పార్టీ ఈ విధానాన్ని అనుసరించే 1945 ఎన్నికలలో గెలిచింది. 1925 నుండి గాంధీగారీ విషయాన్నే చెపుతున్నారు. కమ్యూనిస్టు పార్టీవారు వారి కార్యకర్తలకు జీతాలు, అలవెన్సులు ఇచ్చి ఆ పార్టీలోని విభాగాలను ఎంతో క్రమశిక్షణతో నడుపుతున్నారు. ఆంధ్ర రాష్ట్రీయ కాంగ్రెసు ఈ విధానాన్ని ఆమోదించినందులకు నేను చాలా సంతోషించాను.

ఇది కాంగ్రెసులోని నా ప్రత్యర్థులకు కన్నుకుట్టింది. నేను బలపడటం కొరకే ఈ తీర్మానాన్ని పెట్టానని, ప్రత్యర్థి గ్రూపులకు అవకాశం లేకుండా చేస్తున్నానని ప్రచారం మొదలుపెట్టారు. దీనిని ఒక కారణంగా చూపి పి.సి.సి.ని రద్దు చేయమని కోరారు.

1940 నుండి 1946 వరకు మౌలానా అబుల్ కలామ్‌గారు ఎ.ఐ.సి.సి. అధ్యక్షునిగా ఉన్నారు. వారి రాజీనామా తరువాత 1947 లో జవహర్‌లాల్‌గారు అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. జవహర్‌లాల్‌గారు నన్ను పి.సి.సి. అధ్యక్షునిగా గౌరవిస్తారనుకున్నాను. కానీ వారు శ్రీమతి కమలాదేవి చటోపాధ్యాయను గుంటూరులో జరిగిన (వారనుకున్న) అవకతవకలపై విచారణకు ఆదేశించారు. నన్ను కాంగ్రెసువారిలో అగౌరవపరచటానికే ఈ విచారణ. నేను అధ్యక్షుడనై నెల కూడా కాలేదు. కాంగ్రెసు ప్రత్యర్థి వర్గాలకు నాపై ఆరోపణలు చేయటానికి ఇది ఒక అవకాశం. గతంలో జరిగిన విషయాలపై విచారణ. అసెంబ్లీకి అభ్యర్థులుగా ఎంపిక చేయబడనివారందరూ నాపై అభియోగాలు మోపారు. ఈ వ్యవహారం అంతా నాకు కొత్తగా ఉంది. ఇది కాంగ్రెసు రాజకీయాలు నేర్చుకునేందుకు వచ్చిన అవకాశంగా భావించాను. కమలాదేవిగారు పరిస్థితులను అర్థంచేసుకున్నారు. పార్టీలోని వర్గాలకన్నిటికీ మంచి చేసే ఉద్దేశ్యంతో ఉన్నానని గ్రహించారు. ఆంధ్రలో కమ్యూనిస్టుల బెడదకు వ్యతిరేకంగా నేను తీసుకునే చర్యలపై సంతృప్తి వెలిబుచ్చారు. నా కార్యవర్గాన్ని కాంగ్రెసు వర్కింగు కమిటీ రద్దుచేయబోతున్నదని పట్టాభి వర్గీయులు కేకలు వేశారు.

ఈ ఒక్క నెలలోనే నేను చాలా నేర్చుకున్నాను. కాంగ్రెసులో గ్రూపుతత్వం జీర్ణించుకొంటున్నదని (కమలాదేవి) విచారణలో నాకు అర్థమైంది. ఈ గ్రూపులు గ్రామాల వరకు విస్తరించాయి. 1939 వరకు పట్టణాలవాళ్ళే కాంగ్రెసులో పెత్తనం చేశారు. గ్రామీణులకు అవకాశమే ఇవ్వలేదు. ఈ మూడున్నర దశాబ్దా లలో నేను గ్రామీణ అభ్యర్థులలో రెండవవాడిని. ఇది ఒక ప్రజాస్వామ్య విప్లవంగా భావించాలి. నేను, నా కార్యవర్గం అందరం గ్రామాల నుండి వచ్చినవాళ్ళమే. కమ్యూనిస్టు యువకులు, సోషలిస్టు కార్యకర్తలు నేను చేస్తున్న రాజకీయాలను మెచ్చుకుంటున్నారు. ఇదంతా పాత కాంగ్రెసు నాయకులకు నచ్చలేదు. స్వతంత్రం రాబోతున్నది. జస్టిస్ పార్టీవారు కాంగ్రెసులో చేరాలనుకుంటున్నారు. కులతత్వం ఇప్పుడిప్పుడే పురివిప్పుతుంది. ఈ కొత్త పరిస్థితులలో అవకాశవాదం పెద్దపీట వేసుకుంది.

సభ్యత్వాలు, ఎన్నికలు, నాయకత్వంపై కాంగ్రెసువారు పెద్ద 'తంతు' నడిపారు. గాంధీగారి ఆశయాలకు తిలోదకాలు వదిలారు. నీతిబాహ్యంగా చాలామంది కాంగ్రెసు నాయకులు వ్యవహరించి, ఆధిక్యత కోసం, పదవులకోసం ప్రయత్నిస్తు న్నారు. సభ్యత్వాలు చెల్లించినవారికి రసీదులు లేవు. కొత్త సభ్యత్వాలు ఇవ్వరు. కాలం చెల్లిన ఎన్నికల నోటీసులు, ఫోర్జరీ సంతకాలతో సభ్యులకు పంపటం వంటి అక్రమాలు ఎన్నో. ఒకరిమీద ఒకరికి నమ్మకం లేదు. ఈ విద్వేషపూరిత రాజకీయాలతో నేను స్తబ్ధుడనైనాను. ఈ ద్వేషపూరిత వాతావరణంలో గాంధీగారి ఆశయాలకు గతేది? చాలామంది కాంగ్రెసు నాయకులు కిసాను కాంగ్రెసువారికే పదవులిచ్చారని, ఆ పదవులకు కిసాను కాంగ్రెసువారు అర్హులు కారని నిందలు వేశారు. గాంధీగారి ఆదేశాలను తృణీకరిస్తున్నామన్న భావం వారిలో కల్గలేదు. నిజాయితీపరులుగా పేరుగాంచిన కాంగ్రెసువారు, స్వతంత్ర సమరంలో ఇబ్బందులుపడిన వారు తమ ప్రత్యర్థులపై విద్వేషం వెళ్ళగక్కుతున్నారు. ఈ పరిస్థితులలో నేను చేయవలసినది చాలా ఉన్నదని, కాంగ్రెసు నాయకత్వం ఉమ్మడిగా కృషి చేయాలని గ్రహించాను.

నా ఒక నెల నాయకత్వాన్ని కమలాదేవిగారు తప్పుపట్టలేదు. నాముందు వారు చేసిన పనులను విమర్శించారు. డా॥ పట్టాభి నా కమిటీని రద్దు చేయించ లేకపోయారు.

ఆల్ ఇండియా కాంగ్రెసువారు పంపిన ఆడిటర్సు (గణకులు) నా లెక్కలన్నీ సరిగానే ఉన్నాయన్నారు.

మా కమిటీపై నెహ్రూగారు ఎందుకంత వ్యతిరేకంగా ఉన్నారు? రెండు నెలల్లోనే విచారణ కమిటీని నియమించటం పి.సి.సి. ఆనవాయితీ కాదు. ప్రత్యేకంగా ఏ అభియోగాలు ఈ కమిటీపై లేవు. కొత్తగా ఎన్నికయినవారు సంజాయిషీ ఇచ్చే అవకాశం కూడా ఇవ్వలేదు. మరి ఈ విచారణ ఎందుకు?

కమలాదేవి ఛటోపాధ్యాయ

"నా కృషి విమర్శలకు అతీతంగా ఉండాలని, కాంగ్రెసు పార్టీ పాలన పారదర్శకంగా ఉండాలని, నా కమిటీ సామర్థ్యాన్ని పరీక్షించాలని వారి అభిప్రాయం. కిసాను మజ్దూర్ ప్రజారాజ్యంపై (కె.యం.పి.) నా ప్రేమ, రైతులు, కళాకారుల పట్ల నా విశ్వాసం, క్రియాశీలకమైన నా రాజకీయ చొరవను, వివిధ కోణాలలో నా ప్రవర్తనను అర్థం చేసుకోవడానికే వారట్లా ప్రవర్తించారు."

నా ప్రత్యర్థుల ఆశలు అడియాసలయ్యాయి. పండిట్ నెహ్రూగారు, ఎ.ఐ.సి.సి. నావైపే ఉన్నారు. గాంధీగారి వద్ద వారు ఫిర్యాదు చేశారు. నన్ను నిజాయితీగా సమాధానం ఇవ్వవలసిందని గాంధీగారు కోరారు. సుదీర్ఘమయిన నివేదికను వారికి పంపాను. కాంగ్రెసు సంస్థాగత విషయాలపై నా అభిప్రాయాలు, కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీని వారే అభినందించిన విషయం, సేవాదళ్ కార్యకర్తలపై నా ఆలోచనలు, రాజకీయ, రాజకీయేతర విషయాలపై నా స్పందనను నా జాబు ద్వారా వారికి అందజేశాను. వారూ నన్ను తప్పుపట్టలేదు. వారూ నన్నే సమర్థించారు. కాంగ్రెసు భవిత కొరకు మరింత చొరవగా ముందుకు నడవమని నన్నాదేశించారు.

కాంగ్రెసు అధినాయకత్వం వద్ద పరాజయప్రాప్తి పొందిన పెద్దలు నన్ను పదవి నుండి తొలగించటానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

శ్రీ టంగుటూరి ప్రకాశంగారు గాంధీగారి అభీష్టానికి వ్యతిరేకంగా మద్రాసు రాష్ట్రానికి - ఆంధ్రతో కలసిన ముఖ్యమంత్రి అయ్యారు. రాష్ట్ర కాంగ్రెసులోనూ,

ఎ.ఐ.సి.సి.లోనూ వారు చాలా ఒత్తిడికి లోనౌతున్నారు. ఢిల్లీలో, ఇక్కడ పార్టీలో గ్రూపులు వారిని గద్దె దించడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి.

1946 లో నేను 'యూరప్' పర్యటనకు వెళ్ళే ముందు గాంధీగారిని కలసి ప్రకాశంగారిపై వారికున్న అభిప్రాయము మార్చుకోవలసినదని కోరాను. వారు నన్ను 'సమదృష్టి'తో ఈ విషయాన్ని చూడమన్నారు.

నాకు ఈ 'సమదృష్టి' ఏమిటో అర్థంకాలేదు. ప్రకాశంగారు గాంధీగారికి ఇష్టమైన ప్రజోపయోగకరమైన పనులు వెంట వెంటనే చేయసాగారు. ఖాదీ (ఖద్దరు) నిధికి ఒక కోటి రూపాయలు కేటాయించారు. హరిజనుల అభివృద్ధికి మరియొక కోటిని కేటాయించారు. సహకార సంఘాలలో దళారీలు లేకుండా చర్యలు తీసుకున్నారు. దీనివలన ఆహారధాన్యాల ఉత్పత్తులు వినియోగదారులకు సక్రమంగా అందేవి. జోగన్నపాలెంలో వారు, అనుచరులు కలసి గ్రామీణ స్వావలంబన పథకాన్ని ఫిర్కాల (నేటి మండలాలు) వారిగా అమలుచేస్తున్నారు. కిసానువారికీ పథకం ఉపయోగకారి అయ్యింది.

ఆంధ్ర, తమిళనాట వారు ప్రవేశపెట్టిన మద్యపాన నిషేధం చాలా ఖరీదైన తప్పిదం. గాంధీగారు తమ కార్యక్రమాలలో దీనికే అగ్రతాంబూలమిచ్చారు. దీనివలన కలిగే లోటు పూడ్చలేనిది. పది లక్షల కల్లుగీత పనివారికి ఈ కార్యక్రమం నిరుద్యోగం కల్పిస్తుంది.

ఈ కార్యక్రమాలకు ఆకర్షితుడనై నేను ప్రకాశంగారికి నా పూర్తి మద్దతు నిచ్చాను. వారి మంత్రివర్గాన్ని బలపర్చవలసిన బాధ్యత నాపై ఉన్నది. కానీ పార్టీలో వారి ప్రత్యర్థులు గాంధీగారి ఆశయాలనుగానీ, జాతీయైక్యతనుగానీ పట్టించుకోలేదు. వారు మంత్రివర్గంలో చోటు కొరకే తన్నుకుంటున్నారు. నేను నలుగురైదుగురిని కొత్తగా మంత్రివర్గంలోనికి తీసుకోమని కోరాను. కానీ వారు ఈ నలుగురైదుగురి మంత్రిత్వ బాధ్యతలు తామే స్వీకరించారు. వారి ప్రత్యర్థులు కేవలం పదవీవాంఛాగ్రస్తులు. వారు కాంగ్రెసువారే. ఎట్టకేలకు ప్రకాశంగారు ఇద్దరిని మంత్రవర్గంలోనికి తీసుకోవడానికి అంగీకరించారు. చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకొన్న చందమైంది. కానీ ఈ పెద్దమనుషులు ఈ

ప్రయత్నాన్ని తిరస్కరించి మంత్రివర్గాన్ని పడగొట్టటానికే కృతనిశ్చయులైనారు. నేను చూస్తూ ఊరకుండ లేకపోయాను. ప్రకాశం ప్రత్యర్థులను మంత్రివర్గాన్ని నిలబెట్టవలసినదిగా కోరాను.వారు పటేలుగారితో, ఇతర కాంగ్రెసు పెద్దలతో సమాలోచనలు సాగించి, ప్రభుత్వాన్ని పడగొట్టటానికే నిశ్చయించుకొన్నారు. నేను పటేలుగారితోనూ, నెహ్రూగారితోనూ వాదించాను. దేశభక్త కొండా వెంకటప్పయ్యగారీ విషయంలో ఎంతగానో సహకరించారు. ఒక ముఖ్యమంత్రిపై అవిశ్వాస తీర్మానం పెట్టడం ఒక చెడ్డ సాంప్రదాయమని వారు చెప్పారు. ఇది పార్టీలో క్రమశిక్షణారాహిత్యమే అని వారన్నారు. ప్రకాశంగారి నలభయ్యేళ్ళ ప్రజాసేవను పార్టీలోని పెద్దలు కాలరాస్తున్నారని నేను వాదించాను. కొండా వెంకటప్పయ్యగారు ఇది పార్టీలో 'గ్రూపులు' తయారీకి ఉపయోగపడుతుం దన్నారు. ఇది తగనిపని అని చెప్పారు. కానీ కేంద్రం ప్రకాశంగారి పతనాన్ని చూడటానికే నిశ్చయించుకొంది. నేను యం.యల్.ఏ.లను హెచ్చరించాను. నాపైన కేంద్రం కారాలు-మిరియాలు నూరుతుందని నాకు తెలుసు. కేంద్ర సహకారంతో ప్రకాశం ప్రత్యర్థులు ప్రకాశం మంత్రివర్గాన్ని కూలదోసారు.

ఓ.పి. రామస్వామిరెడ్డియార్‌ను ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారు. ఓ.పి. రామస్వామిరెడ్డియార్ నా మిత్రుడు. నెల్లూరు జైలులో నాతో గడిపాడు.

కాంగ్రెసులోని ముఠాతగాదాలు నన్ను దిగ్భ్రాంతికి గురిచేశాయి. గాంధీగారు కూడా ప్రకాశం మంత్రివర్గాన్ని నిలబెట్టలేకపోయారు. వర్కింగు కమిటీలో నా పని తేలికగాదని తెల్సుకున్నాను.

అయిదు సంవత్సరాల నా అధ్యక్ష పదవీకాలంలో ఎ.ఐ.సి.సి.ని ఒక క్రియా శీలక రాజకీయ సంస్థగా మలచటానికి పాటుబడ్డాను. యువకుల, విద్యార్థుల భాగస్వామ్యంతో ముందుకు నడచాను. ఎన్నికలలో ఈ కార్యక్రమం ఒక బలమైన ఆయుధంగా ఉండాలి. ప్రజలను తన కార్యక్రమాల ద్వారా మేలుకొల్పాలి. రాజకీయ కార్యకర్తలకు ఇది ఒక పాఠశాల కావాలి. సామాన్యులతో సాన్నిహిత్యం పెంచుకొని ఆసక్తికరమైన కార్యక్రమాలలో భాగస్వాములు కావాలి. డబ్బు మూటలకు బానిస కాగూడదు.

ఈరోజు ఆలోచిస్తే ఈ కార్యక్రమాలను నా అధ్యక్ష పదవీకాలంలోనే పూర్తి చేసినట్లు భావించవలసివస్తుంది (1967).

పదవీ బాధ్యతలు నిర్వహిస్తూనే 1946, 47, 48, 49 లలో ఇంగ్లాండు వెళ్ళాను. బ్రిటీషు లేబరు పార్టీ విధివిధానాలను, అమెరికన్ డెమోక్రటిక్ పార్టీ ప్రవేశపెట్టిన రూజ్వెల్టు ప్రోగ్రామును, కో-ఆపరేటివ్ కామన్‌వెల్తు పార్టీ ఆఫ్ కెనడాను గురించి తెలుసుకున్నాను.

స్వతంత్ర సమరంలో జైళ్ళలో మగ్గిన రాజకీయ నాయకుల జీవితం, ప్రజాస్వామ్య నాయకత్వంలో యువకులను ఏకత్రాటిమీద నడిపింపగల శక్తి కాంగ్రెసు నాయకులు, కాంగ్రెసు మంత్రివర్గం అబద్ధం చేసింది. 1936-39 లోనే ఈ దుర్లక్షణం కాంగ్రెసు పార్టీలో కనుపించింది. బాపూ మరణం, స్వతంత్ర సాధన నాయకులలో మార్పు తెస్తుందనుకున్నాను. కానీ అది అడియాసే అయింది. కాంగ్రెసులో గ్రూపు తగాదాలు పెరిగాయి.

1945లో నేను ప్రచురించిన పుస్తకం 'వరల్డ్ రోల్ ఆఫ్ నేషనల్ రివల్యూషన్' (World Role of National Revolution) జాతీయ విప్లవంలో ప్రపంచ పాత్ర ననుసరించి ప్రణాళికాబద్ధంగా కాంగ్రెసు సంస్థ - మంత్రివర్గాల మధ్య సయోధ్యకు కృషి చేశాను. ప్రకాశంగారి అభివృద్ధి కార్యక్రమాలను నేను విశ్వ సించాను. వారి కొత్త ఆలోచనలకు దర్పణంగా పి.సి.సి. నాయకత్వం ప్రజల భాగస్వామ్యంతో - ఉత్పత్తిదారుల, వినియోగదారుల సహకారసంఘాల ద్వారా, ఫిర్కా (నేటి మండలాలు అనుకోవచ్చు) అభివృద్ధి సంఘాల ద్వారా లక్షలాది ఉత్సాహవంతులైన ఖద్దరు ఉత్పత్తిదారులకు ఉపయోగపడింది. మంత్రివర్గంలో చోటు లేనివారు ప్రకాశంగారి కార్యాచరణకు విఘాతం కల్పిస్తున్నారు.

లోకల్ బాడీలు, కో-ఆపరేటివ్ సొసైటీలలో ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగాలి. కానీ అధికారులు తమ స్వలాభం కోసం మంత్రులకు, మంత్రివర్గానికి అనుకూలంగా పనిచేశారు. కొన్నిచోట్ల గెలిచినవారిని ఓడినట్లుగా ప్రకటించి కోర్టుల చుట్టూ తిప్పారు. డిస్ట్రిక్ట్ బోర్డులు, పంచాయితీ ఎన్నికలు, టెంపుల్ ట్రస్టు కమిటీల ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగాలి. కానీ ఈ తంతు అవినీతికి కొమ్ముకాస్తున్నది. జవహర్‌లాల్ నెహ్రూగారు కూడా 1957 లో ఈ ఫిర్యాదులు

చేశారు. ఈ మంత్రివర్గానికి వ్యతిరేకంగా ఉన్న సొసైటీలు, భూమి తనఖా బ్యాంకులు డబ్బు లేక ఆగిపోయాయి. ప్రజలు, నాయకులు మంత్రివర్గానికి అనుకూల, ప్రతికూల వర్గాలుగా చీలిపోయారు. 1967 లో అసమ్మతి వర్గాలు ఎక్కువయ్యాయి.

రాజకీయ నాయకులకు నజరానా

1930 నుండి జాతీయోద్యమంలో ఉన్నవారికి ఐదు ఎకరాల మాగాణి లేక పది ఎకరాల మెట్ట ప్రభుత్వ భూములు (అసైన్డ్ లాండ్సు) ఇస్తామని అప్పటి రెవిన్యూ మంత్రి కళా వెంకట్రావు చెప్పాడు. పైకి చూడటానికి బాగానే ఉంది, కానీ కాంగ్రెసుకు చాలా నష్టము కల్గించే చర్య. ఎ.పి.సి.సి. నుండి ముందుగా రాజకీయ బాధితుడనని ధ్రువపత్రం తీసుకోవాలి. తనకు భూమి కావాల్సిన ఊరి పేరు వ్రాసుకోవాలి. అది ప్రభుత్వ భూమియై ఉండాలి. ఈ దరఖాస్తును జిల్లా కలెక్టరుగారు, అనధికార ప్రతినిధులు, స్థానిక సంస్థల సభ్యులు పరిశీలిస్తారు. కాంగ్రెసు కమిటీలకు చోటు ఉండదు. ఈ దరఖాస్తులను ఎంపికచేసే బాధ్యత ఎ.ఐ.సి.సి.ది. పొలాలు కేటాయించే బాధ్యత మాత్రం ప్రభుత్వానిది.

రాజకీయ బాధితులకు ఈ ఏర్పాటు సముచితమే. ఉత్తరప్రదేశ్‌లో ఉన్న విధంగా 'పెన్షను' ఇవ్వటం ఇంకా బాగుంటుంది. రెవిన్యూవారి దయాదాక్షిణ్యాలపై ఆధారపడవలసిన పనిలేదు. ప్రభుత్వం భూ కేటాయింపులనే కోరుకున్నది.

జరుగుబాటు ఉన్నవారికి ఈ భూమి కేటాయింపులు వద్దని నేను చెప్పాను. ప్రభుత్వం నా మాట వినలేదు. అప్పటి ఆర్థికామాత్యుడు "తనకు కావలసినంత భూమి ఉన్నప్పటికీ – తన బిడ్డలు, వారి బిడ్డలు ఇది తను చేసిన త్యాగానికి గుర్తుగా చెప్పుకుంటారు" అని అన్నారు. నిరాధారులకు చేసే ఈ సహాయం ఈవిధంగా దుర్వినియోగం చేయబడుతున్నది. నేను, భారతీదేవీ, నా తమ్ముళ్ళు ఈ సహాయం కొరకు దరఖాస్తు కూడా పెట్టలేదు. మా అందరి పొలంకన్నా ఇలా వచ్చే పొలం 25 శాతం ఎక్కువ. ప్రభుత్వ ఆక్రమణలో ఉన్న భూములు భూముల్లేని కిసాను ఉద్యమకారులకివ్వాలని మా ఉద్దేశ్యం. కానీ చాలామంది మంత్రులు, వారి ఆశ్రితులు ఈ పొలాలు సొంతం చేసుకున్నారు.

మూడు నాలుగు నెలల్లోనే ఈ పథకంలోని లొసుగులు బయల్పడ్డాయి. రెవిన్యూ ఉద్యోగుల లంచగొండితనం, అప్పటికే గ్రోమోరు ఫుడ్ ప్రోగ్రాం క్రింద హరిజనులకు కౌలుకు ఇచ్చిన భూములు, స్థానిక సంస్థల భూములు, పంచాయితీ చెరువులు, బీళ్ళు ఇవన్నీ ముఖ్య కారణాలు. ఈరోజుకీ (1967) ఈ సహాయం అందని రాజకీయ బాధితులున్నారు. 1960 లో ఈ దుర్మార్గాన్ని తెలంగాణా లోనూ ప్రవేశపెట్టారు.

రాజకీయాలలో దిగజారుడుతనం బయటపడింది. ఒక కేంద్ర మంత్రి ఒక ముఖ్య పట్టణంలో పది ఎకరాలు – చాలా విలువైన భూమిని తీసుకున్నాడు. దానిని వదిలిపెట్టమని అడిగినా వినలేదు. ఒక మాజీ పి.సి.సి. అధ్యక్షుడు ఐదు ఎకరాల ఊరుమ్మడి భూమిని (గ్రామ కంఠం), ఒక డి.సి.సి. అధ్యక్షుడు, అతని మిత్రులు తలా పది ఎకరాల మెట్టభూమిని తీసుకొని వెంటనే మాగాణిగా మార్చుకున్నారు. ఇవన్నీ 50 వేల నుండి లక్షా ఏభయివేలు చేసే భూములు. ఈ దిగజారుడుతనానికి మేమందరం నిస్సహాయ సాక్షులం. వినోబాభావే గారు కూడా వీరి అక్రమ ఆస్తులు వదులుకోమని చెప్పలేదు.

ప్రత్యేకాంధ్ర ఉద్యమం

నేను 1911 నుండి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం పోరాడుతున్న సంగతి అందరికీ తెలిసిందే. నేను పి.సి.సి. అధ్యక్షుణ్ణి కాగానే పట్టణ ప్రజలు, పల్లె జనం అందరూ ప్రత్యేక ఆంధ్ర కోసం కృషిచేయవలసిందిగా కోరాను. దీని పరిష్కారంమీద నా దృష్టిని కేంద్రీకరించాను.



'అమరజీవి' పొట్టి శ్రీరాములు

శ్రీ దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారి ఆధ్వర్యంలో 1948 లో ఒక సభ జరిగింది. వారు మంచి వక్త, రచయిత. ప్రకాశంగారు అధ్యక్షుడుగా జరిపిన ఈ ఊరేగింపు చాలా గొప్పగా జరిగింది. 50 వేలకంటే ఎక్కువమంది ఈ సభకు హాజరయ్యారు. ఆంధ్రరాష్ట్రంతోపాటు,

రాయలసీమకు ప్రత్యేక ప్రతిపత్తి కావాలని కొందరు యువకులు పట్టుబట్టారు. ప్రకాశంగారి తీర్మానానికి ఈమేరకు సవరణ ప్రతిపాదించారు. చర్చ అయిపోయింది కనుక ప్రకాశంగారు ఈ సవరణను అంగీకరించనని చెప్పారు. అప్పటికే పెద్ద వర్షం కురుస్తుంది. గుడారాలలోని జనం తడిసి ముద్దయ్యారు. ఈ వర్షం వలన ప్రకాశంగారు ఓర్పు కోల్పోయారు. ఇది ఒక అవమానమంటూ ఒక వర్గం పేపర్లకు ఎక్కారు. మంత్రులలో ఒక వర్గం దీనిని చాటుగా బలపరచింది. రాయలసీమ కాన్ఫరెన్సు నంద్యాలలో పెట్టారు. ఆంధ్రరాష్ట్రపు ఏర్పాటు తప్పు అని ఈ సభలో చెప్పారు. శ్రీ నీలం సంజీవరెడ్డిగారు ఈ సభకు అధ్యక్షత వహించారు. వారీనాడు ఆంధ్ర నిర్మాతలలో నేనొకరిని అని చెప్పుకుంటున్నారు. ఆంధ్ర ఉద్యమంపై తీవ్రమయిన ఆరోపణలు చేశారు. రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించాలని, లేకపోతే ప్రత్యేక ప్రతిపత్తి కల్పించాలని వీరు ఆనాడు మాట్లాడారు. వీరి ఆందోళనతో కేంద్రంలోని పెద్దలు రాష్ట్రాన్నివ్వటం మరీ ఆలస్యం చేశారు.

ప్రకాశంగారు, నేను రాజ్యాంగ పరిషత్తులో చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి.

నాకు వ్యతిరేకమయినా శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్య ఆంధ్ర ఉద్యమాన్ని బలపరిచారు. మేమిద్దరం – పట్టాభి, పటేలు, నెహ్రూగార్ల త్రిసభ్య కమిటీ ఏర్పాటుకు ముఖ్య కారకులం. ప్రత్యేక రాష్ట్రం కావాలంటే 'మద్రాసును వదులుకోవాలని' ఈ త్రిసభ్య కమిటీ చెప్పింది. నేనీ ప్రతిపాదనకు అంగీకరించమని ప్రకాశంగారికి చెప్పాను. ప్రకాశంగారు నా మాట వినలేదు.

సాటిలేని శ్రీ పొట్టి శ్రీరాములుగారి ఆత్మార్పణతో ఆంధ్ర, ఇతర భాషాప్రయుక్త రాష్ట్రాలు సిద్ధించాయి.

పొట్టి శ్రీరాములుగారు మితభాషి. నిజాయితీపరుడు. గాంధేయవాది. గాంధీగారితో ఆశ్రమవాసం చేశారు. క్రమశిక్షణతో సామాన్య జీవితం గడిపేవారు. వారు హరిజనులకు చేసే సేవకు నా వంతు సహకారమందించానని గర్వంగా చెప్పుకుంటున్నాను. వారు ప్రతి నెలలో 30 వ రోజును హరిజన దినోత్సవంగా

పాటించటానికి ప్రభుత్వాన్ని ఒప్పించారు. వారు హరిజనుల కొరకు పలుసార్లు నిరాహారదీక్ష చేశారు. అసాధారణ కార్యకర్త. నెల్లూరులోని 'రంగనాయకుల' (రంగనాథుని) దేవాలయంలో హరిజనులకు ప్రవేశం కల్పించారు. వీరు నాతో ఆంధ్ర ప్రాంతంలో పర్యటించారు. వారి ఉపన్యాసాలు శక్తిమంతమైనవి, అర్థ వంతమైనవి. క్లుప్తంగా ఉండేవి. మేము మంచి స్నేహితులం. నేను కెనడా నుండి తిరిగిరాగానే వారి నిరాహారదీక్షను గురించి విన్నాను. వారి మాటకు, చేతకు వ్యత్యాసం ఉండదు. వారు ఆంధ్రరాష్ట్రం కొరకు ప్రాణాలు వదలటానికి సిద్ధమే అని ఆంధ్ర ప్రజలను హెచ్చరించాను. నెహ్రూగారా దశలో ఆంధ్రరాష్ట్రాన్ని ఇవ్వటానికి ఇష్టపడలేదు. నిజమయిన గాంధేయవాదిగా, కఠోరమయిన నిరాహార దీక్షను కొనసాగించి పొట్టి శ్రీరాములు అమరుడయ్యాడు. రాష్ట్రంలోని ప్రజ లందరూ కేంద్రపు నిర్లక్ష్య ధోరణికి మండిపడ్డారు. విజయవాడలో రైల్వే ఆస్తులను తగులబెట్టారు.

కేంద్రం సిగ్గుతో తలవంచుకొన్నది. నెహ్రూ ప్రభుత్వం ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటుచేయటానికి సిద్ధమని ప్రకటించింది. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ సంఘం ఏర్పాటయింది. భాషాప్రయుక్త రాష్ట్రాల విభజన మొదలయింది. మృదుస్వభావి పొట్టి శ్రీరాములుకు ఆంధ్ర రాష్ట్రం ఒక చిరస్మరణీయమయిన జ్ఞాపక చిహ్నం.

★ ★ ★

34. ఆటుపోట్లు

కాంగ్రెసులోని విచ్చలవిడి దిగజారుడు తనానికి, ముఠా రాజకీయాలకు బాధపడు తున్నాను. ఈ దిగజారుడుతనం కొన్ని రాష్ట్రాల్లో ఎక్కువగా, కొన్ని రాష్ట్రాలలో తక్కువగా ఉంది. బీహారులో భూమిపుత్రులు–క్షత్రియులు గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు ఈ ముఠా రాజకీయాలలోనే ఉన్నారు. ఇది ఒకవిధంగా ప్రజలను మోసగించటమే. ఈ నిజాయితీ రాహిత్యాన్ని నేను భరించలేక పోయాను.

ఈ చెడు ఆంధ్ర రాజకీయాలలో ఉండకూడదనుకున్నాను. అన్ని 'ముఠాలను' కార్యవర్గంలోనికాహ్వానించాను. ఆంధ్రలో జిల్లా బోర్డులకు 1949 లో ఎన్నికలు జరిగాయి. అప్పట్లో 11 జిల్లా బోర్డులుండేవి. 8 జిల్లా బోర్డులకు అభ్యర్థుల నిర్ణయం జరిగింది. నేను అమెరికా, కెనడాలలో పర్యటన ముగించుకొని వచ్చేసరికి ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు మైనారిటీ అభ్యర్థులను పట్టించుకోలేదు. నేను అల్పసంఖ్యాకులకు కూడా ప్రాతినిధ్యముండాలని చెప్పాను. అదేవిధంగా కృషి చేశాను. పార్టీలోని పెద్దలందరూ నాకు వ్యతిరేకం. ప్రకాశంగారు కూడా విముఖులే. కొమ్మారెడ్డి సూర్యనారాయణగారిని కాదని డా॥ రంగయ్య ముఠాకు అభ్యర్థిత్వం ఇచ్చాను. కృష్ణా, గుంటూరు, చిత్తూరు జిల్లాలు మినహా ఇతర జిల్లాలలో ప్రత్యర్థి వర్గాలకు అభ్యర్థిత్వం ఇచ్చాను.

జిల్లా బోర్డుల అధ్యక్షుల విషయంలో కూడా ఇదే విధానం అవలంబించాను. పార్టీ ఏకంగా ఉండటానికై కృషి చేశాను. మంత్రులు వారికిచ్చిన సీట్లు తీసుకొని మరలా ఇండిపెండెంట్లతో నామినేషను వేయించారు. నేనవలంబించిన రాజీమార్గం–స్నేహభావం వ్యర్థమయ్యాయి. ఓటర్లు తికమక పడ్డారు.

బోర్డు అధ్యక్షుల ఎన్నికలలోనూ నేనీ విధానాన్నే అనుసరించాను. నా మిత్రులు వద్దన్నా, సభ్యుల ఎన్నికలలో నా అంచనాలు తప్పినా, నేనీ రాజీమార్గం వీడలేదు. పి.సి.సి.వారు గతంలో ఈ పదవులు వారికిష్టమైన వారికి ఇచ్చుకునేవారు. నేను దీనిని త్రోసిరాజని తరువాత తన్నుకుంటున్న వైరివర్గాలు సంతోషించాయి. అధ్యక్షుని ఎన్నికలో ఇరువర్గాలవారు సమంగా ఉంటే పి.సి.సి.యే నిర్ణయం తీసుకునేది. మంత్రులు స్వతంత్ర అభ్యర్థులను నిలిపి, రెండో ముఠాతో చేతులు కలిపి వారి అభ్యర్థులను గెలిపించటానికి పనిచేసేవారు.

జిల్లా బోర్డు అధ్యక్ష ఎన్నికలయిన తరువాత ఈ అధ్యక్షులు మంత్రుల చుట్టూ పనులకోసం తిరిగేవారు. ఆ తర్వాత మెలమెల్లగా వీరు మంత్రివర్గపు గ్రూపులో చేరేవారు.

ఎంతో మంచి ఉద్దేశ్యంతో నేను చేసిన పనులు నాకు వ్యతిరేక ఫలితా లిచ్చాయి.

1948 లో శ్రీ టి. ప్రకాశం, నేను మంత్రులతో కలసి పనిచేయటానికి ఒక కార్యాచరణ రూపొందించాం. కాని ప్రకాశం తనను పదవీచ్యుతుణ్ణి చేసిన మంత్రులతో కలసి పనిచేయలేదు. మంత్రులు కూడా అయిష్టంగానే ఉన్నారు.

ఈ పుండు (గ్రూపులు కట్టడం) కాంగ్రెసు జీవనాడులకంతా వ్యాపించింది. 1967 కు ఈ జబ్బు చాలా రాష్ట్రాలలో – ఉత్తరప్రదేశ్, మైసూరు, పంజాబు, మధ్యప్రదేశ్, బీహారు, కేరళ, ఆంధ్రలలో ప్రబలమయింది.

★ ★ ★

35. తలక్రిందులు-11 ఏప్రియల్, 1951

స్వతంత్రం రాక ముందునుంచీ అధికారంలో ఉన్న మంత్రులు, స్థానిక సంస్థల ప్రతినిధులు తమ నాయకత్వానికి ఢోకా లేకుండా చూసుకుంటున్నారు. ఈ ధోరణి స్వతంత్రం తరువాత మరీ ఎక్కువయింది. కిసాను మజ్దూర్ ప్రజా పార్టీవారు కాంగ్రెసు స్థానిక సంస్థలలో మరీ ఎక్కువమంది ఉన్నారు. వీరూ అధికారం కొరకు మంత్రుల చుట్టూ తిరుగుతున్నారు. వీరిలో చాలా మందిని మంత్రులు తమలోకి లాక్కున్నారు. వీరు అవసరమైన సమయంలో మాతో లేరు. ప్రజలకు ఇది పెద్ద 'షాక్'. గాంధీగారి పేరు చెప్పుకొనే నాయకులే ఈ అకృత్యాలకు పాల్పడ్డారు.

ప్రకాశంగారు ఇటువంటివారిపై ఆరోపణలు చేశారు. వీరికి ప్రజలలో ఆదరం లేదు. ధరలు, ఆహారవస్తువుల విక్రయం, పంచదార, సిమెంటు, కిరోసిన్, ఎరువులు మొదలయిన వస్తువులలో కంట్రోళ్ళ రాజ్యంలో అవినీతికి పాల్పడ్డారు. ప్రకాశంగారిని పదవి నుండి దించారు. 'అవిశ్వాస' తీర్మానంతో వీరిని పదవీ చ్యుతుల్ని చేశారు.

ప్రకాశంగారు చేపట్టిన కార్యక్రమాలన్నింటినీ వీరు 'దొంగదెబ్బ' తీశారు. ఖాదీ స్కీము, వినియోగదారులు-ఉత్పత్తిదారుల సహకార సంఘాలు, ఫిర్కా అభివృద్ధి మండళ్ళు, ఆహార పంపిణీ, మద్య నిషేధం, పంచదార, ఇనుము, స్టీలు, సిమెంటులను కంట్రోళ్ళ రాజ్యంలో వీరు తమ స్వార్థానికి వాడుకున్నారు. కె.యం.పి.రాజ్ వారు వీరికిచ్చిన ప్రతిఘటనకు ప్రజలు సంతోషించారు.

11-4-1951 ఒక దుర్దినం. గాంధీగారి అడుగుజాడలలో నడచేవారికి ప్రజాజీవితం శాపమయింది. నీతిని పూడ్చిపెడుతున్న మంత్రులకు ఒక వరం

అయింది. కో-ఆపరేటివ్ సంస్థలు, గ్రామ పంచాయితీలు, ప్రజా సంస్థలు అన్నీ రాజకీయ రంగు పులుముకొని రాజకీయ రణరంగాన్ని తలపిస్తున్నాయి. తమ ప్రభుత్వాలను నిలబెట్టుకొనటానికి రాజకీయ వ్యభిచారం చేస్తున్నాయి. ప్రజల నణగద్రొక్కుతున్నాయి. కిసాను వర్గీయులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నాయి.

కాంగ్రెసు అధ్యక్షునిగా పట్టాభిగారిని బలపరచినందుకు అందరూ నన్నీనాడు నిందిస్తున్నారు. పటేలుగారి వర్గపువారిని కూడా కాదని నేనీ నిర్ణయం ఎందుకు తీసుకున్నాను? కనీసం ఒక ఆంధ్రుడైనా నేటికి ఆల్ ఇండియా కాంగ్రెసుకు అధ్యక్షుడు కాగలడని, ఇతను కూడా గాంధీ సిద్ధాంతాలను నమ్మిన వ్యక్తి అని నేను భావించాను. ఎ.ఐ.సి.సి. అధ్యక్షుడు రాజకీయ వివక్షాలకు దూరంగా ఉంటాడని నేను నమ్మటంవలన ఈ నిర్ణయం తీసుకున్నాను. మంత్రులు వీరి అధ్యక్ష కాలాన్ని దుర్వినియోగం చేశారు. పి.సి.సి.ని బలహీనపరచారు. ఎ.ఐ.సి.సి. అధికారానికి గండికొట్టారు. పి.సి.సి. ఎన్నికలు జరగకుండా మంత్రులు వాయిదా వేయించారు. పి.సి.సి. నైతిక అధికారాన్ని ప్రశ్నించేవారికి పార్టీ వత్తాసు పల్కింది.

కిసాను కాంగ్రెసువారు బలంగా ఉన్నంత కాలం పట్టాభి వర్గీయులు మంత్రులుగా తిరిగి అధికారం సంపాదించలేరు. కాంగ్రెసు సంస్థను చేజిక్కించు కొని కిసాను మజ్దూర్ ప్రజాపార్టీ వారిని వెనక్కు నెట్టటం మంత్రివర్గపు వ్యూహం అయింది. కిసానులు-కళాకారులు గాంధీగారి ఆదర్శాలతో ముందుకు సాగుతారని వారు భయపడ్డారు.

ప్రకాశంగారు అవినీతిపై ప్రకటించిన యుద్ధం, తీసుకున్న సాంప్రదాయేతర చర్యలు అధికారంలో ఉన్న కాంగ్రెసువారి కోపానికి కారణమయ్యాయి. నేను ప్రకాశంగారి తరుపున వాదించటం, కాంగ్రెసు అధ్యక్షుల బ్రతుకు బజారుకీడ్వటం నెహ్రూగారికి నచ్చలేదు. "కాంగ్రెసు అధ్యక్షుడు తప్పు చేయడు" అనే ముసుగులో ప్రజలను మోసగిస్తున్నారు. వర్కింగు కమిటీలో అధికులు నన్ను బలపర్చారు. అయినా నెహ్రూ, రాజేంద్రప్రసాద్‌గారికి నేను కాంగ్రెసు అధ్యక్షునిపైన చేసిన విమర్శలు కంటకప్రాయమయ్యాయి.

ఒకటి ఏప్రియల్, పందొమ్మిది వందల ఏభయ్ ఒకటిన జరిగిన ఎన్నికలు

మా అంచనాలను తారుమారు చేశాయి. పి.డి. టాండనుగారు అధ్యక్షులయినా పరిస్థితులలో మార్పు రాలేదు. కళావెంకట్రావు ప్రధాన కార్యదర్శిగా కొనసాగు తున్నారు.

జవహర్‌లాల్‌గారు కాంగ్రెసుకు పట్టుతున్న హీనదశను అర్థంచేసుకోలేదు. 'పండును వదలి పైపై మెరుగులకు' భ్రమసిపోతున్నారు. నా కార్యకర్తలందరూ ఇది కావాలని చేస్తున్న పనే అనే అభిప్రాయంలో ఉన్నారు. జవహర్‌లాల్‌గారు ఎ.ఐ.సి.సి. కార్యదర్శి మాటలే నమ్మారు. మా గోడు పట్టించుకోలేదు. ఈ కార్యదర్శి (కళా వెంకట్రావు), టాండనుగారి పదవీకాలంలో, టాండనుగారికి వ్యతిరేకంగా ఉన్నాడనే నెహ్రూగారాగ్రహించినది. నెహ్రూగారు చేసిన ఫిర్యాదు లలో ముఖ్యమైనవి కళావెంకట్రావును గురించే.

11-4-1951 న జరిగిన దుర్మార్గానికి ఈ కార్యదర్శి, ఇతని అనుచరులే కారణం.

మంత్రుల సన్నిహితులందరూ జిల్లాల్లో బలహీనపడ్డారు. వీరు ఎ.ఐ.సి.సి.లో ఉన్న నాయకులను పి.సి.సి.కి ఎన్నికలు జరిపే అధికారం లేకుండా చూడ వలసిందని కోరారు. ఎ.ఐ.సి.సి.వారు పి.సి.సి. కార్యవర్గాన్ని రద్దు చేశారు. ఈ అప్రజాస్వామిక, ఫాసిస్టు పద్ధతులకు నేను ఆనాడే రాజీనామా చేయవలసింది. సోదర కార్యకర్తలందరూ కాంగ్రెసులోనే ఉండి పోరాటం చేయాలని కోరారు. నా రాజీనామాను నా సహచరులు 11-4-1951 వరకు ఆమోదించలేదు.

కె.యం.పి. పార్టీలోని గాంధేయులమైన మేము రాష్ట్ర కాంగ్రెసు నాయకత్వం నుండి త్రోసివేయబడ్డాం. పి.సి.సి. ఎన్నికలలో 5 ఓట్లు తక్కువగా వచ్చాయన్నారు. ఎలక్షను ఆఫీసరయిన యస్.కె. పాటెల్‌గారు పి.సి.సి.కి ఎన్నుకొన్న ఆరుగురి సభ్యత్వం చెల్లదన్నారు. ఎ.ఐ.సి.సి. ఆదేశానికి వ్యతిరేకంగా 27 మంది సభ్యులపై గుంటూరు జిల్లా కోర్టులో 'ఇంజక్షను ఆర్డర్' తీసుకొని వారిని ఎన్నికలలో పాల్గొననీయలేదు. మాకు 20 ఓట్ల ఆధిక్యం ఉన్నప్పటికీ ఎలక్షను ఆఫీసరుగారు 5 ఓట్ల తేడాతో సాంకేతికంగా ఓడిపోయినట్లు ప్రకటించారు.

వీరు కోర్టునెందుకు ఆశ్రయించారు? పట్టాభిగారిని, కళా వెంకట్రావుగారినీ ఈ విషయమై హెచ్చరించాను. సంస్థాగతమైన కాంగ్రెసు క్రమశిక్షణను సభ్యులు

ఉల్లంఘించరని కళా వెంకట్రావుగారు నాకు హామీ ఇచ్చారు. కార్యవర్గం కూడా సభ్యులెవ్వరూ కోర్టులను ఆశ్రయించరాదని తీర్మానించింది. కాంగ్రెసు నిబంధన లకు వ్యతిరేకంగా మంత్రుల అనుకూలురే కోర్టును ఆశ్రయించారు.

ఎలక్షను ఆఫీసరు, కోర్టువారి చలువ వలన 30 ఓట్లు మాకు రావలసినవి పోయి 3 ఓట్లతో ప్రత్యర్థి వర్గం గెలిచింది.

11-4-1951 న 50 వేల మంది ప్రజా కిసాను కాంగ్రెసువారి విజయాన్ని ఆకాంక్షించి విజయవాడకు వచ్చారు. ఎన్నికల ఫలితాలు తారుమారయ్యాయి. ముట్నూరి కృష్ణారావుగారి పత్రిక ఈవిధంగా వ్రాసింది "ప్రజలు అచేతను లయ్యారు. రాజకీయ మరణం వారి పాలైంది. ఒక్కరు కూడా విజేతలకు 'జై' కొట్టలేదు."

ప్రజలలో వచ్చిన మార్పు అనూహ్యం. కె.యం.పి.రాజ్ ప్రవచించిన సిద్ధాంతాలు, కార్యాచరణ ద్వారానే కాంగ్రెసు నిలిచివుందని జిల్లా బోర్డు అధ్యక్షులు అనసాగారు.

1954 కు మంత్రులెవ్వరూ ప్రజల వద్దకు వెళ్ళలేకపోయారు. గాంధీగారి అనుచరునిగా, ప్రజలందరి మనస్సులలో నిలచి ఉండటం నా అదృష్టం.

వర్కింగు కమిటీలో 19 స్థానాలకు 9 స్థానాలు మాకు ఇస్తామని మంత్రి వర్గంవారు ప్రకటించారు. మేము ఈ ప్రతిపాదనను తిరస్కరించాం.

మేము కాంగ్రెసు నుండి బయటపడటానికి నిశ్చయించుకొన్నాం. నెహ్రూ గారు ఈ ఏకపక్ష విధానానికి బాధ్యులని ప్రజలందరూ గుర్తించారు. నెహ్రూగారు ఎ.పి.సి.సి. అధ్యక్షుని కార్యవర్గ సభ్యునిగానే కాక పార్లమెంటరీ బోర్డుకు కూడా 'నామినేట్' చేశారు.

ప్రకాశంగారు అప్పటికే కాంగ్రెసు వర్కింగు కమిటీకి రాజీనామా చేయాలనే నిశ్చయంతో ఉన్నారు.

ఈ పరిస్థితులలో నేను జవహర్‌లాల్‌గారికి, పి.డి. టాండనుగారికి నా రాజీనామా లేఖనందజేశాను.

★ ★ ★

36. ఆలిండియా కాంగ్రెస్ వ్యవహారాలు

గాంధీగారి ఒత్తిడి ఫలితంగా సర్దార్ వల్లభాయ్ పటేలు, జవహర్‌లాల్, రాజేంద్రప్రసాద్‌లతో ఆల్ ఇండియా కాంగ్రెసు కమిటీలో నా పేరు చేర్చారు. 1946 లోనే నాకొక అవకాశం రావలసింది. కాంగ్రెసు అగ్రనాయకుడు ఒకరు అడ్డంపడ్డాడు. నెహ్రూగారి హయాంలో నేను ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటీలో సమస్యలను ఎదుర్కొనవలసి వచ్చింది. 1947 లో ఆచార్య కృపలానీగారు ఎ.ఐ.సి.సి. అధ్యక్షుడయ్యాడు. గాంధీగారి ప్రయత్నాలు అప్పటికి ఫలించాయి. కాంగ్రెసు సమావేశాలు గాంధీగారి ఇంటివద్దనే జరుగుతుండేవి. అవసరమయిన సలహాలను వారు ఇస్తుండేవారు.

30 జనవరి, 1948 న వారి హఠాన్మరణం దేశానికి తీరని లోటు.

నవంబరు 1944 నుండీ కిసాను కాంగ్రెసుకు, ఇతర ఉద్యమాలకు నాకు సలహా ఇస్తుండేవారు. గాంధీగారికి నాపై విశ్వాసం పెరిగింది. వారి సన్నిహిత సాహచర్యం నాకెంతో మేలు చేసింది. కాంగ్రెసు వర్కింగు కమిటీలో విభేదాల పరిష్కారం, వర్కింగు కమిటీకి సలహాలు ఇవ్వటంతో వారు నన్ను ఆత్మీయంగా దగ్గరకు తీసుకున్నారు.

విభిన్నమైన రూపాలలో వారు మా జ్ఞాపకాలలో నిలచేవారు. చాలాసార్లు వారు తెల్లని దువ్వలువ మెత్తపై కూర్చొని చరఖాపై నూలు వడుకుతూనో, లేఖలు వ్రాస్తూనో, దక్షిణాది పవిత్ర గ్రంథాలు నేర్చుకుంటూనో మా చర్చలు పట్టించుకోకుండా ఉండేవారు. ఒంటిపై ఆచ్ఛాదన లేని వారి గుండెలు ఎంతో విశాలంగా ఊరట కల్గించేవిగా కన్పించేవి.వారి శరీరకాంతులు సాయంసంధ్యలో దివ్యకాంతులు వెదజల్లేవి. వారి విశాలమయిన ఫాలభాగం వెలుగులీనుతుండేది.

వారి ధ్యానాన్ని భగ్నంచేస్తూ నెహ్రూ గొంతు పెంచినా, కృపలానీ దీర్ఘంగా మాట్లాడినా, మౌలానా ఒక విషయాన్ని గుర్తుచేసినా, వారొక సారి మావైపు తిరిగిచూచి మరలా తన ధ్యానంలో తాను మునిగిపోయేవారు. మేమెవరమయినా వారి సలహాను కోరినప్పుడు అందమైన ఉషస్సులాగా కాంతులీనుతూ మావైపు తిరిగి, శాలువాను గుండెలమీద కప్పుకుంటూ, మాకు సలహానిచ్చి మరలా తన ప్రపంచంలోకి తాను మరలేవారు. అందనంత దూరంలో ఏవో తెరలకావల వారున్నట్లు తోచేది. కార్యవర్గం ఆత్మావలోకనం చేసుకునేది.

వారి మరణం తరువాత కార్యవర్గ సమావేశాలలో ఆ ఉన్నతమయిన ఆశయాలు కన్పించటంలేదు. 'గ్రూపు రాజకీయాలతో' వీరు తన్నుకుంటున్నారు. 1920 నుండే కాంగ్రెసులో ముఠా తగాదాలు ఉన్నాయి. గాంధీ మహాత్ముడు కూడా వీటిని కట్టడి చేయలేకపోయారు. 1937-38 లలో నారిమన్-ఖేర్‌ల వివాదానికి వారు కూడా సరియైన పరిష్కారం చూపించలేకపోయారు. గాంధీ గారి మరణం తరువాత ఈ ముఠా తగాదాలు పెచ్చరిల్లి, కాంగ్రెసు నైతికంగా దిగజారింది.

పశ్చిమబెంగాల్‌లో డా॥ బి.సి.రాయ్‌గారి ప్రభుత్వం ప్రజాదరణ కోల్పోయింది. కమ్యూనిస్టులు, కాంగ్రెసేతర రాజకీయవాదులు వ్యతిరేకంగా ఉన్నారు. సేన్‌గుప్తా, సుభాష్‌చంద్రబోసు, పి.సి. బోసు - వీరందరికి గ్రూపులుండేవి. బి.సి.రాయ్ అధికారపు పగ్గాలు చేపట్టగానే, శరత్‌బాబు(సుభాష్‌బోసు తమ్ముడు) జవహర్‌లాల్ అభ్యర్థిని ఓడించాడు. పశ్చిమబెంగాల్ పర్యటన చేసివచ్చి, జనరల్ ఎలక్షను నిర్వహించాలని, బెంగాల్ కాంగ్రెసు కమిటీని పునర్వ్యవస్థీకరించాలని నెహ్రూ గారు తలచారు. డా॥ రాయ్‌గారు పావులు కదిపారు. శాసనసభలో బలం ఉన్న కాంగ్రెసు మంత్రివర్గాన్ని రద్దుచేయలేకపోయారు. డా॥ బి.సి.రాయ్‌కు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవటానికి జవహర్‌లాల్, సర్దారు, మౌలానా జంకారు.

"ప్రకాశం పంతులుగారి ప్రభుత్వాన్ని పడగొట్టగలిగిన మీరు డా॥ బి.సి. రాయ్‌ను ఎందుకు తప్పించలేకపోయారు" అని నేను కార్యవర్గంలో అడిగాను.

నా ప్రశ్న వారందరినీ ఇరుకున పెట్టిందని, కోపకారణమైందని నేను అర్థం చేసుకున్నాను.

దేశ విభజన ముందు నుండి మౌలానా ఆజాద్ పంజాబు రాజకీయాలకు కేంద్రబిందువుగా ఉండేవారు. భీమసేనసచార్‌ను అసెంబ్లీ పార్టీ నాయకునిగా చేయాలని మౌలానా ఆలోచన. సర్దార్ పటేలు గోపీచంద్ భార్గవకు ప్రాధాన్యత నిచ్చాడు. జవహర్‌లాల్‌కు, మౌలానాకు గోపీచంద్ భార్గవ 'సెక్యులర్ రాజ్యం'పై (లౌకిక రాజ్యం) విశ్వాసం లేనివాడని నమ్మకం. పంజాబు నాయకుల ఢిల్లీ ప్రదర్శనలు ఎక్కువయినాయి. డా॥ గోపీచంద్‌మీద వారు చేయని ఆరోపణలు లేవు. డా॥ గోపీచంద్ ఎట్టకేలకు కాంగ్రెసు కమిటీని విచారించమని కోరాడు. నేను బహిరంగ చర్చకు వారిని ఆహ్వానించాను. వారు సవివరంగా తనపై ఆరోపణలకు-అవినీతి, అసమర్థపాలన, హిందూయిజం, స్వబంధు పక్షపాతాలపై సమాధానం చెప్పారు. మీకు అసెంబ్లీలో బలమున్నప్పుడు ఇన్నిసార్లు ఢిల్లీ తిరగవలసిన అవసరమేమొచ్చిందని వారిని ప్రశ్నించాను. వారి నాయకత్వాన్ని మార్చాలన్న ఉద్దేశ్యంతో ఉన్న నాయకులు తమ ఆలోచనలను గోప్యంగా ఉంచారు. కొన్ని నెలల తరువాత భార్గవగారి మంత్రివర్గం పడిపోయింది.

ఉత్తరప్రదేశ్ కాంగ్రెసు కమిటీ 1920 నుండి నిరంకుశాధికారం చలాయిస్తూ ఉంది. పండిత మదనమోహన మాలవ్యా, మోతీలాల్ నెహ్రూ, జవహర్‌లాల్ నెహ్రూ, మౌలానా ఆజాద్, ఆచార్య కృపలానీ వీరందరూ ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారే. పి.సి.సి. కలహాలను ఎ.ఐ.సి.సి. వరకు తీసుకొనివచ్చేవారు కాదు. జవహర్‌లాల్ ఢిల్లీ వచ్చిన తరువాత రఫీ అహమ్మద్ కిద్వాయ్, గోవింద వల్లభ పంత్ కంటే బలవంతుడయ్యాడు. రెండవశ్రేణి నాయకుల మంత్రివర్గపు మోజుతో కావచ్చు,అసెంబ్లీ సభ్యులు తిరుగుబాటు చేయటం మొదలుపెట్టారు. ఎ.ఐ.సి.సి.ని ఆశ్రయించడం సాగించారు. ముఖ్యమంత్రిగా ఉన్న పంత్‌గారు ఈ తిరుగుబాటు దార్లను పార్టీ నుండి బహిష్కరించటం మొదలుపెట్టారు. సర్దార్ పటేలు పంత్ గారికి సన్నిహితుడు. జవహర్‌లాల్, మౌలానాలు రఫీ అహమ్మద్ కిద్వాయికి సన్నిహితులు. పంత్‌గారు సభ్యుల సఖ్యత కోసం ప్రయత్నించసాగారు. ఓరోజు సాయంకాలం సర్దార్ పటేలు పార్టీలో ఈ తిరుగుబాట్లను ఆపవలసిందిగా రఫీ

అహమ్మద్ కిద్వాయ్ గారిని అడిగారు. "మీరు ఈ విషయం చెప్పటం వింతగా ఉంది" అని రఫీగారు సమాధానమిచ్చారు. ఈ ప్రహసనం (మెంబర్ల తిరుగుబాటు వారిని పార్టీలోంచి తీసివేయటం) ఇలానే కొనసాగింది. చాలామంది సభ్యులు తీసివేయబడ్డారు. ఈ పెద్ద నాయకుల నిరంకుశత్వం వలన ఉత్తరప్రదేశ్ ఆర్థిక శాఖామంత్రి 'సైనిక్' ఎడిటరు అయిన యస్.కె. పల్లీవాల్‌గారు కూడా రాజీనామా చేశారు. గాంధీగారు జీవించి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు.

గాంధీగారి నాయకత్వం, సర్దార్ పటేలు నాయకత్వాలలో గుజరాత్ ఉండేది. నాయకత్వం తృప్తికరంగా లేదు. పి.సి.సి. మాటకు తిరుగులేదు. సర్దార్ పటేలు గారు పి.సి.సి. అధ్యక్షునిగా తప్పుకోదలచినప్పుడు వారు ఒక వయస్సు పైబడిన వారిని తన స్థానంలో కూర్చోపెట్టదలిచారు. యువకులు సభ్యత్వాలు చేర్చటం దగ్గర నుండి మామూలు 'ట్రిక్సు' అన్నీ చేయసాగారు. ఇవన్నీ బాపూ నిర్యాణం తరువాత జవహర్‌లాల్ దృష్టికి వచ్చాయ్. సర్దార్ పటేలుతో మాటమాత్రమే జవహర్‌లాల్ అనగలిగాడు. నేను కాంగ్రెసును వీడిన తరువాత గుజరాత్‌లో పరిస్థితిని అక్కడకు వెళ్ళి చూశాను. 1957 లో కాంగ్రెసు జనరల్ ఎలక్షన్లలో పరిస్థితి దౌర్భాగ్యంగా ఉంది.

బీహార్‌లో 1937 వరకు రాజకీయాలు సజావుగా సాగాయి. 1937-39లో నా ముఖ్య స్నేహితుడు, రాజేంద్రప్రసాద్ అనుచరుడు అయిన శ్రీకృష్ణ సిన్హా (భూమిహార్), అనుగ్రహనారాయణసిన్హా(క్షత్రియులు) ల వివాదం తెరపైకొచ్చింది. ఈ వివాదాలు గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు ఉన్నాయి. జమీందార్లకు వ్యతిరేకంగా స్వామీ సహజానంద చేసిన పోరాటం అక్కడ సత్ఫలితాలను ఇచ్చింది. ఉత్తరప్రదేశ్‌లోలానే బీహార్‌లో కూడా జిల్లాస్థాయి కాంగ్రెసు వర్గాల వారందరూ జమీందారీ వర్గానికి చెందినవారే. రైతుల కోర్కెలకు అనుగుణంగా స్పందించటం వారికి తెలియదు. 'చిత్తశుద్ధి, నైతికశక్తి' బలహీనపడ్డాయి. 1946లో కాంగ్రెసులో విభేదాలు తారాస్థాయికి చేరాయి. రాజకీయవేత్త అయిన అనుగ్రహబాబు నాయకత్వం 1951 వరకు నడచింది. తుఫాన్ ఎప్పుడైనా విజృంభించవచ్చు.

రాజేంద్రప్రసాద్‌గారు బీహార్ రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షునిగా ఉన్నంత కాలం రెండవ తరగతి నాయకత్వం పెరగలేదు. పెద్ద నాయకులలో ఏకాభిప్రాయం లేదు. కాంగ్రెసువారిని కట్టడి చేసే నాయకత్వం బీహార్‌లో కరవైంది.

కొందరు మంత్రులు జమీందారీ మైనర్లకు చెందిన భూమిని కబళించారు. మైనర్లకు సరిగ్గా డబ్బు చెల్లింపులు జరుగలేదు. నా స్నేహితుడు మహామాయా సిన్హా ప్రత్యక్ష విచారణ జరిపించమని కోరాడు. బీహారులో ఈ పరిస్థితి ఎప్పుడూ లేదు. రాజేంద్రప్రసాద్‌గారు మనఃక్లేశానికి గురయ్యారు. సర్దారు పటేలును ఈ వ్యవహారం చూడమని వర్కింగు కమిటీ కోరింది. రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడు కూడా కొంత భూమిని కాజేసి 'ఒక ఆశ్రమం' పెట్టాడు.

అప్పటినుండీ బీహార్‌లో ముఠాతత్వం పెరిగిపోయింది. రాజేంద్రప్రసాద్ తన అనుయాయి అయిన అనుగ్రహబాబుపై పోటీచేసి ఎన్నికలలో గెలవవలసి వచ్చింది. పేరుకు మాత్రమే బీహార్‌లో కాంగ్రెసు అధికారంలో ఉంది. 1967లో మహామాయాప్రసాద్‌గారి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది.

మద్రాసు రాష్ట్రానికి రెండు పి.సి.సి.లు ఉండేవి. ఒకటి ఆంధ్ర, రెండవది తమిళనాడు. శ్రీ యస్. శ్రీనివాసఅయ్యర్ తరువాత సత్యమూర్తి, రాజగోపాలాచార్ల విభేదాల నేపథ్యంలో శ్రీ కామరాజ్‌నాడార్ తమిళనాడు పి.సి.సి. అధ్యక్షు డయ్యాడు. కాంగ్రెసులో నాడార్ తన బలాన్ని పెంచుకుంటుంటే, సత్యమూర్తి తన మరణం వరకు కాంగ్రెసు సందేశాన్ని ప్రజలకు అందజేస్తున్నాడు. 1946 వరకు శ్రీ టంగుటూరి ప్రకాశంగారు శ్రీ సత్యమూర్తిగారు నిర్వహించిన పనిలో నిమగ్నుడైనాడు. కామరాజ్‌కు సహాయకారిగా ఉన్నాడు. రాజగోపాలాచారి ముఖ్యమంత్రిత్వానికి కామరాజ్ విముఖుడు. ఈ సందర్భంగానే గాంధీగారు కామరాజ్‌ను 'కిరికిరి' (క్లిక్) చేస్తున్నాడు అని అతి తీవ్రంగా మందలించారు. గాంధీజీ, సర్దార్ పటేలు ఇరువురు ప్రకాశంకు వ్యతిరేకంగా ఉన్నారు. అందువలన కామరాజ్ ముత్తులింగ మొదలియార్‌ను ప్రకాశంపై పోటీ చేయించాడు. 1946లో ప్రకాశం గెలువగనే కామరాజ్ ప్రకాశంగారికి సహాయం చేయటానికి సిద్ధమయ్యాడు. చాలామంది కామరాజ్ అనుయాయులకు ప్రకాశం మంత్రి

పదవులు ఇచ్చాడు. వివేకరహితమైన స్థితిలో ఒకరికి మంత్రిపదవి ఇవ్వలేదు. నాడారు ప్రకాశంపై కోపం పెంచుకున్నాడు. ఆంధ్రలో ఉన్న ప్రకాశం వ్యతిరేకుల సాయంతో, తన మంత్రుల సాయంతో ప్రకాశంగారిని మొదటి సంవత్సరంలోనే పదవీచ్యుతుణ్ణి చేశాడు.

శ్రీ ఓ.పి. రామస్వామిరెడ్డియార్‌గారు ముఖ్యమంత్రిగా సమర్థుడు కాదు. వారి మంత్రివర్గ సహచరులు దీనిని ఆసరా చేసుకున్నారు. ప్రభుత్వం చేసే సహాయచర్యలన్నీ తమ అనుచరులకే ఇప్పించుకొన్నారు. కంట్రోళ్ళ రాజ్యంలో వచ్చే లాభాలాన్నీ ఈ మంత్రులే దోచుకున్నారు. ప్రకాశంగారు ఈ విషయాన్ని జవహర్‌లాల్, పటేలు, మౌలానాల ముందుంచారు. వారీ విషయాన్ని పరిగణించ లేదు. ప్రకాశంగారీ విషయాన్ని ఎ.ఐ.సి.సి. ముందుంచమని నన్ను కోరారు. కళావెంకట్రావు ఎ.ఐ.సి.సి. సెక్రటరీగా ఉన్నాడు. నేనీ విషయాన్ని వదిలిపెట్ట కుండా వెంటబడుతూనే ఉన్నాను. రెండు సంవత్సరాల తరువాత జవహర్‌లాల్, పటేలు, పట్టాభిగార్లు దీనిని పట్టించుకోనవసరంలేదని తేల్చారు. ఉన్నతమైన పదవులలో ఉన్నవారు చేసే నిర్వాకం వలన ప్రజల మనోభావాలు దెబ్బతినటం ఆశ్చర్యం కాదు.

కంట్రోళ్ళ రాజ్యంపై వచ్చిన ఫిర్యాదులు ఉత్తరప్రదేశ్‌లోని కొందరు ఎదుర్కొ న్నారు. కాంగ్రెసు వర్కింగు కమిటీ నిస్సహాయంగా ఉంది. ఆగ్రాలో ప్రజలు చట్టాన్ని తమ చేతులలోకి తీసుకున్నారు. ఉత్తరప్రదేశ్, తమిళనాడు రాజ్యాలలో జరుగుతున్న ఈ అన్యాయాలకు నాయకత్వం స్పందించలేదు. మరింత ప్రేమగా వారిని దగ్గరకు తీసుకున్నారు. నేను పడ్డ శ్రమంతా వృథా అయింది.

కందుభాయ్‌దేశాయ్ అహమ్మదాబాద్ మిల్లు మజ్దూర్ యూనియన్ నాయకుడు. వీరొక కరపత్రం ప్రచురించారు. దీనిలో నూలు ధరలు, బట్టల ధరలు ఎంత ఎక్కువగా ఉన్నాయో చెప్పారు. చీకటి బజార్లలో ఈ బట్టలను ఎంతో ఎక్కువ ధరలకు అమ్ముతున్నారు. మేమంతా మంచి పరిపాలన నివ్వవలసిందిగా టెక్స్‌టైల్ కమీషనరును కోరాము. వారి నుండి స్పందన లేదు. కేంద్ర ప్రభుత్వం, బొంబాయి వారు ఈ అవినీతిని ఎందుకు సహిస్తున్నారు? కాంగ్రెసు వర్కింగు కమిటీ

సరైన సలహా ఇవ్వకుండా ఇన్నాళ్ళు ఎందుకు మిన్నకుంది? బలవంతులైన గుజరాత్ ధనికస్వాములను, బట్టల మిల్లులవారిని ఏమీ చేయలేక ఊరకుంది. జాతీయ కాంగ్రెసు బహిరంగంగా వారివద్ద నుండి కోట్ల రూపాయలు విరాళం తీసుకుంటున్నది. ఈ విరాళాలు ఇవ్వనివారిపై కోపం పెంచుకుంటున్నది.

1948 నుండి మన ప్రజాస్వామ్యాన్ని 'లంచగొండితనం' అనే 'చీడపురుగు' పట్టి పీడిస్తున్నది. 1948 లో ప్రకాశం పంతులుగారు, ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసులో నేను ఈ అవినీతికి అడ్డుకట్టలు వేయటానికి వీరోచితంగా పోరాడాం. దాసు కమిటీ నివేదికలు, పంజాబు ముఖ్యమంత్రిపై సి.బి.ఐ. దర్యాప్తులు, ఇద్దరు ఒరిస్సా ముఖ్యమంత్రులపై హైకోర్టు న్యాయనిర్ణయం, మధ్యప్రదేశ్ పి.సి.సి. అధ్యక్షునిపై ప్రకాశంగారు, నేను ఎప్పుడో ఆరంభించినవే. అవినీతికి వ్యతిరేకంగా సంతానం గారిచ్చిన నివేదిక ఏమాత్రం సఫలీకృతం కాలేదు.

★ ★ ★

37. కంట్రోళ్ళు

యుద్ధ ప్రకటన వెంటనే ధరల నియంత్రణ మొదలైనది. వారం రోజులలోనే పోలీసుల దాడులు మొదలయ్యాయి. ఈ కంట్రోళ్ళు ప్రజలకు సవాళ్ళుగా మారాయి.

మొదటి ప్రపంచ యుద్ధంలో శ్రీ కె.వి. చలపతయ్య, దేశభక్త కొండా వెంకటప్పయ్య ఆహారపదార్థాలపై, వ్యవసాయ ధరలపై కంట్రోళ్ళకు వ్యతిరేకంగా ఉద్యమించారు. రైతుల నోళ్ళు కొట్టి పట్టణ ప్రజలకు ఈ చర్యలు ఉపయోగపడేవి. 1922 నుండి వ్యవసాయ ధరలు గిట్టుబాటుగా లేవు. 1925-35 ల మధ్య కాలంలో ఈ ధరలు ప్రజల జీవనస్థాయికన్నా తక్కువగా ఉన్నాయి. 1939లో కూడా ఈ ధరలలో చెప్పుకోదగిన పెరుగుదల లేదు. కాంగ్రెసు మంత్రులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. గత పదిహేను సంవత్సరాల వ్యవసాయమాంద్యం గురించి, యుద్ధకాలపు ధరల పెరుగుదలను, ఉద్యోగుల నిర్లక్ష్యాన్ని గురించి నేను వాదిస్తున్నాను. రైతులకు కూడా బహిరంగ విపణులలో, కంట్రోళ్ళలో ఇప్పించటానికి ప్రయత్నించాను. కార్మికులు, వృత్తిపరులు, వ్యాపార వర్గాలవారు నా ప్రయత్నానికి అడ్డుపడరు అనే భావంలో ఉన్నాను. పత్రికలవాళ్ళు కంట్రోళ్ళకు అనుకూలం. వీరు పట్టణవాసుల కొమ్ము కాచేవారు.

ఇవన్నీ నా మనసులో ఉన్నాయి. అందుకే ఆహారధాన్యాల రైతులకు గిట్టుబాటు ధరలు ఇప్పించవలసినదిగా కోరాను. పత్రికలవారు అనుకున్నంత వ్యతిరేకంగా లేరు. కమ్యూనిస్టులు నాపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. ధరలు పెంచటానికి నేను ప్రయత్నిస్తున్నానని పట్టణవాసులు నాపై నిందలు వేశారు. ప్రజలలో 70% మందికి బువ్వ కావాలికదా (రైతులకు) అని వారికి సమాధానం చెప్పాను.

యుద్ధ సమయంలో తమ వైఖరిని చర్చించటానికి 'వార్ధా'లో ఎ.ఐ.సి.సి. వారు కలుస్తున్నారు. సుభాష్‌చంద్రబోసు అదే వారంలో సామ్రాజ్యవాద వ్యతిరేక సభను నాగపూర్‌లో ఏర్పాటుచేశాడు. ఈ రెండు కమిటీలలో నాది ముఖ్య పాత్రే. రైతుల రక్షణకు నేను మంత్రులతోనూ, వామపక్ష నాయకులతోనూ మాట్లాడాను. మంత్రులందరూ సానుకూలంగానూ, కమ్యూనిస్టు నాయకులు వ్యతిరేకంగానూ స్పందించారు. మంత్రులందరూ వ్యవసాయ ధరలు నిలకడగా ఉన్నప్పుడే కంట్రోళ్ళను పెట్టాలనే నిర్ణయానికి వచ్చారు. ఇది నాకొక విజయం.

ఢిల్లీలో వ్యవసాయశాఖాధికారులను కొంతవరకు ఒప్పించగలిగాను. మిస్టర్ ఖేర్‌ఘట్ (ఐ.సి.యస్.) రైతులపై సానుభూతి కలవారు. వ్యవసాయ ధరలు పెరగటానికి తగు చర్యలు తీసుకుంటానని చెప్పారు. రైతులు కొంతకాలమైనా లాభాలతో గడుపుతారన్న ఆశపడ్డాను. నేను 1940 లో జైలుకు వెళ్ళాను. నేను జైలుకు వెళ్ళుతూ ఈ ధరల పెరుగుదలపై ఒక కన్నువేసి ఉండమని భారతీదేవికి చెప్పాను.

1942 లో ప్రభుత్వ అవసరాలకు గోధుమలమీద కంట్రోళ్ళు విధించారు. శ్రీ చౌదరి చోటారామ్ పంజాబు మంత్రి, పంజాబు రైతు నాయకుడు ధరలు మరీ తక్కువ లేకుండా, రైతులు గోధుమలను ఎక్కువగా నిర్బంధ కంట్రోళ్ళలోనికి తీసుకొనకుండా జాగ్రత్తపడ్డారు. 1943 లో కేంద్ర ప్రభుత్వం కంట్రోళ్ళు మరలా అవసరమని తలచింది. పంజాబు ప్రభుత్వం అసమ్మతితో ఉంది. బెంగాలులో కరువు. బెంగాల్‌కు గోధుమలు అందజేయవలసిన అవసరం దృష్ట్యా ప్రభుత్వం సాహసం చేసి పంజాబులో గోధుమలు, బియ్యం, ఇతర సరకులు కంట్రోల్ వస్తువులుగా ప్రకటించగలిగింది.

ఛోటారామ్ పంజాబులో సరియైన ధరలు సాధించగలిగాడు. ధాన్యానికి ఆంధ్ర, ఒరిస్సాలు మిగులు రాష్ట్రాలు. ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వాలు సరియైన చర్యలు తీసుకోలేదు. కంట్రోలు ధరలు చాలా తక్కువగా ఉన్నాయి. ధాన్య సేకరణ ఏకపక్షంగా సాగేది. ధాన్య సేకరణ చేసే ప్రభుత్వాధికారులు లంచగొండులు. ఈ ఉద్యోగులు పెద్ద రైతులు, బియ్యం మిల్లులు, వ్యాపారులు బహిరంగ విపణులలో అమ్మడానికి వీలు కల్పించేవారు. రైతులు ఈ కొద్ది

మిగులు ధాన్యాన్ని బహిరంగంగా అమ్ముకునేవారు. మరల మరల కంట్రోళ్ళు విధించేవారు. అధికారులు ఏమీ చేయలేని స్థితిలో ఈ కంట్రోళ్ళు పెంచేవారు. ఈ పరిస్థితుల్లో గ్రామ నాయకులు, పెద్ద పెద్ద రైతులు అధికారులకు 'పార్టీ'లు ఏర్పాటుచేసి తమ పబ్బం గడుపుకునేవారు. తమ దగ్గర ఉన్న మిగులు ధాన్యాన్ని అమ్ముకునేవారు. నిస్సహాయులైన రైతులు, గ్రామీణులు ఈ బహిరంగ విపణులలో కొనలేక – కొనకుండా ఉండలేక బాధలు పడేవారు.

భారతీదేవి, బి. రామచంద్రారెడ్డి, లక్ష్మీనారాయణలు ఏమీ చెయ్యలేక పోయారు. వీరు ధాన్యం-ఆహార వస్తువుల కాన్ఫరెన్సును ఏర్పాటు చేయటానికి నిర్ణయించారు.

నేనీ పరిస్థితులలో జైలు నుండి విడుదల చేయబడ్డాను. నేను అదే రోజున మారెన సుబ్బారావు (తూ.గో. జిల్లా) అధ్యక్షులుగా నిడుబ్రోలులో చేపట్టిన రాష్ట్రీయ ఆహారధాన్యాల సమావేశాన్నందుకోగలిగాను. ఆరోజు నేను చాలా తీవ్రంగా మాట్లాడాను. రైతులకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలని, తమ సొంతం కోసం, పనివారి కోసం సరిపడినన్ని బియ్యం కూడా అధికారులు వదిలిపెట్టాలని నేనా సభలో చెప్పాను. ఈ కోర్కెలు సిద్ధించకపోతే ప్రజలు దేనికయినా తయారుగా ఉండాలని ఉద్బోధించాను. ముతక ధాన్యానికి ప్రభుత్వం అప్పుడు ఇస్తున్న ధర రూ. 10-50 లు (166 lbs) ను రూ. 12-50 లుగా పెంచమని కోరాను.

నేను అక్కడ ఉన్న నాలుగు రోజులలో కంట్రోళ్ళ బాధితులులను వేలమందిని కలిశాను. తీరప్రాంతాల ప్రజలు తమకు ఇచ్చిన ధాన్యం చాలక, రాత్రిళ్ళు బియ్యపు మూటలు నల్లబజారులో రెట్టింపు ధరకు కొనేవారు. చీరాల, పేరాల, వేటపాలెంలలో ఉన్న అసంఖ్యాక చేనేత పనివారు తినటానికి పనికిరాని బియ్యాన్ని రాత్రిళ్ళు 'తలమూటల' (నెత్తిమీద బియ్యం మూటలు పెట్టుకొని రహస్యంగా అమ్మేవారిని) వారివద్ద ఎలా కొంటున్నదీ, పోలీసులు, గ్రామాధికారులు, రైల్వేవారు కల్గిస్తున్న కష్టాలను చెప్పారు. వీటి ధర మార్కెట్టు ధరకన్నా రెట్టింపు. రాయలసీమ రైతులు ఇంతకంటే దుర్భరమైన పరిస్థితుల నెదుర్కొంటున్నారు. నేను 'సేవాగ్రామ్'కి వెళ్తూ కొన్ని రోజులు శ్రీకాకుళంలో ఆగాను. ఇక్కడి ప్రజలు ఒరిస్సాకు వలస వెళ్తున్నారు. ఈ దుస్థితి చెప్పనలవికాదు.

ప్రభుత్వంవారు సహకార దుకాణాల ద్వారా ఈ కంట్రోళ్ళ వస్తువులు ఇచ్చే వారు. అధికారుల జులుం ఇక్కడ కూడా ఉంది. చౌకధరల దుకాణాల్లో కూడా నల్లబజారు తప్పటంలేదు. చాలాసార్లు ఇక్కడ ఇచ్చే బియ్యం తినటానికి పనికిరావు. రేషనుషాపులు నడిపేవారు కూడా ఈ నల్లబజారులో భాగస్వాములే. కొంతలో కొంత చేనేతవారి పరిస్థితి బాగుంది. వారు నూలును చౌకదుకాణాల ద్వారా కొనుగోలు చేయగలుగుతున్నారు. బహిరంగ విపణులు కూడా ఇక్కడ ఉన్నాయి.

కంట్రోళ్ళతో ప్రజలు పడుతున్న బాధలను, కష్టాలను 'బాపూ'కు నివేదించాను. వారు కూడా ఈ విధానాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు. ఆరోజు నుండీ వారు కంట్రోళ్ళపై ధ్వజమెత్తారు.

నేను కేంద్ర అసెంబ్లీకి ఎన్నికయిన వెంటనే ఈ దుర్మార్గాలను కేంద్ర అసెంబ్లీ దృష్టికి తీసుకొనివెళ్ళాను. నేను అవకాశమొచ్చినప్పుడల్లా ఆహార వస్తువులపై కంట్రోళ్ళను గురించి మాట్లాడేవాడిని. రైతులకు తినటానికి సరిపోయే సరుకునైనా కంట్రోళ్ళు లేకుండా ఉంచాలని కోరేవాడిని. వ్యవసాయదారులకు ప్రభుత్వం రైతుల నుండి తీసుకునే ఆహారధాన్యాలను కేటాయించాలని కోరాను. పట్టణ వాసుల రాయితీలను వీరికి కూడా ఇవ్వాలని నేను కోరుతూ వచ్చాను. వారు పడుతున్న బాధలు నాకు తెలుసు. ధాన్యం మొత్తం పట్టణాలకు తోలి స్థానికులు అలవిమాలిన ధరలు పెట్టే పెద్దరైతుల నుండి, వ్యాపారస్తుల నుండి, మిల్లర్ల నుండి కొంటున్నారు.

రైతులకు-ప్రభుత్వానికి దళారీలుగా (మధ్యవర్తులుగా) బియ్యం మిల్లుల వారుంటారు. వారు ధాన్య సేకరణ చేసి, కొంత మాత్రమే లెఖ్ఖ చెప్పి, మిగతా ధాన్యాన్ని చీకటిబజారులో తమ జిల్లాలో, ప్రక్కనున్న జిల్లాల్లో అమ్ముకుంటారు. ఈ చీకటిబజారు ధరలు ఆకసాన్ని అంటుతుంటాయి. పోలీసువారికి, రెవిన్యూ వారికి లంచాలు ఇవ్వటం వారికి మామూలు అయింది.

మార్కెట్ల ధరలకన్నా తక్కువకు కొన్న ధాన్యాన్ని కొందరు మిల్లర్లు రైతుల ద్వారా ఇతర ప్రదేశాలకు ఎక్కువ ధరలకు ఎగుమతి చేస్తారు. వీరీవిధంగా చేసి పలుకుబడి గల రైతులకు, ఉద్యోగస్థులకు 'పర్సు'లు నింపుతారు.

మామూళ్ళకు అలవాటుపడిన ఉద్యోగులు రైతుల జిల్లా సహకార మార్కెటింగు వ్యవస్థను నాశనం చేశారు. రైతులకు ధరలలో ఏవిధమైన వెసులుబాటు కల్పించ లేకపోయారు.

బియ్యం, పంచదార, గోధుమలు, ఎరువులు, కిరోసిన్, నూనెలు వగైరాలకు చాలా సహకార సంఘాలు ఏర్పాటుచేయబడ్డాయి. కానీ వీటిలోని పెత్తందార్లు ఈ వస్తువులను తమవారికే ఇవ్వటం సాగించారు. ఇక్కడ కూడా బ్లాకు మార్కెటింగ్ జరుగుతుంది. బియ్యం మూటలను తాము పనిచేసే చోటు నుండి బియ్యం దొరకని ప్రదేశాలకు తీసుకొని వెళ్ళటానికి ప్రభుత్వం అనుమతినిచ్చింది. వీరూ బ్లాకు మార్కెటింగులో భాగస్వాములయ్యారు. పట్టణవాసులకు వీరి ధాన్యం లేకపోతే రోజు గడవదు. వారు పోషకాహార లోపాలకు గురికావలసి వచ్చేది.

కొద్దిగా ఎక్కువ జీతాలు ఇచ్చి వ్యాపారస్థులు ఈ మూటలు మోసేవాళ్ళను ఉపయోగించుకునేవారు. జనం ఇదంతా చట్టబద్ధమైన వ్యవహారమనుకునేవారు. చట్టానికి అతీతంగా జరిగే ఈ పనులు ప్రభుత్వానికి తెలిసే జరిగేవి. ఇది వాళ్ళకు లాభదాయకం. పల్లెప్రజలు, పట్టణాల ప్రజ, రైల్వేలు అన్నీ ఈ బ్లాకు మార్కెటింగుకు అనుకూలంగా వర్తిస్తున్నాయి.

మేము చేసే ఫిర్యాదులు ప్రభుత్వం లెఖ్ఖచేయటంలేదు. ఈ విస్తృతమయిన అవినీతిని, చట్ట వ్యతిరేక పనులను చూచి బాధపడ్డాను. వాడకందారులను, ఉత్పత్తిదారులను ఈ చట్టాల అతిక్రమణకు తప్పుపట్టలేము. వారి సామాన్య జీవనానికి ఇవన్నీ ఆటంకాలు. ఈ అమాయక రైతులను ఈ అసంతృప్తికరమైన కంట్రోళ్ళ నుండి రక్షించటానికే నిర్ణయించుకున్నాను.

నేను జైలు నుండి విడుదలయ్యేనాటికే కిసాను సమ్మేళన్ ఈ దుర్మార్గంపై యుద్ధం చేస్తున్నది. నెహ్రూగారు కంట్రోళ్ళకు అనుకూలంగా ఉన్నారు. స్వరాజ్య ప్రభుత్వం ఈ అవినీతికి అండగా ఉంది.

కమ్యూనిస్టులు కూడా చాలా పొరపాట్లు చేశారు. యుద్ధ కాలంలో వారు బహిరంగ అమ్మకాలకు వ్యతిరేకం. ప్రభుత్వాధికారులకు అనుకూలం. రైతుల కనీస అవసరాలకు కూడా ఉంచుకోకుండా ప్రభుత్వానికి ధాన్యం అంతా

అప్పుచెప్పమనేవారు. కమ్యూనిజం కోసం ఇప్పటినుండే 'రిహార్సల్' చేస్తున్నారు. వారి పీపుల్స్‌వార్ నినాదానికి వ్యతిరేకులయిన వారినందరినీ 'బ్లాకు మార్కెట్లు' నడుపుతున్నవారుగా పరిగణించేవారు.

ప్రజలను ఈ విషయాలలో గాంధీజీ మేల్కొల్పారు. ప్రజల బాధలకు వారు స్పందించారు. ధాన్యానికి, గోధుమలకు ఇచ్చే తక్కువ ధరలతో ప్రజలు ఏవిధంగా బాధింపబడుతున్నదీ వారర్థం చేసుకున్నారు. నేను పంపే రిపోర్టులను వారు నమ్మారు. ఈ కంట్రోళ్ళ ద్వారా దేశవ్యాప్తంగా జరిగే నష్టాన్ని (రైతులకు, కూలీలకు) వారికి తెలియజేస్తుండేవాడిని.

1947 కు ముందు ఈ అవినీతికి, బ్లాకు మార్కెటుకు వ్యతిరేకంగా ఉన్న జవహర్‌లాల్‌గారు ఈవిధమైన ప్రభుత్వ విధానం లేకపోతే 'బెంగాలు కరువు'★ మరలా పునరావృతమౌతుందని భయపడ్డారు. గాంధీగారికి ఈ భయాలేమీ లేవు. దేశానికి సరిపడినంత ధాన్యముందని, కరువులు వచ్చే అవకాశం లేదని వారు విశ్వసించారు. గాంధీగారు తన సాయంకాలపు ప్రార్థనా సమావేశాలలో కంట్రోళ్ళను తీసివేయవలసిందేనని ఉపన్యసించేవారు. దేశంలోని (ఆహార) పండితులు, నెహ్రూగారు కంట్రోళ్ళకు అనుకూలం.

ఎట్టకేలకు ఆహార మంత్రిగా ఉన్న రాజేంద్రప్రసాద్ ఈ కంట్రోళ్ళను ఎత్తి వేశారు. స్వతంత్ర భారతదేశంలో ఇది రైతులకు గొప్ప విజయం.

బియ్యంపై ధరల నియంత్రణ ఆంధ్రలో మాత్రం ఉంది. ధరలు లాభసాటిగా లేవు. ధాన్య సేకరణ మాత్రం వెనుకటి వలె కఠినంగా లేదు. బహిరంగ విపణులను (ఓపెన్ మార్కెట్లు) బ్లాకు మార్కెట్లు అని పిలవటంలేదు. రైతులకు ధరలలో కొంత వెసులుబాటు ఉంది.

గాంధీగారి మరణం వెంటనే – కంట్రోలు అధికారుల జులుం – పంచదార, కిరోసిన్, ఇనుము, సిమెంటులపై లేదు. కమ్యూనిస్టులు పట్టణ ప్రజలు బహిరంగ విపణులలో కొంటున్నారని ఆందోళన చేయసాగారు. ఐ.యన్.టి.యు.సి. (ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు) వారు 'ఫుడ్ కంట్రోళ్ళు'

★1943-44 లో బెంగాలులో కరువు వచ్చింది. 1.5 మిలియన్ల నుండి 2.1 మిలియన్ల వరకు మరణాలు సంభవించాయి.

విధించాలనగానే నేను బిత్తరపొయ్యాను. వ్యాపారస్థులు ఎక్కువ వేతనాలివ్వటానికి, కరువుభత్యం ఇవ్వటానికి వ్యతిరేకం. అందువలన వారు కూడా కంట్రోళ్ళు కావాలనేవారే. సోషలిస్టులదీ ఇదే పాట. జవహర్‌లాల్‌గారు కంట్రోళ్ళకు అనుకూలురు. గాంధీగారి మరణం తరువాత సంవత్సరానికే మరలా కంట్రోళ్ళ రాజ్యం వచ్చింది. ఈ భయంకర పరిస్థితి 1952 లో మా ఆందోళనల తరువాత మాత్రమే లేకుండాపోయి, కంట్రోళ్ళు తీసివేయబడ్డాయి.

1948 లో కంట్రోళ్ళపై సమావేశం మాచవరంలో నా అధ్యక్షతన జరిగింది. 'పెజెంట్స్ అండ్ కంట్రోల్స్' అనే పుస్తకాన్ని ఈ సందర్భంగా ప్రచురించాను. ఈ పుస్తకానికి విశేష ఆదరణ లభించింది.

1951లో కంట్రోళ్ళకు వ్యతిరేకంగా ఒక సమావేశం 'లక్నో'లో నా అధ్యక్షతన జరిగింది. కంట్రోళ్ళకు వ్యతిరేకంగా నిరసనదినం పాటించాము. 1951-52 జనరల్ ఎలక్షన్లలో 'కృషికార్ లోక్‌పార్టీ'కి ఇదే ముఖ్యమయిన ఆయుధం. నేను మద్రాసు ఎలక్షన్లలో మెజారిటీ లేని కాంగ్రెసువారికి 'కచ్చా'గా ఇచ్చిన సలహాలో ఆహారధాన్యాలపై కంట్రోళ్ళు తీసివేయాలని కోరాను. సమర్థుడు, నిజాయితీపరుడు అయిన సి. రాజగోపాలచారి ప్రధానమంత్రి అయిన ఆరు నెలలకే కంట్రోళ్ళు ఎత్తివేశారు. రఫీ అహమ్మద్ కిద్వాయి సి. రాజగోపాలచారి బాటలోనే తరువాత నడచాడు.

అధికారుల భయాలు నిజాలుకావని తెల్సిపోయింది. ధరలు పెరుగుతవన్న భయంతో దాచిపెట్టుకొన్న ఆహారపదార్థాలు బహిరంగ మార్కెట్లలోకి వచ్చాయి. కొన్నిచోట్ల ధరలు తగ్గాయి. గ్రామాలు, పట్టణాలు అవినీతి అధికారుల నుండి విముక్తి పొందాయి. గృహస్థులు మరియొకసారి నాణ్యమయిన బియ్యాన్ని, గోధుమలను సరసమయిన ధరలకు కొనసాగారు. హాయిగా గాలి పీల్చుకున్నారు. ఇది రైతులకొక గొప్ప విజయం.

నిజజీవితంలో పడిన బాధలు, చీకటిబజారుదార్లు అన్న బిరుదులను ఎంతో వీరోచితంగా, దృఢమయిన మనస్సుతో రైతులు ఎదుర్కొన్నారు. ఈ ఆర్థిక నిర్బంధాలను గడచారు. ఇది తెలియచెప్పటానికే నేను 1943-53 ల మధ్య జరిగిన సంఘటనలను ఉదాహరించాను.

ఇది రైతులకొక గొప్ప విజయం. ఎప్పుడైనా అత్యవసర పరిస్థితి తలయెత్త గలదని చెప్పి ప్రభుత్వాలు ఇటువంటి అరాచకాలకు పాల్పడతాయి. 1964 లో మరల ఈ కంట్రోళ్ళను ఎదుర్కొంటున్నాం.

ఈ కంట్రోళ్ళ రాజ్యంలో హాస్య సన్నివేశాలకు కొదవలేదు. థర్డ్ క్లాసు, ఇంటర్ క్లాసు, సెకండు క్లాసు కంపార్ట్‌మెంట్లలో 'నెత్తిమూటల' వాళ్ళు ఆ మూటలన్నింటినీ ఈ కంపార్టుమెంట్లలో పారవేయడం, తాము ప్రక్కనున్న కంపార్ట్‌మెంట్లలోనికి ఎక్కడం, రైలు ఆగినప్పుడు వీటిని చూచుకోవటం, లేకపోతే రైల్వే పాసింజర్లకు సైగల ద్వారా తెలియజేయటం, మూటలకు ఎవరినో ఒకరిని కాపలాపెట్టటం ఇవన్నీ చాలా హాస్యభరితంగా, నవ్వు పుట్టించేవిగా ఉండేవి. ప్రయాణీకులు కూడా వీరికి సహాయం చేసేవారు.

ఈ కంట్రోళ్ళ రాజ్యంలో అందరూ ఆఫీసర్ల చలవ వలన బ్లాకు మార్కెటు దార్లుగా మారారు. ఎరువులు, వ్యవసాయ పనిముట్లను కో-ఆపరేటివ్‌ల ద్వారా ఇప్పించేవారం. రైతుల పక్షాన నిలచి ఈ పనులు చేయటానికి ఎంతో మనస్థైర్యం కావాలి. 1966-67 లలో నెత్తిమూటలవారి కొరకు సత్యాగ్రహం చేశాను.

గ్రోమోర్ ఫుడ్ (అధికాహారోత్పత్తి)

ప్రభుత్వం చేపట్టిన గ్రోమోర్ ఫుడ్ కాంపెయిన్ మంచి ఫలితాల నిచ్చింది. నీటి సాగు పెరిగి కరవు దూరమయింది. రసాయనిక ఎరువుల వాడకం బాగా పెరిగింది. మంచి పంట దిగుబడులొచ్చాయి. మొత్తం ఆహారధాన్యోత్పత్తి పెరిగింది. ప్రభుత్వ ప్రచారం బాగా ఉపయోగపడింది. మహాత్మాగాంధీ ఆశీస్సు లతో కిసాను సమ్మేళన్ 1942 నుండి చేసిన కృషి సార్థకమయింది.

1949-50 లలో ఆహార ప్రణాళికను ప్రధానమంత్రికి సమర్పించాను. చిన్న, మధ్యతరగతి పథకాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాను. లార్డ్‌బాయిడ్ ఓర్ ఈ ప్రణాళికను జాగ్రత్తగా చదివారు. నేను వ్రాసిన చాలా విషయాలను వారు ప్రణాళికలో పొందుపరచారు. నేనిచ్చిన ముఖ్యమయిన సలహా కూడా ఇందులో ఉన్నది, అది అత్యధిక దిగుబడి సాధించిన రైతుకు 'కృషి పండిట్' అనే బిరుదునివ్వటం. ఈ బిరుదు ఇప్పుడు విశేష ప్రజాదరణకు నోచుకుంది.

'నేలకోత'ను అడ్డుకోవాలి. దీనికై 'భూసంరక్షణ' ఒక కార్యక్రమంగా 1937లో తీసుకున్నాం. ఈ కార్యక్రమాన్ని శ్రీ మున్షీగారు 1948-51లలో 'వన మహోత్సవం' అనే పేరుతో బాగా ప్రచారం చేశారు. భూ సంరక్షణ చర్యలు తీసుకోవటం ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశ్యం.

దేశంలో సాగునీరు వసతులు కల్పించటానికి కొత్తగా తెలుసుకున్న ఆహార కొరత, బెంగాల్‌లో మరల మరల వచ్చే ఆహార కొరతలు తోడ్పడ్డాయి. గత ప్రభుత్వాలు నీటిపారుదల ప్రాజెక్టులపై వచ్చే ఆదాయాన్ని లెక్కవేసుకొనేవి. ఎంత నీరు ఇవ్వగలుగుతున్నాం, ఎంత పంట ఈ నీటివలన పండుతుంది, ఎంతవరకు కరవు పరిస్థితిని ఎదుర్కొనగలం అనే విషయాలు ప్రాధాన్యత సంతరించుకొన్నవి. గతంలో విస్మరించిన చిన్న-మధ్యతరగతి ప్రాజెక్టులన్నీ నేడు మరలా ఎక్కువ ఆహారోత్పత్తికి ఉపయోగపడుతున్నాయి. దశాబ్దాల తరబడి మూలబడిన తుంగభద్ర ప్రాజెక్టును మరల చేపట్టాం. శ్రీ యన్.వి. రామమూర్తి గారు రామపాదసాగర్‌ను మరల పరిశీలనకు తీసుకొన్నారు. హీరాకుడ్, దామోదరవాలీ, భాక్రానంగల్, చంబల్, దిగువ భవానీ, శరావతి, కోనే ప్రాజెక్టులను కొత్త దృష్టితో పరిశీలిస్తున్నారు.

కృష్ణానదిపై నాగార్జునసాగర్ నిర్మాణంలో శ్రీ యం. సత్యనారాయణ, యం.పి. గారి పాత్ర, నా పాత్ర, వి. ప్రసాద్, కె. కన్నయ్య (కన్నయ్య నాగార్జునసాగర్, అహోబిలాల బొమ్మలను బట్టలుగా ధరించేవారు) మరియు గోపాలక్రిష్ణయ్యల కృషి కూడా ఉంది. ఈ ప్రాజెక్టు పూర్తిగా నిర్మాణం జరిగిన తరువాత 6 మిలియన్ ఎకరాలకు (మిలియన్ అంటే 10 లక్షలు) నీరివ్వగలుగుతాము. 3-4 మిలియన్ టన్నుల ఆహారధాన్యం పండుతుంది.

చిన్నా పెద్ద సాగునీటి ప్రాజెక్టులు దేశం అంతా చేపట్టటం జరుగుతుంది. కిసాన్ సమ్మేళన్ కార్యకర్తలు ఈ వివిధ ప్రాజెక్టుల నిర్మాణంలో చురుకుగా పనిచేస్తున్నారు. 1926-34 వరకు సాగిన 'పెదవడ్లమూడి' ప్రాజెక్టులో ఈవిధంగానే కృషి చేశారు.

గ్రోమోర్ ఫుడ్ ప్రణాళిక కూడా పూర్తిగా విజయవంతమయినదని చెప్పలేం. 10-15 శాతం ఆఫీసర్ల లంచాలకే పోయింది. ★

38. ప్రణాళిక - నేను

1938 లో సుభాష్‌చంద్రబోసు జాతీయ ప్రణాళికా సంఘానికి అధ్యక్షుడుగా ఉండేవాడు. నేనప్పుడు వారికి సహకరించాను. 1947 లో మహాత్మాజీ సలహా మేరకు ప్రణాళికా స్థాయిసంఘ సభ్యునిగా ఉన్నాను.

1949 లో జాతీయ ప్రణాళికా సంఘం ఏర్పడింది. రాష్ట్రాలన్నీ రైతులకు గిట్టుబాటు ధరనివ్వాలని కోరాయి. కంట్రోళ్ళకు వ్యతిరేకంగా నేను చేస్తున్న ఆందోళనకు శ్రీ పట్టాభిగారు మద్దతునిచ్చారు.

ఈ (స్థాయిసంఘపు) చర్చలు ప్రధానమంత్రి ఇంట్లో జరిగేవి. గుల్జారిలాల్ నందాగారు, జవహర్‌లాల్‌గారు నాతో తీవ్రంగా విభేదించేవారు. రైతులు ఏ పంట వేయాలి? ఎంత విస్తీర్ణంలో వేయాలి? ఎన్ని ఎకరాలు (హెక్టార్లు) ఉపయోగించుకోవాలి? తమ సొంత అవసరాల కోసం ఎంత పంటను ఉంచు కోవాలి? ఎవరికి అమ్మాలి? మొదలైన విషయాలపై వారిరువురూ అసంతృప్తితో ఉండేవారు. సమర్థవంతమయిన 'ప్లానింగు' లేదనేవారు. వ్యవసాయ ఉత్పత్తులు జాతీయ ఆదాయంలో సగానికి మించి ఉండేవి. అందువలన నేను వారితో ఏకాభిప్రాయానికి రాలేకపోయాను. ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలు, లాభసాటి ధరలు, చౌకగా అప్పు, ముందస్తు ఒప్పందాలు, క్రయవిక్రయాలు, నాణ్యమయిన విత్తనాల సరఫరా, వ్యవసాయ పరికరాలు, ఎరువులు, క్రిమిసంహారకాలు, పశువుల దాణా, వంటచెరకు వీటన్నింటినీ సమర్థవంతంగా సరిపోయే విధంగా ప్రభుత్వమే ఇవ్వాలని చెప్పేవాడిని.

పంట వైఫల్యాలు, పశు మరణాలకు బీమా ఉండాలని, గిట్టుబాటు ధరలు కాక స్థిరమయిన ధరలుండాలనీ, కౌలుదార్లకు, వ్యవసాయ కూలీలకు రక్షణ

కల్పించాలని నేను వాదించేవాడిని. పొలాల సొంతదారుల సంక్షేమానికి వ్యతిరేకంగా చేసే పనులపైనా వారిని హెచ్చరించేవాడిని. నందాగారు, జవహర్‌లాల్‌గారు వ్యవసాయం అంతా ప్రభుత్వ నియంత్రణలోనే ఉండాలనేవారు. ప్రణాళికలు సమాజపరంగా, కుటుంబపరంగా ఉండాలనీ, గ్రామ సంక్షేమ సంఘాలు వీటన్నిటిపైనా ఆధిపత్యం కలిగి ఉండాలనీ, సామాజిక, ఆర్థిక పరిస్థితులు భూమి ఉన్న, భూమి లేని గ్రామీణులకు అందుబాటులో ఉండాలని వారు కోరేవారు. వారు భూమి ఉన్న, భూమి లేనివారల మధ్య ఆర్థిక తారతమ్యాలు లేకుండా చూడాలని కోరేవారు.

రెండు రోజులు ఈ విషయాలపై చర్చలు జరిగాయి. నేను ఒక్కడనే అయ్యాను. మిగతావారెవ్వరూ వ్యవసాయదారులు కాదు. సోవియట్ రష్యా ప్రభావంలో వీరందరూ ఉన్నారు.

ఈ చర్చలే భవిష్యత్తులో జవహర్‌లాల్‌గారిపై ప్రభావం చూపాయి. శ్రీ నందా, కందూభాయిదేశాయి, సి.డి. దేశముఖ్ గారలు మంత్రివర్గంలో సభ్యులు కారు. జవహర్‌లాల్‌గారు వీరిని దగ్గరకు తీసారు. నా విమర్శనాత్మక ధోరణిని నేను మానలేదు. జవహర్‌లాల్‌గారికి నేనొక్కడనే 'కొరకరాని కొయ్య'నైనాను. నా పార్లమెంటు ఉపన్యాసాలలో ఇవన్నీ ప్రతిఫలించేవి.

మంత్రిగా ఎదిగిన నందాగారు రైతుల స్వాతంత్ర్యాన్ని బలహీనపరిచే ప్రతిపాదనలను పంచవర్ష ప్రణాళికలో పొందుపరచసాగారు. సహకార సేద్యం, సమాజ వికాసం, పంచాయితీరాజ్, గరిష్ఠ పరిమితుల నిర్ధారణ (భూమిపై) లను రైతుల సేద్యానికి గండికొట్టే విధానాలుగా మార్చసాగారు. మిగులు పొలాలకు నామమాత్రపు నష్టపరిహారం చెల్లించేవారు. ఆహారధాన్యాల వ్యాపారం కూడా సమాజపరం చేయటానికి ప్రతిపాదనలను ముందుకు తీసుకొనరాసాగారు. జిల్లాలు, రాష్ట్రాల మధ్య పిండిమరలు, ధాన్యపు రవాణా నియంత్రించే ప్రతిపాదనను కూడా ముందుకు తీసుకువస్తున్నారు. ధాన్యం వ్యాపారంపై రుణ వసతికి కంట్రోళ్ళు విధించాలనే ఆలోచనలో ఉన్నారు. ఈ చర్యలతో ఆగకుండా నందాగారు 17వ రాజ్యాంగ సవరణను నెహ్రూగారికి చెప్పి ఒప్పించారు.

నందాగారి శల్యసారథ్యం

రైతుల వ్యవసాయ భూములకు, వ్యవసాయేతర భూములకు చాలా స్వల్పంగా పరిహారమిప్పించి, 'సహకార వ్యవసాయం' (అంటే సమిష్టి వ్యవసాయమే) కొరకు స్వాధీనం చేసుకోవాలని, కొద్ది విస్తీర్ణం గల భూములను కూడా 'ఎస్టేటు' అని జమీందారీ భూముల పట్టికలో చేర్చాలని, వీటిని రాజ్యాంగ సవరణ ద్వారా చెయ్యాలని నందాగారు చెప్పి నెహ్రూను ఒప్పించారు.

ఈ నాయకులిరువురూ (నెహ్రూ-నందాలు) వీటిని సలహాల రూపంగా 1949 స్థాయీసంఘపు సమావేశాలలో చర్చించేవారు. నేను జవహర్‌లాల్‌గారు ఈ విషయంలో ఏకాభిప్రాయానికి రాలేకపోయాం.

ప్లానులలోకి వెళ్ళితే..

నా భయం నిజమైంది. మొదటి పంచవర్ష ప్రణాళిక నివేదికలో రైతుల వ్యతిరేక ధోరణి కన్పించింది. నేను 1951 మరియు 1953 లలో నా పార్లమెంటు ఉపన్యాసాలలో ఆందోళన వ్యక్తం చేశాను. రైతాంగ ఆర్థిక విధానం, రైతుల హక్కులు, చిన్నకమతాలపై ప్రభుత్వపు రక్షణ కావాలని నేను కోరాను. నేను రైతుల హక్కుల కొరకు అంతులేని యుద్ధం చేయవలసి ఉంటుందని తెలుసు. 1954 లో తెనాలిలో కృషికార్ లోక్‌పార్టీ అధ్యక్షునిగా చేసిన ఉపన్యాసంలో నేనీ భయాన్ని ప్రకటించాను. నా హెచ్చరికలేమీ పనిచేయలేదు. నేను బల్వంత రాయ్ మెహతాకు ఎ.ఐ.సి.సి.లో ఇచ్చిన సమాధానం చూడవచ్చు.

రెండవ పంచవర్ష ప్రణాళిక రైతు ఆర్థికతను సహకార సేద్యం వైపు మళ్ళించే విధంగా ఉంది. జవహర్‌లాల్‌గారి అనుమతితో గరిష్ఠ పరిమితి (ఆదాయంలో) పట్టణవాసులకు, ఉద్యోగులకు పెంచారు. ప్రాథమిక ఆదాయంకన్నా మూడు రెట్లు అంటే రూ. 300-00 లు వ్యవసాయానికి నిర్ణయించారు. నేనీ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించాను. ఆ తరువాత రూ. 600-00 లు గా నిర్ణయించారు. నందాగారు సహకార (సమిష్టి) సేద్యంపై అదే ధోరణిలో ఉన్నారు. శ్రీ ఆర్.కె. పటేలుగారి నాయకత్వంలో నన్ను కూడా 'చైనా పంపవలసినద'ని చాలెంజ్ చేశాను. వివిధ రకాలయిన ఆర్థికతను పరీక్షించటానికి, పరిశీలించటానికి

అవకాశం ఉంటుంది. ప్రభుత్వం వారికిష్టమయిన వారిని పంపించింది. వారూ ఒక అభిప్రాయానికి రాలేకపోయారు. మైనారిటీ సభ్యులు సహకార సేద్యాన్ని వ్యతిరేకించారు.

నేను, పి.ఆర్. పర్చూరి కలసి ఒక సవివరమయిన నివేదికను రెండవ పంచవర్ష ప్రణాళికపై 1956 లో ప్రకటించాం. లోహియా మా నివేదికను స్వాగతించాడు. మా భయాలను జాగ్రత్తగా అర్థంచేసుకున్నాడు.

1952 నుండీ అవకాశమొచ్చినపుడల్లా నేను పార్లమెంటులో పంచవర్ష ప్రణాళికకు వ్యతిరేకంగా గ్రామీణుల కొరకు పోరాడుతున్నాను. పార్లమెంటు లోనూ, వెలుపలా భారత సేవాసమాజ్ రైతులకోసం పోరాటం చేస్తూనే ఉంది.

ప్రభుత్వం పంచవర్ష ప్రణాళికపై పేపర్లలోను, స్కూళ్ళలోనూ, కాలేజీల్లో, యూనివర్శిటీల్లో, పార్లమెంటులో ప్రచారం చేస్తున్నది. సోషలిస్టులు, మార్కిస్టులు ఈ ప్రచారాన్ని ఆహ్వానించారు. వినోబాభావే ప్రజలందరినీ 'ప్లాను' వైపే ఉండమని, సొంత ఆస్తులు రైతులు వదులుకోవాలని ప్రచారం చేశాడు. దీని వెనుక ఉన్న అనైతికతను ఎదుర్కోవటానికి కిసాను సమ్మేళన్ వద్ద ప్రచార సాధనాలు, డబ్బు లేదు. రాజకీయవాదులందరూ వినోబాభావే చెప్పిన గ్రామదాన్ ఉద్యమంపై కొత్త మోజులో ఉన్నారు. (ఉచితంగా తమ ఆస్తుల నన్నింటినీ దానం చేయటానికి). 1957 లో మచిలీపట్నంలో ఈ గ్రామదాన్‌కు వ్యతిరేకంగా మాట్లాడాను. బలహీనవర్గాలు, బడుగువర్గాలు తమ భూములు పోగొట్టుకోవటం మాత్రమే మిగులుతుందని హెచ్చరించాను. గ్రామదాన్‌కు వ్యతిరేకంగా సత్యాగ్రహాలు చేయాలని, రైతాంగ ఆర్థికతకు అండగా ఉండాలని నేనన్నాను.

రైతుల అవసరాల కొరకు, వారి ఆర్థిక ప్రగతి కొరకు పరుగులెత్తడం నా సహజ గుణం. 1948-49 లలో నాకు, జవహర్‌లాల్‌గారికి జరిగిన చర్చలే దీనికి సాక్ష్యం. మచిలీపట్నంలో నా ఉపన్యాసం నా దశాబ్దాల పోరాటానికి సాక్ష్యం. ఆగస్టు 1957 లో శ్రీ వినోబాభావే 'ఏల్‌వాల్'లో ప్రవచించిన గ్రామదాన్‌కు నేను వ్యతిరేకం. ఈ 'ఏల్‌వాల్' సభకు కమ్యూనిస్టు మిత్రులు, సోషలిస్టులు శ్రీ జయప్రకాశ్ నారాయణ జవహర్‌లాల్, తదితర కాంగ్రెసు వారందరినీ ఆహ్వానించారు.

సహకార వ్యవసాయం (కమ్యూనిస్టుల సమిష్టి వ్యవసాయం) అనే ఈ బానిస యజమాని నుండి రైతులనెలా రక్షించాలన్నదే నా ఆలోచన. కళ్ళకు కనిపించే జమీందార్ల నుండి, ఇతర దుర్మార్గపు చిహ్నాల నుండి ఈ దోపిడి నెదుర్కోవడం తేలిక. సామ్యవాద ప్రణాళిక, జాతీయ ప్రణాళికల పేర్లతో జరిగే ఈ దోపిడీని ఎదుర్కోవటం, హెచ్చరించటం, సంఘటితపరచటం, ఉత్తేజపరచటం అంత తేలిక కాదు. కమ్యూనిస్టులు, సోషలిస్టులు దీనిని అభ్యుదయంగా వర్ణించటం, మిగతావారినందరినీ అభ్యుదయ నిరోధకులుగా ప్రణాళికా వ్యతిరేకులుగా ముద్ర వేయటం జరుగుతుంది. ఈ సమయంలో నేను ఈ బాధ్యత స్వీకరించక తప్పదు. నా విజ్ఞానాన్ని, నా వ్రాతలను, రైతుల కోసం ఈ (కమ్యూనిస్టు) ప్రణాళికకు వ్యతిరేకంగా ప్రచారం చేయవలసిందే. ఈ బృహత్ కార్యక్రమంలో భాగంగా నేను 1. 'క్రిడో ఆఫ్ వరల్డ్ పెజంట్రీ' (కర్షకవేదం), 2. ప్రణాళిక - రైతు (The Plan and the Peasant), 3. పంచాయితీ లాండు లార్డిజం, 4. పెజెంటు ఎకానమీ, 5. కో-ఆపరేటివ్ ఫార్మింగు అండ్ పెజెంటు, 6. స్టార్‌బరస్ట్స్ ఓవర్ పెజెంట్సు, 7. సెల్ఫ్ ఎంప్లాయిడ్ సెక్టర్ - అనే పుస్తకాలను ప్రచురించాను.

క్రిడో ఆఫ్ వరల్డ్ పెజెంట్రీకి పూర్తి రూపం సంతరించటానికి నేను U.S.S.R. చూచి వచ్చిన తర్వాత సంవత్సర కాలం పట్టింది. సోషలిస్టులను, కమ్యూనిస్టు పార్టీలను, వాటి ప్రణాళికలను ఎదుర్కోవటానికి 'క్రిడో' ఒక సిద్ధాంతపరమైన సాధనం. ఈ పుస్తకాలపై వచ్చిన 'అభిప్రాయాలు' రైతుస్వామ్యానికి, ప్రజాస్వామ్య వాదం లేక సంక్షేమరాజ్యానికి త్రోవ చూపుతున్నాయి. ఈ పుస్తకాల వెలుగులు తరతరాలకు ప్రసరిస్తాయి.

కిసానులు దేశ ఆర్థికాభివృద్ధిని కాంక్షించేవారు. 1954 లో మన దేశంలోని జాతీయ ప్రాజెక్టులు చూడటానికి కిసాన్ సమ్మేళన్‌వారు, శ్రీ రమణ, యం.పి., శ్రీ రామానాయుడు, శ్రీ యన్. వీరాచారి, ఇతర కిసాను కార్యకర్తలు పది రైళ్ళను 'రంగా కిసాను యాత్రా స్పెషల్' అనే పేరుతో (1956-64 మధ్య) నడిపారు.

1959 లో దేశంలో జలవిద్యుత్ కేంద్రాలు, నీటిపారుదల, వ్యాపారాభివృద్ధి ప్రాజెక్టులను, దేశాభివృద్ధికి ఈ ప్రాజెక్టులు ఎలా ఉపయోగపడుతున్నాయో

చూపించారు. వీటి ఆధారంగా పలుచోట్ల కిసాను యాత్రా స్పెషల్స్ వచ్చాయి. వీటివలన ప్రజాచైతన్యం పెరిగింది. కిసానులకు ప్రణాళికా రచయితలపై నమ్మకం పెరిగింది. ప్రణాళికల విజయం కోసం రైతులు చొరవ చూపుతున్నారు. కిసాను సమ్మేళన్ ఇంత చేస్తున్నప్పటికీ ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిని నేను కోరటంలేదని ప్రచారం చేస్తున్నారు.

నేను జవహర్‌లాల్‌కు, కాంగ్రెసు పార్టీకి బలమైన ప్రత్యర్థి వర్గాన్ని నిర్మించే ప్రయత్నంలో ఉన్నాను. జవహర్‌లాల్‌ను గానీ, ఆయన ముచ్చటపడుతున్న గ్రామదాన్‌ను గానీ వ్యతిరేకించటం అంత కష్టమేమీ కాదు. కానీ ఎంతో పురాతన మయిన కాంగ్రెసుపార్టీమీద దీని ప్రభావం ఎలా ఉంటుందో తెలియదు. కాంగ్రెసులో ఉంటూనే జవహర్‌లాల్‌ను వ్యతిరేకించటం ఒక మానవాతీత ప్రయోగం. సహకార సేద్యానికి వ్యతిరేకంగానూ, జవహర్‌లాల్‌కు వ్యతిరేకం గానూ వారి అధికారాన్ని ఎదుర్కొనటం కాంగ్రెసును ఎదుర్కోవటమే. వీటన్నింటికీ నాకు ధైర్యం ఎలా వచ్చింది?

సాంఘికంగా, ఆర్థికంగా ఉన్న కాంగ్రెసు రోగాలను కాంగ్రెసే పెంచి పోషిస్తు న్నది. నేను, నాలాంటివారూ తిరుగుబాటు చేయవలసిందే.

నెహ్రూగారితో ఇంత వైమనస్యానికి కారణం ఏమిటి? నలభయి ఏళ్ళ గాంధీగారి బోధనలను మరచి ఈ నాయకులు పాశ్చాత్య దేశాల మోజులో పడ్డారు.

భారతదేశ స్వాతంత్ర్యానంతరం, బ్రిటీషు లేబరు పార్టీ నాలుగు సంవత్సరాలు బలంగా ఉంది. ఈ నాలుగు సంవత్సరాలు కాంగ్రెసు పార్లమెంటరీ బహిరంగంగా సోషలిస్టులను బలపరచింది. జమీందారీ, జాగీర్దారీ విధానాలు రద్దయిన నేపథ్యంలో రైతులకు వారి పొలాలపై హామీలు లభించాయి. ప్రభుత్వరంగ సంస్థలు, గృహ నిర్మాణ సంస్థల నుండి చిత్తరంజన్ రైల్వే, హిందూస్థాన్ మెషిన్ టూల్స్ నుండి ఇండియన్ టెలిఫోను వరకు, హిందూస్థాన్ నౌకా నిర్మాణ సంస్థ నుండి ఇంటెగ్రల్ కోచ్ ఫాక్టరీ వరకు అభివృద్ధి చెందుతున్నాయి. ఈ ప్రభుత్వరంగ ప్రస్థానమే బ్యాంక్ ఆఫ్ ఇండియా, జాతీయ బీమా సంస్థల జాతీయాకరణకు కారణం.

పరిపాలనలోనూ, రైల్వేలోనూ జరుగుతున్న అవినీతి, కంట్రోళ్ళ రాజ్యం ప్రజల కళ్ళు తెరుచుకొనేటట్లు చేసింది. ప్రభుత్వ పాలనపై గతంలో వీరికున్న అభిప్రాయాలు వీరి అసమర్థత, అవినీతి పాలన వలన మార్పుచెందాయి.

యల్.ఐ.సి., ముంద్రా వ్యవహారం, జీపులు,ఎరువులు, ట్రాక్టర్ల కుంభకోణాలు, దామోదరవాలీ, శరావతి, భాక్రానంగల్ సంఘటనలు, ఉక్కు కర్మాగారాల్లో నష్టాలు, ఆయుధ కర్మాగారాల్లో అవినీతి - ప్రజలకు కాంగ్రెసు ప్రభుత్వ అసమర్థత, నిజాయితీ, ప్రజాభిప్రాయంపై సదభిప్రాయం లేకుండా చేశాయి.

కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ మంత్రులు పార్టీ కోసం, వ్యక్తిగతమైన పనుల కోసం, రాజకీయాల కోసం, ముఠాకక్షల కోసం పంచాయితీలలో, కో-ఆపరేటివ్ సొసైటీలలో తమ అధికారపు వాడకాన్ని చూచిన ప్రజలు వీరిమీద వ్యతిరేకంగా ఉన్నారు.

సాంఘిక సేవా సంస్థలు కూడా ప్రజలకు ఉత్సాహం కలిగించటంలేదు. సోషల్ సర్వీసు విభాగాలు కాంగ్రెసు డబ్బుతో పనిచేస్తున్నాయి.

అధికార దుర్వినియోగాన్ని, అధికారుల సిగ్గులేనితనాన్ని ప్రజలు అసహ్యించు కుంటున్నారు. తమ అనుకూలురతో ఉద్యోగాలు నింపుకుంటున్నారు. పరిపాలనలో న్యాయం లేదు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. రాజ కీయాల కోసం డబ్బును ఖర్చు చేస్తున్నారు. ప్రజాధనం మీద నియంత్రణ లేదు. రోజురోజుకు పెరుగుతున్న రాష్ట్ర ఉద్యోగుల సంఖ్య భయంగొల్పుతున్నది. అవినీతి ఉద్యోగులకు, అసమర్థ మంత్రులకు కృషికార్ లోక్‌పార్టీ ఒక్కటే ఇప్పటి ప్రతిపక్షంగా ఉంది.

ధరలు పెరిగాయి. దిగువ మధ్యతరగతి ప్రజలు ఎక్సైజు డ్యూటీలతో బాధ పడుతున్నారు. రైలు ప్రయాణాలు ప్రియమైనాయి. జాతీయం చేస్తే రోడ్డు ప్రయాణాలు కూడా ఇదేవిధంగా ఉండవచ్చు. వాడుక వస్తువుల ధరలు ఇప్పటికే యుద్ధ కాలంలోనూ, తరువాత పెరిగిన ధరలను మించాయి. జాతీయ రోడ్డు రవాణా సంస్థ కూడా ఇదేవిధంగా పెంచి ప్రభుత్వానికి ఎక్కువ లాభాలు సంపాదించవచ్చు. ఈ సుంకాలన్నింటితో ప్రభుత్వం ఏం చేయదల్చుకున్నది?

సివిల్ పాలన ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయి. వేతన సంఘంవారిచ్చే రాయితీలు, కరువుభత్యం ఇంకా పెరుగుతున్నవి. శ్రామికులు, మధ్యతరగతివారు నష్టపోతారు.

ప్రభుత్వం అనవసరమైన ఉద్యోగులను నియమించి, అదనంగా వచ్చే రాబడిని దుర్వ్యయం చేస్తున్నది. ప్రభుత్వమువారి ఆలోచనారహితమైన ప్రణాళికలతో రైతులు కష్టాలు పడుతున్నారు. మరమగ్గాల సేవా సహకార సంస్థ ఫ్యాక్టరీలు ఏర్పాటుచేసుకొని నేతపనివారికి అపకారం చేస్తున్నది. చేనేత బోర్డును మిత్రునిగా కాక ఒక శత్రువుగా మారుస్తున్నది. రైతులకు కల్పవృక్షంగా, కామధేనువులా ఉండవలసిన తమ స్వయం ఉపాధి పథకాలను విస్తృతమయిన ప్రచారం ద్వారా దెబ్బతీస్తున్నది.

స్వయం ఉపాధి పథకాల ద్వారా వచ్చే జాతీయ ఆదాయాన్ని నెహ్రూ ప్రభుత్వం చేపట్టిన వినాశకరమయిన ప్రణాళికలు నాశనం చేస్తున్నాయి. పదో వంతు ప్రణాళికా వ్యయాన్ని కూడా ఈ ప్రణాళికలు ఖర్చుచేయలేవు. ఈ ప్లానింగు ద్వారా ప్రభుత్వం చేతివృత్తులవారికి, రైతుల నుండి పరిశ్రమలు స్థాపించేవారి వరకు సహాయం చేయగలదా? బలహీనులను బలవంతులు, పేదలను ధనికులు, నిరుద్యోగులను ఉద్యోగులు దోపిడీ చేయకుండా ఈ ప్రభుత్వం అత్యధికంగా అభివృద్ధిని సాధించగలదా? ఊటబావులలో నీటిలాగా మన చేతివృత్తులవారి సంస్కృతీ వికాసం, వికేంద్రీకృత ఆర్థిక విధానం మనం సాధించగలమా?

సహకార వ్యవసాయంమీదనే కాదు (రష్యావారి సమిష్టి వ్యవసాయం) కాంగ్రెసువారి నాయకత్వంమీద, కాంగ్రెసు ప్రణాళికలపైనా, కాంగ్రెసు కార్యక్రమాలపైనా, మంత్రులపైనా నేను పోరాటం చేయటానికి సిద్ధంగా ఉన్నాను.

★ ★ ★

39. చేతివృత్తులవారు

బొంబాయి అభివృద్ధి కోసం పది సంవత్సరాలలో పది వేల కోట్ల ప్రణాళిక పురిటినొప్పులు పడుతుంది. యుద్ధానంతర ప్రణాళికకు ఇది ఒక పునాది. ఈ ఆశబోతు ప్రణాళిక ప్రణాళికా సంఘంవారి ఆలోచనలకు అనుగుణం. భారత దేశం ఇతర దేశాల నుండి రుణం తీసుకోవాల్సిన అవసరం గురించి మే 1945 లో బిర్లాగారు గాంధీగారికి వివరించారు. “స్వతంత్రం లేని దేశం అప్పుల్లో మునిగిపోతుంది. కనుక నేనీ ప్రణాళికను ఆశీర్వదించలే”నని గాంధీ గారు చెప్పారు. యం.యన్. రాయ్ ‘ప్రజా ప్రణాళిక’ను విడుదల చేశారు. బజాజ్‌గారి అల్లుడు శ్రీ శ్రీమన్నారాయణ అగర్వాల్ ఈ ‘గాంధీ ప్రణాళిక’ను సమర్థించారు. నెహ్రూగారి రెండవ పంచవర్ష ప్రణాళిక వ్యవసాయాభివృద్ధిని పట్టించుకోవటంలేదు. ప్రజా ప్రణాళికలు, గాంధీగారి ప్రణాళికలు గ్రామీణాభి వృద్ధికి కారణాలు.

శ్రీ అర్దీష్వర్ దలాల్‌ను భారత ప్రభుత్వం ప్రణాళికా మంత్రిగా నియమించింది. వీరు తాతా కంపెనీలో భాగస్థుడు. రెండు వేల కోట్ల ఆశావహ బడ్జెటుకు వీరు రక్తమాంసాలు సమకూర్చారు. అసెంబ్లీ సభ్యులను ఈ నిర్మాణ కార్యక్రమాలలో భాగస్వాములను చేశారు. నేను వీరి సంఘాలలో రెండింటికి ఎన్నుకోబడ్డాను.

నాకు ప్రణాళికాబద్ధమైన గ్రామీణ జీవితంపై ఆసక్తి ఉంది. నేను వ్రాసిన ‘కిసాన్ స్పీక్సు’, నేషనల్ ప్లానింగు కమీషనుకు అందజేసిన రిపోర్టులు ఈ విషయాన్ని తెలియజేస్తాయి. గ్రామీణ భారతదేశపు ప్రణాళికాబద్ధమైన ఆర్థికాభి వృద్ధికి సలహాలు చెప్పాను. పట్టణాలకు మాత్రమే ఉపయోగపడే ‘బొంబాయి ప్రణాళిక’ను విమర్శించాను. గాంధీ ప్రణాళికను మెచ్చుకున్నాను. భారతదేశపు

ఆర్థికాభివృద్ధి మన వారసత్వ సాంఘికాభివృద్ధిపై ఆధారపడి ఉంటుంది. పునరావాసం, కుటీర పరిశ్రమలు, మధ్యతరగతి పరిశ్రమలు, వ్యవసాయాభి వృద్ధికి అవసరమయిన శాశ్వత సదుపాయాల కల్పన, రక్షణ, పెంపుదలలను ఒక విధానం ప్రకారం ఏర్పాటుచేయబడిన సామాగ్రి, గ్రామీణ ఋణ బాధ్యత, బహిరంగ విపణులు, గోడౌనులు, నీటివసతి, వరద నివారణ పథకాలు, భూమి కోత నివారణ చర్యలు, పురుగులు–అడవి జంతువుల నుండి రక్షణ వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరాను. స్వయంగా రైతులు అభివృద్ధి సాధించ గలరన్న కారణం వల్లనే నేనీ గాంధీ ప్రణాళికకు అంగీకరించాను.

ప్రాథమిక పరిశ్రమలను నెలకొల్పవలసిన అవసరం ఉంది. వీటికి కావలసిన డబ్బు, సాంకేతిక పరిజ్ఞానం, మనుషులు, మెషిన్లు సంతరించుకోవటానికి, విదేశాలతో సంప్రదించటానికి మనం స్వరాజ్యం వచ్చేవరకు ఆగాలి.

కుటీర పరిశ్రమలకు ఒక సలహా సంఘాన్ని ఏర్పాటుచేయాలని కోరాను. ప్రభుత్వం కుటీర పరిశ్రమలు రాష్ట్రానికి చెందినవని కొంతకాలం ఆపగల్గింది. నేను, ఇతర మిత్రుల తోడ్పాటుతో కుటీర పరిశ్రమలకు, చేనేత పరిశ్రమకు అనుమతి పొందాను. మిల్లు యజమానులు 1957 నుండి మాతో సహకరిస్తు న్నారు.

పరిశ్రమల మంత్రి శ్రీ శ్యామ్‌ప్రసాద్‌గారు కుటీర పరిశ్రమల బోర్డుకు అనుమతి నిచ్చారు. చేనేత కమిటీకి నన్ను ప్రథమాధ్యక్షునిగా నియమించారు. అన్ని కుటీర పరిశ్రమలు బోర్డు యాజమాన్యం క్రిందనే ఉండాలి. వివిధ రకాలైన కుటీర పరిశ్రమలు, శిక్షణా సంస్థలకు కావలసిన సమర్థులయిన వ్యూహకర్తలను, పని తెలిసినవారిని మన మధ్యనుండే తీసుకునేవారు. రక్షణశాఖ వారిని ఈ కుటీర పరిశ్రమల వస్తువులను కొనుగోలు చేయమని కోరారు. నన్ను, నాగపూర్ నుండి 'పణిక్కర్' గారిని 'నూలు మిల్లుల' సలహా సంఘంలో సభ్యులుగా నియ మించారు. మేము చేనేత పరిశ్రమకు కావలసిన సరుకులను చౌకగా ఇప్పించే వాళ్ళం. నూలు మిల్లుల యాజమాన్యం ఎక్సైజు డ్యూటీలో కొంత భాగాన్ని చేనేత పరిశ్రమకు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరేవాళ్ళం. 1951 లో మిల్లుల యాజమాన్యం సిద్ధాంతపరంగా దీనిని అంగీకరించింది.

1947 లో నాగపూర్‌లో మహాత్మాగాంధీగారి సమక్షంలో జరిగిన కాంగ్రెసు వర్కింగు కమిటీ జవహర్‌లాల్‌గారిని ఆర్థిక విషయాల కమిటీకి అధ్యక్షునిగా నియమించింది. నేను కూడా ఈ కమిటీలో సభ్యుణ్ణి. వ్యవసాయ ఉపసంఘానికి కన్వీనరుగా, సమావేశకర్తగా నియమించబడ్డాను. డా॥ జె.సి. కుమారప్ప కుటీర పరిశ్రమలకు కన్వీనరుగా నియమించబడ్డారు. ఈ రెండు సబ్‌కమిటీలు వార్ధాలో సమావేశమయ్యాయి. వ్యవసాయ ధరలు–పారిశ్రామిక ఉత్పత్తుల ధరల మధ్య సారూప్యత ఉండాలని, పూర్తి ఉద్యోగ భద్రత వ్యవసాయ కూలీలకు, రైతులకు ఉండాలని, సహకారీకరణ కూడా ఉండాలని నేను చెప్పాను. ఈ తీర్మానం కొద్ది మినహాయింపులతో ఆమోదించబడింది. ప్రత్యేకమయిన శ్రద్ధను పారిశ్రామిక వత్తిడి ఉన్న ఉద్యోగాలలోనూ, కుటుంబ పరిశ్రమలలోనూ, మధ్యతరగతి పరిశ్రమలలోనూ చూడాలని కుటుంబ పరిశ్రమల ఉపసంఘం ప్రత్యేకంగా చెప్పింది. ఈ రెండు సంఘాల సలహాలను ప్రధాన సంఘం ఆమోదించినది. కమిటీ అధ్యక్షుడైన నెహ్రూగారు మేము చెప్పిన విషయాలను వ్యతిరేకించారు. నెహ్రూగారూ, మేము చెప్పింది ఒక్కటే.

1946 లో నేను (కోపెనుహగన్ నుండి వచ్చిన తరువాత) మధ్యవర్తుల చేతులలో దగాపడుతున్న మత్స్యకారులను గురించి వివిధ రాష్ట్రాలవారితో చర్చించి వీరికి సహకార సంఘాలు ఏర్పాటుచేయాలని చెప్పాను. చాలా సహకార సంఘాలు ఏర్పాటయ్యాయి. ఈ సహకార సంఘాలకు ఋణాలు కూడా మంజూరు అయ్యాయి.

1935 నుండి అఖిల భారత చేనేత కార్మికులకు ఇచ్చిన సలహాలను ప్రభుత్వం ఇప్పుడు పెడుతున్నది. యుద్ధానికి పూర్వం రూ. 5 లక్షలుగా ఉన్న నిధి నేడు రూ. 10 కోట్లు ఎక్సైజు డ్యూటీగా మార్చబడింది.

శ్రమశక్తి చోదితమయిన మన కుటీర పరిశ్రమలు నేడు ఆర్థికంగా ముందున్నాయి. 1926 నుండి నా ఆక్స్‌ఫర్డ్ సిద్ధాంత వ్యాసంలో ఇదే చెప్పాను. నేతన్నలు సహకార సంస్థల నిర్మాణంలో పాలుపంచుకుంటున్నారు. మన ఖాదీ గ్రామోద్యోగ కమీషను ఇప్పుడు అఖిల భారత కుటీర పరిశ్రమల సంఘంలో నిధులను జమ చేయగల్గుతున్నది. అఖిల భారత చేతివృత్తుల కళాకారుల

సంఘానికి అధ్యక్షురాలుగా ఉన్న నా స్నేహితురాలు శ్రీమతి కమలాదేవి చటోపాధ్యాయ నేతృత్వంలో ఆడవారు తమ ఇళ్ళలో తామే స్వయం ఉపాధికి పాటుపడగల్గుతున్నారు. చేతివృత్తుల సంఘానికి నిధులు 'బాగానే' ఉండి, చేనేత పరిశ్రమకు సహాయంగా ఉన్నాయి. ప్రతి మగ్గానికి రూ. 300-00 లు పెట్టుబడి నివ్వడం, అమ్మకపు గృహాలను ఏర్పాటుచేయడం, 18 శాతం నుండి 24 శాతం వరకు తగ్గింపు ధరలివ్వడంతో చేనేత అమ్మకాలు ముందడుగు వేస్తున్నాయి. చిన్నతరహా పరిశ్రమలు విద్యుచ్ఛక్తి సహాయంతో తమ సొంత కాళ్ళమీద నిలబడగల్గుతున్నాయి.

చేనేతవారికి కావలసిన సహకారం సహకార సంస్థల ద్వారా అందించటంతో ఈ పనివారు సహకార సంస్థల పరిధిలోకి విస్తృతంగా వస్తున్నారు.

కేంద్ర నూనెగింజల సంఘం 1948 లో నిర్మించబడింది. దీనికి నేను ఉపాధ్యక్షుడ్ని. నూనె తీసే పనివారు రెండు మిలియన్ల మంది ఉపాధి పొందు తున్నారు.

ఖాదీ కమీషన్ నేడు ఈ కార్యక్రమాన్ని చేపట్టింది.

★ ★ ★

40. ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థ

మహాత్మాగాంధీ ఆశయాలకనుగుణంగా సాంఘిక, ఆర్థిక వ్యవహారాలపై కాంగ్రెసు పార్టీ తీవ్రంగా చర్చించింది. చాలా దీర్ఘంగా ఈ చర్చ సాగింది. పార్టీ ఈ చర్చకు తీర్మాన రూపం ఇచ్చింది. ఎ.ఐ.సి.సి. ఈ తీర్మానం ఆమోదించింది. శ్రీమతి కమలాదేవి చటోపాధ్యాయ, శ్రీ జయప్రకాశ్ నారాయణ ఈ తీర్మానాన్ని అంగీకరించారు. జవహర్‌లాల్‌గారు ఈ సంఘానికి అధ్యక్షులు. నేను ఒక సభ్యునిగా గాంధీగారి సలహామేరకు నియమించబడ్డాను.

ఈ ఆర్థిక సలహా సంఘం మూడు ఉపసంఘాలుగా ఏర్పాటుచేయబడింది.

1. వ్యవసాయం, 2. కుటీర పరిశ్రమలు, 3. వ్యవస్థీకృత పరిశ్రమలు.

ఈ సంఘానికి నేను, డా॥ జె.సి. కుమారప్ప, శ్రీ జి.యల్. నందా సంచాలకులం. రైతుల కోర్కెలు, వారి ఆస్తుల రక్షణ, పర వర్గాలతో పూర్తి సమానత్వం, ఉద్యోగ భద్రత కలిగి ఉండాలని నేనొక 'ముసాయిదా' తీర్మానం తయారుచేశాను. వ్యవసాయం, గ్రామీణ పరిశ్రమలపైన డా॥ కుమారప్పగారొక తీర్మానం తయారుచేశారు. భవిష్యత్తులో కంట్రోళ్ళకు దారితీయగలవని, ఆఫీసర్ల పిడికిళ్ళలో రైతులు చిక్కుతారని పంటలపై ఆంక్షలను వ్యతిరేకించాను. జయప్రకాశ్‌నారాయణ గారు కూడా ఈ సంఘ తీర్మానాలను చాలావరకు ఆమోదించారు. జవహర్‌లాల్ గారి అధ్యక్షతన కొద్ది మార్పులతో ఒక చిన్న పుస్తకంగా ఈ ముసాయిదా చిత్తు తీర్మానాలను ప్రచురించారు. ఎ.ఐ.సి.సి. దీనిని ఆమోదించింది.

ఎ.ఐ.సి.సి. జవహర్‌లాల్‌ను అధ్యక్షునిగా ఒక స్థాయీసంఘాన్ని (Standing Committee) నిర్మించింది. ఈ కమిటీలో నేను సభ్యుణ్ణి. అప్పుడప్పుడు ఇ.పి.సి. (ఆర్థిక సలహా సంఘం - Economic Programme Committee) సమావేశ

మయ్యేది. నేను, జనరల్ సెక్రటరీ అయిన శ్రీ శంకరరావ్‌దేవ్‌గారు ఈ సంఘ కార్యకలాపాలలో పాల్గొనే వారం. జవహర్‌లాల్‌గారు ఈ సంఘ కార్యకలాపాల ననుమతించారు. శ్రీ పటేలు గారు ఆలోచనలో పడ్డారు.

1948 ఎండాకాలంలో జాతీయ ప్రణాళికా సంఘ సమావేశాలు శ్రీ నెహ్రూ గారి ఇంట్లో జరిగాయి. సి.డి. దేశ్‌ముఖ్‌గారు ఆహ్వానితులు.

మేము గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణం గురించి ఆలోచిస్తుంటే జి.యల్. నందాగారు గ్రామాల సాంఘిక, ఆర్థిక స్వయంపోషకత్వాన్ని గురించి 'ప్లానులు' చెప్పేవారు. అతను అధికాహారోత్పత్తిని గురించి చెప్తూవుంటే జవహర్‌లాల్‌గారు ప్రతి విషయాన్ని ఈ దృష్టితోనే చూస్తూ ఉండేవారు. చిన్న రైతులు దేశానికి చేస్తున్న సేవను పట్టించుకోకుండా సహకార వ్యవసాయం భారీగా చెయ్యాలన్న ఉద్దేశ్యంతో ఉన్నారు. గ్రామాలవారిగా లెక్కలు తయారుచేసి గ్రామ ప్రణాళికలను రచించేవారు. గ్రామాలవారి లెక్కలు నాకు సంతోషమే. ప్రణాళికాబద్ధమైన ఉత్పత్తిమీద నాకు అభ్యంతరం లేదు.

రైతుల స్వయం ఉపాధి కల్పనను, వారనుభవిస్తున్న ఆర్థిక స్వాతంత్ర్యాన్ని అభివృద్ధి నిరోధకంగా జవహర్‌లాల్‌గారు తలచారు. నా తీవ్రమయిన నిరసనను జవహర్‌లాల్‌గారికి తెలియజేశాను. నా ప్రవర్తనపై వారు సంతోషంగా లేరు. రైతు తత్వాన్ని ఆయన అర్థంచేసుకోలేదు. రైతుల స్థితిగతులు పట్టించుకోకుండా మిల్లు కార్మికులకు చౌకగా ధాన్యం, ఇతర సరుకులు అందించటానికి నందాగారు మార్గాలు వెతుకుతున్నారు. ఇంతకంటె దురదృష్టకరమైన రోజులను నేను తరువాత ఇంకా ఎదుర్కోవలసి వచ్చింది. వారు ధాన్యం ధరను తగ్గించాలన్న ఉద్దేశ్యంతో ఉన్నారు. జవహర్‌లాల్‌గారు దీనికి తాన అంటే తందాన అంటు న్నారు. నేనడిగే గిట్టుబాటు ధరలపై వారికి ఆసక్తి లేదు. వారికి నేనడిగే వాటిలోని సాధ్యాసాధ్యాలు కానీ, న్యాయం కానీ మనస్సునకెక్కదు. నేను రైతుల కోసం ప్రతి విషయంలోనూ పట్టుదలతో ఉండటం జవహర్‌లాల్‌గారికి నచ్చలేదు. రైతుల సాంఘిక విలువలు, స్వేచ్ఛ కొరకు నేను మాట్లాడటం నెహ్రూగారికి సాంఘికాభివృద్ధికి అవరోధంగా కన్పించింది. రైతు సేవా సహకార సంస్థలు రైతు ఆర్థికాభివృద్ధికి రక్షణకవచాలనీ, తాను ఎంతో మనసుపడిన ఉత్పత్తులన్నీ

ఈ విధానంలో సాధించవచ్చని నేను నెహ్రూగారికి చెప్పేవాడిని. నాకు అర్థ మయింది తొమ్మిదిమంది రాజకీయ నేతలున్న కమిటీలో నేను ఏకాకినని (ఒంటరినని). 25 శాతం ఉన్న పట్టణ ప్రజలకొరకే వారు పాటుపడుతున్నారు.

శ్రీ దేవ్‌గారు, వారి సహాయకులు శ్రీ మిత్రాగారు కొన్ని ఉపయోగకరమయిన 'ముసాయిదా' తీర్మానాలను మాకు అందించారు.

జాతీయ ఆర్థిక కార్యక్రమంపై ఒక సదస్సు జరిగింది. కాంగ్రెసు ముఖ్య మంత్రులు, కాంగ్రెసులోని వివిధ శ్రేణులలోని నాయకులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ రెండు రోజుల సదస్సులో కాంగ్రెసు ముఖ్యమంత్రులు దేశంలోని ఆహార పరిస్థితి, కంట్రోళ్ళను సమీక్షించి, దేశంలోని పారిశ్రామిక ప్రగతిపై వారు తమ దృష్టిని కేంద్రీకరించారు. ఇంతకంటే ముఖ్యమయిన విషయాలను మరచిపోయారు.

శాశ్వత జాతీయ ప్రణాళికా సంఘం కావాలనే మా కోర్కెను అందరూ అంగీకరించారు.

తరువాత కొద్దికాలానికే జవహర్‌లాల్‌గారు తననే జాతీయ ప్రణాళికా సంఘ అధ్యక్షునిగా నియామకం చేసుకున్నారు. నన్నుగానీ, దేవ్‌గారిని గానీ పట్టించుకోలేదు. నాకు గతం గుర్తుకొచ్చింది. సుభాష్‌చంద్రబోసుగారు నెహ్రూగారిని జాతీయ ప్రణాళికా సంఘానికి అధ్యక్షునిగా చేశారు. నెహ్రూగారు బోసుగారిని ఈ జాతీయ ప్రణాళికా సంఘ సభ్యునిగా కూడా నియమించలేదు. ప్రణాళిక సంఘ సభ్యులు ఒక్కరు కూడా రైతులను పట్టించుకునేవారు లేరు. నేను పార్లమెంటులో తీవ్రమయిన విమర్శలు చేశాను. కోట్లాది రైతుల భవితవ్యం రక్షించవలసిన బాధ్యత, సంతృప్తికరంగా నిర్వహించవలసిన అవసరం ఈ సంఘానికి ఉందని చెప్పాను. కార్యవర్గంలోనే కాక, కార్యనిర్వాహకవర్గం (ఎగ్జిక్యూటివ్) ద్వారా కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీలో మార్పుకై కొంత ప్రయత్నం చేశాను. అనంతశయనం అయ్యంగార్, శంకరరావుదేవ్ ఈ కార్యక్రమానికి బలం చేకూర్చారు. కాంగ్రెసులోని పురోగమనవాదులతో కలసి పనిచేయాలని శ్రీ శ్యామప్రసాద్ ముఖర్జీగారు త్వరపడుతున్నారు. భారత వ్యవసాయ, పరిశ్రమల

శాఖ ఇతర శాఖలతో ఎలా పని చేయాలో తేల్చుకోవలసిందిగా కాంగ్రెసు నిర్వాహకసంఘానికి చెప్పాం. ముఖ్యమయిన పరిశ్రమలను ప్రభుత్వం చేపట్టాలి. పండిత నెహ్రూగారి సలహాలతో ఆర్థిక, వాణిజ్య, వ్యాపార మంత్రులను ఒక ముసాయిదా తీర్మానం తయారుచేయమని, తరువాత దీనిని విస్తృతంగా చర్చించ వలసినదని కోరాం. ఈ ముసాయిదా తీర్మానం జాతీయం చేసే వ్యాపారాలకు, ప్రభుత్వం అధికారంతో చేసే వ్యాపారానికి, ప్రభుత్వేతర అధికారంతో (ప్రైవేటు) చేసే వ్యాపారాలకు సంబంధించినదై ఉండాలి. బట్టలు, ఇనుము, ఉక్కు, ఖనిజాలు, పంచదార, సిమెంటు వంటి పరిశ్రమలకు నష్ట పరిహారమిచ్చి స్వాధీనం చేసుకొనే శక్తి ప్రభుత్వానికి లేదు. నూతనమయిన 'కీలక వ్యాపారానికి' ఆయుధాల తయారీ, విమానాల తయారీ, వైమానిక విద్యలకు 'రిజర్వు' చేయాలని కోరాము. సిద్ధాంతాల పిడివాదాన్ని వదలి ప్రైవేటు యాజమాన్యాన్ని ఆదరించాలి. నేను ప్రత్యేకంగా ఆర్థికపరమైన సివిల్ ఉద్యోగాలు (Special Economic Civil Services) ఉండాలని చెప్పిన సలహాను శ్రీ అయ్యంగార్, శ్రీ గాడ్గిల్‌గారు ఆమోదించారు. శ్యాంప్రసాద్ ముఖర్జీగారు మాతో ఏకీభవించారు.

పార్టీ ఈ విధానాన్ని కొద్ది సవరణలతో ఆమోదించింది. దీనిని తాత్కాలిక పార్లమెంటుకు సమర్పించాము. ఇది నేషనల్ ఇండస్ట్రియల్ పాలసీగా రూపు దిద్దుకుంది. నన్ను నాసిక్, జైపూర్ కాంగ్రెసు సమావేశాలలో వీటిని ప్రవేశపెట్ట మని కోరారు. నేను 'మిశ్రమ ఆర్థిక విధానం'పై మాట్లాడాను. మసానీగారంతకు పూర్వమే ఈ మిశ్రమ ఆర్థిక విధానంపై సిద్ధాంతవ్యాసం ప్రకటించారు.

1967 వరకు జవహర్‌లాల్‌గారు వీటిని అమలుచేయలేదు.

నేను 'శ్రామికులకు' కరువుభత్యం, బోనసు, కార్మికులకు వ్యాపారాల్లో భాగస్వామ్యం వంటి విషయాలపై పూర్తిగా మద్దతునిచ్చాను. సోషలిస్టులను, కమ్యూనిస్టులను ఈ విషయంలో అభినందించాలి. వారి విషయాలకు పూర్తి మద్దతును పరిశ్రమల శాఖామాత్యుడైన శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకిచ్చారు.

రాజేంద్రప్రసాద్ (కాంగ్రెస్ అధ్యక్షుడు) భూపరిమితులపై వ్యవసాయ సంస్కరణ సంఘంలో అధ్యక్షునిగా డా॥జె.సి. కుమారప్పను ఒక సభ్యునిగా నన్ను నియ

మించారు. నేను, O.P.R. రెడ్డి (మద్రాసు మాజీ ముఖ్యమంత్రి) గారు మైనారిటీ రిపోర్టు ఇచ్చాం. ప్రాథమిక భూకమతంకన్నా మూడు రెట్లు భూకమతం ఉండాలని రాజేంద్రప్రసాద్‌గారు నిర్ణయించారు. మేము 5 నుండి 10 రెట్లు ఉండాలని వాదించాం. మెజార్టీ సభ్యులు 'సహకార సేద్యాన్ని' ప్రజలపై రుద్దాలని కోరారు. మేము దీనిని వ్యతిరేకించాం. నిలకడయిన ధరలు, పంటలు-పశువులపై బీమా, చౌకగా రైతులకు రుణాలు, సర్వీసు కో-ఆపరేటివ్స్ (సహకార సేవా సంస్థలు) కు మేము మద్దతునిచ్చాం.

విదేశీ సహాయం, విదేశీ రుణాలు అవసరమేనని నేను, శ్రీ ఎస్.కె. పాటిల్ అంగీకరించాం. ఇవి విదేశీ విధానానికి మూలాలుగా (The Basis of Indian Foreign Policy) నేను 'ఈస్టరన్ ఎకనామిస్టు' పత్రికలో వ్రాశాను. (1948-49), 1952-53 లలో 'ప్రపంచ శాంతికోసం' (Towards World Peace) అనే పుస్తకాన్ని వ్రాశాను. ఇది ప్రచురించబడింది. శ్రీ యన్.వి. నాయుడు I.F.A.P. ప్రతినిధిగా (International Plat Forum) పారిస్‌లో మార్షల్‌ప్లానుపై తన అభిప్రాయాలు చెప్పారు. తన విదేశీ విధానానికి వ్యతిరేక మయినా జవహర్‌లాల్‌గారు ఈ మార్షల్ ప్లానును ఆమోదించారు. 'టిబెట్టు'పై తప్పుడు విధానం మినహా విదేశీ విధానాలన్నింటికీ నేను నెహ్రూగారికి మద్దతు నిచ్చాను. పాశ్చాత్య దేశాల ఆర్థిక సహాయం కొరకు వారు త్వరపడటంలేదు. వారి తాత్సారం నన్ను బాధించింది. విదేశీ రుణాల ఆవశ్యకతను వారు గుర్తించటంలేదు. I.M.P. వారు కూడా సంతోషంగా లేరు. విదేశీ రుణాలపై భారతదేశపు ప్రతిపాదనలేమిటి అని ఒక అమెరికన్ రాజకీయవేత్త నన్నడిగారు. ఈ విషయంపై నా స్పందన ఎలా ఉండాలి అని, నేను అమెరికన్లకు ఏమి సమాధానం చెప్పాలి అని నేను నెహ్రూగారిని అడిగాను. "ఏవిధమైన షరతులు లేని విదేశీ సహాయాన్ని ఆహ్వానిస్తున్నాం" అని వారన్నారు. ఈ హామీతో నేను 'శాన్‌ఫ్రాన్సిస్కో'లో 1948 అమెరికా రుణాన్ని త్వరగా అందజేయాలని వారితో వాదించాను. నేను శ్రీ మార్షల్‌గారిని (సెక్రటరీ ఆఫ్ స్టేటు) వాషింగ్‌టన్‌లో కలసి 'యూరోపు'కు ఇచ్చిన విధంగానే ఇండియాకు కూడా (ఏవిధమైన సైనిక ఒప్పందం లేకుండా) రుణ సహాయం అందివ్వవలసిందిగా కోరాను. 1948లో

వారు మా ప్రతిపాదనను పట్టించుకోలేదు. 1949 లో ప్రచ్ఛన్న యుద్ధం తీవ్ర మయింది. 'యుగోస్లేవియా'లో అమెరికా విజయాన్ని సాధించింది. సోవియట్ రష్యా, చైనాలు ఇండియా, ఇతర ఆగ్నేయాసియా దేశాలపైన సానుకూలంగా స్పందించసాగాయి. కాశ్మీరు యుద్ధం (దేశ విభజన) తరువాత భారతదేశంలో పరిస్థితులు బాగున్నాయి. కొరియా యుద్ధంలో ఇండియా పాత్రను అందరూ మెచ్చుకున్నారు. విదేశీ విధానం చర్చించటానికి అమెరికావారిని చాలామందిని (I.F.A.) భారత విదేశీ సహాయ సంస్థ ఆహ్వానించింది. అమెరికా సవతి తల్లి ప్రేమను వారికి తెలియజెప్పాను. 1949 జూన్‌లో నేను అమెరికా వెళ్ళేసరికి వారందరూ జవహర్‌లాల్‌గారి పర్యటనకు ఎదురు చూస్తున్నారు. జేమ్స్ పటాన్ (రైతు నాయకుడు) అమెరికన్ అధ్యక్షునితో నాకు సమావేశాన్ని ఏర్పాటుచేశాడు. ప్రెసిడెంటు ట్రూమన్ భారతదేశంతో స్నేహ సంబంధాలను కోరుతున్నారు. ట్రూమన్ ఏ 'బ్లాకు' (కమ్యూనిస్టు-అమెరికా) కు చెందని భారత్ పరిస్థితిని అర్థంచేసుకొన్నారు. "మీరు మా స్నేహితులకు స్నేహితులు" (అంటే కామన్వెల్తుకు) అని అన్నారు. అమెరికా వ్యవసాయదారుల - కూలీల స్నేహాన్ని మెచ్చుకున్నారు. భారత ప్రధాని పర్యటనకు వారందరూ ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు. నా చర్చల ఫలితాలను శ్రీమతి విజయలక్ష్మీపండిట్‌కు, మంత్రి బి.పి. సేన్‌కు తెలియజేశాను. "మేము నెలల తరబడి చేయలేనిదానిని మీరు ఒక వారం రోజులలో సాధించారు" అని వారభినందించారు. జవహర్‌లాల్‌గారికి, వారి ఆర్థికశాఖామంత్రికి నా చర్చల సారాంశాన్ని వ్రాసి ఇచ్చాను. అమెరికా రాజకీయ నాయకులపై నా అభిప్రాయాన్ని తెలియజేశాను. ఆ తర్వాత ఏం జరిగిందో నాకు అర్థంకాలేదు. జవహర్‌లాల్‌గారు 'వైట్‌హౌస్' నాయకులతో స్నేహంగా ఉండలేదు. రెండు సంవత్సరాలు ఇండో-అమెరికన్ సంభాషణల్లో తాత్కాలికంగా స్తంభన ఏర్పడింది. నేను చాలా నిరాశ చెందాను.

ఇది చాలదన్నట్లుగా భారతదేశంలో ఆహార సమస్య తీవ్రమయింది. 'కంట్రోళ్ళు' విధించినా పట్టణవాసులకు 'రేషన్లు' సక్రమంగా అందటంలేదు. ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కొందరు అమెరికా సెనేట్ సభ్యులు రెండు మిలియన్ టన్నుల ఆహార పదార్థాలను ఉచితంగా ఇవ్వటానికంగీకరించారు.

ఇతర సెనేటర్లు దీనిని వ్యతిరేకించారు. రెండు ప్రజాస్వామ్య దేశాలతో సత్సం బంధాలు కోరుకునే కొందరం, ఆహార బహుమతులు దిగుమతి చేయాలని కోరి, ఈ విన్నపాన్ని భారతదేశ ఆహార మంత్రికి, ఉప విదేశాంగ మంత్రికి ఇచ్చాం. హఠాత్తుగా జవహర్‌లాల్‌గారు పార్లమెంటులో 'టీ కప్పులో తుఫాను' సృష్టించారు. నెహ్రూగారి ఈ తొందరపాటు చర్యను పార్లమెంటులో శ్రీ మసాని గారు తీవ్రంగా దుయ్యబట్టారు. పటేలుగారు జాగ్రత్తపడి మా మధ్య చర్చ జరగకుండా చూశారు.

ఎనిమిది సంవత్సరాల తరువాత నెహ్రూగారు అమెరికా సహాయాన్ని బహుమతిగా గానీ, అప్పుగా గానీ తీసుకోటానికి, ఈ సహాయాన్ని N.E.S. (National Economic Scheme) స్కీములో ఖర్చు చేయటానికి అంగీక రించారు. పరోక్షంగా కొలంబో ప్లాను ద్వారా ఇండియాకు అందజేశారు. అమెరికావారి ఆర్థిక, దౌత్య సహాయం నేను, శ్రీ యస్.కె. పాటిల్, మరికొందరం ఈ సహాయంలోని విజ్ఞతను గుర్తించాం. జవహర్‌లాల్ (తన రెండవ అమెరికా పర్యటన, 1954) అమెరికా ఆర్థిక సహాయం, వ్యాపారవేత్తల సాయం నిరంతరం కొనసాగేలాగు, తద్వారా రెండవ, మూడవ పంచవర్ష ప్రణాళికల విజయానికి కృషి చేశారు. సర్దారు పటేలుగారు ఈ విషయంలో పెట్టనికోటలాగా నిలిచారు.

విదేశీ సహాయం హద్దులు దాటి వర్షించరాదని అమెరికా, రష్యాలు మరచి పోయాయి. ఈ సహాయం భారతదేశాన్ని ద్రవ్యోల్బణంవైపు నెట్టింది. ప్రణాళికా నిర్వహణలో అసమర్థత, వృధా వ్యయం, తక్షణ అవసరాలపైన, వ్యవసాయంపైనా నిర్లక్ష్యం పెరిగిపోయాయి. ఈ సహాయం ఈ రెండు దేశాలకు వాయిదాలు చెల్లించటానికి సరిపోవటంలేదు. రూపాయి విలువ పడిపోయింది. తినగా తినగా అమృతం కూడా చేదుగా ఉంటుంది. అందుకే 'రాజాజీ' గారు ఈ అప్పులు హద్దులు దాటుతున్నవి, జాగ్రత్తగా ఉండవలసిందని చెప్పారు.

★ ★ ★

41. రెండవ ప్రపంచ యుద్ధం

రెండో ప్రపంచ యుద్ధ కాలంలో బ్రిటనులో సోషలిస్టులు, ట్రేడ్‌యూనియన్లు భారతదేశపు జాతీయవాదాన్ని అర్థంచేసుకోలేదు. అమెరికాలాగా, రష్యాలాగా భారతదేశం కూడా స్వతంత్ర దేశమేనని, ఈ యుద్ధ పరిణామాలను తమంత తామే అంచనా వేసుకొనగలమని వారికి చెప్పాను. ఇంగ్లాండు తటస్థంగా ఉంది. 'జపానువారు' మంచూరియాను, తరువాత చైనాను ఆక్రమించారు. అబిసీనియాను ముస్సోలినీ నాశనం చేస్తున్నప్పుడు ఇంగ్లాండు, ఫ్రాన్సు, అమెరికాలు మంచూరియాకు ఏవిధమైన సహకారం చేయలేదు. ఇంగ్లాండు, ఫ్రాన్సువారు తమ జాతీయవాదం చెకోస్లోవేకియా ప్రజల త్యాగాలకన్నా ఎక్కువేనని తలచారు. పెరల్ హార్బరు బాంబింగ్ తరువాత నాజీలతో అమెరికా యుద్ధానికి దిగింది హిట్లర్‌తో పాటు. రష్యా పోలెండులో సగభాగాన్ని ఆక్రమించింది. భారతదేశం స్పానిష్, అబిసీనియా, చెకోస్లోవేకియాలకు సహాయం అందించింది. భారతదేశానికి స్వతంత్రమే ముఖ్యం. బ్రిటను మా స్వతంత్ర కాంక్షకు అంగీకారం తెలపాలి. వెస్ట్‌మినిస్టరు, పార్లమెంటు భవనాల నాశనం గాంధీగారికి ఎంతో ఆవేదన మిగిల్చింది. పారిస్ ఓడినప్పుడు సరోజినీనాయుడు గారి కవితాత్మ ఎంతగా కలతచెందిందో ప్రపంచానికంతకూ తెలుసు. జాతీయభావాలకు భారతదేశం ఎప్పుడూ కళ్ళు మూసుకోలేదు.

గాంధీగారిని విమర్శించిన ఇండియాలోని కమ్యూనిస్టులు రష్యా రెండవ ప్రపంచ యుద్ధంలో చేరగానే దీనిని 'ప్రజాస్వామ్య యుద్ధం'గా వర్ణించసాగారు. రాయవెల్లూరు జైలులో ఉన్న 350 మందిమి విభ్రాంతికి గురయ్యాం.

యుద్ధానికి మా పూర్తి సహకారం ఉంది. అయినప్పటికీ యుద్ధం కోసం

భారత స్వాతంత్ర్యాన్ని బలిపెట్టలేదు. బ్రిటను స్వాతంత్ర్యానికి ఎంత విలువ నిచ్చామో భారతదేశ స్వాతంత్ర్యాన్ని అంతకంటే ఎక్కువగా కోరుకున్నాం.

'దీనాస్టాక్', ఆమె ఐరోపా మిత్రులు మా జాతీయవాదాన్ని అంగీకరించారు. దీనాస్టాక్ వ్రాసిన ఉత్తరాలను జైలు అధికారులు త్రొక్కిపట్టారు. దేవీజీ ఐరోపా మిత్రుల అభిప్రాయాలను నాకు తెలియజేస్తున్నది. ఏ దేశం గెలిచినా రంగు జాతుల స్వేచ్ఛ కొరకు ఒక స్వతంత్ర సంస్థ ఏర్పాటు అవసరమని గాంధీగారికి చెప్పి వారనుమతి తీసుకున్నాను. ఆఫ్రికా-ఆసియావాసుల స్వాతంత్ర్యాన్ని 'ఫెన్నర్ బ్రూక్' బలపరచారు.

బర్మా, మలయాలలో జపాను ఓడినందుకు మేము బాధపడలేదు. జపాను వారు ఇండియాలో జొరబడటానికి వ్యతిరేకులం. నేతాజీ 'ఇండియన్ నేషనల్ ఆర్మీ'ని నిర్మించిన సంగతి నాకు తెలుసు. బ్రిటీషువారు ఇండియా నుండి వైదొలగాలి అన్నదే మా ఆశయం.

కాంగ్రెసు వర్కింగు కమిటీలో రాజాజీ, జవహర్‌లాల్ నెహ్రూ జపాను భారత దేశంలో ప్రవేశించటానికి తీవ్రంగా వ్యతిరేకులు. ఇంగ్లాండుతో గౌరవప్రదమైన ఒప్పందానికి సిద్ధపడ్డారు. బ్రిటీషువారు ఇండియాను జపానుకు వదలివేయ టానికైనా సిద్ధపడ్డారు కానీ భారత ప్రభుత్వం ఏర్పాటుకు అంగీకరించలేదు. ప్రతిష్ఠంభన కొనసాగింది. 'గ్లిమ్‌సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ' జాతీయ భారతానికి, తద్వారా రంగుజాతుల స్వాతంత్ర్యానికి బాటలు వేసింది. అహింసా స్ఫూర్తితో చేసే భారతదేశ ఘర్షణ రంగుజాతుల వారి స్వతంత్రానికి కీలకమయినదని గాంధీగారు చెప్పేవారు.

ప్రపంచ జాతీయ విప్లవ పాత్రను నేనర్థంచేసుకున్నాను. రంగుజాతుల ఏకైక రక్షకునిగా 'కోమిన్‌టరన్' (కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ - 1919-1948) చేస్తున్న సేవలో ప్రమాదాన్ని పసిగట్టలేకపోయాను. వెల్లూరు జైలులో 1940-42 లలో 'వలసలు-రంగుజాతులు' అనే పుస్తక రచన పూర్తిచేశాను. ప్రపంచంలోని ప్రజాస్వామ్యాలన్నీ వీరి స్వాతంత్ర్యాన్ని గుర్తించాలని నేనీ పుస్తకంలో చెప్పాను. 1942లో (కొద్దికాలం జైలులో లేను) గాంధీగారిని కలసి వలసలు-రంగుజాతుల వారి స్వాతంత్ర్య ఘర్షణ సమితి స్థాపనకు వారి ఆశీర్వాదాలు తీసుకున్నాను.

ఈ సంస్థకు దీనాస్టాక్, నేను కార్యదర్శులం. 1942–44 లలో జైలులో ఉండగా నా సిద్ధాంత వ్యాసం 'జాతీయ విప్లవానికి మార్గము–ప్రపంచ పాత్ర' ను రచించి 'కోమిన్‌టరన్' గాని మరియొక రష్యా భావజాలంపై గాని వీరు ఆధారపడ నవసరంలేదని చెప్పాను. నేను జైలు నుండి 1945–46 లలో ఈ సిద్ధాంత వ్యాసాన్ని గాంధీగారి ఆశీర్వాదాలతో ప్రచురించాను. కోమిన్‌టరన్ పెత్తనంలో ఉన్న దేశాల భావస్వాతంత్ర్యానికి దోహదకారిని కాగలిగాను.

యుద్ధం తరువాత పాశ్చాత్య దేశాలు (రెండవ ప్రపంచ యుద్ధం) బీదవిగా మిగులుతాయి అని 1942–43 లలో యం.యన్.రాయ్ చెప్పారు. ఈ మాటలను 'సీరియస్'గా మేము పరిగణించలేదు. ప్రచ్ఛన్నయుద్ధం–ఐరన్ కర్టన్‌లు (రష్యా) ప్రపంచ రాజకీయాధికారాన్ని శాసించిన తరువాత అణుశక్తి ప్రభావంతో పాశ్చాత్య సామ్రాజ్యవాదం ఆసియాలోను, అమెరికాలోనూ (1956–1965 లలో) కుప్ప కూలింది.

లేబర్‌పార్టీ–కన్సర్వేటివ్ మంత్రివర్గాలు, ఫ్రాన్సులో డిగాలే, ఆఫ్రికా ప్రజలకు స్వతంత్రాన్నంగీకరించాయి. నా మిత్రులయిన జోమోకెన్యటా, కోయీనాగీ, ములుంబోలు ఆఫ్రికా నేతలయ్యారు. మా శ్రమకు దక్కిన ఫలితమిది. ఈ విషయంలో 'ఫెన్నర్ బ్రూక్‌వే' (Fennr Brockway) అభినందనార్హుడు.

బ్రిటీషు సామ్రాజ్యవాదం కుప్పగూలుతుంటే కమ్యూనిస్టు సామ్రాజ్యవాదం తలయెత్తసాగింది. ఒకరకమైన సామ్రాజ్యవాదం ఒకవైపు నుంచి కుప్ప గూలుతుంటే వేరొక రకమయిన సామ్రాజ్యవాదం ఎనిమిది–తొమ్మిది తూర్పు ఐరోపా దేశాలలో కొత్తగా స్వాతంత్ర్యాన్ని సంపాదించిన దేశాలలో గుర్తించ లేనంత మెల్లగా తలయెత్తటం మొదలుపెట్టింది. అదే కమ్యూనిస్టు సామ్రాజ్య వాదం. నేను, మసానీ మొదటగా ఈ కమ్యూనిస్టు సామ్రాజ్యవాద విస్తరణను గుర్తించాము. స్టాలిన్–మావోల ఈ కమ్యూనిస్టు సామ్రాజ్యవాదాన్ని జవహర్‌లాల్ నెహ్రూగారు నిరసించలేకపోయారు. నేను ఈరకమయిన సామ్రాజ్యవాద విస్తరణను, ప్రజాస్వామ్య విలువల నాశనాన్ని, పోలెండు, హంగరీ, రుమేనియా, బల్గేరియా, యుగోస్లేవియా, చెకోస్లోవేకియా, ఇథోనియా, లాట్వా, విథనియాల్లో సహించలేకపోయాను. రూజ్‌వెల్టు, చర్చిల్, అట్లీ మొదలయిన పెద్దల హ్రస్వ

దృష్టిని తీవ్రంగా వ్యతిరేకించాను. పోలాండు ఉపాధ్యక్షుడు మికలోజెవిల్, హంగరీ ప్రధాని ఫెరన్స్ నాగీలు వాషింగ్టన్‌లో తలదాచుకున్నప్పుడు వారిని కలసి మాట్లాడాను (1954). కమ్యూనిజం నుండి విమోచన కొరకు వారు జరుపుతున్న సాహసవంతమైన ప్రయత్నానికి నా అభినందనలు తెలియజేశాను.

హంగరీలో కమ్యూనిస్టుల జాతీయవాదాన్ని సోవియట్‌లు అణచివేస్తుంటే జవహర్‌లాల్‌గారు చూస్తూ ఊరుకున్నారు. ఎట్టకేలకు హంగరీ ప్రజల తిరుగు బాటును 'ప్రజాయుద్ధం'గా నెహ్రూగారు చెప్పారు. నేను, మసానీ, జయప్రకాశ్ నారాయణ తదితర సోషలిస్టులం దీనికి బాధ్యులం.

సోవియట్ రాజ్యాన్ని విమర్శించలేకపోవటం భారత్‌కు చాలా నష్టాన్ని కలి గించింది. టిబెట్టులోను చైనా ఆక్రమించటాన్ని నెహ్రూగారు విమర్శించలేదు. మాలాంటివారం తీవ్రంగా విమర్శించాం. చైనా–ఉత్తర కొరియా, వియత్నాం, కంబోడియా, బర్మా, ఇండోనేషియాలో దురాక్రమణలకు సిద్ధమైంది.

చైనా 1962 లో భారతదేశంపై దురాక్రమణ చేసింది. పాకిస్తానుకు ఈ పాపంలో భాగముంది.

పాశ్చాత్య సామ్రాజ్యవాదం అంతరించినందుకు సంతోషిస్తున్నా, వేరొక రూపంలో సామ్రాజ్యవాదం తలయెత్తుతున్నది. ఇది ఒక సాంఘిక దుర్దశే.

★ ★ ★

42. విదేశీ విధానం-విదేశీ సహాయం

టిబెట్టు, కాశ్మీరు, చైనా, ఇజ్రాయిల్ దేశాలు మినహా అన్ని దేశాల విదేశీ విధానంలో జవహర్‌లాల్‌కు (1955-58) నేను మద్దతిచ్చాను. ఇండో-చైనాలో యుద్ధానంతరం శాంతి ఉంటుందని, 1954 లో పోర్చుగీసు మరికొన్ని ప్రాంతాలను ఖాళీ చేసినప్పుడు 'గోవా'కు కూడా స్వాతంత్ర్యం వస్తుందని నేననుకున్నాను. ప్రధానమంత్రితో పాటు నేను కూడా ఆగ్నేయాసియా కాన్ఫరెన్సును గర్హించాను.

బాండుంగ్ సమావేశం విజయవంతంకావటం (ఆఫ్రో-ఆసియా దేశాల సమావేశం) యుగోస్లోవియాలోను, కొన్ని అరబిక్ దేశాలు సంయుక్తంగా కలసి రావటం ప్రధానమంత్రికి పంచశీలను ప్రబోధించే అవకాశం వచ్చింది. బాండుంగ్ సమావేశం ప్రపంచ శాంతికి రాచబాటను వేసింది. నేను పంచశీల ఆవిర్భావం, ప్రపంచ శాంతి గురించి ఇండియా ఇంటర్నేషనల్ క్వార్టర్లీ జర్నల్ (త్రైమాసిక పత్రిక) లో వ్రాసాను. దీనిని నా స్నేహితుడు శ్రీ యన్.సి. పటేలుగారు ప్రచురించారు. ప్రపంచ ప్రభుత్వపు సమావేశానికి (World Govt. Conference) కాంగ్రెసు పార్టీ సెక్రటరీ జనరల్‌గా జవహర్‌లాల్‌చే ఆశీస్సులిప్పించాను. ఐక్య రాజ్య సమితిలో (18-24, ఏప్రియల్ 1955) ఇండోనేషియాలో జరిగిన సదస్సులో ఇజ్రాయిల్‌కు, అలానే చైనాకు సభ్యత్వం విషయాలలో నెహ్రూను ఒప్పించలేకపోయాను.

1948 నుండి అమెరికా, కెనడా, ఇంగ్లాండు, జపానులలో ప్రజాస్వామ్యానికి అనుకూలంగానూ, సోవియట్‌వారి కమ్యూనిజానికి వ్యతిరేకంగానూ ప్రచారం చేస్తూ, భారత ప్రధాని అసంతృప్తికి గురయ్యాం, భారతదేశానికి అధికంగా సహాయం చేయవలసిన బాధ్యత ఈ దేశాలకన్నిటికీ ఉంది.

పాకిస్తానుతో అమెరికా చేసుకున్న యుద్ధ ఒడంబడిక భారత అమెరికా మైత్రికి నష్టమని, సోవియట్ రష్యాకు చేరువకాదల్చుకున్న కొందరికి ఉపయోగ మని అమెరికా రాయబారి మిస్టర్ అలెన్సుకు తెలియజేశాను. ప్రధానమంత్రి కూడా తన తీవ్ర అసమ్మతిని తెలియజేశారు. ఆ యుద్ధ ఒడంబడిక నిజమైంది. పాకిస్తాను యుద్ధోన్మాదానికి దారితీసింది. ఏ భారతీయుడు అమెరికాపైన నమ్మకంతో లేడు. యు.యస్. ఆయుధాలు 'కచ్' దురాక్రమణలో ఏప్రియల్–మే నెలల్లో కశ్మీరులో భారత్‌కు దొరికాయి. అమెరికన్ అధ్యక్షుడు కెన్నడీ చైనా దురాక్రమణలో భారతదేశానికి చాలా సహాయం చేశాడు. కానీ కశ్మీరు సమస్య మనకు, అమెరికాకు మధ్య అడ్డుగోడగా నిలిచింది.

అమెరికా, రష్యాలు ఇప్పుడు భారతదేశానికి ఆర్థిక సహాయం చేయటానికి ముందుకొస్తున్నాయి. ఈ సహాయం భారతదేశ ఆర్థికశక్తికి నష్టం కల్గించే స్థితిలో లేదు. ప్రెసిడెంటు ట్రూమన్‌ను 1949 లోను, 1952 లోనూ ఆసియా ప్రజలకు చేస్తున్న ఆర్థిక సహాయం దయాగుణంతో మాత్రమే గాక ప్రజాస్వామ్య పరిపుష్టికి ఊతంగా ఉండాలని కోరాను. 1947–1956 లలో పాశ్చాత్య రాజకీయవేత్తలు, ప్రచారకర్తలు ఈ పవిత్ర యుద్ధంలో భాగం పంచుకోలేకపోయారు. ఒక దశాబ్దం వృధాగా గడచిపోయింది. భారత్–అమెరికాలు రైతులు, చేతివృత్తులవారికి సహాయం చేయలేకపోయాయి. మానవతా విలువలు, మానవ స్వేచ్ఛా స్వాతం త్ర్యాలు, ఏవిధమైన అడ్డంకులు లేని స్వపరిపాలన ఈ సమయంలో మనకు కావాలి.

అమెరికా రాజకీయ నాయకులు, ప్రచారకర్తలు చాలా మందకొడిగా స్పందిస్తు న్నారు. ఆసియా, ఆఫ్రికా ప్రజలు కమ్యూనిజానికి బలిపశువులుగా మారుతుంటే చూస్తూ ఉండలేము. ఆర్థికాభివృద్ధి కోసం భారతదేశం త్వరగా అడుగులు వేయాలని నేను, సర్ సి.వి. రామస్వామి అయ్యర్, టి.బి. కృష్ణమాచారి, రిజర్వు బ్యాంకు ప్రసాద్, పాత్రికేయుడు దుర్గాదాస్‌గార్లం ఈస్టరన్ ఎకనామిస్టు డి–కోస్టా సంపాదకుడు కోరుతున్నాం. వ్యాపారాల్లో, యూనివర్శిటీలలో, పరిశోధనా రంగాల్లో ఉన్న అమెరికా ప్రతినిధులు ప్రణాళికాబద్ధమైన సోవియట్ విధానానికి దగ్గరగా లేకపోయారు. రూజ్వెల్టు 'న్యూడీల్'ను అంగీకరించింది ఈ అమెరికా

యేనా అని ఆశ్చర్యపోయాను. ఇతోధికంగా ఆర్థిక సహాయం, వ్యాపార సహాయం ఆసియా–ఆఫ్రికా దేశాలకు చెయ్యాలని, లేనట్లయితే అమెరికా రాజకీయ–ఆర్థిక మనుగడకు అవరోధం కలుగుతుందని, కమ్యూనిజాన్ని అరికట్టలేదని నేనభి ప్రాయపడ్డాను.

అమెరికా ప్రతినిధి మిస్టర్ గ్రేడ్ మాటలు కూడా స్నేహపూర్వకంగా లేవు. 1948లో వారు ఊటీలో మాట్లాడుతూ "ఆసియాలో వాతావరణం అనుకూలంగా లేదు. అమెరికా ధనికులు పెట్టుబడికి సిద్ధంగా లేరు అనే పాత పాటను మళ్ళీ వల్లించారు. జవహర్‌లాల్‌గారు ఇతర భారతీయుల వలెనే తన కోపాన్ని ప్రకటించాడు. భారతదేశం తన కాళ్ళపై తాను నిలబడగలదని చెప్పారు. మిస్టర్ గ్రేడ్ మాటలకు నేను 1948 లో శాన్‌ఫ్రాన్సిస్కోలో నా తీవ్ర నిరసన తెలియ జేశాను. నేను మిస్టరు మోర్సు (డైరెక్టరు I.I.O.) గారితో భారతీయుల వైఖరి అర్థంచేసుకోవలసినదని కోరాను. నేను, మిస్టరు మోర్సు జనరల్ మార్షల్‌తో పశ్చిమ ఐరోపా దేశాలకు చేస్తున్న సహాయం ఇండియాకు కూడా చెయ్యాలని కోరాం. కానీ వారు పశ్చిమ ఐరోపా సమస్యతోనే సతమతమవుతూ మా మాటలు పట్టించుకోలేదు. శ్రీ జె.యం. అగర్వాల్ ఏర్పాటుచేసే ఇండియా విదేశ విధాన సమావేశాలలో, అమెరికా విజ్ఞానులను, రాజకీయవేత్తలను ప్రపంచ ప్రయోజనాల దృష్ట్యా భారతదేశానికి, ఆసియాలోని ప్రజాస్వామ్య దేశాలకు వారి ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు అందించమని కోరాను. వారు తాము అమెరికాతో మాట్లాడి మార్షల్ ప్లానును భారతదేశానికి కూడా విస్తరించేటట్లు చేస్తామని చెప్పారు.

మా మాటలు, వ్రాతలు, పరిచయాలు, ఆసియా పరిస్థితిపై మా అవగాహన, రష్యా–అమెరికాల వారిపై విసురుతున్న సవాళ్ళు అమెరికాలో మార్పు తెచ్చాయి.

కమ్యూనిస్టుల కోపానికి కారణమయిన ప్రెసిడెంటు ట్రూమన్‌తో నా చర్చను ఇక్కడ ఇస్తున్నాను–

ట్రూమన్‌తో ముఖాముఖి చర్చలను నేను కోరాను. నేషనల్ ఫార్మర్స్ యూనియన్, అమెరికా ఫారం అసోసియేషన్ స్టేట్ డిపార్ట్‌మెంటు ద్వారా ఈ ముఖాముఖికి అంగీకరింపజేసింది. ఇండియా రాయబార కార్యాలయానికి ఇది ఒక వింత.

"ఐరోపాలోని విభేదాలలో కలుగజేసుకోవటం భారతదేశానికి భావ్యంకాదని, భారతదేశం తటస్థంగా ఉండటమే తగినదని నేను ట్రూమన్‌కు చెప్పాను. వ్యవసాయం, రైతు బడ్జెట్టు, ఋణ సహాయం, రసాయనిక ఎరువులు, కరువు బీమా, నీటిపారుదల, విద్యుత్, సమాచార సంపద, ఇతర శాశ్వత సదుపాయాలు వెంటనే అందుబాటులోకి రాకపోతే, భారతదేశం రష్యా ప్రభావానికి లోనవు తుందని" చెప్పాను. అమెరికా అధ్యక్షుడు అంగీకరించాడు.

అభివృద్ధి చెందిన దేశాలలో అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాల సాంకేతిక పరిజ్ఞానం, కీలక యంత్రసామగ్రి ఎలా ఉపయోగపడతాయో ట్రూమన్ చెప్ప సాగాడు. నా చొరవను మెచ్చుకున్నాడు. నెహ్రూగారి అమెరికా పర్యటన సందర్భంగా తాను కాంగ్రెసు (అమెరికా చట్టసభ) ను ఒప్పించటానికి ప్రయత్నం చేస్తానని, నేనడిగిన 4 బిలియన్ల సహాయం అందచేయకపోయినా భారీగా రుణ సహాయం చేస్తానని వాగ్దానం చేశాడు.

అధికార పర్యటన కాకపోయినా, రైతు నేతగానే వెళ్ళినా అమెరికన్లు తమ స్నేహభావాన్ని నాకు పంచారు.

దురదృష్టవశాత్తూ భారత ప్రధాని నే కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేదు.

నాలుగు సంవత్సరాల తరువాత తన పంచవర్ష ప్రణాళిక విజయం కోసం భారత ప్రధాని తన పర్యటన ఎంత ముఖ్యమో గ్రహించారు. అమెరికా ప్రభుత్వం మరి ఒక నాలుగు సంవత్సరాల తరువాత స్పందించింది. నేను, యస్.కె.పటేలు, కె.యం. మున్షీ తదితరుల ప్రయత్నాలు ఎనిమిది సంవత్సరాలు ఆలస్య మయ్యాయి.

భారత ప్రధాని భారతదేశపు వనరులు చాలవని గ్రహించి, తన ఆర్థిక మంత్రులను, భారత దౌత్యవేత్తలను అమెరికా పంపి అమెరికావారితో మాట్లా డించటం మొదలుపెట్టారు. విదేశీ సహాయం సాంకేతిక పరిజ్ఞానం కొరకు చర్చలు సాగించారు. దీని ఫలితంగానే వేలకొలది మిలియన్ల ధాన్యాన్ని భారత దేశం అమెరికా నుండి బహుమతిగా పొందింది.

తరువాత 1952, 1954, 1964 లలో నేను అమెరికా వెళ్ళినప్పుడు పాయింట్ 4 ప్రణాళిక, (సాంకేతిక సహాయం – అభివృద్ధి చెందుతున్న దేశాలకు చేసేది). కొలంబో ప్రణాళికల క్రింద అమెరికా సహాయం చాలదని, మార్షల్ ప్లాను బాగా ఉపయోగపడుతుందని అమెరికావారికి చెప్పాను.

చాలామంది డెమోక్రాట్లు – లార్డ్ బాయిడ్ ఓర్, శ్రీమతి రూజ్‌వెల్టు, ఇండియాలో అమెరికా రాయబారి మిస్టరు చెస్టర్‌బౌల్స్‌లు ఈ సంతోషకరమయిన వాతావరణానికి కారణం. వారందరికీ నా ధన్యవాదాలు. మిస్టర్ చెస్టర్ బౌల్స్ వ్రాసిన 'రాయబారి నివేదిక – శాంతికి కొత్త అంచులు' (The Ambassodars Report - The New Horizons of Peace) అమెరికాను తూర్పుదేశాల వైపు చూసేటట్లు చేసింది.

రష్యా కొత్తగా అందజేస్తున్న సహాయం నాకు చాలా సంతోషం కల్గించింది. రష్యావారిచ్చే మనఃపూర్వకమైన అప్పు, కీలక సేవలు, బిలాయ్‌లో అతి భారీ ఇనుము–ఉక్కు కర్మాగారం, హెవీ మిషన్ల తయారీ ఫాక్టరీ, నూనె వెలికితీసే సాధనాలు, అమెరికా, బ్రిటన్‌లతో పోటీగా చేస్తున్న సహాయం, ప్రాథమిక పరిశ్రమలు భారతదేశానికి ఆశాకిరణాలు. సంవత్సరానికి నిర్దేశిత ఉక్కు 6 మిలియన్ టన్నులు, బొకారోలో మరియొక స్టీలు ప్లాంటు, భారీగా నూనె వెలికితీత కార్యక్రమాలు, నౌకా నిర్మాణ కేంద్రాలు తీరానికిరువైపులా నిర్మించ బడుతున్నాయి.

★ ★ ★

43. విదేశీ విధానం-విదేశీ పర్యటనలు

గాంధీ జయంతి (అక్టోబరు 2, 1956) పాములపాటి బుచ్చినాయుడు కళాశాలలో జరుపుకున్నాము. ఆ సభకు నేను అధ్యక్షత వహించాను. శ్రీ శ్రీమన్నారాయణగారు కాలేజీ ప్రిన్సిపాల్. సోషల్ సర్వీసు లీగులో పనిచేసిన ఆ కాలేజీ అధ్యాపకులను, విద్యార్థులను అభినందించాను. పాములపాటి బుచ్చినాయుడు కళాశాల ఆడిటోరియంకు శంకుస్థాపన చేశాను. అదేరోజున పారిస్ నుండి కేబుల్ వచ్చింది. నవంబరు 1వ తేదీన అంతర్జాతీయ రైతు కాంగ్రెసుకు అధ్యక్షత వహించవలసినది అని సారాంశం. కాలేజీ నుండి రాగానే భారతీదేవి ఈ కేబుల్‌ను నాకందించింది. ఇంత తక్కువ వ్యవధిలో నా ప్రయాణానికి ఆమె అనుమతించదేమో అనుకున్నాను. ఆమె సంతోషంగా ప్రయాణానికి నా బట్టలు సర్దడం మొదలుపెట్టింది. ఆ రోజు రాత్రే నేను ఢిల్లీ బయలుదేరాను.

నేను పారిస్ వెళ్తూ ఒక రోజు 'రోమ్'లో గడిపాను. మార్షల్ ప్లానును పారిస్, రోమ్ ఉపయోగించుకోకపోతే ఈ రెండు నగరాల పరిస్థితి ఏమిటి? పోలెండు-హంగరీ వలెనే ఈ దేశాల పరిస్థితి ఉండేది.

ఇండియా రాయబారి 'టివీ' గారి ఇంట్లో మధ్యాహ్నం భోజనం. వారు ఇండియన్ నేషనల్ ఆర్మీలో పనిచేసిన దేశభక్తుడు. బి.ఆర్. సేనుగారు డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చరల్‌గా ఎన్నికయ్యారు. అమెరికావారు ఈ విషయంలో సాయం చేశారని టివీగారు చెప్పారు. ఈ ఎన్నిక శ్రీ సేన్‌కు గౌరవప్రదం.వెనుకబడిన దేశానికి చెందిన శ్రీ సేన్‌ను అమెరికా సపోర్టు చేయటం వెనుకబడిన దేశాల అభివృద్ధిని మనసులో ఉంచుకొనే. శ్రీ సేన్‌గారు మూడు

సార్లు ఇదే పదవికి ఎన్నికయ్యారు. 1967 లో రిటైరయ్యారు. ఈ సంస్థనొక కుటుంబంలా పనిచేయించారు.

అక్టోబరు 30 న పారిస్ చేరాను. నవంబరు 1వ తేదీన అంతర్జాతీయ రైతు నాయకులను (International Peasant Union - I.P.U.) గ్రాండ్ హోటలులో కలిశాను. 1954 లో న్యూయార్కులో జరిగిన సభకు, ఇప్పుడు పారిస్‌లో జరుగుతున్న సభకు తేడా ఉంది.

ఫెరన్స్ నాగీ

ఐ.పి.యు. సమావేశానికి ముందే ఇంగ్లాండు, ఫ్రాన్సులు సూయజ్ కాలువను జాతీయం చేయాలని ప్రెసిడెంటు నాసర్‌ను కోరాయి. హంగరీ విప్లవ కమ్యూనిస్టు యువత సోవియట్ దురాక్రమణను ఆపే దశకు చేరుకుంది. తూర్పు ఐరోపా దేశాలలో కమ్యూనిజం వెళ్ళగొట్టబడుతుందన్న ఉత్సాహంతో నేతలందరూ ఉన్నారు. యువకులందరూ సోవియట్ ఉపగ్రహ కూటమి నుండి విముక్తి చెందుతామన్న సంతోషంలో ఉన్నారు. నా స్నేహితుడు ఫెరన్స్ నాగీ నాతో మాట్లాడి పాశ్చాత్య దేశాల సహాయం హంగరీ స్వాతంత్ర్య యోధులకు అందజేసేటందుకు అదే రాత్రి బయలుదేరి వెళ్ళాడు.

కమ్యూనిస్టు నియంత పాలన అంతంకావటం నాకు సంతోషాన్నిచ్చింది. భారతదేశంలో కొన్ని రాష్ట్రాలలో కమ్యూనిజం అధికారం సంపాదించినా భారత ప్రజ హంగరీ ప్రజల వలెనే తిరుగుబాటు చేసి కమ్యూనిజంను వెళ్ళగొట్టగలరన్న నమ్మకం నాకు కల్గింది. నేనీ సందర్భంగా 'World Role of National Revolution' (జాతీయ విప్లవంలో ప్రపంచ పాత్ర) మరియు 'Outlines of National Revolution' (జాతీయ విప్లవ రూపురేఖలు) అనే పుస్తకాలను వ్రాసాను. తిరుగులేని-అణచరాని విప్లవ పోరాటం చేసిన హంగరీ యువత అభినందనీయం. కొద్దిరోజుల క్రితమే పోలాండు యువత 'పౌజాంజొ' నుండి సోవియట్ సామ్రాజ్యవాద సైన్యాలను తిప్పికొట్టింది. నేనీ సందర్భంగా చేసిన ఉపన్యాసాన్ని (I.P.U.) అందరూ మెచ్చుకున్నారు. నేనీ హంగరీ తిరుగుబాటు నుండి స్ఫూర్తి పొందాను. ఆంధ్రలో రాజకీయ నష్టం వలన కలిగిన నిరాశ నుండి నేను తేరుకున్నాను.

రైతుల నెత్తిమీద కత్తి లాగా భయపెడ్తున్న జవహర్‌లాల్‌గారి సహకార వ్యవసాయ భయం కూడా పోయింది. ప్రజల తిరుగుబాటు వల్లనే 1959 లో కేరళలో కమ్యూనిస్టు మంత్రివర్గం పడిపోయింది. నా రెండవ ఐ.పి.యు. కాంగ్రెసు ఉపన్యాసంలో ప్రజాస్వామ్య శక్తుల గురించి, మానవ హక్కుల గురించి, సాంఘిక రాజకీయ వికేంద్రీకరణను గురించి మాట్లాడాను. నా ఉపన్యాసం ఏకాధిపత్యానికి వ్యతిరేకంగా (కమ్యూనిజం) ఉందని అందరూ మెచ్చుకున్నారు. ఇది ఒక బాధ్యతగా తీసుకొని ప్రపంచంలో ఎక్కడ సామ్రాజ్యవాదం ఉన్నా – దానిని తిరస్కరించమని కోరాను. తూర్పుదేశాల ఇష్టానికి వ్యతిరేకంగా కాంగ్రెసు ప్రవర్తించింది. బాండుంగ్ ఒప్పందంలోని తూర్పుదేశాలు తూర్పు ఐరోపావారితో మెలగటంగానీ, సోవియట్ రష్యావారి అదుపు ఆజ్ఞలలో ఉండటంగానీ చేయరాదని చెప్పాను. నా అభిప్రాయాలను మిస్టర్ మైకేల్ (Mr. Miclozenyx), డాక్టరు డిమెట్రోవులు, ఇతర సభ్యులు అభినందించారు. హంగరీ–ఈజిప్టులలో జరిగిన పరిణామాలపై జనవరి 1957 న పత్రికలలో వ్రాసాను.

హంగరీలో తిరుగుబాటు చాలా విషాదంగా ముగిసింది. సోవియట్ అధికారులు హంగరీ ప్రధాని ఇమర్‌నాగితో ఒప్పందం చేసుకొనేవరకు వచ్చారు. ఇది పోలెండులో వారు చేసుకున్న ఒప్పందం వంటిదే. హంగరీ నుండి ఇంటిముఖం పట్టిన సోవియట్ సైన్యాలు మరలా హంగరీని అదుపులోనికి తీసుకోవటానికి వెనుదిరిగాయి. ఆంగ్లేయులను, ఫ్రెంచివారిని ఆదర్శంగా తీసుకున్నాయి. రెండు విశాలమయిన సామ్రాజ్యవాదాలను ఇక్కడ మనం గమనించవచ్చు.

మిస్టరు రోనాల్డ్, అతని ఇండియన్ పెంపుడు కూతురు జేన్ నాకు జన్మదిన శుభాకాంక్షలు లాంకుషైరులో చెప్పారు. మిస్టర్ రోనాల్డు గతంలో నిడుబ్రోలులోని మిషను ఆసుపత్రిలో పనిచేశారు. చోర్లేగారు, వారి శ్రీమతి నా పుట్టినరోజు సందర్భంగా వారింట్లో విందు ఇచ్చారు.

'హౌస్ ఆఫ్ కామన్సు'లో ప్రతిపక్ష నాయకుడు మిస్టర్ హ్యూగెయిట్‌స్కిల్‌ను (Mr. Hugaitskill) కలిశాను. ఇంగ్లీషువారు తమ సామ్రాజ్యవాదాన్ని వదలనంత కాలం రష్యావారు, చైనావారు తమ సామ్రాజ్యవాదాన్ని వదలరని చెప్పారు.

ఈడెను (Eden) ప్రభుత్వాన్ని విమర్శిస్తూ వారు పార్లమెంటులోనూ బయట చేస్తున్న విమర్శలను నేను మెచ్చుకున్నాను. వారు కూడా లేబరు పార్టీకి మద్దతిస్తున్న భారతదేశాన్ని కొనియాడారు. కామన్‌వెల్తులోని తూర్పుదేశాలకు బ్రిటనులో అధిక సంఖ్యాకులు మద్దతునిస్తున్నారని చెప్పారు. హంగరీలో జవహర్ లాల్‌గారి తటపటాయింపును తప్పుపట్టారు. ఈజిప్టులో ఆంగ్లేయుల-ఫ్రెంచివారి జోక్యానికి తమ నిరసన తెలిపారు.

'అట్లీ'గారు, నేను 1954 లో మానవ హక్కులపై మాట్లాడుకున్న విషయాలు నా జ్ఞప్తికి వచ్చాయి. ప్రపంచ ప్రజాస్వామ్య దేశాల త్యాగాలు, చేసిన పోరాటాలు, సాధించిన విజయాలు, మానవ హక్కులకై కన్నుమూసిన త్యాగధనుల గురించి అట్లీగారు ఈ సందర్భంగా గుర్తుచేసుకొన్నారు. సామ్యవాద విజయానికి మానవ స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం ప్రధానంగా ఉండాలని వారన్నారు. నిజమైన డెమొక్రాట్ లాగా, సామ్యవాదిలాగా తన వృద్ధాప్యం కారణంగా గెయిట్‌స్కిలును తన తరువాత ప్రతిపక్ష నాయకునిగా నియమించారు. మేము మరలా ఒకసారి 1955 లో కలిశాము. మా పాతిక సంవత్సరాల స్నేహాన్ని నెమరువేసుకున్నాం.

ప్రపంచ ప్రభుత్వపు సమాఖ్య నాయకులు క్లెమెంటు వెబ్‌ను, గిల్బర్ట్ మెక్‌లిస్టర్‌ను నా లండను ప్రయాణంలో కలిశాను. పాకిస్తానుపై ప్రేమను ఏవిధంగా కన్పరుస్తున్నది, భారతదేశాన్ని ఏవిధంగా అపార్థం చేసుకున్నదీ నేను తెలుసుకోగలిగాను. వారిని ఈ విషయంలో ఒప్పించటం కష్టసాధ్యమని గుర్తించాను. 1954 లో 'న్యూయార్కుటైమ్స్' సంపాదకులతో కూడా నాకిదేవిధ మయిన అనుభవం ఉంది. కశ్మీరు మహారాజావారి ఆహ్వానంతోను, నేషనల్ కాన్ఫరెన్సు వారి పిలుపుతో మాత్రమే ఇండియా కశ్మీరులో ప్రవేశించింది. పాకిస్తాను తన ఆయుధ బలంతో కశ్మీరులో కాలుబెట్టింది.

నేను రెండవసారి అంతర్జాతీయ సహకారోద్యమ ఆఫీసులో (International Co-operative Alliance - I.C.A.) సహకారోద్యమాన్ని గురించి మాట్లాడాను. తూర్పుదేశాలలో సహకారోద్యమాన్ని గురించి మాట్లాడాను. తూర్పుదేశాలలో సహకారోద్యమాన్ని విస్తృతపరచటం గురించి చర్చించాం. సహకారోద్యమంలో

ప్రభుత్వ జోక్యం నష్టం కలిగిస్తుంది. గ్రామీణ రుణ సహాయానికి ఐ.సి.ఏ. వారు సుముఖంగా లేరు.

రిజర్వు బ్యాంక్, ప్రభుత్వాధికారులు, రాష్ట్ర మంత్రుల సలహాలతో పాట్నా అఖిల భారత సహకార యూనియన్ ఎనిమిది సంవత్సరాలు నడచింది. అధికారుల జోక్యం, పెత్తందారీతనంతో మేము చాలా విసుగుచెందాం. జవహర్ లాల్‌గారు కూడా ప్రభుత్వం చాలా తప్పు చేసింది అనే అభిప్రాయానికి వచ్చారు. నేనీ సభలో మంత్రులను తమ సలహాలు మాత్రమే ఇవ్వవలసినదని కోరాను.

భారతదేశంలోని సహకార సంస్థలపై ప్రభుత్వపు నూతన విధానాన్ని గురించి బ్రిటీషు కో-ఆపరేటివ్ జర్నల్‌లోనే కాక, అన్ని సహకార పత్రికలలోనూ నేను వ్రాసిన వ్యాసం ప్రచురింపబడింది. ప్రభుత్వం ఇప్పటికీ తన పద్ధతిని మార్చుకో లేదు. సహకార వ్యవస్థపై తన పెత్తనాన్ని వదులుకోలేదు. నా సలహాలను వినే స్థితిలో లేదు.

నేను చాలామంది ఆఫ్రికా నాయకులను జార్జి పెడ్‌మోర్ (క్రాన్‌లీ స్ట్రీటు - Cranle street) గారి ఇంటిలో లండనులో కలిశాను. నన్ను వారికి పరిచయం చేస్తూ వారింట్లో గల నా ఫోటోను, నాతోపాటు ఆ ఫోటోలో ఉన్న ఆసియా-ఆఫ్రికా స్వాతంత్ర్యోద్యమ నాయకుల ఫోటోలను కూడా వీరికి చూపించారు. డా॥ నుక్రుమా సామాన్యప్రజల ఆర్థిక స్థితిగతులను ఏవిధంగా అధ్యయనం చేస్తున్నది, బ్రిటీషు సామ్రాజ్యవాదులు ఏవిధంగా నైజీరియా నాయకుల ప్రయత్నా లను ఆలస్యం చేస్తున్నదీ చెప్పారు. నేను వారితో జవహర్‌లాల్ ఫ్రాన్సును ఒప్పించటానికి కృషి చేస్తున్నారని చెప్పాను. ఇండియా సుహృద్భావం వలన (జెనీవా కాన్ఫరెన్సులో) ఫ్రెంచి, ఇండోచైనా, మొరాకో, టునసీయాలలో సంపూర్ణ స్వాతంత్ర్యం సంపాదించుకొంటున్నారని చెప్పాను. 'టువర్డ్స్ వరల్డ్ పీస్' (ప్రపంచ శాంతికోసం) అని నేను వ్రాసిన (1953 లో ప్రచురించబడింది) పుస్తకంలో బాండుంగ్ సభ నిర్ణయాలను, నేను ముందుగా ఊహించిన తీరును, సరియైన నిర్ణయాలను, నేను ఊహించిన విధానాన్ని, ఈ నిర్ణయాలను అభివృద్ధి లేని దేశాలలో ఎలా సాధించాలి అన్న విశ్లేషణను నేను పొందుపరచిన పద్ధతిని

వారు అభినందించారు. వారు వ్రాసిన 'పాన్ ఆఫ్రికనిజం వర్సెస్ కమ్యూనిజం' పుస్తకానికి నా అభినందనలు తెల్పాను. (జార్జి పాడ్‌మోర్)

డా॥ నుక్రుమా

జార్జి పాడ్‌మోర్ 1958 లో చనిపోయారు. వారు ఆఫ్రికాలోని రంగుజాతుల వారి స్వతంత్రం కోసం విశేష కృషి చేశారు. వారు 'పాన్ ఆఫ్రికన్ కాంగ్రెసు'కు ముఖ్య నేత. వారు వ్రాసిన పుస్తకాలు పాశ్చాత్య దేశాలవారికి కనువిప్పు కలిగించాయి. డా॥ నుక్రుమా, ఆతని స్నేహితులు 'జార్జి'కి అశ్రుతర్పణాలందించారు. వారి సహచరునిగా నేనెంతో అదృష్టవంతుణ్ణి.

నైజీరియా, కెన్యా, ఉగాండ, న్యూజిలాండు 1965 లలోనే స్వాతంత్రం సంపాదించుకొన్నాయి. జోమోకెన్‌యట్టా, కోయినాగి కెన్యా రిపబ్లిక్‌కు నాయకులయ్యారు. జార్జి బ్రతికివుంటే ఎంత సంతోషించేవాడో!

నా మిత్రుడు ఫెన్నర్ బ్రూక్ మా ఉభయుల స్నేహితుడు, పత్రికా విలేకరి శ్రీ ధన్‌మన్‌కర్‌ను కలిశాను.

వయస్సు పైబడినా అతనిలో వార్ధక్య ఛాయలు ఏమాత్రం లేవు. కెన్యా పది సంవత్సరాలలో స్వతంత్ర దేశమవుతుందని చెప్పారు. అతను కొత్తగా వ్రాసిన 'Struggle for Freedom' (స్వేచ్ఛ కోసం సంఘర్షణ) ను మెచ్చుకున్నాను. 1965 లో 'పీపుల్స్ కాంగ్రెసు' లో నా ఉపన్యాసం అతనికి నచ్చింది. వారి స్వాతంత్ర్య కృషికి భారత నాయకుల తోడ్పాటును కొనియాడారు. జవహర్‌లాల్ గారి మిశ్రమ ఆర్థిక విధానం – చైనాటైపు కమ్యూనిజంపై అతని అభిప్రాయం (వ్యతిరేకత) అలానే ఉంది. జవహర్‌లాల్ పెట్టుబడివాది కాదని, భారతదేశంలో పారిశ్రామికాభివృద్ధికి, ప్రైవేటు భాగస్వామ్యం కూడా అవసరమని, మిశ్రమ ఆర్థిక విధానాన్ని అందులకే బలపరుస్తున్నాడని చెప్పాను. ఫెన్నర్ బ్రూక్ నాతో ఏకీభవించాడు.

రైతు ఆర్థికతను చైనాలోని సామూహిక వ్యవసాయ కేంద్రాల ఆర్థికత వలె మార్చాలనే జవహర్‌లాల్‌గారి ఆలోచనలను వ్యతిరేకించాను. ఫెన్నర్ బ్రూక్ విచారం వ్యక్తం చేశాడు. ఇంగ్లాండులో రైతాంగ విధానం మరల రాగలదని, స్వంత ఉద్యోగాలు పెరగగలవని వారాశించారు. పెరుగుతున్న పారిశ్రామికీకరణ

స్వయం ఉపాధిని బలహీనపరచగలదేమో అని భయపడ్డారు. కోయినాగి డిక్టేటరుగా మారాడు. అధికారం నుండి తొలగించబడ్డాడు.

బ్రెయిల్స్ ఫోర్డు మరణం : భారతదేశ మిత్రుడయిన హెచ్.యన్. బ్రెయిల్స్ ఫోర్డును మరలా కలుసుకోవాలనుకున్నాను. తీవ్ర అనారోగ్యం కారణంగా వారెవరినీ చూడటంలేదు. వారికి 80 సంవత్సరాలు. గత 50 సంవత్సరాలుగా స్వేచ్ఛ కొరకు, ప్రజాస్వామ్యం కొరకు అవిశ్రాంతంగా రచనలు చేస్తున్నాడు. గాడ్విన్ మరియు షెల్లీ సాంప్రదాయాలకు కట్టుబడి వారి ఆదర్శాలను అధ్యయనం చేశాను. 1922 నుండి నా చదువులో ఎంతో సహాయకారి, నా ఐరోపా పరిచయాలకు ఆద్యుడు. 1922-26 లలో వారి సాహచర్యం వలననే సామ్యవాదం, ప్రజాస్వామ్యం, రాజకీయ సంస్థల వికేంద్రీకరణ, రైతు ఆర్థిక స్థోమతలలో ప్రజాస్వామ్య ప్రాముఖ్యతలపైనా దృష్టి నిలిపాను. 1957 లో వారు మరణించారు. ప్రపంచమంతా నివాళులర్పించింది. సమకాలిక రాజకీయ నాయకులందరూ వారి నివాళులతో నిండిన ఒక 'ఆల్బమ్'ను వారి భార్యకు బహూకరించారు.

హారాల్డ్ లాస్కీ : అట్టడుగు ప్రజల, దేశాల స్నేహితుడు, మేధావి అయిన హారాల్డ్ లాస్కీ మరణం నన్ను బాధించింది. నడివయస్సులో క్రూరమయిన మరణం వారిని మామధ్య లేకుండా చేసింది. రంగుజాతుల స్వేచ్ఛ కొరకు జరుగుతున్న పోరాట నేపథ్యంలో వారు మామధ్య లేకుండాపోయారు. సమకాలీన రాజకీయంపై వారు వ్రాసిన 'Liberty of Modern State' (ఆధునిక రాజ్యాల స్వేచ్ఛ) సిద్ధాంతవ్యాసం మానవహక్కుల ప్రేమికులకు-స్వేచ్ఛను కోరే మానవాళికి కరదీపిక.

కోల్ మరణం : వారి అనారోగ్య కారణంగా 'కోల్'ను కూడా చూడలేకపోయాను. వారు కూడా సృజనాత్మక వాతావరణంలో 'లాస్కీ' లాగానే 'మిల్స్' స్వతంత్ర ఆలోచనలకు, 'రాబర్టు ఓవెన్' సహకార కామన్వెల్తుకు, స్వయం ఉపాధికి, మధ్య యుగాల స్వయంపాలనకు ప్రచారకర్త. పాశ్చాత్య సామ్యవాదులను, లిబరల్స్‌ను, ఆసియా ఆఫ్రికా స్వతంత్రవాదులను వారి వ్రాతలు ప్రభావితం చేశాయి. నేను ఇంగ్లాండు వెళ్ళిన ప్రతిసారి వారిని వారింట్లో కలిసేవాడిని.

ప్రపంచ ప్రజాస్వామ్యం వారి నిష్క్రమణతో బీదదైంది. 1959 న మౌలంకర్ నిర్వహిస్తున్న 'లాస్కీ' కేంద్రాన్ని నేను, రాజాజీ కలసి చూశాము.

నేను లండనులో ఉండగా సర్ హోవర్డ్-డి-గులివాతో నా స్నేహాన్ని పెంచుకున్నాను. వారు సి.పి.ఎ.కు సెక్రటరీ జనరల్. ప్రజాస్వామ్య మూలాలపై సి.పి.ఎ. ఇంగ్లీషులోనూ, ఓరియంటల్ భాషలలోనూ (తూర్పుదేశాల భాషలలోనూ) ప్రచురించిన గ్రంథాన్ని గురించి పలుసార్లు వారితో చర్చించాను. 1952 లో ఒట్టోవా చర్చలలో నా ఉపన్యాసం వారిని ఆకర్షించింది. పార్లమెంటు సభ్యులపై వారి ప్రభావం చాలా ఎక్కువగా ఉంది. వారిచ్చే విందులలో ఆర్థర్ హాండర్సన్, మోర్గన్, క్లెమెంట్ వెబ్, లార్డ్ హోమ్‌ను కలిసేవాడను.

1946 నుండి నా సహచరులైన సర్ జేమ్స్ టర్నర్, మిస్టర్ నోల్స్ (Knowles) లను బ్రిటీషు హౌస్ ఆఫ్ అగ్రికల్చర్‌లో కలిశాను. వారు స్వతంత్ర ఐరోపా ఆర్థిక విధానం గురించి ఆందోళనలో ఉన్నారు. ప్రభుత్వం చేపట్టే రైతు వ్యతిరేక విధానాలను నేషనల్ యూనియన్ ఆఫ్ ఫార్మర్స్ (జాతీయ రైతు సంఘం) అడ్డుకోగలదనే ఆశావహ దృక్పథంలో ఉన్నారు. భారతదేశంలో రైతులు నెహ్రూను అలా అడ్డుకోగలరా? రైతులు పశ్చిమ ఐరోపాలో ఉమ్మడి మార్కెట్లపై గందరగోళంలో ఉన్నారు.

బల్గేరియా : శ్రీ యస్.కె. పటేలుగారు నన్ను 1957 లో బల్గేరియా పర్యటనకు ఆహ్వానించారు. వారి కో-ఆపరేటివ్ ఫార్మింగ్ అనేది కమ్యూనిస్టు గుత్తాధిపత్యానికి మారుపేరు. నేను, పటేలుగారు కలసి జెనివాకు 10 జూన్, 1957 కు చేరాం. నేను జెనివాలో ఉండగా నా 1955 అనుభవాలను, స్విట్జర్లాండులోని ప్రజాస్వామ్యానికి - రష్యాలోని నియంతృత్వానికి గల భేదాలను, రిఫరెండమ్ (ప్రజాభిప్రాయ సేకరణ), రికాల్ (ఎన్నికైన సభ్యులను తిరిగి పిలవటానికి - పార్లమెంటు/అసెంబ్లీ) విషయాలలో భారతదేశంలో నేనేవిధంగా అపజయం పాలైంది కూడా వారితో చెప్పాను. స్విట్జర్లాండులో లాగానే ఇండియాలో కూడా (కులాలు - మతాలు) ప్రజాస్వామ్య పార్టీలకు దామాషా ప్రాతినిధ్యం (Proportional Representation) ఉంటే బాగుంటుందని నా అభిప్రాయం వెలిబుచ్చాను. ఏ పార్టీకి చెందని, అన్ని పార్టీలవారితో ప్రభుత్వం ఇండియాలో

బాగుంటుందని, లేనట్లయితే ఫ్రాన్సులో వలే కుళ్ళిపోయే అవకాశముంటుందని చెప్పాను. ఇది సాధించాలంటే ఎంతో ఓర్పు, నేర్పు కావాలి. యువ ప్రజాస్వామ్యం అయిన భారతదేశంలో ఇది సాధ్యమా? జయప్రకాశ్ నారాయణగారు కూడా ఇదే ఆలోచనలను వెలిబుచ్చారు. రాజాజీగారు పార్టీలతో సంబంధం లేని, సామర్థ్యం కలవారిని ఎన్నుకోమని చెప్తున్నారు.

ఒరిస్సా, కేరళ, బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్‌లలో కాంగ్రెసు బలంగా లేదు. ఈ పరిస్థితులలో స్విట్జర్లాండు తరహా మంత్రివర్గ సంఘాలను ప్రవేశపెట్తే బాగుంటుందని నా అభిప్రాయం. ఒరిస్సాను పార్టీలో దొంగలకప్పజెప్పారు. కేరళలో అధ్యక్ష పాలన – అంటే నియంతృత్వానికి తెర తీసారు. 17 సంవత్సరాలు తిరుగులేని అధికారం చలాయించినవారికి నా మాటలు నచ్చకపోవటం వింత కాదు.

వియన్నా విమానాశ్రయం వద్ద చాలామంది 'జూ' (Jews–యూదులు) కుటుంబాలను – టెల్‌అవీవ్ (పాలస్తీనా రాజధాని) కు వెళ్తున్నవారిని చూశాను. వారు ఈ స్వతంత్ర ఆస్ట్రియారాజ్యాన్ని వీడి వారి కలల రాజ్యమయిన 'పాలస్తీనా'కు వెళ్తున్నారు.

సోఫియాలో : మేము 'సోఫియా'ను 11వ తేదీ రాత్రికి చేరుకున్నాము. మరుసటి రోజు వారి 'సహకార కాంగ్రెసు'(Cooperative Congress) కు హాజరయ్యాను. రెండువేల మంది వచ్చిన ఈ ప్రదర్శనను 'కమ్యూనిస్టులు' ఎంతో చక్కగా తీర్చి దిద్దారు.

నేను భారత సహకార సంస్థల సందేశాన్ని ఈ సమావేశంలో వినిపించాను. ఈ సమావేశంలో స్వతంత్ర ప్రజాస్వామ్య లక్షణాలను, సహకార సంస్థల నియంత్రణను, 20 కోట్ల స్వతంత్ర భారత రైతుల ఆర్థిక స్వాతంత్ర్యాన్ని, రైతు ఆర్థికతలో ఉన్న లాభనష్టాలను – సహకార క్షేత్రాలతో పోల్చి అక్కడ హాజరయిన కమ్యూనిస్టులందరికీ చెప్పాను.

మమ్మల్ని యుగోస్లేవియా పార్లమెంటు మెంబరు, కమ్యూనిస్టు నాయకుడు, మిత్రుడు మిస్టర్ పోపోవిక్ ఆహ్వానించారు. వారి అందమయిన కుమార్తె బ్రాంకే మాకు అనువాదకురాలు.

స్టాంబులోస్కీ : 13 జూన్‌న 'బల్గేరియా' రైతు నాయకుడు, యం. అలెగ్జాండర్ స్టాంబులోస్కీ స్మృత్యర్థం ఏర్పాటుచేయబడిన మ్యూజియం సందర్శించాం. స్టాంబులోస్కీ బల్గేరియా ప్రథమ రైతు ప్రధాని. వీరిని పార్లమెంటులోనే భూస్వాములు హత్య చేశారు. వీరికి మా అంజలి ఘటించాం.

14వ తేదీన వారి ఊరయిన 'స్లావట్సా' వెళ్ళాం. హరిత విప్లవానికి గుర్తుగా వారి పుట్టినరోజు సందర్భంగా వారంతా 'పచ్చజెండాలు' చేపట్టారు. రైతుల పార్టీకై నినాదాలిచ్చారు. 'గ్రీన్ ఇంటర్నేషనల్' పద్ధతిలో 'సాల్యూట్' చేశారు. మేము ఐ.పి.యు. వాతావరణంలో ఉన్నట్లుంది.

నేను ఇండియన్ ప్రొఫెసర్‌నని, గ్రీన్ ఇంటర్నేషనల్ అభిమానినని వారిలో ఎవరో నన్ను గుర్తుపట్టారు. ఒక్కొక్కరు త్వరత్వరగా వచ్చి కరచాలనం చేసి 'ఇట్టే' మాయమయ్యేవారు. వారు కమ్యూనిస్టులకు జడిసి వారి పరిచయాన్ని ఇంత అర్థాంతరంగా ముగించుకున్నారని నేను అర్థంచేసుకొన్నాను.

'స్టాంబులోస్కీ' జన్మించిన చిన్న కుటీరాన్ని, వారిని కాపుకాసి హత్య చేసిన రెండంతస్తుల భవనాన్ని కూడా చూశాను. వారి గుర్తుగా ఒక 'బడి', ఒక ఆడిటోరియమ్, ఒక గ్రంథాలయం వారి జన్మదిన సందర్భంగా నిర్మించారు.

ఆ అసంఖ్యాక రైతు సమూహంతో నన్ను మాట్లాడమన్నారు. వారందరూ ట్రక్కులు, లారీలతో అక్కడకు 'తోలబడిన' సహకార వ్యవసాయదారులే. వారి నుండి నేనెంతగా ఉత్సాహాన్ని పుంజుకొన్నది నా ఉపన్యాసం, నా ప్రవర్తన ద్వారా చెప్పాను. వారి నాయకుడు (స్టాంబులోస్కీ) కేవలం వారి జాతీయ నాయకుడే కాదు,ప్రపంచ రైతులందరికీ నాయకుడు. నేను వ్రాసిన 'రివల్యూషనరీ పెజెంటు' (విప్లవ రైతు) లో 'స్టాంబులోస్కీ' ఆలోచనలను, విజయాలను, త్యాగాన్ని ఎలా ప్రశంసించింది తెలియజేశాను. 'అలగ్జాండర్ స్టాంబులోస్కీ' ప్రపంచంలో ప్రఖ్యాత నాయకుడు, అమరుడు. భూస్వాముల భుజకీర్తులు, హోదాలు, గొప్పదనాలు నేడు కనుమరుగయ్యాయి. వారు బల్గేరియన్ రైతాంగానికి చేసిన సేవ ఒక్కటే గుర్తుంటుంది.ప్రపంచ రైతాంగం అంతా వారిని గుర్తుంచుకొంటారు. అధికార దాహం ఉన్నవాళ్ళు, అధికారానికి బానిసలు ఒక మంచి పాఠం వారి

జీవితాన్నుండి నేర్చుకోవాలి. రైతు ప్రజాస్వామ్యం, రైతుల సామ్యవాదం, స్వతంత్రం, శాశ్వతమైనవి. గుత్తాధిపత్యం అశాశ్వతం. వారి రైతుల పార్టీ ఝండా (జెండా) వారి 'బ్యాడ్జిల' గుర్తుగా ఇండియా కూడా ఇదేవిధమైన చిహ్నాలు ఏర్పాటుచేసే ఉద్దేశ్యంతో ఉందని చెప్పాను. ప్రపంచంలోని రైతుల ఆశలు, ఆశయాలు ఒక్కటే. అందువలన రైతులంతా కలసి కార్మికుల వలె పోరాడాలి. అప్పుడే శ్రమజీవుల నిజమైన ప్రజాస్వామ్యం వెల్లివిరుస్తుంది.

ఈ సమావేశం జరిగిన వెంటనే వారి స్మృత్యర్థం ఒక అంకితసభ జరిగింది. ఒక అమరుడైన ప్రజానాయకుని కుమార్తె, పార్లమెంటు మెంబరు, ప్రఖ్యాత నటీమణి కుమారి మార్గరిటా, ఇతర నాయకులు ఈ అంకితసభలో పాల్గొన్నారు. ఆమె చక్కటి ఇంగ్లీషులో అక్కడ ఉన్న నాయకులను నాకు పరిచయం చేసింది. కమ్యూనిస్టు నాయకత్వం రైతు నాయకులను ముగ్గురిని మంత్రివర్గంలోకి తీసు కున్నది. భోజనానంతరం ఉపన్యాసాలలో అందరూ స్టాంబులోస్కీ రైతాంగ విధానాలకు అంకితమయ్యారు.

15 జూన్‌న బల్గేరియన్ స్వాతంత్ర్యానికి, సాహిత్యానికి కేంద్రస్థానమయిన జాతీయ సంఘారామాన్ని దర్శించాం. ఇది కొండల మధ్య ఉన్నది. కమ్యూనిస్టు జైళ్ళ నుండి కొద్దికాలం క్రితమే విడుదలయిన కొందరు రైతు నాయకులను కలిశాను.

16 జూన్‌న రైతుల ఆఫీసుకు ఆహ్వానించారు. అక్కడ పార్లమెంటులో భూస్వాములు హత్య చేసిన రైతు నాయకుడు 'రాడిక్' (Radick) శిలాఫలకం గోడమీద ఉంది. వెలుపలవైపున 'స్టాంబులోస్కీ' అతిపెద్ద విగ్రహం ఉంది. అక్కడ ఆడిటోరియంలో చాలామంది రైతు నాయకుల చిత్రాలున్నాయి. అక్కడ రైతుల పార్టీ నాయకులు మంత్రులు కమ్యూనిస్టులతో తమ 'సహజీవనాన్ని' గురించి చెప్పారు.

17 జూన్‌న 'సోఫియాకు' వీడ్కోలు పలికాను. సోఫియా దగ్గరలో ఉన్న కొన్ని వ్యవసాయ కేంద్రాలను శ్రీ బి.జె. పటేలు, నేను చూశాం. అక్కడ రైతులు 'రొట్టెలు' మాత్రమే తింటున్నారు. చాలా చౌకబారు దుస్తులు వేసుకున్నారు.

మా విచారణలో సాహసప్రవృత్తి, మంచి ప్రవర్తన గల రైతులకు ఆ ప్రక్కనే మంచి పొలాలు ఎక్కువగా పంట పండిస్తారనే ఉద్దేశ్యంతో ఇవ్వబడ్డాయి. రైతులు సమిష్టి వ్యవసాయం, సహకార వ్యవసాయంలో కూడా కలసి జీవించగలరని అర్థమైంది.

శ్రీ బి.జె. పటేలు పోలెండు, జెకోస్లోవేకియా వెళ్ళారు. అక్కడ రైతులకు భూములిచ్చారు. రైతుల ఆర్థిక విధానానికి ఇది ఒక బలమైన ఉదాహరణ. సహకార వ్యవసాయంతో పోటీపడి రైతు ఆర్థికత (Farmer's Economy) నిలద్రొక్కుకుంది. 'గోముల్కా' ఈ వాస్తవాన్ని ఒప్పుకొన్నందుకు నా ధన్యవాదాలు. (ఇప్పుడు గోముల్కా మరల ఛాందసవాద కమ్యూనిస్టులతో కలుస్తున్నాడు.) ఏదియేమైనా సాంప్రదాయక రైతు వ్యవసాయ విధానం కమ్యూనిస్టు దేశాలలో కూడా మరల మరలివస్తున్నది. యుగోస్లోవియాలోని కమ్యూనిస్టు నాయకులు తమ సహకార వ్యవసాయం వదలాలని, రైతులకు వారి వారి భూములనివ్వాలని గోముల్కా పోలెండులో కోరుతున్నాడు.

అన్ని పద్ధతులకన్నా రైతాంగ ఆర్థిక విధానమే మేలని, ప్రోత్సాహకాలను సహకార వ్యవసాయం ఇవ్వలేదని, వ్యవసాయ ఉత్పాదకాలలో పొదుపు, జాగ్రత్త రైతాంగ ఆర్థిక విధానంలోనే హెచ్చు అని అక్కడి రైతులు చెప్పారు.

సోవియట్ గుత్తాధిపత్యంలో వీరికి స్వతంత్రం లేదు. మనఃస్ఫూర్తిగా వీరు పనిచేయలేరు. ప్రభుత్వ ఉత్పాదక రంగాలలో సాన్నిహిత్యం రైతులను రాష్ట్రపు అదుపులో ఉంచుతుంది. వ్యవసాయ ఉత్పత్తిని నియంత్రించటానికి, రైతులకు వినియోగ వస్తువులు అందించటానికి ఇది ఒక మార్గం. దీనికి ఆ దేశాలలో రైతులు సుముఖంగా లేరు. ఐచ్ఛికంగా రైతులు ఈ విధానంలో చేరుతున్నట్లు లేరు. సహకార సంస్థలు రాష్ట్రాధికారంలో భాగమే. రాష్ట్ర సంచాలకుని అధికారంతో పరోక్షంగా నిర్వహింపబడుతున్నవి.

'వియన్న'లో ఆగాను. అక్కడ పార్లమెంటు భవనానికి వెళ్ళాను. రాజరికం ఒలకబోస్తున్న ఈ భవనాన్ని 'హాప్స్‌బర్గ్' నిర్మించాడు. రాచరికంలో మంత్రులుగా ఉన్న మెటర్‌నిక్ వంటివారి దెయ్యాల గృహమది. ఈరోజున 80 మంది శాసన

సభ్యులు అందులో కొలువుతీరారు. ఈ చిన్న ఆస్ట్రియా దేశం ఈ పెద్ద భవనాన్ని ఆక్రమించుకొన్నది. రెండు ఆర్టు గ్యాలరీలను (కళామండపాలను), రూబెన్సు ప్రఖ్యాత చిత్రాలను చూశాను. మేరియా ఆంటోనిటో (ఫ్రాన్సు), (గతంలో ఆస్ట్రియా రాణి) నివసించిన ప్రదేశాన్ని చూశాను. అత్యంత సుందరమయిన 'మొగల్ చిత్ర కళాఖండాలు' అక్కడ గోడలపై ఉన్నాయి. సోవియట్‌ల నుండి విడబడి ఆస్ట్రియా ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని మన ఇండియా దౌత్యవేత్తలు చెప్పారు. వియన్నా ఇతర దేశాలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని, పరిశ్రమలకు కావలసిన సామాన్లు అందచేయగల స్థితిలో ఉంది.

1955 లో ఏథెన్సు నగరాన్ని, అక్కడి చారిత్రక కట్టడాలను ఆక్రోపోలీష్ కొండ నుండి ఇతర దేశాల యాత్రీకులతో కలసి చూశాను. ఆహ్లాదకరంగా మా సంభాషణలు సాగినయ్. సోక్రటీసుకు మరణశిక్ష విధించిన ప్రజాస్వామ్యం పతనమైంది. పెరిక్లిస్ గ్రీకువీరులకు నివాళులర్పిస్తూ చేసిన అద్భుత ప్రసంగం మా మనస్సులకు నచ్చింది. మా గ్రీకు స్నేహితుడు యం.టాకిసు గ్రీకు దేవతలను, ఆచారాలను టర్కీతో జరిగిన యుద్ధాలను గురించి చెప్పారు. ఆ అందమయిన గ్రీకు శిల్పాలను మెలమెల్లగా సున్నితంగా స్పృశించి ఆనందించాము.

ఈ సందర్భానికి గుర్తుగా మేమంతా ఒక గ్రూపుగా ఉంటే బాగుంటుందని ఎవరో సలహా ఇచ్చారు. పెరిక్లిస్ గ్రూపుగా దీనిని పిలిచారు. అధ్యక్షునిగా నన్ను ఎన్నుకున్నారు. అర్ధరాత్రి వరకూ మా సంభాషణలు సాగాయి. ఇ. హెచ్‌ట్రాట్, ఐ. కద్రాస్‌లను సెక్రటరీలుగా ఎన్నుకున్నారు.

గ్రీసులో అధికారం కోసం యుద్ధం చేస్తున్న బ్రిటీషు రష్యాలు ముఖ్యమైన చర్చనీయాంశం. మిస్టర్ టాకిసు ఆ యుద్ధం స్థానిక గ్రీకులకు (లిబరల్స్‌కు), కమ్యూనిస్టులకు మధ్య జరుగుతుందని, తనకు తగిలిన గాయాలను కూడా చూపాడు. తాను ప్రజాస్వామ్యం కోసం పోరాడినట్లు చెప్పాడు. ఇండియాలోని పత్రికారంగం కమ్యూనిస్టులను వెనుక వేసుకొచ్చింది. 1967 లో గ్రీసు మరల మిలటరీవారి చేతులలోనికి వెళ్ళింది.

నేను అమెరికాలో 6వ ఇంటర్నేషనల్ పెజెంటు యూనియన్ (I.P.U.) సమావేశాన్ని ప్రారంభించటానికి 1964 లో వెళ్ళాను. అప్పటినుండి నేను,

క్రాస్ (న్యూయార్కు), ఇ.ట్రాటు మంచి స్నేహితులం. 1965 లో ఇ. ట్రాట్ ఇండియాలో నన్ను, రాజాజీని కలసింది.

నేను ఇండియా వచ్చిన నా మిత్రుడు 'డిమిట్రోవ్'ను రంగాభవన్‌లో కలిశాను. వారు, వారి భార్య ఇద్దరూ 'బల్గేరియా' కమ్యూనిస్టుల నుండి పారిపోయి ఇండియా వచ్చారు. స్టాంబులోస్కీని గురించి చెప్పి వారి జన్మదినానికి హాజరుకమ్మని చెప్పారు. ఉద్వేగవంతమైన విషయాలు మా ఇరువురి మధ్య చోటుచేసుకొన్నాయి. వారి కుమార్తె సోఫియాను బల్గేరియాలో కలవలేకపోయాను. మా మిత్రులు కమ్యూనిస్టులతో రాజీపడ్డందుకు విచారం వ్యక్తంచేశారు.

డిమిట్రోవ్ తాను పంజాబు, రాజస్థాన్, బొంబాయి, హైదరాబాద్ రాష్ట్రాలు పర్యటించానని, ఇద్దరు ముగ్గురు కాంగ్రెసు మంత్రులను కలిశానని, వారంతా 'కృషికార్ లోక్‌పార్టీ' మద్దతుతో రైతులకై పోరాడుతున్నానని చెప్పారు. వారు నా మిత్రులు సిహెచ్. సూరజ్‌మల్ దారాభాయి అమీను, వాంఖేడ్, నాతూరామ్ మిర్జా, డా॥ చెన్నారెడ్డి, యన్.వి. నాయుడు, లచ్చన్న, ఓబుల్‌రెడ్డిలను కలిశానని చెప్పారు. కాంగ్రెసు నాయకులలో కె.యల్.పి. నాయకత్వ ఆలోచనా విధానం వర్ధిల్లుతున్నందుకు వారు చాలా సంతోషించారు.

II

డిమిట్రోవ్ నా కాంస్య విగ్రహ ప్రతిష్ఠ కోసం విజయవాడ వచ్చారు. ఆ కార్యక్రమం వాయిదాపడింది. అతను ఈలోపు జపాను సందర్శించి మరలా ఈ కార్యక్రమానికి హాజరుకాగలనని చెప్పారు. వారు 'నిడుబ్రోలు' వెళ్ళి 'గోభూమి'లో భారతీదేవిని కలుసుకోవాలనుకున్నారు.

1958 జూన్ 8న అలంకరించిన ఎడ్లబండ్లపై నిడుబ్రోలు చేరాం. రైతాంగ విద్యాలయం వద్ద వారికి స్వాగతం పలికాం. విద్యాలయపు అధికారులు 1934 నుండి నేటిదాకా ఆ విద్యాలయపు విజయాలు వారికి చెప్పారు. డిమిట్రోవ్ తన ఉద్వేగపూరితమైన ఉపన్యాసంలో 'నిడుబ్రోలు'ను స్లావోట్సా (స్టాంబులోస్కీ జన్మభూమి) తో పోల్చారు. ఈ రైతాంగ విద్యాలయం ఆసియాకంతటికీ మార్గ దర్శకత్వం వహించగలదన్నారు. తనను కలిసిన మంత్రులందరితో 'ప్రపంచ

కర్షకులారా ఏకంకండి' అనే రంగా నినాదం పాశ్చాత్య దేశాలలో మారుమ్రోగు తుంది. అంతర్జాతీయ రైతు నాయకులు రంగాగారిని తమ నాయకుడను కొంటున్నారని అన్నారు.

నేనీ సందర్భంగా నా రచన 'క్రిడో ఆఫ్ వరల్డ్ పెజెంట్రీ'ని వారికి బహూక రించాను (1958 జూన్ 23న).

దేవీజీ మా మధ్యాహ్న భోజనం 'గోభూమి'లో ఏర్పాటుచేసింది. నా సహధర్మ చారిణి రైతుల కొరకు చేసిన త్యాగాలను, పడిన కష్టాలను వారు గుర్తుచేసు కున్నారు. నేను, నా సోదరులు, మా అమ్మ, మా తాత జన్మించిన ఇంటి ఫోటోను తీసుకున్నారు. మంగమ్మమ్మ నిర్మించిన ఇంటి ఫోటోలు కూడా తీశారు. ఆరోజంతా ఎంతో సంతోషంగా గడచిపోయింది.

తెనాలిలో శ్రీ ఆవుల గోపాలక్రిష్ణమూర్తి రైతులతో డిమిట్రోవ్‌ను కలిశారు. శ్రీ గోపాలక్రిష్ణమూర్తిగారు రైతు భాగస్వామ్యం లేనట్లయితే ఈ ప్రభుత్వం ఉండదు అని అన్నారు. దురదృష్టవశాత్తు వారు తమ అమెరికా పర్యటన తరువాత 1966 లో మరణించారు. వారి మరణం 'హ్యూమనిస్టు ఉద్యమానికి' తీరని దెబ్బ.

III

పాకిస్తాన్ - సిలోనులలో నా పర్యటన

గుడివాడలో నా జన్మదినం జరుపుకుంటున్న (7-11-1957) సమయంలో డిసెంబరు 27న ఢిల్లీలో జరుగుతున్న కామన్‌వెల్తు పార్లమెంటరీ పార్టీ అసోసి యేషన్ ప్రతినిధుల సమావేశానికి రావాలని పిలుపు వచ్చింది. మా ప్రతినిధుల బృందం 11 నుండి 20 నవంబరు వరకు పాకిస్తానులోనూ, 21 నుండి 25 వరకు సిలోనులోనూ పర్యటించాలి. నేను 10వ తేదీ మధ్యాహ్నం గం.3-30 ని.లకు విమానంలో ఢిల్లీ చేరాను. ఢిల్లీలో ఉన్న నా స్నేహితులు ఆరోజున అక్కడ నా జన్మదినం జరిపారు.

నా మిత్రులు జవహర్‌లాల్‌కు, వినోబాభావేకు సహకార సేద్యం పేరుతో సమిష్టి సేద్యం చేస్తున్న ప్రయత్నాలకు ఎదురొడ్డి నిలిచే ధైర్యమున్న నాయకునిగా

నన్ను అభినందించారు. సాంఘిక స్వేచ్ఛ, ఆర్థిక స్వాతంత్ర్యం కోసం రైతులకు, చేతివృత్తులవారికి నేను చేస్తున్న ప్రయత్నాన్ని అభినందించారు.

మరుసటి రోజు ఉదయం కరాచీ చేరి పార్లమెంటు పార్టీ బృందాన్ని కలిశాను. 11 రోజులు పాకిస్తానులో పర్యటించాం. కరాచీ, లాహోర్, తెట్టా, హైదరాబాద్, పెషావరు, కైబరు మార్గాన్ని చూశాం. అక్కడి నీటిపారుదల సౌకర్యాలు, బట్టల మిల్లులు, పట్టణవాసుల ఇండ్ల స్కీములు చూశాం. కెనడావారి సహకారంతో గిరిజన ప్రాంతాలలో నిర్మించబడుతున్న ఒక జలవిద్యుత్ కేంద్రాన్ని, బారేజీలను చూశాను. వీటివలన గిరిజనులకు లాభం కల్గుతుంది. 'మంగ్లా' డామ్ నిర్మాణం అక్కడి గిరిజన ప్రాంతానికి, కశ్మీరుకు లాభదాయకం.

రాజకీయంగా పాకిస్తాన్ ఇబ్బందుల్లో ఉన్నట్లు కనిపిస్తుంది. ఇండియాపై వారి దుష్ప్రచారానికి బాధపడ్డాను. పాకిస్తానులో ఎన్నికలు జరపాలన్న ఉద్దేశ్యంలో కూడా వారి నాయకులు లేరు. నా మిత్రుడు యం.ఆర్. చుంద్రిగర్‌గారి ప్రభుత్వం కూలిపోవటానికి సిద్ధంగా ఉంది. కొన్ని వారాల తరువాత కూలిపోయింది. ఆ తర్వాత సంఘటనలు పాకిస్తానులో అస్థిరతను పెంచాయి.

'లాహోర్'లో అతి పెద్ద మసీదు మొగలులు నిర్మించారు. అందమయిన గురుద్వారాలు, కోట కనువిందైనవి. 'సారే జహాసె అచ్చా ఏ హిందుస్తాన్ హమారా' అనే అద్భుత గీత రచయిత మహమ్మద్ ఇక్బాలుగారి సమాధిని దర్శించాను. 'నూర్జహాన్' రాణి సమాధి లాహోర్‌లో ఎక్కడో ఉంది.

సిలోనులో కమ్యూనిస్టులతో కూడిన సంయుక్త మంత్రివర్గం మాకు ఎదురైంది. మేము వెళ్ళిన సమయానికి అక్కడ 'ప్యాడీ బిల్లు' (వరిధాన్యపు బిల్లు) చాలా వివాదాంశంగా ఉంది. ఈ బిల్లును అయిదు ఎకరాలకు పరిమితం చేయాలని కమ్యూనిస్టులు వాదిస్తున్నారు. ప్రధానమంత్రి ఈ బిల్లు విషయంలో రాజీ చేయాలనే ప్రయత్నంలో ఉన్నారు. నా మిత్రుడు ప్రధానమంత్రి బండారునాయకే ఇటువంటి సంకీర్ణ ప్రభుత్వాలు తూర్పుదేశాలలో అవసరమని చెప్పేవాడు. దురదృష్టవశాత్తూ 1959 లో అతను హత్యచేయబడ్డాడు. 1966 వరకు వారి భార్య సిరిమావో బండారునాయకే ప్రధానమంత్రిగా ఉంది. డడ్లీ సేనానాయకే

ఆమెను ఓడించి ముఖ్యమంత్రి అయ్యాడు. 'కాండీ' లోయల్లో ప్రయాణిస్తూ, నవ్వుతూ పలుకరించే పంట పొలాలను, కాండీలో అతిపెద్దదయిన సరస్సును పాములా మెలికలు తిరుగుతూ ప్రవహించే నదిని, బౌద్ధ రూపశిల్పులు నిర్మించిన విశ్వవిద్యాలయాల భవనాలను, వసతిగృహాలను చూశాను. ఆ శిల్పసంపదలోని కళా నిర్మాణం నాకప్పటికి అర్థమయింది. మాలవీయాగారి (కాశీ) బెనారస్ యూనివర్శిటీ నిర్మాణానికి ఈ బుద్ధిస్టు రూపశిల్పుల నిర్మాణాలే మూలం. 'సిరిగిరి'లో ఈ సింహాళ ఇంజనీర్ల ప్రతిభను, ఏకశిలా నిర్మితాలైన భవంతులను, కోటలను వాటి శిల్పులను అభినందించాం.

సీతాదేవి చెరలో ఉన్న చోటును చూశాను. ఒక క్షణం ఆమెను చూచిన భ్రాంతి కలిగింది. రాజా రవివర్మ చాలా మనోహరంగా ఆమె చిత్రం రచించాడు. ఎన్నో వేల ఏండ్ల క్రితం జరిగిన రామాయణ గాథను వాల్మీకి వ్రాసి, చదివి, పాడించి ప్రచారం చేశాడు. రామునిపై భక్తి, సీతపైన అభిమానం మన గుండెల్లో గూడుకట్టుకొని ఉంది. స్త్రీమూర్తిగా, భార్యగా, తల్లిగా సీతాదేవికి నా నమస్సు లర్పించాను.

సింహళంలో నివసించే ఇండియా ప్రజలంటే అక్కడి రాజకీయ పార్టీల కేమాత్రం సానుభూతి లేదు.

అనారోగ్యం వలన సిలోను నుండి త్వరగా తిరిగివచ్చాను. రెండు వారాలు మంచంలో ఉన్నాను. 'పెన్సిలిన్' ఇంజక్షన్లు, నా ఆత్మబలం నన్ను కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సెషనులో పాల్గొనేటట్టు చేశాయి.

IV

సి.పి.ఎ. సెషన్సు - 1958

ఈ సమావేశంలో రంగుజాతులవారి సంపూర్ణస్వేచ్ఛను గురించి మాట్లాడాను. గతంలో నేను వ్రాసి ప్రచురించిన 'రంగుజాతులు–వలస ప్రజలు' అన్న సిద్ధాంత వ్యాసం (1945) గాంధీ, జవహర్‌లాల్‌ల హయాంలో ఉపయోగపడింది. రంగుజాతుల వారికి (Coloured People) సంపూర్ణ స్వేచ్ఛ ఇవ్వవలసిందేనని ఈ సమావేశంలో చెప్పాను. నెహ్రూగారు ప్రారంభించిన ఈ సమావేశం చివరి

వరకు జరిగే బాధ్యత నాకొదిలి వెళ్ళారు. ప్రపంచంలోని అగ్రరాజ్యాలు మరి ఒక శిఖరాగ్ర సమావేశం జరపాలని చెప్పాను. 1960 లో 'కృశ్చేవ్' తొందరపాటు ప్రవర్తన వలన 'ఐసెన్‌హోవర్' ఈ సమావేశంలో పాల్గొనలేదు. ప్రపంచ సంపదను రంగుజాతులవారితో పంచుకోవాలి అనే నా సూచనను గెయిట్‌స్కిల్ ఆమోదించారు. అభివృద్ధి చెందిన దేశాలు ఒక శాతం వారి వార్షికాదాయాన్ని ఈ అభివృద్ధిచెందని దేశాలకు అందజేయాలన్న ఐక్యరాజ్యసమితి ఆలోచనను భారతదేశం బలపరిచింది. నా ఉపన్యాసాలను 'ఇండియా విదేశాంగ విధానం' అన్న పత్రికలో ప్రచురించారు. రెండవ సంచికలో 'అణ్వాయుధాల అనావశ్యత' గురించి వ్రాశాను. అణ్వాయుధాలు ఉపయోగించం అని చెప్పిన 'సోవియట్' వారి మాటలు 'మబ్బులలో మెరపుతీగలాగా' నాకన్పించాయి. రాజాజీగారు 1962 లో 'గాంధీ పీస్ మిషన్' (గాంధీగారి శాంతియాత్ర) లో అమెరికా, బ్రిటను, ఫ్రాన్సులలో పర్యటించారు. కెన్నడీగారితో అణ్వాయుధ నిషేధాన్ని గురించి మాట్లాడారు. కెన్నడీ-కృశ్చేవ్‌ల చర్చలకు రాజాజీగారి ప్రతిపాదనలే మూలం. 1965 లో భారతదేశం ఈ ఒప్పందంపై మొదటి సంతకం చేసింది.

గెయిట్‌స్కిల్-ఎన్యూరిన్ బీవన్‌లాగానే చాలామంది ఆసియావాసులకు స్నేహితుడు. నా పార్లమెంటు ఉపన్యాసాలు చదివినప్పుడల్లా నన్నభినందించే వాడు. లేబరు పార్టీ అధికారంలోకి వచ్చేసరికి అకస్మాత్తుగా మరణించాడు. ఈ ఇద్దరి పెద్ద నాయకుల మరణం మిస్టర్ విల్సన్‌కు లాభించి, ఇతను బ్రిటీషు ప్రధాని కాగలిగాడు.

మిస్టర్ విల్సన్ – అట్లీ, గెయిట్‌స్కిల్, బీవన్‌ల మార్గాన్ని వదలి రంగుజాతుల వారిని తప్పుగా అర్థంచేసుకున్నాడు. 1965 లో పాకిస్తాను కశ్మీరుపై దురాక్రమణ చేసినప్పుడు చాలా వివేకరహితంగా ప్రవర్తించి, కామన్వెల్తు క్లబ్బు ఉనికికే భంగం కలిగేటట్లు ప్రవర్తించాడు. 'వసుధైక ప్రపంచం' అనే ఆదర్శంతో ముందుకు సాగుతున్న అట్లీ-నెహ్రూల ఆదర్శాలకు విఘాతం కలిగించాడు.

★ ★ ★

44. కాంగ్రెసుకు రాజీనామా

ఏప్రియల్ 19, 1951

ప్రియమయిన టాండన్‌జీ,

కాంగ్రెసు కార్యవర్గ సభ్యత్వానికి, ఎ.ఐ.సి.సి. గౌరవ పదవులకు, కాంగ్రెసు ప్రాథమిక సభ్యత్వానికి నా రాజీనామా అంగీకరించవలసింది.

1917 లో కాంగ్రెసు స్వచ్ఛంద కార్యకర్తగా చేరి 1923 లో పూర్తికాలపు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు కమిటీ సభ్యుడనయి, 1930 నుండీ నేను ప్రజలకు సేవ చేస్తున్నాను. ఇరువయి సంవత్సరాల నా జీవితం ఒక ప్రజా కార్యకర్తగా, గాంధీగారి అనుచరుడుగా గడచిపోయింది. గాంధీమహాత్ముని నిర్మాణాత్మక కార్యక్రమాలలో నా భాగస్వామ్యముంది. గాంధీగారు జైలుకు వెళ్ళమన్నప్పుడల్లా వెళ్ళాను. రాజీనామా చేయటం బాధాకరం.

గాంధీగారి కాలంలోనే మంత్రులు, వారి సన్నిహితులు, వారి మద్దతుదారులు, లబ్ధిదారులు మంత్రివర్గ అనుచరగణంగా–మంత్రివర్గేతరులు వారికి వ్యతిరేకులుగా ప్రచారంలోనికి వచ్చారు. గాంధీగారు కాంగ్రెసులోని ఈ వేర్పాటు ధోరణికి క్రుంగిపోతుండేవారు.

కొంతమందిమి, మంత్రివర్గపు అధికార దుర్వినియోగాన్ని, కాంగ్రెసు విధానాలను అమలుచేయటంలోని అలసతను–గాంధీగారి దృష్టికి తీసుకొని వెళ్ళేవారం. వీరి అధికార దుర్వినియోగానికి స్తబ్ధులమయ్యేవారం. యుద్ధకాలపు కంట్రోళ్ళను వీరింకా పొడిగించటానికి వ్యతిరేకంగా జాతీయోద్యమాన్ని నిర్మించి, ఇండియన్ కిసాను సమ్మేళనాన్ని ప్రారంభించాను. ఈ అన్యాయపు ఆహారపు దొంగతనాన్ని ధరల పెరుగుదలలను నిరసించాను.

స్వాతంత్ర్యానంతర కాంగ్రెసులో గాంధీగారు నూతనోత్సాహాన్ని నింపేవారు. కంట్రోళ్ళకు వ్యతిరేకంగా ఉద్యమించేవారు. కాంగ్రెసు మంత్రివర్గాన్ని హెచ్చరిస్తుండేవారు.

సోషలిస్టులు మార్క్సిజంపై గల ఛాందస విధానాలను విడనాడి గాంధియన్ సోషలిస్టులుగా మాలాంటి వారందరితో కలసి ఉండాలని కోరేవాడిని.

బాపూ జీవితకాలంలోనే కాంగ్రెసు వర్కింగు కమిటి తన లక్ష్యాలను నిర్దేశించింది. శ్రీ జయప్రకాశ్ నారాయణ నేను వీటన్నిటికీ సహకరించాం (1947 ఎ.ఐ.సి.సి., ఢిల్లీ).

నేను, పండిట్ నెహ్రూ, కాంగ్రెసులోని సోషలిస్టులూ, ఆర్థిక సంఘంలో తీర్మానాలను రూపొందించేవారం. 1948 లోని పారిశ్రామిక ఆర్థిక విధానం చాలావరకు కాంగ్రెసు ఆర్థిక విధానంమీద ఆధారపడింది. ప్లానింగ్ ఉప సంఘంలో నేను సభ్యుడను. వ్యవసాయ సంస్కరణల సంఘంలో నేను ఓ.వి.ఆర్. రెడ్డియార్ (ప్రీమియర్ ముఖ్యమంత్రి) సభ్యులం. గాంధీగారి ఆదర్శాలకు అనుగుణంగా మేమీ నివేదికను రూపొందించాలనుకొంటున్నాం. సోషలిస్టులు మమ్మల్ని వదలివెళ్ళినా మా కార్యక్రమాన్ని ఈ 4 సంవత్సరాలు విజయవంతంగా నడిపించాం.

1935 లో ఇండియన్ కిసాను కాంగ్రెసు నిర్మాణాన్ని మీతో చర్చించాను. స్వాతంత్ర్యానంతర భారతదేశంలో రైతుల పాత్రను నేను మీకు చెప్పాను. స్వరాజ్యం కొరకు శ్రమించే రోజులలోనే శ్రామికులకు అధికారం కావాలని, సాంఘిక ఆర్థిక పరిస్థితులు వీరికి అనువుగా ఉండాలని ఆలోచించి ప్రణాళికలు రచించి వీరికొరకు పాటుపడ్డాను. రష్యా ఆలోచనలతో ప్రభావితులయిన శ్రామికులకు దీటుగా రైతులను, కార్మికులను శతాబ్దాల పర్యంతం వారనుభవిస్తున్న సాంఘిక, ఆర్థిక అణచివేతకు వ్యతిరేకంగా వారి భాగస్వామ్యం కొరకు ప్రబోధించాను. ఈ ఆశతోనే జవహర్‌లాల్‌గారు, ఇతర జాతీయ నాయకులు కలిగిన కాంగ్రెసులో కిసానులను, స్వయం ఉపాధిపరులను, శ్రామికులను ఎక్కువ సంఖ్యలో చేరమని మరలా మరలా చెప్పేవాడిని.

నిజమయిన రాజకీయ అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో సాధించాలన్నా,

సాంఘిక రాజకీయ అసమానతలను వదిలించుకోవాలన్నా, జీవన ప్రమాణాలు పెంచుకోవాలన్నా కాంగ్రెసు సంఘాలలో వారి మాట సాగాలి. ఈ ప్రాథమిక కార్యక్రమాలు మొదలుకాగానే కాంగ్రెసులోని సాంఘిక రాజకీయ శక్తులు ఈ ప్రయత్నాలకు అడ్డుగా నిలిచారు. రాజకీయ సంఘర్షణ అనివార్యం. ఈ సంఘర్షణ నిరంతరం కిసానులు, కార్మికులు రాజకీయంగా నిలదొక్కుకున్న గ్రూపుల మధ్య జరుగుతుంది.

రాష్ట్ర కాంగ్రెసు పెత్తనం కిసానుల చేతిలోనికి వచ్చిన తరువాత గత ఐదు సంవత్సరాలలో సుదీర్ఘమయిన రాజకీయ సంక్షోభం వచ్చింది. 1946 లో రాష్ట్రంలో రాజకీయాధికారం కిసానులు, మజ్దూర్‌లు వారికి నాయకత్వం వహించేవారి చేతిలోనికి వచ్చింది. అప్పటినుండి ఆంధ్రలో ఈ సంక్షోభం మొదలైంది.

ఈ అయిదు సంవత్సరాలు (1946-51) గాంధీగారి ఆదర్శాలతో కిసానులు, మజ్దూర్‌లు రాష్ట్ర కాంగ్రెసులో పనిచేస్తున్నారు. మేము మంత్రివర్గానికి విధేయులమే. ప్రజలనుకున్నంతగా మేము మంత్రివర్గంతో తగాదాపడలేదు. శ్రీ టంగుటూరి ప్రకాశంగారు కాంగ్రెసు మంత్రుల అవినీతిని ఎండగట్టారు. మంత్రులు ప్రజల అధికారాన్ని సొంతానికి, వ్యక్తిగతంగా వాడుకోవటంపై ధ్వజ మెత్తారు. మేము కాంగ్రెసు వర్కింగు కమిటీని న్యాయ విచారణ జరిపించమని కోరాం. వర్కింగు కమిటీ నాయకులు ఏవిధంగా విఫలమైంది మీకు తెలుసు. డా॥ పట్టాభి (భోగరాజు పట్టాభి సీతారామయ్య) కాంగ్రెసు అధ్యక్షునిగా ఎన్నిక కావటంతో మద్రాసు మంత్రివర్గం బలం పుంజుకొంది. ఆంధ్ర కాంగ్రెసు సామరస్య సాధన కోసం మేము కూడా (ప్రకాశం-రంగాగారు) డా॥ పట్టాభిని బలపర్చాం. శ్రీ కళా వెంకట్రావును కాంగ్రెసు ప్రధాన కార్యదర్శిగా నియ మించారు. డా॥ పట్టాభి, శ్రీ కళా వెంకట్రావులు రాష్ట్ర కాంగ్రెసులో మెజారిటీ కలిగిన మాపై దుస్సహమయిన చర్యలకు పాల్పడ్డారు. శ్రీ కళా వెంకట్రావుగారి ఒక లక్షమందికిచ్చిన 'బోగస్' కాంగ్రెసు సభ్యత్వం, వారిచ్చిన రూ. 25,000/-ల సొంత చెక్కు విషయం, 9000 మందికి క్రియాశీలక సభ్యత్వం, వారిచ్చిన 26 నవంబరు తాఖీదు - మీకు తెలిసినవే.

కళా వెంకట్రావుగారు, వారి మిత్రులు 26 మంది గుంటూరు జిల్లా కాంగ్రెసు సభ్యులపై కోర్టులో 'ఇంజక్షను' తీసుకొనివచ్చి రాష్ట్ర కాంగ్రెసు ఎలక్షన్లను కాంగ్రెసు నియమావళికి విరుద్ధంగా ఏప్రియల్ 11 న మాపై రుద్దారు. ఇదే నాటకం మేమాడదలచలేదు. ఈ 26 మంది నన్ను బలపరచేవారే. ఎలక్షన్లు వారికి అనుకూలంగా ఉండేవరకు వాయిదా వేయించారు. కోర్టులకు వెళ్ళవద్దని ఎ.ఐ.సి.సి. నియమావళిలో ఉన్నా కోర్టులకు వెళ్ళారు. కళా వెంకట్రావుగారు మామీద గెలిచారు.

రైతుకూలీ ప్రజారాజ్యం పైన ప్రజలు పెట్టుకొన్న ఆశలు వమ్ముకావటంలో ఆశ్చర్యమేముంది? స్వరాజ్య యుద్ధంలో గానీ, నేడు గానీ మేము హింసకు వ్యతిరేకం. గాంధేయవాదానికే కట్టుబడియున్నాం. అందువలననే ఈ మద్రాసు మంత్రివర్గంవారు మామీద గెలువగలిగారు.

మాకు వ్యతిరేకి అయినా డా॥ పట్టాభిని కాంగ్రెసు అధ్యక్షునిగా బలపరిచాం. అహమ్మదాబాద్ తీర్మానం అయిన వెంటనే 1951 జనవరిలో నేను మంత్రివర్గ పెద్దలను కలసి వారి మైనారిటీ వర్గానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెసు కమిటీలో తగిన ప్రాతినిధ్యమిస్తానని చెప్పాను. మీరు, రాజాజీగారు, జగజ్జీవన్‌రామ్‌గారు నేను చెప్పినా వినకుండా ఎన్నికలు జరిపి వారి అధికార బలాన్ని నిరూపించు కున్నారు.

రాజకీయ పరిజ్ఞానం కలిగి, ఉత్తమ నిర్మాణ విభాగమయి 1921 నుండి కాంగ్రెసు విధేయులుగా ఉన్న రైతుకూలీ సంఘానికి ఇటువంటి గతి పట్టింది. రైతులకు–కూలీలకు పార్టీమీద నమ్మకం పోయింది. ఈ శాంతియుత సంఘర్షణ, గాంధీ విలువలు చాణక్య నీతి ముందు నిలువలేకపోయాయి.

జైపూర్ – నాసిక్ కాంగ్రెసు సమావేశాలలో వివిధ రాష్ట్రాల సభ్యులు రైతులు ఎదుర్కొంటున్న వివక్ష గురించి మాట్లాడారు. ఆంధ్రరాష్ట్రంలో జరిగిన పరిణామాల దృష్ట్యా కాంగ్రెసును బలపరచమని నేను ఎలా చెప్పగలను?

బలవంతపు ధాన్య సేకరణ, ఆహారధాన్యాల దిగుబడులను ఎక్కువగా చూపించటం, రైతు అవసరాలను తక్కువగా చూపించటం, గిట్టుబాటు కాని ధరలు రైతుల నెత్తిమీద రుద్దటం, రైతుల కనీస అవసరాలు పట్టించుకోకపోవటం,

జవహర్‌లాల్‌గారిని నేను ఎన్నిసార్లు అడిగినా రైతుల అవసరాలపై దృష్టి పెట్టక పోవటం నా బుర్రలో, నా మనస్సులో చాలా రోజులనుండి ఉన్నదే. ఈ కంట్రోళ్ళు, ఈ అవినీతికి ప్రభుత్వంలో రైతులకు మోక్షం ఉందా?

జమీందారీ విధానం రద్దు రైతులకు ఉపయోగపడింది. రాజరికం పోయింది. రైతులు ఎన్నో ఆశలతో ఉన్నారు. ఎక్కువకాలపు కౌలు, కనీస వ్యవసాయ ధరల నిర్ణయం అమలుచేస్తారనుకొంటున్నారు. పట్టణాల అవసరాలకు ఎక్కువగా, పల్లెలకు తక్కువగా ఈ ప్రభుత్వం ఖర్చు చేస్తున్నది. రైతులు సాధించిన విజయాలు అసంతృప్తినే మిగులుస్తున్నాయి.

సరియైన తిండి లేక కోట్లాది చేనేత కళాకారులు అలమటిస్తున్నారు. కుటీర పరిశ్రమలలో నిర్వహణా వైఫల్యం ఏ 'రికార్డు'లో చూచినా కన్పిస్తుంది. కోట్ల మంది పారిశ్రామిక కార్మికులకు గృహవసతి గానీ, సాంఘిక రక్షణ గానీ, కనీస ధరలు గానీ 'మృతశిశువు'లయ్యాయి.

కంట్రోళ్ళు తన అధికారం చలాయించటానికి ప్రభుత్వానికొక మార్గం. ప్రజలలో పరపతిని, పాలనలో నైతికతను, విశ్వసనీయతను ఈ ప్రభుత్వం పోగొట్టుకుంది. కంట్రోళ్ళను మాలాంటివారు ఎత్తివేయలేకపోయారు. మంత్రులు బస్ రూట్‌లు అన్నీ తమవారికే ఇస్తున్నారు. కాంగ్రెసు కార్యవర్గం, మంత్రులు అందరూ అవినీతి బాట పట్టారు.

కాంగ్రెసు మంత్రులు

మద్రాసులోనే కాదు ఇతర రాష్ట్రాలలో కూడా కాంగ్రెసు మంత్రుల పనితీరు బాగాలేదు. పార్లమెంటరీ బోర్డు తగిన మంత్రులను నియమించటంలేదు. బాపూ గారి సమక్షంలోనే పార్లమెంటరీ బోర్డు చేతగానితనాన్ని విమర్శించాం. మద్రాసు, యు.పి., పంజాబులలో మంత్రులపై అవినీతి ఆరోపణలకు పార్లమెంటరీ బోర్డు బాధ్యత వహించలేదు. తాము విధాన నిర్ణయాలకు మాత్రమే పరిమితం అని చెప్పింది. నేను, మీరూ ఈ బాధ్యతా రాహిత్యాన్ని విమర్శించాం. మంత్రులకు అలవిమాలిన స్వేచ్ఛ ఇవ్వబడింది. దీనివలన పరిణామాలు చాలా విపత్కరంగా ఉన్నాయి. యుద్ధానంతరం ప్రతిరోజు ప్రతి వ్యక్తిని ఈ కంట్రోళ్ళు శాసిస్తున్నాయి. ప్రధానమంత్రి (ముఖ్యమంత్రి) తన మంత్రివర్గ సభ్యులను సంతోషంగా ఉంచగలిగితే చాలు, తన పదవికి ధోకా లేదు.

కేంద్రప్రభుత్వ వైఫల్యం

ఆర్థికశాఖ, పరిశ్రమలు, వాణిజ్యరంగం, ఆహారం, పునరావాసం, ఉపశమనం – విభాగాల్లో కేంద్రప్రభుత్వ విధానాలను నేను చాలాసార్లు విమర్శించాను. ఈ మంత్రులపై విశ్వాసం లేదని పార్లమెంటులోనే చెప్పాను. ప్రధానమంత్రికి ఉత్తరాలు వ్రాసాను. అంచనాల సంఘంలో పార్లమెంటు చర్చ ఈ విషయాన్ని రుజువు చేస్తుంది. ఇంకా బయటపడాల్సిన లోపాలు, కళంకాలు చాలా ఉన్నాయి. జీపుల కొనుగోళ్ళు, ట్రాక్టర్ సంస్థలు, ఎరువులు, ప్రభుత్వ గృహనిర్మాణ సంస్థలు, ముందుగా తయారుచేసిన షెడ్స్ (పంచలు) వంటి విషయాలు ఇంకా ఉన్నాయి. ఇవన్నీ ప్రజల నమ్మకాన్ని వమ్ముచేసేవే. ఇంగ్లాండులో ఒక మంత్రి ఈ కార్యక్రమాల వల్లనే మంత్రిపదవి పోగొట్టుకున్నాడు.

ఈ అసంతృప్తి ఎన్నో ఏళ్ళనుండీ మా మనసుల్లో గూడుకట్టుకొని ఉంది. ప్రజల ఓర్పును పరీక్షిస్తుంది. మా నమ్మకం పోగొట్టింది.

మీ విశ్వాసపాత్రుడు

యన్.జి. రంగ

(పురుషోత్తమదాస్ టాండన్ ప్రత్యుత్తరం)

ప్రియమయిన రంగా,

మీరు 19వ తేదీన వ్రాసిన ఉత్తరం 23వ తేదీన నా కార్యదర్శికందింది. ఈ ఉత్తరం కార్యవర్గ సభ్యులకందరికీ చూపించబడింది. కార్యవర్గం నన్ను మీతో మాట్లాడమని కోరింది.

గత నెలలో జరిగిన కార్యవర్గ సమావేశానికి, అఖిల భారత కాంగ్రెసు కమిటీ సమావేశాలకు మీరు హాజరుకాలేదు. మీరు చాలా విషయాలు వ్రాసారు. ఆ విషయాలన్నీ నేనిప్పుడు చర్చించటంలేదు. మీరు అఖిల భారత కాంగ్రెసు కమిటీకి పంపిన 'రాజీనామా'ను గురించి మీతో మాట్లాడటం నా తక్షణ కర్తవ్యం. మీరు కాంగ్రెసు కమిటీలో అత్యున్నత వ్యక్తులు. మీరు కాంగ్రెసు విధానాన్ని నిర్ణయించేవారు, నిర్వచించేవారు. మీ మాట చెల్లలేదని మీ ఆరోపణ. మీరు ప్రశాంతంగా ఆలోచిస్తే అందరి పరిస్థితి అదే కదా! ప్రజాస్వామ్యంలో మన అభిప్రాయాలను

చెప్పగలం. ప్రజలు మంచిమార్గంలో నడచేటట్లు చూడగలం. మీరు వేరొక కుంపటి పెట్టుకునేకంటే కాంగ్రెసు కమిటీలో ఉండటమే మేలు.

మీరు మీ రాష్ట్రాలలో జరిగిన విషయాలను మనస్సులో ఉంచుకోవద్దు. మీరు కేవలం 5 ఓట్ల తేడాతో కాంగ్రెసు అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికలలో ఓడించబడ్డారు. మీ మాట ఆంధ్ర కమిటీలో చెల్లుబాటవుతుంది. అధ్యక్ష పదవి మినహా మిగిలిన పద్దెనిమిది మంది సభ్యులు మీవారే కదా! ఈ ఏర్పాటు మీ వర్గాలలో (గ్రూపులలో) మంచి అవగాహన కలిగిస్తుంది.

మీరు త్వరపడి నిర్ణయం తీసుకొనవద్దని మీ మిత్రునిగా కోరుతున్నాను. మీతో ప్రత్యక్షంగా మీరు ఇక్కడకు వచ్చినప్పుడు మాట్లాడతాను.

మీ విశ్వాసపాత్రుడు

పురుషోత్తమదాస్ టాండన్

7 ఫిబ్రవరి, 1951

ప్రియమయిన జవహర్‌లాల్,

మీ నాయకత్వాన్ని సమర్థించమని, కాంగ్రెసు కార్యవర్గం వెంటే నడవమని ఎ.ఐ.సి.సి. వర్కింగు కమిటీలో మీరు చేసిన ఉపన్యాసం నన్ను ఆలోచనలో పడవేసింది.

ఆహారం, వ్యవసాయం, పరిశ్రమలు, విదేశీయాంగ విధానాలలో నేను మిమ్మల్నే బలపరచేవాడిని.

బాపూ, పటేలు గార్లు నన్ను మీతో కలసి నడవమని చెప్పిన సందర్భం కూడా ఉంది. ఎన్నికల తరువాత ఓటుహక్కును అందరూ పొందిన తరువాత మీ నిజాయితీ నడవడికి నా వత్తాసు ఇద్దామనుకున్నాను. నేనీ కారణంతోనే గత సంవత్సరం ఆగస్టు–సెప్టెంబరులలో మంత్రిగా ఉండనని చెప్పాను.

దేశంలో ఆహారం, పరిశ్రమల స్థితి రోజురోజుకు దిగజారుతూ నాకు ఆందోళన కల్గిస్తుంది.

మీ విశ్వాసపాత్రుడు

యన్.జి. రంగ

2-ఫెరోజ్‌షా రోడ్
న్యూఢిల్లీ
19-మే-1951

ప్రియమయిన శ్రీ జవహర్‌లాల్‌కు,

1930 నుండి నేను బాపూ ఆశీర్వాదాలతో ప్రజాస్వామ్య రైతుకూలీ ప్రజా రాజ్యం సాధించాలి అన్న ఆలోచనలో ఉన్నాను. గత రెండున్నర సంవత్సరాలుగా కాంగ్రెసు కార్యవర్గంతో నా చర్చలు అసంతృప్తితో కూడుకొని ఉన్నాయి. (ప్రత్యేకంగా ఆంధ్ర కాంగ్రెసు - మద్రాసు మంత్రివర్గీయుల వివాదాలు).

కళా వెంకట్రావు 26 మంది గుంటూరు జిల్లా కాంగ్రెసు సభ్యులపై 'ఇంజక్షను ఆర్డర్' తీసుకున్నారు. ఈ సంఖ్య ఆంధ్ర కాంగ్రెసులో 1/8 వంతు. ఎ.ఐ.సి.సి. ఈ 26 మంది భవితవ్యం తేలకుండానే కార్యవర్గ సభ్యుల ఎన్నిక జరపమన్నది. ఎన్నికల అధికారిగా వచ్చిన శ్రీ యస్.కె. పాటిల్‌గారు కూడా ఈ ఎన్నిక జరపటానికి సుముఖంగా లేరు. ఈ నిర్ణయం అన్యాయం. రాజాజీగారు కూడా ఇది ఒక వర్గానికి అన్యాయం చేయడమేనని ఎలుగెత్తి చెప్పారు. కానీ మీ వత్తిడి ఫలితంగా ఈ ఎలక్షను నిర్వహింపబడింది. కాంగ్రెసు అధ్యక్షులు కూడా సంతోషంగా లేరు. అధికార దుర్వినియోగం ద్వారా, అన్యాయపు పద్ధతుల ద్వారా 'ప్రావిన్షియల్' కాంగ్రెసు కమిటీని స్వాధీనపరుచుకున్నారు. అధిష్ఠానం ప్రేక్షక పాత్ర వహించింది.

ఇంత జరుగుతున్నా కాంగ్రెసువారిని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నోరు విప్పవద్దు అని కార్యవర్గం ఆదేశాలు ఇచ్చింది. నేనా సమయంలో ఆ సభలో ఉన్నట్లయితే ఈ తీర్మానాన్ని వ్యతిరేకించేవాడిని. కాంగ్రెసు నోరుమూసుకొని కూర్చుంటే మంత్రులు రాష్ట్రంలో, కేంద్రంలో పెత్తనం చేయటం ఏం న్యాయం? ప్రజలు అవిశ్వాసులుగా మిగులుతారు.

మీరెప్పుడూ కాంగ్రెసులోని గ్రూపులను గురించి మాట్లాడేవారు. మీకు వీటిలో సొంత అనుభవం లేదు. కార్యవర్గ సమావేశాలలో అడిగినప్పుడు 'ఈ విషయం నా అవగాహనలో లేదు' అనేవారు. అహమ్మదాబాద్ సభలో కాంగ్రెసులోని వివిధ వర్గాలకు మంత్రిపదవులు కల్పించమని నేనడిగిన విషయం మీకు

'గుర్తుండి' ఉంటుంది. నా ఈ సలహాకు మీ సానుభూతి స్పందన క్రియా రహితంగా మిగిలిపోయింది. జాతీయ నాయకులుగా మీరే ఏమీ చెయ్యలేక పోయారు. కాంగ్రెసు కార్యవర్గం నిస్సహాయ స్థితిలో ఉంటే దేశం కాంగ్రెసు నాయకత్వాన్ని పోగొట్టుకుంటుంది.

మీరు క్రమశిక్షణా రాహిత్యాన్ని, రాజకీయ అవినీతిని సమర్థవంతంగా ఎదుర్కొంటున్నట్లు నాకు తోచదు. జాతీయ విషయాలలో కాంగ్రెసువారిని ఉత్తేజ పరుస్తున్నట్లు నేననుకోవటంలేదు. మీ ముందున్న ఈ విషయాలపై మీ దృష్టి ఉన్నట్లు నాకనిపించటంలేదు.

వచ్చే పది సంవత్సరాలలో కాంగ్రెసు తన అంతర్గత కలహాలతోనూ, మంత్రుల అవినీతితోనూ కుళ్ళిపోతుంది. నేనాశించే రైతుకూలీ ప్రజారాజ్యం వచ్చే అవకాశం లేదని అర్థమైంది. రెండు విభాగాలు ఏర్పాటుచేసి ఈ గొప్ప జాతీయ సంస్థను నిలుపమని నేను కోరుతున్నాను.

నేను గత ఒకటిన్నర సంవత్సరం నుండీ కాంగ్రెసులో రెండు విభాగాలు ఏర్పాటుచేయమనే నా వ్యక్తిగతమయిన ఆలోచనను కాంగ్రెసులో చెపుతూ వచ్చాను. నిశ్శబ్ద ప్రేక్షక పాత్ర వహించటంకన్నా ఈ విధానమే మేలు. ఈ గొప్ప జాతీయ సంస్థ చివికిపోకుండా కాపాడమని మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను. ఒకరితో ఒకరు మాట్లాడని నాయకత్వాన్ని రెండుగా చీల్చి, ఒక ఆరోగ్యకరమైన ప్రతిపక్షాన్ని కాంగ్రెసు నుండే నిర్మించమని మిమ్మల్ని కోరాను. నేనటువంటి ప్రతిపక్షంలో చేరటానికి సిద్ధమే. కాంగ్రెసు సిద్ధాంతాలకు అనుగుణంగా, స్వాతంత్ర్యం కొరకు పనిచేసిన వారందరినీ వదులుకోవటంకన్నా ఈ విధానమే మేలు.

నాకు నచ్చని మీ విదేశీ విధానం, ఆర్థిక విధానం – మీమీద నాకున్న వ్యక్తిగత గౌరవం, క్రమశిక్షణల మధ్య నలిగిపోతున్నాను.

మీరు విధించిన కంట్రోళ్ళు, ప్రొక్యూర్‌మెంటు ధరలకు వ్యతిరేకంగా నేను చాలాసార్లు జాబులలోనూ, పార్లమెంటులోనూ నా అభిప్రాయాలు తెలియ పరచాను. మీ ప్రభుత్వ విధానాలను నేను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాను. క్రమశిక్షణ గల కార్యకర్తగా ఇన్నాళ్ళు నా ఆలోచనలను బయటపెట్టలేదు. అహమ్మదాబాద్

కాంగ్రెసు సమావేశం తరువాత కూడా దేశం కోసం మీతో కలసి పనిచేస్తానని చెప్పాను.

ఈరోజున రైతుకూలీ ప్రజారాజ్యానికి, సహకార కామన్వెల్తు నిర్మాణానికి రాజకీయ నాయకత్వ అవసరముంది. అలాకాకపోతే ఒక్క కాంగ్రెసు పార్టీయే పరిపాలిస్తూ ఏకపక్షంగా ఉండటం, జాతీయ పార్టీగా పతనం చెందటం జరుగుతుంది. ఇది కమ్యూనిస్టులకు ఉచిత బహుమతిగా మిగిలిపోతుంది.

చాలామంది ఈ ప్రత్యామ్నాయ నాయకత్వ పద్ధతులలో రాజకీయం చేయాలని ఉన్నారు. దేశం మా ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని ఆశీర్వదించుతుందని ఆశిస్తున్నాను.

మీ విశ్వాసపాత్రుడు

యన్.జి. రంగ

ప్రియమయిన టాండన్‌జీ,

9వ తేదీ జూన్‌న నా రాజీనామాపై జరిగిన చర్చ ఫలప్రదంగాలేదు. ది.13-5-1951 న కాంగ్రెసు ప్రభుత్వాలకు సంబంధించి సామాన్య విషయాలు చర్చకు వచ్చాయి. నా రాజీనామా విషయమై సమాధానం లేదు. 15-5-51న నేను వ్రాసిన మూడు విషయాలు ఒకటి – మద్రాసు మంత్రివర్గంలోని అవినీతి, రెండు – కాంగ్రెసు నిర్ణయానికి వ్యతిరేకంగా కోర్టుకెక్కిన మీ కార్యదర్శి (కళా వెంకట్రావు) విషయం, మూడు – మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు.

ఈ విషయాలలో మీరేవిధమయిన చర్య తీసుకోలేదు. ఈ విషయాలు ఎక్కడకు దారితీస్తాయో అన్న భయం. మంత్రివర్గ పునర్నిర్మాణం చేయలేక కాదు, మంత్రులు ఏమనుకుంటారో అని మీకు మంత్రులు పార్లమెంటరీ బోర్డు జోక్యాన్ని సహించరని కూడా చెప్పారు. మీరీ విషయంలో కుంటిసాకులు చెపుతున్నారని నేనర్థం చేసుకున్నాను. నేను 1936-39 లలో బీహార్ బాటియా పొలాల వివాదంలో సర్దార్ ఎంత మంచి పేరు తెచ్చుకున్నారో (పార్లమెంటరీ బోర్డు నిర్ణయంలో) నేను చెప్పినప్పుడు మీరు పంజాబులో మంత్రుల కష్టాలను గురించి మాట్లాడారు. మీరు నిజాయితీగా నిస్సహాయులు. కాంగ్రెసు పార్లమెంటరీ బోర్డు మంత్రులను కట్టడిచేయలేదనే నిర్ణయానికి వచ్చాను.

ఆంధ్ర ప్రొవిన్షియల్ కాంగ్రెసు ఎన్నికలలో 18 సీట్లకు గాను 9 సీట్లు నా వర్గానికి ఇస్తామని చెప్పటం సమంజసంగా లేదు. కళా వెంకట్రావు 26 మంది ప్రతినిధులకు ఓటుహక్కు ఇంజక్షను ఆర్డర్ ద్వారా లేకుండాచేసి, ఎన్నికయిన ప్రెసిడెంటును గుర్తించమంటున్నారు. ఇది చాలా హాస్యాస్పదం. ఈవిధమయిన ఎన్నిక జరపడంవలన ఎంతమంది ప్రతినిధులకు ఓటుహక్కు లేకుండా పోయింది అనిగాని వారి పరోక్షంలో ఎన్నిక జరగటంవలన ఒక మైనారిటీ గ్రూపుకు వచ్చిన లాభాన్నిగానీ మీరు లెక్కవేయలేదు. కార్యవర్గంలోని మెజారిటీవారు వారిష్టం వచ్చినట్లు చేసే అవకాశముంది. ఇది విపత్కర పరిణామాలకు దోవ చూపుతుందని మిమ్మల్ని హెచ్చరించాను.

1925 లో జరిగిన విషయాన్ని మీకు గుర్తు చేస్తాను. మహాత్మా గాంధీగారు 'కాంగ్రెసువారు కౌన్సిళ్ళలోనికి ప్రవేశించరాదు' అని చెప్పారు. మోతీలాల్ నెహ్రూ, సి.ఆర్. దాసు గార్లు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించి 'వాకవుటు' చేశారు. ఎన్నికలలో గాంధీగారు గెలిచారు. ఆ ఎన్నికలలో మోతీలాల్, సి.ఆర్. దాసు వర్గం పాల్గొని ఉంటే తాను తప్పక ఓడిపోయి ఉండేవాడినని, అందువలన తాను తాత్కాలిక రాజకీయ సన్యాసం తీసుకుంటున్నానని ప్రకటించి, నెహ్రూ, సి.ఆర్. దాస్‌లను ఆశీర్వదించి వెళ్ళారు.

ఈ విషయాలను నేను జవహర్‌లాల్ ముందుంచాను. వారివద్ద నుండి ఎటువంటి సమాచారం లేదు.

ఇంత జరిగిన తరువాత నేను మరలా కాంగ్రెసు వర్కింగు కమిటీలోనికి వచ్చి చేసేదేముంది? అందువలననే నా పరోక్షంలో కాంగ్రెసు వర్కింగు కమిటీలో ఈ విషయాన్ని చర్చించమని కోరాను. నాకు న్యాయం చేయండి అని అడిగాను. ఎంతో ఉన్నతమయిన ఆశలు, ఆకాంక్షలు గల కాంగ్రెసు దేశాన్ని నడిపించాలి. ఆంధ్ర ఎన్నికలలో జరిగిన విషయాలు మరలా ఎక్కడా పునరావృతం కాకూడదు.

నైతిక ప్రవర్తన, నిర్ణయాధికారం కాంగ్రెసు మూలాలలోనే లేదని, కాంగ్రెసు అధ్యక్షుడు నిస్సహాయుడని, అధిక సంఖ్యాకులను అల్పసంఖ్యాకులుగా తేల్చి చెప్పిన కోర్టు తీర్పు ప్రజాస్వామ్యానికి విఘాతం అని తెలియటంలేదా?

విలువలకు వ్యతిరేకంగా మా ప్రవర్తన ఉంటే ప్రజాజీవితం మాకు చాలా ఉపయోగకారిగా ఉండేది. మంత్రివర్గంలో నిస్సిగ్గుగా ఉండేవాళ్ళం. కానీ రాజకీయ కీకారణ్యంలో ఉండి ప్రతిపక్షులు కల్పించే అవరోధాలను అధిగమించటమే మా ధ్యేయం. రాజకీయ అవినీతికి దూరంగా ఉండటమే మా లక్ష్యం.

నేను కాంగ్రెసును వీడి వెళ్తున్నాను. ఇది చాలా బాధాకరమైన నిర్ణయం. దేశ స్వాతంత్ర్యం కోసం గతంలో బాపూ నాయకత్వంలో త్యాగాలు చేసినట్లు మేమీనాడు ఈ గుండెకోతను కూడా భరిస్తాము. బాపూగారి స్నేహం, ఆలోచనలతో ప్రభావితమయిన నా అనుచరుల స్నేహం మీకెప్పుడూ ఉంటుంది.

మీ విశ్వాసపాత్రుడు

యన్.జి. రంగ

★ ★ ★

45. ఐక్య కాంగ్రెస్ K.L.P. హక్కులను నిర్లక్ష్యం చేసింది

నెహ్రూగారు గాంధీ పార్లమెంటు నియమావళిపై నిర్లక్ష్యంతో ఉన్నారు. కృషిక్ లోక్‌పార్టీకి అదృష్టం కలసిరాలేదు. ఇద్దరు మంత్రులలో ఒకరైన శ్రీ యన్.వి. రామారావు చనిపోయారు. రైతులంటే ప్రాణం. కృషికార్ లోక్‌పార్టీకి అంకితమైనవారు. 1920-42 సంవత్సరాల మధ్య వాళ్ళ నాన్నగారు పలుసార్లు దేశంకోసం జైలుకు వెళ్ళారు. వీరు కూడా చాలా చిన్నవానిగా ఉన్నప్పుడు 1930 లో, తరువాత 1940-44 లలో కారాగార క్లేశం అనుభవించారు. వారు చాలా మంచి కార్యకర్త. అందరినీ కలిపి నడిపించే శక్తి గలవారు. వరద గోదావరిలో ప్రజలకు అన్నపానాలు సమకూర్చేవారు (1952-53 లలో). వారు రెండుసార్లు మంత్రి పదవిని వద్దన్నారు. వారు మంత్రిగా ఉన్న ఒక్క నెలలో పంటల బీమా పథకాన్ని రచించి కేంద్ర ప్రభుత్వానికిచ్చారు. ఆ రిపోర్టు అతీగతీ తెలియదు. కృషికార్ లోక్‌పార్టీకిది తీరని నష్టం.

రామారావు తర్వాత శ్రీ కందుల ఓబులరెడ్డిగారిని మంత్రిగా నియమించమని ఎన్నోసార్లు ఎ.ఐ.సి.సి. రాష్ట్ర మంత్రివర్గాన్ని అర్థించాను. శ్రీ కందుల ఓబులరెడ్డి గారిని మొదటనే మంత్రిగా నియమించమన్నాను. ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలకు కాంగ్రెసు కట్టుబడలేదు. శ్రీ గౌతు లచ్చన్నగారి ఒకటిన్నర సంవత్సరాల పోరాట ఫలితంగా శ్రీ కందుల ఓబులరెడ్డిగారిని ప్రభుత్వంలోనికి తీసుకున్నారు.

కాంగ్రెసును 1952-54 లలో ఓడించినందుకు నెహ్రూగారు ప్రతీకారం తీర్చుకున్నారు.

నేను రష్యాకు, యుగోస్లేవియాకు వెళ్ళినప్పుడు నా అనుమతి లేకుండా

రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్ష పదవికి నన్ను ఎంపికచేసి నన్ను ఓడించారు. నెహ్రూగారి ప్రియతముడైన శ్రీ నీలం సంజీవరెడ్డిగారు నా పేరును వ్యతిరేకించారు.

కొందరు పార్లమెంటు స్నేహితులు కాంగ్రెసు పార్టీలో చేరమన్నారు. నెహ్రూ గారు దీనిని వ్యతిరేకించారు.

నా ఐరోపా పర్యటన తరువాత కృషికార్ లోక్‌పార్టీపై చూపుతున్న వివక్షను తెలుసుకున్నాను. తాలూకా, జిల్లా కమిటీలలో కృషికార్ లోక్‌పార్టీ వారిని నమోదు చేయటంలేదు. నేనీ విషయాన్ని ఆల్ ఇండియా కాంగ్రెసు కమిటీ దృష్టికి తీసుకొని వెళ్ళాను. శ్రీ రమణ, యం.పి. గారి సభ్యత్వమూ నమోదు చేయలేదు. ఎన్నికలలో వారి పేరును తీసివేసి, జిల్లా కాంగ్రెసు కమిటీ వారి అభ్యర్థిత్వాన్ని నిరాకరించింది.

1955 లో కృషికార్ లోక్‌పార్టీవారి 'కిసానుమేళా'కు అభ్యంతరం తెల్పారు. గాంధీగారు సహితం కిసానుమేళాకు అభ్యంతరం చెప్పలేదు. నేను ఏర్పాటుచేసే కిసాను సమ్మేళనాలకు తీవ్ర వ్యతిరేకి అయిన శ్రీ పటేలుగారు సయితం నన్ను జాతీయ కార్యవర్గాన్ని ప్రేమతో ఆశీర్వదించేవారు. కాంగ్రెసు వారిప్పుడు 35 సంవత్సరాల చరిత్ర కలిగిన కిసాను సమ్మేళనను కాదంటున్నారు. ముగ్గురు మంత్రుల నియామకాన్ని వ్యతిరేకిస్తున్నారు. కాంగ్రెసు గుత్తాధిపత్యాన్ని, వర్గ దృక్పథాన్ని కిసాను(రైతులు) లు గమనిస్తున్నారు. కిసాను సమ్మేళనంతో సంబంధం వదులుకోమని నోటీసులు ఇవ్వగానే శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్య, గోగినేని లక్ష్మీనారాయణలు ఈ అగౌరవానికి తీవ్రంగా స్పందించారు. ఈ దెయ్యంపై (కాంగ్రెసుపై) యుద్ధానికి రైతులందరూ సిద్ధమయ్యారు.

ఆల్ ఇండియా కాంగ్రెసు కమిటీ ఈ వివాదాన్ని ఇకముందు ముదరనీయ వద్దు అని చెప్పి ఊరకున్నది.

కిసాను కార్యకర్తలు కాంగ్రెసు సభ్యత్వాలను తీసుకోవటం మానివేశారు.

మార్చి 1956 లో శ్రీ కందుల ఓబులురెడ్డిగారు మంత్రి పదవిని స్వీకరించారు. పదునెనిమిది నెలలు ఓబులురెడ్డిగారి మంత్రి పదవికి శ్రీ నీలం సంజీవరెడ్డి, అసమర్థ ముఖ్యమంత్రి బెజవాడ గోపాలరెడ్డి ద్వారా అడ్డం వేయగలిగారు. శ్రీ కందుల ఓబులురెడ్డిగారు 1934 లో రైతాంగ విద్యాలయ

పట్టభద్రుడు. అప్పటి నుండీ రాజకీయాలలో చురుకైన వ్యక్తి. శ్రీ లచ్చన్నగారికి, శ్రీ ఓబులురెడ్డిగారికి కాంగ్రెసు ధోరణి రుచించలేదు.

కాంగ్రెసులోని శల్యులు – నారదులు కాంగ్రెసు మంత్రుల చెవులు కొరుకుతున్నారు. కిసాను మజ్దూర్ పార్టీ కార్యకర్తలందరూ లచ్చన్న, ఓబులురెడ్డి నాయకత్వాన్ని బలపరచారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఉపముఖ్యమంత్రులతో కలసి పదినొక్కమంది మంత్రులు. వారందరికన్నా వీరిద్దరూ ప్రజలతో మమేకమయి వారిని జాగృతులను చేయగలిగారు. దీనితో కాంగ్రెసు రాజకీయం వెర్రితలలు వేయడం మొదలుపెట్టింది.

మూడు కోట్ల జనాభాతో ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. శ్రీ యన్. సంజీవరెడ్డిగారు శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారిని ఎన్నికలలో ఓడించారు. సంజీవరెడ్డి గత కాంగ్రెసు ఒప్పందానికి కట్టుబడలేదు. కిసాను కాంగ్రెసువారికి మంత్రివర్గంలో చోటివ్వలేదు. ఈ అగౌరవ ప్రవర్తన లాల్‌బహదూర్‌శాస్త్రిగారు, ఇతర కాంగ్రెసు నాయకులకు తెలుసు. వారు నెహ్రూతో ఈ విషయం చర్చించలేదు.

జవహర్‌లాల్‌గారికి, తతిమ్మా కాంగ్రెసు నాయకులకు 1955 లో ప్రజలు ఐక్య కాంగ్రెసుకు ఓట్లు వేసి గెల్పించారని తెలుసు. ప్రజాపార్టీ వారిని కృషికార్ లోక్‌పార్టీని మంత్రివర్గంలోనికి తీసుకోలేదు. సంజీవరెడ్డిగారు తన నైతిక బాధ్యతను విస్మరించారు. కాంగ్రెసు పెద్దలు కూడా కాంగ్రెసులో కృషికార్ లోక్‌పార్టీకి గల స్థానాన్ని గుర్తించలేదు. వారికి కృషికార్ లోక్‌పార్టీని విస్మరించే హక్కు లేదు. ప్రజాపార్టీ (ప్రకాశంగారి పార్టీ) కాంగ్రెసులో కలవలేదు అనే నెపంతో వారినీ దూరంగా ఉంచారు. ***అధిక సంఖ్య సభ్యులు గల పార్టీ అల్ప సంఖ్యాకులపై ఆధిపత్యం వహిస్తున్నది.*** అతి కొద్దిమంది మాత్రమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారు. ఇంగ్లాండు, అమెరికాలలోని ప్రజాస్వామ్యాలు ఈవిధంగా నడవవు. భారతదేశంలోని ప్రజలు ఎంతో ఓర్పు గలవారు.

ప్రభుత్వం అవినీతికి వ్యతిరేకంగా 'సంతానం' కమిటీ వేశారు. ఈ కమిటీ సక్రమంగా నడవలేదు. శ్రీ కె.యమ్. మున్షీగారు కాంగ్రెసులోని అవినీతికి విరుగుడుగా స్వీడిష్‌వారి 'అంబడ్స్‌మన్' (Ombodsman) అనే స్వతంత్ర సంస్థను భారతదేశంలో కూడా ప్రవేశపెట్టాలి అని (నేటి లోక్‌పార్టీ) ప్రచారం చేశారు. ★

46. మీకా దమ్ముందా?

1957 లోక్‌సభలో నేను రెండు ముఖ్యమయిన ప్రసంగాలు చేశాను. కమ్యూనిస్టు పార్టీ నాయకుడయిన శ్రీ యస్.ఎ. డాంగేగారు కాంగ్రెసుపైన, నెహ్రూగారిపైన, ప్రజాస్వామ్య పునాదులపైన తీవ్రమయిన ఆరోపణలు చేశారు. కాంగ్రెసును, మార్క్సిస్టు ప్రజలను, ప్రభుత్వాలను అనుసరించమని కోరారు. స్పీకరు అనంత శయనం అయ్యంగార్ నన్ను మాట్లాడమన్నారు. ఈ సందర్భంగా లోక్‌సభలో నా ఉపన్యాసం అందరికీ నచ్చింది. డాంగేగారి వాదనను ఈవిధంగా త్రిప్పి కొట్టాను. గాంధీగారి ఆలోచనలను అనుసరించే దేశం భారతదేశం. మార్క్సిజాన్ని అనుసరించే రష్యా (U.S.S.R.) లక్షలాది రైతులను చంపి, కోట్లాది స్వతంత్ర రైతులను కూలీలుగా మార్చింది. భారతదేశం తన పరిశ్రమలకు అమెరికా సహాయాన్ని కోరటం సబబే. ప్రపంచంలో ప్రజలు ఎక్కడ అసంతృప్తితో ఉంటారో అక్కడ కమ్యూనిస్టు ప్రభుత్వం వస్తుందని డాంగేగారు నమ్ముతారు. ఈ దేశంలోని ప్రజలు ఉన్న కొద్దిపాటి వనరులను కూడా పోగొట్టుకొని కమ్యూనిజం వైపు పయనించలేరు. ఈ నా ప్రసంగం తరువాత కమ్యూనిస్టులెవరూ ఇటువంటి ప్రతిపాదనలు చేయలేదు.

శ్రీ యం.ఆర్. మసానీగారు ప్రవేశపెట్టిన 'కోత తీర్మానం' పైన నేను రెండవ ప్రసంగం చేశాను. మసానీగారు సోవియట్ దేశాలలో సహకార వ్యవసాయం విఫలమైందని చెప్పారు. చైనావారి 'కమ్యూనులు' (వ్యవసాయ క్షేత్రాలు) హండ్రెడ్ ఫ్లవర్స్‌ను, కమ్యూనిస్టు తరహా సేద్యాన్ని భారతదేశం అనుసరించదన్నారు. భారత రైతులను ఇటువంటి ప్రమాదకర పద్ధతులలోకి నెట్టవద్దు అని చెప్పారు. నేను మసానీగారి వాదనను సమర్థించాను. "రైతుల ఓట్లతో గెలిచిన నెహ్రూగారు

సహకార వ్యవసాయాన్ని జాతీయోద్యమంగా ప్రచారం చేయడం, ప్రజల అభి ప్రాయాలను లెక్కచేయకుండా, పరిగణలోనికి తీసుకోకుండా చేయడం తప్పు. ఈ దేశంలో రైతులు స్వతంత్రులు, స్వేచ్ఛాజీవులు. గాంధీ ఆశయాలపై నమ్మకం కలవారు. వికేంద్రీకరణకు అనుకూలురు. ఖరీదైన ప్రభుత్వ పెత్తనాన్ని అధికారుల లంచగొండితనాన్ని సహకార వ్యవసాయం పేరిట రైతులపై రుద్దవద్దు" అని చెప్పాను. ఒక్క యం.పి. మినహా చర్చలో పాల్గొన్న అందరూ నా వాదనను బలపర్చారు.

ఎన్నికల తరువాత జరిగిన ఈ చర్చలో కాంగ్రెసువారికి నా మద్దతు ఎంత వరకు ఉంటుందో తెలియచెప్పాను. నా ప్రసంగం తరువాత దేశంలోని రైతు పక్షపాతులందరూ నాతో కలిసి వచ్చారు. నాతో కలిసిరాని ఆ ఒక్క యం.పి. (శ్రీ కొత్త రఘురామయ్య) గారిని నెహ్రూగారు డిప్యూటీ మంత్రిగా తన మంత్రి వర్గంలోనికి తీసుకున్నారు. అదీ నెహ్రూగారి రాజకీయం.

పార్లమెంటులో నా ప్రసంగం తరువాత నెహ్రూగారు తనకు అలవాటయిన పరోక్ష పద్ధతులతో రైతులను మభ్యపెట్ట చూశారు. శ్రీ వినోబాభావేగారి నైతిక శక్తిని తోడుతెచ్చుకున్నారు. కాంగ్రెసుపార్టీ ముఖ్య కార్యదర్శి శ్రీ శ్రీమన్నారాయణ్‌ను వినోబాభావే 'ఏల్‌వాల్'లో (మైసూరు రాష్ట్రం) ఏర్పాటుచేస్తున్న సమావేశాలకు (1959) సహకరించవలసిందిగా కోరారు. ఆ 'ఏల్‌వాల్' సమావేశాలలోనే 'గ్రామదాన్' ఉద్యమం 'భూదానోద్యమపు' ముసుగులో ప్రవేశించింది. భారత రాష్ట్రపతి బలపరచిన ఈ ఉద్యమాన్ని ప్రధాని, కాంగ్రెసు నాయకులు, కమ్యూ నిస్టులు, సోషలిస్టులు అందరూ బలపర్చారు. తోడ్పాటు నందించారు.

నన్నీ సమావేశాలకు పిలువలేదు. ఇతర కిసాను సోదరులను కూడా పిలువ లేదు. మేమీ చైనా తరహా సహకార సేద్యానికి వ్యతిరేకం. మేము 'సేవా సహకార కేంద్రాలను' కోరుతున్నాం. చైనా వ్యవసాయం భారత జాతీయ విధానంగా రూపుదిద్దటం మేము ఆమోదించలేదు. జవహర్‌లాల్‌గారు ఈ 'సహకార వ్యవసాయాన్ని' గాంధీగారి ముఖ్య అనుచరులైన వినోబాభావేగారి పేరుమీద ప్రచారం చేయడంతో కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ ఎత్తు చిత్తు అవుతుందని,

నేను నా నోరెత్తలేనని వారు ఆశించారు. కానీ వారి ఆశ నిరాశ అయింది.

గాంధీగారి జన్మదినాన్ని 2-10-1957న గుంటూరు జిల్లా, నారాకోడూరులో జరుపుకుంటున్నాము. ఆ బహిరంగసభలో శ్రీ బాపయ్యగారు, శ్రీ బి.వి. శివయ్య గారు (బండ్లమూడి వెంకటశివయ్య) 'ఏల్‌వాల్'లో జరుగుతున్న సమావేశాలను తీవ్రంగా విమర్శించారు. 'ఏల్‌వాల్' చర్చలపై నా అభిప్రాయం స్పష్టీకరించ వలసిందని కోరారు. ఆ నెలాఖరున శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారు నిర్వహిస్తున్న కృష్ణా జిల్లా కిసాను కాన్ఫరెన్సుకు వెళ్ళవలసి ఉంది. ఈ ఏల్‌వాల్ చర్చలను నా కర్షక సోదరులతో పంచుకోవాలి. గ్రామదాన్ ఉద్యమాన్ని ఎదుర్కొన తలిస్తే మరలా నెహ్రూగారితో తలపడాలి. ఇది సామాన్యమైన పని కాదు. దేశంలోని పత్రికలవారితో, ప్రతిపక్షాలతో నేను తగాదా పడాలి.

ఇది ఆత్మహత్యాసదృశమైనది. నేను కాంగ్రెసు నుండి విడిపోవచ్చు. దేశంలో వయోజన ఓటింగు చూసిన తరువాత కాంగ్రెసు పార్టీ నెహ్రూగారికి వ్యతిరేకంగా కలసివస్తుందా? నేను మరల ఈ వయస్సులో పోరాటానికి నడుం బిగించాల్సిం దేనా? కార్టూనిస్టు శ్రీ శంకర్‌గారు చిత్రించినట్లు 'ఒంటరి నాగలి' వ్యవసాయం చేయవలసిందేనా? నా అంతరాత్మ ప్రబోధానికి వ్యతిరేకంగా నడవలేను. అందుకే నేను మచిలీపట్నంలో రైతులనవసరమయితే సత్యాగ్రహం (గ్రామదాన్‌కు వ్యతిరేకంగా) చేయమన్నాను.

పేపర్లలో ఈ విషయం వచ్చీ రాకముందే వినోబాభావేగారు 'గ్రామదాన్' రైతులను ఒత్తిడిచేసే ఉద్యమం కాదన్నారు. జవహర్‌లాల్‌గారు, శ్రీ పంత్‌గారు, వైస్-ప్రెసిడెంటు శ్రీ రాధాకృష్ణన్‌గారు, దేభర్‌గారు గ్రామదాన్ రైతులకు వ్యతిరేకం కాదు అని నాకు జాబులు వ్రాశారు.

ఆ జాబులను చూచినట్లయితే నా మానసిక వేదన,ఆందోళన అర్థమవుతుంది. ఈ వత్తిడిని తట్టుకునే శక్తినిచ్చిన భగవంతునికి నా ధన్యవాదాలు.

(ఈ జాబులను 1. Why Ranga Resigns? 2. Freedom in Pearls. 3. Storm bursts over Peasants లో చూడవచ్చును.)

కాంగ్రెసు పార్టీ సీనియర్ కార్యదర్శి

కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ నన్ను సీనియర్ కాంగ్రెసు సెక్రటరీగా 1 మే, 1958 న ఎన్నుకొన్నది. జవహర్‌లాల్ నన్ను కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీకి పరిచయం చేస్తూ "రంగాగారు ఇక మనకు సాయం చేస్తారు" అని నవ్వుతూ అన్నారు. ఈ సంతోషం రెండు సంవత్సరాలకు మించి ఉండలేదు. ఈ రెండు సంవత్సరాలు నెహ్రూగారు నాతో సుహృద్భావంతో కలసి పనిచేశారు. జాతీయ, అంతర్జాతీయ సమస్యలలో నా సహాయము అరమరికలు లేకుండా తీసుకున్నారు. కానీ మా ఇద్దరి మధ్య 'అడ్డు' ఉందని మాకిద్దరకూ తెలుసు.

సోవియట్ రష్యా రైతాంగ ఆర్థిక విధానంపైననే ప్రణాళిక సంఘపు ధ్యాసంతా ఉంది. దేశంలో పంటలు బాగా పండాలని, ఎక్కువ మొత్తంలో ఈ పంటలుండా లనీ, అప్పుడే భారతదేశం స్వయంసమృద్ధి సాధిస్తుందని వారి భావన. ఇక్కడ కిసానుల ఆర్థిక దృక్పథం పనికిరాదని వారి నమ్మకం. మేము కలసినప్పుడల్లా నెహ్రూగారు ఈ విషయాలే చెప్పేవారు. నేను వారితో ఏకీభవించలేకపోయాను. చివరకు వారు ప్రణాళికా సంఘపు ఆలోచనకు అనుగుణంగా 'నాగపూర్' సభలో తీర్మానం పెట్టాలని నిశ్చయించుకున్నారు. నేను వారిని ఈ విషయమై హెచ్చరించాను. "ఆ సభలో మాట్లాడి మీ దృక్పథాన్ని ఒప్పించుకో"మన్నారు. అక్కడ వాతావరణం అంతా నాకు వ్యతిరేకం కదా! వారెందుకు కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ అంటే భయపడుతున్నారు? వారెందుకు మౌనంగా ఉన్నారు? వారి ఆలోచనలను ఎందుకు బాహాటంగా చెప్పటంలేదు? వారు పార్టీలో సీనియర్ కదా! విజ్ఞత కలవారు కదా!

వారా సమావేశాన్ని ఏర్పాటుచేసింది నన్ను, పార్లమెంటరీ పార్టీ మెంబర్లను నోరు మూయించడానికే అని అర్థమయింది. నేను ఆవేశం పట్టలేక "నన్ను మీరెందుకు దూరం చేసుకుంటున్నారు? 1951–53 లలో మద్రాసులో జరిగిన పరాభవం గుర్తులేదా? మనలో మనమే కలహించుకొని, కమ్యూనిస్టులకు రాజ్యాధికారం ఇచ్చే పరిస్థితి తెచ్చుకున్నామే? ప్రజాస్వామ్యాన్ని పూడ్చిపెట్టే స్థితి కొచ్చామే? అని వారితో అన్నాను.

11-1-1959 న నాగపూర్ సమావేశం సహకార విధానానికి (నెహ్రూగారి) అనుకూలంగా జరిగింది. నేను నా అసమ్మతిని 19 జనవరి, 1959 న తెలియ చేశాను. కాంగ్రెసు పార్టీ సెక్రటరీగా మార్చి నెలలో రాజీనామా చేశాను. జూన్ 19 న కాంగ్రెసు పార్టీలో నా సభ్యత్వాన్ని వదులుకున్నాను.

నెహ్రూగారు ఈ రెండు సంవత్సరాలలో నాతో ఉన్నంత చనువుగా ఎప్పుడూ లేరు. దేశానికి సంబంధించిన పలు కీలక విషయాలు నాతో చర్చించేవారు. నా అభిప్రాయాలకు విలువనిచ్చేవారు. జాతీయ, అంతర్జాతీయ విషయాలలో నా సలహా ఎప్పుడూ తీసుకునేవారు. వారు నన్ను కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ సీనియర్ సెక్రటరీ గానివ్వకుండా చేయదలచుకుంటే వారి పద్ధతులు వారికున్నాయి.

కాంగ్రెసు పార్టీకి రాజీనామా చేసి మరలా కాంగ్రెసులో కలవడంతో నా గౌరవం పెరిగింది. కమ్యూనిస్టులను ఓడించటంతో అది మరీ ఎక్కువైంది. వారు నన్ను తన సన్నిహిత వర్గంలోకి తీసుకున్నారు. గతంలో కూడా నెహ్రూ గారు, సర్దార్ పటేలుగారు గాంధీగారితో ఇలానే ప్రవర్తించేవారు. గాంధీగారు వారిని క్షమించేవారు. ఏ పదవులు కోరని నన్ను కనీసం ప్రజాపద్దుల (Public Accounts) కమిటీ అధ్యక్షునిగానైనా ఉండమని కోరటం జరిగింది. ఈ కమిటీ మీద ఎవరి నియంత్రణా ఉండదు. ఇదంతా వారికి నాపై గల ప్రేమను తెలియ చేస్తుంది.

ప్లానింగు కమీషనువారు (ప్రణాళికా సంఘం) తయారుచేసిన ప్రణాళికలపై నేను, నెహ్రూగారు కలసి మాట్లాడుకోవటం కాంగ్రెసులో అందరికీ సంతోషం కలిగించింది.

మాలవీయాలాంటి కొత్త సోషలిస్టులు నన్ను పార్టీ నుండి బహిష్కరించమని కోరినా నెహ్రూగారు 'ససేమిరా' అన్నారు. కాంగ్రెసు కార్యవర్గం నన్ను బహిష్క రించమని కోరింది. నా కాంగ్రెసు పార్టీ రాజీనామాను వారు అయిష్టంగానే ఒప్పుకున్నారు. 1951-55 లలో వచ్చిన పరిణామాలు వారి మనస్సులో ఉన్నాయ్. వారు నేను పార్టీకి రాజీనామా చేయాలా, వద్దా అన్న విషయాన్ని నాకే వదలివేశారు. ఈ చాలారోజుల ఊగిసలాట వారిలో గుణాత్మక మార్పుకు కారణమైంది.

జవహర్‌లాల్‌గారు నేను కాంగ్రెసు నుండి రాజీనామా చేస్తానని ఊహించ లేదు. అంతేగాక వారి ఒకనాటి మిత్రుడు శ్రీ రాజాజీతో నా స్నేహం బలపడు తుందని వారు భావించలేదు. యం.ఆర్. మసానీ, మున్షీ, వి.పి. మీనన్, నారాయణరెడ్డి, బెంగుళూరు శ్రీనివాసన్, సర్దార్ లాల్‌సింగ్, లోబో ప్రభు, రత్నస్వామి, బి.డి. పటేలు, పంజాబు, కర్నాటక కిసాను నాయకులు – వీరందరూ నాకు మద్దతునివ్వటం వారి కచ్చకు కారణం. వారు ప్రజలలో ఉన్న గౌరవాన్ని పోగొట్టుకొనే పరిస్థితి ఎదురయింది.

ఆ దమ్ము ఉందా?

వారు కడుపుమంటతో "నా గౌరవనీయ మిత్రుడు చాలా పార్టీలు మార్చాడు" అన్నారు. "నాకాధైర్యం ఉంది. నా గౌరవనీయ మిత్రుడు జవహర్‌లాల్‌గారికి ఆ దమ్ము, ధైర్యం లేవు" అని సమాధానం చెప్పాను. చాలా సందర్భాలలో నెహ్రూగారు గాంధీగారితోనూ, కాంగ్రెసు కార్యవర్గంతోనూ తగాదా పడేవారు. నెహ్రూగారు రాజీనామా చేస్తారని అనుకొనేవారు. కానీ వారాపనిని ఎప్పుడూ చేయలేదు. రాజీనామా చేసివుంటే వారికి జరిగే నష్టమేమిటో తెలుసు. నెహ్రూ గారి కమ్యూనిస్టు భావాలకు వ్యతిరేకంగా గాంధీగారు "నీ–నా మధ్య అభిప్రాయ భేదాలు చాలా తీవ్రమయినవి. మన ఇద్దరం కలిసే అవకాశం లేదు" (Bunch of Letters) అని అన్నారు. నేను ఇటువంటి విషయాలు చాలా గుర్తుచేయ గలను. వారు తన తొందరపాటు మాటకు ఊరకుండి నా చమత్కారానికి నవ్వుకున్నారు. పార్లమెంటు కూడా నవ్వులతో నిండిపోయింది.

Sri Jawaharlal Nehru : Would the Hon'ble Member repeat what he said, so that I may be able to understand him?

Prof. Ranga : I am speaking, I think, plainly enough so that my Hon'ble friend can understand. We have known each other for 30 years and he should be able to understand.

Sri Jawaharlal Nehru : I know. The Hon'ble Member has been shifting from party to party in these 30 years. I don't know what he is after.

Prof. Ranga : It is a cheap jaibe. I had courage to do that. My Hon'ble friend never had the courage to do that.

పార్లమెంటరీ కాంగ్రెసు పార్టీ నా పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయమంది. ఐక్య కాంగ్రెసు పేరిట గెలిచిన శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు అందరూ రాజీనామా చేయవలసి ఉంటుందని నేను చెప్పాను. నెహ్రూగారి వద్ద సమాధానం లేదు. ఆ వివాదం జోలికి వెళ్ళకుండా ఊరకున్నారు. నా సుదీర్ఘ వివరణ వారిని మాట్లాడకుండా చేసింది.

జాతీయ విషయాలలో, చైనా దురాక్రమణ విషయంలో నెహ్రూగారు నాపై చాలా ప్రేమను చూపించేవారు.

★ ★ ★

47. ఐదుగురు కాంగ్రెస్ అధ్యక్షులు

1921 లో గాంధీగారు జాతీయోద్యమానికి నాయకత్వం వహించారు. అప్పటిలో కాంగ్రెసు అధ్యక్ష పదవిని అధిష్ఠించిన వారందరూ జాతీయస్థాయి నాయకులే. వారికి దేశ ప్రజలతో ఆత్మీయానుబంధం ఉండేది. సన్నిహిత సంబంధాలు ఉండేవి. సామాన్య జనంలో వీరి పర్యటనలు, ఉపన్యాసాలు ఉత్తేజాన్ని కలిగించేవి. పండిట్ నెహ్రూగారు కాంగ్రెసు అధ్యక్షునిగా ఎన్నికైనప్పుడు వారికి నిండా నలుభయ్యేళ్ళు కూడా లేవు. ఇది కాంగ్రెసు పార్టీ మోతీలాల్ నెహ్రూగారికిచ్చిన బహుమతి. అనారోగ్యవంతుడు, వృద్ధుడునైన మోతీలాల్‌గారు తన కొడుకును 'గద్దె'పై చూడాలనుకున్నాడు. స్వరాజ్యం రావటానికి చాలా సంవత్సరాలు ముందుగా కుర్రవాడైన తన కొడుకును ఆ పదవిలో ప్రతిష్ఠించాడు.

కాంగ్రెసు అధ్యక్ష పదవి చాలా గౌరవప్రతిపత్తులు కలిగినది. గతంలో ఎంతో మంది పెద్దలు ఆ పదవిలో ఉన్నారు. నెహ్రూగారు ఆ పదవి పూర్వ ప్రాధాన్యత లను ధిక్కరించారు. కాంగ్రెసు ప్రతిష్ఠ దిగజారింది. ఆచార్య కృపలానీ ఆలోచన లను పట్టించుకోలేదు. ఆయన గొణుక్కోవటం ఎక్కువయింది. ప్రధానిగా దేశాని కంతకు బాధ్యత వహించాలని, కాంగ్రెసు కూడా అన్ని పార్టీలలానే ఒక రాజకీయ పార్టీ అని నెహ్రూగారి ఉద్దేశ్యం. పటేలుగారు, గాంధీగారు ఈ అభిప్రాయానికి వత్తాసు పలికారు. కృపలానీ ఈ వివాదంతో కాంగ్రెసు అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. 'ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ మినిస్టరు'గా ఉంటూనే రాజేంద్రప్రసాద్ గారు కాంగ్రెసు అధ్యక్ష పదవి చేపట్టారు. రాజన్‌బాబు సున్నితమనస్కుడు. అతిమెత్తని మనిషి. తన ధోరణి తనదే అయినా ప్రధానమంత్రిని కాదనలేదు. ఈ విషయాలు గమనించే గాంధీగారు "కాంగ్రెసు పార్టీని రద్దుచేయమ"ని

కోరారు. దేశ ప్రజలందరూ భాగస్వాములైన పార్టీ పేరుతో స్వాతంత్ర్యాన్ని కాంగ్రెసు పార్టీ ఒక్కటే దోచుకొంటున్నది అని వారభిప్రాయపడ్డారు. అధికార పీఠం ఎక్కిన సీనియర్ నాయకులు రాజకీయాధికారం స్వాహా చేయడం మావంటి రైతులకు, సోషలిస్టులకు, ఫార్వర్డ్‌బ్లాకు వారికి, గాంధీ గారికి రుచించలేదు.

అధికారపు అంచులపై ఊరేగుతున్న నెహ్రూగారు గాంధీగారి ఆలోచనలకు విలువనివ్వలేదు. అలా జరిగితే దేశ చరిత్రే మారేదేమో!

జవహర్‌లాల్‌గారు కాంగ్రెసు అధ్యక్ష పదవికున్న 'సలహాదారు' అధికారాన్ని కూడా తమకు అనుకూలమైన పనిముట్టుగా వాడుకున్నారు. పురుషోత్తమదాస్ టాండన్ స్వతంత్రుడు. ఈ కాంగ్రెసువారు టాండనుగారిని కూడా బయటకు నెట్టారు. జవహర్‌లాల్‌గారే అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. జవహర్‌లాల్‌గారి ప్రజాస్వామ్య నిరంకుశత్వానికి ఇది పరాకాష్ఠ. జవహర్‌లాల్‌గారు చిన్న చిన్న రాష్ట్రాల ముఖ్యమంత్రులను, అనుభవం లేనివారిని కాంగ్రెసు అధ్యక్షులుగా చేయడం మొదలుపెట్టారు. అయితే వీరికి కూడా అధికారపు పురుగు బుర్రను తొలవవచ్చు కదా! అందుకే వారు తన కూతురును ఈ పదవికి ఎన్నుకున్నారు. వారీ విషయానికి ఏమీ ప్రాధాన్యతనిచ్చినట్లు కనిపించకుండా జాగ్రత్త తీసుకున్నారు. ప్రధానమంత్రి కూతురు కావడంతో ఈ పదవికి 'గ్లామర్' పెరిగింది. మూడు తరాలవారు కాంగ్రెసు గద్దె నెక్కారని నెహ్రూ అనుయాయులు భజన చేశారు. తాత నుండి మనుమరాలు వరకు 'అధికార నపుంసకత్వం' పూర్తి అయింది. అన్నీ తానే అయిన ప్రధానమంత్రి ఎంతో ప్రతిష్ఠ కలిగిన అధ్యక్ష పదవిని ఒక అనామకురాలికి కట్టబెట్టారు. భూస్వామ్యం పోతూ పోతూ రాజకీయ స్వామ్యాన్ని ప్రవేశపెట్టింది.

నెహ్రూగారు తన కూతురు తరువాత నీలం సంజీవరెడ్డిగారిని అధ్యక్షునిగా ఎంపిక చేశారు. సంజీవరెడ్డిగారు జాతీయ రాజకీయాలకు కొత్త. దేశం తిరగటానికి వచ్చిన అవకాశానికి వారు సంతోషించారు. స్వతంత్ర పార్టీ అధ్యక్షునిగా రాజాజీగారు నన్ను ఎన్నుకొన్నందులకు, సంజీవరెడ్డిగారిని నెహ్రూగారు కాంగ్రెసు అధ్యక్షునిగా ఎంపిక చేశారని అప్పట్లో అందరూ అనుకొనేవారు. పాపం సంజీవ

రెడ్డిగారు కూడా ఆ పదవిలో ఇమడలేక, తనకు రాష్ట్రంలో మరల మంత్రి పదవినే ఇప్పించమని కోరారు.

తరువాత దామోదరం సంజీవయ్యగారు, ఒక దళిత యువకుడు అధ్యక్షు డయ్యాడు. సంజీవయ్య కుర్రవాడు. “భవిష్యత్తులో అవకాశములు ఎక్కువ. కాంగ్రెసు అధ్యక్షునిగా ఉండేందుకు భయపడవలసిన పనిలేదు” అని నెహ్రూ గారు ఆకర్షణ లేని పదవి అని చెప్పకనే చెప్పారు. సంజీవయ్యగారు తాను భారతదేశ రాజకీయాలకు కొత్తవాడినని, గాంధీగారిని ఏనాడూ చూడలేదని చెప్పుకొన్నారు. ఈ వేషం కట్టిన తర్వాత వారిని ‘లేబరు’ మంత్రిగా మంత్రివర్గం లోనికి తీసుకొన్నారు.

సంజీవయ్యగారు మంచి వక్త. కాంగ్రెసులో అవకాశవాదులు, పైసల కోసం కక్కుర్తి పడేవారున్నారని వారన్నారు.

తరువాత కామరాజ్‌నాడార్‌గారు అధ్యక్షులయినారు. ఆయనకు ‘పార్కలాం’ (చూద్దాం) అనే మాట మాత్రమే తెలుసు. వర్షంలో తడుస్తూ బడి నుండి నడుస్తూ ఇంటికి వచ్చేవాడినని చెప్పుకొనేవారు. వారికి ఇంగ్లీషు, హిందీ భాషలలో ప్రవేశం లేదు. అధికారపు తీగలను ఎలా సవరించాలో బాగా తెలుసు. తమిళనాడు కాంగ్రెసు చక్రం తిప్పినవాడు. రాష్ట్రంలో కమ్యూనిస్టుల ప్రభావం ఎక్కువగా ఉన్న రోజులలో, రాజాజీగారిని తమిళనాడు ముఖ్యమంత్రి పదవిని స్వీకరించమని కోరారు. ఆ గండం గడవగనే తానే ముఖ్యమంత్రి అయ్యారు.

జవహర్‌లాల్‌గారి వారసులను ఎన్నుకోవటంలో వారి చాకచక్యం వెల్ల డయ్యింది. మొదటగా శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రిగారిని, తరువాత ఇందిరాగాంధీ గారిని. కాంగ్రెసు అధ్యక్షునిగా వారు సాధించిన విజయాలు ఈ రెండే. కామరాజ్ గారి హయాంలో కాంగ్రెసులోని అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. పార్టీ ఒక ‘చిల్లుల గంప’ అయింది. పార్టీలో తన్నులాటలను నిరుత్సాహపరచటానికే వారి కాలం అంతా సరిపోయింది. ఉత్తరప్రదేశ్, బీహార్, మైసూర్, గుజరాత్, పంజాబ్, ఆంధ్ర, ఒరిస్సా మరియు రాజస్థాన్‌లలో ఈ బెడద ఎక్కువయింది. ‘కామరాజ్ పథకం’ పార్టీలో అధికార వ్యామోహాన్ని తగ్గించటానికి ఉద్దేశించ

బడింది. కానీ ఈరోజున ఆ పథకం నామమాత్రావశిష్టమై గుల్లబారిపోయింది. తక్కువ మాటలు, ఎక్కువ చేతలు గల కామరాజ్ పార్టీని ఉత్సాహపరచలేక పోయాడు. వీరి అధ్యక్ష కాలంలో తొమ్మిది రాష్ట్రాలలో కాంగ్రెసు తన అధికారాన్ని పోగొట్టుకున్నది. వీరి హయాంలోనే పార్టీ ఫిరాయింపులు ఎక్కువ అయినాయి. ఈ ఫిరాయింపుల అనైతిక రాజకీయ భూతం ప్రభావంతో ఎం.ఎల్.ఎ.లు పార్టీలు మారసాగారు.

కాంగ్రెసు నాయకులు మరలా అధ్యక్షుని కొరకు వెతుకులాటలో పడ్డారు. వారికి మైసూరు ముఖ్యమంత్రి నిజలింగప్ప దొరికాడు. వారు ప్రజల కళ్ళకు ఎలా గంతలు కడ్తారు? 'శరావతి' డామ్ వివాదంలో చిక్కుకున్న నిజలింగప్పను కాంగ్రెసువారు ఎలా, ఎందుకు ఎన్నుకున్నారో అనూహ్యం. నెహ్రూ తరువాత వచ్చిన ఐదుగురు అధ్యక్షులకు జాతీయ అవగాహన కొరవడింది. ఢిల్లీలోని పత్రికలు కూడా 'రాజకీయం భ్రష్టుపట్టింది' అని రాసాయి (4-12-1967).

1951 లో మరల 1959లో లాగానే పార్టీని వీడినవారు మరికొందరున్నారు. మేము పార్టీని సిద్ధాంత వైరుధ్యంతో వదిలితే, వీరు పార్టీని నిరాశా నిస్పృహలతో వదలినవారు. వీరు కాంగ్రెసులోని అసంతృప్తవాదులు. వీరు కాంగ్రెసు పార్టీని వీడినా, తాము కాంగ్రెసు పార్టీ సిద్ధాంతాలను 'తు.చ.' తప్పకుండా ఆచరిస్తామని ఎన్నికలలో చెప్పేవారు. వారు కొత్త పార్టీలను నిర్మించడంలో, నడపడంలో అనుభవం లేనివారు. ఇతర ప్రజాస్వామ్య పార్టీలతో కలసి నడువలేనివారు. వీరు ఈ కారణాల వలననే బలహీనమైన ప్రతిపక్షాలుగా మిగిలిపోయారు.

అవినీతి, అసమర్థ పాలనలో మ్రగ్గే దేశంలో బలమైన ప్రతిపక్షాన్ని నిర్మించడం కాంగ్రెసువారి బాధ్యత కాదా? ఈ చిన్నా చితక వేరుబడిన ముఠాలు, ఒకటి రెండు పెద్ద పార్టీలుగా అవతరించకపోగా 'క్రాంతిదళ్' అని పేరు పెట్టుకోవటం సరైనదేనా? కాంగ్రెసు దేశాన్ని దివాళా తీయించింది. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారన్నట్లు 'ఇది ఆలోచనల విపత్కర పరిస్థితి'.

అన్ని పార్టీలతో (ఒకే త్రాటిపై) కలిసి నడవడానికి కాంగ్రెసువారు ఇష్టపడే వారు కాదు. కేరళ, పశ్చిమబెంగాల్, పంజాబ్, హర్యానా, బీహార్, ఉత్తరప్రదేశ్

లలో ఈ పరిణామాలు చోటుచేసుకొన్నయ్. బ్రిటీషు పద్ధతిలోనే పాలన సాగించారు. కాలం చెల్లిన మైనారిటీ ప్రభుత్వాలను నిలబెట్టి నాటకం ఆడారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై ప్రజల ఆశలను అణచివేశారు.

కాంగ్రెసు పార్టీ తనంత తానుగా కుళ్ళిపోయి రాలిపోతుందని నేను 1952లో ఆ పార్టీని వీడినప్పుడు భావించాను. ఇది భారతదేశపు ప్రజాస్వామ్యానికి క్షేమం కాదు అని చెప్పాను. దేశాన్ని కమ్యూనిస్టులకు అయాచితంగా బహుమతిగా ఇవ్వటం అవుతుందని చెప్పాను.

తరువాత వచ్చిన పరిణామాలు నా నమ్మకాన్ని నిజం చేశాయి.

★ ★ ★

48. వినోబాభావే - రైతులు

ఆంధ్రా రైతులు గ్రామదాన్‌కు వ్యతిరేకం

12 జులై, 1957 ఎండలు మండిపోతున్నాయ్. అయినా ఈరోజు విజయ వాడలో చాలా చల్లగా, హాయిగా, ఆహ్లాదకరంగా ఉంది. లక్షమందికి పైగా రైతులు ఇక్కడ సమావేశమయ్యారు. విశాలమైన నాలుగు రోడ్ల కూడలిలో, కృష్ణా కాలువ ఒడ్డున, చెట్లపై ప్రజలు తంతెలు-తంతెలు (వరుస వరుస) గా ఎదురు చూస్తున్నారు. ఈరోజున కేంద్ర మంత్రి గౌరవనీయులు శ్రీ యస్.కె. పాటిల్‌గారు నా కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల, చేతివృత్తుల, గ్రామీణ ప్రజల జాతీయ చిహ్నంగా ఈ విగ్రహం నిలుస్తుందన్నారు. నా ఊహలకు, ఉద్దేశాలకు అనుగుణంగా, తర తరాలుగా, సంస్కారవంతులైన లక్షలాది ప్రజలు నా సేవకు ఇది ఒక గుర్తుగా నిలుస్తుందని భావిస్తున్నారు. డా॥ జి. డిమిట్రోవ్, ఇంటర్నేషనల్ పెజెంట్స్ యూనియన్ సెక్రటరీ గారు "ప్రపంచ రైతులకు, ప్రజలకు ఇది తగినదని" వ్యాఖ్యానించారు.

ఆంధ్రులు ఈ విగ్రహాలు నెలకొల్పటంలో ముందు ఉంటారు. సర్కార్ జిల్లాలలో ఎక్కడ చూచినా ఈ విగ్రహాలు కన్పిస్తాయి. ప్రజలు స్వచ్ఛందంగా నాకు, ప్రకాశంగారికి కూడా ఈ విగ్రహాలు నెలకొల్పారు.

శ్రీ జి.వి.యస్. నాయుడుగారు (గూడూరు) చాలారోజులుగా నా చలువరాతి విగ్రహానికి ప్రఖ్యాత మద్రాసు శిల్పి శ్రీ జి. నాగప్పగారు రూపకర్తగా ఉండాలని అభిలషించారు. నేను ఈ ఆలోచనను కాదంటూ వస్తున్నాను.

శ్రీయుతులు గొర్రెపాటి వెంకటసుబ్బయ్య, జి. సీతారామయ్య, కె.యల్.పి.

శాసనసభ్యుడు యన్.వి. నాయుడు, జి. లచ్చన్న, వి.వి. రమణ – వీరందరూ నా కాంస్య విగ్రహం బెజవాడలో ప్రతిష్ఠించాలని అభిలషించారు. విగ్రహ నిర్మాణ సంఘం 1952 లో ఈ నిర్ణయం తీసుకున్నది. మున్సిపాలిటీ అనుమతినిచ్చింది. ఆంధ్ర మంత్రులు, ఇతర పెద్దలు ఈ విగ్రహ నిర్మాణానికి యథాశక్తిగా ధన సహాయం చేశారు.

నేను ఈ విగ్రహాలందించే 'బోధన'ను అర్థంచేసుకొని వారికి అనుమతి నిచ్చాను.

ప్రజలు ఎందుకు ఈ విగ్రహ నిర్మాణముపై శ్రద్ధ వహించారు? నెహ్రూగారిపై నేను చేసిన బహిరంగ విమర్శలు రైతులను ఆకట్టుకొన్నాయి. నాపై క్రమశిక్షణా చర్యలకు పూనుకున్న కాంగ్రెసు నాయకులను ప్రజలు నిరసించారు. నేను వినోబాభావేగారి 'గ్రామదాన్' ఉద్యమానెదుర్కోవటం వారికి సంతోషం కలిగించింది. కాంగ్రెసువారికి, రైతులకు వివాదం రాజుకుంది.

కంట్రోళ్ళు, కోటాలు, పర్మిట్లు, లైసెన్సులు, నిర్బంధ ధాన్య సేకరణ – కాంగ్రెసుపై వ్యతిరేకత ఈ విగ్రహ ప్రతిష్ఠకు కారణాలు. పల్లెల్లో ఉన్న రైతులకు నెహ్రూగారి ఆలోచనలు నచ్చలేదు. ప్రపంచ ప్రజాస్వామ్యానికి కృషికార్ లోక్‌పార్టీ చేసిన సేవ చిన్నదేం కాదు వారి నామమాత్రపు ప్రజాస్వామ్య తొందరలో. కాంగ్రెసువారు సహకార (సమిష్టి) వ్యవసాయానికి, చేతి వృత్తులవారికి, వారి కళలకు మేము అడ్డుగా ఉన్నామనుకున్నారు.

కాంగ్రెసువారు రైతులను స్వతంత్ర ఆర్థిక విధానానికి దూరంచేసి, సహకార సేద్యం, సమిష్టి వ్యవసాయాలకు మళ్ళించాలని చేసిన ప్రయత్నాలపై కృషికార్ లోక్‌పార్టీ పోరాడింది.

కిసానులు వినోబాభావే గ్రామదాన్ ఉద్యమానికి వ్యతిరేకం

1957 వ సంవత్సరం, అక్టోబరులో మచిలీపట్నంలో, నవంబరులో గుడివాడలో, డిశెంబరులో నెల్లూరులకు తరలివచ్చిన జనాన్ని చూసి నా మనస్సు ఆనందంతో నిండిపోయింది. జోడెద్దుల బండ్లపై రైతు నాయకులకు స్వాగతం పలకటం సాంప్రదాయం. ఈ మూడుచోట్ల రైతులు ఒకరొకరితో పోటీపడ్డారు.

58 జతలు మచిలీపట్నంలో, 116 జతలు గుడివాడలో, 200 జతలు నెల్లూరులో కట్టి నన్ను ఊరేగించారు. హిందూ, మెయిల్ ఆంగ్ల పత్రికలు ఈ వార్తలను ప్రచురించాయి.

మచిలీపట్నంలో 45 వేల మంది, గుడివాడలో 50 వేల మంది, నెల్లూరులో 50 వేల మంది ప్రజలీ సభలలో పాల్గొన్నారు.

నెహ్రూగారు వినోబాభావే తలపెట్టిన 'భూదానోద్యమం' 'గ్రామదానోద్యమం' గా మార్చుతారని మేమనుకోలేదు. ఇది రైతుల ఆర్థిక విధానానికి వ్యతిరేకం. 1936 నుండి ఇటువంటి పరిస్థితులేర్పడినప్పుడు ప్రజలు నావైపు, టంగుటూరి ప్రకాశం వైపు చూచేవారు. మచిలీపట్నంలో వచ్చిన అనూహ్య స్పందన తరువాతి రెండు సభలకు మార్గదర్శకమయింది.

భూదాన్ నుండి గ్రామదాన్

నెహ్రూ, రాజేంద్రప్రసాద్, దేభర్, కాంగ్రెసు అధ్యక్షులు రామమనోహర్ లోహియా, అశోక మెహతా వంటి సోషలిస్టులు, సర్వోదయ నాయకుడు జయప్రకాశ్ నారాయణ, జి.యల్. నందా, కమ్యూనిస్టు నాయకులు ఎ.కె. ఘోష్, శంకరన్ నంబూద్రిపాద్, మైసూరు ప్రాంతంలో 'ఏల్వాల్' వద్ద భూదాన్‌కు ఆదిగురువైన వినోబాభావేని కలిశారు. దీనినే 'ఏల్వాల్' సమావేశం అంటారు.

గ్రామాలకు గ్రామాలు రైతులందరూ 'దానం' చేస్తే పెద్ద పెద్ద యంత్రాలతో సహకార వ్యవసాయం చేయాలని వీరి ఉద్దేశం. (రైతులందరూ కూలీలుగా మారతారని రంగాగారి ఉద్దేశ్యంగా అనువాదకుడు భావిస్తున్నాడు.)

నేటి ఫాక్షనిజానికి కారణం ఈవిధమైన పరిపాలనే!

బి. రామచంద్రారెడ్డి, చెన్నారెడ్డి ఈ సభలో ఉన్నారు. బెజవాడ రామచంద్రా రెడ్డిగారు స్వతంత్ర పార్టీలో ముఖ్యులు. చెన్నారెడ్డిగారు కాంగ్రెసులో చేరారు.

నా ఆరోపణలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెసు కమిటీ, ఆల్ ఇండియా కాంగ్రెసు నాయకత్వాన్ని నాపై చర్య తీసుకొనమని కోరింది. వినోబాభావేగారు నా సాహసోపేతమయిన ఉపన్యాసానికి అభినందించారు. కాంగ్రెసు క్రమశిక్షణను నేను ఎలా ఉల్లంఘించాను అని ఆశ్చర్యపోయారు. కాంగ్రెసువారు, కమ్యూనిస్టులు

తన పథకానికి ఆమోదం ప్రకటించిన తరువాత ఇతర నాయకులందరూ గొర్రెలుగా అనుసరిస్తారని వారు భావించారు. శ్రీ ఖాసా సుబ్బారావుగారు (ఎడిటర్, ఇంగ్లీషు స్వరాజ్య) నా పక్షాన నిలిచారు.

శ్రీ కోదండరామయ్య, శ్రీమన్ పెజెంటు ఇనిస్టిట్యూట్ తరుపున గ్రామదాన్‌కు వ్యతిరేకంగా నేను చేసిన ఉపన్యాసాలను పంచాయితీ పెత్తనం (Panchayat Landlordism) – రైతాంగ ఆర్థిక విధానాలపై నా ఉపన్యాసాలను కొత్త సంవత్సరంలో (1958న) ప్రచురించారు. మున్షీ, లాల్‌సింగు, ఖాసా, మేధావి శ్రీ విశ్వేశ్వరయ్య, శ్రీ రాజాజీ, శ్రీ సి.పి. రామస్వామి, జనరల్ కరియప్ప మొదలయినవారు గ్రామదాన్ ఉద్యమాన్ని తీవ్రంగా విమర్శించారు.

గుడివాడలో సభ జరిగిన రోజునే (7–11–1957) (ఇండియా ప్రతినిధిగా) సి.పి.ఓ. కాన్ఫరెన్సుకు నాకు ఆహ్వానమందింది. పాకిస్తాన్‌కు వెళ్ళటానికి నవంబరు 11వ తేదీన తయారుగా ఉండవలసిందిగా తెలియజేశారు.

నా పుట్టినరోజునాడు (7–11–1957) ఢిల్లీలో శ్రీ ఈశ్వరదత్తు, శ్రీ చతుర్వేది, (యం.పి.), శ్రీ కె. రామారావు, శ్రీ బి.వి. నాథ్, సర్దార్ లాల్‌సింగు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి శ్రీ జగన్నాథదాస్, శ్రీ దానప్ప – చాలామంది ఆర్థికవేత్తలు, పరిశోధకులు, పార్లమెంటు సభ్యులు నన్ను అభినందించారు.

జార్జి డిమెట్రోవ్‌తో విజయవాడ, మచిలీపట్నం, గుడివాడ, నెల్లూరుల్లో నా పర్యటన విజయవంతమయింది. హైదరాబాద్‌లో 'రంగా భవనం' ప్రారంభించాం. బల్గేరియా, పాకిస్తాను, సిలోను దేశాలలో నా పర్యటన, నెహ్రూ, వినోబాభావే గార్ల విధానాలపై నేను చేసిన తీవ్ర విమర్శలు 1957 లో జరిగిన ముఖ్య సంఘటనలు.

నేనేమీ మంత్రిని కాను, నేనేమీ వ్యక్తిగత లాభాలు రాష్ట్రంలోగాని, కేంద్రంలో గాని ప్రజలకు చేస్తానని చెప్పలేదు. మరి ప్రజలలో ఈ సంతోషానికి కారణం ఏమిటి? భారత ప్రజాజీవితంలో నేను నిర్వహించిన పాత్రను, రైతాంగ ఆర్థిక విధానానికై పోరాటానికి వారు నన్నిలా అభినందిస్తున్నారు.

★ ★ ★

49. రాజాజీ ఆహ్వానం

అది 1959 సంవత్సరం జూన్ 5. మద్రాసు నగరంలోని 'ఉడ్‌లాండ్సు' హోటల్లో ఆ ఉదయం చాలా ఆహ్లాదకరంగా ఉంది. అఖిల భారత వ్యవసాయ సమాఖ్య, కిసాను సమ్మేళన్ వారి ఆహ్వానంతో అక్కడ సమావేశమయిన వారందరూ నాకు తెలిసినవారే. ఐదారు వారాల క్రితం రాజాజీగారి సలహాపై, నా సంప్రదింపులతో బెంగుళూరులో ఒక సమావేశం జరిగింది. సర్దార్ లాల్‌సింగ్, జినరాజ్ హెగ్డే, బెజవాడ రామచంద్రారెడ్డి, బెంగుళూరు మిత్రులు కొందరు, రాజాజీగారి పరిచయస్థులు చాలామంది ఈ సమావేశంలో పాల్గొన్నారు.

80 సంవత్సరాలు పైబడిన రాజాజీగారి రాకకు మేమందరం ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నాం. రాజాజీగారు వచ్చారన్న వార్త తెలిసింది. వారికి స్వాగతం పలకటానికి నేను 'త్వరత్వరగా' అందరికన్నా ముందుగా వెళ్ళాను. వారు మెల్లగా, జాగ్రత్తగా, తన చేతికర్ర ఊతంతో నడుచుకుంటూ వచ్చారు. నన్ను ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నారు. నా చేయి పట్టుకొని, నన్ను తన కుడివైపు కూర్చోపెట్టుకున్నారు. వారి మనస్సులో ఏముందో నాకు తెలియదు.

క్రితం రోజు శ్రీ వై. కృష్ణస్వామి, శ్రీ రామచంద్రారెడ్డి, శ్రీ జినరాజ్ హెగ్డే, నేను వ్యవసాయ ఆర్థిక విధానంగూర్చి ముసాయిదా తీర్మానం, నాటి జాతీయ వైఖరులను గూర్చి మాట్లాడుకున్నాం. నా ధ్యాసంతా ఈ చర్చించిన విషయాల మీదే ఉంది.

సభ మొదలయింది

నేను రామచంద్రారెడ్డిగారిని పరిచయవాక్యాలు పలుకమని కోరాను. సభలోని వారెవరో 'సభాధ్యక్షుడెవరు?' అని ప్రశ్నించారు. అందరం 'రాజాజీ' గారే అని

చెప్పాం. రాజాజీగారు అభ్యంతరం చెప్పారు. అలాగయితే ఈ సమావేశమే లేదన్నాను. రాజాజీగారు నా ఎడమచేయి పట్టుకొని, నన్ను వారించటానికి యత్నించారు.

ఎట్టకేలకు రాజాజీగారు సభాధ్యక్షులుగా ఉండటానికి అంగీకరించారు.

శ్రీ రెడ్డిగారు తన పరిచయంలో 'కాంగ్రెసువారి కమ్యూనిస్టు' ధోరణిని, నాగపూర్ తీర్మానాలను ఎండగట్టి, రైతు రక్షణ విధానాలను విడమర్చి చెప్పారు.

రాజాజీగారు అధ్యక్షునిగా 'కొత్తగా పార్టీని పెట్టవలసిన అవసరాన్ని' సభకు చెప్పారు. ప్రభుత్వపు పెత్తందారీతనాన్ని, ప్రణాళికా సంఘపు రాజ్యాంగేతర విధానాలను, ప్రజల స్వేచ్ఛాస్వాతంత్ర్యాలపై ప్రభుత్వపు దాడులను విమర్శించారు.

రాజాజీ, ఇతరులు పార్టీ నాయకుని కోసం 'వెతుకులాట' మొదలుపెట్టారు. అందరం రాజాజీగారే సరైనవారని, వారే ఈ బరువు బాధ్యతలు స్వీకరించాలని కోరాం. వారు మా మాటలు పట్టించుకోలేదు. తాను దేశంలో ఉన్న నాయకులందరినీ ఎలా సంప్రదించిందీ చెప్పారు. ముఖ్యంగా జయప్రకాశ్ నారాయణను గురించి చెప్పారు. జయప్రకాశ్ తాను నాయకునిగా ఉండననీ, తన కారణాలు తనకున్నవన్నీ చెప్పారన్నారు.

నాయకుని నడిపించే నాయకుడు

రాజాజీ నా పేరు చెప్పారు. నేను వారికి 'తోడు'గా ఉంటానని, వారే నాయకునిగా ఉండవలసిందని పలుమార్లు అడిగాను. అప్పుడు వారు 'నాయకుని నడిపించే నాయకునిగా' ఉండటానికి ఒప్పుకున్నారు. తన ప్రక్కనే నిలచి ఈ బరువును మోయమన్నారు. ఈవిధంగా 'నాయకుని నడిపించే నాయకుని' ఆ సభ ఎన్నుకొంది.

తరువాత పార్టీ తీర్మానాలు చర్చించాం. 'స్వేచ్ఛ ద్వారా దేశ ప్రగతి ఎలా సాధించాలి?' అన్న ధోరణితో ఈ చర్చ సాగింది.

సాయంత్రం 'వివేకానంద హాలు'లో జరిగే బహిరంగ సభకు 'మసాని'గారు వస్తారని, ఆ సభలోనే పేరు నిర్ణయిద్దామని చెప్పాను. సభను ఆశీర్వదించవలసిందని కోరాను. వారందరి అంగీకారంతో పార్టీ పుట్టుక మొదటి దశ ముగిసింది.

భగవంతుడే భాగస్వామి

వివేకానంద హాలులో ఆ సాయంత్రం రాజాజీగారు 'స్వతంత్ర పార్టీ' ఆవిర్భావాన్ని ప్రకటించారు. జవహర్‌లాల్ భగవంతుని రాజకీయాలకు దూరంగా ఉంచితే, స్వతంత్ర పార్టీ వివేకానందుని స్ఫూర్తితో, భగవత్ ప్రార్థనతో, భగవంతునినే ఈ పార్టీ పుట్టుకకు ఒక భాగస్వామిగా ఉండాలని కోరింది.

కొన్ని నెలలుగా 'మసాని'గారు ఇదే విషయమై ఆలోచిస్తున్నారు. 1958, 1959 సంవత్సరాలలో కొన్ని సమావేశాలు కూడా జరిపారు. రాజాజీగారితో ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా నడిపారు. మా అదృష్టంకొద్దీ వారు కూడా సాయంత్రం ఆ సభలోనే ఉన్నారు.

ఈ సభలో నేను 'రంగా కాంగ్రెసు నుండి ఎందుకు రాజీనామా చేశాడు' అనే పత్రాన్ని విడుదల చేశాను. సర్దార్ లాల్‌సింగు, సర్దార్ ఉద్దామసింగ్‌నగోకి గారలు ది.31-1-1959 న నిర్వహించిన సభకు లక్షమందికి మించి ప్రజలు హాజరయ్యారు. స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని కోరే భారత ప్రజకు – నాగపూర్‌లో జరిగిన ఆల్ ఇండియా కాంగ్రెసు సభలో, నెహ్రూగారి తీరుపై ఆధారాలతో ఒక హెచ్చరిక చేశాను. కాంగ్రెసు ప్రభుత్వం అనుసరిస్తున్న కమ్యూనిస్టు విధానాలను ఎదుర్కొనవలసిందిగా ప్రజలను కోరాను. నేను ప్రజలతోనే ఉంటానని చెప్పాను. జనరల్ కరియప్ప, సర్దార్ నగోకి, పెరుమాన్, బసంతసింగు ఈ కాంగ్రెస్ సహకారీకరణకు వ్యతిరేకంగా, ప్రజలనందరినీ కూడగట్టుకొని రాగలమని చెప్పారు. నేను, వీరందరూ రాజాజీగారిని మా ఉద్యమంలో పాల్గొనవలసిందని పలుమార్లు కోరాం. జాతీయ స్థాయిలో ఒక పార్టీని జవహర్‌లాల్‌కు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించటానికి రాజాజీగారు నాలుగు నెలల సమయం తీసుకున్నారు.

శ్రీ జి.డి. పటేలుగారు బెల్గాంలో నిర్వహించిన సభలో నేనూ, యం.ఆర్. మసానిగారు పాల్గొన్నాము. శ్రీ జి.డి. పటేలుగారు తరువాత కాలంలో మైసూరు స్వతంత్ర పార్టీ అధ్యక్షులయ్యారు. ఈ సభ ఫిబ్రవరి 28వ తేదీన జరిగింది.

నా ఆలోచనలను ప్రప్రథమంగా సమర్థించినవారు మసానీగారే. పార్ల మెంటులో వారు నా వెనుక కూర్చునేవారు. నేను కాంగ్రెసు పార్టీ కార్యదర్శిగా ఉన్నప్పుడు కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా ఒక స్వతంత్ర వర్గాన్ని తయారుచేసే పనిలో ఉన్నారు. మేము ఒకరికొకరము దగ్గర అవటానికి ఈ పరిచయం కూడా ఉపయోగపడింది.

తరువాత నేను నాయకునిగా, మసానీ ఉపనాయకునిగా ఉండేవాళ్లం.

ఈ మద్రాసు సభకు ముందు రాజాజీగారు బెంగుళూరులో రెండుసార్లు పలువురు నాయకులను కలుసుకున్నారు. వీరందరూ ప్రజల కోర్కెలు తెలిసిన వారు. ప్రజల హక్కులను కాలరాస్తున్న కాంగ్రెసుకు వ్యతిరేకంగా ఉన్నవారు.

ఈ సభల తరువాతనే రాజాజీగారు 'వ్యవసాయాన్ని–కుటుంబాన్ని రక్షించండి' అనే నినాదాన్నిచ్చారు. ఈ నినాదమే పార్టీ కార్యక్రమమైంది. రాజాజీగారు గాంధీగారి ఆశయాలకు అనుగుణంగా జాతిధర్మాన్ని రక్షించటానికి పూను కున్నారు. ప్లానింగు కమీషనువారి సహకారంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల వ్యక్తిత్వం మీద దురాక్రమణ జరుపుతున్నదన్నది వారి అభిప్రాయం. అందులకే రాష్ట్రాలు తమ వ్యక్తిత్వాన్ని నిలుపుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వపు మితిమీరిన జోక్యాన్ని వారు నిరసించారు. అక్టోబరు 1957 న 'ఏల్‌వాల్' సమావేశంలో గ్రామదాన్‌కు వ్యతిరేకంగా 'కిసాన్ సత్యాగ్రహాన్ని' నేను చేపడతానని చెప్పినప్పుడు వారు బహిరంగంగా నా వాదనను బలపర్చారు. 'యంగ్ ఇండియా' (Young India) పత్రిక నావైపు నిలిచింది.

గ్రామదాన్‌కు, సహకార ఉమ్మడి (సమిష్టి) వ్యవసాయానికి, కాంగ్రెసువారి నాటకాలకు వ్యతిరేకంగా రాజాజీగారు పిలుపునిచ్చారు.

మాకు బాసటగా శ్రీ కె.యం. మున్షీగారు నిలచారు. కాంగ్రెసువారి నాగపూర్ తీర్మానాన్ని వారు అప్రజాస్వామికమైనదిగా నిరసించారు. వారి నాయకత్వం మాకు కొండంత అండగా నిలచింది. వారు మాతో కలసి నడవటంకోసం మేము మా ఆగస్టు సమావేశాల వరకు ఆగవలసి వచ్చింది.

దాదాభాయ్ అమీన్, భయలాభాయ్ పటేలు, వైస్–ఛాన్సలర్ రామచంద్రరావు,

నేనూ జూన్ ఆరవ తేదీన ఒంగోలు వెళ్ళాం. వీరందరూ గుజరాత్ నాయకులు. అక్కడ నాగినేని వెంకయ్యగారితో సమావేశమయ్యాం. 'రైతుల ఆర్థిక స్థితి-సహకార వ్యవసాయం' అనే విషయంపైన చర్చ జరిగింది. నేను 8వ తేదీన గోభూమికి (మా ఇంటికి) వెళ్ళేసరికి మద్రాసు రమ్మని రాజాజీగారి నుండి ఫోను వచ్చింది. 9వ తేదీన గోఖలే హాలులో సమావేశం ఏర్పాటుచేశారు.

రాజాజీగారు ఒక ప్రత్యేక దూతను నాకోసం రైల్వేస్టేషనుకు పంపారు. నా పైననే కాదు వారికి వారి సహచరులందరిపైనా ఇటువంటి అభిమానమే ఉండేది.

'గోఖలే' (గోపాలకృష్ణ గోఖలే) పేరుమీద ఈ హాలు శ్రీమతి అనిబిసెంటు ప్రోద్బలంతో నిర్మించబడింది. వీరిరువురూ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులే.

క్రిక్కిరిసి ఉన్న ఆ సభలో నన్ను రాజాజీగారు (9-6-1957) స్వతంత్ర పార్టీ అధ్యక్షునిగా ప్రకటించారు. మొదటి 6 రోజులు స్వతంత్ర పార్టీ ఆవిర్భావాన్ని గురించి పత్రికలలో, రేడియోలో ప్రముఖంగా ప్రచారం వచ్చింది. అమెరికా, బ్రిటన్ పత్రికలు ఇది ఒక కొత్త శకానికి నాంది అని, మరొక స్వాతంత్రోద్యమానికి పునాది అని వ్రాసాయి.

ఈ కురువృద్ధుని (రాజాజీ) పునరాగమనాన్ని రాజకీయవేత్తలు, కిసానులు, కళాకారులు, వ్యాపారులూ ఆహ్వానించారు. రాజాజీగారు మాత్రమే ప్రజలకందరకూ రాజకీయ విజ్ఞాపన చేయగల సమర్థులు అని భావించారు. నిజాయితీ, సామర్థ్యం, వివేకం, పరిపాలనా దక్షత, దేశభక్తి, గాంధీ స్ఫూర్తి వారిలో ఉన్నాయి.

మూడు వారాల తరువాత బొంబాయి వెళ్ళాం. విద్యావంతులు, వ్యాపారులు, విద్యార్థులు, యువత స్పందన మాకు చాలా సంతోషం కలిగించింది.

గతంలో గాంధీగారి వెంటనున్న బొంబాయి ప్రజలు నేడు రాజాజీగారి వెంట ఉన్నారు.

జహంగీరు హాలులో జరిగిన బహిరంగ సభ 1939 లో జరిగిన ఫార్వర్డుబ్లాక్ సభను గుర్తుచేసింది. మాజీ గవర్నర్లు శ్రీ మోడీ, శ్రీ మున్షీ గారలు రాజాజీ గారిని ఆహ్వానించారు. అవినీతికి, నిరర్థకపు ఖర్చులకు, నెహ్రూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బొంబాయి యువత వేలాదిగా మా సభలకు మరల మరల వచ్చారు.

ప్రభుత్వ యాజమాన్య సంస్థలలో, ప్రభుత్వ యంత్రాంగంలో పెరుగుతున్న వృధా ఖర్చులపైన రాజాజీ తీవ్రమయిన విమర్శలు చేశారు. ప్రభుత్వాధికారాన్ని సొంత పనులకై వాడుకోవటాన్ని తప్పుబట్టారు. చట్టాన్ని-న్యాయ వ్యవస్థను గౌరవించాలి అని రాజాజీగారు చెప్పారు.

స్వతంత్ర పార్టీ వ్యవసాయదారుల పార్టీ, స్వతంత్ర వృత్తులు చేసుకునేవారి పార్టీ. స్వేచ్ఛను ప్రేమించే వారందరి పార్టీ.

స్వతంత్ర వ్యాపారస్తులు, చిన్నా పెద్దా భారీ పరిశ్రమల యజమానులు ప్రభుత్వ సహకారంతో, వ్యాపారాలు చేసి ఎక్కువమందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తారు. ఎక్కువ దేశ సంపదను కూడబెడతారు. రాజాజీగారి ఉపన్యాసం ఈ ధోరణిలో సాగింది.

ఈ కురువృద్ధుని (భీష్ముడు-రాజాజీ) ఉపన్యాసాలకు పత్రికల స్పందన బాగుంది. ఇది నెహ్రూగారి కోపానికి కారణమైంది. 'మంచీ-మర్యాద' లేకుండా వారు పత్రికలవారిపై విరుచుకుపడ్డారు. స్వతంత్ర పార్టీ మహారాజుల పార్టీ, ఇతరుల లాభాలపై బతుకుతుంది, స్వతంత్ర పార్టీ మార్పునకు (Conservative) వ్యతిరేకం అని నెహ్రూగారు ఆరోపణలు గుప్పించారు. స్వేచ్ఛకు (Liberal) అంకితమయిన పార్టీ మాది అని మేము చెప్పాం. స్వతంత్ర పార్టీ వ్యాపారస్థులకు, స్వేచ్ఛా వాణిజ్యానికి 'కొమ్ముకాచే' పార్టీ అని నెహ్రూగారు విమర్శించారు.

రాజాజీ ఈ ఆరోపణలను త్రిప్పికొట్టారు. రంగా ఈ పార్టీ అధ్యక్షుడు. వారు ఇన్నేళ్ళుగా రైతుల కొరకు పడుతున్న తపనను నెహ్రూగారు మరచారా? స్వేచ్ఛా వర్తకం, వాణిజ్యంలో తప్పేమిటి? వ్యాపారస్థులు సక్రమంగా ఉన్నంత కాలం వారిని విమర్శించే హక్కు ఏ ప్రభుత్వానికీ లేదు అన్నారు.

ఆగస్టు 1వ తేదీ లోకమాన్య బాలగంగాధరతిలక్‌గారి జయంతి. ఆరోజున మరలా సమావేశం కావటానికి తీర్మానించాం.

ఆ ఏడు వారాలు మాకు ఊపిరి తీసుకోవటానికి కూడా తీరిక లేదు. వివిధ వృత్తులవారు, వివిధ రంగాలవారూ మమ్మల్ని సంప్రదించేవారు. చిన్న చిన్న మొత్తాలలో చందాలు మాకు వేల సంఖ్యలో అందాయి.

ఈ సమావేశాలకు రెండు రోజుల ముందు శ్రీ మున్షీగారు నెహ్రూగారు 'ప్రవచించే' ఎండిపోయిన లౌకిక రాజ్యానికి వ్యతిరేకంగా స్వతంత్ర పార్టీలో చేరారు.

మా రెండవ సమావేశానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వేయిమందికి పైగా జనం హాజరయ్యారు. వీరందరూ రాజాజీ పిలుపుతో వచ్చినవారే. వీరిలో ఎక్కువమంది 'కాంగ్రెసు'వారే. వారికి స్వతంత్ర పార్టీ స్వాతంత్ర్యోద్యమానికి కొనసాగింపుగా కనిపించింది.

ప్రఖ్యాత గాయకురాలు శ్రీమతి యం.యస్. సుబ్బలక్ష్మిగారి ప్రార్థనతో మా సమావేశాలు మొదలయ్యాయి. శ్రీమతి కుర్షిద్‌బెన్‌జోషీగారు (డాక్టర్ దాదాభాయి నౌరోజీగారి మనుమరాలు) మా పార్టీలో చేరారు. దాదాభాయి నౌరోజీ జాతీయోద్యమ పితలలో ఒకరు.

రాజాజీగారు 30 నిమిషాలు నిలుచునే మాట్లాడారు. భావోద్వేగభరితమయిన తన ఉపన్యాసంలో 'స్వతంత్ర పార్టీ ఆవిర్భావాన్ని స్వాగతించవలసిందిగా' కోరారు. వారి నైతికశక్తి, ప్రావీణ్యతలు శ్రోతలను దిగ్భ్రాంతిపరిచాయి. వారు వత్తిడిని తట్టుకొని 'కూర్చొని అయినా ఉపన్యసించగలరా?' అని అందరూ అనుకున్నారు. వారు నిలచి చేసిన ఉపన్యాసం ప్రజలను ఆశ్చర్యపరచింది. భగవత్కృపతో, గాంధీగారి ఆశీర్వాద బలంతో, అంతరంగపు లోతుల నుండి పెల్లుబికిన చైతన్యంతో కొత్త ఆలోచనలను, నైతికమార్గ నిర్దేశకత్వాన్ని వారు ఈ సమావేశాలలో యువతకు అందించారు. లక్షలాది జనం ఉపన్యాసాలకై వారి వెంట పరుగులు తీశారు. ఈ రెండు సంవత్సరాలు నేను వారిని వెన్నంటి ఉన్నాను.

బొంబాయి నుండి అహమ్మదాబాద్ వెళ్ళాం. అక్కడ సభలో లక్షమందికన్నా ఎక్కువమంది జనం పాల్గొన్నారు. ఆదరణపూర్వకమైన ఆ వాతావరణం రాజాజీ గారికి ఆనందం కలిగించింది.

1959 – నాలుగవ తేదీ 'సబర్మతీ' ఆశ్రమానికి వెళ్ళాం. 'బాపూ' జీవించి ఉన్నప్పుడు చాలా సందర్భాలలో గాంధీగారిని ఇక్కడనే దర్శించుకున్నాం. సబర్మతీ

ఆశ్రమానికి తన మొదటి ప్రయాణాన్ని, గాంధీగారి ఆతిథ్యాన్ని తలుచుకొని రాజాజీగారు చలించిపోయారు.

మా పార్టీ లాంఛనంగా 'సబర్మతీ' నదీతీరాన ప్రారంభించబడింది.

నా జీవితంలో సరికొత్త అధ్యాయం స్వతంత్ర పార్టీ పుట్టుకతో మొదలయింది. (4-7-1959 - 1-8-1959) నా జీవిత చరిత్రలో జాతీయ, అంతర్జాతీయ విషయాలు పెనవేసుకున్న సంగతులు నమోదు చేయవలసి ఉంది. స్వతంత్ర పార్టీ రాజకీయ సమావేశాలు, రాష్ట్ర పార్టీ, కేంద్ర పార్టీలలో నేను చేసిన ఉపన్యాసాలు, నా రచనలూ నా రాజకీయాలకు సాక్షిగా ఉన్నాయి.

నెహ్రూగారు పది సంవత్సరాల క్రితం(27-4-1948 న) రాజాజీ మేథస్సును కొనియాడారు. 26 జనవరి, 1950 న రాజాజీ గవర్నర్ జనరల్ పదవీ విరమణ చేసినప్పుడు "మీ ఆత్మీయ భావమే కాదు, దేశానికవసరమయినప్పుడు మేము మీ సాయం కొరకు ఎదురుచూస్తుంటాం" అని అన్నారు. 'వ్యవసాయ కుటుంబం' రక్షణకై మేమిచ్చిన పిలుపుకై రాజాజీగారు మరలా రాజకీయాలలోనికి వచ్చారు. 'స్వాతంత్ర్యం కోసం ఆరాటం సమాజంలో అతి ప్రాచీనమయింది.' అది విభిన్న వ్యక్తులకు, మతాలకు చెందింది. ఆదికాలంలో ఋషుల నుండి, రామాయణ, మహాభారతాల కాలంవరకు, సోక్రటీసు మరియు ఏథెన్సు ప్రజాస్వామ్యం వరకు, విజ్ఞానుల నుండి రాజనీతిజ్ఞుల వరకు, ప్రజలలో చర్చించబడి, నాటి రాజ్యాధికారాన్ని ఓర్చి, స్వతంత్రభారతావనిలో నిలచింది. గృహాలలో, సంఘంలో, నగరాలలో వారు తమకు కావలసిన స్వేచ్ఛను, ఆధ్యాత్మి కతను, భౌతికావసరాల కోసం, నిర్భయంగా ఉండటం కోసం, శాంతియుత సహజీవనం కోసం సాంఘిక భద్రతను కోరుకుంటున్నారు.

అధికారం ప్రజలదా లేక రాష్ట్రానిదా అని అరిస్టాటిల్ నుండి ప్లేటో వరకు చర్చ జరిగింది. ఐరోపాలోని చదువరులు, విజ్ఞానులు, వివిధ వర్గాలవారు ఒకే సంఘంలో జీవించవచ్చని, వీరిపై రాష్ట్ర పెత్తనం ఉండరాదని భావించారు.

ప్రాచీనకాలం నుండే భారతదేశంలో ఈ నమ్మకం ఉండేది. ఇతిహాసాలు, పురాణాలు మనకు ఇదే నేర్పాయి. రాజులు ఈ ధర్మం అనుల్లంఘనీయమని

భావించారు. రైతుల ఆర్థిక స్వాతంత్ర్యాన్ని వారు గౌరవించేవారు. స్వయం ఉపాధిపరులకు పాలకులు భయపడేవారు. పాలకులు హద్దుమీరినప్పుడు ప్రజలు తిరగబడేవారు. బ్రిటీషువారి హక్కుల చట్టం (Bill of Rights), అమెరికాలోని స్వతస్సిద్ధ హక్కులు (Natural Rights) ఈ తిరుగుబాట్ల వల్లనే రూపొందాయి. ఈ రెండు తరాలవాళ్ళు 70 సంవత్సరాలు పోరాటం చేసింది ఈ హక్కుల కొరకే. స్వాతంత్ర్యం సంపాదించుకోవటానికే.

సోవియట్ అధికార యంత్రాంగం మానవ హక్కులను గౌరవించటంలేదు. మాట్లాడే హక్కును, వ్రాసే హక్కును నేలరాస్తుంది. స్వేచ్ఛాకాముకులందరూ ఈ హక్కుల రక్షణకై ఉద్యమించాలి.

పాలకులు వీరోచిత కృత్యాలు ఏమీ చేయనవసరంలేదు. ప్రజలను సరియైన మార్గంలో నడిపేందుకు, అధికారాన్ని ప్రశ్నించేందుకు, స్వయం నిర్ణయాధి కారం కలిగి ఉండేందుకు ధైర్యాన్ని, మనస్థైర్యాన్ని, త్యాగాన్ని అందించటం పాలకుల బాధ్యత.

స్వతంత్ర పార్టీ ఈ బాధ్యత తీసుకుంది. జవహర్‌లాల్ దీనిని 19వ శతాబ్దపు ఆలోచనగా వర్ణించారు. మానవ హక్కుల రక్షణకు, ఆర్థిక స్వాతంత్ర్యానికి వందల వేల ఏళ్ళనాటి స్వేచ్ఛాజీవితానికి ముందడుగు వేద్దాం.

★ ★ ★

భారతీదేవి రంగా, రాజాజీ, రంగాజీ

50. రాజీనామా తిరస్కారం

నేను, శ్రీ ఓ.పి. రామస్వామిరెడ్డిగారు ప్రభుత్వం ప్రవేశపెట్టదలచిన సహకార వ్యవసాయంపై ప్రయోగాత్మక పరీక్షలు నిర్వహించమని కోరాం. ప్రభుత్వం ఇంత పెద్దయెత్తున ప్రారంభించదలచిన సహకార సేద్యాన్ని సర్వీసు కో–ఆపరేటివ్స్‌కు (సేవా సహకార సంస్థలు) అన్వయించటం జనాల ఊహకందటంలేదు (1959 లోని నాగపూర్ తీర్మానం). 10–2–1952 న నా పార్లమెంటు ఉపన్యాసంలో ఈ విషయమై ప్రభుత్వాన్ని హెచ్చరించాను. మొదటి పంచవర్ష ప్రణాళికపై డా॥ కుమారప్ప కమిటీ ఇచ్చిన అధికసంఖ్యాకుల తీర్పును కాంగ్రెసు సహకార వ్యవసాయం కొరకు ఉపయోగించుకొంటుందని నేను అభ్యంతరం తెల్పాను. నేనానాడే ప్రతిపక్ష సభ్యులతో కలసి నా అసమ్మతి తెలియచేశాను. కాంగ్రెసు పార్టీ 22–12–1952 న నాతో సయోధ్య కోసం ప్రయత్నించింది. నేను ప్రతిపక్షంతో కలసి ఓటువేసిన సంగతి వారికి గుర్తుచేసినా, కాంగ్రెసు వారు నన్ను వారిలోకి రమ్మని పిలిచారు.

కమ్యూనిస్టుల నుండి రక్షించుకోవటానికి వారు నన్ను ఆహ్వానించారు.

మొదటి పంచవర్ష ప్రణాళిక

రాజ్యసభలో 10–2–1959 న నేను రైతులను, చేతివృత్తులవారిని ఈ సమిష్టి భూతానికి బలి ఇవ్వలేను అని చెప్పాను. కమ్యూనిస్టులొకవైపు నుండి – కాంగ్రెసువారింకొకవైపు నుండి రైతాంగ ఆర్థిక విధానంపై సమిష్టి వ్యవసాయాన్ని రుద్దాలని ప్రయత్నిస్తున్నారు. ప్రజల సాంఘిక కార్యక్రమాలమీద, ఆర్థిక విషయాలమీద – వ్యక్తులమీద – సమాజంమీద ఈ సమిష్టి వ్యవసాయం తీవ్రమయిన ప్రభావం చూపుతుంది.

భూములు లేని రైతులకు ప్రభుత్వం భూములు కేటాయించాలి. ప్రభుత్వం ఈ విషయమై ఏమీ చర్యలు తీసుకోవటంలేదు. ఇది గాంధీ ప్రణాళిక కాదు - రష్యావారి ప్రణాళిక. (మొదటి పంచవర్ష ప్రణాళిక)

20-12-1952 న ఆల్ ఇండియా కాంగ్రెసు జనరల్ సెక్రటరీ "పార్లమెంటు పంచవర్ష ప్రణాళికకు ఆమోదం తెల్పింది కనుక అభివృద్ధికాముకులైన అందరిమీద ఎంతో బాధ్యత ఉంది" అని వ్రాశారు. పార్లమెంటు పంచవర్ష ప్రణాళికను ఆమోదించింది. కానీ నేను పంచవర్ష ప్రణాళికకు వ్యతిరేకంగా ఓటు చేశాను. నేనీ వ్యూహకర్తల ఆలోచనలకు వ్యతిరేకం. 180 మిలియన్ల చిన్నరైతులకిది అశనిపాతం. ఈ వ్యూహకర్తలు 120 మిలియన్ల చిన్న ఆసామీల ప్రయోజనాలకు, 150 మిలియన్ల మంది ప్రభుత్వంమీద ఆధారపడకుండా వ్యవసాయం చేయటానికి అడ్డుగా నిలుస్తున్నారు. ఈ వ్యూహకర్తలు కేంద్రీకృత అధికారంపై మోజుతో ఉన్నారు. కానీ వారు సహకార సంస్థలు, పంచాయితీల మీద మాట్లాడుతున్నారు. "మీరూ, జవహర్‌లాల్‌గారూ మీ పంథాను మార్చుకొన్న పక్షంలో నేను, నా పార్టీ శాయశక్తులా మీకు సహాయం చేయగలం" అని వారికి చెప్పాను.

కాంగ్రెసు సెక్రటరీగారు "జవహర్‌లాల్‌గారిని తానడగలేనని, ప్రణాళిక ఆమోదం జరిగిన తరువాత ఇది భావ్యంకాదని" అన్నారు. ప్రణాళికకు కొన్ని విషయాలలో ముందుచూపు ఉంటుంది కదా! జవహర్‌లాల్‌గారు ఈ విషయంలో సాధించిన ప్రగతిని ప్రజలే బేరీజు వేసుకుంటారు. నేను, నా పార్టీ నాలుగు సంవత్సరాలు పూర్తిగా కాంగ్రెసుకు అనుకూలంగానే ఉన్నాం.

ఐక్య కాంగ్రెసు (1955 వరకు నా ప్రస్థావన)

కృషికార్ లోక్‌పార్టీ నాయకుడు శ్రీ గౌతు లచ్చన్న పెట్టిన అవిశ్వాస తీర్మానం ద్వారా నవంబరు 1954 లో ఆంధ్రలో కాంగ్రెసు మంత్రివర్గం పడిపోయింది. 1955 లో మధ్యంతర ఎన్నికలు వచ్చాయి. అధికారం కోసం కమ్యూనిస్టులు విశ్వప్రయత్నం చేశారు. నేను కమ్యూనిస్టులు అధికారంలోకి రాకుండా ప్రయత్నించాను. అలానే ప్రకాశంగారు, జవహర్‌లాల్‌గారు మేమందరం కలసి 'ఐక్య కాంగ్రెసు' స్థాపించాం. ఐక్యకాంగ్రెసు కమ్యూనిస్టులను చిత్తుచిత్తుగా ఓడించింది.

అసెంబ్లీలోని 160 మంది కమ్యూనిస్టులు 16 మందికి తగ్గిపోయారు. కాంగ్రెసు అధ్యక్షుడు దేభర్ 7-3-1955 "మీరు సాధించిన విజయం చాలా గొప్పది" అని నన్ను అభినందించారు. "మీరు కాంగ్రెసుతో కలసి ఉండటం అవసరం" అన్నారు జవహర్‌లాల్‌గారు. దేభర్‌గారూ ఎన్నికలలో పొత్తు అవసరాన్ని గుర్తించారు. కృషికార్ లోక్‌పార్టీ గాంధీగారి ఆదర్శాల కోసం కృషి చేసిందని, ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టిందని నేను సమాధానం చెప్పాను. 1952 లో జవహర్‌లాల్‌గారితో నా ఉత్తర ప్రత్యుత్తరాలను గుర్తుచేశాను. రైతుల యాజమాన్యాన్ని బలపరచాలని, సేవా సహకార సంఘాలకు సహకరించాలని ఐక్యకాంగ్రెసు కోరుతుంది.

1945 నుండి కాంగ్రెసు రైతు విధానాలలో మార్పు కనిపిస్తుంది. ఈ మార్పు 1957 కు స్పష్టమైంది. బహుశా రష్యా అనుభవం వలన కావచ్చు. 1945 లో సహకార (సమిష్టి) వ్యవసాయాన్ని గుర్తించానని చెప్పిన కాంగ్రెసు ఎన్నికల ప్రణాళిక 1951 లో చిన్నకమతాలు, ఆర్థికంగా లాభసాటిగాని పొలాలు వ్యవసాయాభివృద్ధికి ఆటంకాలు అని చెప్పింది. అందువలన సహకార వ్యవసాయం ఒక గ్రామానికిగానీ, అందులో పెద్దభాగానికిగానీ పరిమితమై ఉండాలని కోరింది. చాలామందిమి ఈ రైతు వ్యతిరేక ధోరణికి నిరసనగా కాంగ్రెసుకు రాజీనామా చేసి కృషికార్ లోక్‌పార్టీని నిర్మించాం. 1957 లో కొంత మధ్యేమార్గాన్ని కాంగ్రెసు పార్టీ అవలంబించింది. కొత్త ఎన్నికల ప్రణాళిక పాత ఎన్నికల ప్రణాళికకు చెల్లుచీటీ ఇస్తుంది. 1945 లో కాంగ్రెసు తీవ్రవాదానికి తిలోదకాలు ఇచ్చిందనుకొన్నాం. నాగపూర్, భావనగర్‌లోని తీర్మానాలు "రైతులే వ్యవసాయ దారులలో మధ్యవర్తులను లేకుండా చేయాలి" అనే భాషకు అర్థమేమిటి?

నెహ్రూగారు గానీ, కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ గాని నాకు పంపిన నివేదిక (27-7-1959) లోని భాగాలు 1957 నివేదికలకు సంబంధించినవి. నాగపూర్ తీర్మానం ప్రణాళికా సంఘాన్ని విడిచిపెట్టి కొత్త త్రోవ చూపుతుంది. నేను 1-8-1959న స్వతంత్ర పార్టీ అధ్యక్షునిగా ఒక సూచన చేశాను. "కాంగ్రెసు ప్రభుత్వం ఇటువంటి కొరగాని పనులు చేసి వారి సభ్యులను ఇరుకున పెట్టవద్దు.

మార్క్సిజం, స్టాలినిజంకు అంకితమయిన ఒకరిద్దరు కాంగ్రెసువాదులతో ఈ తీర్మానాలు వ్రాయించి, ప్రణాళికా సంఘాన్ని, ఆల్ ఇండియా కాంగ్రెసు కమిటీని ఊబిలోనికీడ్వవద్దు. స్వయం ఉపాధిపరులైన రైతులపై పెత్తనాన్ని మీ చేతుల్లోకి తీసుకోవద్దు."

రైతుల వ్యవసాయ ఆర్థికత ఇప్పుడే వీరికి గుర్తొచ్చిందా? సహకార సేద్యం కాంగ్రెసు ఇప్పుడే చెపుతున్నదా? ఇప్పుడు వీరు తెలివిగలవారైనారా? కాంగ్రెసు పార్టీ ఎన్నికల మానిఫెస్టోలో ఈ విషయం చెప్పలేదు అని నెహ్రూగారన్నారు. నేను, భారత కిసాన్ సమ్మేళన్, ఫెడరేషన్ ఆఫ్ రూరల్ పీపుల్స్ ఆర్గనైజేషను ఈ దుర్మార్గపు ఎత్తుగడలపై నిరంతరం ఆందోళన చేస్తున్నాం. నాగపూర్ తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ, నేను వ్రాసిన ఉత్తరాలు, పుస్తకాలు నెహ్రూగారు చదివే ఉంటారు. వారు కావాలని చేస్తున్న తప్పుకు రైతులనెలా తప్పుబడతారు? హిందూస్థాన్ టైమ్స్ (25-12-1956) పెద్ద అక్షరాలలో ప్రచురించిన సంపాదకీయం, యఫ్.ఆర్.పి.ఓ.వారు త్వరపడి మీరు చేసే ప్రచారం రైతులను తప్పుత్రోవ పట్టిస్తుంది అని వ్రాసిన విషయం నెహ్రూగారికి తెలియదా? సహకార వ్యవసాయానికి నా వ్యతిరేకతను, పత్రికలలో, పార్లమెంటులో, ప్రభుత్వ సమాలోచనల్లో, 'రైతు సహకార వ్యవసాయం' అనే నా పుస్తకంలోని కొన్ని భాగాలలో చెప్పాను. ఐనా కాంగ్రెసు నా లోక్‌సభ అభ్యర్థిత్వాన్ని అంగీకరించింది.

కాంగ్రెసు తన నైతిక బాధ్యతను విస్మరించింది

ప్రభుత్వం రైతు సంక్షేమం ఏమాత్రం పట్టించుకోలేదు. రైతుల ఆర్థిక పరిస్థితులపై నా అభిప్రాయాన్ని గౌరవించలేదు. అలా గౌరవించినట్లయితే ఈ నాయకులందరూ 'ఏల్‌వాల్' సమావేశం జరిపి గ్రామదాన్‌ను ప్రభుత్వ కార్య క్రమంగా ప్రకటించేవారు కాదు. నా వ్యతిరేకతను జవహర్‌లాల్‌గారికి తెలియ చేశాను. "రైతులలో సన్నిహిత పరిచయమున్న మాలాంటి వారందరమూ మీరు 'ఏల్‌వాల్'లో తీసుకున్న నిర్ణయాలకు విచారించాం. చాలా నిరాశ చెందాం" అని వారికి ఫిర్యాదు చేశాం.

నేను ప్రచురించి, ప్రకటించిన 'రంగా ఎందుకు రాజీనామా చేస్తున్నాడు?'

అనే చిన్న పుస్తకంలోని వివరణను జవహర్‌లాల్‌గారికి నా రాజీనామాతో పాటే పంపించాను.

కాంగ్రెసు 1955 జనరల్ ఎన్నికలలో కృషికార్ లోక్‌పార్టీ వారందరినీ తమలోకి ఆహ్వానించింది. అప్పుడు ఒంటరిగా గెలిచే అవకాశాలు లేవు. కృషికార్ లోక్‌పార్టీ, ప్రజాపార్టీలకున్న వనరులన్నింటినీ ఐక్యకాంగ్రెసుకు ధారపోశాం. ప్రజాస్వామ్యాన్ని, రైతాంగ ఆర్థిక విధానాలను కమ్యూనిస్టులు అడ్డుకుంటారనే భయంతో మేమీ పని చేశాం.

ఐక్యకాంగ్రెసు లేనట్లయితే 1955 లో ఆంధ్రాలో కమ్యూనిస్టు ప్రభుత్వం వచ్చేది. కేరళతో పాటు ఇంకా ఎన్ని రాష్ట్రాలు 1957-67 ఎన్నికలలో కమ్యూనిస్టుల పాలబడేవో! కాంగ్రెసు నాయకులు మా రాజకీయ విజ్ఞతను ప్రశంసించి, కాంగ్రెసులో చేరవలసిందని కోరారు. మేము కాంగ్రెసులో చేరగానే కాంగ్రెసువారు మాలో ఒక అతి బలహీనుడికి మా అనుమతి లేకుండా మంత్రి పదవిచ్చారు. ముఖ్యమంత్రి ఇష్టానిష్టాలతో మంత్రిపదవి ఇవ్వటం జరుగుతుందని కాంగ్రెసువారన్నారు. నన్ను సంప్రదించలేదు. రైతుల కుటుంబ ఆర్థికత్వంమీద, సహకార వ్యవసాయంమీద జాతీయ ప్రణాళికలమీద నిర్ణయం వారే తీసు కున్నారు. నా సలహాను వినకుండానే భూపరిమితి అతి తక్కువగా విధించారు. కృషికార్ లోక్‌పార్టీ అభ్యర్థులకు ఆంధ్రలో సరియైన ప్రాతినిధ్యం 1957 ఎలక్షన్లలో లేదు. నెహ్రూగారు, వారి మంత్రులు లోక్‌సభ నియోజకవర్గాల నన్నిటినీ చుట్టుతూ నా నియోజకవర్గంలో కాలు కూడా పెట్టలేదు. నాకు ఎన్నికలలో వ్యతిరేకంగా పనిచేసిన వారిపై క్రమశిక్షణా చర్యలేమీ తీసుకోలేదు.

కృతఘ్నత ఇలానే ఉంటుంది. కమ్యూనిస్టులను ఓడించటానికి కృషికార్ లోక్ పార్టీ సహాయం తీసుకోవటం వారికి క్రక్కలేని మ్రింగలేని పరిస్థితి కల్పించింది. జవహర్‌లాల్‌గారి ప్రోద్బలంతో ఆంధ్రలో అవిశ్వాస తీర్మానం పెట్టినందుకా? లేక ప్రణాళికా సంఘంవారి రైతు వ్యతిరేక ఎత్తుగడల వలననా? మామీద ఈ వివక్ష. ఈ ఎనిమిది సంవత్సరాలు నిరంతరం రైతుల పక్షాన నిలచి పోరాడాను. రైతుల యాజమాన్య హక్కులను గురించి మాట్లాడే హక్కు ఆంధ్ర అసెంబ్లీకి, లోక్‌సభ సభ్యులకు లేదు.

రైతుల స్వేచ్ఛ కోసం నేను పోరాడుతున్నాను. 1957 జూన్ నెలలో ప్రణాళికా సంఘం రెండవ పంచవర్ష ప్రణాళికలో ప్రవేశపెట్టదలచిన సహకార వ్యవసాయాన్ని అడ్డుకొన్నాను.

భారతదేశం కుటుంబ సేద్యం, స్వయం ఉపాధి పథకాల కల్పన ద్వారానే అభివృద్ధి చెందుతుంది. సహకార వ్యవసాయం ద్వారా కాదు.

నన్ను పార్టీ నుండి రాజీనామా చేయమనటం యాదృచ్ఛికం కాదు. చాలా మంది కాంగ్రెసువారు పార్టీలు ఫిరాయిస్తారన్న భయంతోనే. కాంగ్రెసు పార్టీ ఇద్దరు కృషికార్ లోక్‌పార్టీ వారిని తనలోనికి తీసుకొన్నది. వారికి మంత్రిపదవులు ఆశ చూపింది. కానీ నెహ్రూగారు వారిని రాజీనామా చేయమని అడగలేదు.

నాగపూర్ తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు చేసిన వారెవ్వరూ రాజీనామా చేయవలసిన పనిలేదు.

★ ★ ★

కీ.శే. బొల్లినేని రాములు, రచయిత, కీ.శే. పి. రాజగోపాలనాయుడు, శ్రీ అగరాల ఈశ్వరరెడ్డి

వివరణలు

1వ ఛాప్టరు

1. **చందోలు** – చందవోలు, ధనదుపురం, ధనదుప్రోలు, ధనదువోలు.
చందోలు చారిత్రకాంశము – ఇమ్మడి (2వ) కులోత్తుంగ రాజేంద్రచోడుని కాలమున 'చందవోలు' రాజ్యము ఉత్తరమున 'కళింగము' నకు దక్షిణమున 'పాకనాటి' వరకు వ్యాపించింది. ఈ కులోత్తుంగచోడునకు మల్లికార్జున పండితరాయలు సమకాలీకుడు. ఇతడు 'రాజేంద్రచోడుని కాలమున' ధనదుప్రోలుకు వచ్చాడు. రాజాస్థానమున మల్లికార్జునపండితునికి, బౌద్ధాచార్యునికి వాదప్రతివాదములు జరిగినవి. వాదమున బౌద్ధుడు ఓడిపోయినాడు. శైవులకు–బౌద్ధులకు వైషమ్యములు పెరిగినవి. బౌద్ధాచార్యుడు హత్యగావించబడ్డాడు. ఇది పండితారాధ్యునికి తెలిసి జరిగినది అని. వెలనాటి చోదరాజు భ్రాంతిపడి ఆ కవీంద్రుని కన్నులు ఊడబెరుకుడు అని తీర్పునిచ్చాడు. దీనికి పండితయ్య కోపముతో 'చందవోలు'లోని లింగోద్భవస్వామి సమక్షమున తన కళ్లను తానే ఊడబెరుకుకొని అధర్మమున తనకీ శిక్ష విధించిన – 'తద్బంధువులు – సుతులు విస్మయంబుగ నిప్పు భస్మమైపోవు' అని శాపమిచ్చెను. వెలనాటి రాజ్యమునకు క్షీణదశ ఇప్పటినుండే ప్రారంభమయ్యెను. –మల్లంపల్లి సోమశేఖరశర్మ

2. **'ఆంధ్రపత్రిక'** దినపత్రిక – దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావుపంతులుగారు 1909 లో స్థాపించారు. 1991 లో ఆగిపోయింది. ఎడిటర్లు : కాశీనాథుని నాగేశ్వరరావు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, సి. శేషగిరిరావు, శివలెంక శంభుప్రసాద్ గార్లు.
'మా తెలుగుతల్లికి మల్లెపూదండ' గేయ రచయిత శంకరంబాడి సుందరాచారి, పురిపండా అప్పలస్వామి, వేటూరి సుందరరామమూర్తి ఈ పత్రికలో పనిచేశారు. ఆంధ్రపత్రిక వారపత్రిక, భారతి మాసపత్రిక ఇతర ప్రచురణలు.

3. **కృష్ణాపత్రిక** – తెలుగు దినపత్రిక. శ్రీ కొండా వెంకటప్పయ్య పంతులుగారు మరియు వాసునారాయణరావుగారు ఎడిటర్లు. 1902 లో అంటే 115 సం౹౹ల క్రితం ప్రారంభించబడింది. కీ.శే. ముట్నూరి కృష్ణారావుగారి సారథ్యంలో నడిచింది.

4. **మొదటి ప్రపంచ యుద్ధం** – 28 జులై, 1914 లో ప్రారంభమై 11 నవంబరు, 1918 వరకు కొనసాగింది. యూరోపులో ప్రారంభమై మొత్తం ప్రపంచానికి అల్లుకొంది. నానాజాతి సమితి ప్రారంభించబడిన తరువాత యుద్ధ విరమణ జరిగింది.

5. **దుగ్గిరాల గోపాలకృష్ణయ్య** – కృష్ణా జిల్లా, పెనుగంచిప్రోలులో 2 జూన్, 1889 న జన్మించారు. ఎడింబరో యూనివర్సిటీలో ఎం.ఏ. చదివారు. స్వరాజ్య ఉద్యమకారుడు, గ్రంథాలయోద్యమం నిర్వహించారు. సంఘసేవకుడు, వేదాంతి, రామదండు నిర్మాత. చీరాల–పేరాల ఉద్యమ నిర్మాత. 'ఆంధ్రరత్న' అని వీరిని పిలిచేవారు. 1928 లో మరణించారు.

6. **చిలుకూరి వీరభద్రరావు**–పశ్చిమగోదావరి జిల్లా 'రేలంగి'లో స్థిరపడ్డారు. 1872 లో జన్మించారు. చాలా పత్రికలలో పనిచేశారు. 1809–1902 మధ్యకాలంలో ఆంధ్రుల చరిత్ర వ్రాసారు. శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారి ఆధ్వర్యంలో ఆంధ్రసభ వారిని 'చరిత్ర చతురానన' అనే బిరుదుతో గౌరవించింది.

7. **డా॥ అనిబిసెంటు** – 1 అక్టోబరు, 1847 లో లండనులో జన్మించి, 20 సెప్టెంబరు, 1933 లో 'అడయారు' (మద్రాసు) లో మరణించింధి. థియోసాఫిస్టు, స్త్రీల హక్కులకై పోరాటం చేసింది. రచయిత్రి, గొప్ప ఉపన్యాసకురాలు. భారత స్వాతంత్ర్య సమరంలో ఈమె పాత్ర చెప్పుకోదగ్గది.

8. **లోకమాన్య బాలగంగాధరతిలక్** – 23 జులై, 1856 న బొంబాయిలోని 'రత్నగిరి'లో జన్మించారు. ఆగస్టు 1, 1920 న మరణించారు. భారత స్వరాజ్య సమర నిర్మాత. గాంధీగారికి ఆదర్శం.

9. **కందుకూరి వీరేశలింగం పంతులు** – 16-4-1848 న జన్మించి, 27-5-1919న మరణించారు. సంఘసంస్కర్త, రచయిత, వరకట్న వ్యతిరేకి, స్త్రీవిద్యను ప్రోత్సహించారు. విధవా వివాహాలకు ఆద్యుడు. శతాధిక గ్రంథకర్త. వీరి 'రాజశేఖరచరిత్ర' తెలుగులో మొదటి నవల.

10. 'అభినవ తిక్కన' **తుమ్మల సీతారామమూర్తిచౌదరి** – గాంధీగారి ఆస్థానకవిగా వీరిని సి.ఆర్.రెడ్డి గారు ప్రస్తుతించారు. 'అభినవ తిక్కన' అనే బిరుదును వదులుకొని 'తెనుగులెంక' (తెనుగు సేవకుడు) అని పెట్టుకున్నారు. స్వాతంత్ర్యోద్యమంలో ముఖ్యంగా ఆంధ్రోద్యమంలో కృషిచేసి 'రాష్ట్రగానం, ఉదయగానం' వ్రాసారు. 'మహాత్మకథ, ఆత్మకథ' వ్రాసారు. 25 వేల పద్యాలు రచించిన ఆంధ్రులు గర్వించే గొప్ప కవి. 1969 లో సాహిత్య అకాడమీ అవార్డు పొందారు. ఆంధ్రా యూనివర్సిటీ 'కళాప్రపూర్ణ' ఇచ్చి గౌరవించింది.

11. **లాయిడ్ జార్జి** – 38వ బ్రిటన్ ముఖ్యమంత్రి. బ్రిటిష్ లిబరల్ పార్టీ నాయకుడు.

12. **లార్డ్ మాంటెగ్** – బ్రిటిష్ ప్రభుత్వ కార్యదర్శి. భారతదేశంలో ప్రభుత్వంలో భారతీయులకు కూడా భాగస్వామ్యం ఉండాలని, ముఖ్యంగా స్వయంపాలన గలిగిన సంస్థలలో అని చెప్పినవారు.

13. **సమదర్శిని** తెలుగు వారపత్రిక (1892) – సహఎడిటరు చిలుకూరి వీరభద్రరావు.

14. **కొసరాజు లక్ష్మయ్య చౌదరి.**

15. **చిలక సరస్సు** – ఒరిస్సాలో ఉప్పునీటి సరస్సు. 63 కి.మీ. పొడవు. హృద్యమయిన సరస్సు. పూరి, ఖుద్దా, గంజాము జిల్లాలలో ఉంధి. 1165 కి.మీ. వైశాల్యం.

16. **రఘుపతి వేంకటరత్నంనాయుడు** (1862–1939) – బ్రహ్మర్షిగా పిలువబడ్డాడు. సమాజంలోని అస్పృశ్యతను తొలగించాలి అనేది వారి ధ్యేయం. బాలబాలికలకు ఒక శరణాలయం మరియు హాస్టలు కాకినాడలో (నేటి రంగరాయ మెడికల్ కాలేజిలో) స్థాపించారు. దేవదాసి విధానం రద్దుకై కృషి చేశారు. విధవా వివాహాలను, స్త్రీవిద్యను ప్రోత్సహించారు. కాకినాడలోని పితాపురం రాజా కాలేజి ప్రిన్సిపాల్. మద్రాసు విశ్వవిద్యాలయానికి మొదటగా ఎన్నుకోబడిన ఉపాధ్యక్షుడు.

17. **త్రిపురనేని రామస్వామి చౌదరి** (15-1-1887 - 16-1-1943) – అంగలూరు, కృష్ణా జిల్లాలో జన్మించారు. బార్-ఎట్-లా చదివారు. రచయిత, సంఘసంస్కర్త, అవధాని. శంబూకవధ, కురుక్షేత్రం వారి ప్రఖ్యాత నాటకాలు. తెనాలి మున్సిపల్ ఛైర్మన్‌గా రెండుసార్లు పనిచేశారు. గాంధీగారిని పొన్నూరులో కలిశారు.

18. **పృథ్వీరాజ్ రాథోడ్** – బికనీరు సంస్థానాధీశుడు. అక్బరు వద్ద ఉండేవాడు. ఒక బలహీన క్షణాన రాణా ప్రతాప్‌సింగ్ (మేవాడ్) అక్బరును ఆరు నెలలు యుద్ధ విరామం కావాలని అడిగాడు. పృథ్వీరాజ్ రాథోడ్ ఈ పనిలోని అనౌచిత్యాన్ని తెలియజెప్పి మరలా యుద్ధానికి సిద్ధం చేశాడు.

19. **వీరముష్టివాళ్లు** – వీరు గంభీర ధ్వనినిచ్చే జేగంట, శంఖం, తప్పెట వాయిస్తూ బ్రాహ్మణులు, వైశ్యులు, జంగాలు, బలిజులు మొదలైనవారి ఇళ్లలోనే భిక్ష తీసుకుంటారు. కొందరు బుగ్గలకు నారసాలు పొడుచుకుంటారు, నాలుకలను కూడా కోసుకుంటారు. వీరశైవులు.

20. **గాడిచర్ల హరిసర్వోత్తమరావు** (14-9-1883 - 29-2-1960) – బాలగంగాధరతిలక్, బిపిన్‌చంద్రపాల్‌లతో ప్రభావితుడై భారత స్వాతంత్ర్య సమరంలో ప్రవేశించాడు. నేటి 'రాయలసీమ' పేరు పెట్టింది వీరే.

21. **పి.సి. రే** (ప్రఫుల్ల చంద్ర రే) (2-8-1861 - 16-6-1944) – కలకత్తాలో జన్మించారు. రసాయనశాస్త్రంలో పేరుగాంచారు.

22. **రివర్ థేమ్స్** – ఇంగ్లండులోని పెద్ద నది. 346 కి.మీ. పొడవు. ఆక్స్‌ఫర్డ్ ప్రక్కన ప్రవహిస్తూ 'ఇసిస్' అని పిలువబడుతుంది. లండను దగ్గర ఈ నీరు కొద్దిగా ఉప్పగా ఉంటాయి.

23. **ప్రోలయ** (కాకతి ప్రోలమహారాజు) – రెండవ ప్రతాపరుద్ర మహారాజు మరణించిన పది సంవత్సరాలకు ఈ నాయకుడు తురుష్కులపై యుద్ధాలలో గెలిచి, 'రేకపల్లి' రాజధానిగా పరిపాలించాడు. ప్రసిద్ధమైన 'విలస శాసనం' వీరు వేయించిందే. గజపతులతో యుద్ధంలో మరణించాడు.

24. **కాపయ్య** – ప్రోలయ్య పినతండ్రి కుమారుడు. క్రీ.శ.1330-1366 వరకు కాకతీయ సామ్రాజ్యాన్ని పరిపాలించాడు. 'ఆంధ్రదేశాధీశ్వర' బిరుదు ధరించాడు. 'పురవరేశ్వర',

'చోడరాజ్యస్థాపనాచార్య', 'కాంచీరక్షపాల' వంటి బిరుదులతో వీరిని పిలిచేవారు అని పిల్లలమర్రి శాసనం తెలియజేస్తుంది. 'భీమవరం' వద్ద వెలమలతో యుద్ధంలో మరణించాడు. ప్రోలయ-కాపయ్యలు - చరిత్రాంశములు కీ.శే. మల్లంపల్లి సోమశేఖరశర్మగారిచే ప్రకటించ బడింది. చతుర్థకులజుడును 'ముసునూరి' వంశజుడైన ప్రోలయనాయకుడు 'కమ్మకులము' నకు చెందినవాడని నిర్ణయించబడింది. Forgotten chapter in Andhra History, P.33.

25. **కాకతీయులు** - కాకతీయ వంశం ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో క్రీ.శ.1083-1323 వరకు పాలించిన రాజవంశము. క్రీ.శ. 9వ శతాబ్దమున రాష్ట్రకూట సేనానులుగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన కాకతీయులు ఆంధ్రదేశాన్నంతా ఒకే త్రాటిపై నిల్పారు. శాతవాహనుల తరువాత ఆంధ్రదేశాన్ని, జాతిని సమైక్యం చేసి, ఏకచ్ఛత్రాధిపత్యం క్రిందకు తెచ్చిన హిందూ రాజులు. వీరి కాలంలో ఆంధ్ర-త్రిలింగ పదాలు సమానార్థకమై దేశపరంగా, జాతిపరంగా ప్రచారం పొందాయి. వీరి రాజధాని ఓరుగల్లు.

26. **ప్రతాపరుద్రుడు-2** - చివరి కాకతీయ పరిపాలకుడు. రాణీ రుద్రమ మనుమడు. ముమ్మడమ్మ కుమారుడు. ఇతని కాలం మొత్తం యుద్ధాలతో గడిచింది అనటం అతిశయోక్తి కాదు. ఆరు సార్లు ముస్లింలను గెలిచి, గ్యాసుద్దీన్ సేనాని 'ఉలుగుఖాన్' చేతిలో పట్టుబడి 'నర్మదానది'లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతనితో కాకతీయ రాజవంశం అంతమైంది.

27. **ఓరుగల్లు** - కాకతి ప్రోలయ కుమారుడు మొదటి ప్రతాపరుద్రుడు ఈ కోటను నిర్మించాడు. 1252-54 మధ్య గణపతిదేవుడు హనుమకొండ నుండి ఓరుగల్లుకు తన రాజధానిని మార్చాడు.

28. **విజయనగరం** - క్రీ.శ. 1336 లో హరిహరరాయలు, బుక్కరాయలు స్థాపించారు. శ్రీకృష్ణదేవరాయల రాజధాని. తళ్ళికోట యుద్ధంతో ఈ సామ్రాజ్యం అంతరించింది.

29. **భావనారాయణస్వామి** - సాక్షి భావనారాయణస్వామి దేవాలయం, పొన్నూరు.

30. **కోటప్పకొండ** - ప్రసిద్ధ శైవక్షేత్రం. గుంటూరు జిల్లా - చిలకలూరిపేటకు 15 కి.మీ., నరసరావుపేటకు 10 మైళ్ల దూరంలో ఉంది. శివరాత్రి రోజున తిరునాళ్ల జరుగుతుంది. నాలుగు రాతిచక్రాల బండిపై 'ప్రభలు' కట్టుకొని వస్తారు. ఈ ప్రభను ఎద్దుల (కోడెల) బండ్లపైన కోటప్పకొండకు 30-40 మైళ్ల దూరం నుండి అతి కోలాహలంగా నాట్యాలు, నాదస్వర కచ్చేరీలు (ఈరోజుల్లో రికార్డింగ్ డ్యాన్సులు, మైకుల) పాటగాళ్లతో తీసుకువస్తారు. గ్రామానికి ఒకటిగానీ, రెండుగానీ ప్రభలు గ్రామ ఆనవాయితీనిబట్టి కట్టుకొని వస్తారు. గ్రామస్తులు వారి వారి తాహతునుబట్టి వీటికి చందాలు వేసుకుంటారు. ఎద్దులను ప్రభలకు కట్టడానికి కూడా వంతులు ఉంటాయి. ఎద్దులను ఎన్నయినా కట్టవచ్చు. తిరునాళ్ల మూడు రోజులు జరుగుతుంది. కమ్మవారిపాలెం, కావూరు, గోవిందపురం, పురుషోత్త(మ)పట్నం ప్రభలు పేరుగాంచాయి. ఈ ప్రభలు 40-100 అడుగుల ఎత్తు వరకు ఉంటాయి. కరెంటు వచ్చిన తర్వాత జనరేటర్లతో విద్యుదలంకరణ చేస్తున్నారు. 'ప్రభ' అంటే వెలుగు అని

అర్థం. కొందరు మొక్కుబడి ప్రభలు స్వామివారికి మొక్కు చెల్లించుకోవటానికి కట్టుకొనివస్తారు. కొత్తగా పెండ్లి అయిన జంటలు 'ఈఏటికిద్దరం-పైఏటికి ముగ్గురం' అంటూ మెట్లు ఎక్కుతూ ఉంటారు. 'చేదుకో కోటయ్యా-చేదుకో కోటయ్యా' అని అరుస్తూ కొండను ఎక్కుతుంటారు. పిల్లలు లేనివారు పిల్లలను కలగాలని ఎక్కువగా మొక్కుకుంటారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో శ్రీ కోడెల శివప్రసాదరావు (స్పీకర్) ఈ కొండపైకి రోడ్డు వేయించారు. శివాలయాన్ని పునర్నిర్మాణం చేయించారు. వసతులు కల్పించారు. శివరాత్రి రోజున భోజన వసతి కల్పించారు. ఆగమ పాఠశాలలు సక్రమంగా నడిచేటట్లు చూస్తున్నారు. తన జీవితాన్ని మొత్తాన్ని ఈ ఆలయం కొరకు వెచ్చిస్తున్నారు. వారెంతో అభినందనీయులు.

31. **శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి** (సి.ఆర్.రెడ్డి 10-12-1800 - 24-2-1951) - సాహితీవేత్త, పండితుడు, వక్త, రచయిత, ఆదర్శవాది, రాజనీతిజ్ఞుడు, ఆంధ్ర భాషారంజని సంఘంలో చురుకైన పాత్ర పోషించారు. బ్రిటిష్ ప్రభుత్వం 'నైట్‌హుడ్' నిచ్చి గౌరవించింది. ఆంధ్రా యూనివర్సిటీ స్థాపకుడు. ఆ యూనివర్సిటీకి 1926 నుండి 1931 వరకు మరియు 1936 నుండి 1949 వరకు వైస్-ఛాన్సలర్‌గా పనిచేశారు.

32. **కాలక్షేపం** - కథాకాలక్షేపం - రామాయణ, భారత, భాగవతేతిహాస కథలు వ్యాఖ్యలతో వృత్తిరీత్యా చెప్పేవారు. వీరిని కథావాచకులు అని కూడా అంటారు.

33. **వేమన** (ప్రజాకవి) - చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ వీరి పద్యాలను ఇంగ్లీషులోకి అనువదించారు. వీరిది కొండవీడు ప్రాంతం. శ్రీ మరుపూడి కోదండరామిరెడ్డిగారు వీరిది నెల్లూరు అని చెప్తారు. ఆటవెలది, తేటగీతుల్లో వీరి పద్యాలుంటాయి. వీరు ఒక 'సంచార యోగి'. ప్రజలకు మంచిచెడ్డలు బోధిస్తూ ఉండేవారు. ఈరోజు ఒక వేయి వరకు వేమన పద్యాలున్నాయి. చాలామంది వ్రాసి వేమన పేరు పెట్టి ఉంటారు. కాల నిర్ణయం తెలియదు.

34. **పోతన** - క్రీ.శ. 1450 లో జన్మించారు. 'సహజకవి'. భగవంతునికి (రామునికి) తన మహాభాగవత గ్రంథాన్ని అంకితం చేశాడు.

35. **మెకివిలియన్** - 1469 లో జన్మించాడు. ఇటలీ రాజకీయవేత్త. తంత్రాలు, రాజకీయ కుట్రలు చేసేవాడు. జిత్తులమారివాడు.

36. **రవీంద్రనాథ టాగూర్** - 'గీతాంజలి' కావ్యానికి నోబెల్ బహుమతి పొందారు.

37. **అబ్రహాం లింకన్** - 16వ అమెరికా అధ్యక్షుడు (1861-65). ఏప్రియల్ 1865 లో జాత్యహంకారిచే హత్య చేయబడ్డాడు. నల్లజాతివారికి స్వాతంత్ర్యం ఇచ్చాడు.

38. **బెంజమిన్ ఫ్రాంక్లిన్** (17-1-1706 - 17-4-1790) - అమెరికా నిర్మాతలలో ఒకరు. పెన్సిల్వేనియా రాష్ట్ర గవర్నరు.

39. **ఉడ్రోవిల్సన్** - అమెరికా 28వ అధ్యక్షుడు. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత. మొదటి ప్రపంచ యుద్ధ విరమణకు 14 శాంతి సూత్రాలు చెప్పారు. ఆడవారికి మొదటగా ఓటుహక్కు కల్పించాడు.

40. **రౌలట్ చట్టం** – రౌలట్ పేర ప్రకటించబడింది. దేశంలో ఉంటూ 'టెర్రరిజం'కు పాల్పడే వారికి విచారణ లేకుండా 2 సం॥లు జైలుశిక్ష విధించవచ్చు. అత్యవసర స్థితి 1915 లో చేసిన ఈ చట్టం ద్వారా పొడిగించవచ్చు.

41. **జలియన్‌వాలాబాగ్** – పంజాబులోని ఒక పబ్లిక్ గార్డెన్‌లో నూతన సంవత్సరం సందర్భంగా చేరిన ప్రజలను ఏప్రియల్ 13, 1919 న జనరల్ డయ్యర్ నిర్హేతుకంగా కాల్చి చంపాడు. కాల్పులలో 356 మంది మరణించారని, 1526 మంది గాయపడ్డారని బ్రిటీష్‌వారు చెప్పారు. ఈ సంఖ్యకంటె పది రెట్లు ఎక్కువని ప్రత్యక్ష సాక్ష్యుల కథనం.

42. **ఆక్స్‌ఫర్డ్** – అతి పురాతన విశ్వవిద్యాలయం. 1906 నాటికే ఇది విశ్వవిద్యాలయంగా ఉంది.

43. **ఈశ్వరచంద్ర విద్యాసాగర్** (20-9-1820 – 29-7-1891) – కలకత్తాలో జన్మించారు. రచయిత, సంఘసంస్కర్త.

44. **ఇంగ్లీషు ఛానల్** – దక్షిణ ఇంగ్లాండుకు, ఉత్తర ఫ్రాన్స్‌కు మధ్య ఉంది. బ్రిటీష్ సముద్రం 33.3 కి.మీ. వెడల్పు.

45. **రాణీ రుద్రమదేవి** – దక్షిణ భారతదేశాన్ని పాలించిన గొప్ప రాజవంశాలలో ప్రముఖులు కాకతీయులు. మొదట రాష్ట్రకూటులుగా ఉన్న వీరు (గుండయ, ఎరియ, బేతియ) కాకత్య గుండన కాలంనుండీ క్రీ.శ. 950 నుండి దక్షిణ భారతదేశ పాలకులుగా ఉన్నారు. ఈ విశాల సామ్రాజ్యాన్ని పరిపాలించినవారిలో కాకతి గణపతిదేవ చక్రవర్తి ప్రముఖుడు (1199-1262). అఘటనాఘటన సమర్థుడు, రాజనీతిజ్ఞుడు, వర్తక వాణిజ్యాలను అభివృద్ధి చేశాడు. గణపతిదేవుని కుమార్తె 'రుద్రమదేవి'. ఈమె వీరనారి. క్రీ.శ. 1259 న రుద్రదేవమహారాజు పేరున సింహాసనమధిష్ఠించింది. 40 సం॥లు రాజ్యాన్ని దుర్భేద్యంగా పరిపాలించింది. రాజ్యాన్ని విస్తరించింది. శత్రువులను అణచివేసింది. ప్రజోపకర కార్యాలలో గొప్ప రాణిగా పేరుపొందింది. ఈమెకు మగసంతానం లేదు. అందువలన తన మనుమడు రెండవ ప్రతాపరుద్రుని దత్తత తీసుకొన్నది. ఇతను 25 సం॥లకు పైగా ఆంధ్రదేశాన్ని పరిపాలించాడు. ఇతడే కాకతీయులలో చివరి రాజు. కాకతీయులు వరాహలాంఛనులు. వీరి రాజధాని ఓరుగల్లు. రుద్రమదేవి 27-10-1298 న చందుపట్ల యుద్ధంలో చనిపోయినట్లు శాసనం.

2వ ఛాప్టరు

1. **హిందుయిజం** – భారతీయుల జీవన విధానం.

2. **బుద్ధుడు** – క్రీ.పూ.563 లో నేపాల్‌లోని 'లుంబిని' వనంలో జన్మించాడు. అహింస ఇతని పరమధర్మం. 29 వ సం॥లో భార్యను, కుమారుడు రాహులుని వదలి వెళ్లాడు. అనాత్మవాది. 'మనిషి కోర్కెలకు మూలం ఆశ' అని ప్రబోధించాడు. 'గయ'లో జ్ఞానోదయం కలిగింది. దేశ విదేశాలలో తన మతమైన బౌద్ధాన్ని శిష్యుల ద్వారా ప్రచారం చేశాడు.

3. **తంజావూరు** – దక్షిణ భారతదేశంలోని పట్టణం. భారతదేశపు ధాన్యాగారంగా ప్రసిద్ధి చెందింది. మొదట చోళులు తంజావూరుని నిర్మించారంటారు. తరువాతి కాలంలో పాండ్యులు, విజయనగర రాజులు, తంజావూరు నాయకరాజులు పాలించారు.

4. **గణపతిదేవుడు** (1199–1266) – కాకతీయ చక్రవర్తి. ఓరుగల్లు రాజధానిగా రాజ్య సంపాదనే కాక వ్యాపారాభివృద్ధి కూడా చేశాడు. రాణి రుద్రమదేవికి తండ్రి.

5. **అల్లావుద్దీన్ ఖిల్జీ** – ఖిల్జీ వంశస్థుడు (1296–1316). కాకతీయ రాజ్యంపై దండెత్తి వచ్చాడు. ముస్లిం పాలకుడు.

6. **మాలికాఫర్** – అల్లావుద్దీన్ సేనానాయకుడు. మూడుసార్లు కాకతీయ సామ్రాజ్యంపై దండెత్తాడు. 'మానిక్' అనే హిందువు 'మాలికాఫర్'గా మారాడు.

7. **నాయకులు** – ప్రతాపరుద్ర చక్రవర్తి తరువాత ప్రోలయ్య, కాపయ్య నాయకులు కాకతీయ సామ్రాజ్యాన్ని పాలించారు. గంగయ్య సాహిణి 'బాణసీమ'కు చెందినవాడు. గణపతిదేవ చక్రవర్తి తరువాత రుద్రమదేవి వద్ద కూడా ప్రధానిగా పనిచేశాడు. కడప జిల్లాలోని గంగినేని కొండను వీరి వారసులు నిర్మించారు. నల్గొండ నుండి కోలారు జిల్లాలోని కైవార వరకు, కడప, కర్నూలు, అనంతపురం, నెల్లూరు, గుంటూరు జిల్లాలకు మహామండలేశ్వరుడైనాడు. త్రిపురారిదేవుడు, అంబదేవుడు వీరి వారసులు. మొదటి ప్రోలయ కాలమున గంగయ్య పెత్తందారు.

8. **భట్రాజులు** – రాచకొలువులో ఉండేవారు. వందిమాగధ స్తోత్రపాఠాలు చదువుతుండేవారు. కొలువుకే అలంకారం. ఆశువుగా పద్యాలల్లగలరు. వీరినే 'భట్టు'లంటారు. కాకతీయుల కాలం ముందునుండే వీరున్నారు. పల్నాటి యుద్ధంలో 'భట్టు రాయబారం' ఉంది. చితికి పోయిన తరువాత వెలమ, కమ్మ, కాపులను ఆశ్రయించారు. 'వసుచరిత్ర' కర్త రామరాజ భూషణుడు భట్టు అని అంటారు.

9. **పిచ్చుకుంటులు** – 'భిక్షుక' శబ్దం నుండి వచ్చింది. 'వీవంగా చేతులు లేవయ్య – పోవంగ కాళ్ళు లేవయ్య – అంధకులమయ్య – పిచ్చుకుంటలమయ్య – దానమొసగరే ధన్యాత్ములార' (పండితారాధ్య చరిత్ర). ప్రథమంలో కాపుల, యాదవుల గోత్రాలు చెప్పేవారు. కాలక్రమేణ కమ్మవారి గోత్రాలు, ఇతరుల గోత్రాలు చెప్పేవారు. వీరు శైవమతారాధకులే.

10. **శాతవాహనులు** – దక్షిణ మధ్యభారతమును, కోటిలింగాల, ధరణికోట, జిన్నార్‌ల నుండి పరిపాలించారు. శాతవాహనుల తొలి రాజధాని తెలంగాణ ప్రాంతంలోని కోటిలింగాల. వీరి పాలన క్రీ.పూ. 230 లో మొదలై 450 సం॥లు సాగింది. మొదటి ఆంధ్ర చక్రవర్తులు, గౌతమీపుత్ర శాతకర్ణి, వాశిస్టీపుత్ర పులుమావి మొదలైనవారు. వీరి జనరంజక పాలన వీరిని శాంతికాముకులుగా పేరుతెచ్చింది.

11. **శ్రీకాకుళం** – డిస్ట్రిక్ట్ హెడ్ క్వార్టర్స్ ఆఫ్ శ్రీకాకుళం. బలరాముడు నిర్మించాడంటారు. కృష్ణానది ఒడ్డున వేరొక శ్రీకాకుళం ఉన్నది. శ్రీకృష్ణదేవరాయలు ఇక్కడి దేవాలయంలోనే 'ఆముక్తమాల్యద' వ్రాయడానికి పూనుకున్నాడు.

12. **సర్ ఆర్థర్ కాటన్** (15-5-1803 - 24-7-1899) - ఇతను ఆంధ్రదేశానికి చేసిన సేవ ఎంతగా చెప్పుకున్నా తక్కువే. గోదావరి జలాలను పొలాలకు తరలించిన భగీరథుడు. కాటన్ దొరగా ప్రసిద్ధుడు. ఓర్వలేని కొందరు పాశ్చాత్యులు వీరిపై విచారణ వేయించారు. విచారణలో కడిగిన ముత్యంలా బ్రిటీషు పార్లమెంటులో ప్రకాశించాడు. ఆంధ్రదేశంలో కాటన్‌దొర పేరు విననివారుండరు.

13. **పర్వతనేని వీరయ్య చౌదరి** - పెదనందిపాడు గ్రామ మునసబు. చక్కటి గాత్రం కలదు. సహాయ నిరాకరణోద్యమంలో ప్రజలను పురికొల్పాడు. పెదనందిపాడు ఉద్యమ నిర్మాత.

14. **జాయప్ప నాయక్** - గణపతిదేవచక్రవర్తి బావమరది. నారమ్మ-పేరమ్మల సోదరుడు. 'నృత్తరత్నావళి' అనే గ్రంథాన్ని రచించాడు. గజసాహిణి.

15. **ఇండియన్ పెజెంట్ ఇన్‌స్టిట్యూట్** - రంగాగారు నిడుబ్రోలులో స్థాపించిన 'రైతాంగ విశ్వవిద్యాలయం'.

3వ ఛాప్టరు

1. **ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం** - 1857.

2. **ఆక్స్‌ఫర్డ్** - 1096 లో స్థాపించబడిన పురాతన విశ్వవిద్యాలయం. 'రోడ్స్' స్కాలర్‌షిప్‌లు వంద సంవత్సరాల నుండి ఈ యూనివర్సిటీలో ఇస్తున్నారు. ఆచార్య రంగా చదివిన యూనివర్సిటీ.

3. **ఆర్.సి. దత్** (రమేష్ చంద్ర దత్ - 13-8-1848 - 30-11-1909) - బెంగాలీ. ఇండియన్ సివిల్ సర్వెంటు. చరిత్రకారుడు.

4. **ఆలీ సోదరులు** - మౌలానా మహమ్మద్ ఆలీ, మౌలానా షౌకత్ ఆలీ. ఖిలాఫత్ మూమెంట్‌లో గాంధీగారితో పాటు జైలుకు వెళ్లారు.

5. **సి.ఆర్. దాసు** (చిత్తరంజన్ దాసు - 5-11-1869 - 16-6-1925) - బెంగాలీ. ఇండియన్ స్వరాజ్ పార్టీ వ్యవస్థాపకుడు.

6. **సురేంద్రనాథ బెనర్జీ** (10-11-1848 - 6-8-1925) - ఇండియన్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ స్థాపకుడు. గొప్ప ఉపన్యాసకుడు. 'దేశబంధు' అని పిలవబడ్డాడు. లాయర్.

7. **థేజియన్ సొసైటి** - జనవరి 4, 1884 లో ప్రారంభించబడింది. అధికారం, పంపిణీ, అవకాశం - ఆడవారితో సహా అందరికీ.

8. **బెట్రాండ్ రస్సెల్** - ఇంగ్లాండు దేశస్థుడు. ట్రినిటీ మరియు ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలలో చదివాడు. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత. రచయిత.

4వ ఛాప్టరు

1. **యం.యన్.రాయ్** (2-3-1887 - 26-1-1954) – కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా సభ్యుడు. 1920 లో లెనిన్‌ను మాస్కోలో కలిశాడు. కాన్పూర్ కమ్యూనిస్టు పార్టీ కేసులో 6 సం॥లు శిక్ష అనుభవించాడు.
2. **చౌరి-చోరి సంఘటన** – యునైటెడ్ ప్రావిన్సెస్, గోరఖ్‌పూర్ జిల్లాలో 4 ఫిబ్రవరి, 1922 న సహాయ నిరాకరణోద్యమ ఆందోళనకారులు పోలీసు స్టేషనుకు నిప్పు పెట్టి 24 మంది పోలీసులను చంపారు. భారత జాతీయ కాంగ్రెసు సహాయ నిరాకరణోద్యమాన్ని ఆపివేసింది.
3. **మొప్పిల తిరుగుబాటు** – మలబారులో జరిగిన అల్లర్లు రైతు ఉద్యమంగా మొదలైన ఈ తిరుగుబాటు మతము రంగు పూసుకొన్నది. మొప్పిలలు వ్యవసాయదారులు. ముస్లింలు బ్రిటీషువారిమీద, మొప్పిలలమీద దాడులు చేశారు.
4. **థామస్ పెయిన్** – ఇంగ్లీషు అమెరికన్ వేదాంతి. రాజకీయ ఆందోళనకారుడు. జూన్‌లో 1809 లో మరణించాడు.
5. **థామస్ జెఫర్‌సన్** – 3వ అమెరికన్ ప్రెసిడెంట్. స్వతంత్ర పత్రాన్ని అమెరికాకు వ్రాసినవాడు.
6. **రోడ్స్ స్కాలర్స్** – ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులకు రోడ్స్ పేరుతో ఇచ్చే స్కాలర్‌షిప్.
7. **జోమో కెన్యాటా** – కెన్యా మొదటి ప్రెసిడెంట్. కెన్యా స్వాతంత్ర్యం కొరకు కృషి చేశాడు. ప్రధానమంత్రిగా పనిచేశాడు.
8. **విలియం బివరిడ్జ్** (5-3-1879 - 16-3-1963) – 1946 లో లిబరల్స్‌కు (బ్రిటన్‌కు) నాయకుడు. 1919 నుండి లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌కు డైరెక్టర్. నేషనల్ హెల్త్ స్కీము, ఫ్రీ మెడికల్ ఎయిడ్, అందరికీ సోషల్ సెక్యూరిటీ వీరి సలహా ద్వారానే ప్రవేశపెట్ట బడ్డాయి.
9. **ఆర్థర్ సిసిల్ పిజో** – ఇంగ్లీషు ఆర్థిక శాస్త్రవేత్త, కేంబ్రిడ్జి యూనివర్సిటీ. మార్చి 7, 1959 లో మరణించాడు.
10. **హాండ్‌లూమ్స్ & హాండ్ స్పిన్నింగ్** – భారత చేతివృత్తులలో అగ్రగణ్యమైనవి.
11. **మేరీ క్వీన్ ఆఫ్ స్కాట్లండు** (14-12-1542 - 24-7-1567) – స్కాట్లండును పరిపాలించారు. ఇంగ్లాండులో ఆశ్రయం కొరకు వెళ్ళింది. ఇంగ్లాండులో బంధించి, చివరకు తల నరికి చంపబడింది. క్వీన్ ఎలిజబెత్ చంపించింది.
12. **ఒమర్ ఖయ్యూమ్** – పర్షియా రచయిత. 83 సం॥లు బ్రతికాడు.
    గడచిపోయిన గతముకై వగచేదేల
    తెలియరాని రేపుకై వలపదేల
    వేయి యుగముల సౌందర్య విభవమెల్ల
    రూపుదాలిచి నేడుగా నిలిచియుండ. *–ఒమర్ ఖయ్యాం. (డా॥ జెక్కంపూడి సీతారామారావు)*

13. **మాంటెగ్-చెమ్స్‌ఫర్డ్ రిఫారమ్స్** - భారతదేశంలో 'డైయార్కీ' ప్రవేశపెట్టబడింది. రెండు పాలనల విధానం - 1919 లో ప్రభుత్వ కార్యనిర్వాహకవర్గం, రిజర్వుడు విషయాలు - ట్రాన్స్‌ఫర్డ్ సబ్జక్టులుగా విభజించారు. రాష్ట్ర ప్రభుత్వాధికారాలను కేంద్రం రద్దు చేయవచ్చు.

14. **ఐ.యల్.పి.** - ఇంటర్నేషనల్ లేబర్ పార్టీ.

15. **గిల్డ్ సోషలిజం** - శ్రామికుల అధీనంలో పరిశ్రమలకై పోరాటం - వ్యాపారస్థుల 'గిల్డు'ల ద్వారా ఈ పోరాటం 20వ శతాబ్దంలో జరిగింది. రంగాజీ ఈ ఉద్యమానికి ఊతమిచ్చారు.

16. **హెచ్.యన్. బ్రెయిల్‌ఫర్డ్** - బ్రిటను వామపక్ష పాత్రికేయుడు (రంగాకు ఆత్మీయుడు).

17. **హెచ్.జి. వెల్స్** - ఇంగ్లీషు రచయిత. 'టైమ్ మెషిన్' మొదలైన సైంటిఫిక్ రచనలు చేశాడు. వార్ ఆఫ్ ది వరల్డ్ వగైరా ప్రసిద్ధ ఆంగ్ల రచయిత.

18. **కు-క్లుస్-క్లాన్** (K-K-K) - మూడు ఉద్యమాల పేరు. అమెరికా అంతర్యుద్ధం అయిన తరువాత, క్రొత్తగా స్వేచ్ఛ ఇవ్వబడిన బానిసలను ఘోరంగా చంపేవారు. రిపబ్లికన్ పార్టీకి (అబ్రహాం లింకన్) వ్యతిరేకంగా దక్షిణాది రాష్ట్రాలలో పనిచేసింది.

19. **ఆటా టర్క్** - ముస్తపా కమల్ ఆటా టర్క్ విప్లవకారుడు. టర్కీ మొదటి అధ్యక్షుడు (1923-38)

20. **బిల్ ఆఫ్ రైట్స్** - ఈ హక్కుల చట్టము బ్రిటీషు సార్వభౌమాధికారానికి వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు చేసినప్పుడు 1689 లో చక్రవర్తిపై పార్లమెంటు అధికారాన్ని ప్రతిష్ఠించింది. ఈ హక్కుల చట్టము రాజుకు వ్యతిరేకంగా - బ్రిటీషు పార్లమెంటు తన అధికారాన్ని పదిలపరచుకొన్నప్పుడు 1689 లో మొదటిసారిగా వాడబడింది.

21. **వాన్‌డైక్** - 'వాన్‌డైక్ గోటి' (గడ్డం) - ఆంథోనీ వాన్‌డైక్. పెయింటరు.

22. **నోటర్‌డామ్** - పారిస్ (ఫ్రాన్స్) లోని రోమన్ కాథలిక్ చర్చి.

23. **హెరాల్డ్ లాస్కీ** - ఆర్థిక శాస్త్రవేత్త. బ్రిటీషు లేబర్ పార్టీ ఛైర్మన్‌గా (1945-46) పనిచేశాడు.

24. **జార్జి బెర్నార్డ్ షా** (26-7-1893 - 24-3-1950) - ప్రఖ్యాత బ్రిటీషు నాటక రచయిత. నోబుల్ బహుమతి గ్రహీత. (పిగ్మాలియన్ నాటక రచయిత).

5వ ఛాప్టరు

1. **రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్** - లండనులో జరిగిన కాన్ఫరెన్స్. సైమన్ రిపోర్టు ఆధారంగా 1930 లో భారతదేశం 'డొమీనియన్' (ప్రత్యేక రాజ్యం) గా అవతరించాలని, ప్రత్యేక రాజ్యాంగం కావాలని బ్రిటిషర్లు భావించారు. మూడు రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లు జరిగాయి. మొదటిదానిని గాంధీ బహిష్కరించారు. రెండవదానికి భారతీయుల తరఫున ఏకైక ప్రతినిధిగా హాజరయ్యాడు.

2. **గాంధి-ఇర్విన్ ఒప్పందం** - మహాత్మాగాంధీ-లార్డ్ ఇర్విన్ (వైస్‌రాయ్) మధ్య రెండవ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌కు ముందు జరిగింది.
3. **మహారాజా రంజిత్‌సింగ్** (13-11-1780 - 27-6-1839) - సిక్కు సామ్రాజ్యాన్ని నిర్మించాడు. లాహోర్‌లో చనిపోయాడు. వారి సమాధి కూడా లాహోర్‌లో ఉంది.
4. **ఎన్.వి. రామానాయుడు** - 'జమీన్‌రైతు' పత్రికా సంపాదకుడు. రంగా అనుచరుడు.
5. **కటికనేని బ్రదర్స్** - కళ్యాణరావు, వెంకటగిరి జమీందారి బంధువు.
6. **స్వరాజ్య** - ఖాసా సుబ్బారావు ఎడిటరుగా నడపబడిన పత్రిక.
7. **గొర్రెపాటి వెంకటసుబ్బయ్య** - చాలా సంవత్సరాలు 'వాహిని' ఎడిటరు. రంగా అనుచరుడు.
8. **మహాత్మ** - మహాత్మా గాంధీ. మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ.
9. **సంతానం** - ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సంపాదకుడు, రాజకీయవేత్త.
10. **గొల్లపూడి సీతారామశాస్త్రి** - కావూరు వినయాశ్రమ స్థాపకుడు.
11. **వి. కూర్మయ్య** (వేముల కూర్మయ్యా) - హరిజన నాయకుడు, మంత్రి.
12. **అడల్టు ఫ్రాంఛైజ్** - ఓటుహక్కు కులం, మతం, స్త్రీ-పురుష భేదం లేకుండా అందరికీ సమానంగా ఇవ్వబడింది. భారతదేశంలో ఓటింగ్ వయస్సు 18 సం॥లు. ఆర్టికిల్ 326 (రాజ్యాంగం).
13. **సర్ జాన్ సైమన్** - నాయకత్వంలో 1928 లో భారత్‌కు పంపబడిన 7 గురు సభ్యుల కమిషన్. భారత రాజ్యాంగ సవరణల కొరకు పంపబడింది.
14. **లాలా లజపతిరాయ్** - పంజాబ్ కేసరి. 17 నవంబరు, 1928 లో లాహోర్‌లో చనిపోయారు. ప్రఖ్యాత స్వాతంత్ర్య సమరయోధులు. స్వతంత్రం కోసం ప్రాణాలర్పించారు. 'పూర్తి స్వరాజ్యం' కొరకు ఆందోళన చేసిన (లాల్, బాల్, పాల్) ముగ్గురిలో ఒకరు.
15. **తాళ్లపాలెం** - పొన్నూరు దగ్గర ఉన్న హరిజన గ్రామం. గాంధీ ఈ గ్రామానికి రోడ్డు బాగా లేనందున బురదలో మైలున్నర నడిచి వెళ్లారు.
16. **'దండి' సత్యాగ్రం** - మహాత్మా గాంధీచే ప్రారంభించబడిన అహింసాత్మక శాసనోల్లంఘన ఉద్యమం. సబర్మతి ఆశ్రమం నుండి బయలుదేరి దండి వరకు సాగింది.
17. **పొనకల కనకమ్మ** - సంఘసేవకురాలు. మహాత్మా గాంధీ శిష్యురాలు. ఒక సంవత్సరం జైలు జీవితం గడిపింది. నెల్లూరు.

7వ ఛాప్టరు

1. **కె.యల్.పి.** - కృషికార్ లోక్ పార్టీ. రంగా స్థాపించారు.
2. **ప్రజాపార్టీ** - టంగుటూరి ప్రకాశం పంతులు గారు నిర్మించారు.

3. **పి. కోటయ్య** – ప్రగడ కోటయ్య. నిడుబ్రోలులో జన్మించారు. స్వాతంత్ర్య సమర యోధుడు. రంగాగారి అనుచరుడు. పార్లమెంటు సభ్యుడు. చేనేత ఉద్యమ పిత. జననం 26 జులై, 1915, మరణం 26 నవంబరు, 1995.

4. **కె. రఘురామయ్య** – కొత్త రఘురామయ్య, పార్లమెంటు సభ్యుడు. తెనాలి, గుంటూరు నియోజకవర్గాల నుండి 5 సార్లు ఎన్నికయ్యారు. జననం 6 ఆగస్టు, 1912, మరణం 6 జూన్, 1979. (మాజీ కేంద్ర మంత్రివర్యులు).

5. **ఏల్‌వాల్ కాన్ఫరెన్స్** –

6. **పసుపులేటి కోటేశ్వరరావు, ఎన్. వీరాచారి, ఎన్. విజయరాజకుమార్** – రంగాగారి శిష్యులు, మంచి ఉపన్యాసకులు.

7. **భూలాబాయ్ దేశాయ్** – ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌లో చురుకైన సభ్యుడు. సర్దార్ వల్లభాయ్ పటేల్ చొరవతో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో మెంబరయ్యాడు. సెంట్రల్ లెజిస్లేటివ్ కమిటీకి ఎన్నికయ్యాడు. బార్డోలి సత్యాగ్రహంలో పాల్గొన్నాడు. 10 డిసెంబర్, 1940 నుండి 19 సెప్టెంబర్, 1941 వరకు జైలులో ఉన్నారు. దేశంలోని కాంగ్రెస్‌వాదులంతా జైళ్లలో ఉన్న సమయంలో లియాఖత్ ఆలీఖాన్‌తో 'కో–ఎలిషన్' గవర్నమెంటు ఏర్పాటుచేయడానికి ఒప్పందం చేసుకొన్నారు. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అజాద్ హింద్ ఫౌజ్ జనరల్ షా–నవాజ్‌ఖాన్, ఇ.కె. సెహగల్, జి.యస్. ధిల్లాన్‌ల రక్షణకై వాదించాడు. దేశమంతా దేశాయ్ వాదానికి ఎంతగానో సంతోషించింది. ఆ ముగ్గురు ఖైదీలకు ద్వీపాంతరవాసం విధించారు. మే 6, 1946 న మరణించాడు.

8. **మహమ్మదాలీ జిన్నా** – లాయర్, రాజకీయవాది, పాకిస్తాన్ మొదటి గవర్నర్ జనరల్. 11 సెప్టెంబరు, 1948 న మరణించాడు.

9. **గోవింద వల్లభ పంత్** – మొదటి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి. హిందీని అధికార భాషగా చేసినవారిలో ప్రథముడు. 1955 నుండి 1961 వరకు కేంద్ర హోంశాఖామాత్యులుగా పనిచేశారు. 'భారతరత్న' అవార్డు గ్రహీత. మరణం 7 మార్చి, 1961.

10. **పిలు మోడీ** – పార్లమెంటేరియన్ – స్వతంత్ర పార్టీ.

11. **గోపాలకృష్ణ గోఖలే** – 1905 లో ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియన్ నేషనల్ కాంగ్రెస్. భారత సేవక్ సంస్థకు ఆద్యుడు. 1912 లో గాంధీని దక్షిణాఫ్రికాలో కలిశాడు. జననం 9 మే, 1866, మరణం 1915.

12. **ఐ.ఎల్.ఓ.** – ఇండియన్ లేబర్ ఆర్గనైజేషన్.

13. **గ్రూప్ ఆఫ్ త్రి** – ఎన్.జి. రంగా, మోహన్‌లాల్ సక్సేనా, ఎస్.కె.డి. పల్లీవాలా. ఈ ముగ్గురూ భారత జాతీయ పతాకను ఢిల్లీ పార్లమెంటుపై ప్రప్రథమంగా బ్రిటీషువారికి వ్యతిరేకంగా 1939 న ఎగురవేశారు.

14. **ఎఫ్.ఎ.ఓ.** – ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్.

10వ ఛాప్టరు

1. **రామానీడు విద్యాలయం** – రంగాగారు నిడుబ్రోలులో వారింట్లో స్థాపించిన రాజకీయ విద్యాలయం.
2. **కె. ఓబులరెడ్డి** – కృషికార్ లోక్‌పార్టీలో మంత్రి. కాంగ్రెస్‌లోనూ మంత్రి. రంగాగారి ముఖ్య కార్యక్రమాలన్నింటికీ బాధ్యుడుగా పనిచేశాడు.
3. **కొండా వెంకటప్పయ్య** – 'దేశభక్త' బిరుదాంకితుడు. ఆంధ్రలో ప్రాబల్యం ఉన్న రాజకీయ నాయకుడు. కృష్ణా పత్రిక స్థాపకుల్లో ఒకరు. వీరికి రంగాగారు 'ఆధునిక రాజ్యాంగ సంస్థలు' అనే గ్రంథాన్ని అంకితమిచ్చారు. జననం 1866, మరణం 1948.
4. **ఉన్నవ లక్ష్మీనారాయణ** – 'మాలపల్లి' నవల రచయిత. గుంటూరులో శారదా నికేతన్ స్థాపించారు. బారిష్టరు. జననం 4 డిసెంబరు, 1877.
5. **గరిమెళ్ల సత్యనారాయణ** – కలెక్టర్ కార్యాలయంలో గుమాస్తా. 'ఆనందవాణి', 'వాహిని' పత్రికలకు సహసంపాదకుడు, కవి, రచయిత. 'మాకొద్దీ తెల్లదొరతనము' గేయం వ్రాసినవారు.
6. **అడవి బాపిరాజు** – 'బాపిబావ'గా పిలువబడే వీరు రచయిత, చిత్రకారుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, చారిత్రక నవలా చక్రవర్తి, బి.యల్. పట్టభద్రుడు, 'నవ్య సాహిత్య పరిషత్' స్థాపకుడు. భీమవరం.
7. **ఏటుకూరి వేంకటనరసయ్య** – 'కవిబ్రహ్మ'. పల్నాటి యుద్ధం నేపథ్యంలో 'మాంచాల', 'పల్నాటి వీరచరిత్రం' 5 భాగాలు, 'నాయకురాలు', 'అలుగురాజు', 'అలరాజు', 'రైతు హరికథ' వ్రాశారు. క్షేత్రలక్ష్మి కావ్యం రచించారు. 1-4-1911 లో జన్మించారు. 10-11-1949 లో మరణించారు.
8. **వేంకటకవి కొండవీటి** – ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'కళాప్రపూర్ణ' ఇచ్చి గౌరవించింది. ప్రసిద్ధ హేతువాది. కవి. దాన వీర శూర కర్ణ చలనచిత్రానికి వీరు సంభాషణలు ప్రఖ్యాతిచెందాయి. హరిశ్చంద్ర, తాండ్రపాపారాయుడు మొదలైన అనేక ఇతర రచనలున్నాయి. 1918 లో జన్మించారు, 1991 లో మరణించారు.
9. **శెట్టిపల్లి** – శెట్టిపల్లి వెంకటరత్నం – రచయిత. ప్రతి సంవత్సరం 2 లేక 3 పాటలు 'రైతు భజనావళి' 1934 నుండి 1939 వరకు వ్రాశారు. 26 సం॥ల వయస్సులో ఆకస్మికంగా చనిపోయారు. వారి రచన లన్నింటిని (ఇంగ్లీషు మరియు తెలుగులో) ఎ.జి.స్టాక్ పరిచయంతో రంగాగారు ప్రచురించారు.
10. **వి.వి.గిరి** – వరాహగిరి వెంకటగిరి. భారతదేశపు నాల్గవ రాష్ట్రపతి. బర్హంపూర్‌లో జన్మించారు. ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ స్థాపకుడు. 'భారతరత్న'. 24 జూన్, 1980 లో మరణించారు.
11. **అయ్యదేవర కాళేశ్వరరావు** – లాయరు. మొదటి ఆంధ్రప్రదేశ్ స్పీకరు. నాలుగుసార్లు మద్రాసు శాసనసభ్యుడు. 1911 లో రామ్మోహన్ గ్రంథాలయం స్థాపించారు. 1884 లో నందిగామలో జన్మించారు. 1962 వరకు స్పీకరుగా ఉన్నారు.

12వ ఛాప్టరు

1. **పుచ్చలపల్లి సుందరయ్య** – కమ్యూనిస్టు పార్టీ స్థాపకుల్లో ఒకరు. రైతు ఉద్యమ నిర్మాత, తెలంగాణ. 1 మే, 1913 లో జన్మించారు, 19 మే, 1985 లో మరణించారు. నెల్లూరు. భార్య పేరు లీల. తెలంగాణ ఉద్యమంలో నిజాంకు వ్యతిరేకంగా పోరాడారు. 17 ఏండ్ల వయస్సులో గాంధీగారి సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. 1934 లో 'ఆంధ్ర కిసాన్ సభ' స్థాపక సభ్యుడు.
2. **కులక్స్** – రష్యన్ రైతులు.
3. **గౌతు లచ్చన్న** – 'సర్దార్' బిరుదాంకితుడు. శ్రీకాకుళం జిల్లా బారువాలో జన్మించారు. రంగా సహచరుడు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కొరకు కృషి చేశారు. ఎన్.జి. రంగా అధ్యక్షులుగా, లచ్చన్న కార్యదర్శిగా కృషికార్ లోక్ పార్టీని ప్రారంభించారు. ప్రకాశం పంతులు ప్రభుత్వాన్ని కల్లుగీత కార్మికుల ఉద్యమంతో పడగొట్టారు. 2000–2001 సం॥లలో కేంద్ర మంత్రి బలరాం జక్కర్ ఈ రచయిత (డా॥ జేక్కంపూడి సీతారామారావు) కు, లచ్చన్నకు హైదరాబాద్‌లో సన్మానం చేశారు.

13వ ఛాప్టరు

1. **కామ్రేడ్ డాంగే** – శ్రీపాద అమృత డాంగే.
2. **కె.ఎస్.ఎన్. మూర్తి** – కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి. పోతునూరు, పశ్చిమ గోదావరి జిల్లా. ఇచ్ఛాపురం నుండి తడ వరకు జరిగిన రైతు రక్షణ యాత్రకు అధ్యక్షత వహించారు. (కొమ్మారెడ్డి రాజారామమోహనరావుగారి తండ్రి). వీరి పేర పశ్చిమ గోదావరి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నిర్మించబడింది.
3. **కళింగ** – పూర్వపు ఒరిస్సా. ఆంధ్రలో కొంత భాగం.
4. **స్వామి సహజానంద సరస్వతి** – ఒక యోగి. జాతీయవాది. రైతు నాయకుడు. ఘాజీపూర్ జన్మస్థలం. 22 ఫిబ్రవరి, 1889 న జన్మించారు. 25 జూన్, 1950 న మరణించారు.
5. **ఎ.ఎస్. రాజు** – అల్లూరి సత్యనారాయణరాజు.
6. **సైబీరియా లేబర్ క్యాంప్‌లు** – సోవియట్ రష్యాలో బలవంతంగా రోజుకు 14 గంటలు పని చేయించే క్యాంప్‌లు అని చెప్పేవారు. 20 లక్షల నుండి 30 లక్షల మంది వరకు స్టాలిన్ హయాంలో ఈ క్యాంపులలో చనిపోయారు.
7. **కుప్పుస్వామి** – జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి.
8. **పట్టాభి** – భోగరాజు పట్టాభి సీతారామయ్య.

14వ ఛాప్టరు

1. **కె.యం.పి. రాజ్** – కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్.

15వ ఛాప్టరు

1. **జాన్ స్ట్రాచీ** – బ్రిటీష్ లేబరు నాయకుడు. రచయిత. ఇండియాలో సివిల్ సర్వెంట్‌గా పనిచేశాడు.
2. **ఎడ్గాస్నో** – అమెరికా పాత్రికేయుడు. చైనా కమ్యూనిజం, చైనాలో కమ్యూనిస్టు విప్లవాన్ని గురించి వ్రాశాడు. 15 ఫిబ్రవరి, 1972 లో మరణించాడు.
3. **మాగ్జింగోర్కీ** – ప్రఖ్యాత సోవియట్ రచయిత. ప్రఖ్యాతిగాంచిన 'అమ్మ' (మదర్) ఇతని పుస్తకం. 18 జూన్, 1936 లో మాస్కోలో మరణించారు.
4. **జి.డి.హెచ్. కోల్** – జార్జి డగ్లస్ హోవర్డ్ కోల్. ఇంగ్లీషు రాజకీయ సిద్ధాంతకర్త. ఫేబియన్ సొసైటీలో మెంబరు. ఆర్థికవేత్త, సోషలిస్టు.
5. **న్యూ డీల్** – రూజ్‌వెల్ట్ 1933 లో ఆర్థికమాంద్యం నుండి అమెరికాను బయటపడవేయడానికి అమెరికా అధ్యక్షుడు తీసుకున్న చర్య. అమెరికా రెండవ ప్రపంచ యుద్ధంలోనికి ప్రవేశించే వరకు ఇది కొనసాగింది. రిలీఫ్–రికవరీ–రిఫార్మ్ ఇది రూజ్‌వెల్ట్ ఆదర్శం.
6. **ఫైవ్ ఇయర్ ప్లాన్** – పంచవర్ష ప్రణాళిక. భారతదేశంలో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి 1951–56 లో మొదటిగా ప్రారంభమైంది. ఇప్పుడు 2012 తరువాత 5వ పంచవర్ష ప్రణాళిక జరుగుతున్నది. 1928–32 లో స్టాలిన్ మొదటిగా ప్రవేశపెట్టాడు.

16వ ఛాప్టరు

1. **వీర గున్నమ్మ** – శ్రీకాకుళం. వీరనారి గున్నమ్మ. మందస, గుడారి రాజమణిపురంను వీరగున్నమ్మపురంగా ప్రభుత్వం ప్రకటించింది. ఆంగ్లేయుల తూటాలకు బలి అయింది. యుక్తవయస్కురాలు. సాసుమాను గున్నమ్మ, పలాస స్మారక స్తూపం. 1988 సెప్టెంబరు 10.
2. **గోభూమి** – రంగాగారు నివసించిన ఇంటి పేరు.

17వ ఛాప్టరు

1. **వాహిని** – రంగాగారు నిర్వహించిన వారపత్రిక.
2. **జమీన్ రైతు** – నెల్లూరు వెంకట్రామానాయుడు నిర్వహించిన పత్రిక.

19వ ఛాప్టరు

1. **డిస్కవరీ ఆఫ్ ఇండియా** – నెహ్రూగారు వ్రాసిన పుస్తకం.

20వ ఛాప్టరు

1. **అయ్యంకి వెంకటరమణయ్య** – ఆర్కిటెక్ట్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్. 'పద్మశ్రీ' గ్రహీత. 'కౌలా' గోల్డ్‌మెడల్ గ్రహీత. గ్రంథాలయోద్యమ పితామహుడు. 24 జులై, 1890 న జన్మించారు. 1979 లో మరణించారు.

22వ ఛాప్టరు

1. **సి.వి. రామన్** – 7 నవంబరు, 1888 న జన్మించారు. 21 నవంబరు, 1970 లో బెంగుళూరులో మరణించారు. నోబుల్ బహుమతి గ్రహీత, లెనిన్ శాంతి బహుమతి గ్రహీత. 'భారతరత్న'.
2. **అల్బర్ట్ ఐన్‌స్టీన్** – థియరీ ఆఫ్ రెలిటివిటీని వృద్ధిచేసినవారు. జర్మనీలో జన్మించారు.
3. **సేవాగ్రామ్** – మహాత్మాగాంధీగారు 1938 నుండి మరణించే వరకు నివసించిన గ్రామం (మహారాష్ట్ర).
4. **డా॥ బాబా** – హోమి జహంగీర్ బాబా. 30 అక్టోబరు, 1909 లో జన్మించారు. 24 జనవరి, 1966 లో మరణించారు. భారతదేశపు న్యూక్లియర్ ఫిజిసిస్ట్.

23వ ఛాప్టరు

1. **రఫీ అహ్మద్ కిద్వాయ్** – ఇస్లామిక్ సోషలిస్ట్‌గా కొన్నిసార్లు పిలువబడేవాడు.
2. **ఆటోబయోగ్రఫీ ఆఫ్ గాంధి** – 'మై ఎక్స్‌పెరిమెంట్స్ విత్ ట్రూత్' (సత్యశోధన). చిన్నప్పటి నుండి 1921 వరకు వ్రాశారు. వారి పత్రిక 'నవజీవన్'లో 1925–1929 మధ్య ప్రచురించబడింది. ఇంగ్లీషులో 'యంగ్‌ఇండియా'లో ప్రచురించబడింది. 1999 లో ఉత్తమ ఆధ్యాత్మిక పుస్తకంగా బహుమతి పొందింది.
3. **రజాకార్ ఉద్యమం** – నిజాం ఉస్మాన్ ఆలీఖాన్‌ను బలపరుస్తూ ఖాశిం రజ్వి ప్రైవేటు సైన్యాన్ని ఏర్పాటుచేశాడు. హైదరాబాద్‌ను ప్రత్యేక ముస్లిం రాష్ట్రంగా ఉంచాలని వీరి కోరిక.

24వ ఛాప్టరు

1. **ఫాసిస్ట్** – మనిషి విలువలకు గౌరవం లేదు. సంఘానికే పెద్దపీట (సామాన్యంగా దేశమై ఉంటుంది). నాజీలు కూడా ఒకరకమైన ఫాసిస్టులే. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో ఈ మాట బయటకు వచ్చింది.

25వ ఛాప్టరు

1. **ఫెలో ట్రావెలర్స్** – పార్టీ సభ్యులు కాకుండా ఆ పార్టీని బలపరిచే వ్యక్తులు. బోల్షివిక్ రివల్యూషన్‌లో ట్రాట్స్కీ ఈ మాటను వాడాడు. తరువాత రష్యాలోని కమ్యూనిస్టులు, రచయితలు, కళాకారులు, విద్యావంతులు ఈ దోవనే నడిచారు. స్టాలిన్ హయాంలో ఈ మాట వినపడకుండా జాగ్రత్తపడ్డాడు. కమ్యూనిస్టు సానుభూతిపరుడు అని ఈ మాటకు అర్థం.
2. **నవజీవన ట్రస్ట్** – గాంధీగారి పుస్తక ప్రచురణ సంస్థ.

26వ ఛాప్టరు

1. **ఎం.ఎన్.రాయ్** – మానవేంద్రనాథ్ రాయ్. భారత విప్లవకారుడు, రాజకీయ సిద్ధాంతకర్త, వేదాంతి. రాడికల్ హ్యూమనిజంను స్థాపించాడు. జననం 24 మార్చి, 1887 లో జన్మించి, 26 జనవరి, 1954 లో మరణించారు.

27వ ఛాప్టరు

1. **లిక్విడేట్ ది కాంగ్రెస్** – గాంధి – నవంబరు 1947 లో మహాత్మా గాంధీగారు కాంగ్రెస్ పార్టీని రద్దుచేసి, వేరే పేరు పెట్టుకోమని చెప్పారు.

28వ ఛాప్టరు

1. **పాకిస్తాన్** – ఎన్.జి. రంగాగారి తెలుగు గ్రంథం.

29వ ఛాప్టరు

1. **బి.ఆర్. అంబేద్కర్** – దళితుల ఆశాజ్యోతి.
2. **అల్లాడి కృష్ణస్వామి** – రాజ్యాంగ రచయితలలో ఒకరు.

30వ ఛాప్టరు

1. **కమలాదేవి ఛటోపాధ్యాయ** – మంగుళూరు. సంఘసంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధురాలు, హరేంద్రనాథ్ ఛటోపాధ్యాయ భార్య. జననం 3 ఏప్రిల్, 1903 – మరణం 29 అక్టోబరు, 1988.

31వ ఛాప్టరు

1. **టాల్‌స్టాయ్** – రష్యన్ రచయిత. 'వార్ అండ్ పీస్', 'అన్నా కెరీనినా', 'రిసరెక్షన్' మొదలైన నవలల రచయిత. గాంధీగారి మిత్రులు.

32వ ఛాప్టరు

1. **దుగ్గిరాల గోపాలకృష్ణయ్య** – చీరాల–పేరాల సత్యాగ్రహం నడిపారు. 'రామదండు' నిర్వహించారు. మంచి గాయకుడు.

33వ ఛాప్టరు

1. **పొట్టి శ్రీరాములు** – 'అమరజీవి' – ఆంధ్రరాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన గాంధీగారి నమ్మిన శిష్యుడు. జననం 16 మార్చి, 1901 – మరణం 15 డిసెంబరు, 1952.

34వ ఛాప్టరు

1. **మదనమోహన్ మాలవ్యా** – ఎ.ఐ.సి.సి. అధ్యక్షుడు. బెనారస్ హిందూ యూనివర్సిటీ స్థాపకుడు. హిందూ మహాసభను స్థాపించాడు. 'భారతరత్న'. తన చెప్పును వేలం వేయగా, నైజాం నవాబు కొన్నాడు. చౌరి–చౌరా కేసులో ప్రజలకు శిక్షలు లేకుండా చేశాడు.

35వ ఛాప్టరు

1. **కన్నయ్య** – కోనూరి కన్నయ్య. నాగార్జునసాగర్ డ్యామ్ నిర్మాణానికి కారకులలో ఒకరు.

36వ ఛాప్టరు

1. **కృషి పండిట్** – ప్రభుత్వం ఇచ్చే సత్కారం. (రైతులకు రంగాగారు మొదటగా ఇప్పించారు).

40వ ఛాప్టరు

1. **శ్యాంప్రసాద్ ముఖర్జీ** – పరిశ్రమల మంత్రి. జననం 6 జులై, 1901 – మరణం 23 జూన్, 1953. భారతీయ జనసంఘం స్థాపకుడు.
2. **మాడభూషి అనంతశయనం అయ్యంగార్** – జి.వి. మౌలంకర్ తరువాత లోక్‌సభ స్పీకరుగా పనిచేశారు. లాయరు. ఫెడరల్ కోర్టును సుప్రీంకోర్టుగా మార్చమన్నారు. స్వతంత్రోద్యమంలో మూడు సం॥లు శిక్ష అనుభవించారు. తిరుచానూరు చిత్తూరులో 4 ఫిబ్రవరి, 1891 న జన్మించారు, 19 మార్చి, 1978 లో మరణించారు.
3. **కె.ఎం. మున్షీ** – కన్హైలాల్ మాణికలాల్ మున్షీ. గుజరాత్ రాష్ట్రంలో జన్మించారు. భారతీయ విద్యాభవన్ కులపతి. బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడు.

43వ ఛాప్టరు

1. **గాడ్గిల్ వి.** – జననం 10 జనవరి, 1896 – మరణం 12 జనవరి, 1966.

44వ ఛాప్టరు

1. **మిను మసాని** – ఎం.ఆర్. మసాని. స్వతంత్ర పార్టీ తరఫున 3 సార్లు పార్లమెంటు సభ్యునిగా ఎన్నికైనాడు. జననం 20 నవంబర్, 1905 – మరణం 25 మే, 1989. గుజరాత్ రాష్ట్రం.
2. **మార్షల్ ఎయిడ్** – జార్జి సి. మార్షల్. 2వ ప్రపంచ యుద్ధానంతరం పశ్చిమ ఐరోపా దేశాలకు సాయపడటానికి అమెరికా స్పాన్సర్ చేసింది.
3. **కొలంబో ప్లాన్** – ఆర్థిక సాంఘికాభివృద్ధి కొరకు ఆసియా పసిఫిక్ ప్రాంతాల్లో ఏర్పాటుచేయబడింది.
4. **హిట్లర్** – అడాల్ఫ్ హిట్లర్. నాజీ పార్టీ నాయకుడు. జర్మన్ డిక్టేటర్. జననం 1889 – మరణం 30 ఏప్రిల్, 1947.
5. **ముస్సోలిని** – బెనటో ముస్సోలిని. ఇటలీ నియంత. జననం 29 జులై, 1883 – మరణం 28 ఏప్రిల్, 1945. ఫాసిస్టు. 1939 లో హిట్లర్‌తో కలిశాడు. 1945 లో తిరుగుబాటుదారులు కాల్చి చంపారు.

6. **పెరల్ హార్బర్ ట్రాజెడి** – డిసెంబర్ 7, 1941 న అమెరికా నావికా కేంద్రం పెరల్ హార్బర్‌పై జపాన్ దాడి చేసింది. అమెరికా 2వ ప్రపంచ యుద్ధంలోకి ప్రవేశించింది.

7. **సరోజిని నాయుడు** – నైటింగేల్ ఆఫ్ ఇండియా. గొప్ప రచయిత. ఉత్తరప్రదేశ్‌కు మొదటి మహిళా గవర్నర్‌గా పనిచేశారు. స్వాతంత్ర్య సమర యోధురాలు. 1879 లో జన్మించి, 2 మార్చి, 1949 లో మరణించారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌కు ప్రెసిడెంట్‌గా పనిచేశారు. చక్కగా పాడగలదు.

8. **గోపాలకృష్ణ గోఖలే** –

9. **నేతాజీ** – సుభాష్‌చంద్రబోస్. 23 జనవరి, 1897 లో జన్మించారు. 18 ఆగస్టు, 1945 లో మరణించారు. ఐ.సి.ఎస్. ప్యాసైనప్పటికీ ఉద్యోగం చేయలేదు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా 2 సార్లు (1935, 1939) పనిచేశారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ స్థాపించారు. 'ఆజాద్ హింద్ ఫౌజ్' ను నిర్మించారు. చిత్తరంజన్‌దాస్ శిష్యులు. సంపూర్ణ స్వరాజ్యం కావాలి అని ఆందోళన చేశారు. 1930 లో అరెస్టు కాబడ్డారు.

10. **ఐరన్ కర్టెన్** – యూరోపును రెండుగా విభజించే ఊహా సరిహద్దు. రష్యా వార్తలు ఏవీ బయటి ప్రపంచానికి తెలియనివ్వరు అని చెప్తారు. యాక్టివ్ ప్రొటెక్టివ్ సిస్టమ్ ఇన్ రష్యా.

11. **స్టాలిన్** – 18 డిసెంబర్, 1878 న జన్మించి, 5 మార్చి, 1953 న మరణించాడు.

12. **మావ్‌సే డంగ్** (Maozedong) – 25 డిసెంబర్, 1893 న జన్మించి, 9 సెప్టెంబర్, 1976 న మరణించారు. 'ఛైర్మన్ మావో'. ఫాదర్ ఆఫ్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా.

13. **చర్చిల్** – సర్ విన్‌స్టన్ చర్చిల్. ఇంగ్లాండు ప్రధానమంత్రి (1940–45, 1951–55). 30 నవంబర్, 1874 న జన్మించి, 24 జనవరి, 1965 న మరణించారు.

14. **సర్ క్లెమండ్ అట్లీ** – క్లెమండ్ రిచర్డ్ అట్లీ. ఇంగ్లాండు ప్రధాని (1945–51). భారతదేశానికి స్వాతంత్ర్యం వీరి హయాంలోనే వచ్చింది. లేబర్ పార్టీ నాయకుడు. జననం 3 జనవరి, 1883 – మరణం 8 అక్టోబర్, 1967.

15. **ఫెరన్స్ నాగీ** – హంగరీ. నేషనల్ అసెంబ్లీ స్పీకరు. చిన్న రైతుల పార్టీ నాయకుడు.

16. **పంచశీల** – శాంతి ఒప్పందం. 1954 లో చైనా–ఇండియాల మధ్య చారిత్రాత్మక ఒప్పందం. 5 మంచి గుణాలు – 1.ఒకరిపై ఒకరికి నమ్మకం, 2.ఒకరిపై ఒకరు దాడిచేయకుండడం, 3. అంతర్గత విషయాల్లో జోక్యం లేకుండడం, 4. సార్వభౌమాధికారం కాపాడుకోవడం, 5. సమానత్వం, సహజీవనం. చైనా ఇండియాపై దురాక్రమణతో ఈ ఒప్పందం భగ్నమైంది.

17. **బాండుంగ్ కాన్ఫరెన్స్** – ఏప్రిల్ 18–24, 1955 లో జరిగింది. ఇండోనేషియా ఏర్పాటుచేసింది.

18. **యునైటెడ్ నేషన్స్** – 24 అక్టోబర్, 1945 రెండవ ప్రపంచ యుద్ధానంతర దశలో 50 మంది సభ్యులతో న్యూయార్క్ పట్టణంలో ఉండేది. దీని ఆశయాలు – హ్యూమన్‌రైట్స్, సాంఘిక ఆర్థిక అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, కరువు–ప్రకృతి వైపరీత్యాల్లో రక్షణ మొ॥నవి.

19. **చెస్టర్ బౌల్స్** – ఇండియాలో అమెరికన్ రాయబారి.

20. **సెయింట్ ఫ్రాన్సిస్ అస్సీసి** – ఇటాలియన్ రోమన్ కాథలిక్ ప్రీచర్.

21. **జార్జి డిమిట్రోవ్** –

22. **డా॥ సుక్రుమా** – 1957 లో బ్రిటన్ నుంచి ఘనాకు స్వాతంత్ర్యం సంపాదించాడు. ఘనా మొదటి ప్రధాని. 1966 లో తొలగించబడ్డాడు. రొమేనియాలో 27 ఏప్రిల్, 1972 లో మరణించాడు.

23. **హెచ్.ఎన్. బ్రెయిల్స్ ఫోర్డ్** – హెన్రీ నోయిల్ బ్రెయిల్స్ ఫోర్డ్. అతివాద వామపక్ష బ్రిటన్ పత్రికా విలేకరి. జననం 25 డిసెంబర్, 1873 – మరణం 23 మార్చి, 1958.

24. **హెరాల్డ్ లాస్కీ** – ఆంగ్ల రాజకీయవేత్త. ఆర్థిక శాస్త్రవేత్త, రచయిత. బ్రిటీష్ లేబర్ పార్టీకి 1945, 46 సం॥లో అధ్యక్షుడు. జననం 30 జూన్, 1893 – మరణం 24 మార్చి, 1950.

25. **గోముల్కా** – వ్లాడ్ సా గోముల్కా. పోలిష్ కమ్యూనిస్టు నాయకుడు.

26. **రూబెన్స్** – సర్ పీటర్ పాల్ రూబెన్స్. పెయింటర్. జననం 28 జూన్, 1577 – మరణం 30 మే, 1640.

27. **మేరియా ఆంటో నెట్టీ** – ఫ్రాన్స్ రాణి (1755–1793).

28. **సోక్రటీస్** – క్రీ.పూ. 399 (ఏథెన్స్). – హెమ్లాక్ అనే విషాన్ని తీసుకోవడం ద్వారా అతనికి మరణదండన విధించబడింది. ప్లేటో అతని శిష్యుడు. సోక్రటీస్‌ను గురించి వ్రాశాడు. ప్రశ్నించే వేదాంతి – ప్రశ్నించడం నేర్పినవాడు – వివేకం – నీకేమి తెలియదని తెలుసుకోవడం.

29. **ఎ.జి.కె. మూర్తి** – ఆవుల గోపాలకృష్ణమూర్తి. 29 ఏప్రిల్, 1917. రాడికల్ డెమోక్రటిక్ పార్టీ సభ్యుడు. లాయరు. మరణం 1967, తెనాలి.

30. **మహమ్మద్ ఇక్బాల్** – కవి, వేదాంతి, రాజకీయవేత్త, బారిస్టర్. 'సారే జహాఁసే అచ్ఛా' గేయ రచయిత. జననం 9 నవంబర్, 1877 – మరణం 21 ఏప్రిల్, 1938.

31. **జహంగీర్** – అక్బర్ కుమారుడు. ప్రిన్స్ సలీమ్. నల్లమందుకు, సారాయికి బానిస. పెయింటింగ్‌పై అభిరుచి గలవాడు.

32. **నూర్జహాన్** – జహంగీర్ భార్య. అనార్కలి కథకు ఆద్యురాలు. లాహోర్‌లో ఎక్కడో ఒకచోట ఈమె సమాధి ఉన్నది.

33. **సొల్మన్ బండారునాయకే** – శ్రీలంక నాల్గవ ప్రధానమంత్రి (1956–59).

34. **సిరిమావో బండారునాయకే** – శ్రీలంక (సింహళం) మొదటి ప్రధానమంత్రి.

35. **డ్వైట్ డి ఐసన్‌హోవర్** – 34వ అమెరికన్ ప్రెసిడెంట్. రిపబ్లికన్ పార్టీ. మరణం 28 మార్చి, 1969.

36. **పెన్సిలిన్** – అలెగ్జాండర్ ఫ్లెమింగ్ మొదటిసారిగా కనుగొన్న యాంటీబయాటిక్.

37. **మిస్టర్ బేకర్ – డా॥ గిల్బర్ట్ స్లేటర్ – డా॥ మెకరిగర్** – ఇంగ్లండులో రంగాగారి చదువుకు సహాయపడినవారు.

44వ ఛాప్టరు

1. **కళా వెంకట్రావు** – స్వాతంత్ర్య సమరయోధుడు, రాజకీయవేత్త. జననం 7 జులై, 1900 – మరణం 25 మార్చి, 1959.

2. **శంకర్స్ వీక్లీ** – కేశవ శంకర పిళ్ళే, కార్టూనిస్ట్. ఫాదర్ ఆఫ్ పొలిటికల్ కార్టూన్స్..

Lonely Furrow (ఒంటరి సేద్యం)

–శంకర్స్ వీక్లీ

అనుబంధం

సంవిధాన సభ - ఆంధ్రరాష్ట్రము

1946 లో ప్రకాశంగారు, తాము ముఖ్యమంత్రి అయినప్పుడు, ఆంధ్ర కాంగ్రెసు కమిటీ యాజమాన్యాన్ని ఆచార్య రంగాగారికి అప్పగించారు. పట్టాభి గారు అది తమ చేతుల్లోకి తీసుకోవడానికెంతో యత్నించారు. వారి పక్షాన పని చేయడానికి పూనుకొన్న ముఖ్యమైనవారు–ఆయన అనుయాయులు, మంత్రులూ అయిన కళా వెంకటరావు, బెజవాడ గోపాలరెడ్డి, నీలం సంజీవరెడ్డి గారలు.

కాంగ్రెసు కమిటీలో సభ్యులను చేర్చి, సవ్యమైన పద్ధతిలో కాంగ్రెసు కమిటీని వశం చేసుకోవడానికి యత్నిస్తే, అందులో తప్పులేదు. కాని, వారి వర్గీయులు, సవ్యమైన మార్గాన సభ్యులు కావడానికి రంగాగారి (అనగా, ప్రకాశంగారి) వర్గంవారు అవకాశం ఇవ్వలేదన్న నెపంపైన, ఒక లక్ష పేర్లు జాబితాలుగా వ్రాసి, అవి కాబోయే సభ్యుల పేర్లని, నిర్ధారణ సూచకంగా వేలిముద్రలు అనేకము లైనవి తగిలించి, లక్షమందికి కావలసిన చందా మొత్తం 25 వేల రూపాయలు కాంగ్రెసు అధ్యక్షుని పేర ఢిల్లీకి పంపారు. ఇవన్నీ దొంగ జాబితాలని ప్రకాశం గారి వర్గంవారు వెంటనే కనిపెట్టగలిగారు. ఈ పాతిక వేలూ, పావలా పావలా చొప్పున చందాదారులిచ్చిన డబ్బు కాదు - ఒకరిద్దరు వర్తకులు, ఒకరిద్దరు జమీందారులు (అప్పుడు జమీందారీల రద్దు బిల్లు సెలక్టు కమిటీ ఎదుట ఉన్న కాలము) ఇచ్చిన మొత్తాలు కలపగా పాతికవేలయింది. అందులో ఆరువేలిచ్చిన జమీందారు పేరు నాకు జ్ఞప్తిలో ఉంది. ఈవిధంగా చేసిన ఆరోపణలన్నీ కొంత కాలానికి చర్చకు వచ్చి, ఆ లక్ష సభ్యుల పేర్లు జాబితాలోంచి కొట్టివేయబడ్డాయి.

ఎన్నికల రంగస్థలము - విజయవాడ కాంగ్రెసు భవనము

ఆనాడు, ప్రభుత్వంవారు రాష్ట్ర సంఘాన్ని తమ వశం చేసుకోకుంటే, వారి వర్గం తిరిగి తలయెత్తుకోలేని పరిస్థితులు ఏర్పడుతాయి. అందుచేత, తమ

వర్గానికి ఓటు బలము చేకూర్చుకోడానికి రాష్ట్ర సంఘ సభ్యులను, పశ్చిమ గోదావరి జిల్లాలోని ఒక గ్రామంలో, ప్రస్తుతం మంత్రిగా ఉన్న ఒకరి దివ్య భవనంలో షడ్రసోపేతమైన అన్నపానాదులతో ఒకచోట చేర్చి పెట్టుకొన్నారు.

మరునాడు ఎన్నిక జరుగుతుందనగా, ఎన్ని లెక్కలు వేసుకొన్నా వారి వర్గం వారికి ఏడు ఓట్లు తక్కువగా ఉన్నట్లు తెలిసింది. వారి అభ్యర్థి నీలం సంజీవరెడ్డి గారు. ఆయన మంత్రి పదవి వదులుకొని రాష్ట్ర సంఘ అధ్యక్షుడు కావాలని ఏర్పాటు జరిగింది. ప్రకాశం, రంగా గారల వర్గాన పక్షాన నిలబడ్డ వారు ఆచార్య రంగాగారు.

ప్రభుత్వం పక్షంవారు ఏం చేశారో తెలియదుగాని, అంతవరకు ప్రకాశం గారంటే ప్రాణాలివ్వడానికైనా సిద్ధమని చెప్పిన నలుగురు కృష్ణా జిల్లా సభ్యులు అటు దాటివేశారు. ఎన్నిక తరువాత ఏడు ఓట్లతో గెలుస్తామనుకున్న రంగాగారు నాలుగు ఓట్లతో ఓడిపోయారు.

ఆనాడు జరిగిన ఉదంతాలు ఆంధ్ర కాంగ్రెసు చరిత్రనేగాక, ఆంధ్ర రాజకీయ రంగ నిర్మాణ, పరిణామాలను సంపూర్ణంగా మార్చివేశాయి.

కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ

1947లో పార్టీ సభ్యులలోనే కొందరు ప్రతికూలురు, క్రమబద్ధంగా ఉండాలనే నిర్బంధం లేకుండా, గాంధీ తత్వానికి కార్యరూపం ఇవ్వడానికి ప్రారంభించిన ప్రకాశంగారిని పదవీచ్యుతుని చేసే పన్నుగడల సమయంలో – న్యాయ–అన్యాయ సూక్ష్మతను గ్రహించలేని కాంగ్రెసు అధినేత కృపలానీగారికి కూడా, 1951 నాటికి కాంగ్రెసు నుంచి వెలుపలికి పంపబడే అవకాశాలు వచ్చాయి.

1951 జూన్‌లో కృపలానీగారు – తనతోపాటూ, తనవలెనే కాంగ్రెసు నుంచి విడిపోయిన వారినందరినీ పాట్నాలో సమావేశపరిచారు. వారందరూ కలిసి ఒక పార్టీగా రూపొందాలని నిర్ణయమైంది.

నాటి ఉదయం అక్కడ పార్టీ పేరు నిశ్చయమైంది. సభలో ఎవరి సలహాపైననో 'ప్రజాపార్టీ' అనే మాటకు ముందుగా 'మజుదూర్' అనే మాట కలిపారు. రంగాగారి సలహాపైన దానికి ముందు 'కిసాన్' అన్న మాట కూడా కలిపారు.

'ప్రజాపార్టీ' అన్నది అందరి సభ్యుల ఆమోదాన్ని పొందడంచేత ఆ పార్టీకి 'కిసాన్ మజుదూర్ ప్రజాపార్టీ' అనే నామకరణం జరిగింది.

ఆ మధ్యాహ్నం మహాసభకు నాలుగైదు వేలమంది హాజరయ్యారు. కృపలానీ గారు కాంగ్రెసు సంస్థలో జరుగుతున్న పక్షపాతం, బంధుప్రీతి, అధికార దుర్వినియోగం మొదలైన పరిస్థితులు వర్ణించి, ఆ దుర్గుణాలు లేని రాజకీయ సంస్థ ఒకటి ప్రారంభించడం ప్రజలకు శ్రేయస్కరమని భావించి – తాను, ప్రకాశంగారు, పి.సి. ఘోషుగారు మొదలైనవారు ఆ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పి, పార్టీకి ఆ ఉదయం పెట్టిన పేరు వగైరా విషయాలు వివరించి, పార్టీ ఇతర వివరాలు, ప్రోగ్రాము వ్రాయడానికి నలుగురితో కూడిన ఒక ఉప సంఘం ఏర్పడేటట్టు చెప్పారు. అందులో తాను, ప్రకాశంగారు, కిద్వాయిగారు, డా॥ పి.సి. ఘోషుగారు సభ్యులనీ ఆయనే చెప్పారు. సాదిక్ అలీ అనే యువకుణ్ణి (ప్రస్తుతం పాత కాంగ్రెసు సంస్థలో ముఖ్యుడు) కార్యదర్శిగా నియమించారు.

కృపలానీగారు ఉపసంఘ సభ్యుల పేర్లు చెపుతున్నప్పుడు వెనకనుంచి ఒక మిత్రుడు లేచి అందులో రంగాగారి పేరు ఉంచాలని కేకవేశాడు.

'ఇది చిన్న ఉపసంఘము, దక్షిణ ప్రాంతీయులకు ప్రాతినిధ్యానికి ప్రకాశం గారి పేరు ఉండనే ఉంది గనుక, రంగాగారి పేరు పార్టీ కార్యనిర్వాహకవర్గం ఏర్పాటు చేస్తున్నపుడు వేసుకొంటా'మని కృపలానీగారు చెప్పారు.

కార్యదర్శిగా సాదిక్ అలీ పేరు చెప్పినప్పుడు, తిరిగి అదే మిత్రుడు 'రంగా గారిని కార్యదర్శిగా అయినా వేయండి' అని కేకలు వేశాడు.

అందుకు కృపలానీగారు 'నేను చేస్తున్న పని నాకు తెలుసు. నాకు కార్యదర్శి అంటే నేను చెప్పే మాటలు, ఉత్తరాలు వ్రాసుకొంటూ నావెంట తిరిగే మనిషి. రంగా పెద్దవారు. ఆయనకు ఇవ్వవలసిన స్థానము ఎలాగూ ఇస్తాము. మీరు అనవసరంగా ఇక్కడ గలభా చేయకండి' అన్నారు.

ఆ విషయం అంతటితో ఆగిపోయింది.

మిగిలిన కార్యక్రమం సాఫీగా జరుగుతున్నది. కాని, రంగాగారు చదీచప్పుడు లేకుండా ఆ హాలులోంచి ఏదో పనిమీద అవతలకు వెళుతున్నట్టుగా వెళ్లారు.

ఆచార్య తెన్నేటి విశ్వనాథంగారు –'ప్రకాశంగారి ఆత్మకథ' నుండి

ఆచార్య రంగాజీ

రంగాజీ 1900 సంవత్సరం నవంబరు 7వ తేదీన గుంటూరు జిల్లా, నిడుబ్రోలులో జన్మించారు. తొంభై అయిదేళ్ల పరిపూర్ణ జీవితం గడిపి, 1995 జూన్ 8న పరమపదించారు.

రంగాజీ 1924 లో ఇంగ్లండులో చదువులు సాగిస్తున్న కాలంలో మార్క్సిజం, కమ్యూనిజం, సోషలిజంల ప్రభావానికి లోనై సుత్తి, కొడవలి చిహ్నంగా ఎర్రజెండాను ఎగురవేసిన తొలి యువతరంలోనివారు.

1935–40 మధ్యకాలంలో కమ్యూనిజమంటే ఏకపక్ష కార్మిక నియంతృత్వమే నని ముందుగా అవగాహనకు వచ్చిన ఇరువురు మహామేధావులలో రంగా గారొకరు. రెండవవారు యుగోస్లావియా కమ్యూనిస్టు పార్టీ నిర్మాత, ఆ దేశ కమ్యూనిస్టు ప్రభుత్వాధినేత మార్షల్ టిటోకు గురువు 'మిహిలోన్ జిలాస్' 'న్యూక్లాస్' అనే గ్రంథం ద్వారా ప్రపంచానికి తెలియజెప్పారు.

మార్క్సిజం, కమ్యూనిజం, ఏకపక్ష కార్మిక నియంతృత్వ సిద్ధాంతానికి, మార్క్సు 'క్యాపిటల్' గ్రంథానికి ప్రత్యామ్నాయంగా ప్రజాస్వామ్యం ప్రాతిపదికగా, దానినే ప్రాణప్రదంగా ఎంచుకొనే విధంగా 'కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్' సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. 1944 లో జైలు నుండి విడుదలవుతూనే గాంధీతో చర్చించి ఆమోదింపజేశారు.

ఇక ప్రధాని పండిట్ నెహ్రూతో సిద్ధాంత పోరాటాలు – అపజయాలు – పరాజయాలు పొందుతూనే విజయాలు సాధించిన యోధులు రంగాజీ.

ఆచార్య ఎన్.జి. రంగా, 65 సం॥లు పార్లమెంటులో ఉన్న ప్రముఖ గాందేయ వాది. ఆర్థికశాస్త్రంలోను, చరిత్రాధ్యయనంలోను ఆక్స్‌ఫర్డ్‌లో పట్టం పుచ్చుకున్న ప్రముఖ శాస్త్రవేత్త. 1924 లో భారతీదేవిని వివాహమాడారు.

పార్టీ స్థాపనలో ప్రముఖ పాత్ర నడిపిన ప్రజా ఉద్యమాలు

1931 నుండి అనేక సత్యాగ్రహ సమరాలు, కిసాన్ యాత్రలు, పికెటింగులు నిర్వహించారు. రైతుల స్వంత కమతాలను స్వాహాచేయడానికి, రద్దు చేయడానికి ఉద్దేశించబడిన 17వ రాజ్యాంగ సవరణ బిల్లును సాహసోపేతంగా ఎదిరించి, దేశవ్యాప్త ఉద్యమం నిర్వహించి పార్లమెంటులో విజయంపొంది, స్వయంవృత్తుల వారైన రైతాంగాన్ని కాపాడారు.

రంగాజీ రచనలు, ప్రచురించిన గ్రంథాలు (ఆంగ్లంలో) :

1. Labour in South India (1934)
2. Maidan speech of Ranga in Parliament (1930)
3. Kisan Hand Book (1938)
4. Kisan Speaks (1935)
5. Jamindari Rythu (1940)
6. History of Kisan Movement (1940)
7. Adhunika Rajyanga Samsthalu - 2 volumes (1934) (Telugu)
8. Pakistan (Telugu) (1945)
9. Peasants and Controls (1945)
10. Economic conditions of Jamindari Ryts
11. Economic conditions of Indian Villages - 3 Volumes
12. Outlines of National Revolutionary Path
13. World Role of National Revolutionary Path (1946)
14. Tribes of Nilgiris (1946)
15. Communists and Kisans (1946)
16. Gandhian Way of Planning (1946)
17. Revolutionary Peasant (1947)
18. Colonial and Coloured Peoples Freedom Front
19. Modern Indian Peasant
20. Kisan Mazdoor Praja Raj (1947)
21. Peasants and Congress
22. Students and Congress (1948)
23. Towards World Peace (1957)
24. Credo of World Peasantry (1957)
25. Panchayat Landlordism verses Peasant Economy
26. Storm Bursts on Peasantry (1959)
27. Sahakara Vyavasayam
   (Ranga + Parchuri - Translated by Jasthi Jagannadham)

28. Why Ranga Resigns? (1959)
29. Self Employed Sector (1959)
30. Prajaswamyam (1960)
31. Truteeya Pranalika Communistic Margam (1960)
32. Freedom in Peril (1961)
33. Fight for Freedom (1968)
34. Bapu Blesses (1969)
35. Kakatiya Nayaks (1971)
36. Agony and Solace (1974)
37. Bharathidevi Smruthulu (1975)
38. World Food Insurance (1975)
39. Natural Calamities
40. Distinguished Acquiantances - 2 Volumes (1976)
41. Rajendra Prasad Memorial Lecuture (1981)
42. Telugu's Heroic Role in the World (1981)
43. Lakshminarayana (1981)
44. Prof. Ranga at U.N. (1982)
45. Protect Self-Employed Peasants and Tribal People (1983)
46. Ranga Rachanalu (1987)
47. Panchayat Bhuswamyam verses Rythu Swamyam
48. Congress Path to National Disaster (Ranga and Gayathri Devi)
49. Crop Targets
50. Pasuvula Bheema Padakam (Ranga and Shivaji)
51. V. Rama Krishna - a Tribute
52. Revolutionary Peasants
53. India and U.S.
54. Quintessence of Non-alligned Movement
55. Monograph on Parliamentary Democracy
56. Ariel View of USSR and Ugoslavia
57. Biography of Kisan - Gorrepati
60. Gandhian Plan
61. Rajaji-Sardar Patel-Jawaharlal Nehru
62. Prakasam-Giri-Sriprakash - Freedom Fighters
63. Settipalli Songs
64. Harijana Nayakudu (1966 - Telugu)
65. Indian Education Movement.

ప్రశంస

సోదరుడు డా॥ జేక్కంపూడి సీతారామారావు రైతు కుటుంబంలో జన్మించి, వైద్యశాస్త్రంలో మరియు న్యాయశాస్త్రంలో నైపుణ్యాన్ని గడించారు.

రైతుజన బాంధవుడు ఆచార్య యన్.జి. రంగ గారు తన జీవితచరిత్రను ఆంగ్లంలో 'ఫైట్ ఫర్ ఫ్రీడం' పేరుతో రచించారు. అది ఒక మహాభారత గ్రంథము కంటె గొప్పది. భారత రైతాంగపు మన్ననలను పొందినది. ఇటువంటి ఉత్కృష్ట గ్రంథాన్ని చక్కని తెలుగులో భావిజనాల సౌకర్యార్థం కష్టించి డా॥ సీతారామారావు వెలుగులోనికి తీసుకొనిరావడం అందరికీ ఆనందదాయకం. విదేశాలలో ఉన్నత విద్యాభ్యాసం చేసి, ప్రపంచ సోషలిస్టు నాయకుడు హెరాల్డ్ లాస్కీ శిష్యునిగా దేశ సేవకు ఉద్యుక్తుడై, 'పచ్చయ్యప్పాస్'లో ప్రొఫెసర్ పదవిని కూడా త్యజించి, గాంధీజీ నాయకత్వాన స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న అట్టి మహనీయుని వీరోచిత గాథలను మన రాష్ట్రంలోనేగాక ఇతర రాష్ట్రాలలో ఉన్న మేధావులంతా స్వీకరించడం జరిగింది. ఈనాడు ఆసేతు హిమాలయ పర్యంతం ఏ గొప్ప నాయకుని కదిలించినా 'మేమంతా ఆచార్య రంగాగారి వద్ద రాజకీయ ఓనమాలు నేర్చినవారమేనని' సగర్వంగా చెప్తూ ఉంటారు.

ఇటువంటి ఆదర్శ దేశభక్తుని జీవితచరిత్రను ప్రజలందరికీ అందుబాటులోనికి తీసుకొనివచ్చిన డా॥ సీతారామారావును స్వాతంత్ర్య సమర యోధుల సంస్థ తరపున అభినందిస్తున్నాను.

-పావులూరి శివరామకృష్ణయ్య

ఒక మహామనీషి నిర్గమనము

తన తొంభైఐదో ఏట ఎన్.జి. రంగా పంచభూతాలలో విలీనమయ్యాడు. పంచభూతాత్మక దేహం గల మనమందరం ఎప్పుడో ఒకప్పుడు పంచభూతాలలో లీనమైపోక తప్పదు. నూరేళ్లు నిండకుండా రంగాజీని తనలో చేర్చుకున్న దైవాన్ని కూడా అంతగా నిందించాల్సిన పనిలేదు. ఆయన మననుండి శాశ్వతంగా దూరమైపోయాడన్న పరితాపం సహజంగా మనను పీడిస్తుందనుట నిజం. ఆయనతో కలిసి పనిచేసినవారు, ఆయన చిరకాల మిత్రులు, ఆయన నెరిగిన వారు మాత్రం రంగాజీ మనను వీడి సుదూరలోకాలకు చేరాడన్న భావాన్ని, బాధను, హృదయపరితాపాన్ని అంత సులువుగా విడనాడజాలరనుట నిజం. బహుశ నేటి యువతరం ఆయనను గూర్చి అంతగా అవగాహన కలిగివుండక పోవచ్చు! వారిలో చాలామందికి రంగాజీ నేటి తరానికి చెందిన రాజకీయ నాయకులకంటే, వ్యక్తులకంటే చాలా భిన్నమైన మూర్తిమత్వం, ఉన్నత వ్యక్తిత్వం గలవాడన్న సంగతి తెలిసియుండకపోవచ్చు.

నేటికీ సజీవులైయుండి ఉత్తమ గాంధేయవాదులుగా వినుతికెక్కిన కొద్ది మందిలో ఒకరైన రంగా ఈ లోకంనుండి నిష్క్రమించాడన్న సత్యాన్ని నేటి యువతరం అవశ్యం గ్రహించాల్సి ఉంది. ఆయన మనకు వారసత్వంగా విడిచి వెళ్లిన తన రచనలు, ఆయనపై వెలువడిన గ్రంథాలు, ఆయన పార్లమెంటు ప్రసంగాలు నేటి యువతరానికి మేలుకొల్పు కావాలి. వారిలో వివేకాన్ని వర్ధిల్ల చేయాలి. రంగాజీ సాహస పరాక్రమాలకు, రాజకీయ స్థితప్రజ్ఞతకూ, రాజనీతిజ్ఞ తకూ పేరుపొందిననాటి మేటి దేశభక్తులలో ఒకరు. ఆయన పదవీకాంక్షగాని, అధికార వ్యామోహంగాని లేని మహోన్నత ప్రజానాయకుడు. మచ్చలేని

మహోన్నత మూర్తిమత్వం గల అకళంక ప్రజాస్వామ్యవాది. నైతిక రాజకీయవేత్త. ఆయన మరణంతో నిస్స్వార్థ, నిష్కళంక దేశభక్తుల శకం అంతరించిందనుట నిజం. నిజమైన ప్రజాస్వామ్యవాదులు నిజంగా కనుమరుగయ్యారనుట నిజం. ఆయన నిరహంకారి. ఆయన అహంకారులను సహించడు. కాని కొన్నియెడల తాను నమ్మిని సిద్ధాంతాల కొరకు కఠినం, నిష్ఠురం అయిన వైఖరి వీడనివాడు. భారత పార్లమెంటుకు, పార్లమెంటరీ సంప్రదాయాలకూ మెరుగులుదిద్దిన మహా మహుడు. భారతీయ ప్రజాస్వామ్యాన్ని దీప్తివంతం, కాంతివంతం గావించిన తేజోవంతుడతడు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా తనదంటూ ఒక చెదరని ముద్ర వేసిన అమృతమూర్తి ఆచార్య రంగా అనుట నిజం.

రంగా, నేనూ ఇండియాలో పట్టభద్రులమై తరువాత ఆక్స్‌ఫర్డ్ సెయింట్ కాథరిన్‌లో ఉన్నత డిగ్రీ కొరకు చేరాము. రంగా రీసెర్చి డిగ్రీ పొందాడు. నేను కూడా ఆనర్ స్కూల్ ఆఫ్ మోడరన్ హిస్టరీ నుండి రీసెర్చి డిగ్రీ పొందాను. ఆయన ఆక్స్‌ఫర్డ్‌లో ఉన్న 20వ శతాబ్దం మూడో దశకు తొలి దశ అది అని అనుకుంటున్నాను. ఆ దశలో ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయాలు తమ సాంప్రదాయ పద్ధతులకు భిన్నంగా ఒక నూతన జనరేషన్‌కు ప్రతీకగా నూతన తరహా విద్యార్థులను తయారుచేయుటకై సంకల్పించి కృషిచేయడం జరిగింది. జేమ్సు కెమెరాన్ అనే ఒక సుప్రసిద్ధ ప్రచారకుడు 'గడచిన మధుర దినాలు', 'మనమందరమూ కమ్యూనిస్టులం అయితే లేదా విధిగా అందరం కమ్యూనిస్టులం కావాలి' అనే నినాదాలు లేవనెత్తాడు. నాకది అంటువ్యాధిగా సోకింది. రంగా స్వభావసిద్ధంగా సర్వాధికారానికి సంకేతమైన నియంతృత్వం యెడ ఎనలేని అయిష్టత, అసహ్యం, కంపం, కంటగింపు గలవాడు. తత్కారణం కమ్యూనిస్టు అనే పదం ఆయన దృష్టిలో ఒక కళంకంగా భావించేవాడు. అందుకే ఆయన ఆ కళంకానికి గురికాకుండా ఆజన్మాంతం నిలబడ్డాడు. రంగా సాంఘిక ప్రజాస్వామ్యం యెడ ఆకర్షితుడయ్యాడు. సాంఘిక ప్రజాస్వామ్యాన్ని గూర్చిన చింతన, ఆలోచనలే రంగాను దృఢమైన సిద్ధాంత ద్రష్టగా రూపొందజేశాయి. ఇట్టి ఆలోచనలు ఆయనకు మేధావిగా ఓర్పును, రాజకీయ నాయకుడుగా

ఊరటను కలిగించాయి. అవియే ఆయనలో రాజకీయ భావపరిణతి కలగడానికి హేతుభూతమైనాయి. హెరోల్డ్ లాస్కీ తనదంటూ ఒక చెరగని, స్థిరమైన సోషలిస్టు ముద్ర రంగాపై వేశాడు.

రంగా కూడా నాడు వివేచనా జ్ఞానం, వివేకం గల యువకులందరివలె దేశభక్తి అనే అభినివేశానికీ, పట్టుదలకూ, ఉత్సాహానికీ, ఉద్వేగానికీ గురయ్యాడు. మాతృభూమికి మరలివచ్చిన అనతికాలంలో మద్రాసు పచ్చయ్యప్ప కాలేజీలో ఆయన ఆర్థికశాస్త్రాచార్యుడుగా పనిచేశాడనుకుంటాను. కాని మాలో దేశభక్తియే ఆవేశంగా నిండుగా ఆవహించి ఉంది. తత్కారణంగా రంగా సహజంగా రాజ నీతిజ్ఞుడే గాని ఉపాధ్యాయుడు కాదనుట నిజం. అందుకే ఆయన అనివార్యంగా రాజకీయరంగ ప్రవేశం చేశాడు. అనేకమార్లు జైలుశిక్ష అనుభవించాడు. అఖిల భారత కాంగ్రెస్ శిబిరంలో ఆయన చేరాడు. తన జీవితాన్ని చురుకైన, సుదీర్ఘమైన క్రియాశీల రాజకీయ వృత్తికే అంకితంచేసి రాజనీతిజ్ఞుడుగా, ప్రజానాయకుడుగా, సిద్ధాంతస్రష్టగా, రాజకీయ తత్త్వవేత్తగా చిరస్మరణీయుడయినాడనుట నిజం. ఆయన అనేక పర్యాయాలు కాంగ్రెస్‌ను వీడి కొత్తగా రాజకీయ పార్టీలు పెట్టడం జరిగింది. కాని తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి నిలిచాడు. ఆ సిద్ధాంతా లను భంగపరిచే దురుద్దేశంతో అధికార రాజకీయ చదరంగంలో భాగంగా కొందరు కాంగ్రెస్ పెద్దలు తలపెట్టిన అవినీతి, అప్రజాస్వామ్య విధానాల కారణంగా, అనివార్యంగా తాను కాంగ్రెస్‌ను విడనాడక తప్పిందికాదు. అందుకు ప్రతీకారంగా, ధైర్యంగా ఇలాంటి సాహస కార్యాలకు ఆయన తలపడ్డాడు. ప్రజాహితమే ప్రధానంగా, అధికార దాహం లేకుండా ప్రజాసేవకు అంకితమైన ప్రజానాయకుడుగా ఎటువంటి జంకుకొంకులు లేకుండా ధైర్యంగా ముందడుగు వేసి, భంగపాటులను చవిచూసిన సాహసోపేతుడూ, పరాక్రమవంతుడూ రంగా చరిత్రలో నిలిచి ఉంటాడు అన్నది అక్షరాల నిజం. ఏదియేమైనా బ్రిటీషు పాలనా కాలంనాటి అసలైన సిసలైన మేటి కాంగ్రెస్‌వాదిగా, ప్రజారాధ్యుడుగా ఆయన తన తుది శ్వాస విడిచాడు. ఆయన హృదయంలో, రక్తంలో, ఆలోచనలో కాంగ్రెస్ యెడ ఎల్లప్పుడూ గౌరవభావం జీర్ణించి ఉంది. కాంగ్రెస్ మా అందరికీ

నివాసస్థానంగా ఉంది. ఆయన ఆదర్శ కాంగ్రెస్‌వాది, అసలైన గాంధేయవాది అనక తప్పదు.

రైతులు, వ్యవసాయం, పంటపొలాలతో ఆయనకున్న అవినాభావ సంబంధం జగద్విదితం. ఆయనలో కృషీవలుల నిష్కపట రూపం కొట్టవచ్చినట్లు కన్పడుతుందనుట కల్ల కాదు. వ్యవసాయం వృత్తిగా, జీవనంగా బ్రతికే డెబ్బై శాతం రైతుకూలీలనుగూర్చి, తదితర వ్యవసాయ సంబంధమైన వృత్తులవారిని, కళాకారులనుగూర్చి, ఇంకా అనేక స్వయంపోషక వర్గాలవారికి సంబంధించిన రాజకీయార్థిక సాంఘిక నైతిక చింతనయే ఊపిరిగా పోరాడిన పరాక్రమోపేతుడు రంగా అనుట నిజం. అదియే ఆయన జీవితాదర్శంగా గోచరిస్తుంది. అదియే ఆయన ఆదర్శాలకు, కృషికీ మూలమని మనకు అర్థమవుతుంది. ఆంధ్రప్రదేశ్ సారవంతం, సుక్షేత్రం అయిన మాగాణి భూములకు నిలయం. కృష్ణా, గోదావరి అందు జీవనదులు. ఆ నదుల పరీవాహక ప్రదేశాలు శ్రమజీవులైన రైతుకూలీల సమైక్య సహజీవన సాంఘిక సంస్కృతీ సౌరభాలను వెదజల్లుతుంటాయి. బంగారువన్నె గల కంకులతో వినమ్రంగా అర్రులు వంచి గాలిలో తరంగాలవలె ఉర్రూతలూగుతూ నిలచి కోతకు సిద్ధంగా ఉన్న పంటపొలాలు, ఆ పొలాలను చూచుకొంటూ ఉల్లాసంతో ఉప్పొంగిపోయే రైతులూ, ఆ రైతుకూలీల సంక్షేమమూ, వారి శ్రేయస్సులే దేశ శ్రేయస్సుకు, భారతజాతి అభ్యుదయానికీ, సంస్కృతికీ మూలం అన్న భావం రంగా నరనరాలలో నాటుకుపోయిందనుట నిజం. అందుకే ఆయన రైతు తత్త్వవేత్తగా 'రైతుగీత' (Credo of World Peasantry) వ్రాసి తరించిన మానవతామూర్తి. రైతుబాంధవుడు రంగా అన్నది అమరసత్యం అనక తప్పదు. నిజమైన ప్రజాసేవకుడుగా, ప్రజాస్వామ్యవాదిగా, ప్రజాస్వామ్య తత్వాన్ని జీర్ణించుకున్న యోగిగా మనకు సదా సాక్షాత్కరిస్తుంటాడన్నది కాదనరాని కఠిన సత్యం.

రంగా మనను విడిచి అందని తీరాలకు వెళ్లిపోయాడన్న వార్త వినగానే 'Old soldiers never die; they tade away' 'బలపరాక్రమాలు గల శూరుడు

వృద్ధుడయ్యునూ నశించడు, మ్లానము నొందును' అన్న మాటలు నా స్మృతి పథంలో నిలిచాయి. అధికారంలో ఆయన చేయి క్రిందైనా పార్లమెంటులో ప్రతిపక్షనేతగా ఆయన స్థానం అధికారపక్ష నేతకు సమీపంలోనే ఉండేది. రంగా రాజకీయ ప్రవేశం చేసిన అనతి దినాలలోనే తన ప్రజ్ఞను, బుద్ధికుశలతను, ప్రతిభను, సామర్థ్యాన్ని నాటి కేంద్ర శాసనసభలో ప్రకటించిన ధిషణా దురంధరుడు. అందు నాటి కాంగ్రెస్ స్వరాజ్యపార్టీ నాయకుడైన మోతీలాల్ నెహ్రూ, ఎన్. శ్రీనివాస అయ్యంగారులాంటి పెద్దల అభినందనలకు ఆయన పాత్రుడైనాడు. బహుశ 1930వ సం॥లోనే రంగా కేంద్ర శాసనసభకు ప్రథమంగా ఎన్నుకోబడ్డాడు. అనతికాలంలోనే కేంద్ర శాసనసభలో ఆయన భారత రైతాంగ వాణిని ప్రతిధ్వనింపచేశాడు. మేధావిగా కీర్తిగడించాడు. ఆయనతో నాకు పరిచయం కాకపూర్వమే ఆయన ప్రజల మనిషిగా, సుప్రసిద్ధుడుగా ప్రఖ్యాతి గాంచాడు. ఎల్లప్పుడూ ప్రజలతో పరివేష్టితుడై ఉండేవాడు. ఆయన నిష్క్రమణకు కొన్ని నెలల ముందునుండి ఒంటరివాడుగా బాధాకరమైన జీవితం గడిపాడన్న విషయం నన్నెంతగానో తపింపచేసి కలవరపెట్టింది. ఒంటరి జీవితం ఆయన సహజప్రవృత్తికి పూర్తిగా విరుద్ధం. అట్టి దుస్థితి రంగాలాంటి ఉత్తమ వ్యక్తికి కలలో కూడ జరుగరానిది.

ఆయన మరణంతో భారతదేశం ఒక గొప్ప ధైర్యసాహసాలు గల నైతిక రాజకీయవేత్తనూ, రైతుబాంధవునీ, ఆదర్శ పార్లమెంటేరియన్‌ను కోల్పోయింది. వీరి స్ఫూర్తిని రైతుకూలీలు, తదితర శ్రమజీవులు, స్వయం ఉపాధి వృత్తులకు చెందినవారు, కళాకారులు మొదలైన వారధికంగా గల అశేష భారత ప్రజలు ఎంతవరకు పొందారు? అన్నది నాకు అనుమానమే. 1991 మార్చికి పూర్వమో, తరువాతో నేనాయనను చివరిసారిగా కలిసినట్లు గుర్తుంది. అది అప్పటి ప్రధాన మంత్రి చంద్రశేఖర్ మాకు 'పద్మభూషణ్' బిరుదు ఇచ్చిన సందర్భం అని నాకు జ్ఞాపకం. 1936 లో జరిగిన చరిత్రాత్మక లక్నో కాంగ్రెస్ మహాసభలో నేను రంగాను తొలిసారిగా కలిసాను. ఒక ఆహ్వానితుడుగా నేను ఆ సభకు హాజరయ్యాను. అదే ప్రదేశంలో జరిగిన చిరస్మరణీయమైన అఖిల భారత కిసాన్

మహాసభకు కూడా హాజరయ్యాను. రంగా సాహిత్యాభిమాని. ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ రైటర్స్ కాన్ఫరెన్స్ ఆవిష్కరణ సభకు ఆయన హాజరైనాడు. ప్రేమచంద్ ఆ సభకు అధ్యక్షత వహించాడు. సరోజినీనాయుడు, హస్రత్ మోహాని ప్రభృత సాహిత్య తేజోమూర్తులు ఆ సభలో ఆసీనులై ఉన్నారు. బెంగాల్ రచయితల యూనిట్ తరఫున నేనా సభకు వచ్చాను. నేను కమ్యూనిస్టు పార్టీ సభ్యుడను కూడ. కాని కమ్యూనిస్టు పార్టీకప్పుడు చట్టబద్ధమైన స్థాయి లేదు. ట్రేడ్ యూనియన్లు, విద్యార్థులు, తదితర సాంస్కృతిక సేవకులతో కూడి నేను కొన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్న దినాలవి. నేను 18 నెలలపాటు ఆంధ్ర యూనివర్సిటీలో ఉన్నాను.

1936 లో జరిగిన రైతు సభ (Kisan Sabha) లో నేనెరిగిన ముజఫర్ అహ్మద్, స్వామి సహజానంద, బంకిం ముఖర్జి, ఇందూలాల్ యాజ్నిక్‌లతో కలిసి ఉన్న రంగాను నేను చూడటం జరిగింది. ఇదంతా నన్ను గూర్చి నేను అనవసరంగా కల్పించుకుని చెప్తున్నాననుకోకండి. మరెందుకు చెబుతున్నానంటే కొంతకాలం గడిచాక రంగా ఆ కిసాన్ సభను గూర్చి, ముఖర్జీని గూర్చి, తదితర కమ్యూనిస్టు సహచరులు, మిత్రుల గూర్చి వెలిబుచ్చే భావాలు తన ఉదారబుద్ధికి, సార్వలౌకికతకు అద్దంపడుతాయి కనుక. కమ్యూనిజమంటే తనకు గల ఎలర్జీ గాని, అయిష్టతకుగానీ తనకు సాంఘిక ప్రజాస్వామ్యమందు గల గాఢమైన విశ్వాసం, మక్కువయే కారణం అనక తప్పదు. ఐనప్పటికీ తన కమ్యూనిస్టు మిత్రుల, సహచరుల నైజగుణాలను కొనియాడడంలోనే ఆయన వ్యక్తిత్వం, ఔన్నత్యం ప్రస్ఫుటంగా గోచరిస్తాయనుట నిజం. రంగాలో సహజసిద్ధంగా గోచరించే గుణమేమిటంటే ఔదార్యంతో కూడిన సత్యాన్వేషణా పరతంత్రమైన దృక్పథం అనాల్సి ఉంది. పైన చెప్పిన దృష్టాంతమే ఇందుకు నిదర్శనం.

రంగా పార్లమెంటేరియన్‌గా పుట్టాడు. ప్రవృత్తిరీత్యా తాను పార్లమెంటేరియన్ అని నిరూపించుకున్నాడు. పార్లమెంటేరియన్‌గా భారత ప్రజాస్వామ్యానికి అసాధారణ సేవ చేసిన ఫక్తు ప్రజాస్వామ్యవాదిగా చిరస్మరణీయుడయ్యాడు.

తన భావాలు, ఆదర్శాలు, ఆలోచనలు ఎన్నడూ విడనాడని స్థితప్రజ్ఞుడు రంగా. తాను నమ్మిన సిద్ధాంతాల కొరకు గట్టిగా, కఠినంగా, మర్యాదగా, సభ్యతగా వాదించి పోరాడిన శూరుడు రంగా. పార్లమెంటులో ఉత్తర, దక్షిణ ధృవాలుగా కొనసాగిన వాద ప్రతివాదాలలో సహితం రంగా ఎన్నడూ అసభ్యం, అనాగరికం అయిన వైఖరిని ప్రదర్శించి ఎరుగడు. ఇది ఆయన ఘనతకు, గొప్పతనానికి నిదర్శనం.

స్వరాజ్యం రాక పూర్వం, వచ్చిన తర్వాత కాలంలో సుమారు ఆరు దశాబ్దాల పాటు ఆయన కేంద్ర శాసనసభ్యుడుగా గిన్నీస్‌బుక్‌లో రికార్డుకెక్కడం ఏమంత ఆశ్చర్యపడవలసిన విషయం కాదు. ఆయన పార్లమెంటు సభ్యుడు కాకుండా ఉన్న కాలం చాలా స్వల్ప వ్యవధిగా పరిగణించాల్సి ఉంది. ప్రజాహితం కొరకు ఆరాటపడి పాటుపడిన గుణోపేతుడుగా, ప్రజ్ఞావంతుడుగా, కుశాగ్రబుద్ధిగా, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా తనదంటూ ఒక చెరగని ముద్ర వేసిన అసాధారణ వ్యక్తిగా భారత ప్రజాస్వామ్య చరిత్రలో సదా నిలిచివుంటాడు రంగా. ఇదియే రంగా సాధించిన నిజమైన ప్రజాస్వామ్య విజయం.

రంగా, నేనూ 1952 నుండి 1977 వరకు రెండున్నర దశాబ్దాలపాటు పార్లమెంటులో మిత్రులుగా ఉన్నాము. మా దృక్పథాలు వేరైనా మా జీవన విధానంలో, జీవితాన్ని గూర్చి అవగాహనలో అంతగా భేదముండేది కాదు. 1952, ఆ తర్వాత కొన్ని సంవత్సరాల వరకు రంగా కాంగ్రెస్‌కు ఒక బలమైన స్తంభంగా నిలిచాడు. ప్రజాబలం గల ప్రజాప్రతినిధిగానే రంగా రాణించాడు. ఆయన గొప్ప వక్త (Debater). చర్చనీయ విషయంపై వాగ్ధాటితో అనర్గళంగా వాదించుట ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఆయన ప్రసంగ ధోరణి విలక్షణంగా ఉండేది. అందరినీ అలరించి ఆకట్టుకునేది. ఆయనయెడ అందరికీ గౌరవం ఉండేది. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో నిజాయితీకి నిదర్శనంగా మచ్చలేని మనిషిగా నిలిచాడు. తాను నమ్మిన సిద్ధాంతాలే పార్టీకంటే ముఖ్యమను విపరీత భావం గల రాజకీయవాది రంగా. గ్రామీణ ప్రజలలో సాధారణంగా కన్పించే

స్పష్టమైన, సూటియైన, సూక్ష్మమైన, నిష్కపట వైఖరికీ, భావాలకూ ప్రతిరూపంగా రంగా కన్పిస్తాడు. ఆయనది పసిహృదయం. ఆక్స్‌ఫర్డ్‌లో చదివి వచ్చిన రంగా నుద్దేశించి నెహ్రూ కొంచెం వ్యంగ్యంగా 'ఆచార్య' అని పిలవడం జరిగేది. అందుకు ప్రతీకారచర్యగా రంగా ఎప్పుడూ ఏమీ అనేవాడు కాదు. తద్భిన్నంగా ఆయన 'ఆచార్య' అంటే ప్రొఫెసర్ అనే అర్థాన్ని హుందాగా నిర్వికారచిత్తంతో స్వీకరించేవాడు. ఎంతో చాతుర్యంగా ఆచార్య కృపలాని ప్రసక్తి తీసుకువచ్చి నెహ్రూకు సున్నితంగా చురకవేసేవాడు.

రంగా కాంగ్రెస్‌లో కొనసాగడానికి అవరోధాలు కలిగించే కుట్రలు, కుయుక్తులు, కుటిల యత్నాలు చాలా జరిగాయి. కొండా వెంకటప్పయ్య, ప్రకాశం ప్రభృతులు కాంగ్రెస్‌లో ప్రముఖులుగా ఉన్న రోజులలో రంగా నాయకత్వం నల్లేరు మీద బండిలా నడిచింది. ఆ తరువాత ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ పగ్గాలు చేపట్టినవారి దురాలోచనలు, కుటిలచర్యలు, కుయుక్తులు, స్వార్థచింతన రంగాలాంటి నిష్కల్మషహృదయులకు భరింప శక్యముకాకుండినవి. తత్కారణంగా కాంగ్రెస్‌ను వీడి కృషికార్ లోక్ లాంటి పార్టీలు పెట్టాడు. తనకు గల ప్రజల అండ, వెన్నుదన్ను, తోడ్పాటు ప్రత్యక్షంగా నిరూపించాడు. కాని రంగా స్వతంత్ర పార్టీలో చేరడం దురదృష్టకరం. ఏదియేమైనా ఆయనను పార్టీలు మారాడన్న అపవాదుకు గురిచేసింది కాంగ్రెస్. కొత్తగా జాతీయపార్టీ పెట్టి పోరాడగల యోధుడు, శూరుడు రంగా అన్న కీర్తి ఆయనకు దక్కకుండా కాంగ్రెస్ చేయ గలిగింది. కాని కాంగ్రెస్ లబ్ధిపొందలేకపోయింది. పతన దిశగా ప్రయాణించింది.

అది 1961 వ సంవత్సరం అనుకుంటాను. ఆయనకు షష్ట్యబ్ది పూర్తి జరుపు తున్న అభినందన సభ అది. ఆ సభలో నేను ఆయన మిత్రుడుగా రంగాను అభినందించడానికి సంకోచించలేదు. రైతు తత్త్వవేత్తగా, ప్రజాస్వామ్యవాదిగా, తాను మంచివని నమ్మిన సిద్ధాంతాల కొరకు అనుల్లంఘనీయం, పవిత్రం అయిన పోరాటంసల్పుట ఆయనకు జన్మతః అబ్బిన గుణం. అవసరం అయితే తాను నమ్మిన పార్టీని వదలి వెళ్లడానికైనా వెనుదీయని ధీరుడు రంగా అని

ఆయనను అభినందించాను. (I did not heritate to felicitate my friend as a form non-confirmist, as inviolable champion of the man behind the flough who would not perhaps long relish being in the party he had choosen).

ఆయన స్వతంత్ర పార్టీ లీడర్‌గా పార్లమెంటులో వ్యవహరించినప్పుడు అడపా దడపా పార్లమెంటులో అసౌకర్యంగా కనిపించేవాడు. స్వతంత్ర పార్టీ డిప్యూటీ లీడరైన మసానీ తానే లీడర్‌నని (కొన్నియెడల లీడర్‌నని వ్రాసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి) బఫూన్‌గా ప్రవర్తించుటే ఇందుకు కారణం. రంగాలో వేలెత్తి చూపగల క్షుద్రమైన, నీచమైన అంశం వెదికినా కానరాదు. (There was nothing mean and healthy about Ranga). మర్యాదను, ఔచిత్యాన్ని (decency) ఆయన సదా పాటించేవాడు. స్వతంత్ర పార్టీ ప్రతిపక్ష నేతగా పార్లమెంటులో ఆయన తన పాత్రను హుందాగా నిర్వహించేవాడు. (In Parliament he did his Swatantra Chores). పార్లమెంటు సమావేశాలలో ఆయన అగ్రెసివ్ (aggressive) గా ఉన్న సందర్భాలు లేకపోలేదు. అరుపులు, కేకలు, నిందలు, ప్రతినిందలతో పార్లమెంటు వాతావరణం వేడెక్కి దద్దరిల్లిన సందర్భాలలో అలా జరిగింది. ఆయన ఘనతకూ, మర్యాదకూ, యోగ్యతకూ, గౌరవానికీ ఎన్నడూ పార్లమెంటులో భంగం వాటిల్లలేదు.

రంగా ఒక పెద్ద అధికార పదవి నధిష్ఠించి ఉన్నట్లయితే ఆయన జీవితం మరొకవిధంగా ఉండివుండేది. ఆయనను ఎన్నో పదవులు వరించేవి. కాని ఆయన తేజోగుణాలు అందుకు అనుగుణంగా లేవు. (If Ranga was a politician with a big 'P' his life would have been loaded with office, but his mettle was different). ఆయన సహజ ప్రవృత్తి కూడా నైతికతకు అద్దంపడుతుందనుట నిజం. ఉదాహరణకు రాయబార కార్యాలయాలలో ఇచ్చే పార్టీలకు (embassy parties) రంగా వెళ్లేవాడుకాదు. ఆయన తన నివాసం నుండి పార్లమెంటుకు, పార్లమెంటు నుండి తన నివాసానికి నడచి వెళ్లేవాడు.

ఢిల్లీ వీధులలో కూడా నడవడమే ఆయనకు అలవాటు. ఈ విషయంలో నాకు హృదయనాథ్‌కుంజ్రు జ్ఞప్తికి వస్తాడు. ఆడంబరత ఆయనలో మచ్చుకు కూడా కానరాదు. ఆయనది ధర్మబద్ధమైన, నిష్కళంకమైన జీవితం. ఎన్ని పార్టీలు పెట్టినా అందరివలె ఆయన ఆడంబరాలు, పటాటోపాలు ప్రదర్శించలేదు. గౌరవ బిరుదులు కోరలేదు. ఎటువంటి ప్రతిఫలం ఆశించలేదు. ప్రజాసేవలో తరించుటే ఆయన జీవిత లక్ష్యం.

నీతినియమాలను నీళ్లకొదిలి, వ్యక్తిపూజయే కాంగ్రెస్ మర్యాద (Congress cult) గా, అదియే కాంగ్రెస్ సంస్కృతిలో భాగంగా చేసిన కారణంగా ఇందిరా గాంధీ భారత ప్రజాస్వామ్యాన్ని నామావశిష్టంగా, అవినీతికూపంగా చేసిన తీరును రంగా వలె తీవ్రంగా దుయ్యబట్టిన వ్యక్తి మరొకరు లేరు. ఎమర్జెన్సీ విధించిన కారణంగా ఇందిరాగాంధి అనుభవించిన దురవస్థ, దుర్దశ నుండి బయటపడి ఆమె తన పూర్వ ప్రతిష్ఠను పునరుద్ధరించుకోగలగడాన్ని ఆయన అభినందించకుండా ఉండలేకపోయాడు. ఆ విషయాన్ని రంగా నాతో అనడం జరిగింది. తనవరకు తాను తనకెట్టి మలినం అంటకుండా చూచుకున్నాడు. తన సుదీర్ఘ రాజకీయ చరిత్రలో ఆయన ఎటువంటి సిగ్గుమాలిన పని (scandal) ఎన్నడు చేసి ఎరుగడు. ఆయన సహధర్మచారిణి భారతీదేవిరంగా గుర్తుకొచ్చి నప్పుడల్లా నేనామెకు మనస్సులో నమస్కారం చేస్తాను. వారాదర్శ దంపతులు. రంగాలాంటి ప్రముఖ రాజకీయ వ్యక్తి గుణగణాలను గూర్చి నేను నేడు చెప్ప గలగడంకంటె మించిన మంచి ఏముంది! ఆయనను గూర్చి, ఆయన సాధించిన పనులు గూర్చి ఎటువంటి రికార్డులు బయటపడినా సిగ్గుపడవలసిన రహస్యాలు ఏమీ ఉండనేరవన్నది నిజం.

మొరార్జీదేశాయి నూరు సంవత్సరాలు నిండకుండానే కొద్ది నెలలు ముందు పరలోకగతుడయ్యాడు. రంగా శత వసంతాలు పూర్తికాకుండానే మనను విడిచి వెళ్లిపోయాడు. ఢిల్లీలోనో, హర్యానాలోనో ఎక్కడో ఒకచోట సౌమ్యుడు, సహృదయు డైన గుల్జారిలాల్ నందా కృశిస్తూ వాడి రాలిపోయే దశ (languishing stage)

లో ఉండివుంటాడు. అదేవిధంగా కర్నాటకలో నిజలింగప్ప, బహుశ షీలభద్ర యాజీ కూడ తమ తుదియాత్రకు సిద్ధమవుతూ ఉండివుండవచ్చు. తొంభై సంవత్సరాలు నిండిన రాజకీయవేత్తల శకం త్వరలోనే ముగుస్తుందనవచ్చు.

నామట్టుకు నేను ఇప్పుడు 88 సంవత్సరాల వయసు గల అలనాటి అఖిల భారత కాంగ్రెస్ సభ్యుడుగా సజీవుడనై ఉన్నాను. బాగా ప్రజాదరణ పొందిన కమ్యూనిస్టు పార్టీ ప్రముఖునిగా ఉన్న నేను 1938 లో సుభాష్‌చంద్రబోస్ అధ్యక్షతన హరిపురాలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యునిగా ఎన్నుకోబడ్డాను. కనుక నన్ను నేను వృద్ధ ఎ.ఐ.సి.సి. మాజీ సభ్యునిగానే భావిస్తు న్నాను. రంగా జీవితం కడవరకూ అభిలాషకూ, సంతోషానికీ నిలయంగా కొనసాగింది. కాని నా విషయం ఇందుకు భిన్నంగా ఉంది. ముఖ్యంగా నా చివరి దశలో మేము పెంచి పోషించి కాపాడుతున్న విలువలు నేడు నానాటికీ ఇంకా ఇంకా దిగజారుతున్నాయి. నేను అనవసరంగా నా స్వవిషయాన్ని గూర్చి చెప్పినందుకు క్షంతవ్యుడను. కాని మర్యాదను అతిక్రమించడం మాత్రం కాదు. ఎందుకంటే రంగా 1989–91 మధ్యకాలంలో నన్ను చివాట్లు పెట్టిన సంగతి నాకు బాగా గుర్తుంది. నేను అనారోగ్యం కారణంగా బాధపడుతూ అనాయాస మరణం(euthanasia) కోరుకుంటున్నాని చెప్పినప్పుడు ఆయన నన్ను కటువుగా మందలించాడు. ఆంగ్ల కవి షెల్లీ చెప్పిన

"Out of the day and night
A Joy has taken fight
Fresh spring and summer and winter hoar
Move my faint heart with griet
But with delight? No more, oh never more"

అనే పద్యాన్ని నాకు గుర్తుచేశాడు.

'సంతోషం అనే పక్షి మనసు అనే గూడు నుండి ఎగిరి వెళ్లిపోయింది. బాధతో దివారాత్రాలు భారంగా దొర్లుతున్నాయి. అయినా ఋతువులు తమ తమ వరుసక్రమం తప్పడంలేదు. తమ తమ గతులను, ధర్మాలను తప్పడంలేదు. వసంతం, వేసవి, వర్షాలు, చలిమంచు అన్నీ వాటి విధులు, క్రమాన్ని తప్పడం

లేదు. తత్ఫలితంగా కలుగుతున్న ప్రకృతిశోభ, సౌందర్యం, పరిణామక్రమాన్ని తిలకిస్తుంటే, తలచుకుంటే మన బాధాపరితప్త హృదయాలు ఆనందంతో, ఉల్లాసంతో ఉరకలేస్తూ పొంగిపోతాయి. బాధలను, వ్యధలను మరిచిపోయి తేలికపడుతాయి. ఇంతకంటే మనకు కావలసింది, మనం కోరేది ఏముంది' అన్న ఇంగితాన్ని షెల్లీ ఈ పద్యం ద్వారా తేటతెల్లం చేశాడు. 'Spring and summer and winter hoar' అను పదాలు ఇందుకు సంకేతాలుగా ఆ మహాకవి వాడడం జరిగింది. ఈ పద్యం ద్వారా ప్రకృతి తద్వారాధనయే మనకు మన చరమదశలో ఆనందోత్సాహాలకు, ఉల్లాసానికి, ఓదార్పుకూ మూలం అన్న సత్యాన్ని రంగా ఎంతో సరళంగా, సరసంగా, సూక్ష్మంగా, స్ఫూర్తిదాయకంగా, సూటిగా చెప్పాడన్నది నిజం. మేము మా జీవితంలో కన్న కలలు కల్ల కావు అనడానికి చరిత్ర సాక్షిగా నిలువనేరదన్నది నిజం.

మనం నమ్మిన మంచికొరకు, సిద్ధాంతాల కొరకు ధైర్యంగా, సాహసంగా పట్టిన పట్టు వదలకుండా ఆశావాదులుగా అలుపెరుగకుండా పాటుపడుటే మన ధర్మం. అంతకుమించిన ప్రతిఫలం మరొకటి లేదు. అంతకుమించిన ఆత్మతృప్తి అంతకంటె శూన్యం. ఈ గుణాలు రంగాలో నాకంటె ఎంతో ఎక్కువగా ఉన్నాయి.

*మూలం : **ప్రొఫెసర్ హీరేన్ ముఖర్జీ,** పార్లమెంటరీ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు*
*అనువాదం : **ప్రొఫెసర్ పావులూరి శివనారాయణ,** లయోలా కాలేజి, విజయవాడ*

సహధర్మచారిణి అనే పదానికి ప్రతిరూపం

శ్రీమతి భారతీదేవి రంగా



డాక్టర్ జేక్కంపూడి సీతారామారావు

M.B;B.S., LL.B., LL.M.,

జననం	:	20-09-1942
అర్ధాంగి	:	అన్నపూర్ణ
విద్య	:	వీధి బడిలో
హైస్కూలు విద్య	:	R.V.S.C.V.S. హైస్కూలు, చిలకలూరిపేట
కాలేజి విద్య	:	హిందూ కళాశాల, గుంటూరు
వైద్య విద్య	:	రంగరాయ మెడికల్ కాలేజి, కాకినాడ
LL.B. న్యాయశాస్త్రము	:	శ్రీ జాగర్లమూడి చంద్రమౌళి కళాశాల, గుంటూరు
LL.M.	:	ఆచార్య నాగార్జున యూనివర్శిటీ, గుంటూరు
ప్రచురించిన గ్రంథములు	:	1. కాకతీయ నాయకులు 2. కర్షక వేదం 3. స్వాతంత్ర్యం కోసంతో పాటు పలు వ్యాసాలు, విశ్లేషణలు ప్రచురితమయ్యాయి